# ప్రజ్ఞాన ఘన

## ప్రేమస్వరూప
## శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం





ప్రజ్ఞాన ఘన ప్రేమస్వరూప శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం









# ప్రజ్ఞాన ఘన

## ప్రేమస్వరూప

## శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం



డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారు, ఎమ్మెస్సీ, పి.హెచ్‌డి

# ప్రజ్ఞాన ఘన ప్రేమస్వరూప శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం

ప్రథమ ముద్రణ : **30 జూన్ 2018**
(పూజ్య మాస్టారుగారి చతుర్థ ఆరాధనోత్సవం)

ప్రతులు : **1,000**

వెల : **రూ. 280/-**

ప్రచురణ మరియు ప్రతులకు
: **అపూర్వ పబ్లికేషన్స్**
ఇ.నెం. 36/71/336, శ్వేతద్వీపము
పవిత్ర కాలేజి రోడ్, ఒంగోలు - 523 001
మొబైల్: 94913 17670
వెబ్‌సైట్: **www.missionrk.com**

ముద్రణ : **యశస్వి ఆర్ట్ ప్రింటర్స్**
ఫీవర్ ఆసుపత్రి దగ్గర, మెయిన్‌రోడ్,
ఓల్డ్ నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
ఫోన్: 040-66554439
మొబైల్: 97010 55009

# కృతజ్ఞతలు

కంప్యూటర్‌లో ఎటువంటి డిగ్రీలు లేని నా చేత ఈ గ్రంథానికి డిటిపి చేసే శక్తిని ప్రసాదించిన శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురుదేవులకు ముందుగా కృతజ్ఞతాభివందనములు. ఈ గ్రంథము యొక్క వ్రాతప్రతిని ముద్రణకు వీలుగా తయారుచేయుటలో నాకు విశేషమైన కృషిని అందించిన వారు.

***డి.టి.పి.:*** శ్రీమతి కె. కృష్ణకుమారి, శ్రీమతి లక్ష్మీరాజగోపాల్, శ్రీమతి వల్లీశ్రీనివాస్

***ఎడిటింగ్:*** శ్రీమతి కాటూరి తేజశ్రీ, శ్రీమతి అట్లూరి శ్రీలక్ష్మీ, శ్రీమతి వల్లీశ్రీనివాస్, శ్రీమతి కె. భానుమతి

***డిజైనింగ్:*** శ్రీమతి కాటూరి తేజశ్రీ

ఫొటోలలో సహాయాన్ని చిరంజీవి కాటూరి గార్గేయ ఋత్విక్, శ్రీ పి. శాంతారాంగారు అందించారు.

ఈ గ్రంథ సంకలనమప్పుడు వారి అమూల్యమైన సలహాలను, సూచనలను అందించిన పూజ్యశ్రీ మాస్టర్‌గారి నాన్నగారు శ్రీ కామరాజుగారు, వారి తమ్ముడు శ్రీ విశ్వనాథ్ ప్రసాద్‌గారికి, శ్రీ ముక్కామల రత్నాకర్‌గారికి మా కృతజ్ఞతాభివందనలు.

ఈ పుస్తక ప్రచురణకు సహకారాన్ని అందించిన వారందరికి మా కృతజ్ఞతాభివందనములు తెలుపుకుంటూ వీరికి వీరి కుటుంబాలకు పూజ్యశ్రీ గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య–మాతాభగవతీదేవి దివ్యఆశీస్సులు, శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురుదేవుల దివ్య ఆశీస్సులు పుష్కలంగా వర్షించాలని కోరుకుంటూ

**మీ రాజ్యలక్ష్మి**

**ఓం తత్సత్**

ప్రజ్ఞాన ఘన

ప్రేమస్వరూప

# శ్రీ శ్రీరామకృష్ణ గురుదేవుల

చరణాలకు

# అంకితం

# ముందుమాట

**మునుపెన్నడూ జరుగని రీతిలో తన జీవితమే గాయత్రీమయము అని వాక్కు ద్వారా కాక సరిగ్గా 24,000 (14.10.1948 - 30.06.2014) రోజులు జీవించి చూపిన అపూర్వ దత్తావతారుని దివ్యచరితము.**

నవయుగమైనటువంటి ప్రస్తుత కుంభయుగంలో, అదీ కుంభరాశిలో ఆశ్వయుజ ద్వాదశి తిథి, శతభిషా నక్షత్రంలో 1948 అక్టోబర్ 14వ తేదిన, మచిలీపట్నంలో పూజ్యులు శ్రీకామరాజు, శ్రీమతి సక్కుబాయి దంపతులకు ప్రథమ సంతానంగా బాల శ్రీరామకృష్ణులు జన్మించారు. బాల్యమంతా వారికి కాశీపట్టణంలో తాతగారైన శ్రీ సోమేశ్వరరావుగారి ఆలనపాలనలోనే గడచి పోయింది. బెనారస్ హిందూ యూనివర్శిటిలో యం.యస్.సి., పి.హెచ్.డి., పూర్తి చేస్తూనే, మరొక వంక దాదాపు 33 మంది గురువుల నుండి వేర్వేరు మంత్ర దీక్షలను స్వీకరించి, సాధన చేసి ఆశ్చర్యకరమైన ఆధ్యాత్మిక ఫలితాలను పొందారు.

1971 జూన్ 18వ తేదిన మధురలో పరమ పూజ్య గురుదేవుల నుండి గాయత్రీ మంత్ర దీక్షను స్వీకరించి, పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఇంక ఆ పంథాలో తమ సాధనను ప్రారంభించారు.

మాస్టర్‌గారు వృత్తిరీత్యా టి.జె.పి.యస్. కాలేజీ, గుంటూరులో కెమిస్ట్రీ లెక్చరర్‌గా ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. కాలేజీలో ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే, సరస్వతీ నది అంతర్వాహినిగా ఎలా ప్రవహిస్తుందో అలాగే మాస్టర్‌గారు గాయత్రీమంత్రాన్ని, యజ్ఞవిద్యను, ఇంకా పూజ్యగురుదేవుల మిషన్ కార్యక్రమాలను మెల్లమెల్లగా సామాన్య ప్రజలలోకి ప్రవహింపచేసేందుకు నిర్విరామ కృషి చేయసాగారు.

పూజ్యగురుదేవుల సాధనా ప్రథమ పూర్ణాహుతిగా 1995వ సంవత్సరంలో కార్తీకపూర్ణిమకు 'ఆవల్‌ఖేడా' లో త్రిదివశీయ అశ్వమేధ మహాయజ్ఞమును నిర్వహించారు. సరిగ్గా అదే సమయంలో వేటపాలెంలో అదే కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రద్ధాళువులైన సాధకుల చేత మాస్టర్‌గారు చేయించారు. ఈ మహాయజ్ఞముతో పూజ్యశ్రీ మాస్టర్‌గారి జీవితంలో ఒక్కసారిగా ప్రచండమైన మార్పులు రావడం జరిగింది.

అవల్ఖేడా యజ్ఞనిమిత్తం 24 లక్షల గాయత్రీ మంత్ర లేఖనాలు వ్రాయించారు.

ఈ కార్యక్రమానికి అనుబంధంగా "శ్రీ హంసరామ ఆశ్రమాన్ని" నెల్లూరు జిల్లా, కాకివాయి గ్రామంలో మొట్టమొదటిసారిగా స్థాపించారు. ఈ ఆశ్రమంలో దేవీ నవరాత్రులలో ఆ 24 లక్షల గాయత్రీమంత్ర లేఖనాలను భూగర్భంలో స్థాపించి దానిపైన "సకలకృపామృత రసాకర్షిణి" స్థూపాన్ని నిర్మించారు. ఇంక అక్కడ నుండి సప్తర్షి ఆశ్రమం, అగస్త్యాశ్రమం, సహ్యాద్రి దత్తాశ్రమం, నిత్యావతార దత్తక్షేత్రం, సూర్యకిరణ విజ్ఞాన కేంద్రము, శంబళతీర్థము ఇలా ఒకదాని తరువాత ఒక ఆశ్రమాన్ని స్థాపిస్తూ వీలైనచోట్ల అనుగ్రహపీఠాలను కూడా స్థాపించి తమ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన కేంద్రాలను స్థాపించసాగారు.

ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే సప్తర్షి ఆశ్రమం, గుంటూరులో గాయత్రీ మహావిజ్ఞాన్ మీద మొట్టమొదటిసారిగా ప్రవచనాలను చెప్పారు. ఆ తరువాత వేర్వేరు సందర్భాలలో భాగవతం, భగవద్గీత, అశ్వమేధ మహాయజ్ఞము, సూర్యకిరణ విజ్ఞానము మీద, వేదాలు, ఉపనిషత్తులు, ఇంకా పతంజలి యోగసూత్రాలు, జ్యోతిర్విద్య, ఆయుర్వేదం, వాస్తు, హోమియోపతి మొదలైన విషయాలపై క్రొంగొత్త విధానాలలో ప్రవచనాలు చెప్పారు.

అలానే థియోసాఫికల్ సొసైటీలో The Voice of Silence, Secret Doctrine, మొదలైన విషయాల మీద, ఇంకా అరవిందుల సావిత్రి, Life Divine ల మీద అవిశ్రాంతంగా ప్రవచనాలను చెప్పారు. సోలార్‌సిస్టమ్, Etheric body, Many Mansions మొదలైన విషయాల మీద వీరికి వున్న అఖండ జ్ఞానం మాటలతో వర్ణించలేము. ఇలా ఒకటేమిటి వివిధ విషయాలపై తెలుగులోనే కాక అటు ఇంగ్లీషు, ఇటు హిందీ భాషలలో కూడా అనర్గళంగా చెప్పగల అఖండ ప్రజ్ఞాశాలి మాస్టర్‌గారు. జ్వాలాకూల్ మహర్షిగారు వ్రాసిన 24 పుస్తకాలంటే మాస్టారికి ప్రాణం. పూజ్య గురుదేవుల వాఙ్మయాలను అధ్యయనం చేస్తూ వాటిపైన వారిచ్చిన ప్రవచనాలు అమోఘం. జ్వాలాకూల్ మహర్షి గారి పుస్తకాలలోని జ్ఞానాన్ని పూజ్యగురుదేవుల వాఙ్మయాలను అనుసంధానం చేస్తూ 24 పుస్తకాలకు గైడ్‌లను తయారుచేసారు. పూజ్యగురుదేవుల కొన్ని వాఙ్మయాలను, క్రాంతిధర్మి సాహిత్యం 20 పుస్తకాలను తెలుగులోకి అనువదించి, ఆ పుస్తకాల విలువను తెలియచేస్తూ వందలాది తరగతులు నిర్వహించారు.

ఇంతటి విషయ పరిజ్ఞానాన్ని అందరికీ అందిచేప్పుడు వారు కేవలం అందులోని ఆధ్యాత్మిక అంశాలను మాత్రమే కాక దాని వెనుక నున్న ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని తెలియచెప్పటానికి బహుధాకృషి చేశారు. దాదా గురుదేవుల ఆదేశాలతో హిమాలయాలలో ఉన్న ఋషుల కార్యక్రమాలనన్నింటినీ పూజ్యగురుదేవులు ఎలాగైతే పునరుజ్జీవింపచేశారో, అలానే మన మాస్టర్‌గారు కూడా పరమ గురువులందరి ప్రణాళికలను సమన్వయం చేసి "అఖండ గురుసత్తా"ను ప్రకటీకరణ చేసి వారి సాధనలతో సాహిత్యాన్ని కూడా నూతన సమూహాలకి పరిచయం చేశారు. గురుపరంపరలను పునర్జీవింపచేసి అందరి గురువుల శిష్యులను కలిసి పనిచెయ్యటానికి ప్రేరణనిచ్చి గురుశిష్య పరంపరలో ఒక నూతన విప్లవాన్ని తెచ్చారు.

1996వ సంవత్సరంలో దేవీ నవరాత్రులలో మహాశక్తి స్వరూపిణి అయిన జగజ్జనని మహాయోగీశ్వరీదేవి యొక్క దివ్య ఆవిర్భావాన్ని దర్శించారు. అదే నవరాత్రులలో శ్రీహంసరామ ఆశ్రమంలో అష్టమి నాటి రాత్రి అనుగ్రహ మాలామంత్రాన్ని ప్రపంచానికి ప్రసాదించారు.

పరిణామక్రమంలో ముందుకు వెళ్ళడానికి శ్రీ చక్రానికి ద్వాదశరాశి చక్రాన్ని కలిపి మహాకాల చక్రవర్తి యంత్రాన్ని తయారుచేసి ఆవిష్కరించారు. సమస్త గ్రహ, నక్షత్ర, వాస్తు దోష నివారణకు ద్వాదశరాశి నవగ్రహ అష్టోత్తరశత నక్షత్ర పాద మహాకాలయజ్ఞాన్ని రూపొందించి, తద్వారా అనేకమంది జీవితాలలో శాంతి, సౌఖ్యాలనందించారు.

ఇంకా చెప్పాలంటే సప్తర్షి ఆశ్రమంలో మిల్లేనియం బహుమతిగా సమర్థ సద్గురు స్పర్శ ధ్యాన విధానం, గురుసత్తా కుండలినీ జాగరణ, సుదర్శన విద్యల్లాంటి అనేక సాధనలను నేర్పించారు.

ఇంతలో 2001 డిసెంబరులో తిరుపతిలో జరిగిన అశ్వమేధ మహాయజ్ఞానికి యావత్ ఆంధ్రప్రదేశ్‌లో అవిశ్రాంతంగా ప్రచారం చేసి వేలాదిమంది పరిజనులను అక్కడికి తీసుకువచ్చి 'గురుదక్షిణ'గా సమర్పించారు.

2002 సంవత్సరం ఆగష్టులో తమ ఉద్యోగానికి వాలెంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చి హైదరాబాద్‌కు వెళ్ళారు. తరువాత నవంబరు నుండి తమ కార్యక్షేత్రాన్ని ఒంగోలు శ్వేత ద్వీపానికి మార్చుకున్నారు. అఖండగురుసత్తా కార్యక్రమాలతోపాటుగా శ్రీ మహాలక్ష్మీ సాధన, గోమహాలక్ష్మీసాధన, విశ్వఏకీకరణ యజ్ఞాలను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. భాగవత సప్తాహాలను అనేక ప్రాంతాలలో నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల నుండి మానవజాతిని రక్షించేందుకై అఖండ భాగవత సాప్తాహిక మహాయజ్ఞాలను గ్రామ గ్రామాలలో చేయించి మహాపూర్ణాహుతిని చేశారు.

గ్రహాలు మరియు గ్రహణాల యొక్క విపత్తుల నుండి, అననుకూల పరిస్థితుల నుండి మానవజాతిని రక్షించడానికి గురుస్థానాలను ఇంటింటా స్థాపించి లక్షల సంఖ్యలో గాయత్రీ, మహాలక్ష్మీ మంత్ర జపాలను చేయించి అత్యంత శాంతియుతంగా ప్రమాదాల నుండి బయట పడవేశారు. 2008, 2009 సంవత్సరములలో అమెరికా, న్యూజిలాండ్ దేశాలకు వెళ్ళి గురుదేవుల కార్యక్రమాలను నిర్వహించారు. 2011వ సంవత్సరంలో జరుగబోయే "శతాబ్ది సమారోహాలను" పురస్కరించుకుని అనేక రకాల సాధనా శిబిరాలను నిర్వహించి వేలాది మందిని అందులో భాగస్వాములను చేసి "పూజ్యగురుదేవులకు" గురుదక్షిణగా వారందరినీ శాంతికుంజ్‌తో అనుసంధానము చేసి తమ సంపూర్ణ జీవితాన్ని "గురుచరణాలకు" సమర్పించుకున్నారు.

మాస్టారు కాశీని వదిలివేసి తన గురుదేవుల కార్యక్రమాలకు అంకితమైన తరువాత మరల తిరిగి కాశీలో అడుగు పెట్టలేదు. కార్యక్రమాలు, వాటి పని మీద తప్ప ఆయన విడిగా ఏ యాత్రలూ చేయలేదు. ఏ యాత్ర చేసినా అది గురుప్రణాళికలో భాగంగానే చేశారు. అటువంటిది చివరిసారి ఆయన కాశీని విడిచిపెట్టిన 40 సంవత్సరాల తరువాత తిరిగి 2013వ సంవత్సరంలో 144 సంవత్సరాల తరువాత వచ్చిన మహాకుంభమేళా నిమిత్తంగా వెళ్ళి అక్కడి నుండి కాశీకి చేరుకున్నారు. అది కూడా వారి ప్రణాళిక కాదు. తీసుకువెళ్ళిన వారి ప్రణాళికలో భాగమే. అంటే వారికి ఎటువంటి మోహమూ లేదు. కానీ నేచర్ ఈజ్ ఆల్‌వేస్ రైట్ అని అక్కడకాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో తమ సంపూర్ణ జీవిత విశేషాలను నివేదన చేసి త్రైలింగస్వామి వారి సమాధి దర్శనంతో నూతన ప్రణాళికలను ప్రారంభించారు. అందులో భాగంగానే సప్తర్షి ఆశ్రమంలో సాధనా శిబిరాన్ని నిర్వహించి, చివరి పుట్టినరోజును 2013లో హైదరాబాద్‌లో తమ తమ్ముడు విశ్వనాథ్‌గారింట్లో జరుపుకున్నారు. ఆ రోజు శ్రీపాదవల్లభ జయంతి, వినాయకచతుర్థి. ఆ రోజు శ్రీపాదశ్రీవల్లభుల విశేష పూజ చేయించి, స్వయంగా గణపతి పూజనుకూడా చేసి "ఇక నుండి నా పుట్టినరోజు వినాయకచతుర్థి రోజుననే జరుపుకోండి" అని ఆదేశించారు. అంటే ఆయన దత్తావతారమని తెలుపకనే తెలిపారు (గణపతికి, దత్తావతారానికి, గాయత్రీ మంత్రానికి కల సంబంధమును మనము గ్రహించాలి). అదే ఆయన చివరి పుట్టినరోజు. చివరగా శంబళ తీర్థానికి చేరి తమ జీవనలీలను అనంతవిశ్వంలోకి విలీనం చేశారు.

# సాప్తాహిక పారాయణ విధానము

## క్రమానుగత పట్టిక


క్రసం. అధ్యాయము ........................................................................ పేజీ నెం.

I. మొదటి రోజు పారాయణ

జననము – ద్విజత్వము ........................................ 1

1. స్వర్గాదపి గరీయసి ........................................ 1
2. దీక్షా ప్రకరణ ........................................ 18
3. నడచివస్తున్న విజ్ఞాన సర్వస్వం ........................................ 36

II. రెండవ రోజు పారాయణ

సాధన – సేవ ........................................ 60

4. సూక్ష్మీకరణ సాధన ........................................ 60
5. మహానందిలో సాధనా శిబిరం - గురుదేవుల మహాప్రయాణం .............. 80
6. గణపతి నవరాత్రులు... పంచకోశ జాగరణ సాధనా శిబిరం .................. 98

III. మూడవ రోజు పారాయణ

"మేధ" – యజ్ఞ విజ్ఞానము ........................................ 116

7. అశ్వమేధ ఉపన్యాసాలు ........................................ 116
8. ఋషికల్ప సాధనా శిబిరం ........................................ 136
9. 2400 కుండీలతో గాయత్రీ మహాయజ్ఞం - అడ్డరోడ్డు ........................ 154

## IV. నాలుగవ రోజు పారాయణ

**క్షేత్రములు – శక్తి .............................................. 169**

10. శ్రీ హంసరామ ఆశ్రమానికి శ్రీకారం ........................................ 169

11. అనుగ్రహపీఠాల స్థాపన .................................................... 187

12. అనుగ్రహమాలామంత్ర ద్రష్ట................................................ 208

## V. ఐదవ రోజు పారాయణ

**ఆశ్రమములు – దర్శనములు ................................ 225**

13. సమర్థ సద్గురు స్పర్శ దీక్ష ................................................ 225

14. సప్తర్షి ఆశ్రమము............................................................ 240

15. గురుసత్తాయే కల్కి అవతారము ........................................... 262

## VI. ఆరవ రోజు పారాయణ

**మార్గము – లక్ష్యము......................................... 275**

16. "ప్రాణవిద్య"కు కేంద్రం సహ్యాద్రి దత్తాశ్రమము ............................... 275

17. మాస్టర్‌గారి ఒక లక్ష్యం - పరివ్రాజకులను తయారు చేయడం ............. 290

18. మేధాజాగరణ శిబిరాలు ...................................................... 307

## VII. ఏడవ రోజు పారాయణ

**గురువులు – దేవతలు .....................................337**

19. ఉద్యోగ విరమణ - సాయి సన్నిధి........................................... 337

20. చంద్ర విద్యాకేంద్రం - శ్రీ అగస్త్యాశ్రమం, రేపల్లె ............................ 358

21. గురుదీక్ష - సాధనలు ........................................................ 374

# నిత్య పారాయణా విధానము

### గణపతి ప్రార్థన

మూడుసార్లు ఓంకారము

ఏకదంతాయ విద్మహే వక్రతుండాయ ధీమహి తన్నోదంతి ప్రచోదయాత్ ॥

### గురు ప్రార్థన

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః॥

ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురు దేవాయ నమః అను గురు మంత్రమును 108సార్లు చేసుకుని పారాయణను మొదలు పెట్టాలి. పారాయణానంతరం ఆరతి, శుభకామనలతో ముగించవలెను.

### ఆరతి

జయ జగదీశ హరే శ్రీరామకృష్ణ దేవహరే ।

సూర్యచేతన సాధక ।

శ్వేత ద్వీపవాసా ।

శ్రీరామకృష్ణ దేవహరే ।

ఓం జయ జగదీశహరే ॥

శ్రీవత్స గోత్రజా శ్రీ సక్కుబాయి పుత్రా ।

అమరత్వా అనంతా ॥2॥

ఆపద్బాంధవా ।

శ్రీరామకృష్ణ దేవహరే ॥

మాత పితా గురు దైవము స్వామి అంతయు నీవే

మరి అంతయు నీవే ॥
అనుగ్రహమాలామంత్రదాతా ॥2॥
ధరణీ దీక్షా ద్రష్టా ।
శ్రీరామకృష్ణ దేవహరే ॥
ఓంకార రూప ఓజస్వరూపా ।
రామకృష్ణ మహదేవా ।
శ్రీరామకృష్ణ మహాదేవా ।
మంగళ ఆరతి అందుకో ॥2॥
మహాకాల రూపా।
శ్రీరామకృష్ణ మహాదేవా ॥
మహాకాల మహాకాల ఓం జయ మహాకాల మహాకాల ఓం ।
మహాకాల మహాకాల ఓం జయ మహాకాల మహాకాల ఓం జయ ।
మహాకాల మహాకాల ఓం ।
మహాకాల మహాకాల ఓం ॥
రామ కృష్ణ రామ కృష్ణ ఓం శ్రీరామకృష్ణ రామ కృష్ణ ఓం ।
రామ కృష్ణ రామ కృష్ణ ఓం శ్రీరామకృష్ణ రామ కృష్ణ ఓం శ్రీ ।
రామ కృష్ణ రామ కృష్ణ ఓం ।
రామ కృష్ణ రామ కృష్ణ ఓం ॥3॥
ఓం జయ సద్గురు దేవా
ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురు దేవాయ నమః

**మహా శుభ కామన**

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం

న్యాయేన మార్గేణ మహీ మహీశాః

గోబ్రాహ్మణేభ్యో శుభమస్తు నిత్యం

లోకా సమస్తాః సుఖినో భవంతు

కాలేవర్షతు పర్జన్యః పృథ్వీ సస్యశాలినీ

దేశోయం క్షోభరహితో బ్రాహ్మణా సంతు నిర్భయాః

సర్వేభవంతు సుఖినః సర్వేసంతు నిరామయాః

సర్వేభద్రాణి పశ్యంతు మాకశ్చిత్ దుఃఖమాప్నుయాత్

అపుత్రాః పుత్రిణః సంతు పుత్రిణః సంతు పౌత్రిణః

నిర్ధనాః సధనాః సంతు జీవంతు శరదాం శతం

ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

అసతోమా సద్గమయా । తమసోమా జ్యోతిర్గమయా ॥

మృత్యోర్మా అమృతంగమయా । స్వార్థం మా పరమార్థంగమయా ॥

అవ్యవస్తాం మా సువ్యవస్థాంగమయా


ఓం శాంతిః శాంతిః శాంతిః శాంతిః శాంతిః

*భావం:* సకల ప్రాణికోటి క్షేమాన్ని కాంక్షిస్తూ సమస్త మానవజాతి శాంతి, సుఖము, సమృద్ధులతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ భావనాత్మకముగా ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 6 గంటలకు, రాత్రి 12 గంటలకు లేని యెడల పడుకునే ముందు ఈ మహా కామన చేసుకోవాలి. ఈ సాధన చేయడము వలన మనము కోరుకున్నప్పుడు మనకు మన కుటుంబానికి శాంతి, సుఖము, సమృద్ధి చేకూరుతుంది.

# ముఖ్య గమనిక

ఏ గురు చరిత్రను అయినా ఆ గురువే స్వయంగా వ్రాసుకున్నప్పుడు దానిని సంపూర్ణ జీవిత చరిత్రగా భావిస్తాము, కానీ ఆ గురువు జీవితాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నము చేసి మనము వ్రాసినప్పుడు దానికి కొన్ని పరిమితులు ఉంటాయి. వారి జీవితములోని ఒక పేజీని మాత్రమే ఈ గ్రంథము ద్వారా తెలియచేయటానికి ప్రయత్నించాము అనటం సమంజసం. ఒక గురువు సమక్షంలో ఒకే సంఘటనలో అనేకమంది వ్యక్తులకు అనేకమైన అనుభూతులు కలుగుతాయి, చూసేవారి దృష్టికోణం, జ్ఞానము, అవగాహనా సామర్థ్యాన్ని బట్టి ఆ సంఘటనను అనుభవపూర్వకముగా తెలుసుకుంటారు.

**మాస్టర్‌గారి జీవితచరిత్ర రాయటాన్ని గురించి వారితో చెప్పినప్పుడు ఆయన స్వయంగా చెప్పిన విషయముల డైరీ స్క్రీన్‌షాట్**



పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు మా పెద్దమ్మాయి వల్లీకి నువ్వు డైరీలో నేను చెప్పిన విషయములు అన్నీ రాస్తున్నావు కదా, వాటిని సమయం వచ్చినప్పుడు నా జీవిత చరిత్రగా 6000 పేజీల పుస్తకాన్ని తయారుచెయ్యమని ఆశీర్వదించారు. మేము దర్శించిన సంఘటనలను,

అర్థం చేసుకున్న విషయాలను మాత్రమే ఇచ్చట పొందుపరచటం జరిగింది, ఈ గ్రంథము మేము దర్శించిన సంఘటనల యొక్క సంక్షిప్త సంకలనము మాత్రమే. కొన్ని వేలమంది వ్యక్తులు ప్రత్యక్షముగా మాస్టర్‌గారితో కలిసి పనిచేసినప్పటికి వారందరిని గురించి ప్రస్తావించటం అసాధ్యమైన కారణంగా, సందర్భానుసారము మచ్చుకు కొంతమందిని గురించి మాత్రమే ప్రస్తావించటం జరిగింది. **గురువుల జీవితమే శిష్యులకు మార్గదర్శనము, మన ప్రియతమ మాస్టర్‌గారు తన జీవితాన్నే మన అందరికీ వారసత్వంగా అందించిన ప్రేమమూర్తి.** ఈ గ్రంథములోని వర్ణనా లోపములను పుస్తక మాధ్య నేపథ్యహద్దులుగా అర్థం చేస్కొని మన్నించగలరు (ఒకే సంఘటనలోకానీ, కార్యక్రమాలలోకానీ ఎంతోమంది వ్యక్తుల ప్రమేయము, సహాయ సహకారములు ఉంటాయి, కానీ పుస్తకములో వారందరినీ ప్రస్తావించటము కష్టముకదా!) 2002 సంవత్సరము వరకు జరిగిన కొన్ని ముఖ్య విషయాలను ఈ మొదటి భాగములో అందించాము. గురువుకి తన శ్రమకు సార్థకత శిష్యుడు తన స్థాయికి ఎదిగినప్పుడు మాత్రమే లభిస్తుంది అని మాస్టర్‌గారు ఎప్పుడూ అనేవారు. గురువుల జీవిత చరిత్ర పారాయణ ద్వారా మానవుడు గురువు స్థాయికి ఎదగగలగాలి.

**మాస్టర్‌గారు నివసించిన ఒంగోలు శ్వేతద్వీపములో**
**వారు స్వయంగా ఫ్రేమ్ చేయించి పెట్టుకున్న ఫోటో**

***SVETA – DVIPA***

**WHITE ISLAND**

**WHAT IS**

***SVETA – DVIPA***

***PageNo.408.***

***The Secret doctrine***

***Vol.II ANTHROPOGENESIS***

***The sacred bull Nandi was brought from Bharata to Sankha to meet Rishaba(Taurus)every kalpa. But when those of the White Island (Who descended originally from Sveta - Dvipa)*, Who had mixed with the Daityas (giants of the land of iniquity) , had become black with Sin, then Nandi remained forever in the "White Island" [or Sveta - Dvipa]. Those of the fourth world [race] lost AUM (ONGOLE).***

***Neither Atlantis not yet Sankha-dvipa, Was ever called"White Island". When tradition says that "the white island became black on account of the sins of people" it only means the denizens of the "White Island", or Siddhapura, or Sveta-dvipa, Who descended to the Atlantis of the third and fourth races, to "inform the latter; and who, having incarnated, became balck with Sin"__ a figure of Speech. All the Avatars of Vishnu are said to come originally from the White Island. According to Tibetan tradition the White Island is the only locality which escapes the general fate of other dvipas and can be destroyed by neither Fire nor Water, for - it is "the eternal land".***

# గురు చరణములు ఆచరణీయములు

గురు చరణములు ఆచరణీయములు, గురు చరిత్ర పారాయణ ద్వారా మనకు భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక ఉన్నతి లభిస్తుంది. మన మాస్టర్‌గారు సాధకులకు చెప్పే కొన్ని ముఖ్య జీవన సాధనా సూత్రములు:

1. పూర్తి విశ్వాసముతో మానసికంగా నన్ను ప్రేమించగలిగితే, మీ ఇళ్ళల్లో కూడా నేను లభిస్తాను.

2. ప్రశ్న మీరు నన్ను గుర్తించారా లేదా అని కాదు, మీరు నా లక్ష్యాలను గుర్తించారా? లేదా?

3. ఈ రోజునుండి నేను నా స్వభావములో ఈ మార్పు తెచ్చుకుంటాను, అని నిర్ణయం తీసుకోవడమే అతి పెద్ద గురు దక్షిణ.

4. పనులను తక్షణమే చెయ్యండి, కాని ఏ పనిని చెయ్యాలో ఏ పనిని చెయ్యకూడదో అనేది వివేకముతో నిర్ణయించుకోండి.

5. సర్వ శక్తులు పొందాలి అంటే ప్రేమ తప్ప వేరే మార్గము లేదు.

6. గురువు ఆశీర్వాదం ఇచ్చేప్పుడు పాత్రత అడగడు, పాత్రత మనం పెంపొందించుకుంటే గురు అనుగ్రహం సునాయాసంగా వస్తుంది.

7. గురువు కంటే గురువు యొక్క పాదాలు ముఖ్యము, ఎందుకంటే అవి జీవించే విధానాన్ని నేర్పిస్తాయి.

8. ఆధ్యాత్మిక విద్య నేర్చుకుంటే అన్ని విద్యలు నేర్చుకున్నట్లే. ఆధ్యాత్మికత అంటే జప తపములే కాదు, దానితో పాటు మీ జీవిత విధానము మారాలి, మీ చేతనత్వస్థాయి పెరగాలి.

9. నేను ఎవరో గుర్తించే ప్రయత్నం చెయ్యకండి, ఇంకొక 1500 సంవత్సరములకు కానీ నేను ఎవరో మానవజాతి గుర్తించలేదు.

10. గురువుకు మీ శిరస్సు అవసరము లేదు, మీ సమర్పణా భావము కావాలి. గురువుకు చేతకానిది ఒకటి ఉన్నది, వారు మీ స్వేచ్ఛను అడ్డుకొనలేరు.

11. ప్రతి రోజూ గురువు యొక్క ప్రవచనాలు వినండి, లేదా చదవండి. ఆధ్యాత్మిక జగత్తులో అవి గురువు యొక్క ఆశీర్వచనాలు. గురువులతో సత్సంగము చేయటానికి అనువైన మార్గము వారి పుస్తకములను చదవడమే.

12. మీ కర్మ ఎంత బలమైనదైనా కూడా, మీకు గురువు యొక్క అనుగ్రహం ఉంటే చాలు, ఆ కర్మను అధిగమించవచ్చు.

13. గురువుల చిత్ర పటాలు సజీవ చేతనత్వాలు.

14. మీకు కొన్ని జన్మలవరకు చెప్పే బాధ్యత నేను స్వీకరిస్తున్నాను.

15. గురువు కంటే గురువు యొక్క నామానికి శక్తి ఎక్కువ ఉన్నది.

16. Nature is always right – ప్రకృతి ఎల్లప్పుడూ కరక్టే.

17. భావము, ఆలోచనలు, కర్మల సమన్వయము కలవారు గురువులకు ప్రీతిపాత్రులు. శ్రేష్ఠ గురువుకు సమర్పణ అన్నింటికంటే శ్రేష్ఠమైనది.

18. గురువులందరూ ఒక శృంఖలలోని భాగాలే, నిరంతర చేతనత్వ అస్తిత్వములోని అంశములే, వారి మధ్యగల సంబంధ బాంధవ్యాలను గుర్తించండి.

19. 'శ్రీ' – వనరులు ప్రసాదించే శ్రీ మహాలక్ష్మీతత్వం, 'రామ' – ఎలక్ట్రిసిటీ, కుండలినీ శక్తి, 'కృష్ణ' – అందరినీ ఆకర్షించే అయస్కాంత శక్తి శ్రీకృష్ణుడు, శ్రీరామకృష్ణ అంటే శ్రీతో కూడిన విద్యుదయస్కాంత శక్తి. శ్రీ రామ చేతనత్వము, శ్రీ కృష్ణ చేతనత్వముయొక్క శక్తి ధారలను లక్ష్యం వైపుకు ఉపయోగించటానికి "ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురు దేవాయ నమః" అనే మంత్రాన్ని ఉపయోగించుకోండి.

20. నువ్వు ఏది నాటుకుంటావో అదే కోసుకుంటావు అనేది ఆధ్యాత్మికతలో మొదటి సూత్రము.

21. అమరత్వ ప్రాప్తి మన జన్మ హక్కు. రోగరహిత, వృద్ధాప్యరహిత, మృత్యురహిత జీవితము అనే లక్ష్యానికి నేటి మానవజాతి తీవ్ర కృషి చెయ్యాలి.

22. బాధ్యతలను నిర్వర్తించుకుంటూ యుగసైనికుల వలె సమయదానం, అంశదానం, ప్రతిభాదానం చెయ్యాలి. ఇదే మన పిల్లలకు వారసత్వంగా ఇవ్వాలి.

23. గాయత్రియే కామధేనువు, కల్పవృక్షము మరియు చింతామణి. గాయత్రీ మంత్రాక్షరాలు ఏ ఆకృతిలో ఉంటాయో మన శరీరములో ఉండే జీన్స్ అదే ఆకృతిలో ఉంటాయి, గాయత్రీ మంత్రమును ఉపయోగించుకుని మన జీన్స్‌ను మార్చుకోవటమే నిజమైన గాయత్రీమంత్ర సాధన.

24. భూమిపై స్వర్గావతరణ అంటే మనుషులు దేవతలుగా మారాలి. దీనికి గాయత్రీ మంత్రము మాత్రమే సహాయపడుతుంది.

# I జననము – ద్విజత్వము

## అధ్యాయం-1
## స్వర్గాదపి గరీయసి

పేరులోనే కలదు పెన్నిధి అన్నట్లుగా భారతదేశము అనే పదములోనే – 'భ' అనగా వెలుగనీ, రత అంటే ప్రీతి అనీ–వెలుగు పట్ల ప్రీతి కలిగిన వారందరూ భారతీయులని, వారుండే ప్రదేశమే భారతదేశమని మనకిక్కడ అర్థమౌతోంది. అలాంటి భారతదేశము వేదభూమి, పుణ్యభూమి, కర్మభూమిగా పిలువబడుతోంది.

**"ధన్యాశ్చయే భారతభూమి భాగే"** అన్న అథర్వణవేద ప్రమాణము అందరికీ తెలిసిందే. భారతభూమి మీద పుట్టినవారు ధన్యులని దాని అర్థము. భారతదేశాన్ని ఒక మట్టిగడ్డగా కాక ఒక మాతృమూర్తిగా గౌరవించే సంప్రదాయము మనది. ఈ దేశము సమస్త భూమండలములోను ప్రతిచోట తనదైన రీతిలో ఒక ప్రత్యేకమైన ప్రతిష్ఠను, గౌరవాన్ని పొందుతూనే ఉన్నది. దీని యొక్క గొప్పతనము, సమృద్ధి, ఉదారత, అనేకత్వము లనేవి ప్రతివారికి ఆశ్చర్యము కలిగించే విషయములే. యావత్ప్రపంచము దీనిపట్ల భావనాపూర్వకమైన శ్రద్ధాంజలిని అనేక రకాలుగా అందించింది, ఇంకా అందిస్తూనే ఉన్నది.

అనంతమైన జ్ఞాన విజ్ఞానములను మరియు మార్గదర్శక వెలుగునివ్వగల విశేషమైన ప్రతిభ కలిగివుండటము వల్ల ఈ దేశము **జగద్గురువు** అని పిలువబడింది. సువ్యవస్థితమైన పరిపాలన, ప్రగతి పథములో ముందుకు నడిపించగల సరంజామాను ప్రోదిచేసుకున్న కారణంగా దీని నాయకత్వానికి **చక్రవర్తి** అనే పేరు ఇవ్వబడింది. దరిద్రులను ధనవంతులుగా మార్చగల శక్తి ఉన్నవారి గొప్పతనమును ఎవరు సందేహించగలరు? అందువల్లనే ఇది రత్నగర్భ అని, బంగారు పిచ్చుక అని, నిరతాన్నదాతయైనందున అన్నపూర్ణ అనే ఖ్యాతిని కుడా అందుకున్నది.

సాక్షాత్ అవతారమూర్తి శ్రీరామచంద్రుడు భారతదేశ వైభవాన్ని శ్రీమద్రామాయణములో "స్వర్గాదపిగరీయసీ" అని కొనియాడాడు. భగవంతుని 'దశావతారాలన్నీ' ఈ గడ్డమీదనే ఆవిర్భవించా యనేది అందరికీ విదితమే. అలాంటి దేవసంస్కృతిని కలిగిన ఈ భారతదేశము గంగ, గోవు, గాయత్రీ, గురువు అనబడే నాలుగు విశిష్ట మూలస్తంభాల ఆధారముతో అద్భుతమైన సంస్కృతి, సంప్రదాయాలకు ఆలవాలమై, స్వర్గతుల్యమైన ఒక దివ్య భవంతిని నిర్మించుకున్నది. గంగ, గోవు, గాయత్రీ అనబడే త్రిపుటి నిత్యజీవితములో ఓతప్రోతమై మానవజీవితానికి మార్గదర్శనము చేసే ప్రధానాంగాలుగా అందరికీ సుపరిచితమే. ఇంక నాలుగవ ఆధారమైన గురువు అనే విషయానికి వద్దాము.

గురువు – ప్రపంచములో ఎక్కడా ఏ దేశములో కనబడని, వినబడని పదము. ఈ "గురువు" అనే పదము ఒక్క భారతదేశములో మాత్రమే ఎంతో ప్రాచుర్యాన్ని, పవిత్రతను సంతరించుకున్నది.

గురోరర్థాత్ అంధకారః, రుకారః తేజ ఉచ్యతే, అజ్ఞానగ్రాసకం బ్రహ్మ, గురురిత్యక్షరద్వయం॥

'గు' అనగా అంధకారము, 'రు' అనగా వెలుగు లేక కాంతి అని అర్థము. అంటే అజ్ఞానము నుంచి వెలుగులోకి నడిపించేవాడే 'గురువు' అని సప్రమాణంగా ఈ శ్లోకము చెప్తోంది.

దశావతార పరంపరలో శ్రీరామావతారము వరకు 'దుష్టశిక్షణ, శిష్టరక్షణ' అనే ప్రాతిపదిక మీద అవతారము రావడం జరిగింది. అదే ద్వాపరయుగంలో శ్రీకృష్ణావతారము – రెండు విశిష్టమైన పనులను చేసింది. అవతార ప్రకటీకరణకు ఆధారమైన దుష్టశిక్షణ – శిష్టరక్షణతో పాటు 'గీతా మకరందాన్ని' ప్రపంచానికి అందించి "కృష్ణం వందే జగద్గురుం" అనే పేరుతో గురుతత్త్వమనే నూతన అధ్యాయానికి నాంది పలికింది.

కృష్ణావతారము తరువాత ఈ ప్రపంచములోకి ఇంక అవతార ప్రక్రియ రాలేదు. కేవలము గురుపరంపర బాహ్య ప్రకటీకరణ మాత్రమే జరుగుతోంది.

ప్రపంచములో ఎక్కడ, ఏ దేశములోనైనా అరాచకత్వము ప్రబలిపోయి భయంకరమైన అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడినప్పుడు నిరాశాపూరిత వాతావరణము నెలకొనినప్పుడు సామాన్య మానవాళి దిక్కుతోచక నిర్వీర్యమైన వేళ, ఆధ్యాత్మికత అడుగంటిపోయి, జ్ఞానజ్యోతులు కొడిగడుతున్న సమయములో గురుపరంపర భూమి మీద అవతరించి ఆనాటి దేశకాల పరిస్థితులకి అవసరమైన

సాధనలు తాము చేసి అందరిచేత చేయించి తిరిగి ఒక దివ్యమైన, శాంతియుతమైన వాతావరణానికి శ్రీకారము చుట్టడం జరుగుతున్నది. ఆ పరంపరలో ఒక బుద్ధుడు, ఆదిశంకరాచార్య, క్రీస్తు, రమణమహర్షి, శ్రీరామకృష్ణపరమహంస, పండిత శ్రీరామశర్మఆచార్య వంటి ఎందరో గురువులు అలాంటి సమయములో ఆవిర్భవించి అందరిని తరింపజేశారు. అలాగే ఆవిర్భవించిన ఒక ఆధ్యాత్మిక ధృవనక్షత్రం, విజ్ఞానఖని, ప్రేమమూర్తి, మమతామూర్తి పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల మానసపుత్రులు, ప్రజ్ఞాపుత్రులు, మన అంతర్యామి **పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ మాస్టారుగారు.**

కాశీలో చదువుకునే రోజులలో సుమారు 36 మంది గురువులు మాస్టర్‌గారికి ఎదురుగా వచ్చి వారికైవారే ఆయనకు వేర్వేరు మంత్రదీక్షల నిచ్చారు. వారు ఆశించిన మంత్రఫలితాలు నియమిత సమయానికంటే ముందుగానే మాస్టారికి అనుభవములోకి వచ్చేవి. ఆ అద్భుతం దీక్షనిచ్చిన గురువులనే ఆశ్చర్యపరిచేదని ఒకానొక సందర్భంలో మాస్టారే స్వయంగా చెప్పారు. గురువులందరి లక్ష్యము, భావాలు ఒక్కటే! వారు ఒకరి పనిని మరొకరు కొనసాగిస్తుంటారు. క్రొత్త విషయాన్ని ప్రపంచానికి తెలియజేసి **గురుతత్త్వమునకు ఒక నూతన నిర్వచనం ఇచ్చేందుకు జన్మించారు** కనుక ఆయన అనేకమంది గురువుల దగ్గర ఆధ్యాత్మికతను అధ్యయనము చేసి ఔపోసన పట్టారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

అంతేకాకుండా సాధనతో పాటు స్వాధ్యాయంగా వారు చదివిన గ్రంథాలకు అంతులేదు. సంస్కృతము, ఇంగ్లీషు, హిందీ, తెలుగు భాషలలో వచ్చిన అనేక ఆధ్యాత్మిక, వైజ్ఞానిక గ్రంథాలేకాక; ప్రఖ్యాత ఇంగ్లీషు నవలలు, హిందీ నవలలు ఇంకా అనేక తెలుగు నవలలను కుడా వారు వైజ్ఞానిక, ఆధ్యాత్మిక దృష్టికోణముతో అధ్యయనము చేసేవారు. వాటిలో చెప్పబడిన మంచి విషయములను తాము ఆచరిస్తూ అందరికీ చెప్పేవారు కూడా!!

1971 సంవత్సరములో జూన్ 18 వ తేదీన మధురలో పూజ్యగురుదేవులు పండితశ్రీరామశర్మ ఆచార్యగారిని దర్శించిన తరువాత మాస్టర్‌గారు తమ సాధనా విధానాలకు ఒక నిర్దిష్ట లక్ష్యము ఏర్పడినదని, ఇంక తన జీవిత లక్ష్యమునకే కాక తన ప్రియతమ గురుదేవుల కొరకు కూడా పనిచెయ్యడము 'నా జీవిత లక్ష్యము'లో చేర్చుకున్నానని చెప్పేవారు.

నవయుగ నిర్మాణము కొరకు తమ జీవితములోని ప్రతి క్షణాన్ని తపస్సు, స్వాధ్యాయముతో పాటు నిస్వార్థభావంతో గురుదేవులు చేస్తున్న సేవను, వారి అంకితభావాన్ని, తత్పరతను చూసి మాస్టర్‌గారు ఎంతో ప్రభావితులైనారు. ఆ క్షణంలోనే తమని తాము గురుదేవులకి సర్వసమర్పణ చేసుకున్నారు.

సంపూర్ణ సమర్పణ చేసుకున్న మాస్టర్‌గారు ఇక గురుదేవుల మార్గదర్శనములో గాయత్రీ యజ్ఞములను చేస్తూ, వాటితోపాటు పూజ్య గురుదేవుల సాహిత్య అధ్యయనము చేస్తూ, వారు అందించే సాధనలను పరిపూర్ణ నిష్ఠతో ఆచరిస్తుండేవారు.

ఆ తదుపరి గురుదేవుల ఆదేశముతో శ్రీరామకృష్ణగారు ఆంధ్రప్రదేశ్‌లో 'గాయత్రీపరివార్' కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ బాధ్యతలను మాస్టర్‌గారికి అప్పగించటానికి గురుదేవులు మన మాస్టర్‌గారికి మూడుసార్లు కలలో కనిపించి "రామకృష్ణ రా!... రామకృష్ణా రా!..." అని పిలిచారు.

మధురలో జూన్ 18వ తేదీన గురుదేవులు అందరికీ గాయత్రీ దీక్ష నిచ్చిన తరువాత పాదనమస్కారముల సమయములో శ్రీరామకృష్ణగారు రాగానే ఎంతో ఆప్యాయత, ప్రేమనిండిన కంఠముతో 'ఏం రామకృష్ణా! నిన్ను ఇక్కడికి రప్పించటానికి మూడుసార్లు పిలవాలా?' అంటూ ఆశీర్వదించారని మాస్టర్‌గారు చెప్పేవారు. ఆ క్షణములోనే గురుదేవులు – మాస్టారిని తన మానస పుత్రుడిగా, ఆధ్యాత్మిక వారసుడిగా ఎంపిక చేసుకుని తదుపరి కార్యక్రమాల బాధ్యతలనప్పగించారు.

'మనుష్యులు దేవతలుగా మారాలి – పృథ్విపై స్వర్గావతరణ' జరగాలనే పూజ్యగురుదేవుల లక్ష్యానికి వారిచ్చిన మూల సూత్రములు 'గాయత్రీమంత్రము–గాయత్రీ యజ్ఞము'. ఈ రెండు విస్తృతముగా కుల, మత, జాతి విచక్షణ లేకుండా విశ్వవ్యాప్తం చేయాలనే లక్ష్యానికి వారెన్నో ప్రణాళికలను రూపొందించారు.

బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో M.Sc., Ph.D లను పూర్తి చేసిన తరువాత మాస్టర్‌గారు గుంటూరులో T.J.P.S కాలేజీలో కెమెస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తూ ఉద్యోగ బాధ్యతలను సక్రమముగా కొనసాగిస్తూ రాష్ట్రం నలుమూలలా 'గాయత్రీ పరివార్' వ్యాప్తికి అపార కృషి చేయసాగారు.

గాయత్రీపరివార్ అంటే కేవలము గాయత్రీమంత్రము చేయడం, వీలైనప్పుడు యజ్ఞము చేయడం మాత్రమే కాదు. గురుదేవులు ' మేరా పూరా సామర్థ్య మేరే సాహిత్యమే ఛిపాహై' అనేవారు. గురుదేవులు తమ తపశ్శక్తి సామర్థ్యాలను తమ సాహిత్యంలో నిక్షిప్తం చేశారు. కనుక ఆ సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆచరణలో పెట్టుకోవటమనేది గాయత్రీ పరివారము యొక్క ముఖ్యలక్ష్యం. గురుదేవుల ఉన్నత లక్ష్యం కొరకు శ్రద్ధతో, నిష్ఠతో, ప్రజ్ఞాపాటవాలతో త్రికరణశుద్ధిగా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించే సమూహమే గాయత్రీపరివార్ అంటే. వారంతా ఎక్కడెక్కడ ఉన్నా సంఘటితమై ప్రేమ, ఆత్మీయతలతో కలిసికట్టుగా పనిచేసే సామర్థ్యము కలిగినవారని అర్థము.

ప్రస్తుతము యుగసంధి కాలము – అనగా మహాక్రాంతికి నాందిసమయం. ఈ సమయంలో మహాకాలుడు సంకల్పించిన పరివర్తన ఆశ్చర్యకరమైన రీతిలో, అమితవేగముతో ముందుకు వెళ్తోంది. ఆ వెలుగుబాట వైపు వెళ్ళడానికి ఈ సంస్థ ద్వారా యుగసైనికులను తయారుచేసి **'21వ శతాబ్ది–ఉజ్జ్వల భవిష్యత్తు'** కొరకు అవిశ్రాంతంగా తాను పనిచేస్తూ, గురుసమర్పణలో భాగంగా తమను తాము పూర్తిగా 'సత్యయుగస్థాపన' కొరకు సమర్పణ చేసుకున్నవారికి సరళమైన రీతిలో సాధనాసంపత్తిని అందజేస్తూ ప్రేరణనిస్తూ, మార్గదర్శనము చేస్తూ అలుపెరుగని రీతిలో కృషి చేస్తూ కూడా భౌతిక అవసరాల నిమిత్తమై కాలేజీలో పనిచేస్తున్న ఈ మహాత్ముణ్ణి అందరూ "మాస్టారూ" అని ప్రేమగా పిలుస్తుంటారు. బాగా దగ్గరగా వుండేవారు సన్నిహితులు మాత్రం చనువుగా ఆర్.కె అనీ, మాస్టర్ ఆర్.కె అనీ పిలుస్తుండేవారు. ఇక్కడ మాస్టర్ అనే పదానికి అర్థం ఏమిటో చూద్దాం.

### "మాస్టర్" అంటే ?

'మాస్టర్' అనే పదానికి కాస్త వివరణ అవసరం. 'మాస్టర్' అనే ఇంగ్లీషు పదానికి అధికారి అనీ, సిద్ధుడనీ రెండు అర్థాలున్నాయి. ఒక ప్రత్యేకార్థమున "దివ్యజ్ఞానసంస్థవారు" పందొమ్మిది, ఇరవై శతాబ్దాలలో 'బ్రహ్మవిద్యను' ఖండఖండాంతరాలలో వ్యాప్తి గావించిన మహర్షులను "మాస్టర్స్" అనే పదంతో సంబోధించేవారు. రష్యాలో జన్మించిన మహాయోగి, బ్రహ్మవిద్యా ప్రవర్తకురాలు అయిన మేడం బ్లావెట్స్కీ ఈ పదమును మొట్టమొదటిసారిగా వాడారు. ఆ సాంప్రదాయాన్ని అనుసరించే మేడం బ్లావెట్స్కీ దగ్గర బ్రహ్మవిద్య జ్ఞానం పొంది ఆ దివ్యజ్ఞానాన్ని ప్రపంచాని

కందించిన శ్రీ సి.వి.వి.గారిని మొట్టమొదటగా మాస్టర్ సి.వి.వి. అని పిలవటం మొదలైంది. ఇంక సాంప్రదాయంలో సాధనలో అపార పారావారాన్ని చూసి సమాజానికి దివ్యజ్ఞానాన్ని అందించిన మహానుభావులందరినీ మాస్టర్ అని మొదటగా ఉచ్చరించటం లోకాచారమైనది.

## జననము - బాల్యం - విద్యాభ్యాసము

పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారి జననం

హిమాలయాలలోని గురుమండలి కార్యక్రమాలన్నీ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి అయ్యేందుకు, పృథ్వి అంగీకరించిన సమయములోగా ఆత్మసామ్రాజ్య స్థాపనకు సహకరించడానికి, ఆ కార్యక్రమాలను విస్తరింపజేయడానికి ఆ గురుమండలి కోరికపై సర్వసమర్థుడైన డా.మారెళ్ళ శ్రీరామకృష్ణగారు 14.10.1948వ సంవత్సరములో కృష్ణాజిల్లా, మచిలీపట్నములో పూజ్యశ్రీ మారెళ్ళ కామరాజు–సక్కుబాయమ్మ పుణ్యదంపతులకు ప్రథమ సంతానముగా జన్మించారు. మహాత్ముల జనన సమయములో పుడమితల్లి పులకించిపోతుంది. దిక్కులు ప్రసన్నంగా ఉంటాయి. ప్రకృతి పరవసించిపోతుంది. దానినే మహాకవి కాళిదాసు 'కుమారసంభవం' అనే మహాకావ్యంలో ..........

ప్రసన్న దిక్పాంసు వివిక్త వాతం
శంఖస్వనా నంతార పుష్పవృష్టిః ।
శరీరిణాం స్థావర జంగమానం
సుఖాయ తజ్జన్మదినం బభూవః ॥

సాక్షాత్ పర్వతరాజు పుత్రి పార్వతీదేవి జన్మించిన సమయములో ప్రకృతి ఎలా పరవశించిందో అలా మన శ్రీరామకృష్ణగారు పుట్టినప్పుడు దివ్యమైన వాతావరణముతో ప్రకృతి పరవశించిపోయింది. ప్రకృతిమాతే పరవశించే పవిత్ర శిశు జననము ఇంటిల్లిపాదికీ ప్రమోదాన్ని కల్గించింది. 'ఆత్మావైపుత్రనామసి' అని శ్రీ కామరాజుగారికి పుత్రోదయము ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఇంక తాతగారు శ్రీ సోమేశ్వరరావుగారైతే ఆ శిశువుని చూసి పరవశించిపోయారు. తల్లి విషయము చెప్పనవసరము లేదు.

తాతగారైన శ్రీ సోమేశ్వరరావుగారు మొదటినుంచీ శ్రీరామకృష్ణపరమహంసగారినే తమ మానసిక గురువుగా ఎంచుకొని వారందించిన మార్గంలోనే జీవనదేవతను సాధన చేసేవారు.

తమకు ఆదర్శమైన శ్రీరామకృష్ణ పరమహంసగారి పేరునే తమ మనవడికి పెట్టుకొని మురిసి పోయారు. ఆ పేరు పిలుస్తున్నప్పుడల్లా తమ ఆరాధ్యదైవాన్ని ఆరాధించిన భావనతో తల్లీనమై పోయేవారు. యోగపురుషుడైన శ్రీరామకృష్ణగారికి తాతగారి మార్గదర్శనములో బాల్యము ఎంతో విచిత్రంగాను, వింతలతోను సాగిపోయింది. మాస్టర్‌గారు పుట్టిన నాలుగేళ్ళకే తాతగారు శ్రీ సోమేశ్వరరావుగారు రిటైర్ అయ్యారు. వారి తల్లిగారు రాజేశ్వరమ్మగారు. రాజేశ్వరమ్మగారు ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతమైన స్థితికి ఎదిగిన వ్యక్తి. ఆవిడ తమ ఇంటి పనులు పూర్తిచేసుకున్నాక చుట్టు ప్రక్కలవున్న స్త్రీలకు భక్తి, జ్ఞాన మార్గాలను బోధిస్తుండేది. పూర్వకాలములో అందరు ఒకేచోట పచ్చళ్ళు, అప్పడాలు చేసుకునే పరిపాటి ఉండేది. అలా పనులు చేస్తూ కూడా ఆవిడ అందరికి జ్ఞానమార్గాన్ని బోధించేది. తల్లిగారిలో ఉండే ఈ ఆధ్యాత్మిక పిపాస కుమారునికి కూడా అబ్బింది. వేదవేదాంగాలు, పురాణ, ఇతిహాసాలను ఆమూలాగ్రము అధ్యయనము చేయడముతో పాటు పూజ, ఉపాసనాది కార్యక్రమాలను ఆయన ఎంతో శ్రద్ధతో చేసేవారు. శ్రీరామకృష్ణగారిని చూచినప్పుడల్లా వారు తమ గురువైన శ్రీరామకృష్ణపరమహంసగారే తన మనవడి రూపంలో వచ్చారని ఆనందించేవారు. విచిత్రమేమిటంటే ఆ రామకృష్ణపరమహంసే తిరిగి పండిత శ్రీరామశర్మ ఆచార్యజీగా జన్మించి ఈ చిన్నారి శ్రీరామకృష్ణకు ఆధ్యాత్మిక మార్గదర్శనము చేయడంతో పాటు తమ ఆధ్యాత్మిక సంపదకు వారసుడిగా చేసుకుంటారనే విషయాన్ని శ్రీ సోమేశ్వరరావుగారు ఆనాడు ఊహించివుండరు.

ప్రేమ, ఆత్మీయతలతో పాటు భావసంవేదనలు అనేవి కూడా మానవజీవితానికి మూలభూతమైన ఆధారాలు. వీటి మూలంగానే ఏ వ్యక్తియైనా మరొకరితో అనుబంధాల నేర్పరుచుకొని, సంబంధ బాంధవ్యాలను కలుపుకుంటాడు. జీవితాన్ని ఆనందమయం చేసుకుంటాడు. సుఖశాంతులతో జీవిస్తూ, పవిత్రమైన సంస్కారాలను శ్రద్ధతో అలవరుచుకొంటాడు. ఇవన్నీ మరుజన్మ ఉత్తమోత్తమంగా ఉండేందుకు పునాదిరాళ్ళవుతాయి. వీటి ఆధారంగానే జన్మ, పునర్జన్మల ప్రక్రియ కొనసాగుతుంది. అలాంటి అనుబంధాలే మానవజాతిని కలిసి జీవించేలా చేస్తున్నాయి. సోమేశ్వరరావుగారు రిటైరైన తరువాత తమ శేషజీవితాన్ని కాశీ విశ్వనాథుడి సన్నిధిలో గడపాలనే తలంపుతో కాశీకి బయల్దేరారు. సకుటుంబసమేతంగా అందరూ వెళ్ళి తాతగారిని రైలు ఎక్కించి వీడ్కోలు చెప్తున్న సమయములో 4 ఏళ్ళ చిన్నారి శ్రీరామకృష్ణ కూడా తాతగారితో పాటు రైలెక్కి కూర్చుని ఎవరెంత బ్రతిమిలాడినా రైలు దిగనని మొరాయించారు. మనుమడి మీద ఉన్న మమకారముతో శ్రీసోమేశ్వరరావుగారు

కూడా 'కొద్ది రోజులుంచుకొని మళ్ళీ తీసుకువస్తానని' కొడుకు, కోడలికి మాట ఇచ్చి మనవడితో కలిసి కాశీకి వెళ్ళిపోయారు. అలా తాతగారితో కాశీకి వెళ్ళిన పసివాడు యోగీశ్వరుడిగా ఆంధ్రప్రదేశ్‌కి తిరిగి రావటమనేది పరమగురువుల ప్రణాళిక కాక మరేమిటి? అప్పటికే శ్రీమతి సక్కుబాయిగారు రెండవసారి గర్భాన్ని ధరించారు. చిరంజీవి రామకృష్ణ తన తాతగారితో వెళ్ళిపోవడం ఆమెకెంతో వెలితిగానూ, శూన్యంగాను అనిపించింది. కానీ తప్పదుగదా!

సరే తాతా, మనవడు కాశీకి చేరిన తరువాత నివసించటానికి 'గణపతిశాస్త్రి' మఠాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ మఠము శ్రీసమర్థరామదాసుగారిచే ఏర్పాటు చేయబడిన హనుమాన్‌ఘాట్‌కు దగ్గరగా ఉండేది. ఎదురుగా పవిత్ర గంగానది ఒడ్డు కనిపిస్తూ ఎంతో ఆహ్లాదకరముగా ఉండేది. భోజన ఏర్పాట్లంతా తాతగారే చూచుకునేవారు. ప్రతిరోజు ఉదయం తాతా మనవడు గంగానదికి స్నానానికి వెళ్ళి స్నానం చేసి చెంబు నిండా నీళ్ళు తీసుకుని దారిలో ఉన్న గుడులన్నింటిలో గల లింగాలకి అభిషేకము చేస్తూ వచ్చి చివరగా విశ్వేశ్వరస్వామికి అభిషేకము చేసేవారు.

శ్రీసోమేశ్వరరావుగారు మంచి పండితుడు – సంస్కృత భాషలో పూర్తి జ్ఞానము కలిగినవారు. ప్రతినిత్యం విష్ణుసహస్రనామ పారాయణ, గీతాపారాయణ, భజగోవింద స్తోత్ర పఠనం, కాశీ విశ్వనాథుని ఉపాసన వారి నిత్యకర్మానుష్ఠానాలు. తమ సాధనతో పాటుగా మనుమడిని కూడా కూర్చోబెట్టి విశిష్టమైన ఈ సాధనలన్నీ నేర్పించేవారు. ఒక్కొక్కసారి గంగలో నిలబడి స్తోత్రపాఠాలను నేర్పించేవారని మాస్టారు చెప్తుండేవారు. ఆడుతూ, పాడుతూ బాల్యాన్ని అనుభవించే వయస్సులో తాతగారిచ్చే ఈ శిక్షణ బాల శ్రీరామకృష్ణకు కొంత అసహనాన్ని తెప్పించినా తాతగారి పట్ల ఉన్న ప్రేమతో వారు అవన్నీ నియమంగా ఆచరించేవారు. 'సాధన చెయ్యని రోజున ఆహారము కూడా పెట్టను' అనే తాతగారి నియమం కోసం బాలరామకృష్ణ తప్పనిసరిగా సాధన, పారాయణలు చేసేవారు. సాధారణ విద్యాభ్యాసం యథావిధిగా జరిగిపోతుండేది.

**విద్యాదదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం ।**
**పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాద్ధర్మం తతఃసుఖమ్ ॥**

అనేది శాస్త్రప్రమాణం. భౌతిక విద్య కేవలం మనోవికాసానికి దోహదము చేస్తుందనడంలో సందేహము లేదు. కానీ ఆదర్శమార్గంలో జీవిస్తూ ఆత్మోన్నతి పొందడం, తద్వారా సమాజ ఆరాధన,

లోకకళ్యాణం కొరకు పాటుపడటమనేది ఆదర్శవ్యక్తి యొక్క జీవితగమ్యం. అందుచేతనే తాతగారు మనుమడికి నిష్ఠతో పాటు ఏకాగ్రత కలగడానికి గీత, విష్ణుసహస్రనామ పారాయణలతో పాటు నవలలు చదవడం కూడా అలవాటు చేశారు. మహాత్ములకు విద్య నేర్పించడమనేది ఒక అద్భుతమైన వరదానము. సాక్షాత్ అవతారపురుషుడైన శ్రీకృష్ణుడు సాందీపని ఆశ్రమములో 64 రోజులలోనే చతుష్షష్టి కళలను అభ్యసించారని చెప్తారు. అలాగే పర్వతరాజపుత్రి పార్వతీదేవికి విద్య నేర్చుకోవడంలో ఉన్న చురుకుదనం వల్ల ఆమెకు అనాయాసముగా సమస్తవిద్యలు గురుముఖతః కరతలామలకము లయ్యేవని కుమారసంభవములో "ప్రపేదిరే ప్రాప్తన జన్మవిద్యాం" అనే ఒకే ఒక్క మాటతో మహాకవి కాళిదాసు అభివర్ణిస్తారు. గతజన్మలో సతిగా ఉన్నప్పుడు ఆమె అభ్యసించిన విద్యలన్నీ ఈ జన్మలో అతి సరళముగా గురుముఖతః ఆమెకు అనాయాసముగా వచ్చేసేవట.

అదేవిధంగా మన బాల శ్రీరామకృష్ణకు కూడా తాతగారైన శ్రీ సోమేశ్వరరావుగారు అతి పిన్న వయస్సులోనే ఆధ్యాత్మికవిద్యకు నుడికారం చేయడం అందులోనూ జ్ఞానప్రదాత సాక్షాత్ విశ్వనాథుని సన్నిధిలో గంగ ఒడ్డున సమస్త విద్యలను అభ్యసింపజేయడమనేది యాదృచ్ఛికమైన విషయము మాత్రం కానేకాదు.

కాలచక్రములో అతి విచిత్రమైన మార్పులు సంభవిస్తూ ఉంటాయి. కొన్ని యాదృచ్ఛిక విషయాలైతే కొన్ని సంభావనల రూపములో అలా జరిగిపోతుంటాయి. సంఘర్షణ అనేది జీవితములో ఎప్పుడూ తప్పదు. 'జీవన దేవతా సాధన' చేయడంలో అనేక ఒడిదుడుకులను సాహసముతో ఎదుర్కొని విజయము సాధించడమనేది ధీరపురుషుల లక్షణం. జీవితంలో అనేక మలుపులు. అందులో భాగంగా మాస్టర్‌గారి తల్లిదండ్రులు కూడా గుంటూరు నుండి కాశీకి వచ్చేశారు. శ్రీకామరాజుగారు ఎం.యల్‌లో చేరారు. ఈ మధ్యకాలంలోనే శ్రీమతి సక్కుబాయిగారికి ద్వితీయ సంతానముగా లక్ష్మీసుందరి జననము జరిగింది. సాక్షాత్ మహాలక్ష్మియే జన్మించిందని అందరూ సంబరపడిపోయారు. చిన్నారి రామకృష్ణ చెల్లిని చూసుకుని మురిసిపోయేవారు. పాపతో ఆడుకోవడం, అమ్మ పనిలో ఉంటే చెల్లిని ఊయలలో పెట్టి ఊపడం లాంటి పనులు చేసేవారు. అలా చెల్లి వచ్చాక ఆయనకు ఎంతో ఆనందముగా రోజులు గడిచిపోతుండేవి. కుటుంబమంతా కాశీలోనే స్థిరపడిపోయారు. ఈ మధ్య కాలములో శ్రీమతి సక్కుబాయిగారు మూడవసారి గర్భాన్ని ధరించారు. ఈసారి ఆమెకు ఆరోగ్యములో కొంత నలత ఏర్పడింది. ఇలా ఉండగా సోమేశ్వరరావు

గారి మనుమరాలు 'లీల' అనే ఆమె బెనారస్ యూనివర్సిటీలో బి.ఏ. చదవటానికి వీరి దగ్గరకి వచ్చింది. అత్తకు చేదోడు, వాదోడుగా ఉంటూ కాలేజీకి వెళ్ళివస్తుండేది. సక్కుబాయిగారు బాగా బలహీనపడిపోతున్నారు. ఎవరైనా మంచి డాక్టర్‌కు చూపించాలని సోమేశ్వరరావుగారు ప్రయత్నిస్తుండగా ఆ గణపతిశాస్త్రిగారి మఠంలోనే ఉంటున్న పార్వతమ్మగారు వచ్చి సక్కుబాయిగారి విషయము నేను చూచుకుంటాను, మీరేమీ కంగారుపడవద్దని అనునయించి ఆరోజు నుంచి సక్కుబాయిగారు ప్రసవించేటంత వరకు ఆమెను కంటికిఱెప్పలా చూచుకున్నది. పార్వతమ్మగారు జగన్మాత "రాజరాజేశ్వరిదేవి" ఉపాసకురాలు. పార్వతమ్మగారి పర్యవేక్షణలో సక్కుబాయిగారు తిరిగి నూతనోత్సాహాన్ని పొంది ఎంతో ధైర్యముతో కుటుంబ బాధ్యతల్ని కొనసాగించారు. పురిటిరోజులు దగ్గరపడుతున్నాయి. సాక్షాత్ పార్వతీదేవియే ఈ పార్వతమ్మ అన్నరీతిలో ఆమె సక్కుబాయిగారి దగ్గరే ఉండి అన్నీ చూచుకున్నారు. ఆవిడ చేతిచలువ వల్ల సుఖప్రసవము జరిగింది. మగబిడ్డ పుట్టాడు. మళ్ళీ కుటుంబములో నూతన ఆనందము వెల్లివిరిసింది. సాక్షాత్ కాశీ విశ్వనాథుడి ప్రసాదము అన్న భావనతో ఆ బిడ్డకు "విశ్వనాథ్ ప్రసాద్" అని నామకరణము చేశారు. అలా బాలరామకృష్ణకు చిన్నారి చెల్లితో పాటు ఆడుకోవటానికి ఒక బుల్లి తమ్ముడు కూడా వచ్చేశాడు. చిన్నకుటుంబం కనుక ఉన్నదాంతో తృప్తిగా హాయిగా, ఏ లోటూ లేకుండా ఆనందముగా కాలం జరిగిపోతున్నది.

మెల్లిగా సంసారము పెరుగుతున్నది. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. ఉన్న ఇల్లు చాలటము లేదు. అందుకని మఠానికి సమీపములో భరద్వాజగారనేవారి రెండస్తుల భవనము ఒకటి ఖాళీగా ఉన్నది. ఆ ఇంట్లోకి మారటానికి ఒప్పందం కుదిరింది. ఇంటి అద్దె రూ॥ 40. ఆరోజుల్లో 40 రూపాయలంటే ఎంతో విలువైనదిగానే చెప్పాలి. సరే ఆ ఇంట్లోకి కుటుంబము వచ్చేసింది. కానీ ఈ కుటుంబం ఆ ఇంట్లోకి రావడం చుట్టుప్రక్కల వాళ్ళకి నచ్చలేదు. కారణమేమిటంటే ఆ ఇంట్లో ఏవో దుష్టశక్తులున్నాయి, అవి మనుష్యులని బ్రతకనీయవని చెప్పారు. సోమేశ్వరరావుగారు ఇలాంటివాటిని ఒప్పుకోరు. దైవశక్తి మన దగ్గరుంది. ఇలా మనం వీటికి భయపడటము అవివేకము. ఇంట్లో చేరిపోదామని చేరిపోయారు. కానీ మనవరాలు లీల మాత్రం భయపడిపోయింది. ఆఇంట్లో చేరగానే 'తాతయ్యా మనకీ ఇల్లు వద్దు, వేరే ఇంటికి మారిపోదా'మని గోల చేసింది. తాతగారు పట్టువదల్లేదు. ఆ ఇంట్లో చేరిననాటి నుండే వాటి బెడద ప్రారంభమైంది.

ఇలాంటి సంఘటననే మనము పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యగారి ఆత్మకథలో చదువుతాము. గురుదేవులు ఎలాగైతే వాటితో ఒడంబడిక ఏర్పరచుకొని ఆ ఇంట్లోనే ఉన్నారో; అలానే శ్రీసోమేశ్వరరావుగారు కూడా భగవద్గీత పారాయణ చేస్తూ వాటికి మంచి మాటలు చెప్తూ వాటిని ఉద్ధరించి, తాము కూడా ప్రశాంతముగా ఆ ఇంట్లోనే ఉండటం కొనసాగించారు. తాతగారైతే ఎంతో ధైర్యస్థులు. ఇంట్లో ఆడవాళ్ళు, పిల్లాజెల్లా ఎలా అని సోమేశ్వరరావుగారు సంశయిస్తుంటే కోడలు సక్కుబాయిగారు మాత్రం ఎంతో ధైర్యంతో, ఆత్మస్థైర్యముతో వారి మాటలకు ఇష్టపడి ఆ ఇంట్లోనే ఉండటము జరిగింది. మామగారి మాట అంటే ఆమెకు కొండంత నమ్మకము. కోడలిచ్చిన భరోసాతో తృప్తిపడ్డ శ్రీసోమేశ్వరరావుగారు ఆ ఇంట్లోనే ఉంటూ, దుష్టశక్తులతో ధైర్యముగా 5,6 నెలలు పోరాడి వాటిని పంపివేయడము జరిగింది. వెళ్తూవెళ్తూ అవి ఆ ఇంట్లో వాటి పాదముద్రలను వదిలిపోయాయి. దాంతో అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఇలా పిశాచ, ప్రేత బాధ ఒకసారి వాళ్ళ బంధువుల గృహంలో ఏర్పడినప్పుడు శ్రీసోమేశ్వరరావుగారు తమ పావుకోళ్ళను విసిరి ఆ ప్రేతాన్ని తరిమికొట్టి ఆ ఇంటిని పిశాచబాధ నుండి విడుదల చేశారు. వారు నియమంగా చేసే పూజ, అర్చన, పారాయణలతో పాటు దైవం పట్ల వారికి అమితమైన శ్రద్ధా, విశ్వాసాలుండేవి. అంతేకాదు భగవద్గీతా పారాయణ వలన వారికి ఎలాంటి సమస్యనైనా పరిష్కరించే సామర్థ్యము ఏర్పడిందని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చును. శ్రీసోమేశ్వరరావుగారు గొప్ప సాధకులు, ఉపాసకులు కూడా. ఉపనయన సంస్కారము జరిగినప్పుడు 'గాయత్రీమంత్రదీక్ష' ఉండనే ఉన్నది. అందువల్ల వారికి గాయత్రీ ఉపాసనా బలము కూడా ఎంతో ఉండేది.

శ్రీసోమేశ్వరరావుగారిది కేవలము వ్యక్తిగత సాధన మాత్రమే కాదు. వారు కుటుంబము పట్ల, పిల్లల విషయములో కూడా ఎంతో శ్రద్ధను చూపించేవారు. ముగ్గురు పిల్లల్ని ప్రతిరోజు ఉదయము తనతోపాటే గంగాస్నానానికి తీసుకువెళ్ళేవారు. గంగ ఒడ్డున వారిని కూర్చోబెట్టి ఒంటికి ఆవనూనె మర్దన చేసి గంగాస్నానము చేయించేవారు. స్నానం పూర్తి అయిన తరువాత అన్నపూర్ణ విశాలాక్షి, విశ్వనాథుని దేవాలయాలకెళ్ళి దర్శనము చేయించుకొని ఇంటికి తీసుకువచ్చేవారు. కాసేపు స్తోత్రపాఠాలు భగవద్గీత వల్లె వేయించేవారు. ఆ కార్యక్రమాలు పూర్తి అయిన తరువాత బడికి సంబంధించిన పాఠాలు చదువుకోవడం అలవాటు చేశారు శ్రీసోమేశ్వరరావుగారు. ఎంతో

నైపుణ్యంగా ఆ పిల్లలకి గురువు-దైవం అంతా తానే అయి అనాయాసముగా వారిని భౌతిక, ఆధ్యాత్మిక విద్యలలో నిష్ణాతుల్ని చేసి ఆదర్శవంతమైన తాతగారుగా నిలిచారు. ప్రతి కుటుంబములో ఉండే తాతగార్లు, అమ్మమ్మలు, బామ్మలు ఆవిధముగా మనుమల్ని, మనుమరాళ్ళను ఆత్మీయతతో ప్రేమతో దగ్గరకు తీసుకుని ఇలాంటి శిక్షణనిస్తే తప్పక గురుదేవులు కోరుకున్న "పృథ్విపై స్వర్గావతరణ" జరిగి తీరుతుందనేది అతిశయోక్తి కాదేమో! ఐతే పెద్దవాళ్ళకు నేర్పాలనే కోరిక ఉన్నా పిల్లలకి నేర్చుకోవాలనే ఆకాంక్ష కూడా ఉండాలి. అలానే పిల్లలకు నేర్చుకోవాలి అనే తపన ఉన్నా నేర్పించే పెద్దలూ వుండాలిగదా మరి!! (భగవంతుడే దానికి సాక్షి).

కాలచక్రము గిర్రున తిరిగిపోతున్నది. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. దాంతోపాటే చదువులు ముందుకు సాగిపోతున్నాయి. బనారస్‌లో వారి విద్యాభ్యాసమంతా హిందీ, సంస్కృత భాషలలోనే జరిగిపోయింది. పిల్లలు ఒక్క విద్య విషయములోనే కాక ఆటపాటలలో కూడా ప్రవీణులైనారు.

ఒకసారి తాతగారు గంగనీటి మీద పడుకుని ధ్యానమగ్నులైనారు. శ్రీరామకృష్ణ ఒడ్డునే కూర్చుని తాతగారిని గమనిస్తున్నాడు. ఇంతలో కామరాజుగారు అక్కడికి వచ్చి గంగలోకి దిగారు. పట్టుతప్పి గంగలో పడిపోయారు. నోటమాట రాలేదు. నీటి లోతుల్లోకి వెళ్ళిపోతున్న కామరాజుగారు ఒక చేయి పైకెత్తి, తండ్రిగారు చూస్తే తనను రక్షిస్తారు అని ఆశపడ్డారట. ఇదంతా చూస్తున్న పసివాడైన శ్రీరామకృష్ణ కేమీ అర్థము కాలేదు. కానీ తండ్రిగారు నీటిలోకి వెళ్ళిపోతున్నప్పుడు మాత్రం అసంకల్పితంగా పెద్దపెద్ద కేకలు వేయడంతో ధ్యానము నుంచి శ్రీసోమేశ్వరరావుగారు బైటికొచ్చి విషయాన్ని గమనించి కుమారుడిని రక్షించుకున్నారు. ఆ సంఘటన జరిగిన తరువాత శ్రీసోమేశ్వరరావుగారు మనుమలిద్దరికి అంటే చిరంజీవులు రామకృష్ణ, విశ్వనాథ్‌లకు ఈత నేర్పించారు. అందులో వారు నిష్ణాతులయ్యేదాకా శిక్షణనివ్వటము మానలేదు. చివరికి నీళ్ళమీద పడుకుని ధ్యానమెలా చెయ్యాలో కూడా నేర్పించారు. అలా అడుగడుగునా వారికి తాతగారి మార్గదర్శనము లభించటమనేది నిజంగా ఎంత పూర్వజన్మ పుణ్యమోగదా!

ఇటువంటి శిక్షణ బాల్యము నుండే పొందిన మాస్టర్‌గారు నిరంతరము ఒక విచిత్రమైన మానసిక స్థితిలో ఉండేవారు. ఎప్పుడు చూసినా తన పనిలో తానుండేవారు. వారి మాటలు కానీ, ప్రవృత్తిగానీ అందరికంటే భిన్నముగా ఉండేది. వారేపని చేసినా గీతలో శ్రీకృష్ణులవారు చెప్పినట్లుగా 'యోగః కర్మసుకౌశలమ్' అన్నట్లుగానే ఉండేది. యోగము అంటే ఒక్క జప, ధ్యానాలే

కాదు. ఏ పని చేసినా అది ఎంతో నైపుణ్యముగా చూడముచ్చటగా ఉండటమే యోగము. అలా పని చేసేవారు మాస్టర్‌గారు. శ్రీరామకృష్ణ మంచి చెడులంతా పూర్తిగా తాతగారికే వదిలివేశారు శ్రీకామరాజుగారు. కొడుకింత పెద్ద యోగి కాగలడని ముందుగానే తెలుసు అన్నట్లుగా బాల రామకృష్ణ బాధ్యతను పూర్తిగా తన తండ్రిగారికే వదిలివేయడం జరిగింది.

(1990 లో జూన్ 4,5,6,7,8, తేదీలలో మహానందిలో ఐదురోజులపాటు జరిగిన సాధనా శిబిరములో మాస్టర్‌గారు చేయించిన సాధన జలతత్త్వ సాధన. మహానంది దేవాలయం లోపల వున్న కోనేరులోకి సాధకులను తీసుకువచ్చి వారిచేత ఉదయము రెండు గంటలపాటు, సాయంత్రం రెండు గంటలపాటు నీటిలోనే సాధన, ధ్యానము చేయించేవారు. అదొక మధురమైన అనుభూతి. ఆ సాధన చెయ్యాలని వచ్చిన సాధకులంతా ఉదయము-సాయంత్రము కోసం ఎంతో ఉత్సాహముతో ఎదురుచూచేవారు. ఈ సాధనంతా చిన్నతనములో తాతగారు నేర్పించిన ఈత ప్రభావమే మరి!)

మాస్టర్‌గారి జీవితమంతా సాధనామయమే. ఒక్క క్షణం కూడా సమయాన్ని వృథా పోనిచ్చేవారు కాదు. ఇతర విషయాల గురించి పట్టించుకునేవారు కాదు. నిరంతరము సాధనే-అది బహిరంగ సాధన కావచ్చు, అంతరంగ సాధన కావచ్చు. మొదటినుంచి తాతగారి శిక్షణ వలన ఒక ఆదర్శ జీవిత విధానము-ఆదర్శ వ్యక్తిత్వము అలవడినాయి. లోపల ఉన్న యోగి పూర్తిగా వికసించటానికి అంతఃప్రేరణగా నిరంతర స్వాధ్యాయము చేస్తుండేవారు. ఎవ్వరితో ఎక్కువగా మాట్లాడేవారు కాదు. నాకు బట్టలు కావాలనిగానీ, తినుబండారాలు కావాలనిగాని ఎప్పుడూ అడిగేవారు కాదు. పండుగలన్నింటిలోను మాస్టర్‌గారికి దీపావళిపండుగ అంటే ఎక్కువ ఇష్టము. పండగ ఇంకా నెలరోజులుండగానే చెల్లితో కలిసి ఎక్కడ దీపాలు పెట్టాలి? ఎన్ని దీపాలు పెట్టాలి? ఏ ఆకృతిలో అమర్చాలి అనేవి చర్చించేవారట.

## మహాత్ముల దర్శనము

**'సాధునాం దర్శనం పుణ్యం-స్పర్శనం పాపనాశనం-సంభాషణం కోటి తీర్థంచ'** అనే ప్రమాణాలు మాస్టర్‌గారి జీవితములో అక్షరసత్యాలైనాయి. కాశీపట్టణం మహాత్ములకు, సాధుసత్పురుషులకు ఆలవాలము, మహాపండితులకు కేంద్ర స్థానము. అక్కడ ఒక మారుమూల ప్రాంతములో ఒక అవధూతస్వామి ఉండేవారు. ప్రతి పండుగకు సోమేశ్వరరావుగారు పిల్లలకు అభ్యంగనస్నానం చేయించి క్రొత్త బట్టలు కట్టించి, ఆ అవధూత స్వామి దర్శనానికి తీసుకువెళ్ళి పిల్లల చేత పండ్లు,

పాలు ఇప్పించేవారు. స్వామివారు పిల్లలందరికి ఆశీర్వచనాలు ఇచ్చేవారు. శ్రీరామకృష్ణగారిని ప్రత్యేకంగా చూస్తూ వారిలో ఉన్న యోగిని దర్శిస్తుండేవారుట.

శ్రీరామకృష్ణ పదమూడు సంవత్సరాలకే ఇంటర్ పరీక్ష పాసయ్యారు. ఆ వయస్సులో ఇంటర్ పాసవ్వటమనేది సాధారణ విద్యార్థులకు సంభవమయ్యే విషయము కాదు. చదువు విషయములో ఎప్పుడూ ముందుండేవారు. సాధారణ విద్యతో పాటు మాస్టర్‌గారికి జ్యోతిర్విజ్ఞానము కూడా నేర్పించారు తాతగారు. ఆ విద్యలో మాస్టర్‌గారు నిష్ణాతులైనారు. యథాలాపంగా చెప్పినట్లున్నా కొన్ని రాబోయే విషయాల్ని కచ్చితముగా టైమ్‌తో సహా చెప్పేసేవారు. ఐతే ఎవ్వరూ దానిని అంతగా పట్టించుకునేవారు కాదు. మాస్టర్‌గారి మాటలు చాలా చిత్రముగా ఇంకా నిగూఢముగా, గంభీరముగా ఉండేవి. ఎదుటివాళ్ళు వాటిని అర్థము చేసుకోవటానికి కాస్త సమయము పట్టేది.

ఒకసారి సాయిబాబా అనే కార్తికేయ ఉపాసకుడు వీళ్ళింటికి వచ్చారు. శ్రీ సాయిబాబాగారు షణ్ముఖుని అంశతో జన్మించారని అందరు చెప్పుకునేవారు. ఆయన దగ్గరకి వెళ్ళిన వారి అనేక బాధలు తీరిపోయేవి. ఆయన కార్తికేయమంత్రాన్ని ఉపదేశించారు. శ్రీరామకృష్ణకు తన త్రిశూలముతో నాలుక మీద బీజాక్షరము వ్రాస్తానని అడిగారుట. అందుకు మాస్టర్‌గారు తన తమ్ముడు విశ్వనాథ్‌కి వ్రాయమన్నారుట. మాస్టారి కోరిక ప్రకారం స్వామీజీ విశ్వనాథ్ నాలుక మీద బీజాక్షరాలు వ్రాశారుట.

ఆ తరువాత కొన్నాళ్ళకు శ్రీ గణపతి సచ్చిదానందస్వామివారు వీరింటికి వచ్చారు. వారితోపాటు వారి పదిమంది శిష్యులు కాశీలో ఉండటానికి వచ్చి వీరింట్లోనే బసచేశారు. వారు ఉన్న మూడు రోజులు సక్కుబాయిగారు వారికి చక్కటి ఆతిథ్యాన్ని ఇచ్చి వాళ్ళని ఆనందింపజేశారు. స్వామి శ్రీరామకృష్ణ పట్ల ప్రత్యేక అభిమానము చూపేవారు. ఆప్యాయంగా మాట్లాడేవారు. ఆ ఇంటికి ఎవరు వచ్చినా మాస్టర్‌గారిని పట్టుకుని వదిలేవారు కారు. ఎంతసేపు ముచ్చటించినా వాళ్ళకి తనివి తీరేదికాదు. అంతటి అద్భుతమైన ఆకర్షణాశక్తి చిన్నప్పటినుంచి మాస్టారిలో ఉండేది. ఇంటర్ పాస్ అయిన తరువాత మాస్టర్‌గారు డిగ్రీలో చేరారు. కామరాజుగారు ఉద్యోగములో చేరారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులలో కాస్త మార్పు వచ్చింది. తరువాత పిల్లలు పెద్ద చదువులకి వచ్చారు. కుటుంబము సరళముగా సాగిపోతున్నది.

ఇలా ఉండగా మాస్టర్‌గారికి అయోధ్యవాసియైన శ్రీబాలయోగిలాల్‌గారు మొట్టమొదటగా రామనామదీక్ష ఇచ్చారు. ఒకరోజు శ్రీరామకృష్ణ కాశీ రైల్వే ప్లాట్‌ఫారం మీద నిలబడి ఉండగా ఒక వ్యక్తి ఆయన దగ్గరకొచ్చారు. కాసేపు అలాగే మాస్టర్‌గారి వంక తదేకంగా చూస్తూ 'నీకు రామనామ దీక్షనిస్తాను తీసుకుంటావా?' అన్నారుట. అంగీకారంగా తల ఊపారుట. అక్కడే ఆ క్షణంలోనే స్వామి దీక్షనివ్వడం జరిగింది. అనంతమైన ఆధ్యాత్మిక సంపద తనకై తానే ఆయన దగ్గరికి అనేకమంది గురువుల ముఖతః రావడమనేది ఆయనలో దాగివున్న యోగి యొక్క దివ్యాకర్షణా ప్రభావం కాక మరేమిటి!

ఏ గురువు దగ్గరనుండి ఏ ఆధ్యాత్మిక సాధన లభించినా అత్యంత వినయ, విధేయతలతో దానిని స్వీకరించేవారు. అలా ఆరోజు ఆ ప్లాట్‌ఫారం మీద 'రామనామ' దీక్ష స్వామీజీ ఇస్తూంటే ఆ ప్లాట్‌ఫారాన్నే గురుకులంగా భావించి స్వీకరించారు. ఆ 'దీక్షను' పరమపవిత్రం, అద్భుతమైన పెన్నిధిగా ఎలాంటి అహంకారం లేకుండా ఒక దివ్య మానసికస్థితిలో స్వీకరించారు. నిరంతర సత్యాన్వేషణ, జ్ఞాన పిపాస అనేదే వారి లోకం. రాబోయే రోజులలో తన దగ్గరకు వచ్చే ఆత్మసాధకులకు కావలసిన ఈ సత్యాన్ని తెలియజేయటానికే వారు ఆనాడు అనేకమంది గురువుల దగ్గర ఆధ్యాత్మిక సాధనలను స్వీకరించారేమో!

ఒక స్వామివారు ఒకసారి వీళ్ళింటికి వచ్చారు. తిరిగి వెళ్ళేముందు సక్కుబాయిగార్ని పిలిచి 'విభూతినిస్తాను ఒక పళ్ళెం తీసుకురామ్మా' అని అన్నారు. ఆవిడ ఒక పళ్ళెం తెచ్చి వారి ముందు పట్టుకుని నిలబడ్డది. ఆయన తన చేతివ్రేళ్ళను విభూతి నిస్తున్నట్టుగా పళ్ళెంలోకి రాల్చారు. ఆశ్చర్యం! పళ్ళెంలోకి వెండి లక్ష్మీదేవి విగ్రహం ప్రత్యక్షమైంది. సక్కుబాయిగారు ఆశ్చర్యపోతూ వారి మహిమకు ఆనందంతో నమస్కారం చేశారు. ఏది జరిగినా, ఎలాంటి చమత్కారాలు చూసినా, ఎంతమంది మహానుభావులు సంపర్కంలోకి వచ్చినా మాస్టర్‌గారిలో ఎలాంటి సంచలనం కలిగేది కాదు. ఎలాంటి ఆశ్చర్యాన్ని కానీ, ఆనందాన్ని కానీ వ్యక్తపరిచేవారు కాదు. నిరంతరము ఆత్మచింతనలోనే నిమగ్నులై ఉండేవారేమో!

మాస్టర్‌గారికి ఒకసారి ఒక విచిత్రమైన కల వచ్చింది. దానిని చెల్లెలు లక్ష్మీతో చెప్పాలనిపించి లక్ష్మి దగ్గరకు వచ్చి 'ఇవాళ నాకు మంచి నిద్రపట్టింది. ఒక కల వచ్చింది. ఆ కలలో సాక్షాత్తు జగన్మాత పార్వతీ, లక్ష్మీ, సరస్వతులు కలిసి వచ్చి తనను లేపి తమతో పాటుగా తీసుకువెళ్ళారని,

ఆ వెళ్ళిన ప్రదేశము ఒక గుహలాంటిదనీ, వాళ్ళు తనను ఆ గుహలోకి తీసుకువెళ్ళి ఏదో చేశారనీ, ఆ తరువాత వాళ్ళు ఏమి చేశారో నాకు గుర్తుకురావడం లేదు' అని చెప్పారు. అన్న చెప్తున్న మాటలు ఏమిటో ఆమెకు అర్థం కాలేదు. ఐనా చెప్పిన ప్రతి మాటను శ్రద్ధగా విన్నది. అలా కొన్ని కొన్ని విషయాలను చిన్న చెల్లితో చెప్తూ ఆమెకూ ఎంతో విషయపరిజ్ఞానాన్ని పరిచయం చేస్తూవుండేవారు.

కాలక్రమేణా కుటుంబ పరిస్థితులలో మార్పులు వచ్చాయి. భరద్వాజగారి ఇంటి నుంచి మరో రెండు ఇళ్ళు మారారు. చివరకు దశాశ్వమేధఘాట్ నుంచి తిల్ చాముండేశ్వర్ అనే గుడి ప్రక్కన ఉన్న ఇంట్లోకి మారారు. ఆ గుడిలో ఒక పెద్ద బిల్వవృక్షము ఉండేది. ఆ చెట్టు నీడ వీళ్ళింటి మీద వచ్చి పడేది. ఆ గుడిలో ఒక విచిత్రము ఉంది. అక్కడ ఉండే శివలింగము పరిమాణము రోజురోజుకు కాస్తకాస్తగా పెరుగుతూ ఉండేదిట. విశేషమైన ఆకర్షణ, మహత్తు కలిగిన ఈ లింగాన్ని ఆశ్చర్యముతో అశేషజన ప్రవాహము ప్రతిరోజు వచ్చి దర్శించుకునేదిట. అంతటి మహత్తుగల మహాకాలుని నీడలో మాస్టర్‌గారి బాల్యం గడపడంలో గల పరమార్థం మహాత్ములకే ఎఱుక!

## చిత్రమే కాని - ఇది నిజం

కాశీలో దాస్‌గుప్తా అనే బెంగాలీ వ్యాపారస్తుడు ఉండేవాడు. ఆయన మాస్టర్‌గారి కుటుంబానికి బాగా సన్నిహితులు. మాస్టర్‌గారు అంటే అందరికీ అభిమానము ఉన్నట్టే దాస్‌గారికి కుడా ప్రత్యేకమైన అభిమానము ఉండేది. దాస్‌గారు సత్యసాయి భక్తుడు. వారింట్లో తరచుగా పూజలు, భజనలు చేస్తుండేవారు. అతని ద్వారా మాస్టర్‌గారు కూడా సత్యసాయి, శిరిడీసాయి పూజలు అవీ చేస్తుండేవారు. దాస్‌గారింట్లో ఒక రాత్రి చిత్రమైన సంఘటన ఒకటి జరిగింది. అందరూ గాఢనిద్రలో ఉన్నారు. తలుపు తట్టిన శబ్దానికి దాస్‌గారు తలుపు తెరిచి చూస్తే ఒక వృద్ధుడు చలితో వణికిపోతూ 'ఈ రాత్రికి మీ ఇంట్లో పడుకుంటాను, కాస్త చోటు ఇస్తారా' అని అడిగారు. దాస్‌గారు లోపలికి ఆహ్వానించి చోటు చూపించి పడుకోమని చెప్పి తనూ వెళ్ళి పడుకున్నారు. మర్నాడు ఉదయము లేచి చూసేసరికి ఆ వృద్ధుడు కనిపించలేదు. వేసిన తలుపులు వేసినట్టే ఉన్నాయి. కానీ ఆ వృద్ధుడు పడుకున్న స్థానములో శిరిడీసాయి, సత్యసాయిల విగ్రహాలతో పాటు అక్కడ విభూతి అచ్చులు పోసినట్లుగా ఉన్నది. అంతులేని ఈ మహిమకు ఇంట్లోవారంతా ఆశ్చర్య

పోయారు, ఆనందపడిపోయారు. స్వామి తమ ఇంటికి ఇలా వచ్చారు కదా! అయ్యో! గుర్తించలేక పోయామే! అని వాపోయారు. ఐనా జరిగిపోవలసినది ఏదో జరిగిపోయింది. వెంటనే దాస్ గుప్తా ఆనందముతో మాస్టర్‌గారి ఇంటికి వచ్చి ఈ విషయాన్ని తెలియపరిచారు. మనకి విచిత్రము. మాస్టర్‌గారికి మటుకు ఇది చాలా మామూలు విషయము. ఈమధ్య మాస్టర్‌గారు సత్యసాయి ఉపాసకులయ్యారు. ఇంక మాస్టారి 'సత్యసాయి' పూజలెంతటి పరాకాష్ఠకు చేరుకున్నాయంటే ఇంట్లో వాళ్ళు అందరూ సత్యసాయితో మాట్లాడగలిగే కనెక్షన్స్ ఏర్పరచేశారు. అంటే మానసికంగా సత్యసాయితో కావాలనుకున్నప్పుడల్లా మాట్లాడగలిగేవారు. ఇంట్లో ప్రతిరోజు సాయంత్రము భజన చేసేవారు. శ్రీ కామరాజుగారు, విశ్వనాథ్, లక్ష్మీ వీరంతా భజన చేస్తుంటే భక్తులు మైమరిచిపోయేవారు.

సత్యసాయి ప్రేమతత్త్వము మాస్టర్‌గారిని బాగా ఆకర్షించింది. ముఖ్యముగా సత్యసాయి భజనలో "ప్రేమ ముదిత మన్‌సే కహో రామ రామ రామ్, రామ రామ రామ్, రామ రామ రామ్, శ్రీ రామ రామ రామ్" అనే ఈ పాటని మైమరిచిపోయి వినేవారు. మీకు ఏదైనా కష్టము వస్తే సాయికి చెప్పుకోండి- యుద్ధము చేసి మరీ సాధించుకోండి. ఆయన ఎందుకు పలకడు? పలకలేదు అంటే మీకు పిలవడము రాలేదు అనే కదా!! ఆర్తితో పిలవండి పలుకుతాడు. ఆయన ప్రేమమూర్తి అని చెప్తుండేవారుట. ఐతే మాస్టర్‌గారు ఒక్క సాయిని మాత్రమే పూజించలేదు. అనేకమంది గురువులతో పాటు ఒక ప్రధానమైన గురువుగా ఆరాధించేవారు, అంతే.

కాశీలో దాదాపు 20 సంవత్సరాలు ఉన్నారు. వారి విద్యాధ్యయనము అంతా బెనారస్ హిందూ యూనివర్సిటీలోనే జరిగింది. కాశీలో ఉండగానే వారికి అనేకమంది గురువులతో పరిచయము అయ్యింది. వారి మార్గదర్శనము జరిగింది. అనేక మంత్రదీక్షల నివ్వటమూ జరిగింది. సాధారణముగా ఒక దీక్షను గురు ముఖతః పొందాలంటే

**గురు శుశ్రూషయా విద్య పుష్కలేన ధనేవా అథవా విద్యయా విద్య....** అనే ప్రమాణాలు అందరికి తెలిసినవే.

మొదటి మార్గము – గురుకులాలకి వెళ్ళి గురు శుశ్రూష చేసి గురు అనుగ్రహముతో విద్య గడించటము.

రెండో మార్గము – పుష్కళంగా గురుదేవులకు ధనాన్ని ఇచ్చి విద్యని పొందడము.

మూడవ మార్గము – అథవా విద్యయా విద్య అంటే మనము ఒక విద్యని ఒకరికి నేర్పించి వారి దగ్గర నుంచి మరొక విద్యను నేర్చుకోవడము అనేది అనాదిగా వస్తున్న సంప్రదాయము.

కానీ ఇక్కడ మాస్టారి విషయములో గురువులే స్వయముగా వచ్చి తమ దగ్గరున్న అఖండమైన విద్యని మాస్టర్‌గారికి అందించేవారు. ఈ దివ్యాత్మకు తమ విద్యని ప్రదానము చేస్తే అది రాబోయే రోజులలో వేలాదిమందికి అందుతుందని బహుశా వాళ్ళకి ముందే తెలుసునేమో!

## అధ్యాయం-2
# దీక్షా ప్రకరణ

మాస్టర్‌గారికి కాశీలో ఉన్న 20 సంవత్సరాలలో అనేకమంది గురువులతో పరిచయభాగ్యం కలిగింది. దాదాపు 36 మంది గురువులు తమకై తామే స్వయంగా వచ్చి గురుదీక్షల నిచ్చారని ముందే చెప్పుకున్నాముగదా! సుదూర అంతరిక్షానికి ఆవలనున్న 24 మంది ఉన్న పరమగురు మండలి ఈ భూమ్మీదకు పంపగా వచ్చిన ఆ దివ్యాత్మకు–అసలు జన్మయే తీసుకోవలసిన అవసరం లేదు. గీతలో భగవానుడు

**అజోఽపిసన్ అవ్యయాత్మా భూతానామీశ్వరోఽపిసన్ ।**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (గీత 4/6)**

అని చెప్పినట్టుగా ఈ ప్రకృతిలో ఆయన చేయవల్సిన విశిష్టమైన పనుల కోసం పరమ గురుమండలి ఆదేశానుసారం అవతరించిన ఆయనకు గురువులు, మంత్రదీక్షలు అనేవి ఒక నామమాత్రపు ప్రక్రియ మాత్రమే కానీ ఆయన తన శక్తిని గురించి గానీ, తాను చేయవలసిన పనిని గురించి గానీ ఎవ్వరికీ ఎప్పుడూ చెప్పలేదు. (తర్వాత తర్వాత సమయానుకూలంగా సందర్భం వచ్చినప్పుడు మాత్రం కొన్ని సత్యాలను బయటపెట్టేవారు). సాక్షాత్ విష్ణుమూర్తి మానవరూపంలో శ్రీరాముడుగా అవతరించి అనేక కష్టాల ననుభవిస్తూ దుష్టశిక్షణ చేసి రామరాజ్య స్థాపన చేసి ఎలా కార్యక్రమాలను అవిశ్రాంతంగా చేశాడో అలానే మాస్టర్‌గారు కూడా తమలో అనంతదైవీశక్తి ఉన్నా దానిని బయటి ప్రపంచానికి తెలియనీయకుండా సాధారణ వ్యక్తిగా జీవిస్తూ గురువులనీ – దీక్షలనీ – సాధనలనీ చేయటం ఎందుకు అంటే అది మనకు ఆదర్శంగా ఉండటానికి.

యోగీశ్వరులైనవారికి దీక్షల నివ్వటానికి గురువులు తమంతట తామే వారిని వెతుక్కుంటూ వచ్చి ఎంతో శ్రద్ధతో దీక్షల నిచ్చి తమ శక్తి ధారపోసి ఆనందంగా వెళ్ళిపోయేవారట. అలా ఆయన స్వీకరించిన మొదటి మంత్రం 'రామమంత్రం!' ఎంతో శ్రద్ధతో అనుష్ఠించిన మంత్రం రామమంత్రం. ఆ తర్వాత తీసుకున్న మంత్రం సరస్వతీమంత్రం, మూడోది దుర్గామంత్రం. అలానే కార్తికేయ, బగళాముఖీ మొదలైన మంత్రాలు తీసుకున్నారు. తీసుకున్న ఆ మంత్రాలను శ్రద్ధతో అనుష్ఠించేవారు. నిర్లక్ష్యము కానీ, అశ్రద్ధ కానీ, బద్ధకము కానీ ఎప్పుడూ ఉండేవి కావు. ప్రతి పనిని ఎంతో శ్రద్ధతో, నియమముగా చేసేవారు.

కాశీక్షేత్రము ఎంతో పుణ్యక్షేత్రము. **"కాశీ కాశీతి కాశీతి కాశ్యాంతు నివసామ్యహం"** అని మూడుసార్లు అనుకుంటే చాలు పుణ్యము వస్తుంది. అలాంటి కాశీని గురించి **"కాశ్యాంతు మరణాన్ ముక్తిః"** అనే ఒక ప్రమాణం ఉన్నది. మానవుడు కాశీలో మరణిస్తే ముక్తి వస్తుంది అనేది భారతీయుల విశ్వాసము. అలాంటి కాశీక్షేత్రానికి రావాలనీ విశ్వనాథుడిని, విశాలాక్షమ్మను దర్శించుకోవాలనే తపనతో అనేకమంది భక్తులు వేలాది సంఖ్యలో కాశీకి వస్తుంటారు. అంతటి పవిత్రమైన కాశీక్షేత్రములో వుండే వీధులు కానీ, సందులు గానీ ఎంతో అపరిశుభ్రంగా నడవటానికి కూడా వీలులేనంత గందరగోళముగా వుంటాయి. ఒక పక్క చదువుకోవాలి. అయినా సమయాన్ని కూడతీసుకుని వీలైనప్పుడల్లా ఆనందమయిఘాట్‌కి వెళ్ళి అక్కడి పరిసరాలను శుభ్రం చేసి వచ్చేవారు. పెద్ద చదువులు చదువుకుంటున్నా కూడా సేవా కార్యక్రమాల్లో శ్రద్ధగా పాల్గొనేవారు. వివేకానంద స్వామి చెప్తుండేవారు–'మంత్రజపము చేసే పెదవులకన్నా సహాయము చేసే చేతులు మిన్న' అని. నోటిలో మంత్రము, చేతిలో పని అన్న రీతిలో అంతరంగం ఆత్మారాముని ఆరాధన చేస్తూంటే – బాహ్య ప్రపంచములో దీన హీనులకు సేవచేయటము అనే సిద్ధాంతాన్ని మన మాస్టర్‌గారిని చూసి నేర్చుకోవాలి. ఆయన అందరిలో ఉంటున్నప్పుడు సర్వసాధారణ వ్యక్తి మాదిరే వ్యవహరిస్తారు. అందువలన ఆయన లోతైన వ్యక్తిత్వము అందరికీ తెలియదు.

ఒకసారి మాస్టర్‌గారికి ఎడమచెవిలో విపరీతమైన నొప్పి వచ్చింది. ఎన్నో మందులు, చిట్కాలు చేసినా నొప్పి తగ్గలేదు. ఆరోజులలో మాస్టర్‌గారు మూడురోజులపాటు నిత్యము అఖండ లలితా సహస్రనామ పారాయణ రాత్రి పగలు చేశారు. మూడురోజుల అఖండ లలితా పారాయణ పూర్తైన రోజు ఏ చెవి అయితే నొప్పిగా ఉందో ఆ చెవిలోంచి రక్తం విపరీతంగా కారిపోయింది.

అంతే ఆనాటి నుంచీ చెవి నొప్పి మాయమైపోయింది. అలా నొప్పి మరింకెప్పుడూ రాలేదు అని మాటల సందర్భంలో చెప్పటం జరిగింది.

'కాశీక్షేత్ర నివాసం చ కాలభైరవదర్శనం' అనే శ్లోకాన్ని మనం చదువుతూ ఉంటాం. సాక్షాత్ పరమశివుడు కాశీక్షేత్రానికి కాలభైరవుడిని క్షేత్రపాలకుడిగా నియమిస్తాడు. అప్పటికే చాలా సాధనలు చేసిన మాస్టర్‌గారు క్షేత్రపాలకుడైన ఆ కాలభైరవుడి సాధన కూడా చేస్తే మంచిదని తలచి 8 రోజుల పాటు నియమ నిష్ఠలతో ఆ సాధన చేశారు. అనుష్ఠాన ఫలితాలాయనకు కరతలామలకం. దేవీకటాక్షంతో పాటు కాలభైరవ అనుగ్రహాన్ని కూడా అనతికాలంలోనే అనుభూతి చెందారు. శ్రీరామకృష్ణపరమహంస ఎలాగైతే ఒక్కొక్క దేవతను లేక దేవుణ్ణి మూడురోజులపాటు సాధన చేసి సాక్షాత్కరింపజేసుకున్నారో అలానే ఈ శ్రీరామకృష్ణగారికి కూడా ఎన్ని ఉపాసనలను, సాధనలను చేసినా తనివి తీరలేదు. సాధనా తపన తీరలేదు. ఆ అమృతధారలు ఇంకా ఇంకా ఆశ్వాదించాలనే తపనతో 'జై బజరంగ బలి 'అనుకుంటూ హనుమంత సాధనను అంటే చాలీసా పారాయణను మొదలుపెట్టారు. సాక్షాత్ సుందరాకాండ పారాయణే చాలీసా పారాయణ. 108 సార్లు చాలీసా పారాయణ పూర్తి చేసి హనుమదనుగ్రహాన్ని పొందారు. ఆ తరువాత దశమహావిద్యల్లో గల భువనేశ్వరీదేవి మహా మంత్రానుష్ఠానాన్ని పూర్తి చేసి ఆ దేవి అనుగ్రహానికి పాత్రులైనారు.

మాస్టారు అప్పుడు ఎం.ఎస్.సి. చదువుతున్నారు. అప్పటికే అనేకమంది గురువుల దగ్గర దీక్షలు స్వీకరించి సాధనలు చేయటం అయిపోయింది. కానీ అవి ఏవీ ఇంట్లోవాళ్ళకు తెలిసేవి కాదు. కొంతవరకు వాళ్ళమ్మగారికి తెలుసు. ఎందుకంటే ఆయనకు భోజనం పెట్టేది ఆమేకదా! ఒకసారైతే 40 రోజులపాటు ఇంటికి వచ్చికూడా భోజనం చేయకుండా వెళ్ళిపోతుండేవారు. 'ఏ గురువు ఏం సాధన ఇచ్చారో, ఏ సాధన చేస్తున్నారో' అనే విషయం ఎవ్వరికీ చెప్పేవారుకాదు. ఒకరోజు ఇంటికి వస్తూనే "అమ్మా! ఈవేళ 20 మందికి వంట చెయ్యి" అని చెప్పారట. కాసేపాగి వచ్చి అమ్మ వండిన ఆ భోజనమంతా తానే తిన్నానని ఒకనాడు చెప్పారు. ఇలాంటి విషయాలు బయటకు పొక్కేవికాదు. కేవలం తల్లీ కొడుకుల మధ్య రహస్యంగా జరిగిపోతూవుండేవిట.

ఆత్మసాధనలో భాగంగా దీక్షలు, అనుష్ఠానాలు చేస్తూ కూడా మాస్టర్‌గారు తమకు 19 వ సంవత్సరం వచ్చేనాటికి ఎమ్.ఎస్.సి డిగ్రీని కూడా పొందారు. పోస్టుగ్రాడ్యుయేషను అయిపోయాక ఉద్యోగంలో చేరమని తండ్రిగారు చెప్పినా వినకుండా పి.హెచ్‌డి.కి దరఖాస్తు పెట్టుకున్నారు.

ఒకవంక చదువుకుంటూనే వారు సాయి భజనలు, సత్సంగాలను చేస్తూచేస్తూ మెల్లిగా శ్రీరామశర్మ ఆచార్యగారి పరిధిలోకి వెళ్ళిపోయారు. అఖండ సాధనా, అనుష్ఠానాలన్నీ కూడా చివరకు ఆయనను 'అఖండ గాయత్రి పరివార్'లోకి వెళ్ళేలా చేశాయి.

ఇక్కడ కూడా మాస్టార్‌గారు స్వయంగా తాను శ్రీరామశర్మఆచార్యగారి దగ్గరకు వెళ్ళలేదు. అప్పటికింకా గాయత్రీ పరివార్ ఇంత వ్యాప్తి చెందలేదు. స్వయంగా మహాకాల స్వరూపులు పండిత శ్రీరామశర్మగురువుగారు సాధు స్వభావం గల, నిస్వార్థసేవాపరాయణులైన మన మాస్టర్‌గారికి కలలో కన్పించి చక్కటి ఆహ్వానాన్ని పలికారు.

## చిత్రమైన ఆహ్వానం

సాధారణంగా ఏ సాధనైనా ఫలవంతం కావాలంటే దీక్ష చాలా అవసరం. ముఖ్యంగా గురుదీక్ష చాలా అవసరం. చాలామందికి ఉన్న ఒక అర్థరహితమైన ఆలోచన ఏమిటంటే **గురుదీక్ష అంటే ఇంకెవరో వచ్చి మీ చెవిలో రహస్యంగా, వినీవినబడకుండా మేళతాళాల మధ్య ఇచ్చే మంత్రోపదేశం అనుకుంటారు. అది ఇంకెవ్వరూ వినకూడదనే ఒక మూఢవిశ్వాసంలో ఈనాటి సమాజం జీవిస్తోంది. అసలు గురుదీక్ష అంటే ఆ వ్యక్తి చెప్పింది చేయటం. అలా చేస్తే తప్పక దానికి సంబంధించిన ఫలితాలు వస్తాయే తప్ప కేవలం ఒక మంత్రదీక్ష తీసుకోవటం వల్ల ఎలాంటి ప్రయోజనాలు సిద్ధించవు. ఇది సాధారణ వ్యక్తులకు సంబంధించిన విధివిధానం.**

మాస్టర్‌గారి లాంటి సిద్ధపురుషులకు 'దీక్షా' ప్రకరణ లేదా దీక్షా విధానం ఇంకొకరకంగా జరిగింది. శ్రీరామకృష్ణపరమహంస తన యావశ్శక్తిని అందించటానికి వివేకానంద కోసం పరితపించిపోయారు. నరేంద్రుని ఆగమనంతో ఆయనకు ఊరట కల్గి తనకు వారసుడు లభించాడని ఆనందించాడు. మాస్టర్‌గారి విషయంలో కూడా పండిత శ్రీరామశర్మఆచార్యగారు, శ్రీరామకృష్ణ త్వరగా తన దగ్గరకు రావాలి – తన వారసత్వాన్ని ఆంధ్రప్రదేశ్ అంతటా అందించాలి అనే ఆలోచనతో శ్రీరామకృష్ణకు కలలో కన్పించి 'రామకృష్ణా! నీవు నా దగ్గరకు రా! నీతో నాకు చాలా పనుంది' అంటూ పిలిచారు. శ్రీరామశర్మఆచార్య కలలో కన్పించి రమ్మని పిలిచిన రోజు 1969 డిసెంబర్ 22 వ తేది. (బహుశః అదొక విశిష్టమైన రోజే కావచ్చు. ఎందుకంటే ఆదిగురువైన దత్తస్వామి "దత్తజయంతి." సాధాణంగా డిసెంబర్ చివరి వారాల్లో రావడం కద్దు. ఇది కేవలం ఊహ మాత్రమే!!) మాస్టర్‌గారికి కలలో కనిపించిన ఆ వ్యక్తిని ఇంతకు ముందెప్పుడూ చూచిన

గుర్తురావటం లేదు. ఎవరీయన అనే సందేహం వచ్చింది కానీ తర్వాత ఇంక దాన్ని గురించి పట్టించుకోలేదు. ఇక తర్వాత మర్చిపోయారు కూడా!

తర్వాత కాలంలో విచిత్రమైన సంఘటన ఒకటి జరిగింది. దాన్ని మనం విచిత్రం అనుకుంటాం గానీ కచ్చితంగా జరగవల్సిన ఒక నియతి. గురుప్రణాళిక ప్రకారమే జరిగిందని చెప్పాలి. అదేంటంటే ఒకరోజు మాస్టర్‌గారు సిటీబస్‌లో యూనివర్సిటీకి వెళ్తున్నారు. కూర్చోటానికి ఖాళీలేక రాడ్ పట్టుకుని నిలబడివున్నారు. ఉన్నట్టుండి ఒక వ్యక్తి చేతి నుండి ఒక పత్రిక జారి మాస్టర్‌గారి దగ్గర క్రిందపడింది. వెంటనే వంగి ఆ పత్రిక తీసి అటూ ఇటూ తిప్పి చూసి ఆ వ్యక్తికి ఇవ్వబోయారు. అది అఖండజ్యోతి హిందీ మాసపత్రిక. పూజ్య గురుదేవుల రచనలు అందులో ఉంటాయి. ఆ మాసపత్రిక వెనకాల అట్టపై చిత్రం 'శ్రీరామశర్మఆచార్య' గురుదేవులది. ఆ ఫొటో చూసి ఆగిపోయి, ఆ పత్రికను గురించిన వివరాలను ఆ వ్యక్తిని అడిగారు. ఆ ఫొటో సాక్షాత్తు తన కలలో కనిపించి 'రామకృష్ణ! నా దగ్గరకు రా!' అని పిలిచిన వ్యక్తిది. ఎక్కడకు రావాలి? ఎందుకు రావాలి? అనే ప్రశ్నలు ఆయన మనసులో ఉదయించాయి. ఇంతలో తన గమ్యం రాగానే బస్సు దిగి యూనివర్సిటీలోకి వెళ్ళిపోయారు.

యూనివర్సిటిలో తన సీనియర్ నగేందర్‌సింగ్ మాస్టర్‌గారికి మంచి స్నేహితుడు. పరిశోధనలను చేసుకోవటానికి వారికి సొంత లాబ్ ఉండేది. 'ఆ లాబ్‌నే నీవు వాడుకో రామకృష్ణ' అనేవారు. అందుచేత మాస్టారు ఆ లాబే వాడేవారు. ఈలోపున మాస్టర్‌గారికి 'గురుదేవులు మళ్ళీ స్వప్న దర్శనమిచ్చి రమ్మని పిలిచారు'. ఆయన ఎవరనే అవగాహన ఇంకా మాస్టర్‌గారికి రాలేదు. అంతటితో ఆ సంఘటన మళ్ళీ మరుగునపడిపోయింది.

కొంతకాలం తరువాత అతి దగ్గర స్నేహితుడు 'రేపు మా ఇంట్లో గాయత్రీయజ్ఞం చేస్తున్నాము, నీవు తప్పకుండా రావాలి' అని చెప్పాడు. మాస్టర్‌గారికి మంచి స్నేహిత బృందం ఉండేది. అందులో అన్నిరకాల వాళ్ళూ ఉండేవారుట. అందరూ మాస్టర్‌గార్నే ఏ విషయానికైనా సలహాలు అడుగుతూండేవారనీ తాను వాళ్ళ సమస్యలకి పరిష్కారాలు చెప్తూండేవాడినని మాస్టర్‌గారు చెప్తూండేవారు.

సరే స్నేహితుడి ఆహ్వానం మేరకు మన మాస్టర్‌గారు వాళ్ళింట్లో జరిగే హవనానికి వెళ్ళారు. యజ్ఞానికి వేదిక మీద పెట్టిన ఫొటోల్లో ఒకదాంట్లో శ్రీరామశర్మఆచార్యగారి ఫొటో ఉంది. సరే

యథావిధిగా హవనం జరిగిపోయింది. ఆ యజ్ఞం మాస్టారికి చాలా నచ్చేసింది. తర్వాత స్నేహితుడి ద్వారా పండిత శ్రీరామశర్మ ఆచార్యగారి వివరాలన్నింటినీ అడిగి తెలుసుకున్నారు. ఆ వివరాలన్నీ మాస్టర్‌గారి హృదయానికి హత్తుకున్నాయి. ఎవరీ మహానుభావుడు. ఎందుకు వీరు నా కలల్లో కన్పిస్తున్నారు అని ఆలోచిస్తూ పడుకున్నారు.

అంతే ఆ రాత్రి మళ్ళీ గురుదేవులు స్వప్నంలో కనిపించి ఎంతో ప్రేమతో 'నా దగ్గరకు రా రామకృష్ణా!' అని పిలిచారు. ఇంక మనస్సు ఆగలేదు. ఎలాగైనా మధురకు వెళ్ళి గురుదేవులను దర్శించుకోవాలని మనస్సులో నిర్ణయించుకున్నారు. అఖండజ్యోతి మాసపత్రికకు చందాదారులుగా చేరారు. ప్రతి నెలా పత్రిక ఎప్పుడు వస్తుందా అని ఆరాటం. పత్రిక రాగానే ఆమూలాగ్రం ఎంతో ఏకాగ్రతతో చదివి అందులో ఇచ్చిన సమాచారాన్ని హృదయంగమం చేసుకోవడం - ఇచ్చిన సాధనలను చేయటం ప్రారంభించారు.

'గురుదీక్ష' అంటే గురువు ఇచ్చిన మంత్రాన్ని వల్లెవేయటం కానే కాదు. గురువు చెప్పిన విషయాలను గురువుల సాహిత్యాన్ని అధ్యయనం చేయటం. అందులో వారిచ్చిన, ఆచరించాల్సిన విధానాలను ఆచరణలో పెట్టడమే అసలైన గురుదీక్ష అని మాస్టర్‌గారు ఒక ప్రవచనంలో చెప్పటం జరిగింది.

మధురకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాక 24 వేల గాయత్రీమంత్ర జపముతో ఒక లఘు అనుష్ఠానాన్ని పూర్తిచేశానని మాస్టర్‌గారు స్వయంగా చెప్పారు. ఇంతలో అఖండజ్యోతి మాసపత్రికలో ఒక ప్రకటన వచ్చింది. '1971 జూన్ 18 వ తేదీన గురుదేవులు సామూహిక గాయత్రీదీక్ష నిస్తారు. అటు తరువాత గురుదేవులు మధురను వదలి హరిద్వార్ వెళ్ళిపోతారు. దీక్ష తీసుకోదలచినవారికిది ఒక అమూల్యమైన అవకాశం. కుల మత జాతి విచక్షణ లేకుండా అందరికీ ఆహ్వానం' అని ప్రకటించారు. ఈ ప్రకటన చూశాక మాస్టర్‌గారికి గురుదేవులను కలుసుకోవాలనే ఆరాటం పెరిగిపోయింది. తల్లికి దూరమైన లేగదూడ తల్లికి దగ్గర కావాలనే ఆరాటంతో ఎలా పరుగులు పెడుతుందో అలా మాస్టర్‌గారి మనస్సు ఆరాటంతో పరుగుపెట్టింది. 'ఎప్పుడు చూస్తానా' అనే తపన.

గాయత్రీమహామంత్ర ద్రష్ట, గాయత్రీ ఉపాసకులు, యుగనిర్మాణ యోజనా వ్యవస్థాపకులు, ప్రేమమూర్తి సాక్షాత్తు మహాకాల స్వరూపులు అయిన మన పండిత శ్రీరామశర్మఆచార్యగారిని

చూడాలనీ, దీక్ష తీసుకోవాలనీ మనస్సులో అనుకున్నారు. కావలసిన డబ్బు సమకూరలేదు. సన్నిహితుడైన ఒక మిత్రుణ్ణి డబ్బు సర్దమని అడిగారు. అతను కేవలం రానూ పోనూ టిక్కెట్టుకు సరిపడా మాత్రమే డబ్బు ఇచ్చాడు. అంతకంటే ఎక్కువ డబ్బు ఆయన దగ్గరా లేదు. సరే. రానూ పోనూ టిక్కెట్టు కొనుక్కొని ఖాళీ చేతులతో రైలు ఎక్కారు. మధురలో దిగారు. అప్పటికే పదిమైళ్ళ పొడవునా గుడారాలు వేసివున్నాయి. దాదాపు లక్షల సంఖ్యలో జనం ఉన్నారు. ఈయనకు ఒక గుడారం చూపించారు. స్నానం చేశారు. కడుపులో ఆకలిగా ఉన్నది. తినటానికి చేతిలో డబ్బుల్లేవు. 'నానా అగచాట్లుపడి వస్తే ఇదా ఇక్కడి మర్యాద' అని మనస్సులోనే గురుదేవులను ప్రశ్నించారుట. కాసేపటికి ఒక అపరిచిత వ్యక్తి వచ్చి ఈయనకు (మాస్టారికి) కావలసిన ఆహారాన్ని ఇప్పించి శాంతింపచేసి వెళ్ళిపోయాట్ట. తరువాత మళ్ళీ అదే వ్యక్తి వచ్చి కావలసిన సౌకర్యాలను చూపించి గురువుగారి ప్రవచనానికి తీసుకువెళ్ళాడు. గురువుగారి ప్రవచనం జరుగుతున్నది. గురువుగారు మధురను వదిలి హరిద్వార్ వెళ్ళే సందర్భంలో ఇస్తున్న వీడ్కోలు సందేశమది. ఇంతలో ఒక వ్యక్తి లేచి 'ఆప్ హమే ఛోడ్‌కర్ మత్ జాయియే' అంటూ ఏడ్వనారంభించాడుట. వేంటనే గురుదేవులు అతనిమీద మండిపడి 'బాహర్ ఫేంక్ దో ఇస్ సాలేకో' అని అరిచారుట.

ఆ తర్వాత గురువుగారు 'గురువు శరీరాన్ని పట్టుకొని వేళ్ళాడేవాడు కాదు నాక్కావల్సింది. గురువు యొక్క లక్ష్యాన్ని అర్థం చేసుకొని, వారి ఆదర్శాలను అర్థం చేసుకొని పాటించే వ్యక్తులు నాక్కావాలి' అని చెప్పారుట. ఈ మాటలు వినటానికి మామూలుగా అనిపించినా.... అవి మాస్టర్‌గారి హృదయంలో గాఢంగా హత్తుకుపోయాయి. ఈ మాటలనే దీక్షగా స్వీకరించి జీవితమంతా ఆచరించారు. అందరికి అదే నేర్పించారు కూడా! మూడవరోజున గురుదేవులు అందరికి సామూహిక దీక్షలను ఇవ్వటం జరిగింది.

దీక్షావేదిక మీద అల్లంత దూరంలో గురువుగారిని చూశారు. ఆరోజు అంటే 1971 జూన్ 18వ తేదీన గురుదేవులు ఇవ్వబోయే 'గాయత్రిదీక్ష'కు లక్షలమంది ఎంతో తపనతో దూరదూర ప్రాంతాల నుండి వచ్చారు.

## గురుదర్శనం - గురుదీక్ష

సభ ప్రారంభమైంది. గురుదీక్షకు ముందు గురుదేవులు 'వీడ్కోలు సందేశము' ఇచ్చారు. ఇంక తాము మధురను వదిలి హరిద్వార్ వెళ్తున్నామనీ, చేయవల్సిన పరమగురువుల పనిని

ఇంక హరిద్వార్‌లో విశ్వామిత్ర తపోస్థలిలో ఉంటూ ప్రారంభిస్తామనీ, దానికోసం ఒక ఆశ్రమం నిర్మించాల్సి ఉంటుందనీ చెప్పారు. హిమాలయ పరమగురువు దాదాగురుదేవుల ఆదేశంతో మిగిలిన పనిని ప్రారంభించాలనీ – ఈ దీక్ష తీసుకున్న మీరంతా చేయవల్సిన పని చాలా ఉంటుందనీ ఒక మధురమైన సందేశాన్ని ఇచ్చారు (అదే విదాయి సందేశ్. దానిని తెలుగులో ప్రచురించాము. దానిని అందరూ చదవాలి. ఎంతో ఆవేదనతో గురుదేవులు మధురలో ఇచ్చిన చివరి సందేశం ఇది. మాస్టర్‌గారు ఆ సందేశాన్ని లక్ష ప్రతులు అచ్చువేయించి అందరికీ పంచమని చెప్పారు.) సరే – నిశ్శబ్దంగా ఆ సందేశాన్ని అందరూ విని ఆకళింపు చేసుకున్నారు. ఆ వీడ్కోలు సందేశము విన్న అందరి కంటిలో ఆగని అశ్రుధారలు – తీవ్రమైన ఆవేదన. అందరికీ ఉత్తేజాన్నిచ్చిన ఆ సందేశాన్ని అందరూ చదివి తీరాలి. సందేశము అయిపోయాక 'గురుదీక్ష' ప్రకరణ ప్రారంభమైంది. అందరూ కళ్ళు మూసుకొని గురుదేవులిచ్చే దీక్షను ఎంతో శ్రద్ధతో ఏకాగ్రతతో స్వీకరించారు. కొద్దిక్షణాలపాటు అంతా నిశ్శబ్దం. ఊహించలేని రీతిలో ఉద్వేగము. దాంతోపాటు అనిర్వచనీయమైన ఆనందము అందరికీ కల్గిందిట (ప్రజ్ఞాపుత్రుడైన ఒక వ్యక్తి చెప్పిన విషయమిది). ఎందుకా ఆనందము అంటే ఆరోజు లక్షల మందికి దీక్షనిచ్చారు. లక్షలమందికి రెండు సెకనుల పాటు గురుదేవులు స్వయముగా తమ దగ్గరికి వచ్చి గురుదీక్ష నిచ్చిన రీతిగా అనుభూతి కలిగినది. మహారాసలీల జరుగుతుండగా ప్రతీ గోపికకి సాక్షాత్ శ్రీకృష్ణుడు తన ఒక్కదాని దగ్గరకి వచ్చి శ్రీకృష్ణుడు తనతో నాట్యమాడుతున్నాడనే అనుభూతిని, ఆనందాన్ని పొందినట్లుగా ఈ లక్షలాదిమంది గురుదేవులు తన ఒక్కరికే ఎదురుగా నిలబడి దీక్ష నిచ్చిన అనుభూతిని పొందటము జరిగింది.

దీక్షానంతరము పాదనమస్కారాలు! అందరూ మౌనంగా వరుస క్రమములో ఒక్కొక్కరు వెళ్ళి నమస్కారము చేస్తూ వెళ్ళిపోతున్నారు. మాస్టర్‌గారి వంతు వచ్చింది. పాదాలకు నమస్కరించి లేవగానే గురుదేవులు 'ఏమిటీ నిన్ను రమ్మని రెండుసార్లు పిలవాలా' అని అడిగారు. శిరస్సు మీద చెయ్యి ఉంచి –'హస్త–మస్తక స్పర్శ' అనే దీక్షనివ్వటంతో మాస్టర్‌గారి ఒళ్ళు పులకరించిపోయింది. అవధులు లేని ఆనందము కల్గింది. ఆనాడు శ్రీరామశర్మఆచార్యకు వసంతపంచమిరోజు దాదా గురుదేవులు దర్శనము ఇచ్చిన క్షణములో గురుదేవులెలాగైతే తనను తాను ఆయనకు సర్వసమర్పణ చేసుకున్నారో అలాగే మాస్టర్‌గారు మన గురుదేవులకు సర్వసమర్పణ చేసుకున్నారు. గురుదేవులు మధురలో ఉండి తపస్సాధనలు చేసే ప్రదేశములో 'తపోభూమి' అనే ఆశ్రమాన్ని నిర్మించారు. అక్కడికి దగ్గర్లోనే 'అఖండజ్యోతి' పత్రిక ప్రచురణకు 'ఘియామండి' దగ్గర ప్రచురణాలయము

ఏర్పాటుచేశారు. 'తపోభూమి'కి సాధన నిమిత్తం వచ్చేవారందరికి అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయి. గురుదేవులు అందరినీ అక్కడే కలుస్తుండేవారు.

మాస్టర్‌గార్కి పూజ్య గురుదేవులతో ప్రథమ సమాగమం తపోభూమి మధురలోనే జరిగింది. గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడితో **"బహూని మే వ్యతీతాని జన్మాని తవచార్జున తాన్యహం వేదసర్వాణి నత్వం వేత్త పరంతప"** అని అంటారు. అంటే మనము ఇద్దరము కల్సి అనేక జన్మలు తీసుకున్నాము నాకవన్ని తెలుసు – నీకు తెలియదు. అలానే గురుదేవులు కూడా "నీకు నాకు మధ్యన అనేక జన్మల సంబంధము ఉన్నది. కాబట్టే నిన్ను నా దగ్గరకు పిలిపించుకున్నాను. నీతో చేయవల్సిన ఋషుల ప్రణాళికలు చాలానే ఉన్నాయి. మెల్లిమెల్లిగా అవన్నీ నీకు త్వరలోనే చెప్తాను. ఇప్పటికి ఇంతవరకు చాలు అంటూ మాస్టర్‌గారి శిరస్సు మీద చెయ్యి పెట్టి శక్తిపాతాన్నిచ్చారు". ఆ స్పర్శతో మాస్టర్‌గారికి గత జన్మల జ్ఞాపకాలన్నీ వెల్లువలాగా బయటకు స్మృతిలోకి వచ్చాయి. ఒక మనిషి జన్మ ఎందుకు తీసుకుంటాడు అంటే ఋణానుబంధాలు తీర్చుకోవటానికి. అది ఏదైనా కావచ్చు – వ్యక్తిగతమైన, కుటుంబపరమైన, సమాజపరమైన లేదా ఋషిపరమైనది కూడా కావచ్చు. మానవుడు జన్మలెత్తేది ఆ ఋణానుబంధాలను తీర్చుకోవటానికే అనేది ఒక నగ్నసత్యం. అలా స్పర్శ నిచ్చిన తరువాత గురుదేవులు మాస్టర్‌గార్కి ఋషులందరి సూక్ష్మశరీరాల దర్శనాన్ని కల్గించారు. దీంతో మాస్టర్‌గారికి ఒక నిర్దిష్టమైన జీవన లక్ష్యము లేదా జీవిత గమ్యం బోధపడింది. వెంటనే మాస్టారు 'గురుదేవా! నేనేం చేయ్యాలో చెప్పండి. త్రికరణశుద్ధిగా చేస్తాను' అని ఎంతో వినమ్రంగా గురుదేవుల నడిగారు. గురుదేవులకు ఆనందం కలిగింది. సమయము వచ్చినప్పుడు నేనే నీకు అన్నీ చెప్తాను. నీవు చేయవల్సిన పని మాత్రము చాలానే ఉన్నది అంటూ నామమాత్రంగ కొన్ని విషయాలను సూచనప్రాయముగా చెప్పారుట. ఆతరువాత గురుదేవులు రామకృష్ణగారిని రెండురోజులపాటు తన దగ్గరే ఉంచుకొని అంతరంగ సూచనల నిచ్చారు. ఆశ్రమములో ప్రతినిత్యం క్రమబద్ధంగా జరుగుతున్న కార్యక్రమాలన్నింటిని శ్రద్ధగా గమనించేవారు మాస్టారు.

పూజ్య గురుదేవులు 'నవయుగ నిర్మాణం' కోసము చేస్తున్న తపస్సాధనలు, ప్రతీ క్షణాన్ని ఎంతో విలువైనదిగా భావించి దానిని సమస్త మానవజాతి శ్రేయస్సు కోసము ధారపోసే విధానము, నిస్వార్థ ప్రేమ, నిస్వార్థ సేవాతత్పరతలు మాస్టార్ని ఎంతో ఆకర్షించాయి. ఇతరుల కష్టాలను తీర్చి వారిని బాధల నుంచి విముక్తి చెయ్యటానికి అనుక్షణం వారు పడే తపన, ఆవేదనను చూచి

మాస్టర్‌గారి మనస్సు ఆయనకు సర్వసమర్పణ చేసుకుంది. ఆక్షణములోనే పూర్తి సరెండర్ ఐపోయారు. ఆశ్రమములో రెండు, మూడు రోజులున్న తరువాత బయల్దేరేముందు గురుదేవులు ప్రత్యేకంగా చెప్పవల్సిన విషయాలను కొన్ని చెప్పిన తరువాత వీడ్కోలు తీసుకుని వచ్చేటప్పుడు ఆయన ఎంతో ప్రేమతో రామకృష్ణ వైపు చూశారు. ఆక్షణములో గురుదేవుల కళ్ళనుంచీ జాలువారిన ఆ దివ్య ప్రేమామృతధారలు తేనెకన్నా తీయనైనవి. ఆ శక్తిధారలను జీవితములో నేనెన్నటికీ మర్చిపోలేనని ఎంతో తన్మయత్వంతో మాస్టర్‌గారు చెప్తుంటే ఆ దృశ్యాన్ని చూచితీరాలే కానీ వర్ణించలేము కదా.

అసలే ప్రేమతత్త్వాన్ని నింపుకొని పుట్టిన మన మాస్టర్‌గారు గురుదేవుల ప్రేమతో మరీ కరిగిపోయారు. ఏ లక్ష్యాన్ని పూర్తిచేయటానికి పరమగురుమండలి తనని ఈ భూమ్మీదకు పంపిందో ఆ లక్ష్యమేంటో ఆయన పూజ్య గురుదేవులను చూడగానే అర్థమైపోయింది.

ఇక్కడ సంస్థలతో పని లేదు. పేరేదైనా లక్ష్యం పనిమీదనే. గురుదేవుల ఆశయాలను సాధించ టానికి తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించటానికి మాస్టర్‌గారు నిర్ణయించుకున్నారు. ఈ భరతభూమిలో ఆయన నాటుతున్న బ్రహ్మబీజాలను ఆంధ్రప్రదేశ్ వైపుకు తీసుకురావటానికి కావల్సిన గట్టి బీజాలను గురుదేవులే మాస్టర్‌గారి గుండెలనిండా నింపి పంపారు. అవ్యక్తస్థితిలో ఉన్న ఆ బీజాలు కాలక్రమములో సమయం వచ్చినప్పుడు వాటంతటవే మొలకెత్తటము జరుగుతుంది.

జీవిత లక్ష్యము అర్థమైపోయింది. ఎప్పుడైనా మాస్టర్‌గారు ఇలా చెప్పేవారు. కాశీలో ఉ ండగా అంతమంది గురువుల దగ్గర దీక్షలు తీసుకుని సాధనలు చేసినా జీవిత లక్ష్యము అర్థము కాలేదు. గురువుగారి దగ్గరకి వెళ్ళాకే తన 'గమ్యం' ఏమిటో తెల్సిందనేవారు. మధుర నుంచీ కాశీకి ప్రయాణమైనారు. అటుతరువాత ఆ అపరిచితవ్యక్తి దగ్గర వీడుకోలు తీసుకొని రైలు ఎక్కారు. కానీ ఆ వ్యక్తి ఎవరు అనేది ఇంతవరకు బయటపెట్టలేదు. కానీ ఆయన ఎన్నో జన్మలుగా కష్టసమయంలో వారిని ఆదుకున్న వ్యక్తి అని మాత్రం అర్థమైంది. రైలులో రిజర్వేషన్ లేదు. ఎండ తీవ్రంగా ఉన్నది. నిలబట్టానిక్కూడా చోటులేదు. విపరీతమైన దాహంగా ఉన్నది. నాలుక పిడచ కట్టుకుపోతున్నది. రైలు దిగి వెళ్ళటానిక్కూడా వెసులుబాటు కనిపించలేదు. భరించలేని బాధగా ఉన్నది. ఇంతలో రైలు ఇంజను ఒకటి వచ్చి మాస్టర్‌గారు ఉన్న బోగీ ప్రక్కన ఆగింది. రైలు డ్రైవర్ని కాసిని మంచినీళ్ళను ఇమ్మని అడిగారు. అతను ఆ ఇంజనులో మరిగిపోతున్న

నీళ్ళను ఇచ్చాడు. సెగలు, పొగలు కక్కుతున్న ఆ నీళ్ళనే గటగటా త్రాగేశారు. ఆ సమయంలో వారి శరీరంలో ఊహించనలవికాని విచిత్రమైన మార్పులు రావటం జరిగిందని చెప్పారు. శాస్త్ర ప్రకారం గురుదీక్ష తీసుకున్న తరువాత శిష్యుడు వేడివేడి నీరు త్రాగాలి. మాస్టర్‌గారి చేత ప్రకృతి ఆవిధంగా వేడినీళ్ళు త్రాగించి 'గురుదీక్షకు' అంత చక్కటి పూర్ణత్వాన్నిచ్చింది. ఇంక అంతే! ఇక వెనుదిరిగి చూడలేదు. ఇంకో గురువు దగ్గరికీ వెళ్ళలేదు. ఇంక ఆయన మనస్సు, ఆత్మ అంతా గురుదేవులకే అంకితమైపోయాయి. గురుదేవుల పని మీదనే మనస్సు కేంద్రీకృతమైపోయింది.

ఇంటికి వచ్చీరావటముతోనే సిద్ధము చేసుకున్న ప్రణాళికలను అమలు చేయనారంభించేశారు. ఇంట్లో వాళ్ళందరికీ గాయత్రీ ఎలా చెయ్యాలో నేర్పించారు. అనుష్ఠాన నియమాలను వివరించారు. ఆహార నియమాలను చెప్పారు. వంటలో ఉల్లి, వెల్లులి నిషేధించారు. శ్రద్ధగా అనుష్ఠానమును చేయటానికి అందరినీ తయారు చేశారు. యజ్ఞకుండాన్ని ఇంట్లో ఆగ్నేయదిక్కులో స్థాపించారు. నిత్య హవనము ప్రారంభించారు. అందరు ఆత్మసాధనలో లీనం కావాలి. ఇంట్లోవాళ్ళకి ఈ మార్పులన్నీ మొదట కాస్త ఇబ్బందిగా అనిపించినా తర్వాత తర్వాత అలవాటైపోయింది.

ఈ దివ్య బాటలో శ్రీరామకృష్ణ నడవటము చూచిన తాతాగారైన శ్రీసోమేశ్వరరావుగారెంతో ఆనందించారు. శ్రీరామకృష్ణపరమహంస పేరు పెట్టుకున్నందుకు మనమడు మంచి మార్గములోనే నడుస్తున్నాడు అని ఎంతో సంబరపడిపోయారు. కాలము చాలా చిత్రమైనది. ప్రకృతి తన నియమానుసారము తన పని తాను చేసుకుంటూ పోతుంది. అలాంటి నియమాలలో భాగంగానే శ్రీసోమేశ్వరరావుగార్కి హఠాత్తుగా పక్షవాతం వచ్చి కాళ్ళు, చేతులు, మాట పోయాయి. ఐతే ఎంతో ఆత్మస్థైర్యం, మనోదృఢత్వము గల వ్యక్తి కాబట్టి తన సాధన తాను చేసుకుంటూ, ఆహార నియమమును పాటిస్తూ మనోబలంతో సాధన చేసుకుంటూ శరీరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒక్క చెయ్యి తప్ప మిగిలిన అవయవాలన్నీ స్వాధీనమైనాయి. అంత బాగోలేకపోయినా ఆయన తన అనుష్ఠానానికి ఎలాంటి అడ్డు రానిచ్చేవారు కాదు. పక్షవాతం వలన నరాలు పట్టుతప్పాయి. మరుపు వచ్చి మంత్రాన్ని ఎక్కడ మర్చిపోతానో అనే భయంతో దానిని రాసి ఎదురుగా ఉంచుకునేవారు. నిరంతరము దానిని ప్రక్కనే పెట్టుకుని మౌనంగా సాధన చేసుకునేవారు.

గాయత్రీ సాధన అత్యంత నియమ, నిష్ఠలతో సాగిపోతున్నది. ఆధ్యాత్మికవిద్యతో పాటు భౌతికవిద్యలో కూడా మాస్టర్‌గారు అతి వేగముతో ముందుకు పోతున్నారు. పిహెచ్.డీ చేస్తున్నారు.

ఆ సమయములో తండ్రిగారైన శ్రీ కామరాజుగారికి తిరుపతి యూనివర్సిటీలో 'లా రీడర్' గా ఉద్యోగము వచ్చింది. కాశీకి వచ్చి ఇన్ని సంవత్సరాలు జరుగుతున్నా ఆయనకు తగిన ఉద్యోగము ఒక్కటీ రాకపోవటముతో విసిగిపోయిన కామరాజుగారు తిరుపతి యూనివర్సిటీవారు ఇచ్చిన ప్రకటన చూసి తనకు తగిన పోస్టు ఖాళీగా ఉండగా దానికి దరఖాస్తు చేశారు. ఇలాంటిదే మరొక పోస్టు ఢిల్లీలో కూడా ఖాళీ వచ్చింది. శ్రీ కామరాజుగారు దానికీ దరఖాస్తు చేశారు.

ఇంతలో తిరుపతి నుంచి 'ఉద్యోగములో వచ్చి చేరమనే' ఉత్తర్వులు జారీ అయ్యాయి. మళ్ళీ మధన ప్రారంభమైంది. కాశీకి వచ్చి ఇన్ని సంవత్సరాలైపోయింది. ఏదో సుఖంగానే ఉన్నాము. మళ్ళీ ఆంధ్రాకి వెళ్ళాలా అనే సందిగ్ధ పరిస్థితి వచ్చింది. తండ్రిగారు పడుతున్న ఈ మనోవ్యధను చూచి మాస్టర్‌గారు 'గురువుగారే మార్గము చూపిస్తారు. మీరేమీ చింతించకండి. మనకాయన అండ ఉండగా ఏమీ ఫరవాలేదు' అని ధైర్యం చెప్పారు. సాయంత్రము యథావిధిగా దీపయజ్ఞము చేశాక ఆరతి ఇవ్వటము అయిపోయింది. అంతా అయ్యాక తండ్రిగారిని పిలిచి దేవుడి ముందు ఇలా వేలుపెట్టి చూపించారు. పూజ దగ్గర వెలిగించిన అగరుబత్తీలు కాలిపోయి పడిన భస్మము "S" అని ఇంగ్లీషు అక్షర ఆకారములో నిలిచిపోయిందట. దాన్ని అలాగే చూస్తూ నిలబడ్డ తండ్రిగారితో 'చూశారా నాన్నగారు! గురుదేవులు మిమ్మల్ని తిరుపతి వెళ్ళమనే ఆజ్ఞ ఇచ్చారు. ఇంతకన్నా మరోలా ఆయన తన అనుమతిని ఎలా చూపించగలరు?' అని చెప్పటము జరిగింది. పరిపూర్ణ సమర్పణ చేసుకున్నవారికి వారి సమస్యలని గురుదేవులు ఎలా పరిష్కరిస్తారో ఈ సంఘటన ద్వారా మనకు చక్కగా బోధపడుతుంది. చూసే మనస్సుండాలే కానీ గురువుల చమత్కారాలకు పరిమితులేమి ఉంటాయి!

ఈ సంఘటనతో అందరి మనస్సు కుదుటపడింది. విశ్వనాథుడి సన్నిధి నుంచి శ్రీమన్నారాయణుడి సన్నిధికి తిరుపతికి వెళ్ళాలని అందరూ నిర్ణయించుకున్నారు. ఒక్క మాస్టర్‌గారు తప్ప అందరూ తిరుపతికి వెళ్ళిపోయారు. ఎందుకంటే మాస్టర్‌గారి రిసెర్చి అయితే పూర్తి అయింది కానీ సర్టిఫికెట్ మీద సంతకాలు పెట్టాల్సిన ప్రొఫెసర్‌గారు సంతకము పెట్టలేదు. తన ప్రమేయము, తన దయాదాక్షిణ్యాలతో పనిలేకుండా మాస్టారు తన మేధస్సు తెలివితేటలతో రీసెర్చి పూర్తి చెయ్యటమనేది అతనికి సహించరాని విషయమైంది. అతని అహం దెబ్బతిన్నది. అంతే అలా సంతకం చెయ్యకుండా తొమ్మిది నెలలు పాటు అడ్డుపడ్డాడు. ఐతే మాస్టర్‌గారికి మనస్సులోకి ఇదేదీ వెళ్ళేదికాదు.

మహాత్ములు ఎప్పుడు కూడా దేనికి బాధపడరు, చింతించరు. వారు అననుకూల పరిస్థితులను కూడా అనుకూలంగా మార్చేసుకుంటారు. పాండవులు 13 సంవత్సరాల పాటు అరణ్యవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము చెయ్యాల్సివచ్చినప్పుడు 'అయ్యో! అరణ్యాలపాలయ్యామే, ఇలా జరిగిందేమిటి?' అంటూ చింతిస్తూ కూర్చోలేదు. ఆ అరణ్యాలలో ఉంటూనే శారీరిక దారుఢ్యాన్ని పెంచుకున్నారు. మానసిక ధైర్యాన్ని తెచ్చుకున్నారు. 14 సంవత్సరాల తరువాత రాబోయే కురుక్షేత్ర సంగ్రామానికి కావలిసిన వనరులను సమీకరించుకున్నారు. ఆయుధాలను, అస్త్రశస్త్రాలను సమీకరించుకున్నారు. అర్జునుడు శివుణ్ణి గురించి తపస్సు చేసి పాశుపతాస్త్రాన్ని సంపాదించాడు. ఇలా పంచపాండవులు ఎవరి సామర్థ్యాన్ని బట్టి వారు తమతమ శక్తి సామర్థ్యాలను కౌరవులకు ధీటుగా అరణ్యాలలో ఉంటూ కూడా సంపాదించుకున్నారు. మాస్టర్‌గారు అలానే తనకు రావల్సిన సర్టిఫికెట్ రాకపోతే చింతించలేదు. కాశీలోనే ఉన్నారు. ఆయన శక్తిని, సామార్థ్యాన్ని ఏ శక్తి అడ్డుకోలేదు. తన ఆధ్యాత్మిక సాధనను బాగా వృద్ధిచేసుకున్నారు. ఈ ఖాళీ సమయాన్ని 'జీవనదేవతా' సాధనకి వెచ్చించాలని పూర్తి దీక్షతో తీవ్రమైన రీతిలో సాధన ప్రారంభించారు.

ఒకనాడు మాస్టర్‌గారు గంగానదికి స్నానానికి వెళ్ళి స్నానము చేసి ఒడ్డున కూర్చుని జపము చేయటము ప్రారంభించారు. జపము ప్రారంభించటానికి కనులు మూసుకునే సమయములో ఆ మహనీయుని కన్నుల ముందర ధవళవస్త్రధారి, వీణాపాణియైన ఒక మునీశ్వరుని రూపము కదలాడింది. కన్నులు మిఱిమిట్లు గొలిపే ఆ మూర్తినుంచి వెలుగులు విరజిమ్మబడుతున్నాయి. చూడటానికి ఆయన సశరీరధారిగా కనబడుతున్నా దివ్యమైన కాంతిపుంజముగా తనకు సాక్షాత్కరించారు. వెంటనే మాస్టరుగారికి ఆయన ఎవరో అర్థమైపోయింది. ఆ కాంతి పుంజము ఇలా మాట్లాడింది. ఆయన పలుకులు మధుర మంజీరనిక్వణనాదాల్లా ఉన్నాయి. అలాంటి మధుర స్వరము "నేనెవరినో గుర్తించావా? నారదమహర్షిని. నీవు గత జన్మలో చేసిన సాధనకు ఫలితముగా నీకు నేను సాక్షాత్కరించాను" అన్నది.

మహాత్ముల దర్శనము కోటి జన్మల పుణ్య ఫలితముగదా! మరి వెంటనే మాస్టర్‌గారు ఎంతో వినయ విధేయతలతో లేచి నిలబడి సాష్టాంగ దండప్రమాణాలాచరించారు. ఎంత అద్భుతం! పురాణాలలో చదవటమే గానీ ఆ దివ్యమూర్తి దర్శనము కలియుగంలో ఎవ్వరికీ జరిగినట్లు దాఖలాలు లేవు. అంతటి మహనీయుడు, దేవర్షి తనకు దర్శనమీయటమనేది ఆహా! ఎంతటి

అదృష్టమోగదా! ఆనందంతో పులకించిపోతూ అలానే నమస్కారము చేస్తూ ఉండిపోయారు మాస్టారు. అంతట నారదమహర్షి ఎంతో ప్రేమతో మాస్టర్‌గారిని 'లేనాయనా! నీతో చాలా పని ఉన్నది. ఈ భూమీమ్మీద నీవు నిర్వహించాల్సిన బాధ్యతలు, పనులు చాలానే ఉన్నాయి. అఖండ గురుచరణాల వద్ద నీ జీవితము ధన్యం చేసుకుంటూ ఇంకా అనేకానేకమంది శిష్యులకు నీవు శిక్షణనీయాలి. గురుతరమైన బాధ్యతలు నీమీద చాలానే ఉన్నాయి' అని అంటుండగా మాస్టారు 'చెప్పండి స్వామీ! నేనేం చెయ్యాలి అంటూ వినయంగా అడిగారు. అప్పుడు మహర్షి 'పరమ పవిత్రమైన, మహాశక్తివంతమైన సూర్యవిద్యను నీవీ లోకములో వ్యాప్తిచెయ్యాలి. సూర్యవిద్యకు గాయత్రీమాత అధిష్ఠానదేవత. ఆ గాయత్రీశక్తిని సార్వజనీనము చేయుటకు నీవు కూడా పనిచెయ్యాలి. అనవసరమైన మూఢనమ్మకాలతో నిజమైన ఆధ్యాత్మికతకు దూరమౌతున్న ఈనాటి ప్రజానీకానికి నీవు కళ్ళు తెరిపించాలి. బ్రహ్మవిద్యను అందుబాటులోకి తీసుకురావాలి' అని అంటూ ఇంకా రాబోయే కాలములో ఏం చెయ్యాలో వివరిస్తూ, అదంతా చేసేందుకు అవసరమైన ప్రత్యేక శక్తిని ప్రసాదించేందుకై 'బగళాముఖీ' మహామంత్రాన్ని ఉపదేశించారు. ఆ మంత్రసిద్ధికి పాటించాల్సిన నియమ, నిష్ఠలను వివరిస్తూ లోకకళ్యాణము కొరకు జన్మించిన ఆ ప్రియశిష్యుణ్ణి ఆశీర్వదిస్తూనే మాయమైపోయారు నారదమహర్షి.

మహర్షి అంతర్ధానమైనాగానీ మాస్టర్‌గారు ఆ అనుభూతి నుండి తేరుకోవటానికి చాలా సమయమే పట్టింది. లోకకళ్యాణం కోసం దేవర్షి నారదులవారు అనేకమందికి ప్రేరణనిచ్చారు. అలా ప్రేరణ పొంది చరిత్రపుటలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయులు లోకోత్తర కార్యక్రమాలను చేశారనటంలో ఎలాంటి ఆక్షేపణ లేదు. ఒక వాల్మీకికి, ఒక పార్వతికి, ఒక ప్రహ్లాదుడికి, ఒక ధృవుడికి ఇలా ఎంతోమందికి దర్శనమిచ్చి వారిని మహనీయులుగా మార్చి లోకకళ్యాణ కార్యక్రమములను చేయించే దేవర్షి నారదులవారి సాక్షాత్కారము మాస్టర్‌గారికి లభించింది.

మాస్టర్‌గారు బగళాముఖీ సాధనను ప్రారంభించారు. కేవలము ద్రవాహారము అంటే మంచి నీళ్ళు మాత్రమే త్రాగుతూ కఠినాతికఠినమైన ఈ సాధనను 40 రోజుల పాటు ఏకదీక్షగా చేయటము, అడుగడుగునా దేవర్షి నారదులవారి మార్గదర్శనముతో పాటు ఆశీర్వాదాలు లభించడము వారి జీవితములో ఒక మరపురాని మహత్తర సాధనగా గుర్తుండిపోయింది. 40 రోజుల పాటు చేసిన ఈ మహత్తర సాధన వలన మంత్రసిద్ధిని పొందారు. పవిత్రమైన దివ్యత్వంతో ఆయన అంతఃకరణ

దివ్యతేజస్సుతో దేదీప్యమానమైంది. తత్ఫలితముగా వారు ఎంతమందికి తమ శక్తిని ధారపోసినా (దానము చేసినా తరగని విద్యలాగా) అది ఇనుమడిస్తూ ఒక ప్రవాహం లాగా ఆయనలో ఓతప్రోతమై ఉండిపోయింది. ఈ దివ్యమైన శక్తిని మానవమాత్రులు గుర్తించలేరు. ఒక్క యోగిజన హృదయము మాత్రమే దాని లోతులను అర్థం చేసుకొని గుర్తించగలదు. ఇదంతా దేవర్షి నారదులవారి దివ్య దర్శన ప్రభావమే!

నారదులవారు మాస్టర్‌గారికి దర్శనమిచ్చి నీవు సూర్యకిరణవిద్యను ప్రపంచానికందించు అని చెప్పిన తర్వాత వారు అంకితభావంతో ఆ మహర్షి కిచ్చిన మాటను తమ జీవితకాలం ఎంతో శ్రద్ధగా నిలబెట్టుకున్నారు. సాధారణంగా వారిచ్చే ప్రవచనాలలో ఏదో ఒక సందర్భంలో ఆ సూర్యవిజ్ఞానాన్ని అందంగా అందించేవారు. సూర్యుడు అనగానే మనకు సప్తాశ్వరథారూఢుడైన సూర్యభగవానుడు, ఆయన నుండి మనకు వచ్చే ఏడు కిరణాలు గుర్తుకువస్తాయి. ఈ బ్రహ్మాండము, మన భూగ్రహమే కాక నవగ్రహాలు ఇవన్నీ సూర్యునికి అనుసంధానమయ్యే పని చేస్తాయి. సూర్యుని 12 రూపాలుగా పిలవబడే ద్వాదశాదిత్యులు, ఆయన రూపాలకు సంబంధించిన ద్వాదశాదిత్యనామాలతో సూర్యనమస్కారములు చెయ్యటం అందరికీ తెలిసినదే. కానీ సూర్యనమస్కారాలను వినూత్నపద్ధతిలో గ్రహాలతో, కిరణములతో, రంగులతో, షట్చక్రములతో కలిపి మానవ శరీరములో న్యాసము చెయ్యటం అనే నూతన ప్రక్రియను ఆవిష్కరించి తన సహజమైన వైజ్ఞానికతను ఆధ్యాత్మికతతో సమ్మిళితం చేసి మానవజాతికి ఒక గొప్ప వరాన్ని ప్రసాదించారు. ఇలా 12 సూర్యనమస్కారాలను చెయ్యటం ద్వారా వ్యక్తి భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించటంతో పాటు పరిణామక్రమమును అతి త్వరిత గతిలో సాధించవచ్చు. మహాకాలోపాసనకు ఇది అతి సరళ విధానము.

పూజ్య గురుదేవులను కలుసుకొని వచ్చిన తరువాత ఆయన ఆలోచనలన్నీ ఒకే దిశగా ప్రవహించటము మొదలుపెట్టాయి. ఆ దిశలో మాస్టర్‌గారు యోగ్యులైన మరియు ఉన్నత సంస్కారాలు కల్గిన వ్యక్తులందర్నీ తీర్చిదిద్ది వారికి "గాయత్రీ - గురుదేవుల" పట్ల చక్కటి దిశానిర్దేశాల నిచ్చి తీర్చిదిద్ది వారిని గురుసత్తా వైపుకు నడిపించటము మొదలుపెట్టారు. లక్ష్యసాధనకు అవసరమైన అనేక ఇతర మార్గాలు అన్వేషించసాగారు.

ఇంతలో తల్లిగారైన శ్రీమతి సక్కుబాయమ్మగారికి బాగా అనారోగ్యం ఏర్పడింది. మనిషి బాగా డీలాపడిపోయింది. ఇంక జీవించగలననే నమ్మకము ఆమెలో తగ్గిపోయింది. విషయము తెలిసిన మాస్టర్‌గారు కాశీనుంచి గుంటూరుకు వచ్చేశారు. తల్లి అంటే వారికి అమితమైన ప్రేమ. ఒక సందర్భములో ఆమెను గురించి 'మా అమ్మ గొప్ప ఇంద్రాక్షీమంత్ర సాధకురాలు. కానీ ఆమె తన సాధనా సంపత్తిని గురించి ఎప్పుడూ, ఎవ్వరితోనూ చెప్పేది గాదు' అని చెప్తుండేవారు. ఒకసారి మాస్టర్‌గారికి ఒక్కరికే భోజనము వడ్డిస్తున్న సమయములో ఆయన తన తల్లి గురించి ఇలా చెప్పారు– "నేను చదువుకునే రోజుల్లో ఒక్కొక్కసారి మా అమ్మ నా ఒక్కడికే భోజనము పెట్టేది. ఇంట్లో వాళ్ళందరికోసము చేసిన పదార్థాలన్నీ నాకే వడ్డించేసేది. ఎందుకో తెలియదు. అంతలా తినేవాడిని. ఏదైనా దిష్టి తగులుతుందేమోనని నాకు వేరుగా పెడుతుండేది. చిత్రమేమిటో తెలుసా! అమ్మ భోజనము ఎప్పుడు చేసేదో నేనెప్పుడూ చూడలేదు' అని ఎంతో అభిమానంగా తల్లిగారి గురించి చెప్పేటప్పుడు వారికి తమ తల్లి పట్ల గల మమతానురాగాలు గొంతులో వెల్లివిరిసేవి.

తల్లిగారికి అనారోగ్యమనేసరికి మాస్టర్‌గారి మనస్సు కొంత కలత చెందింది. ఉద్యోగరీత్యా తిరుపతిలో కామరాజుగారికి రీడర్‌గా పోస్టింగు రాలేదు. అదే స్కేల్ మీద లెక్చరర్‌గానే పనిచేస్తుండేవారు. తిరుపతిలో ఉండగానే సక్కుబాయిగారికి కాలులో ఒక ఎముక ప్రక్కకి తొలగటము వల్ల ఆవిడ బావగారైన శ్రీఅమరేశ్వరరావు గారి పర్యవేక్షణలో జనరల్‌హాస్పిటల్లోనే ఆమెకు ఆ కాలుకు సర్జరీ చేశారు. సర్జరీ అయ్యాక ఆమెను అమరేశ్వరరావుగారి హాస్పిటల్‌కు గుంటూరుకి తీసుకువచ్చారు. ఆ సమయములో మాస్టర్‌గారు నిరంతరము తల్లి ప్రక్కనే ఉంటూ ఆమెకు సపర్యలు చేశారు. ఆమెకు అంత్యకాలము సమీపిస్తోంది. పరమగురువులతో ఆమెకు సూక్ష్మలోకపు సంబంధాలను ఏర్పరిచారు. వారందరు ఆమెకు తమ దీవెనల నందజేశారు. ఐనా శరీరము శరీరమే. శరీరబాధలను భరించలేక ఆమె చాలా దుఃఖించేవారు. దానికి పరమగురువులు 'ఆమెకు ఉన్న ప్రారబ్ధకర్మల ఫలితాల ప్రకారము ఇంకా ఎంతో అనుభవించవలసి ఉంది. ఐనా తన కుమారుని కోరిక మేరకు దానినెంతో సంక్షిప్తంగా ఆమె అనుభవిస్తోంది' అని తెలిపారు. శరీరబాధలు తీవ్రంగా ఉన్నాయి. కొడుకు మంచం మీద ప్రక్కనే కూర్చొని ఆమెను స్వాంతనపరచాలని ప్రయత్నిస్తుండగా ఆమె 'నాయనా! నాకు సమయము అయిపోతోంది. నా బెంగంతా లక్ష్మి గురించే. ఆడపిల్ల. దాని పెండ్లి, పేరంటం వంటి బాధ్యతలెన్నో చేయాలి. నా పరిస్థితి ఇలా అయిపోయింది. విశ్వనాథ్ మగపిల్లవాడు. వాడి గురించి నాకే బెంగాలేదు' అంటూ బాధపడిపోయింది.

సంవేదనాభరితమైన ఆ పరిస్థితిలో మాస్టర్‌గారు తల్లి చేతిలో చెయ్యి వేసి 'అమ్మా! నీవు బాధపడకు. ఈ క్షణమునుండే లక్ష్మికి నేను ఒక్క అన్నగా మాత్రమే కాదు. తల్లి, తండ్రిని కూడా అయి దానిని క్షేమముగా చూసుకుంటానని మాట ఇచ్చారు. ఇకపై దాని భారమంతా నాది. సరేనా! ఇంక దిగులు పడకు' అని ధైర్యము చెప్పారు.

సక్కుబాయిగారికి కూతురి గురించిన బెంగతీరిపోయింది, తృప్తిగా ఉంది. అంతేగదా! దైవం లాంటి కొడుకు కొండంత ధైర్యం చెప్తే ఇంక తల్లికేమి దిగులుంటుంది. సాధ్యమైనంతవరకు తల్లిగారి బాధ్యతను మాస్టర్‌గారే చూసుకునేవారు. ఒకసారి మాస్టర్‌గారికి హడావిడిగా బెనారస్‌కి వెళ్ళాల్సిన పనిబడింది. ఊరికి బయలుదేరే ముందు ఒక స్నేహితుడితో 'బహుశః అమ్మను చూడటము ఇదే ఆఖరిసారి కావచ్చునేమో!' అని అనుకుంటూ ముందుకుసాగారుట. ఆ మాటలు విన్నవారికి రాబోయే పరిస్థితులు అర్థమై బాధపడ్డారు.

మాస్టర్‌గారు బెనారస్ వెళ్ళిపోయాక తల్లిగారి ఆరోగ్యము కాస్త మెరుగైంది. ఇంకో 2, 3 నెలలు గుంటూరులోనే ఉండమని అందరూ ఎంత బ్రతిమాలినా వినకుండా ఆవిడ అనంతపూర్‌కు బయల్దేరి వెళ్ళారు. అక్కడ యూనివర్సిటీలో శ్రీకామరాజుగారు 'లా' లెక్చరర్‌గా అప్పటికే పనిచేస్తున్నారు. ఇక్కడికి వచ్చాక కూడా ఆవిడ తాను చేసుకునే సాధనను ఎంత ఆరోగ్యము బాగాలేకపోయినా చేసుకుంటూనే ఉండేది. మళ్ళీ ఆరోగ్య పరిస్థితి నానాటికి దిగజారిపోతోంది.

ఆరోజు అనంతపద్మనాభ చతుర్దశి. ఏటా చేసుకునే విధముగా అనంతపద్మనాభవ్రతము చేసుకోవాలని ఎంత ఓపికలేకపోయినా ఉదయాన్నే లేచి – పూజకి కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకున్నారు. శరీరము ఏమాత్రము సహకరించటము లేదు. ఐనా భార్యాభర్తలు కలిసి పూజ చేసుకున్నారు. పూజ పూర్తయ్యేసరికి ఆమె సాక్షాత్ పార్వతీదేవి వలె వెలిగిపోతున్నది. అందరికీ ప్రసాదాలు పెట్టింది. బాగా నీరసము వచ్చింది. కాసేపు పడుకుంటానంటూ వెళ్ళి మంచము మీద పడుకున్నారు. అంతే ఆవిడకు అదే ఆఖరు నిద్ర అయిపోయింది.

**'అనాయాసేన మరణం, వినా దైన్యేన జీవనం, దేహాంతే తవ సాయుజ్యం దేహిమే పార్వతీ ప్రభో'** అని గదా అంటారు పెద్దలు. అనాయాసమరణం అనేది ఎంతో పుణ్యం చేసుకున్న పుణ్యాత్ములకు మాత్రమే లభిస్తుంది. అనంతపద్మనాభస్వామివ్రతం చేసుకొని అందరికి ప్రసాదాలు పెట్టి, మంగళ కరమైన ఆ మడితో కట్టుకున్న పట్టుచీరతోనే ఆవిడ శ్రీమన్నారాయణమూర్తి సాన్నిధ్యానికి చేరుకుంది.

అసలు ఆవిడ ఎంత పుణ్యాత్మురాలో కదా! పుణ్యాత్మురాలు మాత్రమే కాదు మహాసాధకురాలు, సాధ్వీమణి కాబట్టే మహాసిద్ధపురుషుడైన మాస్టర్‌గారికి జన్మనిచ్చింది. ఆరోజు ఆ తల్లి దర్శనము చేసుకున్నవారి పుణ్యం అంతా ఇంతా కాదేమో! సాక్షాత్ ఆ అనంతపద్మనాభుడే ఆవిడ భరిస్తున్న ఆ శారీరిక కష్టము నుండి ఆమెకు విముక్తి నిచ్చి తన సాయుజ్యాన్ని ప్రసాదించి తనలో ఐక్యం చేసుకున్నాడు.

ఈనాటికీ మాస్టర్‌గారు వారి అమ్మగారి పుణ్యతిథిని ఎంతో శ్రద్ధగా చేసుకుంటారు. ఆరోజు ఉదయాన్నే లేచి శ్రద్ధగా స్నానాదికాలు చేసుకుని తల్లికి తర్పణాదుల నిచ్చి లలితాసహస్రనామ పారాయణాదులు చేసి సువాసినులకు పసుపు, కుంకుమ, వస్త్రాలను ఇచ్చి ఎంతో శ్రద్ధగా అందరికీ భోజనాలు పెట్టించేవారు.

మాస్టర్‌గారి తమ్ముడు విశ్వనాథ్–మరదలు విజయల ఏకైక పుత్రిక సుకృత పెండ్లి విషయములో మాస్టర్‌గారే దగ్గరుండి అన్నీ చూసుకుంటూ సుకృతను పెళ్ళికూతురిని చేసిన రోజున తల్లిగారి పటానికి పూలమాల వేయించి, ఆమెకు పసుపు, కుంకుమలు ఇప్పించి నమస్కరించుకుని ఆమె ఆశీర్వాదాలు తీసుకుని తదుపరి కార్యక్రమాలను దగ్గరుండి చేయించారు. ఆరోజు రాత్రి వాళ్ళమ్మగార్ని గురించి ఎన్నో తీపి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. అంతటి మహనీయుడిని తనయునిగా పొందటానికి ఆ తల్లి ఎంత తపస్సు చేసిందో ఎవరికెరుక!!

అలాంటి ఆర్ద్రతాహృదయము కల్గిన మాస్టర్‌గారు బెనారస్‌లో ఉండగానే తల్లిగారి మరణవార్త విన్నారు. చలించలేదు. కంటనీరు పెట్టలేదు. **'సంపతౌచ, విపతౌచ మహతామేకరూపతాం'** అని భవభూతిమహర్షి ఉత్తరరామచరిత్రలో చెప్తాడు. మహాత్ములు సంపదలు, సౌఖ్యాలు వచ్చినా – విపత్తులు, ఆపదలు వచ్చినా ఏమాత్రము చలించరు అని దాని అర్థం. అలాగే మాస్టార్‌గారు ఎక్కడా, దేనికీ కూడా చలించలేదు.

కానీ అమ్మ చెప్పిన బాధ్యతలను మర్చిపోలేదు. యోగము అంటే బాధ్యతల్ని వదిలి పారిపోవటము కాదు. ఉన్న బాధ్యతలను, కర్మలను పరిపూర్ణనిష్ఠతో ఆచరించటమనే నిర్వచనాన్ని మాస్టర్‌గారు అక్షరాలా ఆచరించి చూపించారు. అమ్మకిచ్చిన మాట ప్రకారము లక్ష్మిని కంటికి రెప్పలా చూసుకునేవారు. పెళ్ళయ్యాక పరాయింటికి వెళ్ళాల్సిన పిల్ల, ఆ ఇంటి బరువు బాధ్యతల్ని స్వీకరించాల్సిన పిల్ల, అందరికీ తలలో నాలుకలాగా ఉంటూ ఆ ఇంటికి వన్నె తేవాల్సిన చెల్లెలికి

విద్యాబుద్ధులతో పాటు బరువు బాధ్యతల విషయంలో కూడా చక్కటి శిక్షణ నిచ్చేవారు. సమయం దొరికనప్పుడల్లా తల్లిలాగా దగ్గర కూర్చొని అనేక విషయాలను నేర్పిస్తుండేవారు. అంతే కాకుండా ఒక స్నేహితుడిలాగా అఖండజ్యోతిపత్రికలో గురుదేవులిస్తున్న ఏ సాధననైనా తాను మొదలు పెట్టబోయేముందు చెల్లెలికి చెప్పేవారు.

తల్లి పోయేనాటికి విశ్వనాథప్రసాద్ అందరికంటే చిన్నవాడు. చెల్లితో పాటు తమ్ముడిని కూడా ఎంతో ప్రేమతో పెంచి, మంచి విద్యాబుద్ధులను నేర్పేవారు. విశ్వనాథ్ బాగా చురుగ్గా ఉండేవాడనీ, చదువు విషయంలో అందరికంటే ఎంతో ముందుండేవాడని, క్రికెట్ ఆటంటే ప్రాణమనీ, అర్ధరాత్రి ట్రిమ్‌గా తయారై టి.వి ముందు కూర్చుని శ్రద్ధగా ఆట చూచేవాడనీ, తనతో పాటు అన్న కూడా కూర్చుంటే ఇంకా ఆనందించేవాడని చెప్తుండేవారు.

## అధ్యాయం-3

# నడచివస్తున్న విజ్ఞాన సర్వస్వం

మాస్టర్‌గారి దివ్యత్వాన్ని గురించి మరొకరు చెప్పాలా? అందరిపట్ల వారు చూపించే ప్రేమాభిమానాలను ఎవరు మర్చిపోగలరు. చంద్రుని చల్లదనం ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో మన మాస్టర్‌గారి మధురమైన నవ్వు అంత ఆహ్లాదకరంగా ఆనందాన్ని వెదజల్లుతూ ఉంటుంది. అందర్నీ ఆకర్షించేది, సమ్మోహనపరచేది ఆ చిఱునవ్వే.

మానవజీవితం ఎంతో అమూల్యమైనది. కోట్లాది జన్మల తపోసాధనతో ఈ దివ్యమైన మానవశరీరాన్ని పొందాము. అందునా ఎంతోమంది సాధువులు, సంత్‌లు, మహాత్ములు ఆవిర్భవించిన ఈ యుగసంధి వేళలో జన్మించడం, అంతేకాక వారి సాన్నిధ్యమనే మహానుభూతిని పొందడమనేది మాటలతో వర్ణించలేని మహద్భాగ్యంగా, మహాప్రసాదంగా మనం అనుభూతి చెందాలి. అలాంటి అమూల్యమైన ఈ జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఒక మహత్తరమైన కార్యనిర్వహణార్థమే భగవంతుడు మనల్ని ఈ భూమి మీదకు పంపించాడు. ఈ యుగసంధి కాలమనేది పృథ్వీగ్రహ చరిత్రలోనే ఒక మహత్తరమైన మలుపు. అలాంటి ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం కచ్చితంగా అది మానవోచితధర్మమనే చెప్పాలి.

సమయాన్ని భగవంతునితో పోలుస్తారు. గీతలో భగవంతుడు కాలాన్ని గురించి చెప్తూ 'కాలోస్మిలోకక్షయకృత్ప్రవృద్ధో' (అంటే కాలాన్ని నేనే) అంటాడు. భగవత్స్వరూపమైన ఆ కాలాన్ని మనం ఎంతగా సద్వినియోగం చేసుకోవాలనేది మాస్టర్‌గారిని చూసి నేర్చుకోవాలి. కాశీలో ఉండగానే మాస్టర్‌గారు అనేకరకాల దీక్షలను స్వీకరించడం, వాటిలో పరిపూర్ణతను సాధించడం జరిగిందని ముందు అధ్యాయాలలో తెలుసుకున్నాము. పరమపూజ్య గురుదేవుల దర్శనంతో 'జీవితలక్ష్యం' బోధపడింది. భౌతికవిద్యకు సంబంధించిన విషయపరిజ్ఞానాన్ని ఆర్జించడంతో పాటు మిగిలిన సమయాన్ని ఒక్క క్షణమైనా వృథాపోనీయకుండా గ్రంథాలయానికి వెళ్ళి అనేక రకాల సాహిత్యాలను అధ్యయనం చేస్తుండేవారు.

మన ఆత్మలో ఆత్మగా, మనస్సులో మనస్సుగా, ప్రేమకు ప్రతిరూపంగా, ఆదర్శవంతమైన, అనుకరణీయమైన వ్యక్తిత్వంతో సమస్త జ్ఞానవిజ్ఞానాలకు ప్రతిరూపంగా, నడచివస్తున్న సరస్వతీదేవి అపర పురుషావతారంగా విరాజిల్లే మహాపురుషులుగా మనమధ్య తిరుగాడిన మన శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు అటు ఆధ్యాత్మిక విషయాలను చెప్తున్నా, ఇటు భౌతిక విషయాలను గురించి వివరణనిస్తున్నా వినేవారికి అది ఒక అద్భుతమైన మధురమైన సామగానంలా ఉండి అది కేవలం మనుషులే కాదు పశుపక్ష్యాదులను సైతం ఆలకించి ఆనందంతో మైమరచిపోయేలా చేసేది. ఎవరు ఏ విషయంలో నైనా తమకు వచ్చిన అనుమానాలు తీర్చమని అడిగినా ఎంతో ఓపిగ్గా నవ్వుతూ చిటికలో ఆ సమస్యలకు సమాధానాలు చెప్పేవారు. మాస్టర్‌గారు అటు ఆధ్యాత్మిక గ్రంథాలనే కాదు, సైన్సుకు సంబంధించిన విజ్ఞాన విషయములు, జనరల్ నాలెడ్జికి సంబంధించిన గ్రంథాలను కూడా ఆమూలాగ్రం పఠించేవారు అనడం కన్నా మథించారు అంటే బావుంటుంది.

గురుదేవుల సాహిత్యం, మన ఆర్షగ్రంథాలతో పాటుగా థియోసఫీకి సంబంధించి మాడమ్ బ్లావట్స్కీ వ్రాసిన సీక్రెట్ డాక్ట్రిన్ వంటి ఎన్నో ఉద్గ్రంథాలు, అరవిందో శ్రీమాతల రచనలు, లాహిరీ మహాశయులు, యోగానందుల సాహిత్యము మొదలు శ్రీరామకృష్ణపరమహంస మొదలైన మహనీయులందరి గ్రంథాలను ఆమూలాగ్రంగా అధ్యయనం చేయటమేకాక; ఆ విషయాలను తన స్వంతం చేసుకుని, అందులో వారందించిన ప్రామాణిక సూత్రాలను కచ్చితంగా ఆచరించేవారు. ఆయనకు తెలియని గురువు కానీ గురుచరిత్ర కానీ లేదనటం అతిశయోక్తి కానే కాదు. కేవలం ఆధ్యాత్మిక గ్రంథాలేకాక హిందీ, తెలుగు, ఇంగ్లీషు భాషలలో ప్రముఖ రచయితలు వ్రాసిన నవలలు

కూడా చదివేశారు. మాస్టర్‌గారు గుంటూరు వచ్చాక కాలేజీలో పనిచేస్తూ కూడా సమయం దొరికినప్పుడల్లా పుస్తకాలు చదువుతుండేవారు. పూజ్య గురుదేవులు ఎప్పుడూ వ్రాస్తూనే కనిపించే వారు. అలాగే మాస్టర్‌గారు కూడా ఎప్పుడు చూసినా బోర్లా పడుకుని కానీ, కూర్చుని కానీ చదువుతూనే కనిపించేవారు.

## మాస్టర్‌గారు - దివ్యజ్ఞానసమాజం

ఇక్కడ దివ్యజ్ఞానసమాజమునకు (Theosophical Society) – మాస్టారికి గల సంబంధం గురించి కాస్త చెప్పాలి. పూజ్యులైన మాస్టారు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో యమ్.యస్.సి. అయిపోయాక పిహెచ్.డి చేస్తున్న రోజులవి. చదువుకునే రోజుల నుండే ఆయన థియోసఫీలో సభ్యుడిగా ఉండేవారు. ఇక్కడ మనం థియోసఫీ గురించి కొంచెం తెలుసుకోవాలి. థియోసఫీ అనేది విశ్వవ్యాప్తంగా ఉన్న ఒక సంస్థ. ఈ సంస్థ చాలా పురాతనమైనది. శ్రీకృష్ణుడు, శిర్డీసాయి, పరమపూజ్య గురుదేవులు శ్రీరామశర్మఆచార్యగారితో సహా నెహ్రూ, రాజాజీ వంటి మహనీయు లెందరో ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారు. ప్రపంచంలో ఉన్న థియోసఫీ లాడ్జిలన్నింటికీ మద్రాసు కేంద్రమని, భారతదేశానికి సంబంధించిన భాగానికి కాశీ కేంద్రమని మాస్టర్‌గారు చెప్పేవారు. డిసెంబర్‌లో జరిగే "యాన్యువల్ కన్వెన్షన్స్" మద్రాసులో జరుగుతుంటాయి. అప్పుడప్పుడూ కాశీలో కూడా జరుగుతుంటాయి. కాశీలో ఉన్న థియోసాఫికల్ సొసైటీ చాలా గొప్ప కేంద్రం. అక్కడ థియోసఫీకి సంబంధించి మహనీయులు వ్రాసిన ప్రఖ్యాత గ్రంథాలెన్నో ఉంటాయి.

చదువుకునే రోజుల్లో మన మాస్టర్‌గారు ఈ సంస్థలో సభ్యులుగా ఉండేవారు. మాస్టర్‌గారు ఈ సంస్థలో సభ్యులుగా ఎలా చేరారో మనం తెలుసుకోవాలి. బెనారస్ యూనివర్సిటీలోనే థియోసఫీ సభ్యులు ప్రొఫెసర్ ఒకాయన ఉండేవారు. మాస్టర్‌గారికి థియోసఫీకి సంబంధించిన కొన్ని పుస్తకాలను ఇచ్చారు. ఆయన వాటిని చదివి థియోసాఫికల్ సొసైటీలో చేరాలని సంకల్పించారు. కానీ సొసైటీలో సభ్యత్వం సాధించటం అంత తేలిక కాదు. అప్పుడు మాస్టారు 'హౌ టు కాంటాక్ట్ ఏంజల్స్' అను ఒక వ్యాసాన్ని రాసి అప్పటి థియోసాఫికల్ సొసైటి ప్రెసిడెంట్ జఫ్ఫరీ హడ్సన్‌గారికి న్యూజిలాండ్‌కు పోస్టులో పంపారు. అది చదివిన జఫ్ఫరీ హడ్సన్‌గారు టెలిగ్రాం ద్వారా మాస్టర్‌గారిని వెంటనే థియోసాఫికల్ సొసైటీలో చేర్చుకొని వారికి దీక్షని ఇమ్మని సొసైటీవారిని ఆజ్ఞాపించారు.

ఆయనకు పుస్తకాలంటే ప్రాణంకదా! దాంతో ఖాళీ దొరికినప్పుడల్లా గ్రంథాలయానికి వెళ్ళి థియోసఫీకి సంబంధించిన చిన్న, పెద్ద పుస్తకాలను చదువుతుండేవారు. ఒకరోజున మన మాస్టర్ గారు లైబ్రరీలో కూర్చుని పుస్తకాలు చదువుతున్నారు. మాస్టర్‌గారికి చిన్నతనం నుండి ఉన్న ఒక అలవాటు ఏమిటంటే ఏదైనా ఒక దానిని పట్టుకుంటే ఇంక దాని అంతు కనుక్కునేదాకా వదిలేవారు కాదు. అలానే థియోసఫీని పట్టుకున్నారు. ఇంక అదే పనిగా ఆ సొసైటీకి సంబంధించిన గ్రంథాలన్నింటినీ ఆమూలాగ్రం చదవటం మొదలుపెట్టారు. ఒకసారి ఆ ప్రొఫెసర్‌గారు కూడా అదే లైబ్రరీకి వచ్చారు. మాస్టర్‌గారు చదువుకుంటూ కూర్చున్నారు. 'ఏం చదువుతున్నావ్ రామకృష్ణ' అని పలకరించారు. తను చదువుతున్న పుస్తకం పేరు చెప్పారు మాస్టారు. వెంటనే ఆయన మరికొన్ని పుస్తకాల పేర్లు చెప్పి వాటిలో ఉన్న విశేషాలు చెప్తూ అవి చదవమని సలహా ఇచ్చారు. వాటి పరిచయం కూడా చెప్పారు.

కానీ మాస్టర్‌గారు అప్పటికే అవన్నీ చదివేశానని చెప్పటంతో ఆ ప్రొఫెసర్‌గారికి నోట మాట రాలేదు. అప్పుడాయనకు ఈ కుర్రాడు సామాన్యుడు కాదు అని అర్థమైంది. ఇతను ఎంతటి జ్ఞానాన్ని అయినా తన స్వంతం చేసుకోగలడని ఆలోచించుకొని మాస్టారితో 'నీవు థియోసఫీలోకి పూర్తిగా రా! నిన్ను అమెరికా పంపించే ఏర్పాటు చేస్తాను. ప్రపంచమంతటా థియోసఫీని విస్తరింపచేయి!' అని రకరకాలుగా చెప్పి చూశారు. అంటే ఆ ప్రొఫెసర్‌గారికి అతి సాధారణముగా కనిపిస్తున్న ఆ కుర్రాడిలో ఎంత గొప్ప శక్తి సామర్థ్యాలు, అసాధారణ ప్రజ్ఞాపాటవాలు ఉన్నాయో అర్థమైంది. అందుకే ఆయన థియోసఫీని విస్తరింప చేసే గొప్ప బాధ్యతను ఒకేసారి ఈ కుర్రాడికి అప్పగించటానికి సిద్ధపడ్డారు. నిజానికి ఆ ప్రొఫెసర్‌గారిచ్చిన అవకాశం సామాన్యమైనది కాదు. ఆరోజుల్లో సామాన్య మానవులకు విదేశాలకు వెళ్ళే అవకాశాలు చాలా అరుదుగా లభించేవి. అలాంటి పరిస్థితులలో అద్భుతమైన ఒక విశాలమైన సంస్థలో ప్రాణవంతమైన పని చేయగలిగే మహదవకాశం రావడమనేది మామూలు విషయం కాదు. అందులోకి వెళ్ళి పనిచేస్తే కనుక అఖండమైన పేరు ప్రతిష్ఠలతో పాటు ఎన్నో భౌతిక సుఖసౌకర్యాలు పాదాక్రాంతమౌతాయి. మహనీయులైన మాస్టర్‌గారు వాటన్నింటినీ తృణప్రాయముగా వదిలివేశారు. ఆనాడు వారిలో రగులుతున్న ఆలోచనలు వేరు, అన్వేషణ వేరు. అటువంటి ఉన్నత ఆదర్శాలను సాధించాలనుకునే వ్యక్తికి ఈ అవకాశం తృణప్రాయమే గదా!

ఐతే వారు థియోసఫీని వదిలిపెట్టలేదు. ఆ సాహిత్యాన్నీ వదిలిపెట్టలేదు. అందులో ఉన్న ఉన్నత ఆదర్శాలను అన్వేషించడమూ ఆపలేదు. ఆ సంస్థకు వారి ద్వారా జరగాల్సిన పని జరుగుతూనే ఉంది. వారు విదేశాలకు వెళ్ళకపోవడం మన అదృష్టం. వారు అలా వెళ్ళిపోయి వుంటే మనకు **అఖండ గురుసత్తాతో** పరిచయం లభించి వుండేదిగాదు. మాస్టారి వద్ద ఇంత జ్ఞానాన్ని పొందివుండేవాళ్ళమూ కాదు. అలా మనం అదృష్టవంతులం. ఏ సంస్థలో చేరినా ఆ సంస్థకు సంబంధించిన గ్రంథాలను అధ్యయనం చేయడం మాస్టర్‌గారికి అలవాటు.

అలాగే ఇక్కడ కూడా మేడం బ్లావెట్స్కీ వ్రాసిన The Voice of Silence చదివారు. తర్వాత "సీక్రెట్ డాక్ట్రిన్" చదవటం మొదలుపెట్టారు. అది వారికి అనుకున్నంత స్థాయిలో అర్థం కావట్లేదు. చాలా కాలం తరువాత వారు గుంటూరులో ఉన్న రోజుల్లో ఒకరోజు ఉదయం మాస్టర్‌గారు ఏదో పనిమీద గుంటూరులో ఉన్న శ్రీకృష్ణ దివ్యజ్ఞాన సమాజానికి వెళ్ళారు. అక్కడ E.K.గారు అంటే ఎక్కిరాల కృష్ణమాచార్యులుగారు వచ్చివున్నారు. మహాత్ములు ఎక్కడ ఉన్నా వారి సేవా కార్యక్రమాలు వారు చేస్తూనేవుంటారు కదా! అలాగే E.K. గారు కూడా అక్కడున్న కొంతమందికి హోమియో మందులు ఇస్తున్నారుట. వారిని చూస్తూనే మాస్టారు ఎంతో వినయ, విధేయతలతో నమస్కారం చేశారుట. E.K గారు కూడా R.K. గారిని చూసి చిఱునవ్వు నవ్వారుట. మాస్టర్‌గారికి ఎందుకు అడగాలనిపించిందో తెలియదు గానీ 'మాస్టారూ! మేడం బ్లావెట్స్కీ వ్రాసిన"సీక్రెట్ డాక్ట్రిన్" అర్థం కావటం లేదు' అన్నారుట. అందుకు E.K గారు నవ్వుతూ "అవునా! ఇవాళ నుంచీ చదువు అర్థమవుతుంది" అన్నారు. మాస్టర్‌గారు తక్షణమే అత్యుత్సాహంతో ఇంటికి వచ్చి "సీక్రెట్ డాక్ట్రిన్" చదవటం ప్రారంభించారు. అలా మొదలుపెట్టిన మాస్టర్‌గారు ఆపకుండా 72 గంటలు ఏకబిగిన ఆ పుస్తకాలను చదవటం పూర్తిచేశారు. ఇంతకు ముందు చదివినప్పుడు అర్థంకాని అనేక విషయాలు, అంతరార్థములు, లోతైన ఆధ్యాత్మిక రహస్యాలు దృశ్యరూపకంగా కనిపించాయి. చెప్పలేని ఆనందం కలిగింది. మనస్సులోనే మాస్టారు E.K మాస్టర్‌గారికి అనేక పర్యాయాలు ధన్యవాదాలు తెలుపుకున్నారు. మరి కృతజ్ఞత చూపించటం కనీస కర్తవ్యం కదా! 1988 తరువాత గుంటూరు థియోసాఫికల్ లాడ్జిలో మాస్టర్‌గారు సీక్రెట్ డాక్రిన్ మీద అనేక ఉపన్యాసాలు కూడా ఇచ్చారు. ముఖ్యంగా సీక్రెట్ డాక్ట్రిన్ మీద ఇచ్చిన ఉపన్యాసాలు అద్భుతంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. అందులోని మొదటి ఏడు Stanzas వివరణ చెప్పారు. (దానిని గుప్తవిద్య అనే పేరుతో ముద్రించి 3-3-1996 న అడ్డరోడ్డులో జరిగిన 2400 కుండీల యజ్ఞంలో విడుదల చేయటం జరిగింది.

ఎంతో అద్భుతమైన వివరణను అందులో చూడవచ్చు). అలాగే The Voice of Silence మీద కూడా అద్భుతమైన ప్రవచనాలు ఇవ్వడం జరిగింది.

ఇలా మాస్టర్‌గారి జ్ఞానాన్ని గురించి ఎంత చెప్పినా తనివితీరదు. మాస్టర్‌గారి ప్రవచనాలను వింటున్నప్పుడు ఒక దివ్యమైన భావమయ జగత్తులోకి వెళ్ళిపోతాము. ఆ భావనలో లీనమైన ఆ దివ్యత్వాన్ని భాషలో బంధించాలనే ప్రయత్నంలో ఎవరు ఎంత వర్ణించినా, వ్రాసినా దానికి సంపూర్ణతను చేకూర్చలేరేమోననిపిస్తుంది. మాస్టర్‌గారిని నడిచే 'ఎన్‌సైక్లోపీడియాగా' అందరూ అభివర్ణిస్తుంటారు.

## సద్గురు కృప

సాధారణంగా అందరి జీవితాల్లోనూ ఒకవిధమైన వెంపర్లాట కనిపిస్తుంది. జీవితము యొక్క అసలైన సందేశాన్ని ఒక్క జ్ఞానులు మాత్రమే అర్థం చేసుకోగల్గుతారు. ఈ జ్ఞానమే వారిని అంతర్ముఖులను చేస్తుంది. ఈ జ్ఞానమే వారిని అంతరాత్మను వెదికేందుకు తత్పరులను చేస్తుంది. అప్పుడు సమస్యలనేవి ఏవీ ఈ ప్రపంచంలో లేవనీ అన్నీ మన మనస్సుల్లోనే ఉన్నాయనీ అర్థమవుతుంది. మన జీవిత లక్ష్యం ఏమిటో కూడా మనకి సరిగ్గా తెలియదు. అందుకే గోస్వామి తులసీదాస్ "గురుబినా హోహి న జ్ఞాన్" అంటే 'గురువు లేకుండా జ్ఞానం లేదు' అని అన్నారు.

సాధారణంగా ఉన్న ఒక వితండవాదమేమిటంటే– 'గురువు అసలు అవసరం లేదు. నిజమైన గురువు మనలోనే ఉన్నాడు' అని చాలామంది తర్కిస్తూ ఉంటారు. సిద్ధాంతపరంగా అది నిజమే కానీ మనలో ఎంతమంది అంతఃకరణలో నెలకొనివున్న గురువు చెప్తున్న మాటలు విని అర్థం చేసుకోగల్గుతాము? అక్కడ్నుంచీ వచ్చిన నిర్దేశాలను ఎంత వరకు అర్థం చేసుకుని ఆచరించగలుగుతాము? మనిషి యొక్క మానసిక ఆలోచనలు పరిమితమైనవి, స్థూలమైనవి అన్న విషయాన్ని గమనించాలి. మనస్సనేది వ్యాకులపరచే వాసనలు, కోరికలు, మహత్వాకాంక్షల సంగమం. ఈర్ష్య, ద్వేషం, కోపాలనెందుకు అనుభవిస్తామో కూడా మనకు తెలియదు. కాబట్టి ఈ కోలాహలాన్ని ఎంత అణచివేద్దామని చూస్తామో అది అంతగా ప్రతిధ్వనిస్తూవుంటుంది.

ఈ ఆంతరిక అశాంతిని ఆపటానికే మనకు గురువు అవసరం. మనస్సు, శరీరం, అంతరాత్మలను నియంత్రించే విధానాలను తెలిసిన నిపుణుడు 'గురువు'. ఆత్మవికాసాన్ని అడ్డుకునే నకారాత్మక ప్రవృత్తులను మార్చుకోవడానికి ప్రయాణించాల్సిన మార్గాన్ని వారే చూపించగలరు.

## ప్రజ్వలించే జ్ఞానకాగడాయే గురువు

గురువు భౌతిక శరీరధారి అయినప్పటికీ వారి ఆత్మ అజ్ఞాతలోకాలలో విహరిస్తూంటుంది. వారు తమకోసం కాక మనకోసం ఈ భూమితో అనుబంధాన్ని ఏర్పరుచుకుంటారు. వారిది స్వార్థరహిత ప్రయోజనం. వారికి కోరికలు, ఆకాంక్షలనేవీ ఏవీ ఉండవు. గురువు అంటే పూర్ణత్వం, పవిత్రత, శాంతి, ప్రేమ, జ్ఞానాల స్వరూపం. **గురువు సాకారుడు, నిరాకారుడు కూడా! దేహాన్ని ధరించినప్పటికీ దేహాతీతుడు! దేహత్యాగం చేసినా వారి అస్తిత్వం సమసిపోదు. పైగా అది మరింత తీక్షణమౌతుంది. వారిని పొందటానికిగానీ, కలవటానికిగాని కావలిసినది తీవ్రమైన ఆర్తితో కూడిన పిలుపు. గురువులు శరీరం త్యజించాక ఇంకా సర్వవ్యాపకులౌతారు.**

మనం జీవితంలో ఎటువంటి భూమికకు చెందినా సరే పేదవారైనా, ధనవంతులైనా, సుఖంగా ఉన్నా దుఃఖంగా ఉన్నా మనలో ప్రతీ ఒక్కరి కోసం ఇవ్వటానికి గురువుగారి దగ్గర ఏదో ఒకటి ఉంటుందనేది సత్యం.

**ఆగని ప్రకృతి చక్రం:** ప్రకృతిలో ఏది నాటితే అదే వస్తుంది తప్ప ఇంకోటి ఎలా వస్తుంది? 'ఏవం ప్రవర్తితం చక్రం' అనగా ఈ ప్రకృతి యొక్క చక్రం ఆగదు. మహాకాలచక్రం అలా సాగిపోతూనే ఉంటుంది. అందులోని భాగంగానే ఆత్మతత్త్వ విస్మృతి అనే ధర్మగ్లాని జరుగుతూవుంటుంది. అలా జరిగినప్పుడల్లా ధర్మసంస్థాపన చేయటానికి, మార్గదర్శకత్వానికి పరమగురువులు ఈ భూమి మీద అవతరిస్తూంటారు. గురువు అనే పదానికి ఋగ్వేదంలోని మొదటి మండలం 158వ సూక్తంలో చెప్పినట్లుగా 'పరమే వ్యోమన్' అనీ, పతంజలి యోగసూత్రాలలో చెప్పినట్లుగా 'సః పూర్వేషామపి గురుః కాలేన అనవచ్ఛేదాత్' అంటే గురువు కాలాతీతుడు అనగా మనకన్నా పూర్వము కూడా గురువు ఉన్నాడు అని చెప్పబడింది. గురువు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వసమర్థుడు, ఆత్మజ్ఞాన ప్రవర్తకుడు కనుక ఆయన తన సమర్థ స్పర్శతో శిష్యుల జీవితాలను మార్చివేసి తనంతటివాళ్ళను చేస్తాడు. అది ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రక్రియ.

## ప్రాణ ప్రత్యావర్తన శిబిరం

మహాకాలస్వరూపులైన పూజ్యగురుదేవులు వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్యగారు ప్రజ్ఞావంతులైన కొంతమంది శిష్యులకు తమ ఆధ్యాత్మిక వారసత్వాన్ని

ప్రసాదించటానికి ఒక విశిష్టమైన, ప్రాణవంతమైన 'ప్రాణప్రత్యావర్తన' సాధనా శిబిరాన్ని గాయత్రీతీర్థ్, శాంతికుంజ్‌లో 1974 వ సంవత్సరంలో ప్రారంభించారు. మాస్టారితో పాటుగా సుమారుగా మరో 60 మంది సాధకులు 1975 వ సంవత్సరంలో ఈ ప్రాణప్రత్యావర్తన శిబిరంలో పాల్గొన్నారని మాస్టర్‌గారు చెప్పారు.

**అసలు ప్రాణప్రత్యావర్తన అంటే ఏమిటి?ః ఆధ్యాత్మికసాధనలన్నింటిలోను ప్రాణప్రత్యావర్తన ప్రక్రియ అతి విశిష్టమైనది. ఈ సాధన ద్వారా సాధకుని అంతరంగములో గురువే తమను తాము బీజరూపంలో ప్రతిష్ఠించుకుంటారు. సాధకుని యొక్క సాధనా తీవ్రతను బట్టి ఏడు సంవత్సరముల నుండి ఏడు జన్మల మధ్య కాలంలో సాధకుడు గురువు యొక్క ఫొటోకాపీగా మారుతాడు. అంటే గురువు స్వయంగా శిష్యులలో అవతరిస్తాడు.**

ఒక నెలరోజులపాటు ఈ శిబిరం జరుగుతుంది. విశిష్టమైన సాధనలు, ఆధ్యాత్మిక ప్రక్రియలు, ధ్యానవిధానాలు ప్రత్యేకంగా ఈ సాధకులకు నేర్పబడతాయి. వీరికి ఆహారం కూడా మాతాజీయే ప్రత్యేకంగా వండుతారు. పవిత్రమైన ఆ మాతృమూర్తి అమృతహస్తాలతో వండిన భోజనం సాధకుల మనసులను పవిత్రం చేయటమే కాక, ఉన్నతమైన ఆధ్యాత్మిక శిఖరాల నందుకోగలిగేంతటి ప్రజ్ఞను వారిలో మేల్కొలుపుతుంది. ఇది చాలా ముఖ్యమైన, ప్రముఖమైన శిక్షణ నిచ్చే సాధనాశిబిరం. ఎంతో క్రమశిక్షణతో కాలనిర్ణయపట్టిక ప్రకారం జరిగే ఈ సాధనాశిబిరంలో ప్రతిరోజూ ఒక్కొక్క సాధకుడు ఒక గంటసేపు పూజ్యగురుదేవుల సమక్షంలో కూర్చుంటారు. 'మౌన వ్యాఖ్యాప్రకటిత పరబ్రహ్మతత్త్వం' అని దక్షిణామూర్తి శ్లోకంలో వర్ణించినట్లుగా శిష్యులు మౌనంగా గురుదేవుల సమక్షంలో కూర్చుంటారు. అంతే వాళ్ళ అంతఃకరణలో ఏది ప్రవేశపెట్టాలో దానిని అతి సూక్ష్మంగా, శాంతంగా గురుదేవులు వాళ్ళకి అందించేవారు. ఇది వినటానికి చిత్రంగానే ఉంటుంది. కానీ నిజం ఇదే!!

**మాస్టర్‌గారు కూడా ఆ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ శిబిరం యొక్క విశిష్టతను గురించి మాస్టర్‌గారు చెప్పిన మాటలను యథాతథంగ ఇక్కడ పొందుపరచుచున్నాము – ప్రాణప్రత్యావర్తన సాధన అని గురుదేవులు మమ్మల్ని ఒకసారి హరిద్వార్‌కు పిలిచారు. మూడురోజులు కేవలం తులసినీళ్ళ మీదనే ఉంచారు. నోరు మూసుకుని (మౌనంగా)కూర్చోండని చెప్పారు. నా ఆత్మశక్తి మీలోకి ప్రవేశపెడుతున్నానని చెప్పారు. ఇదే ప్రాణప్రత్యావర్తన ప్రక్రియ. దాని తర్వాత ఆయన**

**ఏమన్నారంటే 'ఇప్పుడు నేను ఏమి చేశానో మీకు తెలియదు. ఒక 30 ఏళ్ళ తరువాత తెలుస్తుంది' అన్నారు.**

**1975 కృష్ణాష్టమికి ఆ మూడు రోజుల విశేషమైన సాధన పూర్తి అయింది. 2005 వ సంవత్సరం నాటికి 30 ఏళ్ళు పూర్తి అయ్యాయి. సరిగ్గా అదే శ్రీకృష్ణాష్టమినాడు హైదరాబాదులో మిషన్ ఆర్.కె. సంస్థను ఆవిష్కరించారు. ఇప్పుడు నాకు గాయత్రీమహావిజ్ఞానం చెప్పే సామర్థ్యం వచ్చింది. శక్తి వచ్చింది. అనుభవం వచ్చింది. ఆయన ఆనాడు ప్రాణప్రత్యావర్తన బీజాలు వేశారు కనుక మా గురువుగారి బీజాలు పలుకుతున్నాయి. మరి మీకు కూడా పలుకుతాయి. నాకే కాదు మీకు కూడా గురుదేవులు ఆ శక్తిని ఇచ్చారు. సజలశ్రద్ధ, ప్రఖరప్రజ్ఞ ఫోటో ద్వారా మీకు వస్తు రూపంలో గురుదేవులు ఇచ్చిన ఫ్రేమ్ అది. సజలశ్రద్ధ, ప్రఖరప్రజ్ఞ ఎక్కడ వుంటుందో అక్కడ మీకు గురుదేవుల దర్శనం అవుతుంది అని ప్రత్యేకంగా ఒక సాధనాశిబిరంలో చెప్పారు.**

ఆ సాధనలో గురుదేవులు వేసిన బీజాలు తనలో పెరిగి పెద్దవౌతున్నాయని మాస్టర్‌గారు గుర్తించటం జరిగింది. ఒకరోజున మాస్టర్‌గారు గురుదేవుల దగ్గరగా కూర్చున్నారట. గురువుగారు మంచం మీద కూర్చుని ఏదో ఒక విషయం గురించి చెప్తూ చెప్తూ ఉన్నట్లుండి చెయ్యి బాగా పైకి ఎత్తి మాస్టర్‌గారి వీపు మీద గట్టిగా చరిచారట. 'ఏమో నాలో ఉన్న ఏ నకారాత్మక కర్మను తరిమివేశారో కానీ ఆ దెబ్బ తాలూకు నొప్పి ఇప్పటికీ నాకుంది' అనేవారు. సరిగ్గా స్వాధిష్ఠానచక్రం దగ్గరే ఆ నొప్పి. అందుకే అప్పుడప్పుడు నొప్పిగా అనిపించినప్పుడు నడుం నొక్కించుకునేవారు.

ఒకసారి ఈ సాధనాశిబిరం వల్ల గురుదేవులకి బాగా దగ్గరయ్యే భాగ్యం **మాస్టర్‌గా**రికి కల్గింది. అటువంటి సమయంలో అప్పుడప్పుడు తన కుటుంబ పరిస్థితులు, కుటుంబసభ్యుల వివరాలు చెప్పటం జరుగుతుండేది. అలా అలా తండ్రి, తమ్ముడు, చెల్లెలికి కూడా గురుదేవులతో సంబంధాన్ని ఏర్పరిచారు. లక్ష్మి అప్పుడప్పుడూ గురుదేవులకు ఇంటి విషయాలను గురించి ఉత్తరాలు వ్రాస్తూండేది. గురుదేవులు వాటికి ప్రత్యుత్తరాలని ఇస్తూండేవారు. (ఐతే వాటిని దాచుకోవాలని తెలియలేదు అంటూ బాధపడింది లక్ష్మి). ఉత్తరంలోని విషయాలను గురించి అన్నా, చెల్లెలు చర్చించుకుంటూ చెల్లెలికి కావల్సిన సలహాలను ఇస్తూ ప్రతీ పనిని ఎలా చెయ్యాలో కూడా ఒక తల్లిలాగా నేర్పిస్తూండేవారు. ఆనాడు ఆమెకు ఒక మహాత్మునికి, ఒక సిద్ధపురుషునికి, ఒక యోగికి సహోదరిగా జన్మించాననే ధర్మసూక్ష్మం తెలియదు. ఐనా అన్నగారి మాటను వేదంగా

పాటించేది. ఆ అదృష్టం ఎంతమందికి ఉంటుంది. లక్ష్మి వివాహ విషయంలో కూడా తండ్రితో పాటుగా ఎంతో శ్రద్ధ తీసుకుని చెల్లెలికి అనుకూలమైన చక్కటి సంబంధాన్ని చేశారు.

కాలచక్రం తిరిగిపోతున్నది. బెనారస్ యూనివర్సిటీలో తనకు రావల్సిన పట్టా పుచ్చుకుని మాస్టర్‌గారు గురుదేవుల దగ్గరకు వెళ్ళి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళటానికి అనుమతిని అడిగారు. ఆంధ్రాలో ముందు ముందు నీ అవసరం చాలావుంది. ప్రస్తుతానికి వెళ్ళు అంటూ భవిష్య కార్యక్రమాల ప్రణాళికల వివరాలను సూచన ప్రాయంగా కొన్ని వివరించి ఆంధ్రాకు పంపారు. గురుదేవులు ప్రసాదంగా ఇచ్చిన ఆ ప్రణాళికలను హృదయంలో పదిలంగా భద్రపరుచుకుని, వాటిని ఇతరులకి ఎలా పంచిపెట్టాలా? అనే ఆలోచనలతో ఆంధ్రదేశంలోకి అడుగుపెట్టారు మన మాస్టర్‌గారు.

## ఆంధ్రప్రదేశ్‌లో పరివార్ కార్యక్రమాలు

అప్పటికింకా శ్రీకామరాజుగారు అనంతపురంలో ఉద్యోగం చేస్తున్నారు. మాస్టర్‌గారు సరాసరి అనంతపురానికే వచ్చారు. తాము కూడా అక్కడే ఉద్యోగం సంపాదించుకోవాలని చాలా ప్రయత్నాలు చేశారు. అన్నగారు చేస్తున్న ఈ ఉద్యోగ ప్రయత్నాల గురించి 'లక్ష్మి' గురుదేవులకు ఉత్తరం రాసింది. లక్ష్మి రాసిన ఉత్తరానికి జవాబుగా రామకృష్ణకు ఆ ఊర్లో ఉద్యోగం రాదు. వేరే ఊరు వెళ్ళవలసివున్నది అని సూచించారు. ఆ ఉత్తరం చూచిన మాస్టర్‌గారు ఏమీ చలించలేదు. అలా అని తన ప్రయత్నాలు మానలేదు. ఇందులో చిన్న పరమార్థమున్నది. 'కృషితో నాస్తి దుర్భిక్షం' – ఏ వ్యక్తి అయినా తన స్వయంకృషి మీద ఆధారపడి జీవించాలి. అప్పుడే గురువుల ఆశీర్వచనాలు ఫలిస్తాయి. అది ఎక్కడ, దేనికి అనే ఈ వివక్షకు ప్రత్యక్ష నిదర్శనాలతో పనేముంటుంది?

మాస్టర్‌గారు తన ఉద్యోగ ప్రయత్నాలు మానలేదు. అనంతపురంలో ఉండగానే గురుదేవులచే సూచించబడిన కార్యక్రమాలను చేపట్టారు. 'పేరులోనే పెన్నిధి' గలదు. అనంతపురంలో ప్రారంభించ బడిన ఆ కార్యక్రమాలు త్వరలోనే అనంతంగా రూపొందాయి. మెల్లమెల్లగా ఒక్కొక్క ప్రణాళిక రూపుదాలుస్తున్నది.

ఒక పక్కన ఉద్యోగ ప్రయత్నాలు, మరొకవైపు గురుదేవుల కార్యక్రమాలు అలా సాగిపోతూనే ఉన్నాయి. ఈ పరిస్థితులలో మాస్టర్‌గారి జీవితంలో మరొక నూతన కిరణం ఆవిర్భవించింది. అదే హోమియోపతి వైద్యం నేర్చుకునే అవకాశం. మాస్టర్‌గారికి ప్రముఖ హోమియో వైద్యులు

శ్రీజి.వి.చలపతిరావుగారితో పరిచయమేర్పడింది. అనతికాలంలో ఆ పరిచయం వాళ్ళను మరింత దగ్గర చేసింది. శ్రీచలపతిరావుగారి ప్రోత్సాహంతో మాస్టర్‌గారు హోమియో వైద్యంలో నిష్ణాతులయ్యారు. ఆయనతో కలిసి మాస్టారు మెదడువాపు వ్యాధితో బాధపడుతున్న వేలాదిమంది పిల్లలకు ప్రాణదానం చేశారు. హోమియో వైద్యంతో చివరివరకు వేలాదిమందికి ఆరోగ్యాన్ని ప్రసాదించారు.

శ్రీకామరాజుగారి కోసం రామసుబ్బయ్య అనే ఒక బి.ఎల్ విద్యార్థి తరచూ వీళ్ళింటికి వస్తూండేవారు. మెల్లమెల్లగా మాస్టారితో రామసుబ్బయ్యగారికి పరిచయం ఏర్పడింది. తరువాత అది మంచి స్నేహంగా మారింది. మాస్టర్‌గారి ఉద్యోగ ప్రయత్నాలలో కూడా రామసుబ్బయ్య ఎన్నోరకాలుగా సహకరించేవారు. రానురాను ఆయనకి కుడిభుజంగా తయారయ్యారు. అక్కడ రామసుబ్బయ్యతో పాటు మాస్టర్‌గారంటే అభిమానమున్న మిగిలిన స్నేహితులు కూడా శ్రీరామకృష్ణకు అనంతపురంలోనే ఉద్యోగమిప్పించి అక్కడే ఉంచుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేశారు. కానీ ఏవీ ఫలించలేదు.

నిజానికి తనకు అనంతపురంలో ఉద్యోగం రాదని మాస్టర్‌గారికి తెలుసు అయినా ప్రయత్నమనేది మానవలక్షణం కాబట్టి చేశారు. అనంతపురంలో ఉన్నప్పుడు మాస్టర్‌గారికి చాలామంది శిష్యులు ఏర్పడ్డారు. శ్రీ దేశాయి సుబ్రమణ్యంగారు లాంటివారు ముఖ్యులు. ఈ దేశాయి సుబ్రమణ్యంగారి భార్య గర్భవతిగా ఉండగా మాస్టర్‌గారు ఒకరోజు వచ్చి 'అన్నయ్యా! ఈరోజు వదినని హాస్పిటల్‌కి తీసుకువెళ్ళండి, కాన్పు అవుతుంది' అన్నారు. కానీ డాక్టరుగారు ఇచ్చిన తేదీ ఇంకా చాలా రోజులుంది. ఐనప్పటికీ సుబ్రమణ్యంగారు మాస్టారి మాటను విశ్వసించి హాస్పిటల్‌కు తీసుకువెళ్ళగా ఆరోజే కాన్పు అయి పాప పుట్టింది. ఈ విషయాన్ని ఆమే నాతో శ్రీశైలం శిబిరానికి వచ్చినప్పుడు చెప్పారు. అనంతపురంలో పరిచయమైన మరొక స్నేహితురాలు శ్రీమతిదుర్గ. ఆవిడ కూతురైన మైత్రేయికి కూడా తన వైద్యంతో చికిత్స చేసి ఆమెకు స్వస్థత చేకూర్చారు.

మాస్టర్‌గారి తమ్ముడు శ్రీవిశ్వనాథ్ మంచి క్రికెట్ ఆటగాడు. వాళ్ళ బృందానికి అతనే కెప్టెన్. శ్రీగురురాజారావుగారు వాళ్ళ పాఠశాలలో లెక్కల మాస్టారు. ఒకసారి ఆయన విశ్వనాథ్ కోసం వీళ్ళింటికి వచ్చారు. అప్పుడే వారికి మాస్టర్‌గారితో పరిచయం అయింది. మాస్టర్‌గారికి పుస్తకాల పట్ల ఉన్న అభిరుచిని గ్రహించిన ఆయన అప్పుడప్పుడు వారికి చదువుకోటానికి తన

దగ్గరున్న పుస్తకాలను తెచ్చిస్తుండేవారు. అలాగ వారి పరిచయం అభిమానంతో ముందుకెళ్ళింది. ఇవాళ తీసుకున్న పుస్తకాన్ని మాస్టర్‌గారు చదివి మరునాడే ఇచ్చేస్తుండేవారు. అలా గురురాజారావు గారి దగ్గరున్న పుస్తకాలనన్నింటినీ చదివేశారు. శ్రీ గురురాజారావుగారికి ఇంతింత పుస్తకాలను ఆయన అలా ఎలా చదివేయగలుగుతున్నారు అని ఆశ్చర్యం కలుగుతూండేది. తనకు తెలిసినంత వరకు అలా చదవగలిగింది ఒక్క వివేకానందస్వామి మాత్రమే.

ఒకరోజున చనువుగా 'ఇంత త్వరగా ఎలా చదువుతున్నావు ఆర్.కె అసలు నీవు చదివే పద్ధతి ఏంటి' అని ఆసక్తితో అడిగారు. 'పుస్తకంలో ప్రతీ పేజీలోని మొదటి లైను అలానే చివరి లైను చదువుతాను. అంతే అందులో ఉండే సారాంశమంతా తెలిసిపోతుంది' అని చాలా సులువుగా చెప్పేశారు. అందువల్ల పుస్తకం చదవడం చాలా త్వరితగతిన పూర్తవుతుంది. వివేకానందుడు కూడా ఇలానే చదివేవాడని గురురాజారావుగారి అనుమానం తీర్చారు.

అనంతపురంలో శ్రీరామసుబ్బయ్య, శ్రీ గురురాజారావుగార్లతో పాటు శ్రీ సీతారాంగారు కూడా పరిచయమయ్యారు. వీళ్ళ ముగ్గురి మనస్సులో మాస్టర్‌గారి పట్ల ఒక గురుభావమేర్పడింది. ఆయన ఏం చెప్పినా వారికది వేదవాక్కే. ఏది చెప్పినా తక్షణమే ఆచరిస్తూండేవాళ్ళు.

వీళ్ళ కుటుంబం అనంతపురంలో ఉండగానే తాతగారైన శ్రీ సోమేశ్వరరావుగారికి పక్షవాతం రావటం జరిగింది. ఐనా వారు ధైర్యంతో తన తపోసాధనతో శరీరాన్ని స్వాధీనపరుచుకుని కొంతకాలం జీవించారు. ఒక రోజు రాత్రి పద్మాసనంలో కూర్చుని ధ్యానం చేసుకుంటూనే పక్కన పడుకున్న మనమడి (మాస్టారు) మీదకి ఒరిగి ప్రాణాలను వదిలారు. సిద్ధపురుషుల మరణమును ఎలా వర్ణిస్తారంటే 'అనాయాసేన మరణం-వినాదైన్యేన జీవనం' అంటారు. అలా ఆ మహాత్ముడు యోగపురుషుడైన మనువడి సాన్నిధ్యంలో ఒరిగిపోవటం ఓ అద్భుతమైన విషయం.

## గురుతరమైన గురువాణి

శ్రీకామరాజుగారికి గుంటూరుకు బదలీ అయింది. మొత్తం కుటుంబమంతా గుంటూరుకు వచ్చేసింది. మాస్టర్‌గారు గుంటూరుకు వచ్చేయటంతో శ్రీరామసుబ్బయ్యగారికి కూడా గుంటూరుకు వచ్చెయ్యాలనిపించింది. అప్పుడాయన కొచ్చిన్‌లో ఎమ్.ఎల్ చేస్తూండేవారు. ఎమ్.ఎల్ అయిపోగానే గుంటూరుకు వచ్చి శ్రీకామరాజుగారు పనిచేస్తున్న నాగార్జున యూనివర్సిటీలోనే ఆయన

ఉద్యోగాన్ని సంపాదించుకున్నారు. అప్పటికాయనకు స్థిమితం చిక్కింది. ఖాళీ సమయంలో మాస్టర్ గారి దగ్గరకు రావటం – గాయత్రి పరివార్ సంగతులు మాట్లాడుకోవడం చేస్తూండేవారు. కేవలం పరివార్ విషయాలే కాక మాస్టర్‌గారికి తన కుటుంబపరిస్థితులు, తన తమ్ముడి చదువు,ఉద్యోగం మొదలైనవి కూడా చెప్తూండేవారు. మాస్టర్‌గారి అపారకరుణ, ప్రేమ పొందిన ఆ కుటుంబం త్వరలోనే చక్కబడింది. తరువాత తమ్మునికి ఉద్యోగం కూడా వచ్చింది. పరిస్థితులన్నీ శీఘ్రంగానే చక్కబడిపోయాయి. శ్రీరామసుబ్బయ్యగారు మాత్రం వీలైనంత సమయాన్ని మాస్టారితోనే గడిపేవారు.

శ్రీకామరాజుగారు లక్ష్మికి సంబంధం చూశారు. వరుడు బాపట్ల వాస్తవ్యులైన శ్రీలక్ష్మీనారాయణగారు. ఆయన బ్యాంక్ ఉద్యోగి. ఘనమైన కుటుంబం. అందరికీ అన్నివిధాలా నచ్చింది. అందుచేత 1980 జనవరి ఒకటవ తేదీన ఎంతో వైభవోపేతంగా చెల్లెలు లక్ష్మి వివాహమైపోయింది. లక్ష్మి వివాహ సమయంలో మాస్టర్‌గారు చేసిన ఒక చమత్కారము మనం తెలుసుకోవాలి. పెళ్ళి పనులు మొదలైనాయి. వస్తువులు సమకూర్చుకుంటున్నారు. పెద్దకొడుకు ఏమీ పట్టించుకోలేదని తండ్రిగారు కాస్త విసుక్కున్నారు. ఆరోజుల్లో పంచదార రేషన్లో మాత్రమే దొరికేది. పెండ్లి అంటే మాటలు కాదు కదా! చాలా పంచదార కావాలి. ఎలాగా అనుకుంటున్న సమయంలో మాస్టర్‌గారు 'ఇంట్లో ఉన్న రెండు కేజీల పంచదారను తీసుకువెళ్ళి కాలవలో పోసిరమ్మని' ఒకరికి చెప్పారు. వారు వెంటనే ఆ పనిని చేసారు. అంతే, ఆరోజు సాయంత్రమే అప్పటి తహసీల్దారుగారు మాస్టారింటికి ఒక గోతం నిండా పంచదార పంపించారు.

అలా ఆ సమస్య తీరిపోయింది. కానీ అంత పంచదార ఎలా వచ్చిందనే విషయం గురించి తరువాత ఎవ్వరూ పట్టించుకోలేదు. లక్ష్మి అత్తారింటికి వెళ్ళిపోయింది.

ఈమధ్యకాలంలోనే గుంటూరులోని టి.జె.పి.ఎస్ కాలేజీలో లెక్చరర్ పోస్టు కోసం మాస్టర్‌గారు ఇంటర్వ్యూకి వెళ్ళారు. అది కమిటీ కాలేజీ కనుక కొంతవరకు రికమండేషన్ ప్రభావం ఉండవచ్చు. కానీ మాస్టర్‌గారికి అటువంటి అవసరమేదీ లేకుండా సునాయాసంగానే ఆ ఉద్యోగం లభించింది. ఇక్కడ మనకు వారి గురుదేవుల వాక్కు యొక్క మహిమ అర్థమవుతుంది. అనంతపురంలో వద్దు. వేరే ఊరు వెళ్ళు. అక్కడ నీకు ఉద్యోగం దొరుకుతుంది అనే మార్గదర్శనాన్ని గురుదేవులు ముందే నిర్దేశించారు. అలానే జరిగిందనే విషయాన్ని మనం గమనించుకోవాలి.

## మత్స్యావతార ప్రక్రియ

అదేవిధంగా 'గురువాక్యంతు కర్తవ్యం' అనగా గురువు చెప్పిందే కర్తవ్యం. గురువు వాక్కు వృథా కాదు కదా! గురుదేవుల ఆశీర్వాదబలంతో మాస్టర్‌గారు గుంటూరు కాలేజీలో ఉద్యోగంలో చేరారు. ఇంక అక్కడే స్థిరపడిపోయారు.

గుంటూరులో గాయత్రీపరివార్ కార్యకలాపాలు ప్రారంభించారు. మాస్టర్‌గారితో ఉంటూ శ్రీరామసుబ్బయ్యగారు, శ్రీ డి.వి.ఎన్.బి.విశ్వనాథ్‌గారు, శ్రీరత్నాకర్‌గారు, రఘుపతిగారు, ఎన్.ఎల్.ఎన్.మూర్తి గారు ఇంకా కొంతమంది సభ్యులతో 'గాయత్రీ పరివార్' వటవృక్షం మాదిరి విస్తరించసాగింది. కార్యక్రమాల ఒరవడి తీవ్రం కాసాగింది. గ్రామగ్రామాలలో 'గాయత్రీ' అంటే ఏమిటో బోధపడటం మొదలైంది. మాస్టర్‌గారు ఎక్కడ చెప్పినా గాయత్రి గురించి, గురువుగారి గురించే చెప్పేవారు. తనగురించి ఎంతో గోప్యంగా ఉంచుకుంటూ ఎవ్వరికీ ఏమీ తెలియని రీతిలో కార్యక్రమాలు నడపసాగారు. కాలేజీలో కూడా ఎవ్వరికీ ఏమీ చెప్పేవారుకాదు.

అప్పుడప్పుడూ మాటల సందర్భంలో చెల్లెలితో 'గత కొన్ని జన్మలుగా అడవులలోనే నా జీవితం, సాధన జరిగేది. అందువల్ల ఈ సామాజిక జీవితం-సభ్యతల గురించి నాకు ఏమాత్రం అవగాహన లేదు. ఈ మనుషులతో కలిసి జీవించటం నాకు చాలా కొత్తగా ఉంటున్నది' అని అంటూండేవారట. **ఆయన ఈ పృథ్వి మీద తాను చేయవలసిన గురువుల ప్రణాళికలు-నవయుగ నిర్మాణ కార్యకలాపాల నిమిత్తం సేవాభావంతో ఈ కార్యభారాన్ని మోస్తున్నారే తప్ప తాను ఈ పనికొరకు రాలేదనే భావప్రకటీకరణ అక్కడ మనకు ద్యోతకమవుతోంది.** తాను ఎంతో నిగూఢంగా ఉంటూ గురుదేవుల ప్రణాళికలను గాయత్రీపరివార్ సంస్థ యొక్క కార్యకలాపాలను శ్రీ డి.వి.ఎన్.బి. విశ్వనాథ్, శ్రీ సీతారాం, శ్రీ ఎన్.ఎల్.ఎన్.మూర్తి, శ్రీ రత్నాకర్‌గార్ల ద్వారా నడిపించసాగారు.

1982 వ సంవత్సరం నుంచీ ఈ కార్యక్రమాల విస్తృతి ఇంకా తీవ్రం కాసాగింది. వేటపాలెం నుండి నేను మావారు శ్రీ బి.సత్యనారాయణరావుగారు, ఒంగోలు నుండి శ్రీ లక్ష్మీనారాయణరావు దంపతులు (మా అక్క బావగార్లు), చీరాల నుండి శ్రీ సుబ్బారావు దంపతులు, సవాయ్‌సింగ్, జబ్బర్‌సింగ్, లీలావతి, హైమావతి, ప్రసాదు మొదలైనవారంతా ఎంతో ఉత్సాహంతో, ఆత్మీయతతో కలిసిమెలిసి గ్రామగ్రామాల్లో పంచకుండీ యజ్ఞాలు, నవకుండీ యజ్ఞాలు - గురుదేవుల సాహిత్య పరిచయకార్యాలు ఎంతో ఉత్సాహంతో ఉరకలు వేస్తూ చేసేవాళ్ళము.

శ్రీ డి.వి.ఎన్.బి. విశ్వనాథ్‌గారు మాచెర్లలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నప్పుడు దాదాపు ఆ చుట్టుప్రక్కలగల గ్రామాలన్నింటిలోనూ గాయత్రీమంత్ర దీక్షల నివ్వటం, యజ్ఞాలు చెయ్యటం, గురుదేవుల మిషన్ గురించి విస్తృతంగా ప్రచారం చేయటం జరిగింది. 1982 వ సంవత్సరంలో మొదటిసారిగా వేటపాలెంలో కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రారంభించబడిన యజ్ఞ కార్యక్రమాలు మెల్లమెల్లగా చీరాల, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, సూళ్ళూరుపేట, మద్రాసు, వరంగల్, తాడిపత్రి, మార్కాపురం, పొదిలి మొదలైన ప్రధాన ప్రాంతాలకు, వాటి చుట్టూ ఉన్న కొన్ని వందల గ్రామాలకు విస్తరించాయి. శ్రీసత్యనారాయణ, శ్రీలక్ష్మీనారాయణ గార్ల ఆధ్వర్యంలో మాస్టర్‌గారు, మిగిలిన పరివార్ సభ్యులు వచ్చి ఎంతో వైభవోపేతంగా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ యజ్ఞాలలో పాల్గొని గాయత్రీమంత్రదీక్ష తీసుకున్నవారి ఆనందాలకు అవధులుండేవి కావు. వాళ్ళ జన్మ తరించిపోయినట్లుగా అనుభూతి చెందేవారు. అలా దీక్షాపరులైనవారందరూ ఆ మహావిద్యను తమవరకే పరిమితం చేసుకోకుండా తమ బంధు మిత్రులు, పరిచయస్తులందరికీ పరిచయం చేసి వాళ్ళవాళ్ళ గ్రామాలలో కూడా యజ్ఞాలు చేయించే వారు. వారంతా గురుదేవుల గురించి, మిషన్ కార్యక్రమాలను చూసి ఆనందించి ఎంతో పరవశంతో ఆ జ్ఞానాన్ని అందరికీ పంచిపెట్టడం జరిగింది. ఈమధ్యకాలంలోనే శ్రీతుమ్మూరు గారికి మాస్టర్ గారితో పరిచయమయ్యింది. వారికి మాస్టారు చేస్తున్న ఈ కార్యక్రమాలు ఎంతో నచ్చాయి. మెల్లిమెల్లిగా వారూ కార్యక్రమాలకు రావటం అందులో పాల్గొనటం చేస్తుండేవారు. ఇంక మెల్లిగా మాస్టర్‌గారి ప్రేరణతో యజ్ఞాలు చెయ్యటం, సత్సంగాలు చెప్పటం కూడా ప్రారంభించారు. వారికి హిందీ బాగా రావటంతో గురుదేవుల అనుగ్రహంతో గురుదేవుల సాహిత్యాన్ని (కొన్ని పుస్తకాలను) తెలుగులోకి అనువదించటం కూడా జరిగింది.

మత్స్యావతార ప్రక్రియ ఈ విశ్వంలో ఎలా వ్యాపించిందో అలా ఆంధ్రప్రదేశ్‌లో గాయత్రీ పరివార్ దశదిశలుగా వ్యాపించింది. అలా మాస్టర్‌గారు చేస్తున్న కార్యక్రమాలు మెల్లిగా ప్రాచుర్యం లోకి రావటం మొదలైంది.

## ప్రేమ అంటేనే బాధ్యత

గాయత్రీపరివార్ కార్యక్రమాల గురించి మెల్లమెల్లగా అందరికీ తెలియసాగింది. ఒక్కొక్కసారి వారికున్న సమస్యలను తీర్చుకోటానికి మాస్టర్‌గారి దగ్గరకు వస్తుండేవారు. వారి సన్నిధిలో కూర్చుంటే

అందరూ వారి సమస్యలను మర్చిపోయి ఎంతో హాయిని అనుభూతి చెందుతుండేవారు. వారి దగ్గర కొచ్చేవాళ్ళు ఏమాత్రం క్రొత్తగా అనుకోకుండా మనస్సులోని బాధను ప్రేమమూర్తి అయిన మాస్టర్‌గారికి చెప్పుకొని స్వాంతన పొందేవారు. మధురమైన వారి వాక్కు ఆర్తితో వచ్చినవారి హృదయాలలోకి చొచ్చుకొనిపోయేది. అలా మాస్టర్‌గారి పరివారం వందల నుండి వేలసంఖ్యకు చేరింది. కానీ వారి జ్ఞాన స్వరూపాన్ని అర్థం చేసుకున్న కొద్దిమంది జిజ్ఞాసువులు తమ సందేహాలను తీర్చుకోవాలనుకుంటే మాత్రం తమ సమయాన్ని రాత్రిపూట చర్చలతో గడిపేవారు. అలా మాస్టర్‌గారు తెల్లవార్లు మాట్లాడుతూంటే సాక్షాత్ శ్రీకృష్ణభగవానుడే వారిలో ప్రత్యక్షంగా కనిపించి గీతోపదేశం చేస్తున్నట్లు అనుభూతి పొందేవారు. శ్రీకృష్ణుని అవతారశక్తిని భీష్మాచార్యులవారు, కుంతీదేవి దర్శించినట్లుగానే మాస్టర్‌గారి యొక్క అవతారశక్తిని గుర్తించిన మహనీయులలో గుంటూరుకు చెందిన అభిరామేశ్వరరావుగారు కూడా ఒకరని శ్రీవిశ్వనాథంగారు చెప్తూండేవారు.

మాస్టర్‌గారు గుంటూరులో ఉంటున్నప్పుడు అరండల్‌పేటలో శ్రీవీరభద్రరావుగారనే ఒక మహాత్ములుండేవారు. వారిని అందరూ జగత్‌నాన్నగారని పిలుస్తూండేవారు. వారు 'బృందావన రాధాదేవి'కి ప్రియభక్తుడు. భక్తి భావానికి రాధాదేవి పరాకాష్ఠ. జగత్‌నాన్నగారు ఆ తల్లిని ఉపాసించి ఆధ్యాత్మిక జగత్తులో అత్యంత ఉన్నతిని సాధించారు. ప్రేమ-ప్రేమ-ప్రేమ ఇదే వారి ధ్యానం. వారిదగ్గర కెళ్ళినవారిని అనంతమైన ప్రేమ ప్రవాహంలో ఓలలాడించేవారు. బాధలతో, సమస్యలతో, కష్టాలతో ఇంకా ప్రేత పిశాచ బాధలతో నలిగిపోతున్నవారికి కూడా వారి సన్నిధిలో ఊరట లభించేది. దుఃఖంతో వచ్చినవారు ఆనందంతో వెళ్ళిపోతుండేవారు.

పూజ్యులైన శ్రీజగత్‌నాన్నగారికి-శ్రీకామరాజుగారి కుటుంబానికి మంచి స్నేహితం ఉండేది. జగత్‌నాన్నగారు తన ఇంట్లోనే 'రాధాదేవి' మందిరాన్ని నిర్మించుకొని ఆమెకు ప్రేమతో పూజలు, అర్చనలు చేస్తూండేవారు. భక్తిభావంతో తాము చేరుకున్న ప్రేమతత్త్వానికి నిదర్శనంగా వారు ఒక అనాథశరణాలయాన్ని స్థాపించారు. అనాథబిడ్డలను చేరదీసి స్వయంగా తామే వారికి తల్లి, తండ్రియై వారిలో దైవీసంస్కారాలు జాగృతం చేసేవారు. ప్రేమమయ రాధాదేవి ఉపాసనతో పాటు అనాథబిడ్డల ఆరాధన కూడా చేస్తుండేవారు. ఒకానొక సందర్భంలో మాస్టర్‌గారు 'జగత్‌నాన్న గారికి రాధాకృష్ణుల దివ్యసాక్షాత్కారం కూడా అయింది' అని చెప్తూ ఒక చిన్న అపురూపమైన సంఘటన చెప్పారు.

జగత్‌నాన్నగారు ఒక రాత్రి రాధాకృష్ణుల ధ్యానంలో దివ్యసాక్షాత్కారానుభూతిని పొందుతున్నారు. రాధాకృష్ణుల రాసకేళిలో రాధాదేవి నోటినుంచి తాంబూలం అందుకుంటున్న శ్రీకృష్ణులవారి చేతి నుండి కాస్తంత తాంబూలం జారిపడింది. వెంటనే దివ్యాత్ములైన జగత్‌నాన్నగారు ఆనందంతో ప్రసాదాన్ని ఆరగించి మహదానందాన్ని పొందారుట. ఆనాటినుంచి వారి అణువణువు రాధాదేవితో మమేకమైపోయిందిట. వెళ్ళిన వారందరికీ ఆ ప్రేమమూర్తి రాధాదేవి యొక్క దివ్యనామాన్నే మహాప్రసాదంగా ఇస్తుంటారు. 'పరహితార్థ ప్రాపకుల్ సజ్జనుల్' అన్న నానుడికి నిదర్శనంగా నాన్నగారి ఆలోచనలు ఎప్పుడూ పరహితం కోసమే పరితపిస్తుండేవి. బాధాతప్తహృదయముతో ఎవరు వచ్చినా వారికి తమ ప్రేమామృతాన్ని ప్రసాదించి పంపేవారు.

వారి దగ్గరకు తరచుగా ఆత్మలు ఆవహించి వేధింపబడుతున్నవారు వస్తుండేవారు. అలాంటి దుష్టాత్మలను కూడా వారు వదలగొట్టి బాధా నివారణ చేస్తుండేవారు.

జగత్‌నాన్నగారికి పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ అంటే ప్రాణం. మాస్టర్‌గారితో ఎంతో ఆత్మీయతతో సన్నిహితముగా మెలిగేవారు. వారికి మాస్టర్‌గారంటే ఉన్న అపారమైన ప్రేమకు తార్కాణం సాయంత్రం పూట ఆయన తన స్వహస్తాలతో మాస్టర్‌గారికి అన్నం ముద్దలు చేసి నోట్లోపెట్టేవారు. వారితో ఉన్న సాన్నిహిత్యం వల్ల మాస్టర్‌గారు కూడా తమ దగ్గరకు వచ్చిన అలాంటివారిని జగత్‌నాన్నగారి దగ్గరకు పంపించేవారు. రోగిని బట్టి చికిత్స చేసేపద్ధతి మాస్టర్‌గారిది. అందుకే వారు ఏ రోగానికి ఏం చెయ్యాలో నిర్ణయించుకొని వారి కర్మానుసారాన్ని బట్టి, వ్యాధిని బట్టి చికిత్స చేస్తుండేవారు. హోమియోతో తగ్గే రోగాలకు హోమియోమందు వేసేవారు. ప్రారబ్ధకర్మల వల్ల కలిగే సమస్యలకు మంత్రానుష్ఠానాలను చేయించేవారు. గాలి, ధూళి లాంటి రోగాలతో బాధపడుతున్నవారిని జగత్‌నాన్నగారి దగ్గరకు పంపేవాళ్ళు.

ప్రేమ అంటేనే బాధ్యత అనే నిర్వచనం మాస్టర్‌గారి జీవితంలో అణువణువున ప్రకాశించేది. మాస్టర్‌గారి మేనత్తకూతురుకు తన 17 వ సంవత్సరంలో మొదలైన విరేచనాలు 35 సంవత్సరాల వరకు అలా ఆమెను బాధిస్తూనే వుండేవి. మనిషి నీరసించిపోయి నిస్తేజంగా, నిర్లిప్తంగా అయిపోయింది. ఈ బాధతోనే ఆవిడ ఇన్ని సంవత్సరాలు గడిపేసింది. దేనికైనా 'టైం' రావాలంటారు కదా పెద్దలు. అలానే ఆమెను వాళ్ళత్త మాస్టర్‌గారి దగ్గరకు తీసుకువచ్చింది. ఆమె చెప్తున్న ఆ కష్టాన్ని వింటూనే 'ఈ సమస్యను' శ్రీవీరభద్రరావుగారే తగ్గించగలరు అనుకొని ఆమెను వారి దగ్గరకు పంపించారు. వీరభద్రరావుగారికి ఆమెను చూస్తుండగానే సమస్య అర్థమైపోయింది.

ఆమె శరీరాన్ని పట్టిపీడిస్తు యాతనకు గురిచేస్తున్న అదృశ్యశక్తి ఏమిటో కనుక్కుని కొన్నాళ్ళపాటు ఆమెను తన దగ్గరుంచుకొని మామూలు మనిషిని చేశారు. తరువాత ఆమె ఎంతో ఆరోగ్యంతో, ఆనందంగా ఇంటికి వెళ్ళిపోయారు.

ఇలాంటి మరొక సమస్యను కూడా మాస్టర్‌గారు జగత్‌నాన్నగారి దగ్గరకు పంపించారు. అదేంటంటే మాస్టర్‌గారి స్నేహితులు శివకుమార్‌గారని అనంతపూర్‌లో ఫిజిక్స్ లెక్చరర్. ఈ దంపతులకు కూడా సంతానం లేదని మాస్టర్‌గారి దగ్గరకు వచ్చారు. మాస్టర్‌గారు వీరికి ఒక మంత్రం ఉపదేశించి పూజ్యశ్రీ నాన్నగారి దగ్గరకు పంపించారు. వారిలో గల ప్రారబ్ధకర్మలను క్షయం చేసి రాధాదేవి అనుగ్రహంతో వీరికి సంతానం కలుగుతుందని ఆశీర్వదించి పంపించారు. ఆ తరువాతి కాలంలో వారికి ఇద్దరు అమ్మాయిలు కల్గారు. ఈవిధంగా దివ్యాత్మ స్వరూపులైన మాస్టర్‌గారు భౌతిక కక్షలోని రోగాలను, మానసిక కక్షలోని రోగాలు బాధలను, ప్రారబ్ధపరమైన కర్మలకు తగు నివారణోపాయాలను ప్రయోగించి అందరినీ బాధావిముక్తులను చేసేవారు.

ఇక్కడ మరొక సంఘటన చెప్పాలి. శ్రీకామరాజుగారి స్నేహితుల అమ్మాయికి ఒక సమస్య వచ్చింది. ఆ అమ్మాయికి మాస్టర్‌గారంటే మొదటి నుండి గురుభావమే ఉండేది. ఆ స్నేహితుడు బదిలీపై వేరే ఊరు వెళ్ళిపోతూంటే వారి అమ్మాయి మాస్టారికి చెప్పిపోదామని వచ్చింది. మాస్టర్‌గారు "శ్రీరామశర్మఆచార్య" అనే అష్టాక్షరీ గురునామాన్ని మూడుసార్లు ఆమెతో పలికించి ఎట్టి పరిస్థితుల లోను గురునామాన్ని వదలద్దని గట్టిగా చెప్పి పంపించారు.

కాలగతిలో కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రారబ్ధమంటే ఏమిటో తెలియదు కానీ వారి ఇంటి ప్రక్కనే ఒక దేవీ ఉపాసకులు ఉంటుండేవారు. పూజలు, హోమాలనే పేరుతో ఆ అమ్మాయి తరచూ అక్కడికి వెళ్తుండేది. ఈ అమ్మాయి కూడా మాస్టారి గురించి ఎంతో గర్వంగా చెప్తుండేది. ఒకసారి ఆ దేవీ ఉపాసకుడు ఈ మంత్రం చేస్తే నీవు కూడా ఆయనంత గొప్పదానివై పోతావు అంటూ ఒక మంత్రాన్ని ఆమెకు ఉపదేశించారు. అలా ఆ మంత్రాన్ని జపిస్తూ ఆ అమ్మాయి ఆ తాంత్రికుడి చేతిలో కీలుబొమ్మైపోయింది. అతడేమి చెప్తే అది చేసే స్థితికి వచ్చేసింది. ఒకరోజు ఒక ఉత్తరం రాసిపెట్టి ఇంట్లోనుండి బయటకు వచ్చేసింది. దేవీ ఉపాసకుడి దగ్గరకు వచ్చింది. కానీ ఆమె మనస్సులో శ్రీరామశర్మఆచార్య అనే గురునామం జరుగుతూనేవున్నది. అదే ఆమెను రక్షణా కవచంలా కాపాడింది.

గురు అనుగ్రహం ఎంత గొప్పదో చూడండి. ఎందుకో ఆ అమ్మాయి తల్లి తన కూతురు ఏం చేస్తోందో చూద్దామని గదిలోకి వెళ్ళింది. పిల్లలేదు. ఉత్తరం కనిపిస్తే చదివింది. కాళ్ళ క్రింద భూమి కదిలిపోతున్నట్లనిపించింది, తల తిరిగి పడిపోతానేమోనన్నంత భయం వచ్చేసింది. అప్పుడు రాత్రి 9 గంటలైంది. ఐనా ఆ తల్లి ధైర్యాన్ని కూడగట్టుకొని ఆ తాంత్రికుడి ఇంటికి వచ్చింది. స్నానం చేసి పసుపు వస్త్రాలు ధరించి అపరలక్ష్మీదేవిలాగా వెలిగిపోతున్న కూతుర్ని చూసి భయంతో కంపించిపోయింది. ఏదో కీడు జరగబోతోందని మనస్సు చెప్పడంతో ఒక్క ఉదుటున వెళ్ళి రానని మొరాయిస్తున్న కూతురి రెక్కపట్టుకుని బలవంతంగా లాంగదీసుకొని ఇంటికి తీసుకువచ్చేసింది. తరువాత కూతురిని తీసుకుని రాత్రికి రాత్రి బయల్దేరి గుంటూరులోని మాస్టారి ఇంటికి వచ్చేశారు

ఆ సమయంలో మాస్టర్‌గారు ఇంట్లో లేరు. హరిద్వార్ వెళ్ళివున్నారు. మాస్టారి తమ్ముడు విశ్వనాథ్‌గారు వున్నారు. విషయం విని వారు తల్లికి ధైర్యం చెప్పారు. గురునామ మహిమతో పాటు ఆ ఇంట్లో నిరంతరం చేసే సాధన, యజ్ఞముల దివ్యవిభూతి వల్ల ఆ ఇంట్లో దైవీచేతనత్వం యొక్క దివ్యతరంగాలు ప్రవహిస్తున్నాయి. ఆ శక్తితో ఆ అమ్మాయి కాస్త కుదుటపడింది. మొదటినుండి వాళ్ళు కుటుంబ స్నేహితులే కనుక మాస్టారు లేకపోయినా మాస్టారి తమ్ముడుగారు వీళ్ళకి ధైర్యం చెప్పి జగత్‌నాన్నగారి దగ్గరకి తీసుకెళ్ళారు.

తర్వాత నాలుగు రోజులకు మాస్టర్‌గారు హరిద్వార్ నుండి వచ్చి విషయమంతా తెలుసుకున్నారు. విషయం ఆయన ఊహించినదే కాబట్టి ఎంతో ఓపికగా వాళ్ళకు ధైర్యం చెప్పి వారిని అనునయించారు. అప్పటి నుండి ఆయన తన పద్ధతిలో ఆ అమ్మాయికి చికిత్స మొదలుపెట్టారు. పూజ్యగురుదేవుల అనుగ్రహం ఏమిటంటే ఆ అమ్మాయి అలాంటి పరిస్థితిలో కూడా గురునామాన్ని వదిలిపెట్టకపోవడమే. అందుచేత ఆ అమ్మాయికి గాయత్రీ దీక్ష నిచ్చి అనుష్ఠానాలు చేయించటం మొదలుపెట్టారు. ఒక నెలరోజుల పాటు కఠోరమైన నియమములతో అనుష్ఠానం చేయించి ఆ అమ్మాయిని తిరిగి మనిషిని చేశారు.

ఎంతోకాలం తరువాత ఆ అమ్మాయి మామూలు మనిషి అయింది. అప్పుడు 'ఇదంతా మాస్టర్‌గారి చలువే. ఆయనే నాకు మళ్ళీ జీవితాన్ని ప్రసాదించిన పరమాత్మ' అంటూ కృతజ్ఞతతో కోటి కోటి ప్రణామాలు చేసుకుంది. అంతకంటే ఏమిచ్చి ఆమె ఆయన ఋణం తీర్చుకోగలుగుతుంది.

అలా ఆ అమ్మాయిని అంతటి భయంకరస్థితి నుండి తప్పించారు మాస్టర్‌గారు. ఆ అమ్మాయికి గురుదేవుల అనుగ్రహం ఉంది కనుక ఆమె సన్మార్గంలోనే ఉండగలిగింది. సమర్థసద్గురు అనుగ్రహంగా మన మాస్టర్‌గారు అలా ఎన్ని సమస్యలను పరిష్కరించారో! ఎన్నని, ఎంతని రాయగలం!

నిజంగా ఆ అమ్మాయిని రక్షించి మాస్టార్‌గారు "పరబాధా నివారకాయైనమః" అన్న నామానికి ప్రతిరూపంగా నిలిచారు. చెప్పాలంటే ఇలాంటి సంఘటనలు ఇంకా చాలానే ఉన్నాయి. అలాంటివాటిలో ఒక చిన్న సంఘటన.

గాంధీ అనే ఆయన మున్సిపల్ ఆఫీస్‌లో పని చేస్తుండేవారు. వారికి సంతానం లేదు. చాలా కాలమైంది. దంపతులిద్దరికీ ఈ విషయమై చాలా కలతగా ఉండేది. సరే వారు ఏదైనా మార్గం చూపిస్తారేమోనని మాస్టారి దగ్గరకొచ్చి తమ బాధను చెప్పుకున్నారు. మాస్టారు వారి అభీష్టసిద్ధికై ఒక మహామంత్రాన్ని ప్రసాదించారు. సాధారణంగా మనకు ప్రాప్తమున్నా జన్మాంతరాలలో చేసిన ప్రారబ్ధకర్మలు అడ్డుతగిలి ఫలితాన్ని ఆపుచేయటానికి ప్రయత్నిస్తుంటాయి. అలాంటివారికి మంత్రజపాలు, అనుష్ఠానాలను సూచించేవారు. తరువాత వారి కర్మలు క్షయమైపోయి వారి అభీష్టాలు సిద్ధిస్తాయి. అలా మాస్టర్‌గారి మార్గదర్శనంతో వారు ఆ మంత్రానుష్ఠానం చేసి అతి త్వరలోనే సంతానంగా ఒక కూతురిని, కొడుకుని పొందారు.

తనను నమ్మినవాళ్ళను ఎట్టి పరిస్థితులలోనూ విడువని ప్రేమతత్త్వం మాస్టర్‌గారిది. అందుకు నిదర్శనంగా మనకు తెలిసిన కొన్ని ఉదాహరణలను మాత్రమే సందర్భోచితంగా ఇక్కడ ఇవ్వగలుగుతున్నాము. అత్యంత వినాశనానికి దారితీసే సుడిగుండాల వలయంలోకి వెళ్ళిపోతున్నవారిని కూడా వారు అత్యంత దయతో కాపాడిన ఇలాంటి సంఘటనలు ఎన్నని చెప్పగలం?

ఒక సందర్భంలో మాస్టారు చెప్పారు– మనకొచ్చే అనేక బాధలన్నీ సంచిత ప్రారబ్ధకర్మల ఫలితములే. ఐతే మనకు ప్రారబ్ధకర్మ మాత్రమే తెలుసు. సంచితకర్మ అనేది మనకు తెలియదు కదా! దాంతో మనం సంచితకర్మతో పాటు ఇప్పుడున్న పరిస్థితులను కలుపుకొని మళ్ళీ ఏదో ఒక గందరగోళాన్ని సృష్టించుకుంటాము. అప్పుడేమౌతుందంటే ఈ గందరగోళం ఆ సంచితంతో కలిసి మరో పెద్ద ఆగామీకర్మ తయారౌతుంది. అది వచ్చే జన్మకు సిద్ధమై కూర్చుంటుంది. అందుచేత ప్రారబ్ధకర్మ ఏమిటో మనకు స్పష్టంగా తెలిస్తే మన జీవితవిధానం ఇప్పుడు ఉన్నట్లుగా కాక

మరోరకంగా ఉంటుంది. దాన్ని తెలుసుకునేందుకే ఋషులు మనకొక చిన్న పనిముట్టును అందించారు. దానినే జ్యోతిషశాస్త్రమని అంటారు. జ్యోతిషశాస్త్రాన్ని సవ్యంగా అవగాహన చేసుకున్న వారే నూటికి ఎనభై శాతం సరిగ్గా చెప్పగలుగుతారు. ఇక్కడ ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించు కోవాలి.

ఇక్కడ మాస్టారుగారు జ్యోతిషశాస్త్ర అధ్యయనం చేసినటువంటి ఒక జ్యోతిషశాస్త్రవేత్త రాసిన రెండు పంక్తులు చాలాసార్లు చెప్తుండేవారు. సాధారణంగా జ్యోతిషం మీద ఆసక్తి ఉన్నవాళ్ళు ఒక పుస్తకం చదువుతారు. "కీరో హాండ్ బుక్ ఆఫ్ పామిస్ట్రీ" అనే పుస్తకమది. కీరో అనే జ్యోతిషశాస్త్రవేత్త ప్రపంచ భవిష్యత్తును గురించి అందులో చెప్పటం జరిగింది. అందరూ దాన్ని అలా చదివి ఇలా చెయ్యమని చెప్తుంటారు. దానిని అలా చదివితే లాభంలేదు. నిజంగా జ్యోతిషశాస్త్రాన్ని కనుక మనం సరిగ్గా అధ్యయనం చెయ్యగలిగితే ఈ ప్రారబ్ధకర్మ గురించి చాలా స్పష్టమైన అవగాహన వస్తుంది. దానికి పరిహారం ఏం చెయ్యాలో కూడా తెలుస్తుంది.

అంత అద్భుతమైన జ్యోతిషశాస్త్రం ఈనాడు క్రొత్తపుంతలు త్రొక్కుతున్నది. ఆ జ్యోతిష శాస్త్రమును మళ్ళీ ఒక సవ్యమైన పంథాలో పెట్టడానికే మన ఋషులు పండుగలను ఏర్పాటుచేశారు. **సామూహికంగా పండుగలను చేసుకున్నవారి ప్రారబ్ధకర్మలన్నీ భోజనం చేయటంతో ఎగిరిపోతాయి. ప్రారబ్ధకర్మలను పోగొట్టుకోవడానికి సినిమాలను చక్కటి మాధ్యమముగా ఉపయోగించుకోవాలని మాస్టర్‌గారు చెప్తుండేవారు.** మాస్టర్‌గారు సినిమా చూసే విధానం చాలా విచిత్రంగా ఉండేది. మన జీవితాలలో వస్తున్న అనేక సమస్యలు కావచ్చు, కష్టాలు కావచ్చు వాటిని సినిమాల్లో చూస్తూ అదేరకంగా మనం కూడా స్పందిస్తూ సినిమాల్లో ఆ సమస్య నివారణకు ఎవరిలో ఏ మార్పు వచ్చిందో చూసుకొని అలాంటి మనఃస్థితినే మనము కూడా తెచ్చుకోగలిగితే భౌతికజీవితంలో మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. ప్రారబ్ధకర్మల పరివర్తనకు సినిమాలు చక్కగా తోడ్పడతాయి. ఆయన సినిమా చూస్తున్నప్పుడల్లా సందర్భానుసారం ఆ సన్నివేశం గురించిన వివరణను కూడా చెప్పి ప్రారబ్ధకర్మను ఎలా నివారించుకోవాలో చెప్పేవారు. అలా వారు ప్రతీ క్షణాన్ని సాధనాత్మక నిర్దేశాలతో సమన్వయం చేసేవారు.

టీ.జె.పీ.ఎస్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళడానికి ముందు మాస్టర్‌గారు తమ తమ్ముడు విశ్వనాథ్‌గారితో కలిసి జగత్‌నాన్నగారి ఆశీర్వాదానికి వెళ్ళారు. జగత్‌నాన్నగారు

మాస్టారికి బొట్టు పెట్టి వెనక్కి తిరగకుండా ఇంటర్వ్యూకి వెళ్ళమన్నారు. ఆ ఇంటర్వ్యూలో మాస్టర్ గారికి ఉద్యోగం వచ్చింది.

## యు.ఎస్.ఎ యజ్ఞాలు

గాయత్రీపరివార్ అప్పుడప్పుడే ప్రాచుర్యంలోకి వస్తున్న రోజులవి. మొట్టమొదటగా వేటపాలెం కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో యజ్ఞకార్యక్రమం ప్రారంభమైంది. ఆ తరువాత 1982 దేవీనవరాత్రులకు అందరూ గాయత్రీ లఘుఅనుష్ఠాన దీక్షలు తీసుకొని సాధన చేశారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఒంగోలులో సీతామహాలక్ష్మిగారింట్లో ఏర్పాటుచేశారు. ఆ కార్యక్రమానికి శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు విచ్చేశారు. మొట్టమొదటిసారిగా పూర్ణాహుతి అంటే ఏమిటో అందరికీ తెలిసింది. పూర్ణాహుతికి వచ్చినవారందరికీ మాస్టర్‌గారితో పరిచయభాగ్యం కలిగింది. వాళ్ళ అదృష్టం ఆరోజు అందరికీ మాస్టర్‌గారే స్వయంగా గాయత్రీమంత్రదీక్షలను ఇవ్వడం జరిగింది.

1982 వ సంవత్సరము నుంచీ గాయత్రీపరివార్ కార్యక్రమాలు విరాట్ రూపాన్ని ధరించాయి. కార్యకర్తలు పెరిగారు. యజ్ఞాలు చేయగలవారి సంఖ్య మెల్లిమెల్లిగా పెరగటంతో మారుమూల గ్రామాలలో కూడా గాయత్రీయజ్ఞాల ప్రాభవం విస్తృతమైంది. 1985 వరకు ఈ శృంఖల అలా అలా పెరిగి పెద్దది కాసాగింది. మాస్టర్‌గారు కొంతమంది కార్యకర్తలకు ఉత్తరాలు వ్రాసి కార్యక్రమాలకు అవసరమైన ప్రేరణనిస్తుండేవారు. ఆ కాలంలో ఫోన్‌లు అందరికీ ఉండేవి కాదు. శ్రీ రామసుబ్బయ్య గారు వీలైనంతవరకు అందరికీ మాస్టర్‌గారిచ్చే కార్యక్రమముల ప్రణాళికలను ఉత్తరాల ద్వారా తెలుపుతుండేవారు. మరీ అత్యవసరమైతే గుంటూరు టెలిఫోను ఆఫీసులో పని చేస్తున్న మా చెల్లి శ్రీమతికృష్ణకుమారి ద్వారా సమాచారాన్ని ఆయా కార్యకర్తలకు అందజేస్తుండేవారు.

1985 వ సంవత్సరములో మాస్టర్‌గారు యు.ఎస్.ఎ అనే త్రిదివశీయ యజ్ఞకార్యక్రమాన్ని పరివార్ వాళ్ళకి అందించారు. ఇది 3 రోజుల పాటు జరిగే కార్యక్రమము. ఇందులో అఖండజపం, 3 రోజుల పాటు ఆరని అగ్నితో రెండు పూటలా యజ్ఞాలు జరిపే సాధనాశిబిరం. మొట్టమొదటగా ఈ కార్యక్రమాన్ని వేటపాలెంలో మా ఇంట్లో చేశారు. ఈ కార్యక్రమంలో చుట్టుప్రక్కల గ్రామాల వాళ్ళు పాల్గొన్నారు. అలా యు.యస్.ఎ కార్యక్రమాలు ఒంగోలులోను, ఆ తర్వాత చీరాలలోను జరిగాయి.

ఇంతకూ యు.యస్.ఎ అంటే ఏమిటో తెలుసా?

యు - అంటే ఉపాసన

యస్ - అంటే సాధన

ఎ - అంటే ఆరాధన

ఉపాసన, సాధన, ఆరాధన అనే సాధనా త్రిపుటిని వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు అందించారు.

**ఆధ్యాత్మిక జగత్తులో ఉపాసన, సాధన, ఆరాధన అనే త్రివేణి మానవజాతికి ఏమిస్తుంది?**

యు.ఎస్.ఏ కార్యక్రమం చేసేముందు మాస్టర్‌గారు ఎందుకీ కార్యక్రమం ఇవ్వబడింది? దీనివలన మానవజాతి పొందే లాభమేమిటి అనేదానికి చక్కటి వివరణను అందించారు. మానవుడు నిరంతరం ఉన్నతిని పొందుతూనే ఉండాలి. ఈనాడు మానవుడు భౌతికంగా ఎంతో ఉన్నతిని, అభివృద్ధిని సాధించాడు. కానీ వాటి వల్ల మనిషికి ఎటువంటి సుఖశాంతులు లభించటంలేదు. మనుషులను మంచి మనుషులుగా తయారుచేయడమనేది విజ్ఞానం వల్ల జరగదు. ఇది ఆధ్యాత్మికత వల్లనే సాధ్యం అని ఎప్పుడూ చెప్తుండేవారు.

**మనిషిని మనీషిగా తయారుచేసేదే నిజమైన ఆధ్యాత్మికత:** ఉపాసన-సాధన-ఆరాధన అనే త్రివేణిలో మునకలు వేస్తేనే మానవ జీవితం సఫలమౌతుంది.

ఈశ్వరుని దివ్యగుణాలను మన లోపల ధరించటమే ఉపాసన. దివ్య సిద్ధాంతాలను ఆధారంగా చేసుకుని కర్తవ్యాన్ని నిర్ణయించుకుని ఆ మార్గంలో ముందుకు సాగటం, ఎలాంటి ప్రలోభాలు పిలుస్తున్నా, ఆపదలు చుట్టుముట్టినా, స్థిరమైన మనస్సుతో కర్తవ్యాన్ని నిర్వహించటమే నిజమైన ఉపాసన.

సాధన అనేది వ్యక్తిగతమైనది. సాధన చేసేటప్పుడు సంయమనంతో శరీరాన్ని మనస్సును అదుపులో ఉంచుకోవాలి. ప్రతీక్షణం మన మీద మనం అంకుశాన్ని ప్రయోగించుకుంటూ నియమానుసారం జీవించడమే నిజమైన సాధన.

ఆరాధన అంటే సేవ. సర్వకాలసర్వావస్థలలోను ఇతరుల మంచిని కోరుకుంటూ పరులకు ఉపయోగపడే పనులు చేస్తూ సమాజ ఉన్నతికోసం గురుదేవులందించిన చిన్నచిన్న సత్సంగాల ద్వారా మనోవికాసాన్ని కలిగించాలి.

ఈ మూడు సాధించినవారే ఉన్నతిని పొంది స్వర్గీయ వాతావరణాన్ని నిర్మించగలుగుతారు. అందరికీ సుఖశాంతులు అందించగల్గుతారు. దీనికోసమే ఉపాసనలో మూడుమాలల జపం చేయమంటారు. సాధన అనేది రోజుకు 24 గంటలు చేస్తే చాలంటారు మాస్టారు. అసలు సాధన అంటే ఏ చిన్న పని చేసినా శ్రద్ధతో, నిష్ఠతో, తాదాత్మ్యతతో చేయడమే. ఆరాధనలో భాగంగా ప్రజ్ఞామండలి ద్వారా గురుదేవుల ప్రణాళికల నందించే ప్రక్రియలో భాగంగానే ఈ యు.ఎస్.ఎ కార్యప్రణాళికను అందించారు.

# II సాధన – సేవ

## అధ్యాయం-4
## సూక్ష్మీకరణ సాధన

ఈనాడు ప్రపంచం యావత్తు విజ్ఞానమయకోశము యొక్క పరిధిలో నడుస్తున్నది. శాస్త్రవేత్తలు చెప్పిందే సత్యం. శాస్త్రవేత్తలు ఆవగింజ నుంచి అంతరిక్షం వరకు ప్రతి చిన్న విషయం మీద ఎన్నో రకాల పరిశోధనలను ఆవిష్కరిస్తున్నారు. విద్య, వైద్య, ఆర్థిక మరియు వైజ్ఞానిక రంగాలలో అంతులేని రీతిలో నూతన విధానాలను ఆవిష్కరిస్తున్నారు. ఐతే దీనిని ఉపయోగించుకోవాలన్నా కూడా దానికి సంబంధించిన ధర్మాలను సూత్రాలను ఆచరించినప్పుడే అనుకున్న ఫలితాలు వస్తాయి. విద్యుత్తును ఉపయోగించుకోవాలంటే దాని ధర్మాలను, సూత్రాలను పాటించితీరాలి. అలానే అయస్కాంతక్షేత్రంలో ఆ విద్యుత్తు తరంగాలను ఉపయోగించుకోవాలంటే వాటి సూత్రాలను తెలుసుకొని పని ప్రారంభించాలి.

అలానే ఆధ్యాత్మికరంగంలో కూడా ఉన్నతమైన ఆధ్యాత్మిక లాభాలను పొంది విశ్వకళ్యాణము కొరకు వాటిని వినియోగించాలనుకునే మహనీయులకు కూడా కష్టతరమైన సాధనలను చేస్తేనే సత్ఫలితాలు వస్తాయి. ప్రస్తుత పరిస్థితులలో సమస్త విశ్వమూ పృథ్వీగ్రహ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో సంకట పరిస్థితులను ఎదుర్కొంటున్నది. దానిని సరిచేసి మానవజాతిని సవ్యమైన మార్గంలోకి తీసుకురావాలంటే చేయవలసిన ఉన్నతస్థాయి సాధనలను దాదాగురుదేవుల మార్గదర్శనంలో చేయడానికి పూజ్యగురుదేవులు సంసిద్ధులైనారు.

ఈనాడు ఎటు చూచినా పరిస్థితులు అస్తవ్యస్థంగా వినాశ, సంకటముల దిశగా ప్రవహిస్తున్న విషయం అందరికీ తెలిసినదే. సంకటాలనే రాక్షసులు గుంపులు గుంపులుగా వచ్చి ఎంతో శ్రమతో సాధించుకున్న సభ్యతను, సంస్కారాలను నాశనం చేస్తున్నాయి. వీటన్నింటినీ చూస్తుంటే ప్రళయం వస్తునట్లుగా తోస్తున్నది. దీనిని ఆపటం అత్యవసరం. దీనిని నిర్వీర్యం చెయ్యడం అనివార్యం. వ్యక్తిగత

స్వార్థం పెరిగి సామూహిక స్వార్థంగా మారి సామ్రాజ్యవాదం దోపిడి, దురాక్రమణలు జాతి వైషమ్యాలు, హత్యలు మానభంగాలు నేటి సమాజంలో విలయతాండవం చేస్తున్నాయి. అందువల్ల యుద్ధాలు జరగడం, దానివల్ల విపరీతమైన జననష్టం, ధననష్టం జరుగుతోంది. యుద్ధాల వల్ల ఇరుపక్షాలు నష్టపోవటమే కాక బలహీనమైపోతున్నాయి. ఇలాగే ఉంటే మానవజాతి మనుగడయే కష్టసాధ్యమైపోవచ్చు. యుద్ధోన్మాదం అనేది ఆత్మహత్యాసదృశం. ఉభయులలోను వివేకము ఉదయిస్తే చిన్న చిన్న తగాదాలను అక్కడికక్కడే పరిష్కరించి యుద్ధాలు రాకుండా నివారించుకోవచ్చు.

మానవునిలో ఉన్న సద్గుణాలు, శ్రమశీలత, తెలివితేటలను సృజన ప్రయోజనాలకు ఉపయోగించుకుంటే ఎన్నో సాధనాలను, సౌకర్యాలను ఏర్పాటుచేసుకోవచ్చు. మనిషి కూడా దేవత వలె ప్రసన్నంగా, సుసంస్కారంతో సర్వాంగసుందరంగా ఉండవచ్చు. సన్మార్గములో నడిచే మనుషులతో ఈ ధరిత్రి నిండితే అది స్వర్గతుల్యం కాకమానదు. ఇలాంటి పరిస్థితులను ఆవిష్కరింప చేయటానికై పూజ్యగురుదేవులు సాధన యొక్క పరాకాష్ఠయైన సూక్ష్మీకరణ సాధనకు సంసిద్ధులైనారు. అత్యంత కఠినతరమైన ఈ సాధన ద్వారా పృథ్విలో ఈనాడు ప్రళయతాండవం చేస్తున్న వినాశకర పరిస్థితులకు చరమగీతం పాడటం తథ్యమని గురుదేవులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈ ప్రపంచాన్ని సరిచేసి నిలబెట్టాలంటే మానవీయశక్తి చాలదు. దైవీశక్తి కావాలి. దానిని ఏవిధంగా జాగృతం చెయ్యాలి, ఏవిధంగా ఏకత్రితం చెయ్యాలి? దానిని మానవుల వెనుక పడేలా ఎలా చెయ్యాలి? ఇది చాలా పెద్దపని. అన్నింటికంటే పెద్ద సమస్య ఇక్కడ ఏమిటంటే సమర్థవంతులైన వారి ఆలోచనా సరళిని మార్చటం. ఈనాడు ధనవంతులు, రాజకీయనాయకులు, కళాకారులు, సాహితీవేత్తలందరూ తప్పు మార్గంలోనే ఉన్నారు. వీరిని స్వార్థం నుంచి పరమార్థం వైపుకు మార్చగల్గితే చక్కని సద్భావనలు, ఆనందాలు వెల్లివిరుస్తాయి.

ఈనాడు యుగపరివర్తన జరగాలంటే తపోబలంతోనే సాధ్యమౌతుంది. మానవశక్తులన్నింటిలో కుండలినీశక్తి స్థాయి చాలా ఉన్నతమైనది. జననేంద్రియములలో మూలాధారక్షేత్రంలో ఇది నివాసముంటుంది. సాధన ద్వారా ఈ శక్తి బ్రహ్మాండమంతా వ్యాపిస్తుంది. అసంఖ్యాకమైన మనుష్యుల మానసికస్థితిని ఇది మార్చివేయగలదు. యుగాన్ని మార్చివేయగలదు. విశ్వామిత్రుని వలె ఒక నూతన సృష్టిని చేయగలదు. పురాణ ఇతిహాసాలలో ఇలాంటి అనేక సందర్భాలెన్నింటినో మనం చదివియున్నాము.

## అసలు సూక్ష్మీకరణ సాధన ఎందుకు?

పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్యగారు 1984 నుంచి 1987 వసంతపంచమి వరకు దాదాగురుదేవుల నిర్దేశానుసారం వారి మార్గదర్శనంలో శాంతికుంజ్ ఆశ్రమంలో సూక్ష్మీకరణసాధన చేశారు. ఇక్కడ సాధనను గురించి కాస్త విచారణ చేయాలి. కుండలినీజాగరణ అంటే చేతన యొక్క అంతరాళాలలో దాగివున్న దివ్యశక్తుల జాగరణ, ప్రచండీకరణ. అది మూడు శరీరాలలో ఉన్న శక్తిని జాగృతపరచి విభిన్న ప్రయోజనాలకోసం వివిధరకాలుగా పనిచేయిస్తుంది. పరమపూజ్యగురుదేవులు ఈ సాధనలలో నిష్ణాతులై విశ్వకుండలినీ జాగరణను కూడా పూర్తిచేశారు.

స్థూలశరీరములోని కుండలినీ జాగరణ:– దీనినే షట్చక్రజాగరణ అని కూడా అంటారు. ఇది షట్చక్రాల ఆధారంగా జరుగుతుంది. స్థూలశరీరంలోని మేరుదండములో మూలాధారం నుండి సహస్రారకమలం వరకు దేవయానమార్గ మున్నది. దానిలో శక్తివంతమైన 6 చక్రాలు ఉ ంటాయి. వీటినే మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరకం, అనాహతం, విశుద్ధి, ఆజ్ఞ అని పిలుస్తారు. వీటి సిద్ధి వలన మనుష్యుడు శక్తివంతుడై సమృద్ధిగల ప్రచండ పరాక్రమాన్ని పొందుతాడు. దీనివలన సాధకుడు ఎంతో శక్తివంతుడౌతాడు. మన ఇంద్రియాలు బహిర్ముఖంగానే కాకుండా అంతర్ముఖంగా కూడా ఎన్నో పనులు చేస్తుంటాయి. చర్మచక్షువులతో చూడలేని వాటిని దివ్యచక్షువుల జాగరణతో చూడగలము. అన్ని ఇంద్రియాలకు ఇలాంటి సామర్థ్యం కలిగి దూరదృష్టి, దూరశ్రవణం, ఆలోచనలు పెరగడం, శక్తిపాతము, భవిష్యజ్ఞానం లాంటి స్థూలజగత్తుకు సంబంధించిన సిద్ధులు లభిస్తాయి.

## సూక్ష్మశరీరస్థిత కుండలినీ జాగరణ

ఇది పంచకోశాల ఆధారంతో జరుగుతుంది. చేతనకు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయకోశములనే 5 ఆవరణలు ఉంటాయి. అందులో పంచతత్త్వాలు, పంచప్రాణాలు వుంటాయి. వీటి సామర్థ్యాన్ని వికశింపజేసుకోవటంలో సాధకుడు అదృశ్యజగత్తుతో సంబంధాన్ని ఏర్పరచుకుంటాడు. సూక్ష్మశరీరంలో కుండలినీ జాగరణ జాగృతం కావటంతో సాధకునకు అదృశ్యజగత్తుతో పరిచయం కలుగుతుంది. అందులో నివశించే పితరులతో, దేవతలతో స్నేహసంబంధాలు కలిగి ఇచ్చిపుచ్చుకునే సామర్థ్యం పెరుగుతుంది. ప్రకృతిరహస్యాలు తెలిసిపోవటమే కాక భవిష్య సంఘటనలన్నీ దర్శనమౌతాయి. దాంతో అన్ని విషయాలు తెలుస్తాయి.

కాబట్టి ప్రణాళిక వేసుకొని అనుకూలత అనే లాభం పొంది ప్రతికూలతలను నివారించుకుని ముందుకు సాగిపోగల సామర్థ్యం కల్గుతుంది. అంతేకాకుండా ప్రజల మనస్సులలోకి అనుకూల భావాలను ప్రవేశపెట్టి జీవనప్రవాహ గతిని సవ్యమైన దిశకు మళ్ళించవచ్చు.

## కారణ శరీర స్థిత కుండలిని జాగరణ

వీనికి సంబంధించి మూడు ప్రయోగాలున్నాయి. వాటిని గ్రంథిభేదనము అంటారు. మస్తిష్కమునకు మధ్యలో 'బ్రహ్మగ్రంథి' ఉంది. దీనిని కైలాసపర్వతమని, క్షీరసాగరమని అంటారు. దీనిని బ్రహ్మాండీయ శక్తులను ఇచ్చిపుచ్చుకునే ధ్రువకేంద్రముగా గుర్తించాలి.

రెండవది హృదయంలో ఉన్న విష్ణుగ్రంథి. అది చేతన యొక్క అంతరాళములో ఉండే భావసంవేదనలకు కేంద్రము. తృప్తి, తుష్టి, శాంతి యిక్కడ లభిస్తాయి. ఉన్నతమైన ఆలోచనలు చేస్తూ ఇతరుల ఆలోచనలను సైతం మార్చగలిగే శక్తి ఈ గ్రంథి నుండి లభిస్తుంది.

**మూడవది రుద్రగ్రంథి:** ఇది నాభిచక్రంలో ఉంటుంది. శారీరిక సామర్థ్యం, ప్రతిభ, బుద్ధి సూక్ష్మత, ఉత్పాదన, అభివర్ధన మొదలగు శక్తులు ఈ క్షేత్రమునుండే లభిస్తాయి. మూలాధారచక్రము దీని గహ్వరములోనే వున్నది. కుండలినిశక్తి చిరవిశ్రాంతి తీసుకునే ప్రదేశము ఇదే. దీనిని ప్రాణాయామ ప్రహారములతో నిద్రలేపి బ్రహ్మలోకము వరకు నడిపించాలి.

మొత్తం మీద స్థూలశరీరంలోని 6 చక్రాలు, సూక్ష్మశరీరంలో పంచకోశాలు, కారణశరీరంలో మూడు గ్రంథులు కలిపి 14 అవుతాయి. ఇవే చతుర్దశ భువనాలు. ఊర్ధ్వలోకాలు ఏడు, అధోలోకాలు ఏడు. ఇందులో అభ్యుదయానికి ఏడు, దుష్టదమనానికి ఏడు హేతువులౌతాయి. మానవీయ శక్తి మహాసముద్రము వంటిది. దానిని త్రివిధ కుండలినీ సాధనల ద్వారా మథించాలి. నిజానికి మానవ శరీరాన్ని దైత్యులతోను, మనస్సును దేవతలతో పోల్చవచ్చు. శరీరము, మనస్సు ఈ రెండూ కలిసి తప-యోగముల యొక్క శాఖ-ప్రశాఖలను ఆలంబనగా చేసుకొని సాధనలో నిమగ్నమైతే ఈ 14 రత్నాలు సాధకునికి హస్తగతమౌతాయి. ఇదంతా కుండలినీ విజ్ఞానం గురించిన సంక్షిప్త వివరణ మాత్రమే. ఈమాత్రమైనా కుండలినీ విజ్ఞానమును గురించి మనం తెలుసుకోక పోతే, అర్థం చేసుకోలేకపోతే మున్ముందు మాస్టర్‌గారు స్వయంగా చేసిన ఈ సాధనలు, మనతో చేయించిన సాధనలను కొంచెమైనా అర్థం చేసుకోవడం కష్టం. దీని తరువాత తపస్సు, యోగము లంటే ఏమిటో తెలుసుకుందాము.

తప, యోగములను వివరించాలంటే.... తపస్సు అనేదానిని సాధారణ పరిభాషలో తపస్సు చేయటం అంటారు. ఇక్కడ యోగం రెండుగా విభజింపబడినది. ఒకటి బహిరంగయోగము రెండవది అంతరంగయోగము.

బహిరంగయోగములో శరీర సంచాలన కొరకు అనేక అభ్యాసాలు చేయవలసివుంటుంది. ఆసనాలు, ప్రాణాయామాలు, బంధాలు, ముద్రలు, జపము, హవనము, భజన, కీర్తనము మొదలైనవన్నీ బహిరంగ యోగములోకి వస్తాయి. వీటి విధానము చక్కగా సునియోజితంగా ఉంటుంది. విశేషమైన ఆరోగ్య సంవర్ధన, ప్రతిభా సంవర్ధన, బుద్ధికుశలత ఇవన్నీ శరీర అవయవాలకు సంబంధించిన సాధనలు. దీనితోపాటు చేసే క్రియాయోగం వల్ల అనేక ప్రయోజనాలతో పాటు మనస్సుకు కూడా కళ్ళెం వేయటం జరుగుతుంది.

పోతే రెండవపక్షం అంతరంగయోగానికి సంబంధించినది. ఇందులో చెల్లాచెదరైన మనస్సును, ప్రాణాన్ని తదేకనిష్ఠతో తయారుచేయటం జరుగుతుంది. కుసంస్కారాలు కడిగివేయబడతాయి. మనన, చింతనలలో ఉన్నతి కలుగుతుంది. ధ్యానం కూడా అంతరంగ సాధనలో ఒక భాగం. ఇక్కడ కాంతి మీద దృష్టిని నిలిపి భక్తిభావంతో కాంతికి దగ్గరకావటం జరుగుతుంది. ఇంక నాద యోగసాధన, ఖేచరీముద్రతో సోమరసం త్రాగి రసాస్వాదన చెయ్యటం మొదలైనవన్నీ ఈ సాధనలోకే వస్తాయి.

ఇలా పూజ్యగురుదేవులు ఏ సాధనలను చేసినా వాటిని ఎప్పటికప్పుడు అఖండజ్యోతి ద్వారా సాధకులకు అందిచేవారని మాస్టర్‌గారు చెప్తుండేవారు. అప్పటికే మాస్టర్‌గారికి ఒక కోర్‌గ్రూపు ఉండేది. శ్రీరత్నాకర్, శ్రీరఘుపతి, శ్రీ ఎన్.ఎల్.ఎన్ మూర్తి, శ్రీ డి.వి.యన్.విశ్వనాథ్‌గారు. ముఖ్యంగా శ్రీఅభిరామేశ్వరరావుగారు. మాస్టర్‌గారితో తెల్లవార్లు ఈ సాధనల గురించే మాట్లాడు కుంటూనే వుండేవారమని విశ్వనాథంగారు చెప్పారు. ఆధ్యాత్మిక విషయములు తప్ప మరే విషయములు వారి సంభాషణలోకి వచ్చేవి కాదు. గురుదేవుల సాహిత్యం అఖండజ్యోతిలోని విషయాలతో పాటుగా ఎలిస్.ఎ.బెయిలీ, అయిన్‌రాండ్ వంటి వాళ్ళ రచనలపై కూడా వారి సంభాషణలు సాగేవి. గురుదేవులు సూక్ష్మీకరణ సాధన చేస్తున్న సమయంలోనే హిందీనుండి తెలుగులోకి 'కల్పసాధన' అనే సాధనాత్మక గ్రంథం వెలువడింది. ఈ పుస్తకాన్ని పూజ్యశ్రీ మాస్టర్‌గారు హిందీ నుండి ఆంగ్లంలోకి అనువదిస్తే, తెలుగులోకి శ్రీ డి.వి.యన్.బి.విశ్వనాథంగారు అనువదించారు.

శ్రీ సీతారాంగారు దాన్ని ముద్రణ చేయించారు. అదొక అద్భుతమైన సాధనాత్మక గ్రంథం. అందులో ఇవ్వబడిన సాధనలను లేఖలరూపంలో మాస్టర్‌గారు చెప్తుంటే రామసుబ్బయ్యగారు తెలుగులో వ్రాసుకొని, దాని కాపీలను గ్రామానికొకటి పంపారు. అది మరో మూడు గ్రామాలకు చేతిరాతితో వ్రాసి టపాలో పంపేవారు. అది ఒక సాధన. అలా వ్రాయటం వల్ల అందులో వుండే విషయం హృదయానికి ఎంతగానో హత్తుకుపోయేది. అలా పదిమంది నుంచి వందమందికి విషయం వెళ్ళిపోయేది. అందులో ఇవ్వబడిన సాధనలను తు.చ.తప్పకుండా చేస్తూండేవారు.

మాస్టర్‌గారి నుంచి ఉత్తరం వచ్చింది అంటే అది మహద్భాగ్యమే. దానిని ఒకటికి పదిసార్లు చదువుకొని సత్సంగాలు పెట్టుకొని అందరికీ అందులో విషయాలు తెలియపరచడం, సాధనలు చేయించటం చేసేవాళ్ళం. అలా సూక్ష్మీకరణసాధనలో ఇవ్వబడిన కొన్ని బహిరంగ సాధనలను ఎందరో సాధకుల చేత మాస్టర్‌గారు కేవలం ఒక ఉత్తరం ద్వారా, సాధనా శిబిరాల ద్వారా చేయించేవారు. గురుదేవులు చేయించిన ప్రాణప్రత్యావర్తన శిబిరంలో మాస్టర్‌గారు అనేక సాధనల పైన విశిష్టమైన పట్టు సాధించి ఉండటం వల్ల వాటిని ఎంతో వివరంగా సాధన చేయటానికి అనువుగా, సరళంగా సాధకులకు అందించేవారు.

దివ్యాత్మ స్వరూపులైన మాస్టర్‌గారు సందర్భం వచ్చినప్పుడల్లా కొన్ని కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలను చెప్పీచెప్పనట్లుగా బయటపెడుతుండేవారు. పూజ్యగురుదేవులతో వారికున్న అనుబంధం కేవలం భౌతికమైనది కానేకాదు.

గురుదేవులు సూక్ష్మీకరణ సాధన చేస్తున్న కాలంలో మాస్టర్‌గారు తాను స్వయంగా సాధన చేస్తూ కూడా గురుదేవుల ప్రణాళికలోని భాగంగా ప్రతి ఆదివారం ఉదయాన్నే ఎంతో ట్రిమ్‌గా తయారయ్యేవారు. ఆ తరువాత రామసుబ్బయ్యగారు, మాస్టర్‌గారు ఇద్దరూ కలిసి బయటకు వెళ్ళి "21 వశతాబ్ది–ఉజ్జ్వలభవిష్యత్తు" కరపత్రాలను బస్టాండ్‌ల్లోను, రైల్వేస్టేషన్‌లలోనూ వేలసంఖ్యలో పంచిపెట్టేవారు. అదీ మాస్టారికున్న గురుభక్తికి ఒక మచ్చుతునక. ఒకొక్కవారం ఒకొక్క ఊరికి వెళ్ళి యజ్ఞాలు చెయ్యటం ద్వారా ప్రచారం చేయిస్తూండేవారు. అంతేకాకుండా గుంటూరు, పట్టాభిపురం ఇంట్లో ఉన్న రోజుల్లో ప్రతిరోజు 108 ఆహుతులతో సంవత్సరం పాటు శ్రీవిశ్వనాథ్, రామసుబ్బయ్యగార్లతో ఒక విశేష ప్రయోజనం కొరకు రెండుపూటలా గాయత్రీయజ్ఞాలు చేయించారు.

మాస్టారికీ వారి గురువుగారికి మధ్యనగల ఆత్మీయత, శ్రద్ధ ఎలాంటివంటే వారెంత దూరంలో ఉన్నా లోతైన వారి అనుబంధం వల్ల వారు అతి దగ్గరగా ఉన్నట్లుగానే అనుభూతి చెందేవారు. జన్మజన్మాంతరాలనుండీ పాత్రతను పెంచుకుంటూ భౌతిక లాభాలు, స్వసుఖాపేక్ష అనేదే లేకుండా ఆత్మకళ్యాణంతో పాటు విశ్వశ్రేయస్సుకు సమర్పితుడైన మహాత్ములు మన మాస్టర్‌గారు.

**ఆనాడు శాంతికుంజ్‌లో గురుదీక్షను అంటే ప్రాణప్రత్యావర్తన దీక్షను స్వీకరించిన నాటినుండి మాస్టర్‌గారు గురుదేవులిచ్చే అనుదానాలను పొందేందుకు అవసరమైన కర్తవ్యములను పాటిస్తూ వుండేవారు. ఎంత ఉదారంగా గురుదీక్ష ఇవ్వబడుతుందో అంత ఉదారంగాను గురుదక్షిణ ఇవ్వాలి. బీజారోపణ గురుదీక్ష అయితే దానికి ఎరువు వేసి, నీరు పోసి పెంచడమనేది గురుదక్షిణ. లోకాచారం ప్రకారం శిష్యుడు నిరంతర సాధనారతుడై ఉంటే కనుక గురువు యొక్క శక్తి ఒక నియమితరీతిలో శిష్యునిలో ప్రాణసంచారము చేయగలుగుతుంది. ప్రాణ సంచారము కొరకు గురు-శిష్యులు ఒక దగ్గరే ఉండనవసరము లేదు. సద్గురువు దూరంగా ఉన్నా శిష్యుని పాత్రతను బట్టి ప్రాణసంపదను ప్రాణశక్తిని నిరంతరము అందజేస్తూనే వుంటాడు. అలాంటి నియతిని పాటించిన మన మాస్టర్‌గారు గురుదేవుల సాధనాసంపత్తిలోనేకాక వారి యొక్క మహత్తర ప్రణాళికలో భాగస్వాములైనారు. అందుకే గురుదేవులు "రామకృష్ణా! కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు గల భరతఖండానికి గుంటూరు ధృవకేంద్రం కాబోతోంది. నువ్వు గుంటూరు వదలకు" అని కూడా సందేశం ఇచ్చారు.** అందుకే **మాస్టర్‌గారి** ఉద్యోగం కూడా ఎలాంటి బదిలీలు లేని ప్రైవేటు కాలేజీలో కెమిస్ట్రీ అధ్యాపకులుగా గుంటూరులో వచ్చిందేమో!

శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు సూక్ష్మీకరణ సాధన చేస్తున్న కాలంలో మాస్టర్‌గారు కూడా గుప్తంగా అతి రహస్యమయ సాధనల నెన్నింటినో చేసేవారు. అందులో భాగంగానే బహిరంగ యోగంలోని భాగాలైన ఆసనాలు, ప్రాణాయామాలు, బంధాలు, ముద్రలు మొదలగువాటి గురించిన వివరణతో సాధనలను ఉత్తరాల ద్వారా పంపిస్తుండేవారు. ఈకాలంలోనే గురుదేవుల ఆత్మకథను మాస్టర్‌గారే అనువదించారు. అలానే మాస్టర్‌గారి స్ఫూర్తితో, పరదేవతా అనుగ్రహంతో గాయత్రీ మహావిజ్ఞానం(3వ.భాగం ), సూర్యవిజ్ఞాన్, కుండలిని మహావిజ్ఞాన్ మొదలగు గురుదేవుల రచనలను శ్రీడి.వి.యన్.బి విశ్వనాథంగారు అనువదించి ఆంధ్రావనికి అందించారు. ఈ మూడు పుస్తకములు సూక్ష్మీకరణ సాధనకు అనుబంధ గ్రంథాలు. ఈ పుస్తకములు సూక్ష్మీకరణ సాధనకు సంబంధించిన

జ్ఞానవిజ్ఞానాలకు పరాకాష్ఠవంటివి. ఇవి జీవించే దేవతామూర్తులని చెప్పటంలో కించిత్ అతిశయోక్తి కూడా లేదు. జీవితంలో వాటిని చదవడమే కాదు అధ్యయనం కూడా చెయ్యాలి. వాటి ఉపాసన, సాధన చెయ్యాలి. అనంతరం వాటిని ఆరాధనలో భాగంగా ప్రపంచానికి అందించాలి. అందుకే మాస్టర్‌గారు ఈ మూడు పుస్తకాల మీద అనేక ప్రాంతాలలో అద్భుతమైన ప్రసంగాలనిస్తూ సాధనలను చేయించారు.

## సూక్ష్మీకరణ తరువాత గురుదేవుల దర్శనం

పూజ్య గురుదేవులు వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత శ్రీరామశర్మఆచార్య గురుదేవులు 1984 నుంచి 1987 వరకు సూక్ష్మీకరణ సాధన చేశారు. దాదాగురుదేవుల ఆదేశాల మేరకు ఈ విశిష్టమైన ఆధ్యాత్మిక కుండలినీ సాధనను కఠోరమైన నియమనిష్ఠలతో పూజ్య గురుదేవులు అత్యంత విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాలలోను 108 కుండీల యజ్ఞాలను చేయాలని మాతాజీ లేఖ ద్వారా సందేశం పంపించారు.

1987 వ సంవత్సరములో పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్యగారి యొక్క సూక్ష్మీకరణ సాధనా పూర్ణాహుతిగా అష్టోత్తరశతకుండీయ గాయత్రీ మహా యజ్ఞాలను శ్రీరామకృష్ణమాస్టర్‌గారి ఆధ్వర్యంలో వేటపాలెం, ఒంగోలు, గూడూరు, మదనపల్లి మొదలైన అనేక ప్రాంతాలలో శ్రీయుతులు రామసుబ్బయ్యగారు, రత్నాకర్‌గారు, బి.సత్యనారాయణరావుగారు, ఎ.సీతారాం గార్లు మాత్రమే కాక మరికొంత మంది కార్యకర్తల సహకారంతో దిగ్విజయంగా నిర్వహించటం జరిగింది.

1987 మే నెలలో పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్యగారి సూక్ష్మీకరణ సాధనానంతరం అందరికీ దర్శనాలను, పాదస్పర్శను యిస్తున్నారని తెలిసింది. అంతే మాస్టర్‌గారు గురుదేవుల దర్శనం కోసం హరిద్వార్‌కు బయల్దేరారు. ఈసారి మాస్టారితో పాటు సుమారు 40 మంది హరిద్వార్ శాంతికుంజ్ ఆశ్రమానికి వెళ్ళాం. జీవితంలో మరిచిపోలేని శుభఘడియలవి. ఒక అద్భుతమైన విశిష్ట సాధన తరువాత మాతాజీ, గురుదేవులను దర్శించుకోవటమనేది పూర్వజన్మల సుకృతం. మాస్టర్‌గారు అందరికీ మాతాజీ, గురుదేవుల దివ్యదర్శనం, చరణస్పర్శను యిప్పించి ధన్యులను చేశారు. గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, బ్రహ్మవర్చస్‌శోధ్ సంస్థాన్‌లన్నింటిని చూపిస్తూ వాటి ప్రత్యేకతలను, ప్రాధాన్యతలను ఎంతో అద్భుతంగా, మరిచిపోలేని రీతిలో వాటిపై

సమగ్రమైన అవగాహనను కలుగజేశారు. మాస్టర్‌గారితో హరిద్వార్ వెళ్ళినవారి అదృష్టం గురించి ఎంతని చెప్పాలి? ఏమని చెప్పాలి ? వారికది జీవితంలో మరుపురాని మధురానుభూతి మరి !

మాస్టర్‌గారితో పాటు గురువుగారిని చూడటానికి వెళ్ళినవారందరూ కూడా అక్కడ నవదివశీయ సాధనాశిబిరంలో పాల్గొన్నారు. ప్రతిరోజు ప్రాత:కాల సాధనానంతరం యజ్ఞం అయిపోయాక మాతాజీ, గురుదేవుల దర్శనార్థం అందరూ మౌనంగా 'Q' లో వెళ్ళి మాతాజీ, అఖండజ్యోతి దర్శనం అయ్యాక 3 వ అంతస్తులో ఉన్న గురుదేవుల దర్శనానికి వెళ్ళాలి. అక్కడ గురుదేవులు ఒక గదిలో కూర్చుని మేజాబల్ల మీద పుస్తకాలు పెట్టుకొని తదేకంగా వ్రాసుకుంటుంటారు. దర్శనార్థం వెళ్ళినవారు కటకటాల్లో నుండి దూరంగా ఉన్న గురుదేవుల్ని దర్శించుకొని వెళ్ళిపోవాలి. గురుదేవులు అలా వ్రాస్తు వ్రాస్తూ మధ్యమధ్యలో తల ఎత్తి వచ్చినవాళ్ళ వంక చూస్తుండేవారు. అలా వారి దృష్టికి వెళ్ళినవారు తమ జీవితాలు ధన్యమైపోయినట్లు ఆనందపడిపోయేవాళ్ళు.

దర్శనం చేసుకోవాలని ఆత్రంగా అందరం పైకి వెళ్ళాము. కటకటాల్లోంచి దూరంగా ఉన్న గురుదేవుల వంక చూశాం. లీలగా మాత్రమే కన్పించారు. దర్శనానికి వెళ్ళిన 4, 5 రోజులూ అలానే కన్పించారు. ఏమిటి! మాలో ఏదైనా దోషం ఉన్నదా? ఎందుకు గురుదేవుల రూపం పరిపూర్ణంగా కనిపించడంలేదనే తపన అందరిలో బయల్దేరింది. ఈ విషయాన్ని సరాసరి మాస్టర్‌గారినే అడిగాం. దానికి వారు చెప్పిన సమాధానం ఏమిటంటే గురుదేవులు చేసిన సూక్ష్మీకరణ సాధన అతి తీవ్రమైనది. అత్యంత శక్తివంతమైనది కూడా. ఆయన మనకు సరిగ్గా ఎందుకు కనపడటం లేదు అంటే మన అన్నమయకోశం పరిశుభ్రంగా లేదు. ఈ 9 రోజులూ మనం ఇక్కడ మాతాజీ పెట్టిన భోజనం తింటే మన అన్నమయకోశం శుభ్రపడుతుంది. అప్పుడే మన దృష్టికి గురుదేవుల రూపం కనబడుతుందని చెప్పారు. త్వరలోనే మీకు గురుదేవులు దివ్యస్వరూప దర్శనం అవుతుందని చెప్పారు. నిజంగా అలానే జరిగింది. ఒకరోజు మాస్టర్‌గారిని మాకు గురుదేవుల స్పర్శ భాగ్యాన్నీ కలిగించండని అడిగాము. మాతాజీతో మాట్లాడి చెప్తానన్నారు. వందనీయ మాతాజీ 'రామకృష్ణా! ఎల్లుండి మీకు గురుదేవులు పాదస్పర్శ ఇస్తారు' అని చెప్పటంతో అందరి హృదయాలు తేలికపడ్డాయి. వెళ్ళిన 7వ రోజున అక్కడికి వెళ్ళిన వారికందరికీ పూజ్య గురుదేవుల, మాతాజీల చరణస్పర్శ, ఆశీస్సులు లభించాయి.

తర్వాత ఒక విశేషమైన సంభాషణలో మాస్టర్‌గారు 'సూక్ష్మీకరణ సాధనలో గురుదేవులు–ఒక విశిష్ట ప్రయోజనార్థం ఐదు శరీరాలుగా మారిపోయారు. దీనినే పంచకోశసాధన అంటారు. ఒక్కొక్క శరీరం ఒక్కొక్క ప్రత్యేకమైన సాధనా కక్ష్యలో తత్సంబంధమైన పనిలో నిమగ్నమై వుంటుంది. దర్శనార్థం గురుదేవులు బయటకు వచ్చినప్పుడు ఆ ఐదు శరీరాలు సమీకృతమై ఏకమాత్ర రూపంగా వ్యక్తమైంది' అని చెప్పారు. అద్భుతమైన సాధనా రహస్యం అది. అలాంటి మహత్తరమైన రహస్యాలను ఆ దివ్యాత్మ తప్ప మరింకెవరు చెప్పగలరు? అలా మరికొన్ని విషయాలు చెప్పారు. గురుదేవులు మధురను వదలి హరిద్వార్‌కు వచ్చి శాంతికుంజ్ నిర్మాణాన్ని కొంతవరకు చేసి దాదాగురుదేవుల ఆదేశాలతో హిమాలయాలకు వెళ్ళారు.

## మందిర నిర్మాణాలకు మార్గదర్శనం

1983 లో ఒకసారి మాస్టర్‌గారు ఒంగోలుకు వచ్చారు. శ్రీ చిదంబరశాస్త్రిగారు ఆంజనేయ స్వామి ఉపాసకులు. వారు మాస్టర్‌గారిని కలిసి 'మాస్టారూ ఒంగోలు సుందరనగరంలో పంచముఖీ ఆంజనేయస్వామి దేవాలయం కట్టాలనే సంకల్పం కల్గింది. స్థలం కూడా నిర్ణయమైనది. అక్కడ దేవాలయ నిర్మాణం చేయాలంటే స్థలశుద్ధి కొరకు దానిని శక్తివంతం చేయటానికిగాను ఏమి చెయ్యమంటారు' అని అడిగారు.

### పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

శ్రీచిదంబరశాస్త్రిగారు అడిగినదానికి మాస్టర్‌గారు ఒక విశేషమైన సాధనా విధానాన్ని వివరించారు. ఈ ఆలయ నిర్మాణార్థం 40 రోజులలో గాయత్రీ మంత్రం 8 లక్షల చొప్పున 3 విడతలుగా మంత్రజపం చేయాలి. ఆ జపం కేవలం ఒంగోలు పరివార్ మాత్రమే కాకుండా ఎవరు ఎక్కడున్నా సరే సంకల్పంలో 'పంచముఖీ ఆంజనేయ మందిర నిర్మాణార్థం' అని చెప్పుకొని 40 రోజుల పాటు జపం చేయాలి. ఎవరెంత జపం చెయ్యాలనేది కూడా లెక్కవేసి, ఎంతమంది నిష్ఠతో చేయగలరో వాళ్ళందరి చిరునామాలు సేకరించి జపాలు ప్రారంభించాలనీ, 40 రోజులలో 8 లక్షల జపం పూర్తి అయిన తరువాత వచ్చే పూర్ణిమనాడు ఏ స్థలంలోనైతే దేవాలయం కట్టాలనుకున్నారో ఆ ప్రదేశంలో ఈ సాధన చేసినవారి చేత 108 కుండీలతో గాయత్రీ మహాయజ్ఞం, పూర్ణాహుతీ జరగాలనీ చెప్పారు. అలాంటి సాధనా పూర్ణాహుతి మూడు పూర్ణిమలకు 3 సార్లు అదే ప్రదేశములో చెయ్యాలని చెప్పారు. తరువాత ప్రతిరోజూ సాయంత్రం వీలైనంతమంది వెళ్ళి

1 గంట జపం చేసి గాయత్రీమాతకు హారతిచ్చి, చాలీసా పారాయణ చేయాలని చెప్పారు. గుంటూరు, ఒంగోలు, వేటపాలెంవారు జపాలు చేశారు. అత్యంత నియమంతో జపాలు చేసినవారు మాత్రమే వచ్చి పూర్ణాహుతిలో పాల్గొనాలని చెప్పారు. ఆ యజ్ఞం కూడా తెల్లవారుజామున 5 గంటలకే ప్రారంభించాలని చెప్పారు. సూర్యోదయానికి పూర్వం చేసే యజ్ఞానికి విశిష్టమైన ఫలితాలు లభిస్తాయి.

మాస్టర్‌గారిచ్చిన నిర్దేశాల ప్రకారం రెండుసార్లు అనుష్ఠానాలు చేసి 2 పూర్ణిమలకు పూర్ణాహుతి చేయించారు. మూడోసారి పూర్ణాహుతి 'మహాశివరాత్రి'కి ఏర్పాటుచేశారు. ముందురోజు నుండి అక్కడ జపాలు ప్రారంభించారు. ఈ పూర్ణాహుతికి మాస్టర్‌గారు, చెల్లెలు లక్ష్మీసుందరి, తమ్ముడు విశ్వనాథ్ మొదలైనవారంతా వచ్చారు. మహాశివరాత్రి జాగరణకు కాసేపు జపాలు, కాసేపు భజనలు చేశారు. ఈ భజనలను లక్ష్మీసుందరి, విశ్వనాథ్‌గార్లు ఎంతో అద్భుతంగా చేయించారు. ఆ తరువాత కాసేపు ప్రవచనాలు చెప్పారు. శ్రీకామరాజుగారు, రత్నాకర్‌గారు, రామసుబ్బయ్యగార్లు గాయత్రీ వైశిష్ట్యాన్ని గురించి చాలా బాగా చెప్పారు.

తర్వాత కాలక్రమంలో దేవాలయ నిర్మాణం జరిగినది. పంచముఖఆంజనేయస్వామివారికి ప్రధాన మందిరం, దాని వెనుక వివిధ ఆకారములలో 8 హనుమత్ మందిరాలను విశేషంగా నిర్మించారు. ఆ తర్వాత పంచముఖీగాయత్రీమాత మందిరం ప్రక్కనే రాఘవేంద్రస్వామి మందిరం కూడా నిర్మించటం జరిగినది. ఈనాడు ఆ మందిరం ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకున్నది. పంచముఖఆంజనేయస్వామి ప్రదక్షిణ, సింధూరపూజలు ఇక్కడి విశిష్టతలు. ఇంకా అనేకరకాలైన అర్చనలు, సేవలు, ఉత్సవాలు, కళ్యాణాలు ఎప్పుడూ ఏవో జరుగుతూనే ఉంటాయి.

అలాగే ఇక్కడ పంచముఖీగాయత్రీమాత మందిరంతో పాటు శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయ నిర్మాణము కూడా జరిగింది. ప్రతీ పూర్ణిమకు గాయత్రీ యజ్ఞం చేస్తారు. అలా ఆ దేవాలయాల శోభ, వైభవం చెప్పనలవికాదు. అలాగే ఒంగోలులోని లాయరుపేటలో గాయత్రీమాత మందిర నిర్మాణం కూడా మాస్టర్‌గారి ఆధ్వర్యంలోనే జరిగింది. ఏ మందిరం నిర్మించాలన్నా ముందు ఆ స్థలంలో ఉండే దివ్యశక్తి ఆవిర్భావానికై జపశక్తి చాలా అవసరం. అందుచేత ముందుగా ఆ స్థలవైభవాన్ని జాగృతం చేయటానికి తప్పనిసరిగా మాస్టర్‌గారు లక్షల సంఖ్యలో జపాలు చేయించే వారు.

హరిద్వార్‌లో గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్ నిర్మాణానికి ముందు గురుదేవులు విశ్వామిత్రుని తపఃస్థలిలో ఒక చిన్న పర్ణశాల ఏర్పాటుచేసి మాతాజీని, ఆమెకు సాయంగా ఒక 5,6 మంది దేవకన్యలను, మరొక వ్యక్తిని అక్కడ ఉంచి హిమాలయాలకు వెళ్ళారు. అప్పుడు ఆ స్థలంలో నరసంచారమనేది ఉండేది కాదు. ఏ చిన్న వస్తువు కావాలన్నా హరిద్వార్ వెళ్ళవలసివచ్చేది. అలాంటి పరిస్థితులలో కూడా సాక్షాత్ దుర్గాదేవి అవతారమైన మాతాజీ పూజ్య గురుదేవుల యొక్క ఆదర్శగృహిణిగా ఆ స్థలంలో ఉన్న దైవీచేతనత్వాన్ని జాగృతం చేయటానికి తను, తనతో పాటుగా ఉన్న ఆ దేవకన్యలతో కలిసి 24 లక్షల గాయత్రీమంత్ర జపం చేయటం జరిగింది. తద్వారా విశ్వామిత్రుని తపఃస్థలిలో శక్తి జాగృతమైంది. ఆ తరువాత గురుదేవులు వచ్చారు. వారు వచ్చిన తరువాతనే గాయత్రీతీర్థ్, శాంతికుంజ్ నిర్మాణాలు జరిగాయి. గుంటూరులో సప్తర్షి ఆశ్రమ నిర్మాణానికి ముందు కూడా మాస్టారు ఆ స్థలంలో లక్షల సంఖ్యలో జపాలు చేయించారు. రకరకాల సాధనలు చేయించారు. ఇదంతా జరిగిన తరువాతనే ఆశ్రమ నిర్మాణం చేయటం జరిగింది. (గురువుగారి 24 లక్షలసాధన, 24 సంవత్సరాలు అదే సాధనను మాతాజీ ఆరుమంది దేవకన్యలతో కలిసి ఆరుసంవత్సరాలలో పూర్తి చేసి గాయత్రీతీర్థ్, శాంతికుంజ్ నిర్మాణాలకు వినియోగించారని గురుదేవులే స్వయంగా చెప్పారు.)

అంతేకాకుండా వారు **'మీకు ఎప్పుడు ఎక్కడ ఏ గురువులు కనిపించినా, వారి ప్రవచనాలు, సాధనలనేవి తటస్థపడినా ఆ అవకాశాలను వదులుకోకండి. వచ్చిన ప్రతి అవకాశం మనకు భగవంతుడిచ్చిన వరంగా స్వీకరించి సాధన చెయ్యండి. ఈ ప్రపంచంలో మనం నేర్చుకునేందుకే జన్మించామనే విషయం మర్చిపోయి ప్రవర్తించకండి'** అని చెప్తుండేవారు.

వారి జీవితంలో కూడా ఈ ప్రమాణాన్ని తు.చ తప్పకుండా పాటించేవారు. ఏ సంస్థలో ఎక్కడ, ఎవరు, ఏం చెప్తున్నా వెళ్ళి సావకాశంగా, శ్రద్ధగా విని ఆ జ్ఞానాన్ని తమ సొంతం చేసుకునేవారు. వారితో కలిసి ఆ సాధనలు శ్రద్ధగా, నిష్ఠతో చేసేవారు. వారి సాహిత్యాన్ని ఔపోసన పట్టిందాకా ఊరుకునేవారుకారు. అంతేకాదు ఆ సంస్థలతో చక్కటి అనుబంధాన్ని కూడా ఏర్పాటు చేసుకునేవారు. తాము పొందిన జ్ఞానాన్ని ఆ సంస్థలకు వెళ్ళి ప్రవచనాలుగా చెప్పి అందరి మన్ననలను పొందేవారు. ఇంత చేస్తున్నా వారిలో అతిశయం కానీ, భేషజాలు కానీ కనిపించేవి కావు. గొడ్డలిలాంటి సమస్యలు వచ్చినా గోటితో తీసిపారేసేవారు. ఎప్పుడూ "Nature Is Always Right' అంటూ అన్నీ తక్షణమే ఆచరించాలి అని చెప్తుండేవారు.

## భవిష్య ప్రణాళికలు

పూజ్యగురుదేవులచే అందించబడుతున్న సాధనలను ఆంధ్రప్రదేశ్ పరివారానికి అందించాలి. పరివారానికి ఉన్నతస్థాయిలో ఆధ్యాత్మిక మార్గదర్శనం చెయ్యాలి. దానికొరకు మాస్టర్‌గారు ఆత్యాయిక పరిస్థితి మాదిరిగా1989 డిసెంబరు నెల చివరి వారంలో భవిష్య కార్యక్రమాలకు నాందిగా ఒక విశేషమైన బీజారోపణ కార్యక్రమాన్ని "శ్రీరామకృష్ణ మిషన్ స్కూల్" ఒంగోలులో ఏకదివశీయ సాధనాశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పూజ్యగురుదేవుల ఆత్మకథను సాధనగా మొట్టమొదటిసారిగా వివరించారు. ఈ శిబిరాన్ని శ్రీలక్ష్మీనారాయణదంపతులు అత్యంత శ్రద్ధాభక్తులతో నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్నవారందరూ ఒక అలౌకిక దివ్యానుభూతి పొందారు. ఆ అనుభూతిని మళ్ళీ మళ్ళీ పొందాలనే తపన ప్రతీవారిలో కలిగింది. గురుదేవుల అనుగ్రహం వుంటే త్వరలోనే అందరి కోరిక తీరుతుందని ఆక్షణంలో అందరికీ అనిపించింది. ఒకరకమైన దివ్యస్ఫూర్తి, ప్రేరణతో నాకు–మావారికి శ్రీశైలంలో జనవరిలో ఇలాగే సాధనాశిబిరం పెట్టాలనే సంకల్పం కలిగింది. వెంటనే పూజ్యశ్రీ మాస్టర్‌గారికి మా మనస్సులో మాట చెప్పగా, తక్షణమే వారినుండి అనుమతి లభించింది. శిబిరం ముగించటానికి ముందరే ఈ విషయాన్ని సభాముఖంగా ప్రకటించారు. అతి త్వరలోనే మళ్ళీ అందరూ మాస్టర్‌గారి ప్రవచనామృతపానం చేయవచ్చుగదా అని ఆనందించారు.

అప్పట్లో మేము మార్కాపురంలో ఉద్యోగం చేస్తుండేవాళ్ళం. అందుచేత శ్రీశైలం అక్కడకు దగ్గరేకాక, అది మహాకాలక్షేత్రం మరియు అద్భుతమైన పుణ్యక్షేత్రం. సాధనకు ఎంతో అనుకూలమైన ప్రదేశం. అంతేకాక మార్కాపురంలో అప్పటికే గాయత్రీ పరివారం ఏర్పడివున్నది. వాళ్ళు ఈ సంగతి విని చాలా ఆనందించారు. అందరి సహకారంతో కరివెనవారి సత్రంలో సాధనాశిబిరానికి అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి.

## శ్రీశైలంలో సాధనా శిబిరం

నూతనసంవత్సరం 1990 జనవరి 12, 13 ,14, 15 తేదీలలో కార్యక్రమానికి కావలసిన అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. పూజ్యశ్రీ మాస్టర్‌గారికి కూడా ఇక్కడ సాధనాశిబిరం పెట్టడం చాలా సంతోషాన్ని కలిగించింది. శ్రీశైలంలో సాధనాశిబిరం అనగానే అందరికీ రెట్టింపు ఉత్సాహం వచ్చేసింది. అందులోనూ అవి పర్వదినాలు – భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ

రోజున కూడా శిబిరం జరుగుతుంది. శ్రీశైల మల్లేశ్వరస్వామిది జ్యోతిర్లింగము. భ్రమరాంబాదేవిది శక్తిపీఠము. సాక్షాత్ మహాశివుని జ్యోతిర్లింగము, అమ్మ భ్రమరాంబ శక్తిపీఠములతో పాటు ఆది శంకరులు స్థాపించిన శ్రీచక్రం ఈ క్షేత్రంలో వున్నది. అంతటి దివ్యమైన పవిత్ర పుణ్యస్థలంలో జరుగుతున్న సాధనాశిబిరానికి అన్ని ఊళ్ళ నుండీ అనుకున్న సమయానికి సాధకులందరూ వచ్చేశారు. ఎంతో ఆహ్లాదకరంగా, రమణీయంగా ఉన్న ఆ పుణ్యక్షేత్రాన్ని చూస్తూనే ఆనందంతో తలమునకలయ్యారు.

**శిబిరాన్ని ప్రారంభించటానికి కాస్త ముందుగా పూజ్యశ్రీ మాస్టర్‌గారు నన్ను పిలిచి 'చూడమ్మా! ఈ శిబిరం నికట భవిష్యత్తుకు ఒక మైలురాయి లాంటిది. ఇందులో మీరు చేసే ప్రతీ పనీ, ఖర్చుపెట్టే ప్రతీపైసా భవిష్యత్తులో కోట్లాదిరూపాయిలుగా విస్తృతి చెందుతుంది. కాబట్టి అవసరాన్ని బట్టి ఖర్చు చెయ్యండి' అని హెచ్చరించారు. మాస్టర్‌గారు చెప్పిన ప్రతీ మాటనూ ఎంతో శ్రద్ధగా విని పదిలంగా హృదయంలో దాచుకుని ఆచరించటానికి ప్రయత్నించాను.**

ఆ సాధనాశిబిరాన్ని నాలుగు హిమాలయయాత్రలు అన్న పేరుతో ప్రారంభించారు. సాధానా శిబిరం ప్రారంభించటానికి ముందు ప్రత్యేకంగా ఒక గదిలో గురుదేవుల, మాతాజీల మరియు గాయత్రీమాతల చిత్రపటాలను అందంగా వేదిక మీద అలంకరించి అనంతరం మాస్టర్‌గారే ఒక ప్రక్కన అఖండజ్యోతిని వెలిగించి గాయత్రీజపాన్ని ప్రారంభించారు. ఇంక ఆక్షణం నుంచీ సాధన జరుగుతున్న 4 రోజులూ అఖండజపం జరగాలని చెప్తూ ఆ బాధ్యతను శ్రీసదానందమూర్తిగారికి అప్పజెప్పారు. వారు ఎంతో శ్రద్ధగా తమ కర్తవ్యాన్ని నిర్వహించారు. ప్రతీరోజూ ఉదయం 5-00 గం.లనుండీ ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యానం ఆతరువాత యజ్ఞం జరిగేది. ఇదంతా అయ్యాక మాస్టర్‌గారి ప్రవచనం ఉండేది. ఈ సాధనాశిబిరంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు గురుదేవుల 'ఆత్మకథ లోని ప్రతీ అధ్యాయాన్ని సాధనాత్మకంగా చాలా చక్కగా వివరించారు.

ఈ శిబిరాల నిర్వహణ బాధ్యత మొత్తం శ్రీరామసుబ్బయ్య, శ్రీ సీతారాంగార్లు చూసుకునేవారు. ప్రతీరోజూ సాయంత్రం 6 గంటలకు గాయత్రీ ఆరతితో ఆరోజు శిబిరం ముగుస్తుంది. ఆ తరువాత అందరూ కలిసి మాస్టర్‌గారితో పాటు మహాదేవుని దర్శనానికి వెళ్ళేవారు. ప్రదోషకాలంలో మహాశివుని దర్శనం సర్వపాపహరం. ముందు స్వామివారిని దర్శించుకొని ఆ తరువాత తల్లి భ్రమరాంబాదేవి తనివితీరా దర్శించుకొని పిమ్మట అక్కడే కూర్చుని మాస్టర్‌గారు చెప్పే అనేక

సాధనా రహస్యాలను విని ఆనందాన్ని అనుభూతి చెందుతూ వసతిగృహాలకు వచ్చేవారు. అటు అనంతపురం, నంద్యాల, కర్నూలు, చీరాల నుంచీ–ఇటు గుంటూరు, ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, హైద్రాబాద్, ఏలూరు మొదలైన ప్రాంతాల నుండీ మొట్టమొదటగా పెట్టిన ఈ శిబిరానికి రావటం నిజంగా చాలా విశేషం. ఈ శిబిరానికి వచ్చిన సాధకులందరూ మహదానందంతో మాస్టర్‌గారిని వదలి వెళ్ళలేక వెళ్ళారు. ఇంతలో ఫిబ్రవరినెల వచ్చింది. పిల్లలకు పరీక్షల రోజులు దగ్గరపడుతున్నాయి. ఎక్కడున్నవాళ్ళు అక్కడ పనుల్లో మునిగిపోయారు.

## వసంతపంచమికి గురుదేవుల దర్శనం

సాధారణంగా వసంతపంచమి పర్వదినం ఫిబ్రవరి నెలలోనే వస్తుంది. గాయత్రీపరివార్‌కి వసంతపంచమి చాలా ముఖ్యమైన పర్వదినం. గాయత్రీపరివార్ సభ్యుడైన జబ్బర్‌సింగు నుంచీ నాకు ఒక ఉత్తరం వచ్చింది. 'ఈ వసంతపంచమి ఐన తర్వాత ఇంక గురుదేవుల దర్శనాలు ఉండవుట. అందుకని నేను శాంతికుంజ్‌కి వెళుతున్నాను. వీలైతే మీరూ రండి!' అని కార్డ్ వ్రాశాడు. విషయం విన్న వేంటనే గురుదేవుల దర్శనం కోసం పదహారుమంది శాంతికుంజ్‌కి వెళ్ళటానికి సిద్ధపడ్డాం. టిక్కెట్లు లేవు. రిజర్వేషన్లు లేవు. ఎలా వెళ్ళాలి? కానీ ప్రయత్నం చేద్దామనిచెప్పి మావారు చీరాల వెళ్ళి శ్రీసవాయిసింగ్‌గారితో సంప్రదించగా, వారు తక్షణమే ఈ 16 మందికి టిక్కెట్లు రిజర్వేషను చేయించారు. ఆ విషయంలో వారు చాలా సహాయం చేశారు. ఆక్షణంలో అనిపించింది 'ఇది సాక్షాత్ గురుదేవుల అనుగ్రహమే!' అని. రెండు నెలల ముందుగా జరగాల్సిన రిజర్వేషన్ క్షణాలమీద జరిగిపోవటమనేది నిజంగా ఇది వారు మనకిచ్చిన గొప్ప వరం అని మనస్సులోనే ధన్యవాదాలు చెప్పుకున్నాం అందరం!

జనవరి 28 తారీకు తెల్లవారుఝామున నాలుగు గంటలకల్లా శాంతికుంజ్‌కు చేరాం. గురుదేవుల దర్శనం అప్పటికే మొదలైపోయంది. ఇంకో గంటలో దర్శనం ఆగిపోతుందని తెల్సింది. ఇంతలో జబ్బర్‌సింగ్ వచ్చి అందరిని తొందరచేసి దర్శనాస్థలికి తీసుకువెళ్ళాడు. బయట మంచు కురుస్తున్నందువల్ల విపరీతమైన చలి. ఐనా క్యూలో వేలాదిమంది భక్తులు. ఆ క్యూలో కలిసి మేమూ ముందుకు నడిచాము. గురుదేవులున్న గదిలోకి ప్రవేశించాము. తెప్పపడితే ఆయన దర్శనం క్షణం తరిగిపోతుందేమోనన్న భావోద్వేగంతో వారిని దర్శించటానికి ఆదుర్దాపడుతున్నాము. గురుదేవులు ఒక చిన్నమంచం మీద కూర్చుని వున్నారు. తల మీద మంకీ టోపితో, ఒళ్ళంతా

దుప్పటీ కప్పుకొని కూర్చుని ఉన్నారు. చేతిలో కాగితాలు వున్న పాడ్ వున్నది. వచ్చినవాళ్ళందరినీ హిందీలో "నామ్" అని అడుగుతూ వారి పేర్లు వ్రాసుకుంటున్నారు. దివ్యమైన కాంతితో వెలిగిపోతున్నారు. వంగి పాదనమస్కారము చేసుకుని నిలబడ్డాము. 'నామ్' అనే అమృతవాక్ వెలువడింది. పేరు చెప్తున్నప్పుడు కళ్ళవెంట ఆనందంతో అలా నీళ్ళు కారిపోయాయి. ఎంతో ఆదరంతో అడుగుతూ అందరి పేర్లనూ రాసుకుంటున్నారు.

జనం విపరీతంగా వున్నందున కార్యకర్తలు "క్యూ"ను తొందరగా ముందుకు నడుపుతున్నారు. రాలేక రాలేక అందరం బయటకు వచ్చేశాము. ఐనా మధురాతిమధురమైన ఆ దృశ్యం మనస్సులో చెరగనిముద్ర వేసుకుంది. ఇంక ఆ మరునాడు గురువుగారి దర్శనం లేదు. కానీ మాతాజీ ప్రతీరోజూ తన బిడ్డలకు దర్శనమిచ్చేది. ఇదంతా "మాస్టారి అనుగ్రహమే!' ఆయన అనుజ్ఞ తీసుకొని వచ్చాము కాబట్టే క్షణాలలో దర్శనభాగ్యం కలిగింది. గురుదేవుల చేతిరాతతో మా పేర్లు ఇమిడిపోయాయి. మాస్టర్‌గారే స్వయంగా గురుదేవులకు పరావాణిలో వీళ్ళను పంపుతున్నానని తమ వినతిని పంపివుంటారు. అందుకే గురుదేవులు మా పేర్లను రాసుకున్నారనిపించింది. ఆరోజు తప్ప మళ్ళీ ఆయన ఏ పేర్లూ రాసుకోలేదు. ఆ తొమ్మిదిరోజులూ అద్భుతంగా సాధన జరిగింది. అందరం గురుదేవుల సమక్షంలో దీక్షలు తీసుకున్నాము. (తదుపరి కార్యక్రమాలకు ఈ సంఘటనతో గల సంబంధం వలన ఈ విషయాన్ని ఇచ్చట ప్రస్తావించటం జరిగింది).

ఆరోజు వసంతపంచమి. తెల్లవారుఝామున 3 గంటలనుంచే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మాతాజీ, గురుదేవులు వెండికొండ పైన ఆశీనులైన సాక్షాత్ పార్వతీపరమేశ్వరుల్లాగా శ్వేత, ధవళ వస్త్రాలతో వెలిగిపోతున్నారు. దర్శనానందంలో కళ్ళల్లో వచ్చిన నీరు ఆ దివ్యదర్శనానికి అడ్డురాగా 'కంఠేన స్వరగద్గదేన నయనే' అన్నట్లుగా ఆ మహాదేవుని దివ్యదర్శన భాగ్యాన్నిపొందాము. ఇంక ఈ జన్మకు ఇదే చివరి దర్శనం అనే భావన రాగానే హృదయంలో నుంచీ దు:ఖం పొంగుకువచ్చింది. వసంతపంచమి వారోత్సవాలు బ్రహ్మానందంగా జరిగాయి. ఆ ఉత్సవాలలో ప్రతీరోజు సాయంత్రం దీపయజ్ఞం చేసేవారు. ఆ సందర్భంలో చెప్పారు– 'మీరు మీమీ ఊళ్ళకు వెళ్ళిన తరువాత ఇలా సహస్రదీపయజ్ఞాలు చెయ్యాలి'. ఇది ఈ వసంతపంచమికి గురుదేవులిచ్చిన అద్భుతమైన వరదానం. ఇది మీ అదృష్టం. అలా చేస్తామనే వాళ్ళిప్పుడు సంకల్పం తీసుకుంటే గురుదేవుల, మాతాజీల దివ్యశక్తి మీకు అండగా ఉంటుంది.' మీ సంకల్పం అక్షరాలా నెరవేరుతుంది

అని నాటి సందేశ సారాంశం. నాకు సహస్రదీపయజ్ఞాలు చెయ్యాలనే బలమైన కోరిక కలిగింది. మనస్సులోనే గురుదేవులకు, మాస్టర్‌గారికి నా సంకల్పాన్ని విన్నవించుకుని, ఆ పని చేయగలననే ధైర్యం రావటంతో వారిరువురకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకున్నాను. మనస్సు నిండా గురుదేవుల, మాతాజీల దివ్యశక్తిని నింపుకొని తిరుగు ప్రయాణమయ్యాం. ఇంక వచ్చాక మరల మామూలు జీవితంలో పడిపోయాం.

## మాస్టర్‌గారు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా

మార్చినెల వచ్చేసింది. అందరికీ పరీక్షల హడావిడి. ఒకరోజు గుంటూరు నుండీ శ్రీసదానంద మూర్తిగారు వచ్చారు. మాస్టర్‌గారిని ఎక్స్టటర్నల్ ఎగ్జామినర్‌గా మార్కాపురం ఎస్.వి.కె.పి.డిగ్రీకాలేజీకి డ్యూటీ వేశారనీ, త్వరలోనే వస్తారనే శుభవార్త చెప్పారు. ఆ వార్తవిని ఆనందంతో అందరూ గంతులు వేశారు. ఆరోజులలో ఫోనులుండేవి గాదు. ఏదైనా సమాచారం చెప్పాలంటే ఒకటి ఉత్తరాల ద్వారా లేదా మనిషైనా వచ్చి చెప్పాలి. మాస్టర్‌గారు వచ్చారనీ, కళాశాల పనిమీద రావటం వలన నేరుగా కళాశాల వాళ్ళు ఏర్పాటుచేసిన గెష్టుహౌసుకే ముందు వెళ్ళాననీ కబురు చేశారు.

ఆరోజు నుంచీ విధులకు వెళ్ళాలి. సరే మాస్టర్‌గారు కాలేజీకి వెళ్ళారు. ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం కాలేజీకి వెళ్ళి-వచ్చేటప్పుడు మా ఇంటికి వస్తుండేవారు. మొదటిరోజే చాలా సరదాగా పిల్లలందరితో కల్సి పోయారు. పిల్లలు కూడా ఏవిధమైన బెరుకు లేకుండా ఆయన చుట్టూ చేరి కబుర్లు చెప్పటం అందరికీ వింతగా తోచేది. ప్రాక్టికల్స్ సమయంలో కూడా పిల్లలకు భయమనేది లేకుండా చాలా లిబరల్‌గా వుండేవారు. మా అమ్మాయి భాస్కరవల్లి అప్పుడు ఆ కాలేజీలోనే రెండో సంవత్సరం డిగ్రీ చదువుతున్నది. అందుకని మాస్టర్‌గారు పద్ధతి ప్రకారం హొటల్లోనే వుంటూ, పరీక్షలు పూర్తి అయ్యాక మాత్రమే ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చాక కాఫీ తాగుతూ 'హమ్మయ్య! ఇప్పుడు హాయిగా వుందిరా వల్లీ! ఇంక చెప్పండి అని వసంతపంచమికి హరిద్వార్‌లో జరిగిన విశేషాలు' అన్నారు. పూసగుచ్చినట్లు అన్నీ చెప్పారు పిల్లలు. నేనుమాత్రం శాంతికుంజ్‌వారు వసంతపంచమికి ఇచ్చిన సందేశ సారాంశమును "సహస్రదీపయజ్ఞాలు చేయించమని" చెప్పిన విషయాలు, ఇంకా నేను తీసుకున్న సంకల్పం గురించి చెప్పాను. అన్నీ చాలాశ్రద్ధగా విన్నారు. తరువాత చెప్పారు.

'నేను సాధారణంగా ఇలా ఎగ్జామినర్‌గా బయట ఊళ్ళకు ఎప్పుడూ వెళ్ళను. మీరు గురుదేవుల దర్శనం చేసుకువచ్చారు. వసంతపంచమికి ఏదో సందేశం ఇచ్చివుంటారు. అది వినాలి అని వచ్చాను' అన్నారు. 'సరే ఇక్కడ వున్నన్ని రోజులూ మీరు వచ్చారని సత్సంగాలు ఏర్పాటుచేయటం జరిగింది మాస్టారూ. ఇవాళనుంచీ రోజుకో చోటకు వెళ్ళాలి అన్నాను. ఇంక అలా ప్రతిరోజూ సత్సంగాలతో 15 రోజులు ఎంతో ఉత్సాహంగా, సరదాగా గడిచిపోయాయి. అప్పట్నుంచీ మార్కాపురంలో జరిగే పెద్దపెద్ద కార్యక్రమాలకు మాస్టర్‌గారు రావటం, అనేకమందితో పరిచయాలు ఏర్పడటం, తరచుగా వాళ్ళు కలవటం ఇలా పరివారం బాగా పెరిగింది. అలా వచ్చినవారిలో మార్కాపురంలో ఇరిగేషన్‌లో డి.ఇ.గా పనిచేసే శ్రీసునందనరావు, ప్రసూనాంబగార్లకు మాస్టర్‌గారంటే అమితమైన గౌరవం, భక్తి ఏర్పడ్డాయి. తరువాత కాలంలో వీరు మాస్టర్‌గారు మొదటిసారిగా స్థాపించిన శ్రీహంసరామఆశ్రమానికి దాదాపు ఐదు ఎకరాల స్థలాన్ని గురుదక్షిణగా సమర్పించుకుని జీవితాలను ధన్యం చేసుకున్నారు.

## 'శక్తి' సాధనా శిబిరం....శ్రీశైలం

పూజ్యశ్రీ మాస్టర్‌గారు అత్యవసరంగా శ్రీశైలంలో సాధనాశిబిరం పెట్టమని కబురుచేశారు. వేంటనే నేను, మావారు మాస్టర్‌గారి నిర్దేశాల ప్రకారం శ్రీశైలంలో కరివెనసత్రంలో సాధనాశిబిరానికి కావలసిన ఏర్పాట్లు చేశాం. అన్ని గ్రామాలనుండీ వచ్చిన సాధకులుండటానికి వ్యవస్థ, భోజనవ్యవస్థ, సాధనాకక్ష్య, అఖండజపానికి ప్రత్యేకంగా ఒక గది.... అన్నీ యథావిధిగా ఏర్పాటుచేశాం. మాస్టర్ గారు, రామసుబ్బయ్యగారు రెండురోజులు ముందే మార్కాపురానికి వచ్చేశారు. మాస్టర్‌గారితో వల్లీ బాగా చనువుగా వుండేది. సాయంకాలం చల్లగాలికని మాస్టర్‌గారు, వల్లీ, రామసుబ్బయ్యగారు మేడమీదకు వెళ్ళారు. మాటల మధ్యలో వల్లీ తనకు నిన్న రాత్రి వచ్చిన కల గురించి చెప్పింది. మాస్టర్‌గారు వల్లీ చెప్తున్న కలను శ్రద్ధగా వింటున్నారు. అది చాలా పెద్దకల. క్లుప్తంగానైనా చెప్పాలి. ఎందుకంటే ఈ కలకు, సాధనకు సంబంధం వుంది. సరే కల ఏంటో చూద్దాం.

ఒక పెద్దగుహలాంటి ఇంట్లో పెద్ద ఇత్తడిపళ్ళెంలో శివలింగానికి అభిషేకం చేసినదానికి గుర్తుగా పళ్ళెంనిండా పూలు, అక్షతలు, బిల్వదళాలు వున్నాయి. ప్రక్కన్నే తెల్లని దుస్తులు ధరించిన ముస్లిం నిలబడి ఉన్నాడు. ఇదంతా ఏదో చిత్రంగావుంది అనుకుంటూ సొరంగం లాగా వున్న ఆ గుహ దాటి బయటకు వెళ్దాం అని అనుకుంటుండగా తన శరీరం ఆకాశంలోకి దూదిపింజలా

దూసుకు వెళ్ళిపోతోంది. ఆకాశంలో పెద్దమేడ. ఆ మేడలో గురుదేవులు పద్మాసనంలో ధ్యానంలో ఉన్నారు. గురుదేవుల దర్శనమైంది గదా అని సంతోషిస్తుంటే కార్యకర్తలు వచ్చి వల్లీని ప్రక్కకు తోసేశారు. ఐతే ప్రక్కన్నే ఒక కిటికీ కనిపించింది. అక్కడికెళ్ళి గురుదేవులను కళ్ళారా చూస్తున్నది. ఇంతలో గురుదేవులే వచ్చి వల్లీని క్రిందకు తోసేశారుట. అంతే నిటారుగా వచ్చి భూమ్మీద నిలబడింది. ప్రక్కనే మాస్టారున్నారు. ఆయన వెనుక లక్షలాదిమంది జనం పరుగులు పరుగులు పెడుతూ వస్తున్నారు. ఇదీ కల.

అంతా విన్నారు. కాసేపు కళ్ళు మూసుకున్నారు.ఆ తర్వాత 'ఆ కల సరిగ్గానే వచ్చింది.' ఎందుకంటే శ్రీశైలంలో శివాభిషేకం చెయ్యాలని ముందే మాస్టర్‌గారు నిర్ణయించుకున్నారుట. రెండవది ఖేచరీముద్రసాధన చెప్పాలా? వద్దా? అనే మీమాంసలో వున్నారుట. 'ఆకాశం-మేడ' అనే సంకేతం ద్వారా గురుదేవులు దానిని చెప్పవచ్చని సంకేత మిచ్చారు అంటూ ఆ కలకు వివరణ నిచ్చారు. శివరాత్రి సాధనాశిబిరానికి ముందే విశేషమైన బాధ్యతను గురువుగారు- మాస్టర్‌గార్కి అప్పజెప్పారని అర్థం. అదే ఆయన వెనక గల లక్షలాదిమంది జనం. ఇదంతా వింటున్న రామసుబ్బయ్యగారు 'అవును ఆర్.కె.! మరి ఇంతమంది బాధ్యతను నీవు తీసుకోవాల్సిందేగా!' అన్నారు. 'అవునయ్యా. బాస్ పనిపెట్టారు' అన్నారు మాస్టారు. (సాధారణంగా మాస్టర్‌గారు ఏ నిర్ణయం తీసుకున్నా ప్రకృతినుండి దానికి ఎలాంటి అంగీకారం వచ్చిందీ అనేది ప్రతీ సందర్భంలోనూ గమనించుకుంటూ వుంటారు. ఇక్కడ వచ్చిన కల విషయం అలాంటిదే.)

దేవాత్ములైనవారు భౌతికజగత్తులో గురువుల ప్రణాళికను అనుసరించి కార్యక్రమాలను ఒకరి నుంచీ మరొకరు దానిని ముందుకు తీసుకువెళ్తుంటారు. సరిగ్గా ఇదే విషయం షిరిడీసాయికూడా చెప్పారు. శ్రీరామకృష్ణ పరమహంసగారి పనిని సాయిబాబా అందుకున్నారు. భౌతికంగా చూస్తే వారికీ-వీరికి మధ్య ఎలాంటి సంబంధ బాంధవ్యాలు కనిపించవు. కానీ వారి స్థాయిలోవారు ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో ప్రణాళికాబద్ధంగా చేసుకుంటారు. అది మానవమాత్రులకు కనిపించదు. అందువలన గురువులను ఎవరి దృష్టికోణంతో వారు చూస్తుంటారు. గురువుల లీలలు కూడా భగవల్లీలల్లాగే ఎంతో నిగూఢంగా వుంటాయి. వారి అనుగ్రహం సంపూర్ణంగా ఉంటేనే తప్ప మామూలు మానవులకు అవి అర్థంకావు. వారి మాయలో, అపారమైన ప్రేమలో వాటిని గుప్తముగా వుంచుతూ ముందుకు నడిపిస్తుంటారు. ఎంతో గమనిస్తేనేగాని అవి కొంచమైనా అర్థంగావు.

సాధనాశిబిరంలో ప్రతీరోజు రాత్రి సమయంలో స్వామి దర్శనానికి వెళ్ళటం సాధనలో ఒక భాగం. ఆరోజూ అలాగే వెళ్ళాం. దర్శనం అయ్యాక మాస్టారితో పాటు అందరం పొగడచెట్టు క్రింద కూర్చున్నాం. కబుర్లు చెప్తున్నారనిపిస్తుంది కానీ అందులో నిగూఢమైన దైవసందేశం ఏదో ఉంటుంది. ఇప్పుడు స్త్రీలు శ్రీసూక్తం ఒకటి–పురుషులు పురుషసూక్తం ఒకటి చొప్పున పారాయణ చెయ్యండని చెప్పారు. ఎంతో స్వరయుక్తంగా ఆ ప్రశాంత వాతావరణంలో దానిని చదువుతున్న వాళ్ళంతా ఒక దివ్యానుభూతిని పొందారు.

పారాయణ అయిపోయాక మెల్లగా లేచి బయటకు వస్తుండగా ఇంతలో నా కాలికేదో తగిలింది. ఒంగి తీశాను. చిన్న స్ఫటికలింగం. తీసి మాస్టర్‌గారి చేతిలో పెట్టాను. మాస్టర్‌గారు సీతారాంగారితో 'చూశావా అనుగ్రహమంటే ఇదే! సాక్షాత్ ఆయనే వచ్చారు. ఈ లింగాన్ని పెట్టి ఇవాళ రాత్రి 12 గంటలకు శివాభిషేకం చెయ్యి' అన్నారు. అంతే సత్రానికి వచ్చి అభిషేకానికి కావలసిన ఏర్పాట్లు చేయగానే, సీతారాంగారు అభిషేకాన్ని ప్రారంభించారు. మాస్టర్‌గారు కాసేపు అభిషేకం దగ్గర కూర్చుని తర్వాత నేరుగా మేడమీదకు వెళ్ళారు. మేడ మీదికి వెళుతూనే మాస్టారు 'సీతారాం ఎంత పద్ధతిగా శివాభిషేకం చేస్తున్నాడో ఇప్పుడు మీకు చూపిస్తాను అంటూ ఆకాశం వంక అలా చూస్తూవున్నారు. ఇంతలోనే ఆకాశంలో మబ్బులు లింగాకారాన్ని దాల్చాయి. దాని మీద అభిషేకం జరుగుతున్న దివ్యదర్శనం అయింది. సీతారాంగారు అభిషేకం ముగించి మాస్టర్‌గారికి తీర్థమివ్వగానే ఆ దృశ్యం అలా మబ్బుల్లోకి మాయమైపోయింది. చూట్టానికి, వినటానికి అది మామూలు విషయంగానే అనిపిస్తుంది. కానీ అది మాస్టర్‌గారి అంతరంగ సాధన యొక్క బాహ్యప్రకటీకరణ, పరమాత్మ యొక్క ప్రత్యక్ష సాక్షాత్కారమనేది అనుభూతి చెందగల్గితే అర్థమౌతుంది. కలలో కనిపించిన అభిషేకం అలా శ్రీశైలంలో ప్రత్యక్షంగా జరిగిపోయింది. తర్వాతిరోజు సాధనలో ఖేచరీసాధన–దానివలన వచ్చే లాభాలను వివరిస్తూ ప్రయోగాత్మకంగా సాధనను చేయించారు. ఖేచరీసాధనను ఇంటికి వెళ్ళాక కూడా ప్రతీరోజూ చెయ్యమని చెప్పారు.

అలా శ్రీశైలంలో జరిగే ప్రతీ శిబిరంలోనూ ఎన్నో ఆధ్యాత్మిక రహస్యమయ సాధనలను చేయించేవారు. దివ్యమైన ఈ యుగసంధికాలంలో ఆ మహాకాలక్షేత్రంలోని అద్భుతమైన ఆధ్యాత్మికశక్తిని సాధకుల అంతశ్చేతనలో నింపాలనే మహాసంకల్పంతో మాస్టర్‌గారు ఈ ఒక్క సంవత్సర కాలంలోనే మూడు సాధనాశిబిరాలను వరుసగా మొదటిది సంక్రాంతికి నాలుగురోజులు–

రెండవది వినాయకచతుర్థికి 9 రోజులు–మూడవది దేవీనవరాత్రులను అఖండంగా నిర్వహించి... ఎవరి ఆర్తిని బట్టి వారికి అవసరమైనదానిని వారికి ప్రసాదించారు. ప్రతీ సాధనాశిబిరానికి దాదాపు 200 మంది సాధకులు మాస్టర్‌గారిచ్చే మధురమైన ఆ దివ్యసందేశాన్ని విని, సాధనలను చేసుకోవటానికి వచ్చేవారు. ఒకసారి శిబిరానికి విజయేశ్వరీమాత వచ్చి అందరిచేత సహస్ర నారికేళవ్రతం చేయించారు. ఆ వ్రతంలో మాస్టర్‌గారు కూడా పాల్గొన్నారు.

## అధ్యాయం-5

# మహానందిలో సాధనాశిబిరం – గురుదేవుల మహాప్రయాణం

మహానందిలో ఏర్పాటుచేసిన ఈ సాధనాశిబిరం గురించి ముందుగానే గురుదేవులకు ఉత్తరం వ్రాశాను. తక్షణమే వారి నుండీ ఆశీస్సులతో జవాబు వచ్చింది. చదివితే విపరీతమైన ఆనందం కలిగేది. ఆ ఆనందంతో పాటు అపారమైనశక్తి వచ్చి ఎంత పనైనా ఆడుతూపాడుతూ చేయగలిగేవాళ్ళం.

ఈసారి 1990 జూన్ 2వ తేదీ గాయత్రీ జయంతి వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సాధనాశిబిరం ఏర్పాటు చేయటం జరిగింది. జూన్ 1వ తేదీకే పూజ్యశ్రీ మాస్టర్‌గారు, వాళ్ళ నాన్నగారు, శ్రీరత్నాకర్, శ్రీసీతారాం, శ్రీరామసుబ్బయ్యగార్లు మార్కాపురంలోగల మా ఇంటికి వచ్చేశారు. వాళ్ళందరి రాకతో గాయత్రీజయంతి పండుగ వాతావరణం వచ్చేసింది. అందరిలోనూ తెలియని ఆనందం. గాయత్రీజయంతినాడు ఉదయం 8 గంటలకే గాయత్రీ యజ్ఞం ప్రారంభించారు. మాస్టర్‌గారి ఉపస్థితిలో యజ్ఞం జరిగింది. ఆరోజు యజ్ఞానికి వచ్చినవాళ్ళంతా మాస్టర్‌గారి నుండీ మంత్రదీక్షలు తీసుకున్నారు. అంతటి పర్వదినం రోజు మాస్టర్‌గారి నుంచీ దీక్షలు తీసుకోవటం అనేది వారి సుకృతం. వారి జీవితాలు ధన్యమైవుంటాయి.

జూన్ 4,5,6,7,8 తేదీలలో మహానందిలో శ్రీరామకృష్ణ రెసిడెన్షియల్ పాఠశాలలో జరుగబోయే సాధనాశిబిరానికి రమ్మని అందరికీ అప్పటికే ఆహ్వానాలు వెళ్ళిపోయాయి. యజ్ఞం అయ్యాక అందరూ భోజనాలు చేశారు. రేపు ఉదయమే మహానందికి బయల్దేరాలి. అక్కడికి కావలసిన సామాను సర్దుతున్నారు. మధ్యాహ్నం 2–30 గంటలకు ఒంగోలు నుంచీ శ్రీలక్ష్మీనారాయణగారు

వచ్చారు. వస్తూనే 'మీకీ సంగతి తెలుసా? ఇవాళ టి.వి.లో హరిద్వార్‌లో వున్న గాయత్రీ ఉపాసకులు పండిత శ్రీరామశర్మఆచార్య గారు పరమపదించారని చెప్పారు. మీకీ విషయం తెలుసో? లేదో? ఈ పరిసిత్థిలో శిబిరం వుందో లేదో కనుక్కుందామని వచ్చాన న్నారు. అంతే ఒక్కక్షణం కాలం స్థంభించిపోయినట్లైంది అందరికీ. అందరి ముఖాలలోనూ విషాదఛాయలు. మాస్టర్‌గారు ఏం చెప్తారా అని అందరం వారి వంకకు చూశాం. కాసేపాగి మాస్టర్‌గారు 'రామసుబ్బయ్యా! మనం విమానంలో శాంతికుంజ్‌కు వెళ్ళగలమా?' అని అడిగారు. ఈ క్షణంలో టిక్కెట్లు ఎలా దొరుకుతాయి? ఎలా వెళ్ళగలం? అని కాసేపు తర్జనభర్జన జరిగింది. ఉన్నపళాన మాస్టర్‌గారు లేచి మేడమీదికి వెళుతూ "పైకి ఎవ్వరూ రావద్దు. నేను క్రిందికి వచ్చేవరకు నన్నెవ్వరూ కదిలించవద్దని" చెప్పి పైకి వెళ్ళిపోయారు. అందరూ బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాం. ఎక్కడి పనులు అక్కడ ఆపేశాం. మాస్టర్‌గారు ఎప్పుడు క్రిందికి వస్తారు? ఏం చెప్తారోనని అందరికీ ఆదుర్దాగా ఉన్నది.

సాయంత్రం ఆరుగంటలకు మాస్టర్‌గారు కిందికి వచ్చి " రామసుబ్బయ్య! అనుకున్న ప్రకారం రేపటినుంచీ సాధనా శిబిరం జరుగుతుంది. వెళ్ళి అందరికీ ఫోన్లు చేసిరా' అనేసరికి అందరికీ కాస్త ఊపిరి వచ్చింది. ఆరోజులలో ఫోన్లు అతి తక్కువమంది ఇళ్ళల్లో మాత్రమే ఉండేవి. సరే వాళ్ళు ఆపని మీద వెళ్ళారు. మళ్ళీ అందరిలో నూతన ఉత్తేజం వచ్చింది. మనస్సులో తీరని దుఃఖంవున్నా మాస్టర్‌గారి ఉపస్థితి అందరికీ అనంతమైన శక్తినిచ్చింది. జూన్ 3వ తేదీ మధ్యాహ్నాని కల్లా 23 ఊళ్ళనుంచీ పరివార్ సభ్యులు వచ్చేశారు. అక్కడకు వచ్చిన చాలామందికి గురుదేవుల నిర్యాణం గురించి తెలియదు. అందుకని మాస్టర్‌గారిని చూచేసరికి అందరిలో ఉత్సాహం వెల్లి విరిసింది. మాస్టర్‌గారు దగ్గరున్నందున గురుదేవులు లేరనే వెలితి ఎవ్వరికీ తెలియలేదు.

శ్రీశైలంలో పెట్టిన పృథ్వీతత్త్వ జాగరణ సాధన అయితే; మహానందిలో జరిగింది జలతత్త్వ సాధన. పృథ్వీ మూలాధారానికి ప్రతీకయైతే జలం స్వాధిష్ఠానచక్రానికి ప్రతీక. మహానందిలో నందినోటిలో నుంచీ జలధార వస్తూవుంటుంది. ఆ జలధార ఎక్కడ నుంచి వస్తుందో ఎవ్వరికీ తెలియదు. ఆ నీరు ఎంత స్వచ్ఛంగా వుంటుందంటే అడుగు భాగంలో సూది వున్నా స్పష్టంగా కనిపించేటంత నిర్మలంగా ఉంటాయి. సాధన అంతా ఆ కోనేరులోనే చేయించారు. అదొక మధురమైన దివ్యానుభూతి. ఆ తరువాత ఇంకెక్కడా, ఎప్పుడూ అలాంటి సాధన జరుగలేదు.

నభూతో న భవిష్యతి అన్నట్లుగా జరిగింది. ఉదయం రెండుగంటలు, సాయంత్రం రెండుగంటలు నీటిలోనే సాధనంతా చేయించేవారు. తరువాత రెండు గంటల పాటు ప్రవచనాలు చెప్పేవారు. ఈ సాధనాశిబిరం పెట్టిన "శ్రీరామకృష్ణ రెసిడెన్షియల్" పాఠశాల మొత్తం ఆశ్రమ వాతావరణం లాగే ఉంటుంది. ఎటు చూచినా పెద్దపెద్ద చెట్లు. తరగతి గదులన్నీ పర్ణకుటీరాలే! కనుక సహజమైన ఋషి సాంప్రదాయ వాతావరణంతో ఎంతో ప్రశాంతంగా వుండేది. అక్కడ ఏలాంటి భౌతిక సుఖాలుగానీ, ఆడంబరాలుగానీ లేవు. చల్లగా వుండే ఆ చెట్ల క్రిందనే మాస్టర్‌గారు అనుకున్నప్పుడల్లా ప్రవచనాలు చెప్పేవారు. ఈసారి గాయత్రీ జయంతికి జరుగుతున్న ఈ సాధనాశిబిరాన్ని ఎంతో అద్భుతంగా విశ్లేషించి చెప్పారు. ఈ గాయత్రీ జయంతిలో మూడు అద్భుతమైన ఆధ్యాత్మిక రహస్యాలు ఉన్నాయని చెప్తూ ఇలా వివరించారు.

జేష్ఠశుద్ధ దశమినాడు గాయత్రి ఆవిర్భవించింది. గంగామాత గురించి భగీరథుడు తపస్సుచేసి, ఆ చల్లని తల్లిని భూమ్మీదకు దింపాడు. ఆ గంగావతరణ జరిగినరోజును గంగాదశహరా అంటారు. అది కూడా ఈ జేష్ఠశుద్ధ దశమినాడే జరిగింది. మళ్ళీ అలాంటి ఒక అద్భుతం ఇదే పర్వదినాన జరిగింది.

**1990 జూన్ 2 వ తేదీ ఉదయం సుమారు 8 గంటల సమయాన (గాయత్రీ జయంతినాడు) గురుదేవులు తమ భౌతికశరీరాన్ని వదలిపెట్టారు. వారి అంతశ్చేతన ఆ మహాశక్తిలో లీనమైపోయింది. వందనీయ మాతాజీ సరిగ్గా ఆ సమయానికి గురుదేవుల ఆదేశానుసారమే ప్రవచన వేదిక మీద తమ సందేశాన్ని ఇస్తున్నారు. సంపూర్ణ సత్యము తెలిసినా గానీ స్థితప్రజ్ఞతతో ఆమె ఆరోజు జరుగ వలసిన క్రియాకలాపాలను నిర్ధారిత క్రమంలో సంతులితం చేశారు. సాయంత్రం సూర్యాస్తమయానికి ముందే ఆ మహాయోగి గురుదేవుల తపఃపూతశరీరం వారి జీవనయజ్ఞ పూర్ణాహుతిగా అగ్నికి సమర్పించబడినది. వారి పరమ తేజస్సు వందనీయ మాతాజీలో కలిసిపోయింది. ఆమె అవిచల భావంతో తన ఆరాధ్యదైవము యొక్క భౌతిక వియోగాన్ని అనుభవిస్తూ మహాతపమునకు తయారు కాసాగారు. గాయత్రీజయంతినాడు గురుదేవుల మహాప్రయాణం ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక విస్ఫోటనమని మాస్టర్‌గారు ఆనాటి ప్రవచనంలో చెప్పారు.**

1990 ఏప్రియల్ 28 నాడు బ్రహ్మదీపయజ్ఞాలను చెయ్యాలనే సంకల్పమును పరమపూజ్య గురుదేవులు ముందుగానే నిర్ణయించారు. వారు ఏకాంతవాసములో ఉన్నప్పటికీ ఆయన ఆరోజున

దగ్గరగా వున్న కార్యకర్తలనందరినీ సమావేశపరచి జూన్ 7,8 తేదీలు అనగా జేష్టపూర్ణిమనాడు భోపాల్, కోరబా, మజఫర్‌పూర్, అహమ్మదాబాద్, లక్నో మరియు జైపూర్‌లలో ఈ విరాట్‌దీప యజ్ఞాలను సుసంపన్నం చేయాలని నిర్ణయించారు. క్రమశిక్షణ కలిగిన వారి పరిజనులు తమ సద్గురువు ఆదేశాన్ని శిరసా వహించి 1990 జూన్ 2 నాడు గురుదేవుల మహాప్రయాణ సమాచారం అందినా, తమకు అప్పజెప్పిన పనిని సంపూర్ణంగా చేయటానికి ఏకనిష్ఠులై ఏవిధమైన ఏమరుపాటు లేకుండా ఆ మహాయజ్ఞాలను సుసంపన్నం చేయగలిగారు. అక్కడిలాగే ఇక్కడ కూడా గురుదేవుల మానసపుత్రులు పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఆత్మనిష్ఠాగరిష్ఠులై, ఏకనిష్ఠతో ఈ సాధనాశిబిరాన్ని కనీ, వినీ ఎరుగని రీతిలో నిర్వహించారు.

శిబిరం జరుగుతున్న ఒకరోజు సాయంత్రం మహానందిలో స్నానాలు చేసి అందరూ తిరిగి వస్తున్నారు. అంతలో అనుకోని రీతిలో కుంభవృష్టి కురిసింది. అందరూ తడిసి ముద్దైపోయారు. కానీ మాస్టర్‌గారు యథావిధిగా రోజూ మాదిరే ప్రవచనం చెప్పటానికి వేదిక మీదికి వచ్చారు. త్వరత్వరగా అందరూ అక్కడి వచ్చేశారు. ఆనాటి మాస్టర్‌గారి ప్రవచనంలో తమ జీవితంలో జరిగిన అనేక రహస్యాలను బహిర్గతం చేశారు. కాశిలో వుండగా వారి తాతగారితో కలిసి ఒకసారి హిమాలయయాత్రకు వెళ్ళారుట. మాస్టర్‌గారికప్పుడు పది సంవత్సరాల వయస్సు. తాత, మనుమడు కొండ ఎక్కుతున్నారుట. దారిలో తాతగారికి తెలిసిన వ్యక్తి కనబడితే, వారితో మాట్లాడుతూ ఆయన అక్కడే ఆగిపోయారుట. మన బాల శ్రీరామకృష్ణుడు పరుగెత్తుకుంటూ కొండపైకి వెళుతుంటే దారిలో ఒక తాతగారు కనిపించి 'చేతిలో లడ్డు పెట్టి తినమన్నారుట. లడ్డు తింటూ తాతగారితో కబుర్లు చెప్తూ నడుస్తున్నారు. ఇంతలో సోమేశ్వరరావుగారు వచ్చి నీకీ లడ్డు ఎక్కడిదిరా? అని అడిగారు. 'ఇదిగో ఈ తాతయ్య ఇచ్చారు' అంటూ ప్రక్కకి తిరిగి చూపించే లోపల అక్కడ ఎవ్వరూ లేరుట. "ఏ మహర్షి అనుగ్రహమో!" అని శ్రీసోమేశ్వరరావుగారు అనుకున్నారు. ఆ లడ్డు ద్వారా మాస్టర్‌గారి అంత:కరణలోకి ఏ దివ్యశక్తిని ప్రవేశపెట్టారో ఆ దివ్యపురుషులు. మహాత్ముల మార్గదర్శనం ఎలా ఉంటుందో ఎవ్వరూ ఊహించలేరు కదా!

ఆరోజు అలానే ఇంకో సంఘటన చెప్పారు. శాంతిలోకుంజ్‌లో జరుగుతున్న ప్రాణప్రత్యావర్తన శిబిరంలో పాల్గొన్నప్పటి సంఘటనను ఒకటి చెప్పారు. ప్రాణప్రత్యావర్తన సాధనలో భాగంగా రోజుకు ఒక్కరు మాత్రమే – ఒక గంటసేపు గురుదేవుల సమక్షంలో కూర్చోవాలి. ఆ సమయంలో

గురుదేవులు మౌనంగానే 'మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వం' అన్నట్లుగా తన పనిని తాను చేసుకుంటూ, ఆరోజు వచ్చిన సాధకునికి తెల్లకాయితాలు-కలం ఇచ్చి 'నీవు చేసిన పాపాలన్నీ వ్రాయి. అలానే నీకేం కావాలో కూడా వ్రాయి' అని అంతే చెప్పి, తన దగ్గర కూర్చోబెట్టుకుని ఇంక తమ పనిలో లీనమైపోయేవారు. ఇంక మాస్టర్‌గారు వ్రాయటం మొదలుపెట్టారు. గురుదేవులు ఏదో పని మీద ప్రక్కగదిలోకి వెళ్ళి కాసేపాగి తిరిగివచ్చారు. వస్తూనే రామకృష్ణ వంక చూచి చిఱునవ్వు నవ్వారుట. అప్పుడు రామకృష్ణగారు గురుదేవులతో "మీ గురువుగారు వచ్చారా?" అని అడిగారుట. దానికి గురుదేవులు 'నీవు చూశావా?' అని అడిగారుట. చూశానన్నట్లుగా తల ఊపారుట మాస్టర్‌గారు. అంతే. ఆ విషయం అంతటితో అయిపోయింది. ఆ వచ్చినవారు దాదాగురుదేవులని అర్థమైంది గదా! ఈ శిబిరంలో మాస్టర్‌గారు సుమారు 200 పేజీలదాకా వ్రాసి గురుదేవుల కిచ్చారుట. గురుదేవులు ఆ కాగితాలను చదువుతూ అక్కడక్కడ ఎఱ్ఱరంగు ఇంకున్న కలంతో కొన్ని పంక్తుల క్రింద గీతలు పెట్టి ఇస్తూ "వీటిని వ్రాయమని నీకెవరు చెప్పారు?' అన్నారుట. దానికి మాస్టర్‌గారు 'తప్పులుగానీ పాపాలుగానీ అవి ఈ జన్మలో చేసినా గత జన్మలలో చేసినా పాపాలు పాపాలే గదా గురువుగారూ!' అని అన్నారుట. (అంటే పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారికి తమ గతజన్మల గురించి కూడా తెలుసుననే విషయం మనకిక్కడ అర్థమౌతోందికదా !) అలాంటివే మరికొన్ని సంఘటనల గురించి చెప్పటం జరిగింది.

ఆరోజు రాత్రి ఎవ్వరూ నిద్రపోలేదు. మాస్టర్‌గారు అలా తమ అనుభవాల గురించి, వివిధ సాధనల గురించీ చెప్తూనే వున్నారు. మాటల సందర్భంలో థియోసాఫికల్ సొసైటీ వ్యవస్థాపకురాలు బ్లావెట్‌స్కీ మాత గురించి ఎవరో అడిగారు. అంతే ఆరోజు తెల్లవారుఝాము మూడుగంటల వరకు ఆవిడ జననం, బాల్యం, ఇంకా ఆవిడకు పరమగురువులతో గల ప్రత్యక్ష, పరోక్ష సంబంధ బాంధవ్యాలు, ఆవిడ వ్రాసిన సీక్రెట్ డాక్ట్రిన్- అది వ్రాయటానికి ఆమెకు పరమ గురువులనుండీ ఎలాంటి ప్రేరణ ఏవిధంగా వచ్చిందీ మొదలైన విషయాల గురించి మనస్సుకు హత్తుకునేలా చాలా ఆహ్లాదకరంగా చెప్పారు. తెల్లారితే 8 వ తేదీ. శిబిరం అయిపోతుంది. కానీ అప్పుడు చెప్పారు. 'రేపు పూర్ణాహుతి కదా!' 'ఉదయం 8 గంటలకల్లా పంచకుండీ యజ్ఞం చెయ్యాలి. దాని ఏర్పాట్లు చూసుకోండి' అని చెప్పి వారు తమ పనులు చేసుకోవటానికి వెళ్ళిపోయారు...

ఇంక ఎవ్వరూ నిద్రపోలేదు. చింతచెట్ల క్రిందన పంచకుండీలను పెట్టి, దానికి కావలసిన వస్తువులను ఏర్పాటుచేసి, అందరూ స్నానాలు చేసి వచ్చి యజ్ఞానికి సిద్ధమైనారు. చెప్పిన సమయానికి

యజ్ఞం ప్రారంభించారు. మాస్టర్‌గారు కాసేపు కూర్చొని 'వెళ్ళి పడుకుంటాను. పూర్ణాహుతి సమయానికి లేపండని' చెప్పి వెళ్ళి పడుకున్నారు. సాధారణంగా యజ్ఞం మొదలుపెట్టగానే అలా నిద్రలోకి వెళ్ళారూ అంటే కారణజగత్తులో దాని ప్రభావం ఎలా ఉందో పట్టుకుని పూర్ణాహుతి ద్వారా దాని శక్తిని సక్రియం చేస్తారు. మిగిలిన యజ్ఞప్రక్రియను శ్రీసత్యనారాయణమాస్టారు చేశారు. ఈ యజ్ఞంలో దాదాపు 250 మంది ఆహుతులు వేసుకున్నారు. పూర్ణాహుతి సమయానికి మాస్టర్‌గారు వచ్చి పూర్ణాహుతినిచ్చారు.

సరిగ్గా అదే సమయానికి ఎవరో ఒక వ్యక్తి వచ్చి రాజ్యలక్ష్మి పేరుతో ఉన్న ఒక కవర్ ఇచ్చి వెళ్ళాడు. అది శాంతికుంజ్ నుంచీ వచ్చిన ఉత్తరం. మాస్టర్‌గారే దానిని తీసి చదివారు. మాతాజీ స్వయంగా వ్రాసిన ఉత్తరం అది. ఎంతో ప్రేమగా తమ ఆశీర్వాదాలను తెలుపుతూ ఇలా వ్రాశారు. 'గురుదేవులు ఆరుచోట్ల విరాట్ బ్రహ్మదీపయజ్ఞాలను చేయించి బ్రహ్మబీజాలను విశ్వమంతా వ్యాపింపజేశారు. ఆరుచోట్ల అనేది షట్చక్రాలకు ప్రతీక. మీరు మహానందిలో చేస్తున్న 'బ్రహ్మయజ్ఞము' సహస్రారసిద్ధికి ప్రతీకగా నిలిచిపోతుంది' అని సాక్షాత్ మాతాజీ సంతకంతో ఆ ఉత్తరం వచ్చింది. మాతాజీ, గురుదేవుల మానసపుత్రులు, ప్రజ్ఞాపుత్రులు అయిన మాస్టర్‌గారు చేసిన బ్రహ్మయజ్ఞానికి అమ్మ తన హర్షాన్ని అంత అందంగా వ్రాతపూర్వకంగా సరైన సమయానికి పంపటమనేది అనూహ్యమైన విషయం. ఆ ఉత్తరం నిజానికి మార్కాపురం గరల్స్ హైస్కూలు చిరునామాకు వచ్చింది. ఎవరు తెచ్చివెళ్ళారో ఎవ్వరికీ తెలియదు. ఈ విషయం నిజంగా అందరికీ ఆశ్చర్యమనిపించింది. మరి మాతాజీ వారి సాధనకు తగిన ఆశీర్వచనాలను అలా పంపటంలో ఆశ్చర్యం ఏముంటుందీ? అందరికీ ఆనందంతో కన్నులు చెమ్మగిల్లాయి. ఆనంద అశ్రునయనాలతో తమ సాధనకు తగిన ఆశీర్వాదాలు అమ్మ నుంచీ పొందటమే అసలైన పూర్ణాహుతి అనిపించింది. అందరికీ అదే భావన. మా జీవితాలు ధన్యమైనాయి. గాయత్రీజయంతి సందర్భంగా పెట్టిన ఈ సాధనా శిబిరం పూజ్య గురుదేవుల ఆశీర్వాదాలతో చేసిన విరాట్ దీపయజ్ఞాలతో కలిసిన సౌభాగ్యాన్ని పొందటమనేది గురుదేవుల కరుణ కాక మరేమై వుంటుంది ?

మాస్టర్‌గారు గురుదేవుల మహాప్రయాణం గురించి ఒక విషయాన్ని తరువాత కాలంలో ఇలా చెప్పారు. అదేమిటంటే 1990 జూన్ 4,5,6 తేదీలలో ఏర్పడే సూర్యకళంకాలు మాత్రమేకాక; నికటభవిష్యత్తులో వచ్చే అనేకానేక సూర్యకళంకాలు మరియు ఉపద్రవాల మూలంగా మానవజాతికి

కలిగే అనేకానేక కష్టనష్టాలను దూరం చేయటానికే పూజ్యగురుదేవులు తమ శరీరాన్ని వదిలి వేసి సూక్ష్మలోకాలలో తమ క్రియాకలాపాలను కొనసాగిస్తున్నారని చెప్పారు.

**ఇంకో విచిత్రం:** తొమ్మిదో తేదీకి సాధనా శిబిరం ముగిసిపోతుంది. ఎవరి ఊళ్ళకు వారు వెళ్ళిపోవాలి. అందరూ దాదాపు ఉపాధ్యాయులే. జూన్ 12 వ తేదీన పాఠశాలలు తెరుస్తారు. అందరూ బాగా అలసిపోయారనే చెప్పాలి. సెలవలు అయిపోతున్నాయి. ఊళ్ళకు వెళ్ళాలి. కాస్తో కూస్తో సర్దుకోవాలి. ఎలాగా అనుకుంటున్న సమయంలో అనుకోని రీతిలో వార్తాపత్రికలో వచ్చిన వార్త 'తీవ్రమైన ఎండల కారణంగా జూన్ 20 వరకు సెలవులను పొడిగించారు.' ఈ వార్త అందరికీ ప్రాణం పోసింది. ఈ సాధనాశిబిరంలో అన్నీ చమత్కారాలే! గురుదేవుల నిర్యాణమనే బాధ ఒక ప్రక్కనవున్నా మాస్టర్‌గారితో కలసివున్న అనుభవం అందరికీ కాస్త ఊరటనిచ్చింది. అంతే కాక గురుదేవుల చేతనత్వం విశ్వవ్యాప్తిగావించబడి మన అందరిలో ఉందన్న విశ్వాసం ఈ శిబిరంలో అవగాహనకు వచ్చింది, ఈ శిబిరం పరిపూర్ణంగా ముగిసింది. ఇంత బాగా జరగటమనేది మాస్టర్‌గారి తపఃశక్తి మరియు పూజ్యగురుదేవుల అనుగ్రహమేగదా!!

## వ్యక్తిగత సాధన

మహానందిలో జరిగిన సాధనాశిబిరం తరువాత కొన్నాళ్ళ పాటు పూజ్యశ్రీ మాస్టర్‌గారు వ్యక్తిగత సాధనలో లీనమై పోయారు. ఆ సమయంలో వారు సూక్ష్మప్రేరణగా గురుదేవుల నుండీ వచ్చే సందేశాలను దర్శించటం మొదలు పెట్టారు. వారు వ్యక్తిగతంగా పరివార్ సభ్యులతో కలిసి కార్యక్రమాలు నిర్వహించలేక పోయినప్పటికీ, లేఖామాలల రూపంలో అందరికీ సక్రియమైన మార్గదర్శనం చేస్తూనే ఉండేవారు.

1990 ఆగష్టు నుండీ వారి దగ్గర నుంచీ వచ్చే లేఖామాలలు కొన్ని సాధనాత్మకమైనవి, కొన్నిప్రేరణాత్మకమైనవి మరికొన్ని సక్రియాత్మకమైనవిగా ఉండేవి. ప్రతీ రోజూ ఉదయం మాస్టర్‌గారి సాధన పూర్తి అయ్యేసరికి శ్రీరామసుబ్బయ్యగారు విధిగా వచ్చి కలిసేవారు. ఆ సమయంలో విశేషమైన సందేశాలను మాస్టర్‌గారు చెప్తుంటే వారు బ్లాక్ పెన్నుతో వైట్ పేపర్ మీద వ్రాసేవారు. వాటి జిరాక్సులను తీయించి సక్రియమైన కొన్ని కేంద్రాలకు మాత్రమే పంపేవారు. అక్కడివారు ఇంకో మూడు ప్రతులను చేతితో వ్రాసి ఇంకో మూడు కేంద్రాలకు పంపాలి. అలా ఆ సందేశం అన్ని కేంద్రాలకు వెళ్లిపోయేది. ఎంత అద్భుతమైన సాధనో అది. ఈ రోజులలో మాదిరి వాటిని

అచ్చువేసి పంపటమో, జిరాక్సు కాపీలు తీసి పంపటమో చేయనిచ్చేవారు కాదు. ఇలా వ్రాసి పంపటం వలన అందులో ఉన్నవిషయం వారి మనస్సుల్లోకి సులభంగా వెళ్ళిపోతుంది. అలా మాస్టర్‌గారు పంపుతున్న సందేశాలను (అఖండజ్యోతి హిందీ మాస పత్రికలో భవిష్యకార్యక్రమాల రూపకల్పనలను) అందరికీ అంద జేసేవారు. స్థానికంగా స్వాధ్యాయ మండలలు ఏర్పాటు చేసి వాటి ద్వారా మాస్టర్‌గారు పంపిన ఈవిషయాలను అప్రమత్తంగా అమలు చేసేవారు. ఆ రోజులలో ఈ కార్యక్రమాలను కార్యకర్తలు ఎంత ఉత్సాహంగా చేసేవారో చెప్పలేం !!

19-07-92న మాస్టర్‌గారు ఇలా వ్యక్తపరచారు "ఇక నుండీ మీకు వ్రాసే ఉత్తరాలు 1993 వసంత పంచమికి సూక్ష్మజగత్తునుండీ గురుదేవులందిస్తున్న అనంత జ్ఞాన సంపదను మనము పూర్తిగా తెలుసుకొని దానిని ఇతరులకు సులభంగా చెప్పగలిగే సాధనా పద్ధతులను తెల్పటానికి ప్రయత్నిస్తాను. ఈ విశిష్టసాధనా క్రమంలో పాలుపంచుకోదలచినవారు నాలుగు సంయమనాలు - సమయసంయమనం, ఇంద్రియసంయమనం, వాక్ సంయమనం, అర్థ సంయమనాలను పాటించాలి." భవిష్యకార్యక్రమాల రూపకల్పనలను వారే ముందుగా 'లేఖామాలల' ద్వారా పరివార్ సభ్యులకంద చేసేవారు. "దేవ సంస్కృతి దిగ్విజయ యాత్ర" అనే విశేష సంచిక ప్రత్యేకంగా అఖండజ్యోతి హిందీ మాసపత్రిక (1992 నవంబరు నెలలో) అశ్వమేధ యజ్ఞాలను ఎలా చెయ్యాలో తెలిపేటటువంటి సమగ్ర రూప కల్పనలనందించగా - దానికి ముందుగానే అంటే 1991 మే నెల 2వ తేదీన వ్రాసిన లేఖలో ఒక విషయాన్ని మర్మగర్భితంగా గురుదేవుల సూక్ష ప్రేరణగా ఎలా అంద చేశారంటే.....లేఖప్రతిని ఈ క్రింద పొందుపరచుచున్నాము.

బుద్ధావతారం ఉత్తరార్ధంలో నిష్కళంక ప్రజ్ఞావతారంగా మహాకాలుని ఆదేశాల మేరకు రాబోయే విశ్వజిత్ మహాయజ్ఞానికి అంకురార్పణగా ఇంటింటా జరిగే దీపయజ్ఞ రూపమైన, యుగయజ్ఞరూపమైన, వాజపేయ యజ్ఞాలు గాయత్రీ పరిజనులకు 'రాజసూయ యజ్ఞాలుగా పరిణతి చెంది సాహసము గల "సమర్పణ" చేసుకునే ధీశాలురకు సూక్ష్మజగత్తు నుండీ గురుదేవులందించే ఆహ్వానం మేరకు ఈ యజ్ఞప్రక్రియల నన్నింటినీ నరమేధముగా మార్చగలగాలి. అని వ్రాస్తూ దానికి తగిన సాధనా విధానాలను కూడా అందించటం జరిగింది.

ఈ విధంగా 'గురుదేవుల' సందేశాలను సూక్ష్మజగత్తు నుండీ ప్రేరణా రూపముగా, 'లేఖామాలల' ద్వారా అందజేస్తుండేవారు. ఇలా ప్రారంభించబడిన కార్యక్రమాలు రాష్ట్రమంతటా

తీవ్రస్థాయిలో దావానలంలాగా వ్యాపించాయి. అనేక మందికి వారితో చక్కటి పరిచయాలు ఏర్పడ్డాయి. వారంతా మాస్టర్‌గారి అనుగ్రహంతో రక, రకాల ప్రేరణలను, విభూతులను, ఆశ్వాసనలను, ఆరోగ్యాలను పొందారనటంలో ఏ మాత్రమూ సందేహం లేదు.

## లేఖామాల – 1

పూజ్యగురుదేవుల మహాప్రయాణం తర్వాత మహానందిలో శిబిరం అయ్యాక ఇంక మాస్టర్ గారు పూర్తి అంతరంగ సాధనలోకి వెళ్ళిపోయారు. ఒక్క రామసుబ్బయ్యగారిని తప్ప ఇంకెవ్వరినీ కలవటం ఆపేశారు. సూక్ష్మజగత్తు నుంచీ పూజ్యగురుదేవుల ద్వారా పంపబడే ఆ సూక్ష్మదైవీ సంకేతాలను పట్టుకోవాలంటే సాధనతో పాటు స్వాధ్యాయం అనివార్యం. వీటితో పాటు నాలుగు సంయమనాలను, కఠినాతి కఠినంగా ఆచరించేవారు. ఇంత చేస్తున్నా ఉద్యోగబాధ్యతలను అతి మామూలుగా, ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా చాలా ప్రశాంతంగా చేసుకుంటూ పోయేవారు. సంధ్యాసమయాలలో చేసే సాధన, ధ్యానాల ద్వారా గురుదేవులందించే సాధనాపరమైన ఆ దివ్య శక్తి ధారల సంకేతాలను పట్టుకొని, వాటిని లేఖామాలల రూపంలో పరివార్ సభ్యులకు పంపిస్తుండే వారు.

పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్యజీ మహాప్రయాణం తర్వాత మాస్టర్‌గారు పరివార్ సభ్యులతో కలవటం చాలా వరకు తగ్గించేశారు. కానీ లేఖామాలల ద్వారా విశిష్టమైన తమ సందేశాలను, సాధనలను అందించేవారు. మొదటి లేఖామాలలోని సందేశం ఇలా ఉంది., 'ఈనాటి శరీర నిర్మాణాలు, దేశకాల పరిస్థితులు నేను స్వయంగా 20సంవత్సరాల పాటు జరిపిన వైజ్ఞానిక సాధనా పద్ధతుల ఫలితమే ఈ లేఖామాల. ఇందులో ఇవ్వబడిన సాధనలను తు.చ తప్పకుండా ఆచరించే వారికి తప్పని సరిగా వారివారి అనేక జన్మలనుంచీ కనిపించకుండా, వెనువెంట ఉండి ప్రోత్సహిస్తున్న గురుదేవుల సూక్ష్మసంపర్కమేకాకుండా, ఈనాటి పరిణామక్రమంలో తాము చేయవల్సిన కార్యక్రమాలను సుస్పష్టంగా గుర్తించగలుగుతారు. పూజ్యగురుదేవుల, మాతాజీ, గాయత్రీమాతల అనుగ్రహ ప్రసాదము ఈ ఉత్తరంలో చెప్పబడిన సాధనల వలన మీ అందరికీ లభించాలని ఆశిస్తూ.'..........

**మౌనం ఎందుకు?:** ఈనాడు ప్రపంచంలో, దేశవిదేశాలలో గల అనేక ఆధ్యాత్మిక సంస్థలు రాబోయే భవిష్యత్ కాలాన్ని మానవజాతికి అధిగమించలేని జటిలసమస్యగా వర్ణిస్తూ రాబోయే

కాలము ఒక చైతన్యపూరిత యుగంగా అభివర్ణిస్తున్నారు. ఈ అన్నిసంస్థల గురువులూ, వారిప్రముఖ అనుయాయులూ చెప్పేది సంగ్రహంగా ఏమిటంటే...

1. పరిణామక్రమంలో మానవజాతి ఇప్పుడు ఒక విచిత్రమైన సంధి కాలంలో వున్నది.

2. పృథ్వీ, శుక్రగ్రహము మరియొకగ్రహం పైనమాత్రమే మానవజాతికి, దైవీప్రణాళికలో భాగస్వాములగుటకు దశల వారీగా దీక్షా ప్రణాళిక ఏర్పాటు చేయబడ్డది.

3. కేవలం ఐదు ఇంద్రియాల ద్వారా పొందగలిగే జ్ఞానానికి మాత్రమే పరిమితమైన మానవజాతి, అతీంద్రియశక్తులను గుర్తించి, వాటిని తమ దైనందిన జీవితంలో ఎవరికీ ఏవిధమైన హాని కలుగకుండా ఉపయోగించుట.

4. సృష్టి యొక్క బహు ఆయామి (మల్టీ డైమన్షల్) చేతనత్వ రహస్యాన్ని తెల్సుకొని, కేవలం భౌతిక జగత్తులోనే కాక, అనేక ఆయామాలలో స్వేచ్ఛగా అదే స్థితిలోవున్న అనేకులతో కలిసి పనిచేయుట.

5. దీక్షాప్రకరణలో ఒక రహస్యాన్ని ఈవిధంగా తెలుసుకోవచ్చు. వృక్షజగత్తుకి, ఖనిజ జగత్తులోని రేడియోధార్మికత హేతువు. వృక్షజగత్తులోని రేడియోధార్మికత, జంతువర్గానికి హేతువు. జంతువర్గములోని, రేడియో ధార్మికత మానవసృష్టికి కారణము. మానవజగత్తులోని, రేడియో ధార్మికత అతి మానవచేతనత్వాన్ని సృష్టిస్తుంది.

6. పరిణామక్రమాన్ని చాలా త్వరగా పూర్తిచేయటానికి, మానవజాతికందించబడిన దీక్షావిధానప్రక్రియ దేవతలకు లేదు. అంటే దేవతలు పరిణామక్రమాన్ని ప్రాకృతికమైన కొన్నికోట్ల సంవత్సరాలలో పొందగలరు కానీ మానవులు దీక్షాప్రకరణ వలన ఏడుసంవత్సరాలలోనే పరిణతిని సాధించగలరు. అందువలన దేవతాశక్తులనుపయోగించుకోవటం నేర్చుకోవాలి గానీ, దేవతల దగ్గరకు వెళ్ళి కోరికలు తీర్చమని అడుక్కోకూడదు.

7. రానున్నకాలంలో (civilization) సివిలిజేషన్ దేవ, మానవ సౌభ్రాతృ సమాజంగా రూపొందుతుంది.

8. అయితే ఇవన్నీ జరగటానికి, ఈనాటి భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేవు. అనేక భూకంపాలు, అగ్నిప్రమాదాలు, యుద్ధాలు, జలప్రళయాలన్నీ రాబోయే నూతన సుందరమైన దివ్యమానవ సమాజానికి కావల్సిన భూఖండాలను తిరిగి నిర్మిస్తాయి.

పై సంఘటనలన్నీ జరగాలంటే గురుదేవులు, ఇతర గ్రహాలనుంచీ వచ్చి పృథ్వీ పరిణామ క్రమంలో పాలుపంచుకుంటున్న, మన ఊహలకే అందని, అతి ఉదాత్త ఆత్మలు, దేవతాశక్తులతో పాటు ఈ దివ్యప్రణాళికను అర్థం చేసుకున్న కొంతమంది మానవసమూహాలు ఇప్పుడు, ఇక్కడ అవసరం. మనో, వాక్కాయ, కర్మల ఏకీకరణనే మానవుడు మొట్టమొదట నేర్చుకోవలసిన పాఠము. ఆధ్యాత్మిక సోపానాలలో మొట్టమొదటి మెట్టు ఇదే. చివరి మెట్టు ఇదే !

వాతావరణాన్ని అనుసరించి తన పనులకు అనుగుణ్యంగా ప్రకృతిని ఉపయోగించుకోవటమనేది మానవజాతి నేర్చినవిద్య. పైన చెప్పిన విషయాలను నేర్చుకుని, వాటిని ఉపయోగించుకొనుటకు, తెలుసుకొనుటకు, నెలలో రెండు రెండు రోజులు బాగా ఉపయోగపడతాయి. అవే అమావాస్య, పూర్ణిమలు. ఒక్క సంవత్సర కాలంలో మానవుడు, భౌతిక ప్రపంచ పరిధిని దాటి బహు ఆయామీ (మల్టీ డైమన్షనల్) చేతనత్వంతో సంబంధం పెట్టుకోగలగాలి. దానికి సంవత్సరంలో 24 సూక్ష్మ, గుప్త, సరళ కాల పరిణామాన్నే గాయత్రీ ఛందస్సు అన్నారు. **ప్రపంచంలోని జ్ఞానాన్ని భౌతిక జగత్తులోని పంచేంద్రియాల ద్వారా నేర్చుకొని వినియోగించుకోవాలి, కనుక దానిని పంచముఖీ గాయత్రి అన్నారు. లభించిన శక్తిని యావత్తూ ఒక్క దైవీ ప్రణాళికకు మాత్రమే ఉపయోగిస్తే దానిని ఏకముఖీగాయత్రి అన్నారు.**

**1991 ఏప్రియల్, మే, జూన్, జూలై, ఆగష్టులలోని ఐదు పూర్ణిమలు సుమారు 1 కోటి 95 లక్షల సం॥ల చరిత్రను కలిగిన ఈ మానవజాతి భవిష్యత్తును నిర్ణయిస్తాయి.**

సంపూర్ణ ఆధ్యాత్మిక సాధనకు గురుమంత్రము "As Above So Below" (పైన ఏది జరుగుతుందో క్రింద అదే జరుగుతుంది). దీనిని అనుసరించి పూర్ణిమనాడు సాయంత్రం తూర్పు, పశ్చిమదిశలలో పరిపూర్ణంగా ఉండే చంద్రుడు (మనస్సు), కుంకుమ వర్ణంలో ఉండే సూర్యుడు (అమ్మవారు), మనకు కనిపిస్తారు. ఆరోజు, ఆ సమయంలో మౌనంగా కూర్చోగలిగితే, మనలో ఉన్న సూర్యుడు (ఆత్మ), మన మనస్సులో పూర్తిగా ప్రతిబింబించి (ధీ) దైవీప్రణాళికనర్థం చేసుకోగలిగే పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల 'మౌనము' అనే ప్రక్రియ ఒక్క పూర్ణిమనాడు మాత్రమే కాక, దాని ముందు నుంచీ సాధన చేస్తూ ఉంటే పూర్ణిమ ధ్యానములో సత్ఫలితాలు వస్తాయి, ఈ సాధనలో అందరూ పాలుపంచుకుని, మానవజాతి చరిత్రలో లభించిన ఈ మహత్తర తరుణాన్ని సద్వినియోగపరుచుకున్నవారిలో మనందరి పేర్లు ఉంటాయని ఆశిస్తూ.... మీ శ్రీరామకృష్ణ.

ఈ ఐదు నెలలలో వచ్చే ఐదు పూర్ణిమలు సుమారు 1కోటి 95 లక్షల సంవత్సరాల చరిత్రకలిగిన మానవజాతి భవిష్యత్తును నిర్మిస్తాయన్న ప్రమాణ మాధారంగా పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఐదు ప్రదేశాలలో అతి ఉచ్చస్థాయి సాధనాశిబిరాలను నిర్వహించాలని సంకల్పించారు. అనుకున్నవిధంగా ఈ ప్రణాళిక గురుపూర్ణిమ నుంచీ ప్రారంభించబడినది. ఆ తర్వాత వరుసగా ఐదు పూర్ణిమల సాధనా శిబిరాలు పరిపూర్ణమైన శ్రద్ధా, నిష్టలతో వేర్వేరు ప్రాంతాలలో ఎంతో దిగ్విజయంగా నిర్వహించబడ్డాయి. వాటి యొక్క సమగ్ర, సంక్షిప్త రూపాన్ని తిరిగి 25-10-91వ తేదీన వ్రాసిన ఉత్తరంలో, సాధనల స్థాయీ భేదాలు, వాటి విశిష్ఠ ఫలితాలను గురించి చాలా వివరంగా వ్రాశారు.

## ఆధ్యాత్మిక రహస్యం

1990వ సంవత్సరం జూన్ రెండవ తేదీన జరిగిన ఆధ్యాత్మిక విస్ఫోటనం (పూజ్య గురుదేవులు గాయత్రీ జయంతి నాడు తమ భౌతిక శరీరాన్ని గాయత్రీమాత చరణాల వద్ద వదిలివేసిన పర్వదినం 2-2-1990) వెనుక గల ఆధ్యాత్మిక రహస్యాలను గురించి విశ్లేషణ చేసిన తరువాత మాస్టర్‌గారు చెప్పిన పరమసత్యాలు.

1990 వసంతపంచమి నుండి మొదలైన అవతార ప్రక్రియ, 1993 వసంతపంచమి నుండి వేగవంతమై నరసింహావతారము యొక్క అతి ఉగ్ర శక్తిధారలను అంతరిక్షం నుండి పృథ్వి మీదకు దింపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఆ ప్రచండతీవ్రతను, ఆ శక్తి ఝంఝామారుతాన్ని ఈ పృథ్వి మీద నివసించే ఖనిజ, వృక్ష, జంతు, మానవ సముదాయాలు తట్టుకోవడానికి వీలుగా ప్రపంచమంతటా విభిన్న ప్రదేశాలలో 'వినియోగ కేంద్రాలు'గా త్రిదివసీయ అశ్వమేధ యజ్ఞ ప్రక్రియ స్థూల, సూక్ష్మ, కారణ, వాతావరణాలలో పరిమార్జన చేయడానికి రూపొందించబడింది. భవిష్యత్తులో జరగబోయే సంఘటనలు, జాతీయ స్థాయిలో **రాబోయే మార్పులతో సహా మొత్తం ప్రపంచ చరిత్రలోనే అనేకానేకా మార్పులు రాబోతున్నాయి. ప్రతికూలతల నుండీ, అనుకూలతలను పొందటానికి, గురుసత్తా నుండీ ప్రేరణ పొందగలిగే, గురుతర బాధ్యత ప్రతీవ్యక్తి మీద వున్నదనీ, కాలము అనుకూలపరిస్థితులనేర్పరిచినా, వ్యక్తిగత కారణాలవలన, ఈ బృహత్తర సదవకాశాన్ని వుపయోగించుకోలేకపోతే, సౌరకుటుంబ చరిత్రలోనే మళ్ళీ ఇటువంటి సదవకాశం మనకు లభించదనే హెచ్చరికను 1992 డిసెంబర్ 30 లేఖామాలలో వ్రాశారు.**

## సహస్రదీపయజ్ఞాల పరంపర

1990 వసంతపంచమికి శాంతికుంజ్‌కు వెళ్ళినప్పుడు తీసుకున్న సహస్రదీప యజ్ఞ పరంపర దీక్ష విషయాన్ని మాస్టర్‌గారికి చెప్పగా, వారు ఈ విషయంమీద దృష్టి పెట్టి అందరికీ ఒక సర్క్యులర్ పంపారు. 'సహస్రదీప యజ్ఞశృంఖల గ్రామగ్రామాల్లో జరగాలి'. అంతే చాలా ఊళ్ళవాళ్ళు స్పందించారు. ఒక్కొక్క నెలలో, ఒక్కొక్క ఊరు అని తేదీలను కూడ నిర్ణయించటం జరిగింది. అలా ఒంగోలు, గుంటూరు, మార్కాపురం, చీరాల, అమలాపురం, ఏలూరుతో సహా మరికొన్ని గ్రామాలలో ఉన్న ఇంకా కొంతమంది పరివార్ సభ్యులు ఈకార్యక్రమం చేస్తామని తమ తేదీలను తెలియపరిచారు.

ముందు ఏ కార్యక్రమమైనా ఒంగోలుతో ప్రారంభమయ్యేది. ఈసారి సహస్రదీపయజ్ఞం కూడా మొట్టమొదటగా ఒంగోల్లోనే పి.వి.ఆర్.స్కూలు ఆవరణలో సాయంత్రం ఆరుగంటలకు వెయ్యిమంది స్త్రీ, పురుషులతో ఎంతో వైభవంగా, ప్రసన్నంగా జరిగింది. పరమాత్మస్వరూపులైన పూజ్యశ్రీ మాస్టర్‌గారు ప్రప్రథమంగా జరిగిన ఈ సహస్రదీపయజ్ఞాన్ని స్వయంగా వారే నిర్వహించారు. ఎంతోదివ్యంగా, ఆకర్షణీయంగా, ఒంగోలు పరివార్ శ్రీ లక్ష్మీనారాయణ దంపతుల కృషి ఫలితంగా జరిగిన ఈ యజ్ఞం అందరికీ ఆదర్శప్రాయం మాత్రమే కాక బహుధా స్ఫూర్తిని, ప్రేరణని ప్రసాదించింది. తర్వాత జరిగిన యజ్ఞాలు మరి కాస్త పూర్ణత్వాన్ని సంతరించుకొని ఎంతో అపూర్వంగా జరిగాయి. తర్వాత శ్రీరత్నాకర్, శ్రీవిశ్వనాథ్, శ్రీరామసుబ్బయ్యగార్లందరీ కృషి ఫలితంగా గుంటూరులో సహస్రదీపయజ్ఞం నయనానందకరంగా జరిగింది.

మార్కాపురంలో శ్రీచెన్నకేశవస్వామిదేవాలయంలో యజ్ఞం మహత్తరంగా జరిగింది. ఆ రోజు దేవాలయానికి మూడు ప్రక్కలా షామియానాలు వేస్తున్నారు. నాలుగోవైపు వద్దనుకున్నారు. అన్ని ఏర్పాట్లను చూస్తున్న అంజనీకుమార్‌ని పిలిచి మాస్టర్‌గారు, 'చూడు, అంజనీకుమార్ ఆ వైపున షామియానాను ఎందుకు వెయ్యలేదు' అని అడిగారు. జనం ఇంత వరకు సరిపోతారుగదా మాస్టర్‌గారూ! అందుకని వెయ్యలేదన్నాడు. ఆ క్షణంలో మాస్టర్‌గారు ఒక అద్భుతమైన సత్యాన్ని చెప్పారు.'ఒకటి గుర్తుంచుకో! మనం ఎంత పెద్ద ఏర్పాట్లు చేస్తే, కార్యక్రమం అంత పెద్ద ఎత్తున జరుగుతుంది. అటువైపు కూడా షామియానాలు వేయించావనుకో, జనం అటువైపు కూడా నిండిపోతారు. కాబట్టి అటు కూడా షామియానాలను వేయించు' అన్నారు. నిజంగానే అక్షరాలా

అంత పెద్ద ఎత్తున ప్రోగ్రాం జరిగింది. ఇక్కడ ఒక ధర్మసూక్ష్మాన్ని గమనించాలి. సాధారణంగా మన ఆలోచనలకు పరిమితులుంటాయి. మహాపురుషులకు ఆ పరిమితులు, హద్దులు ఉండవు. ఎల్లలు లేని ప్రపంచం వారిది. వారి భావాలలో విశాల దృష్టికోణం వుంటుంది. అదే వారి ప్రజ్ఞ. అదే వారి దూరదృష్టికి నిదర్శనం. ఇంక ఆ ధర్మసూక్ష్మాన్ని మేము ఎన్నటికీ మరిచిపోలేదు, ఎవ్వరూ మరచిపోకూడదు కూడా! అలా 'ఈ సహస్ర దీపయజ్ఞశృంఖల' పరంపర కొన్నాళ్ళపాటు కొనసాగింది. అలా మార్కాపురం చుట్టుప్రక్కలగల కంభం, గిద్దలూరు, శ్రీశైలం, అనంతపురం, కర్నూల్ మొదలైన చోట్ల కార్యక్రమాల నిర్వహణకి మాస్టర్‌గారు ఎంతో ఉషారుగా మార్కాపురానికి వస్తుండేవారు.

మార్కాపురాన్ని గురించి మరో చక్కటి సంఘటన చెప్పాలి. మార్కాపురం, బాలుర పాఠశాలలో ఏడు, ఎనిమిది తరగతులు చదివే పిల్లల అల్లరిని మాన్పించటానికి వల్లీ, ఉమవాళ్ళు, సాయంత్రం అవగానే పిల్లలనందరినీ మేడమీదకు తీసుకువెళ్ళి వారికి చక్కటి కథలరూపంలో గాయత్రీమంత్రం నేర్పించటం, యజ్ఞాలు, దీపయజ్ఞాలు చేయించటం నేర్పించి, రోజూ కాస్త గురువుగారి జీవిత చరిత్ర చెప్పివారి మనస్సులలో గురువుగారి పట్ల గాయత్రీ మంత్రం పట్ల అఖండ భక్తి, ప్రపత్తులు కలిగేలా జ్ఞాన బీజాలు వేయటం జరిగింది. అది జన్మ, జన్మల సంస్కారం. అలా యజ్ఞాలు నేర్చుకున్న పిల్లలందరూ మాస్టర్‌గారు వచ్చినప్పుడు వాళ్ళకైవాళ్ళే అన్నిఏర్పాట్లు చేసుకొని మాస్టర్‌గారి సమక్షంలో అత్యుత్సాహంతో దీపయజ్ఞాన్ని అత్యంత రమణీయంగా చేశారు. వారిని చూచి మాస్టర్‌గారు చాలా ఆనందించి, 'మార్కాపురం పిల్లలు బాలపరివార్'. గురుదేవుల అండదండలు సదా వారి వెంటుంటాయి. రాబోయేరోజులలో వీళ్ళవలన ఎంత పని జరుగుతుందో మరి చూద్దాం అన్నారు. ఆనాటి నుంచీ ఆ పిల్లలు ఈనాటికీ ఎక్కడ ఏచిన్నకార్యక్రమము జరిగినా వారక్కడికి వచ్చితమ వంతు అంశదాన-సమయదానాలు అందిస్తూనే ఉంటారు.

## 1991 గురుపూర్ణిమ సాధనా శిబిరం

పూజ్యగురుదేవులు సూక్ష్మజగత్తు నుంచీ పంపే ప్రేరణలను ప్రణాళికా బద్ధంగా, కార్యాచరణలో ప్రయోగించటానికి, మాస్టర్‌గారు లేఖామాలలను అందజేస్తున్న నేపథ్యంలో, ఒకవుత్తరంలో 1991 జూలై నుండీ ప్రతి పూర్ణిమకు, ఒకచోట సామూహికసాధనా శిబిరాలను ఏర్పాటు చేయవల్సిందిగా నిర్దేశించారు. అలా ఐదు పూర్ణిమలు వేర్వేరు ప్రదేశాలలో చెయ్యాలని సూచించారు. ఆ లేఖ

చదివిన వెంటనే గురుపూర్ణిమను మార్కాపురంలో చెయ్యాలనే తమ సంకల్పాన్ని శ్రీరామసుబ్బయ్య గారి ద్వారా పూజ్యశ్రీ మాస్టర్‌గార్కి తెలియజేశాం. వెంటనే మాస్టారు తమ అంగీకారాన్ని తెలిపారు. అనుకున్న సమయానికి ముందు రోజే శ్రీమాస్టారు, కొంతమంది సాధకులు మార్కాపురానికి వచ్చేశారు. ఇల్లు మేడ మీద రెండవ అంతస్తులో వుంటుంది. ఇంక మూడవ అంతస్తులో బెడ్‌రూము ఒకటి వుండేది. మంచిగాలీ, వెలుతురుతో గది విశాలంగా, హాయిగా వుండేది. పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఎప్పుడు వచ్చినా ఆ గదిలోనే ఉండేవారు. కాంప్‌కు సుమారు 60, 70 మంది వస్తారని అంచెనా. అందుచేత మావారు, కాస్త సౌకర్యంగా వుంటుందన్న ఉద్దేశ్యంతో మేడ మీద షామియానాను వేయించారు. పూజ్యశ్రీమాస్టర్‌గారు వస్తూనే, 'షామియానా ఎందుకు మాస్టారూ, తీసేయించండి. డబ్బు దండగ. ఇల్లు హాయిగా సరిపోతుంది' అన్నారు. వేయించేశాంగదా, వుండనిద్దాంలే అనుకున్నారు సత్యనారాయణమాస్టారు.

నేను కూడా ఇల్లు అంత విశాలంగా లేదుగదా, చాలదేమోనని వేయించాం మాస్టారు అన్నాను. 'ఇల్లు విశాలంగా లేకపోతేనేం, మనస్సు విశాలంగా వుంటే చాలు. అన్నీ అవే బావుంటాయి,' అంటూ హాయిగా నవ్వేశారు. ఇంతకీ షామియానా తీయించలేదు. రేపు తీయిద్దాంలే అనుకున్నాం. కానీ మాస్టర్‌గారు ఎప్పుడు చెప్పిన పనిని అప్పుడే చెయ్యమని గదా చెప్తారు. తక్షణమే తీయిస్తే సరిపోయేది. అలా జరగలేదు. సరే, ఆ రాత్రి భోజనాలయ్యాక పడుకోటానికి మాస్టర్‌గారూ, వారితో పాటు ఇంకో పదిమంది పైకి వెళ్ళారు.

వాతావరణం ఎంతోప్రశాంతంగా, హాయిగావుంది. ఉన్నట్టుండి ఉధృతంగా, గాలులు వీచటంతో షామియానా అంతా కుప్ప కూలి పోయింది, అందరూ షామియానా క్రింద ఉండి పోయారు. దానిని మెల్లిగా లేపి ప్రక్కన పడేశారు. అయితే ఎవ్వరికీ ఏదెబ్బలు తగల్లేదు. మాస్టర్‌గారి మాట వినకపోతే ప్రకృతి ఊరుకుంటుందా మరి? మాస్టర్‌గారు మాకిక్కడ ఒక సంఘటన చెప్పారు. గురుదేవుల సమక్షంలో జరుగుతున్న ఒక పెండ్లికి లైటింగ్, బల్బులతోరణాలవీ పెట్టించాలని, మాస్టారు ఇంకొందరు కుర్రాళ్ళు ఉత్సాహ పడ్డారుట. గురువుగారెందుకో ఒప్పుకోలేదుట. అయినా పిల్లలందరూ కల్సి ఉత్సాహంతో లైటింగ్ అంతా ఏర్పాటు చేశారుట. ఆ రాత్రి హటాత్తుగా వర్షం కురిసి అన్నీ కుప్పకూలిపోయాయి. అప్పుడు నిజంగా అనుకున్నారుట, గురుదేవులు చెప్పింది వినాలి అని. ఇప్పుడూ అదే జరిగింది. మీరీ కాంపులో చాలా జాగ్రత్తగా చెప్పింది చెప్పినట్లు

చెయ్యండి, లేకపోతే పరిస్థితులు వేరుగా వుంటాయని చిన్న హింట్ ఇచ్చారు. (ఎందుకంటే ఈ క్యాంపు అగ్నివిద్యకు సంబంధించిన పావక, పవమాన, శుచి అనబడే మూడు అగ్నులకు సంబంధించిన విషయ వివరణ ప్రధానంగా ఉన్నది.) ఇంతలో ఎంత విచిత్రంగా గాలి మొదలైందో, అంతే విచిత్రంగా ఆగిపోయింది. గురుదేవుల లీలలు అలాగే వుంటాయి, వాటిని మనం గమనించుకుంటూ వారి పర్యవేక్షణలో చెప్పింది, చెప్పినట్లు పనులు చేసుకుంటూపోవాలి. అంతేగానీ అక్కడ మన సొంత ఆలోచనలు పెట్టకూడదు.

అంతచిన్న ఇల్లు. దాదాపుగా 90 మంది దాకా సాధకులు వచ్చారు. అందరూ అందులోనే ఎంతో తృప్తిగా, హాయిగా, సరదాగా సాధనలు చేసుకోవటమనేది మాస్టర్‌గారి మహిమగాక మరేమిటీ? సాధనాశిబిరాన్ని టైంటేబుల్ ప్రకారం శ్రీరామసుబ్బయ్యగారు నడిపారు. శ్రీమూర్తి, గౌరీసావిత్రి దంపతులు పిల్లలతో వచ్చి సాధనా కాంప్‌లో పాల్గొన్నారు. వారు గురుదేవుల యుగసంగీతం పాడటం, ప్రజ్ఞాపురాణం చెప్పటం చేసేవారు. ఈ కాంప్‌లో పావక, పవమాన మరియు శుచి అనే త్రివిధ అగ్నుల గురించి ఎంతో బాగా వివరించారు. దాంతో పాటు సాధనలు చేయించారు. అంత చిన్న హాలులోనే ప్రవచనాలు వినేవాళ్ళం, కలిసి మెలిసి భోజనాలు చేసేవాళ్ళం. మాస్టారితో సరదా, సరదాగా కబుర్లుచెప్పేవాళ్ళం. ఎంతో అనందంగా వుండేవాళ్ళం. కాంప్ మొదటి రోజు రాత్రి, ఇల్లు సరిపోతుందో, లేదోనని మేము దిగులు పడుతుంటే, 'గురువుగారు దీనిని పుష్పకవిమానం చేస్తారు లేమ్మా' అని మాస్టర్‌గారు మాకెంతో ధైర్యం చెప్పారు. సాధనాశిబిరం మధ్యరోజున గురుపూర్ణిమ వచ్చింది. ఆరోజు రాత్రి భోజనాలయ్యాక పూర్ణిమాధ్యానం ఉంటుంది. అందర్నీ మేడ మీద సమావేశంకమ్మన్నారు. రాత్రి 10.30 గంటలైంది. అందర్నీ ఒకరికి ఒకరు తగలకుండా దూర దూరంగా కూర్చోమన్నారు.

మెడిటేషన్ చెప్పటం ప్రారంభించారు. అందరూ నిశ్శబ్దంగా, ప్రశాంతంగా, పుచ్చపువ్వులాంటి చల్లని పండువెన్నెల్లో హాయిగా కూర్చున్నాం. మాస్టర్‌గారు ధ్యానం చెప్పటం మొదలెట్టారు. మనందరమూ హిమాలయాపర్వత శిఖరాల మీదకు వెళ్తున్నాము. వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నది. ఒక సన్నని కాలి బాట. ఎటు చూచినా పచ్చని చెట్లు. చెట్లు నిండా పువ్వులతో కళకళ్ళాడిపోతున్నాయి. అంత ఆహ్లాదకరమైన వాతావరణంలో బాట చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎదురుగా ఎత్తైన కొండ కనిపిస్తున్నది. ఆ కొండ శిఖరాగ్రాన మాతగాయత్రీ ఆశీనురాలైవున్నది.

అపురూపమైన దివ్య సౌందర్యంతో, మేలిమి బంగారు ఛాయతో కోటిసూర్యులకాంతులతో ధగద్ధగాయ మానంగా మెరిసిపోతున్నది. చూస్తుంటే ఇంకా చూడాలనిపించే దివ్యమంగళ స్వరూపం. ఆమె దగ్గరకు వెళ్ళాలని త్వరత్వరగా అడుగులు వేస్తున్నాము. ఇంతలో మాతాజీ, గురుదేవులు వచ్చారు. మన చేతులు చెరోప్రక్కన పట్టుకుని నడిపిస్తూ మాత గాయత్రీ వైపునకు తీసుకువెళుతున్నారు. మనం చిన్నపిల్లల వలె వారి చేతులు పట్టుకొని మెల్లిమెల్లిగా అడుగులు వేస్తూ ముందుకు వెళ్తు న్నాము. ఆనందం... వర్ణించనలవిగాని ఆనందం. ఆ చల్లని పండువెన్నెల్లో మాస్టర్‌గారు అలా వర్ణిస్తూవుంటే అందరికీ మేను పులకించి పోతున్నది. మెల్లగా గాయత్రీమాత సమీపానికి చేరుకుంటున్నాము. ఆ రోజు ఆ మేడమీద అతి చల్లని ఆ హిమాలయ పర్వతసానువులలో వుండే ఆ ప్రశాంత దివ్యవాతావరణాన్ని అందరం అనుభూతి చెందాం. అందరం దివ్యలోకాలోకి వెళ్ళి పోయాం. రాత్రి చాలా పొద్దు పోయింది. మైకు లేక పోయినా మాస్టర్‌గారు చెప్తున్నమాటలు ఎంతో మధురంగా వినిపిస్తున్నాయి. ధ్యానంలో ఇంకా లోతుల్లోకి తీసుకువెళ్తున్నారు. అర్ధరాత్రి 3.00 గంటల వరకూ దేవాత్మహిమాలయాలలో మాతగాయత్రీ, మాతాజీ, గురుదేవుల దివ్యసన్నిధిలో అందర్నీ ఓలలాడించారు. ధ్యానం ముగిసింది. అందరూ అలానే నిద్రలోకి ఒరిగి పోయారు. ఆరోజు రాత్రి మాస్టర్‌గారి పాదాలు మంచులో తిరిగితే ఎలా గడ్డకట్టుకు పోతాయో అలా చల్లబడి పోయాయి. ధ్యానమంటే అంతలా అనుభూతి చెందగలగాలి. అప్పుడే ఆ ధ్యానము యొక్క పరిపూర్ణ అనుభూతిని పొందగల్గుతారు. ఆ రోజు ధ్యానంలో పాల్గొన్న వాళ్ళందరి హృదయాలు ఆనందంతో తేలి పోసాగాయి.

మర్నాడు స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో పంచకుండీ గాయత్రీ హోమాన్ని మాస్టర్‌గారే స్వయంగా, యుగయజ్ఞ పద్ధతిలో నిర్వహించారు. ఆ యజ్ఞంలోనే శ్రీమతి లక్ష్మీరాజగోపాలుకు పుంసవన సంస్కారం చేశారు.

ఎంతో అందంగా, ఆనందంగా జరిగిన ఈ శిబిరంలో తరువాత రోజు రాత్రి 'శాంతి అస్త్ర ప్రయోగ'మనే మరి ఒక దివ్యమైన సాధనను కూడా చేయించారు. శ్రీకృష్ణుడు కీలితం చేసిన అస్త్రవిద్యను, తిరిగి శాంతి అస్త్రప్రయోగం ద్వారా పునర్వ్యవస్థీకృతం చేయటం జరిగిందని చెప్పారు. అద్భుతమైన అస్త్రప్రయోగమది. విశ్వశాంతికిదోహదం చేసే దివ్యాస్త్రప్రయోగమది. దానిని ప్రతీరోజూ చెయ్యమని చెప్పారు, దాని వలన కుటుంబంలో, ప్రకృతి పరిసరాలలో కూడా దివ్యమైన శాంతి

వస్తుందని ప్రతీరోజూ ఒకే సమయానికి చెయ్యటం చాలా మంచిదనీ చెప్పారు. ఇంకా ఈ సాధన శిబిరం గురించి చివరగా మాస్టర్‌గారు, 'ఎంతోక్వాలిటీతో పాటు క్వాంటిటీగా' జరిగిందని ఒక మంచి సర్టిఫికేట్‌నిచ్చారు.

దాని తర్వాత శ్రావణ పూర్ణిమకు రెండవ సాధనా శిబిరం ఒంగోలులో శ్రీలక్ష్మీనారాయణ గారింట్లో మూడురోజుల పాటు జరిగింది. ప్రత్యేకించి ఇక్కడ అఖండజ్యోతిని స్థాపించి అఖండజపం చేయించారు. శ్రావణపూర్ణిమ నాటికి 2లక్షల40వేల జపం జరగాలనేది మాస్టర్‌గారి లక్ష్యం. దానితో పాటు భగవద్గీత గురించి ఈశిబిరంలో ప్రత్యేక ప్రవచనాలు చెప్పారు. ఆరోజు పూర్ణిమ, పండు వెన్నెల. సన్నగా చిరుజల్లు పడుతున్నది. మాస్టర్‌గారెందుకో చాలా గంభీరంగా వున్నారు. పూర్ణిమరోజు రాత్రి ధ్యానానికి చుట్టుప్రక్కల ఊళ్ళనుంచీ చాలామంది సాధకులు వచ్చారు. ఆరోజు ధ్యానానికి ముందు చాలా జాగ్రత్తలు, సూచనలు కూడా చెప్పారు. ధ్యాన సమయంలో పూర్తి జాగురూకులై ఉండమని చాల హెచ్చరించారు. ధ్యానంలో వచ్చే అనుభూతులను జాగ్రత్తగా గుర్తుంచుకోమని చెప్తూ ధ్యానాన్ని ప్రారంభించారు. 'వజ్రాయుధ'మనే పేరుగల అస్త్రప్రయోగం చేయించారు. చాలా శక్తివంతమైన సాధన. సుమారు రెండుగంటలకు పైనే జరిగింది ఆరోజు రాత్రిసాధన. సాధనంతా అయిపోయాక, మెల్లిగా అందరూ కళ్లు తెరిచాక, ఎవరికైనా ఏమైనా అనుభూతులు వచ్చాయా? అని అడిగారు. ఎవరికొచ్చిన అనుభూతిని వారు చెప్పారు. అందులో కుమారి తేజశ్రీకి మాత్రం మాస్టర్‌గారు ఏ లక్ష్యంతో ఆ సాధన చేయించారో అది దర్శనమైంది. ఆ అమ్మాయి తనకు కనిపించి ఒక సింబల్‌ను పేపరు మీద గీసి చూపించగా మాస్టర్‌గారు కోరిన ఫలితం లభించిందని, ఇంక ఆసాధనను ఎవ్వరూ చెయ్యవద్దని చెప్పారు. ఆ ప్రయోగాన్ని ఆ రోజు వరకే పరిమితం చేశారు. ఆనాడు శ్రీకృష్ణుడు కీలితం చేసిన అస్త్రవిద్యను ఈ యుగసంధి పర్వవేళలో మాస్టర్‌గారు వాటిని ఉత్కీలనం చేయటమనేది ఒక నియతి. అలా వారి లక్ష్యం మేరకు శ్రావణ పూర్ణిమ సాధన కూడా అనుకున్నంత విజయవంతంగానే చేయటం జరిగింది.

ఇక మూడవ పూర్ణిమ భాద్రపద పూర్ణిమ. ఈ సాధనా శిబిరాన్ని చీమకుర్తి దగ్గర గల రామతీర్థం అనే గ్రామంలో నిర్వహించబడినది. ఈ శిబిరంలో మహాభారత నిర్మాణానికి శ్రీకృష్ణుడు, వ్యాసుడు, మొదలైన వారంతా ఎలాంటి ధృఢమైన పునాదులను వేశారో వివరిస్తూ, ప్రస్తుతం మనమేం చెయ్యాలనేది వివరించారు. కింగ్‌డమ్ ఆఫ్ గాడ్స్, ఆరా గురించి ఈ సాధనా శిబిరంలో

వివరించారు. ప్రణాళికాబద్ధంగా, గురుదేవుల సూచనలమేరకు సాధనాసమయంలో ఆచి, తూచి అడుగులను వేయటం జరిగింది.

అలానే భాద్రపద మాసంలో గణపతి నవరాత్రులలో ఐదురోజుల సాధనాశిబిరాన్ని ఏర్పాటు చెయ్యమన్నారు. దానిని శ్రీశైలంలో కరివెనవారి సత్రంలో సెప్టెంబర్ 11వ తేదీ నుంచీ 15వ తేదీ వరకు చేయటానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. అప్పటికింకా మేము మార్కాపురంలోనే ఉద్యోగం చేస్తుండటం వల్ల ఆ క్యాంపును తేలికగా ఏర్పాటు చేయగలిగాము.

## అధ్యాయం-6

# గణపతి నవరాత్రులు... పంచకోశ జాగరణ సాధనా శిబిరం

ఈసారి సాధన 'గాయత్రీపంచకోశసాధన'. ఈశిబిరానికి ఇరవైరోజులు ముందరే, గాయత్రీ మహావిజ్ఞాన్ బాగా చదువుకొని రమ్మని సూచించారు. ఒక ఐదుమందిని ప్రత్యేకించి ఐదు కోశాలగురించి బాగా అధ్యయనం చేసి రావాలనీ వాళ్ళిక్కడ ఆ విషయం మీద క్లాసులు చెప్పాలనీ ఇంకా ఈ సాధనకొచ్చేవారు, రోజుకు రెండుగంటలు మౌనం పాటించి రావాలనే నియమాన్ని కూడా చెప్పారు. ఆరోజుల్లో సాధనకు వచ్చే వారందరూ ఆ నియమాలనన్నిటినీ తు.చ.తప్పకుండా పాటించే వచ్చేవారు. అందులోనూ శ్రీశైలంలో సాధనాశిబిరం అంటే మరీ ఉత్సాహంగా పరిగెత్తుకుంటూ వచ్చేవారు. అందరూ అనుకున్న సమయానికే అంటే 10వ తేదీకి శ్రీశైలం చేరాం.

సెప్టెంబర్ 11వ తేదీ ఉదయం 4.00 గంటల నుండీ శిబిరం ప్రారంభించాం. ఎక్కడ సాధనాశిబిరం జరిగినా, శాంతికుంజ్‌లో మాదిరే ఉదయహారతితో కార్యక్రమాలు ప్రారంభమయ్యేవి. కాంప్ నిర్వహణ బాధ్యతనంతా శ్రీ సీతారాం, శ్రీరామసుబ్బయ్యగార్లు చూచుకునేవారు. ప్రతీ రోజూ ఆరతి అయ్యాక జపం, ఆ తర్వాత పంచకుండీ హోమం చేసేవారు. కాస్త విరామం ఇచ్చాక యుగసంగీతం రెండుపాటలను పాడేవారు. ఈ పాటలను శ్రీ సీతారాం, శ్రీమతిగౌరీసావిత్రి, తేజ, ఉమా, భాస్కరవల్లి వాళ్ళు పాడుతుండేవారు. అది అయ్యాక మాస్టర్‌గారి ప్రవచనాలు ప్రారంభమయ్యేవి. ఈప్రవచనాలలో ప్రధానంగా మాస్టర్‌గారు గజలక్ష్మీ ధ్యానవిధానానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. ఈ ధ్యానం ద్వారా పంచకోశాలనెలా దాటాలో ప్రయోగాత్మకంగా చేయించారు.

ప్రతీరోజూ ఈసాధనను చక్రాలమీద చేయించేవారు. ముఖ్యంగా సూర్యచక్రమును జాగృతం చేయటానికి రంగులధ్యానం చేయిస్తున్నప్పుడు మాస్టర్‌గారిచ్చిన వివరణ, సాధకులను ఉత్తేజపరచి వారిలో నిద్రాణంగా వున్న ఆ దివ్యశక్తి అనుభూతమయ్యేటట్లు చేసింది. ఆరోజంతా నిజంగా అందరూ ఒకవిధమైన ట్రాన్సులో ఉన్నట్లనుభూతిని చెందారు. తర్వాత ఏ చక్రంలో ఏ రంగును ఊహించుకోవాలి, ఆ సాధనాఫలితాలెలా వుంటాయనేది విశేషంగా వివరించటం జరిగింది.

ఇంక 12వ తేదీ వినాయకచతుర్థి. సాక్షిగణపతి వేంచేసి వున్న ఆ పుణ్యక్షేత్రంలో వినాయక చవితి చేసుకోవటం ఎంతో అదృష్టంగా అందరూ భావించారు. ఎంతో శ్రద్ధా, భక్తులతో అందరూ పూజకు సిద్ధమయ్యారు. శ్రీసీతారాం, మూర్తిగార్లు వినాయక చవితి ప్రాశస్త్యాన్ని వివరిస్తూ, పూజ, అర్చనలను ఎంతో దివ్యంగా చేయించారు. ఆ సాయంత్రం సీతారాంగారు సుదర్శన విద్యను గురించి సంక్షిప్తంగా పరిచయంచేసి, పారాయణ క్రమాన్ని సామూహికంగా చేయించారు. ఇంక రోజు వారీ కార్యక్రమాలలో పంచకోశసాధనలో, అన్నమయ కోశంగురించి శ్రీ సీతామహలక్ష్మిగారు, ప్రాణమయకోశం గురించి పూజ్యశ్రీమాస్టర్‌గారు, మనోమయకోశం శ్రీమతిసీతామహలక్ష్మి, విజ్ఞానమయకోశం గురించి నేను మరియు ఆనందమయ కోశాన్ని శ్రీసత్యనారాయణగార్లు సంక్షిప్తంగా వివరించాము. సాయంత్రం ప్రవచనంలో శ్రీరామసుబ్బయ్యగారు, పరమగురువులు... వారి ప్రణాళికలను చాలాబాగా వివరించారు.

సాక్షిగణపతివారి సాన్నిధ్యంలో మాస్టర్‌గారు అనేక భవిష్యప్రణాళికలకు బీజారోపణను చేశారు. సంగ్రహంగా చెప్పాలంటే ఈ శిబిరంలో అగ్నివిద్యకు, శ్రీనివాసవిద్యకు, మహాలక్ష్మీసాధనకు, పరమగురువుల ప్రణాళికలను ఎంతోగుప్తంగా, గంభీరంగా, అత్యంత సరళంగా అందరికీ ప్రసాదించారు. శ్రీశైలంలో సాధనలకు ప్రతీకగానేమో తరువాత కాలంలో అనుగ్రహనగర్‌లో అపూర్వగణపతిని స్థాపించారు. తర్వాత ఆ క్షేత్రంలో మల్లవరంలో పెద్ద డ్యాం నిర్మించబడి ప్రకాశంజిల్లాకు చక్కటి నీటి వసతిని ప్రసాదించింది. గణపతిని ఒక విధంగా నీటిలోనేగదా వుంచుతాం. అలాగే శ్రీశైల మల్లీశ్వరస్వామి దివ్య అనుగ్రహమా, అన్నట్లుగా తర్వాత కాలంలో కాకువాయి, నెల్లూరుజిల్లా శ్రీహంసరామ ఆశ్రమంలో పంచముఖశివలింగాన్ని కూడా దివ్యాత్ములైన మన మాస్టర్‌గారు స్థాపించటమనేది ప్రకృతిలోని ఒక నియతిగా, ఒకతత్త్వంగా మనం గుర్తించాలి. దివ్యలోకాలలో వున్నామా అన్నంత ఆనందంగా, తెలియకుండానే ఐదురోజులు గడిచి పోయాయి.

## 1991లో దేవీ నవరాత్రులు

1991అక్టోబర్, 7వ తారీకు నుండీ 16వ తారీకు వరకు దేవీనవరాత్రి సాధన, ఒంగోల్లోని వేమూరి కళ్యాణమంటపంలో, శ్రీలక్ష్మీనారాయణ దంపతులు ఏర్పాటు చేశారు. ఈ తొమ్మిదిరోజుల సాధనాశిబిరంలో యావన్మందీ పాల్గొనాలనీ, వచ్చేటప్పుడు దుర్గాసప్తశతీ, కుండలినీ మహావిజ్ఞాన్ పుస్తకాలను తీసుకొనిరావాలనే సమాచారం అందరికీ వెళ్ళింది. పూజ్యశ్రీ మాస్టర్‌గారు ముందు రోజే వచ్చి, ఏర్పాట్లు చూసి చాలా ఆనందించారు. ఏడవతేదీ సాయంత్రానికి సాధకులందరూ వచ్చేశారు.

ఆ రోజులలో సాధనాశిబిరము అంటే తప్పనిసరిగా, అందమైన వేదిక – దాని పైన వేదమాత గాయత్రీ, మాతాజీ, గురుదేవుల చిత్రపటాలనలంకరించి వుంచాలి ఆ ప్రక్కనే, వేరుగా అఖండజ్యోతి పెట్టి అఖండ జపం జరిగేలా తగిన ఏర్పాట్లను చేయించేవారు. విధిగా ప్రతీ రోజూ యజ్ఞం జరగాలి. అదీ సిలబస్. ఆ తర్వాతే మిగిలిన కార్యక్రమాలు. ప్రవచనమునకు ముందు తప్పక యుగసంగీతం పాడాలి. కార్యక్రమ నిర్వహణ బాధ్యత ఎప్పటి లాగే శ్రీరామసుబ్బయ్య, నేను తీసుకున్నాం. ఈ సాధనా శిబిరంలో ప్రత్యేకంగా దుర్గాసప్తశతిలోని 700 శ్లోకాలను మాస్టర్‌గారే స్వయంగా పారాయణ చేస్తూ వివరణ నిచ్చారు. ఈ శిబిరంలో దుర్గాసప్తశతి చదవటం అందరూ నేర్చుకున్నారు. ఈశిబిరంలో ఇదొక్కటే ప్రత్యేక సాధన. రోజువారీ కార్యక్రమాల్లో తనకు కేటాయించిన సమయంలో కుండలినీ మహా విజ్ఞాన్ క్లాసులను చెప్పే అవకాశం నాకు దక్కింది. ప్రతీ వారికి సబ్జెక్ట్ మీద అవగాహన తీసుకు రావాలనే అభిప్రాయంతో, సిలబస్‌గా ఇచ్చిన పుస్తకాలను బాగా చదివి, వాటిమీద క్లాసులు చెప్పమని అందర్నీ ప్రోత్సహించేవారు. అందరికీ విషయ పరిజ్ఞానం తీసుకురావాలనేదే వారి తపన. ఆ విధంగా అందరితో స్వాధ్యాయం చేయించేవారు.

### శిబిరంలో జరిగిన విశేష సాధనలు

1. ప్రతీ సాధకుడూ 24 వేల గాయత్రీమంత్ర జపసంఖ్య పూర్తి చెయ్యాలి. ఈ సాధన వలన మనకు కాలపురుషునితో సంబంధం ఏర్పడుతుంది. (కారణ జగత్తు)

2. శ్రీ సూక్త, పురుష సూక్త పారాయణ. (సుదర్శనవిద్య లేక శ్రీనివాస విద్య).

ఇది కాలపురుషుని స్వభావ, స్వరూపాలను తెలుపుతుంది. (సూక్ష్మజగత్తు).

ఈ పారాయణను శ్రీ సీతారాంగారు చేయించారు.

3. దుర్గా సప్తశతి పారాయణ బాహ్య ప్రపంచంలో కాలపురుషుడు కోరుకునే ఆసురీశక్తి సంహారానికి సాధకుని కారణ, సూక్ష్మ, స్థూల శరీరాలలో అవసరమైన మార్పులను తెస్తుంది.

ఇలా ఈ సాధనా శిబిరంలో దైవీప్రణాళికలో భాగంగా, వ్యక్తి యొక్క స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలో అవసరమైన మార్పులను తీసుకువచ్చి, కాలపురుషునితో మనకు సంబంధాన్ని ఏర్పరచటానికి, పైనచెప్పిన సాధనలను అలవోకగా, ఎంతోసరళంగా చేయించటమనేది, పరమాత్మ స్వరూపులైన ఒక్క మాస్టర్‌గారికి మాత్రమే సాధ్యమనేది పరమ సత్యం. ఈ యుగసంధి కాలంలో, అజ్ఞానాంధకారంలో దిశారహితంగా జీవిస్తున్న మనపై అపార కరుణతో, ఇంతింత సాధనలను మనచేత చేయించి, గురుప్రణాళికలో భాగస్వాములను చేసి, ఎప్పటికీ సాధనామార్గంలో నడిచే విధంగా మన జీవితాలను క్రమబద్ధం చేశారు.

ఇలా సాధనాశిబిరాలకు వచ్చిన కార్యకర్తలు తాము నేర్చుకున్న ఈ జ్ఞానాన్ని, వారివారి గ్రామాలకెళ్ళి ఎంతో ఉత్సాహంతో, అక్కడవున్న పరివార్ సభ్యులకు గురుదేవుల సందేశాన్ని, పొల్లుపోకుండా నేర్పించేవారు. అలా, అలా భావభరిత శ్రద్ధాళువులైన కార్యకర్తల కృషి ఫలితంగా, ఆంధ్రావనిలో గాయత్రీపరివార్ అనే వటవృక్షం శాఖోపశాఖలుగా అత్యంత తీవ్రగతితో వ్యాపించసాగింది. ఆ రోజులలో సాధనా శిబిరం అనగానే సాధకులు ఉత్సాహంతో పరిగెత్తుకుంటూ వచ్చి పదిరోజులూ అలా ఉండి పోయేవారు. అంత ఆనందంగా ఉండేలా మాస్టర్‌గారు అందరినీ ఎంతో ప్రేమతో, ఆత్మీయంగా చూచుకునేవారు. అలా సహజీవనం చేయించటం, అదే వారిలోగల ప్రత్యేకత. మన అదృష్టం కూడా !

ఇలా గత కొన్ని నెలలుగా జరిగిన కార్యక్రమాలపై సమగ్రమైన సమీక్షను ఈ క్రింది లేఖామాల ద్వారా మాస్టర్‌గారు వివరించారు.

## లేఖామాల - 2

యుగసంధికాలంలో మొదటిపాదంలో అంకురార్పణగా జనవరి, ఫిబ్రవరి, మార్చినెలల్లో పరాస్థాయి సిద్ధాంతాల మార్పు జరిగింది. సంవత్సర కాలపురుషుని గమనంలో ద్వాదశ అమావాస్యలు, ద్వాదశ పూర్ణిమలుగా జరిగే గాయత్రీఛందస్సు యొక్క అవగాహన కొరకు **"మౌనము"** ద్వారా ప్రారంభమైన కార్యక్రమాల పరంపరలో భాగంగా మొదటి ఐదు పూర్ణిమలలో జరిగిన పూర్ణిమా

సమావేశాలు, కుండలినీ శక్తిధారలతో మొదలైన మన పరిచయము చీరాల సాధనాశిబిరంగా రూపొందింది. రెండవపాదములో ఏప్రియల్, మే, జూన్ నెలలకు 'పశ్యంతీస్థాయి' స్వరూపమేర్పడింది. గురుపూర్ణిమ, శ్రావణపూర్ణిమలు మార్కాపురంలో, ఒంగోలులో జరిగాయి. టైం అండ్ స్పేస్‌కి ఆవలవున్న సిద్ధాంతాలు తెలుసుకుంటూ, మూడవపాదంలో అంటే జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలలలో మధ్యమాస్థాయికి దిగింది. అక్కడ పంచీకరణ జరిగి కుండలినీ శక్తిధారలతో సంకలనము చెందే ప్రాణశక్తిధారల సమాంతర ప్రవాహంతో, బ్రహ్మాండ-పిండాండ సమన్వయముగా భూర్-భువః-జనః-తపః-సత్యములు తలాలుగా ఏర్పడుట, మానవశరీరంలో అవి ప్రతిబింబించుటను పంచకోశసాధనను వినాయకచవితి పూజతో కలిపి శ్రీశైలంలో జరిగిన సాధనాశిబిరంలో తెలుసుకోటానికి ప్రయత్నించాము. నాల్గవపాదంలో అక్టోబర్‌లో జరిగిన దేవీనవరాత్రులో రూపొందవలసిన వైఖరీస్థాయి కార్యక్రమాలు, అన్ని దేవతాశక్తుల కలయికయైన దుర్గావతరణ రూపంలోను, మనకు పరిచయమున్న అన్ని ఆధ్యాత్మిక సంస్థలను కలుపుకుని 50వేల దేవస్థాపనా కార్యక్రమాల రూపంలో స్థూలస్థాయిలో కనిపించాలని నిర్ణయించుకున్నాము. ఇది కుండలినీ, ప్రాణశక్తిధారలతో కలవకుండా సమాంతరంగా ప్రవహించే జీవశక్తిధారలుగా ఏర్పడుతుంది.

ఈ అపూర్వమైన త్రివేణీ సంగమము-జ్ఞాన, భక్తి, కర్మ (కాలపురుషుని కోరిక, దానికి మనము ఏర్పరచుకునే స్వరూపము, భౌతికజగత్తులో మనమేర్పరచుకొనే లక్ష్యము)ల ద్వారా డిసెంబరు లోపల, దశావతారాలలో మొదటిదైన మత్స్యావతారంగా అంచెలంచెలుగా ఎదుగుతూ విశ్వమంతా వ్యాపించాలి. పై కార్యక్రమాలను చేస్తూ జనవరి, ఫిబ్రవరి, మార్చినెలల్లో రాబోయే వసంతపంచమినాటికి, 'వరాహావతారము' యొక్క పరాస్థాయి నిర్ణయములను తీసుకోవలసివస్తుంది. ప్రళయకాలంలో సప్తఋషులైన కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వశిష్టులను పడవలో దాటించటమనేది మత్స్యావతార సాంకేతిక గాథ. ఈ కథ ఏడు అక్షరాలు, ఏడుస్వరాలు, సప్తవర్ణాలు ఇవన్నీ వైఖరీస్థాయిలో ఒక అపూర్వ గాంధర్వగానంలాగా పరిణతి చెందాలని తెలుపుతుంది. కానీ అందమైన సంగీతాన్ని తయారుచేసే ముందు అనేక అపశృతులు, అనవసరమైన స్వరములు, అర్థంలేని శబ్దాడంబరాలు పరస్పరం ఢీకొని అద్భుతమైన, ఆనందస్వర ప్రవాహం ఏర్పడతాయి. అలాగే మనందరి కృషి ఫలించేందుకు ముందుగా ఒక కోలాహలం జరగటం సహజం. అందువల్ల ఈ నవనిర్మాణ స్వరలహరిలో అందరూ కలసి,

మెలసి ఏకాత్మతతో పని చేయగలిగే సహనము, ప్రేమ, అనురాగములను పెంపొందించుకొని భవిష్యత్తులో అందరూ కలిసి మెలిసి 'వసుధైక కుటుంబకమ్' అనే ఋషుల కలను నిజము చేయగలరని విశ్వసిస్తూ ఏవిధమైన అవరోధాలు ఏర్పడకుండా వుండాలనే ధృఢసంకల్పం తీసుకోమని కోరుతున్నాను. నారదుల వారి మహతీవీణ, ఆయనకున్న కలహభోజనుడనే నామము – పూజ్య గురుదేవుల శిష్యులందరూ వాల్మీకి, ప్రహ్లాద, ధృవులుగా రూపొందేందుకు ఉపయోగపడాలని, యుగయుగాలుగా మనమంతా చేస్తున్న కృషి పైన చెప్పిన ముగ్గురి స్థాయిలో రూపొందుతుందనీ ఆశిస్తూ...

మీ

**శ్రీరామకృష్ణ**

## యువపరివార్ ఆవిర్భావము

1991 డిసెంబర్ 25వ తేదీన ఏలూరులో, మా మరదలు శ్రీమతి లక్ష్మీరాజగోపాల్ బాబు నామకరణ మహోత్సవానికి నేను, ఏలూరుకు వెళ్లాను. కార్యక్రమాలన్నీ అయిపోయాక, సాయంత్రం వాళ్ల తాతగారు వచ్చి,'అమ్మా, మీరు గాయత్రీ పరివార్‌గదా, గాయత్రీదేవిని గురించి నాలుగు మాటలు చెప్పండి, అందరూ వింటారని' అడిగారు. నామకరణ మహోత్సవానికి వచ్చిన బంధువు లందరూ ఉన్నారు. వారి కోరిక మేరకు పెద్దలందరి సమక్షంలో, నేను మాస్టర్‌గారిని తలుచుకొని, క్రిందటి సాధనాశిబిరంలో చెప్పిన విషయాలను గుర్తున్నంత వరకుచెప్పటం జరిగింది. నేను చెప్పిన ఆ నాలుగు మాటలు వాళ్ళకు సమ్మోహనాస్త్రంలాగా పని చేశాయి. మాస్టర్‌గారి దివ్యాను గ్రహం. ఎక్కడ, ఎవరి ద్వారా ఏం చేయించాలో, వారికి ఆ విధమైన ప్రేరణ కలిగించారు. అంతే, అందరిలోఉత్సాహం వచ్చేసింది. మేమూ గాయత్రీ యజ్ఞాలు పెట్టుకుంటామంటూ, సిద్ధపడిపోయారు. అదంతా గురుదేవులకృప. అంతకు ముందే మా మరదలుకి చెల్లెలు తేజశ్రీ మాస్టర్‌గారి వద్ద గాయత్రీ దీక్ష తీసుకుని ఒంగోలులోను. శ్రీశైలంలోను సాధనా శిబిరాల్లో పాల్గొన్నది. దానితో ఈ కార్యక్రమంతో మరింత ప్రేరణ పొందిన ఆ అమ్మాయి, వాళ్ళ అన్న వేంకట్, అమ్మా నాన్నలు శ్రీమతి భానుమతీ, శ్రీ సదానందమూర్తిగార్లు మిత్రులు సింగ్, ఫణి ఇంకా కొంతమంది ముందుకు వచ్చి, అదే కామాక్షి ఆలయంలో పంచకుండీ యజ్ఞానికి తేదీ నిర్ణయించుకొని ఇంక ఆ పనిలో నిమగ్నమయ్యారు.

అనుకున్న తేదీ రానే వచ్చింది. మొదటిసారే అయినా పిల్లలందరూ ఎంతో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఊళ్ళో పిలిచినవాళ్ళంతా వచ్చారు. యజ్ఞంలో పాల్గొనుట అదే మొదటిసారి కావటంతో అందరూ అదో మహద్భాగ్యంగా భావించారు. యజ్ఞములో వారికి అనుపమానమైన అనుభూతి కలిగింది. అలా అనుభూతిని పొందిన సదానందమూర్తి దంపతులు, తేజ, వెంకట్, శ్రీహనుమంతరావుగారు, సింగ్ మొదలైనవాళ్ళంతా, 'మేము ఈ గాయత్రీ-యజ్ఞ' యుగ్మాన్ని ఊరూరా ప్రచారం చేస్తామని బద్ధకంకణులైనారు. ఇంత చిన్నవయస్సులో ఇంతింత కార్యక్రమాలను చేస్తున్న చి.సౌ. తేజశ్రీకి, చి.జగన్నాధరావుగార్లకు పూజ్యశ్రీ మాస్టర్‌గారే దగ్గరుండి గాయత్రీ పరివార్ సంస్కారపద్ధతిలో వివాహం జరిపించి పూజ్యగురుదేవుల, మాతాజీల అనుగ్రహాశీస్సులను పుష్కలంగా ఆ నూతనదంపతుకు ప్రసాదింపచేసి, తమ ఆశీర్వాదంగా ' మీరిద్దరూ సదా నా పనులను చేయాలనే అగ్నిదీక్షను వారికి ఆ శుభసందర్భంలో ప్రసాదించారు.'

అలా దీక్ష తీసుకున్న వీరితో పాటు ఇంకా కొంతమంది యువకులు కలిశారు. అత్యుత్సాహంతో వీరందరూ అవిశ్రాంతంగా కార్యక్రమాలుచేసి, 1993సం.లో ఏలూరులో 108కుండీల యజ్ఞమును చేయటానికి, మాస్టర్‌గారి అనుమతిని పొందారు. ఆరోజులలో అది అతి పెద్ద కార్యక్రమం. ఈ యజ్ఞాన్ని కె.పి.డి.టి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. మాస్టర్‌గారితో పాటు చాలా మంది ముందు రోజే వచ్చేశారు.

**ఈసారి యజ్ఞములోని విశేషమేమిటంటే, యజ్ఞం చెయ్యటానికి ముందుగా, అశ్వమేధయజ్ఞానికి పతాకావిష్కరణను, మాస్టర్‌గారి చేత చేయించటమనేది ఈకార్యక్రమానికి ఒక హైలైట్ అయింది. భవిష్యత్‌లో జరుగబోయే అశ్వమేధయజ్ఞ పరంపరలకిది, నాందీ ప్రస్థావనగా జరిగింది. మాతాజీ 108 అశ్వమేధాలు జరగాలని ప్రకటించారు. దానికి శుభసూచకంగా ఏలూరులో జరుగుతున్న 108 కుండీల గాయత్రీ మహాయజ్ఞంలో, అశ్వమేధమహాయజ్ఞపతాకావిష్కరణ జరగటమనేది కాకతాళీయం కానేకాదు. ప్రకృతిలో జరుగవలసిన ఒక తథ్యమది. ఎంతో హృదయంగమంగా జరుగుతున్న ఈమహాయజ్ఞంలో, ఈపతాకావిష్కరణ కార్యక్రమం, అక్కడి కార్యకర్తలకది ఎంతో ఆనందాన్ని కూర్చింది. తర్వాత యజ్ఞకార్యక్రమంలో, మాస్టర్‌గారు యజ్ఞంతో పాటుగా, అశ్వమేధయజ్ఞము యొక్క విశిష్టతను గురించి అపూర్వంగా ప్రవచించారు.**

అంతా అయిపోయాక పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఆపిల్లలనందర్నీ పిలిచి చాలా అభినందించారు.

భవిష్యత్‌లో ఇలాగే పెద్దపెద్ద కార్యక్రమాలను చెయ్యాలనీ, మహాకాలుని మహత్తరప్రణాళికలో భాగస్వాములు కావాలనీ ప్రేరణనిస్తూ, 'ఏలూరు వాళ్ళు యువపరివార్' అని అభినందించారు. మాస్టర్‌గారి నోటి వెంట అంతటి అపురూపమైన, ఉత్సాహభరితమైన, ప్రేరణాత్మకమైన అభినందనలు వినగానే అందరూ ఆనందంతో చప్పట్లు కొట్టారు. ఆనాటి నుంచీ ఆ పిల్లలు ఉద్యోగరీత్యా ఏ ప్రాంతానికి వెళ్ళినా, గాయత్రీ-యజ్ఞ యుగ్మాన్ని విడిచి పెట్టకుండా, వీలైనంత సమయాన్ని దాని కొరకు కేటాయించి, మాస్టర్‌గారి సూచనలమేరకు పని చేస్తున్నారీనాటికి.

## మాస్టర్‌గారు - బ్రహ్మోపదేశం

శ్రీమతి రాఘవమ్మగారు ఎస్. ఎస్.వై గురూజీ. ఆమె శ్రీమతి శ్యామలగారికి వదినెగారు. వారిద్దరూ మాస్టర్‌గారికి మంచి శిష్యులు. వారు ప్రతీ రోజూ క్రమం తప్పకుండా ఎస్.ఎస్.వై సాధనలు చేసుకుంటుండే వారు. ఒకసారి వాళ్ళిద్దరూ తమ సంస్థగురించి, వారి గురువుగారి గురించీ, అక్కడ వారు చేయించే సాధనలగురించీ ఇంకా ఎన్నో విషయాలు చెప్తూ, అక్కడికి దగ్గరలోనే జరుగుతున్న ఎస్. ఎస్. వై క్లాసుకు రమ్మని మాస్టర్‌గారిని ఆహ్వానించారు. మాస్టర్‌గారిలో వున్న ప్రత్యేకత ఏమిటంటే, ఎక్కడ, ఎప్పుడు ఏ విధమైన క్రొత్త సాధన కనిపించినా , దానిని ఎంతో శ్రద్ధతో, వినయవిధేయతలతో నేర్చుకుంటుండేవారు. వారు పిలిచిందే తడవుగా వెళ్ళి క్లాసులు చేశారు. బ్రహ్మోపదేశానికి తెనాలి వెళ్ళారు. అక్కడ గురూజీ ఇచ్చిన బ్రహ్మోపదేశాన్ని, సాధనా విధానాలను అత్యంత సూక్ష్మవిచారాలతో నేర్చుకున్నారు. ముఖ్యంగా అక్కడి ఆహార పద్ధతులు మాస్టర్‌గారిని బాగా ఆకర్షించాయి. దుర్గాసప్త:శతీలో, "శాకంబరీతి విఖ్యాతే " అనే పదం యొక్క ప్రయోగాన్ని, ఎస్. ఎస్. వై గురూజీ పట్టుకొని, దానిని తమ సాధనలో ప్రధానాంశముగా ప్రవేశ పెట్టారు. తరగతులనుండీ వచ్చిన తరువాత కూడా మాస్టర్‌గారు ఆ సాధనలను, ఇంకా అక్కడ చెప్పిన ఆహారపుటలవాట్లను పాటిస్తూ, వాటిని మన సాధనలతో కలిపి అందరి చేతా చేయించేవారు. తరువాత ఏ. ఏం. సి. క్లాసులు చేశారు. ఆ తరగతులు చేసి నేరుగా ఏలూరులో ఏర్పాటు చేసిన మహాశివరాత్రి సాధనాశిబిరాన్ని నిర్వహించటానికి వెళ్ళారు.

## మహాశివరాత్రిసాధన - ఏలూరు

'అండాండ పిండాండ సమన్వయ సాధన' అని ఆ సాధనాశిబిరం పేరు. మూడురోజుల పాటు జరిగే ఈ మహత్తరమైన 'మహాకాల సాధనకు' వివిధప్రాంతాల నుండీ సాధకులు వచ్చారు.

యువ పరివారముతో పాటు మాస్టర్‌గారి బావ ఎల్.హనుమంతరావుగారు అందరికీ సరిపోయేలా ఒక చక్కటి కళ్యాణ మంటపంలో అన్ని ఏర్పాట్లు చేసారు. "అండాండ పిండాండ సమన్వయ" సాధనా శిబిరం ప్రారంభమైనది. అణోరణీయాన్, మహతోమహీయాన్..... అంటూ మొదలైన మాస్టర్‌గారి ప్రవచనం ఒక చిన్న పరమాణువు నుండీ మహాకాలుని మహత్వపూర్ణమైన క్రియా కలాపాల వరకు అనర్గళంగా సాగిపోయింది.

సాధనలో భాగంగా ఆహారనియమాలను కూడా పొందుపరచారీ శిబిరంలో. కేవలం పచ్చి కూరలు, పండ్లు, నీరు మాత్రమే స్వీకరిస్తూ ఈ సాధన కొనసాగింది. మాస్టర్‌గారు ఎస్.ఎస్.వై చేసి వచ్చాకనే ఈ మార్పును ప్రవేశ పెట్టారు. ఈ శిబిరంలో భాగంగా, ఏలూరుకు దగ్గరలో వున్న సత్రంపాడు అనే ప్రదేశంలో, సిద్ధ సమాధి యోగా శిష్యుల ఇంటిలో మహాశివరాత్రి నాడు "సిద్ధిరాజు అనుగ్రహ పీఠం"ను స్థాపించారు. పీఠ స్థాపన సమయంలో మాస్టర్‌గారి దివ్యశక్తి , మహాకాలుని అనంతశక్తితో అనుసంధానం చేయబడినది కాబోలు, ఆనాడా ప్రదేశంలో ఆ క్షణంలో ఒక అలౌకాకమైన దివ్యవాతావరణం ఏర్పడింది. తర్వాత ఆ పీఠం యొక్క ప్రాశస్త్యాన్ని వివరిస్తూ, అక్కడ చేయవలసిన సాధనా వివరాలను చాలా స్పష్టంగా వివరించారు. తరువాత కాలంలో "ఈ అనుగ్రహ పీఠం" అభీష్ట వరదాయిగా ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకున్నది.

ఆ కార్యక్రమం అయిపోతూనే అందరూ కళ్యాణ మండపానికి చేరుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా అందరూ ఉపవాస దీక్షలో ఉన్నారు. లింగోద్భవ కాలంలో మాస్టర్‌గారు, "ధ్యాన ప్రక్రియను" ప్రారంభించారు. ఆ రోజు ధ్యానంలో వ్యక్తి, వ్యక్తిలో కరుడుగట్టుకు పోయిన మల, విక్షేప దోషాలు కరిగి పోయేలాగా, అతి తీవ్ర మైన ధ్యాన విధానాన్ని మాస్టర్‌గారు అతి ఉగ్ర మానసిక స్థితిలో చెప్తుండగా, ఆ ప్రచండతను తట్టుకోలేక అందరూ మనో, మాలిన్యాలు కరిగి పోయేలా వెక్కి, వెక్కి ఏడ్చి కన్నీళ్ళ ద్వారా వాటిని కడిగి వేసుకోగలిగారు. ఆ తర్వాత వారి హృదయాలు తేలిక పడి ఎంతో ప్రశాంతతని అనుభూతి చెందసాగారు. అదే ప్రశాంతతను వారిలో అలాగే ఉంచటానికి, మాస్టర్‌గారు మరికొన్ని స్వల్ప సాధనలను ఆ రోజు చేయించారు. అందరూ బాగా రిలాక్స్ అయిపోయారు.

మహా శివరాత్రి కాబట్టి జాగారం చెయ్యాలి. ధ్యానావస్థ నుండీ అందరూ బయట పడ్డాక, 'అందరికీ వేడి, వేడి టీ కావాలి. త్వరగా ఏర్పాటు చెయ్యమని' ప్రక్కన్నే వున్న సదానందమూర్తిగారు,

సింగ్, మామిళ్ళపల్లి శివ, శ్రీరాం, వేంకటేశ్వర్లు వాళ్ళకు చెప్పారు. అప్పటికే అర్ధరాత్రి కావస్తోంది. వాళ్ళు పాల కోసం బయటకు వచ్చారే కానీ ఆ సమయంలో, 'పాలు ఎక్కడ దొరుకుతాయిరా భగవంతుడా' అనుకుంటూ, మళ్ళీ మాస్టర్‌గారు చెప్పారు గదా, అవే దొరుకుతాయనే ధైర్యంతో పాత్ర తీసుకొని వీధిలోకి వచ్చి కాస్త దూరం నడిచారు. ఇంతలో ఒక వ్యక్తి పాలకాన్ పట్టుకొని వెళుతున్నాడు. ఆయన్ను ఆపి, 'పాలు కావాలి, పోస్తావా?' అని అడిగారు. మీదే ఆలశ్యం పోయించు కోండన్నట్లాయన వారు కోరినన్ని పాలు పోసి వెళ్ళి పోయాడు. ఆక్షణంలో వాళ్ళకెంత ఆశ్చర్యం కలిగిందో మాటల్లో చెప్పలేం. ఈ అర్ధరాత్రి ఇంత అందమైన అనుభవాన్ని ప్రసాదించిన మాస్టర్‌గారికి మనస్సులోనే అనేక ధన్యవాదాలు తెలుపుకొని, కాఫీ చేయించి తెచ్చి అందరికీ అందించారు. మాస్టర్‌గారు అన్నారూ అంటే అది వేదవాక్కే, మరి జరిగి తీరాల్సిందే! మాస్టర్‌గారి వాక్శక్తి అంత ప్రభావాన్ని కలిగి వుండేది. మరునాడు పూర్ణాహుతి సమయంలో "ప్రాథమిక సాధనలు" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. శ్రీమతి భానుమతీ, సదానందమూర్తిగార్లు రోజువారిగా చేయవలసిన సాధనల నన్నింటికీ చక్కటి అక్షరరూపాన్నిచ్చి అందంగా అచ్చువేయించి, ఆ పూర్ణాహుతి సమయంలో మాస్టర్‌గారి చేత ఆవిష్కరింప చేసి సాధకులకందరికీ ప్రసాదరూపంలో పంచి అఖండ జ్ఞాన సంపదకు వారసులయ్యారు. వారి వారసత్వంగా, వారి ముగ్గురు పిల్లలూ లక్ష్మీరాజగోపాల్, ఉ షావేంకటే, తేజాజగన్ వాళ్ళు మాస్టర్‌గారు, వారికప్పజెప్పిన పనులను ఈ నాటికీ ఎంతో ప్రేమా, బాధ్యలతో చేస్తూనే ఉన్నారు. ఆపిల్లలు విదేశాలకు వెళ్ళినా, అక్కడకూడా వారా పనిని కొనసాగిస్తునే వున్నారు. అదంతా వారికి మాస్టరుగారిచ్చిన ఆశీర్వాద బలమే !!

## 'శ్రద్ధాత్రయ విభాగయోగ' సాధనాశిబిరం - శ్రీశైలం

1992వ సంవత్సరం అక్టోబర్ ఒకటవతేదీ నుంచీ ఐదవతేదీ వరకు శ్రీశైల పుణ్యక్షేత్రమునందు నిర్వహింపబడిన శక్తిసాధనా శిబిరంలో పూజ్యులు డా.మారెళ్ళ శ్రీరామకృష్ణగారు సాధకులలో శ్రద్ధ అనేది ఎంత గొప్పగా ఉండాలో చెప్పేందుకై భగవద్గీత 17వ అధ్యాయంలోని శ్రద్ధాత్రయ విభాగయోగము నందలి ప్రతి శ్లోకాన్ని చదువుతూ వివరించారు. సర్వకాల సర్వావస్థలలో ఆచరించదగిన ఆ సాధనా సంపత్తిని ఇక్కడ పొందుపరుస్తున్నాము.

ఇప్పుడు మనం 17వ అధ్యాయమును గాయత్రీ పంచముఖీ సాధనతో కలిపి చదువుదాము. ఇక్కడ గాయత్రీ పంచముఖీ సాధనకు, శ్రద్ధాత్రయ విభాగయోగమునకు గల సంబంధమును

జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. గీత, గాయత్రీ, గణేశుడు, గోవు, గురువు (గోవిందుడు), ఈ ఐదింటినీ 'పంచకము'లంటారు. ఎక్కడ ఎవరు ఏం చెప్పినా సాధారణంగా హిందూధర్మాన్ని ఈ ఐదింటి ద్వారానే ప్రపంచానికి అందచేయాలి. ముఖ్యంగా హిందువైనవాడికి ఈ ఐదింటి గురించి బాగా తెలియాలి. నేను 1960-62 ప్రాంతాలలో చిన్మయానందగారి ఉపన్యాసాలను వినటానికి వెళ్ళేవాణ్ణి. అక్కడ ఆయన ఒక సంఘటన గురించి చెప్పారు. ఆ సంఘటన ఈనాటికీ సరైనదేనని పిస్తుంది.

మన భారతదేశపు సాంస్కృతికశాఖామాత్యులు ఒకసారి అమెరికాకు వెళ్ళారుట. సంస్కృతిశాఖ వారు కనుక 'మీరు గీత చదివారా?' అని అక్కడివారు అడిగారట. ఆయనగారది నవల అనుకొని, 'లేదండీ, నేనా నవల చదవలేదు కానీ నా స్నేహితుడు చదివాడు. చాలా బావుందని చెప్పాడు' అని అన్నాడుట. ఇది నిజంగా జరిగిన విషయం. శ్రీ చిన్మయానందగారు ఒక బహిరంగ ఉపన్యాసంలో చెప్పిన విషయమిది. ఇంక అప్పటినుండి 'గీతాజ్ఞానయజ్ఞాలను' చేయాలని సంకల్పించారు. అది ఆయన కోరిక కాదు, ఆవేదన. అంతటి ఆవేదన ఎందుకు కలిగిందంటే 'భగవద్గీతను' నవల అనుకున్న వ్యక్తి భారతదేశపు సాంస్కృతిక శాఖామాత్యులు ఐతే ఇంక దేశంలోని మిగిలిన వ్యక్తుల సంస్కృతి ఎంత గొప్పగా ఉంటుందో అని ఊహించుకున్న భావనతో ఆయన గీతా జ్ఞానయజ్ఞాలను ప్రారంభించారు. భారతీయ సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే గీతను, గాయత్రిని, గోవును, గణేశుని, గురువులను గురించి అర్థం చేసుకోవాలి. వీటిని గురించి తెలిసిన వ్యక్తి మాత్రమే హిందువు.

'ఎ హిందూ ఈజ్ వన్ హూ బిలీవ్ ఇన్ నేచర్ అండ్ లా ఆఫ్ ధర్మా (A Hindu is one who believe in nature and law of Dharma)' అని టిబెట్‌లోని ఒక పరమగురువు చెప్పారు. ఆయనే జ్వాలాకూల్ మహర్షి. వారెప్పుడూ ఆ హిమాలయాల ఉచ్చప్రాంతాల నుండి క్రిందికి దిగి రాలేదు. వారుండే ఆ ప్రాంతాన్ని నందనవనమంటారు. నందనవనమంటే అది నిజంగానే నందనవనం. దానిని గురించి అనేక మంది సిద్ధ పురుషులు తమ ఆత్మకథలలో చాలా వివరంగా వ్రాశారు. ఆ ప్రదేశంలో ఇంతవరకు ఏ మనిషి అడుగుపెట్టలేదు. సిద్ధపురుషులు మాత్రమే అందులోకి ప్రవేశించగలరు. మానవులు అడుగుపెడితే ఆ ప్రదేశం నాశనమౌతుంది. సిద్ధపురుషులు అడుగుపెడితే అది తీర్థమౌతుంది. అందుకే 'తీర్థేకుర్వంతి తీర్థాని' అని పెద్దలు చెప్తారు. ఒకప్పుడు

పుట్టపర్తి ఎవ్వరికీ తెలియదు. ఇప్పుడు ప్రపంచంలో అందరికీ తెలుసు. కారణం సత్యసాయి ఆ ప్రదేశాన్ని తీర్థస్థలిగా శక్తివంతం చేశారు. ఒక ప్రదేశాన్ని తీర్థస్థలిగా చేయగలిగే వ్యక్తి మాత్రమే నందనవనంలోకి అడుగు పెట్టగలడు. గురుదేవులు తమ 'ఆత్మకథ'లో ఒక సన్నివేశాన్ని వివరిస్తారు. వీరభద్రుడు అనేటువంటి సిద్ధిపొందిన ఒక సాధకుడు మాత్రమే అక్కడకు దారిచూపిస్తాడు. హిమాలయాలలో ఉన్న తమ, తమ గురువుల ఆదేశానుసారం సాధన చేసి అర్హత పొందిన సాధకులు, విశిష్ట సాధకులు ఎవరైనా గోముఖానికి వస్తే, వారికోసం ఆ వీరభద్రులు గోముఖము వరకు వెళ్ళి అక్కడనుండి నందనవనం వరకు దారి చూపిస్తారు. సరే ఒకసారి వెళ్ళివచ్చాం కదా మరల వెళదామనుకుంటే వీలుకాదు. ఆ వీరభద్రుడు అలాగే శ్రీరామశర్మఆచార్యగారిని, నందన వనానికి తీసుకువెళ్ళాడు. హిమాలయాలలోని అతి ఉచ్ఛక్షేత్రాల్లో ఉంటూ కోట్లాది దేశ, విదేశ సంస్కృతులకు కోట్లాది సంవత్సరములనుండి మార్గదర్శనం చేస్తున్న గురువులు హిందువును గురించి, పునర్జన్మను గురించి చెప్పినటువంటి నిర్వచనమేమిటంటే, 'పునర్జన్మ మీద నమ్మకం ఉన్నవాడు కాదు, పునర్జన్మను గురించి తెలిసిన వాడు మాత్రమే హిందువు'. ఈ పదాలను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. దీనికంతటికీ కావల్సిందేమిటంటే 'శ్రద్ధ'.

## శ్రద్ధ అంటే ఏమిటి?

ఇక్కడ 'హిందువు' యొక్క నిర్వచనం చెప్పినటువంటి ఒక మహనీయుని గొప్పతనాన్ని గురించి చెప్తున్నాను. ఎందుకంటే అది తెలిస్తేనే గాని 'శ్రద్ధ' అంటే ఏమిటో మీకు అర్థం కాదు. అది తెలిస్తేనే తప్ప శ్రద్ధలోని మూడు ఘట్టాలను తెలుసుకోలేరు. నందనవనంలో కూర్చున్నటువంటి ఆ మహనీయుడు భారతదేశమంతటా 'టెలిస్కోప్' పెట్టి ఇందుకు పాత్రులైన వ్యక్తులెవరైనా కనిపిస్తారా? అని వెతికారుట, కానీ కనిపించలేదు. ఆయనే జ్వాలాకూల్ మహర్షి. ఆయన గాయత్రీమంత్రములోని ఒక్కొక్క అక్షరానికి 1000 పేజీల పుస్తకం చొప్పున 24 పుస్తకాలను వ్రాయాలని సంకల్పించుకున్నారు. దాని కోసం ఆయన అమెరికా, ఇంగ్లాండు దేశాలలో వెతికారు. ఒక్కరూ దొరకలేదు. చివరకు ఫ్రాన్సులో ఒకామె దొరికింది. ఆమె పేరు ఎలీస్-ఎ-బెయిలీ. ఆమెకు, జ్వాలాకూల్‌మహర్షి పంపుతున్న దివ్యసందేశాలను అందుకునే అర్హత విచిత్రంగానే వచ్చింది. స్ఫటిక సంకాశముగా విషయాన్ని అందివ్వగల (ప్రెజెంట్‌చేయగల) సామర్థ్యం ఈమెకు విచిత్రంగానే అబ్బింది. ఈ కారణంగా మాస్టరు డి.కె గారు అనగా జ్వాలాకూల్‌గారు ఈమెకు చెప్పి వ్రాయించుకోవటం

జరిగింది. 700 కోట్ల మానవసమాజంలో, ఆయన సందేశాన్ని అందుకోగల సామర్థ్యం ఈ అమ్మాయికి మాత్రమే వుంది. హిమాలయాల నుండి ఒక గురువు, మానవ సమాజాన్ని ఉద్ధరించటానికి చేసిన ప్రయత్నంలో భాగంగా వారు పంపే సందేశాలను రాసుకోవటానికి కేవలం ఒక్క స్త్రీ మాత్రమే దొరికింది. శ్రీడి.కె.గారు హిమాలయాలలో కూర్చుని చెప్తుంటే, ఆమె తన ఇంట్లో కూర్చుని వ్రాసినవి 24 బ్రహ్మాండమైన పుస్తకాలు. అగ్నివిద్య అని ఒకపుస్తకమున్నది. ఆ పుస్తకంలోని మొదటి ఐదు పేజీలు చదివిన ఏవ్యక్తీ, సాధకుడుగా మారకుండా వుండలేడు. అదీ శ్రద్ధ అంటే !

ఎక్కడో హిమాలయాలలో నుండి వచ్చిన సందేశాన్ని, గురువుపై శ్రద్ధను నిలుపుకుంటూ, ఆ సందేశాన్ని మానవసమాజానికందించటానికి ఆమె పడిన శ్రమ, వ్యధను కనుక మనం అర్థం చేసుకోగలిగితే చరిత్ర పుటలలో ఆమెను కీర్తించాలి. 24 పుస్తకాలను అచ్చు వేయించేంతటి శ్రమ తీసుకుందంటే ఆమెకు ఎంత శ్రద్ధ ఉండి ఉండాలో ఆలోచించండి. ఒక మంచి పుస్తకాన్ని అచ్చు వేయించటానికి తల ప్రాణం తోకకు వస్తున్నది. హాయిగా యండమూరి నవలైన 'తులసి' లాంటి పుస్తకాలను అచ్చు వేయిస్తే కనీసం 30వేల రూపాయల లాభమైనా వచ్చివుండేది. పుస్తకాలు కూడా అమ్ముడయ్యేవి. కానీ సందేశాల వంటి ఈ పుస్తకాలు అచ్చువేయించటానికి మేం పడే అవస్థ అంతా, ఇంతా కాదు. అలాంటిది ఎలీస్–ఎ–బెయిలీ ఒక్కొక్క పుస్తకం వెయ్యి, వెయ్యి పేజీల చొప్పున 24 పుస్తకాలను అచ్చువేయించటానికి ఎంత కష్టపడిందో మన ఊహకు కూడా అందదు, అదీ ఆరోజులలో! ఆ కష్టం స్వీకరించేందుకు, దాన్ని కూడా ఒక సాధనగా భావించి చేస్తున్నప్పుడు వచ్చే బాధతో పాటు కలిగే స్ఫూర్తి ఏదైతే ఉందో అదే, 'శ్రద్ధ'అంటే! ఆ శ్రద్ధ అనేది లేకుండా ఎవ్వరూ, ఏపనీ చేయలేరు. 'శ్రద్ధ' అనేది ఎన్నిరకాలుగా వుంటుందో, అర్జునునికి, శ్రీకృష్ణుడు శ్రద్ధాత్రయవిభాగయోగంలో చెప్తాడు. 'త్రయ' అంటే మూడు రకాల గుణాలు – సత్వ, రజ, తమో గుణాలు. ఇవి మనిషి ఔన్నత్యానికి ఉపయోగపడతాయి తప్ప మిమ్మల్ని క్రింద పడేసేందుకు కాదు అని తెల్సుకోవటం 'శ్రద్ధ'. శ్రద్ధ అనేది భారతీయుల లక్షణం. శ్రద్ధ కలిగి వున్నవారే భారతీయులు. మీలో భగవంతునిపై శ్రద్ధ అనే విత్తనం లేకపోతే ఎంతమంది గురువులు వచ్చినా, ఎంతమంది ఋషులు వచ్చినా ఏం లాభం లేదు. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అనే శ్రీకృష్ణుడూ చెప్తాడు. 'శ్రద్ధే' అన్నిటికీ మూలం.

'శ్రద్ధ' అంటే 'నేను' భగవంతుని అంశను అని గాఢంగా విశ్వసించాలి. స్వామి వివేకానంద ఎప్పుడూ చెప్పేది అదే 'ఈచ్ సోల్ ఈజ్ పొటెన్షియల్లీ డివైన్'. ప్రతి విత్తనం చెట్టుగా మారదు

కానీ ప్రతి విత్తనములోను చెట్టుగా మారగలిగే శక్తి వుంటుంది. అలాగే ఇక్కడ కూర్చున్న వాళ్ళేకాదు, ఈ ప్రపంచంలో ఉన్న కోట్లాదిమంది, భగవంతుని స్వరూపాలుగా మారగలిగే విత్తనాలే అని మనం గుర్తుంచుకోవాలి. మన దగ్గర ఉండవలసింది ఇటువంటి శ్రద్ధే. శ్రద్ధను గురించి అనేక రకాలుగా, ఈ17వ అధ్యాయంలో వివరించబడింది. శ్రద్ధ, శ్రద్ధతో పాటు విశ్వాసం ఈ రెండూ మానవజీవిత గమనానికి రెండు చక్రాల్లాంటివి.

## 'శ్రద్ధ-విశ్వాసం'

**'భవానీ శంకరం వందే శ్రద్ధా విశ్వాసరూపిణౌ'** అని కదా పెద్దలంటారు. శ్రద్ధ, విశ్వాసం రెండూ మానవజీవితానికి ఆధారభూతమైన సత్యాలు. **ఇక్కడ విశ్వాసము అంటే మనకు అనుభవము లేని విషయము మీద మనకు నమ్మకమున్న వ్యక్తి చెప్పిన మాటలు విని ఆచరిస్తాము, విశ్వసిస్తాము కానీ, అది మన అనుభూతిలో ఉండదు.** మనం ఏ వ్యక్తినైతే నమ్ముతామో ఆ వ్యక్తి చెప్పిన దానిని కార్యరూపంలో పెట్టటానికి ప్రయత్నిస్తాము. అది విశ్వాసము. కానీ గురువులు కోరుకునేది విశ్వాసముకాదు, 'శ్రద్ధ'. సాధకులిక్కడ విశ్వాసానికి, శ్రద్ధకు మధ్యగల తేడాను గుర్తించుకోవాలి. **'శ్రద్ధ' అనేది మీరు స్వయంగా ఆచరించి, పొందినటువంటి అనుభూతి వల్ల నమ్మకం పెట్టుకోవడవ వల్ల ఏర్పడుతుంది. ఆచరణ ద్వారా, అనుభూతి ద్వారా వచ్చిన నమ్మకాన్ని 'శ్రద్ధ' అంటారు. 'విశ్వాసమును'-విశ్వాసము అనే అంటారు.**

భారతదేశంలో 'గురుస్థానం' వహించే వ్యక్తికి 'ఆచార్య' పీఠం అలంకరించే వ్యక్తికి, రెండు లక్షణాలుండాలి. ఒకటి తను అనుభూతి చెందిన విషయాలను, సాధనల ద్వారా శిష్యునికి చెప్పటం. శిష్యుడు, దానిని అనుభూతి చెంది గురువు చెప్పినవన్నీ సత్యాలేనని నమ్మకం పెట్టుకొని శ్రద్ధాపూరిత అంత:కరణతో గురువుకు సమర్పణ చేసుకోవటం ఇదీ 'శ్రద్ధ'. ఈ 'శ్రద్ధ' మూడు రకాలు. తామసికమైన శ్రద్ధ, రాజసికమైన శ్రద్ధ, సాత్త్వికమైన శ్రద్ధ. ఈ మూడూ 'శ్రద్ధాత్రయవిభాగయోగం'లో కీలకమైనవి. వీటి ఆచరణకు సాధకులు మూడురకాలైన పనులు చెయ్యాలి. అవే యజ్ఞము-దానము-తపస్సు.

**1. తపస్సు:** గురువుగారు తపమునకిచ్చిన పేరు ఆత్మనిర్మాణము. అసలు తపశ్చర్య అంటే మనలో ఉన్న లోపాలను సరిదిద్దుకొని, ఉన్నతమైన వ్యక్తిత్త్వమును నిర్మించుకొనుట. ఇది కేవలం స్వార్థముతో కూడినటువంటి సాధన. అందువల్లనే తపస్సును, తామసిక లక్షణంతో పోల్చారు.

పూర్తిగా స్వార్థపూరితమైన ఈ ప్రక్రియలో ఇంకొకరిని గురించి ఆలోచించలేము. కేవలం తపశ్చర్యలు మాత్రమే చేసి, మిగిలిన రెండు పనులను చేయని వ్యక్తిత్వాలను అసురులంటారు. హిరణ్యకశ్యపుడు, రావణాసురుడు వీరంతా తపశ్చర్యలు చేశారు. వాళ్ళు దేని కొరకు తపశ్చర్యలు చేశారు? వారిలో వున్న లోపాలను నిర్మూలించుకొనుటకు కాక విపరీతమైన శక్తి సముపార్జనచేయుటకు వారు తపశ్చర్యలు చేశారు. మీరూ అలాంటి తపశ్చర్యలే చేశారనుకోండి, మీరూ రాక్షసులుగానే మారిపోతారు. శక్తి వస్తుంది కానీ, ఆ శక్తిని ఎలా ఉపయోగించుకోవాలో మీకు తెలియదంటారు గురుదేవులు. తపము తర్వాత గురుదేవులు యజ్ఞమును గురించి చెప్పారు.

**2. యజ్ఞము:** యజ్ఞమనేది సాత్త్వికమైన చర్య. యజ్ఞమనగా ఫలితమునాశించకుండా మనము చేసే ఏ పని అయినా సరే అది 'యజ్ఞకర్మే' అవుతుంది. యజ్ఞకర్మ చేసినప్పుడు దైవత్త్వము ప్రాప్తిస్తుంది. మన నిత్యజీవితంలో ఈనాటికీ మూడు రకాలైన వ్యక్తిత్త్వములు యజ్ఞకర్మ చేస్తూనే వున్నాయి. ఈ మూడు రకాలైన వ్యక్తిత్వాలను వేదాలు దేవతలుగా గుర్తించాయి. వారే తల్లి, తండ్రి, గురువు. ఈ మూడు రకాల వ్యక్తిత్వాలు ఏ విధమైన ప్రతిఫలాపేక్ష లేకుండా తమ కర్తవ్యాన్ని పరిపూర్ణ నిష్టతో చేస్తునే ఉంటాయి. ఫలాపేక్షతో చేసిన పనులవల్ల సమస్యలు వచ్చి పడతాయి. తల్లి తన కర్తవ్యంగా బిడ్డకు సేవ చేస్తుంది. తండ్రి పాలన, పోషణ భారాన్ని వహిస్తాడు. గురువు విద్యా, బుద్ధులను నేర్పిస్తాడు. వీరు ముగ్గురు ఏవిధమైన ఫలాపేక్ష ఆశించకుండా బిడ్డల పట్ల తమకుండే సముచిత కర్తవ్యాలను నిర్వహిస్తారు. ఇలా చేసే ఏ పని ఆయినా 'యజ్ఞము' అనిపించుకుంటుంది. అలాంటి **'యజ్ఞమును' గురుదేవులు 'సమాజ నిర్మాణమునకు నాంది' అన్నారు.** సమాజం బాగుపడితే, సమాజంలోని అంగంగా మనమూ బాగుపడతాం మరి! తపము, యజ్ఞము అయ్యాక ఇంక మూడవది దానము.

**3. దానము: దీనిని గురువుగారు కుటుంబ నిర్మాణము అన్నారు.** ఇదంతా వేదాలలో ఉన్నదే! అయితే ఆధునిక యుగానికి చెందిన కొందరు మహాపురుషులు మనకర్థమయ్యే భాషలో చెప్పేందుకు ప్రయత్నించారు. తపమన్నా, యజ్ఞమన్నా, దానమన్నా– సమాజ నిర్మాణం, కుటుంబ నిర్మాణం, వ్యక్తిత్వ నిర్మాణం అన్నా ఒక్కటే! అందుచేత తపశ్చర్య వలన వ్యక్తిత్వనిర్మాణం జరుగుతుంది. యజ్ఞము వలన సమాజ నిర్మాణం జరుగుతుంది. దానము వలన కుటుంబ నిర్మాణము జరుగుతుంది. అయితే ఈ దానాలు ఎన్ని రకాలు? అవి ఏమిటి? అన్నదానికి సమాధానంగా గురుదేవులు అంశదానము, సమయదానము, ప్రతిభాదానాలనే మూడు దానాల గురించి చెప్పారు.

**దేశే కాలేచ పాత్రేచ తద్దానం సాత్త్వికం స్మృతం ॥ (భ.గ. 17-20) అని గీత చెప్తోంది.**

సర్వసాధారణంగా దానం చెయ్యటం ఎలా అనేది ఇక్కడ ప్రస్తావించబడింది. దానం చేసేటప్పుడు దేశే-కాలేచ-పాత్రేచ అంటే దేశము, కాలము, పాత్రతలు మూడు ఉండేట్లు చూసుకోవాలి. మనం శ్రీశైలంలో వున్నాం. శ్రీశైలంలో దానం చేస్తే అనేక కోట్ల ఫలితముంటుంది. దేశం అనేదానికి మనం చెప్పుకోవలసిన నిర్వచనం ఇది.

ఇక పాత్రత విషయానికి వస్తే ఏమహానుభావుడికో దానం చేశామనుకోండి, అది సమాజానికి ఉపయోగపడుతుంది. పూర్వకాలంలో దానం చేసేవారి శక్తి ఎంత గొప్పగా ఉండేదో తెలిపేందుకు 'నచికేతోపాఖ్యానం' చాలా మంచి ఉదాహరణ. కాబట్టి ఈనాటి దేశే, కాలేచ, పాత్రేచ అన్నదానికి సాత్త్విక దానంగా అంశదానము, సమయదానము తప్ప మిగిలిన ఏ దానము చేసినా ఫలితమెలా వుంటుందో మీకు తెలుసు. కాబట్టి తపము, యజ్ఞము, దానములనే వాటిని పూజ్యగురుదేవులు దేశ, కాల పరిస్థితులను బట్టి సమయదాన, అంశదాన, ప్రతిభా దానాలుగా రూపొందించి ఆచరణ యోగ్యం చేశారు.

ఇంకా ఈ శిబిరంలో భవిష్యత్‌లో చేయబోయే కార్యక్రమాలకు కావలసిన 'శక్తి సముపార్జన' కొరకు అందరిచేతా సామూహిక మంత్రజపం, ఉదయాన్నే యోగాసనాలతో పాటు మనోమయ కోశానికి సంబంధించిన కొన్ని విశిష్ఠ ప్రయోగాలు శ్రీరత్నాకర్, సీతారాంగార్లు చేయించారు. శ్రీరామసుబ్బయ్య, అంజనీకుమార్‌గార్లు శిబిరనిర్వహణ బాధ్యతను స్వీకరించారు. కాలనిర్ణయపట్టిక ప్రకారం జరుగవలసిన కార్యక్రమాలను మాస్టర్‌గారి ప్రవచనాలతోనూ, ఇంకా పలువురు సీనియర్ కార్యకర్తలైన చీరాల సుబ్బారావుగారు, కామాక్షి, శైలజ వాళ్ళతో కొన్ని ప్రవచనాలు చెప్పిస్తూ అందరిలో ఒక నూతన ఉత్సాహాన్ని తెప్పించేవారు. యువపరివార్ తేజ, వల్లీ, భువన, సుమ, ఉమ, ఉషలాంటి పిల్లలు యుగసంగీతం పాడటం, ఉదయాన యోగాసనాలు నేర్పించటంలాంటివి చేస్తూ ఎంతో సరదగా సాధనా క్యాంపులలో తిరుగుతూ ఆ వాతావరణంలోని దివ్యత్వాన్ని అనుభూతి చెందుతూ ఉండేవారు. సాధనాక్యాంప్ అంటే ముక్కు మూసుక్కూర్చొనే విధానం వలె కాకుండా ఆ జ్ఞానానుభూతిని అత్యంత సరళంగా అందరికీ అందించటమనేది మాస్టర్‌గారి ప్రత్యేకత. శ్రీశైలంలో జరిగిన ఈ శిబిరం భవిష్య ప్రణాళికలకు ఒక లైట్‌హౌస్ వలె ఎంతో ప్రయోజనాన్ని ప్రసాదించింది.

## వివేకానంద జయంతి

సాధారణంగా ప్రతి సంవత్సరం వివేకానంద జయంతి కార్యక్రమాలు ఎక్కడో ఒకచోట జరుగతూ వుంటాయి. 1993వ సంవత్సరం వివేకానంద జయంతికి, వేటపాలెంలో శ్రీగొల్లపూడి సీతారాంగారి, ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో 24 కుండీల యజ్ఞకార్యక్రమాలను శ్రీసత్యనారాయణగారు ఏర్పాటు చేశారు. ఆ త్రిదివశీయ యజ్ఞప్రణాళికలో, పూజ్యశ్రీ మాస్టర్‌గారు "శ్రీవివేకానందస్వామి", శ్రీరామకృష్ణమిషన్ యొక్క ప్రాచుర్యాన్ని దశదిశలా వ్యాప్తి చేయటానికి చేసిన కృషి గురించి పరమాద్భుతంగా వివరించారు. 10,11,12 తేదీలలో జరిగిన ఆ యజ్ఞాలకు ముఖ్యంగా పూర్ణాహుతికి అనేక గ్రామాలనుంచీ పరివార్ వాళ్ళు వచ్చారు. పూర్ణాహుతి రోజున యజ్ఞవిద్యను గురించి చెప్తూ, గురుదేవులచే ఇవ్వబడిన, మనం ఎప్పుడూ వినని మూడు రకాల యజ్ఞప్రక్రియలను ఇలా వివరించారు.

1. పరాప్రకృతి పరిమార్జన 2. సౌరశక్తిసందోహన 3.విశ్వకుండలినీ మంథన.

ఈ మూడు యజ్ఞాలలో మొదటి రెండు యజ్ఞాలు మాత్రమే మనం సుసంపన్నం చేయగలిగాం. మూడో యజ్ఞం,"విశ్వకుండలినీ మంథన" అనేది ప్రఖర, ప్రజ్ఞాపురుషులైన పూజ్యగురుదేవుల స్థాయిలో, జగన్మాతను ఉపాసన చేసి జీవితాన్ని యజ్ఞమయంగా, జీవనదేవతా సాధనచేసి, ఆశక్తిని విశ్వమాత ఆరాధనకు వినియోగించే వెయ్యిమంది సాధకులు ఒక చోటకు చేరి సాధన చేసినప్పుడు మాత్రమే, "విశ్వకుండలినీమంథన" యజ్ఞాన్ని సుసంపన్నం చేయవచ్చని చెప్పారు. ఎంతో వైభవంగా ఆ కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీజి.సీతారాం, శ్రీకృష్ణమూర్తిగార్లు, మాస్టర్‌గారు వివరిస్తున్న ఆ యజ్ఞాలను గురించి వింటూ, 'మనం చేయగలమా' అని ఆలోచిస్తున్నారు. ఇంతలో ఒంగోలు నుండీ వచ్చిన పరివార్‌వాళ్లందరూ ఆ ప్రవచనాన్ని వింటూనే అనిర్వచనీయమైన ఆనందంతో, మాస్టర్‌గారి దగ్గరకొచ్చి, "మాస్టారూ! మేము పరాప్రకృతి పరిమార్జన యజ్ఞం" చేస్తామంటూ మాస్టర్‌గారి అనుమతిని కోరారు. ఆతర్వాత వేటపాలేంవారు అంతే ఉత్సాహంతో వచ్చి "సౌరశక్తి సందోహన"యజ్ఞం మేము చేస్తామంటూ ముందుకు వచ్చారు. చిత్రమేమిటంటే ఎవ్వరికీ అసలా యజ్ఞాలగురించి పూర్వా, పరాలేమీ తెలియవు. ఏమీతెలియకుండానే, ఆ యజ్ఞకార్యక్రమాలను భగవతి ప్రేరణగా స్వీకరించారేమో ఆ నాడు. అదంతా మహాత్ములైన మాస్టర్‌గారి అనంతకృపాకటాక్ష, ఆశీర్వాదాలేననిపిస్తుంది. పూజ్యశ్రీ మాస్టర్‌గారు వారి ప్రతిపాదనలను విన్నారు. తర్వాత కాస్త

నిదానందంగా 'ఈ విషయాన్ని ముందు మాతాజీకి వివరంగా వ్రాసి, ఆమె అనుమతి పొందాకే యజ్ఞాల గురించి ఆలోచిద్దాం' అన్నారు. తరువాత మళ్ళీ అన్నారు, "ఈ రెండు యజ్ఞాలను చెయ్యటానికి ఋషులు చేసిన సాధనా విధానాలననుసరించి, ఏ ఋషి ఎంతసాధన చేశారనేది, త్వరలోనే వివరంగా పంపుతాను. మీరా సాధనను వ్యక్తిగతంగాకానీ, సామూహికంగా కానీ చేసి, జపసంఖ్య మాతాజీకి, నాకూ ఉత్తరాల ద్వారా తెలియజేయండి. దానిని బట్టి యజ్ఞాలు చేసే తారీకులను నిర్ణయిద్దాం", అని చెప్పి ఆ నాటి కార్యక్రమాన్ని ముగించారు.

వివేకానంద జయంతి సాధనా శిబిరం ద్వారా అందరికి ఒక చక్కటి దిశానిర్దేశంతో పాటు ప్రేరణలు దివ్యాత్ములైన శ్రీమాస్టర్‌గారి ద్వారా లభించాయి. శిబిరం అయిపోయింది. యజ్ఞాలు జరిగిన మూడు రోజులు వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా వుంది. అది జనవరి నెల కాస్త చలిగానే వుంటుంది, అందులోనూ విపరీతమైన మబ్బులు, సన్నని చిరుజల్లు కురుస్తుండగా, మలయమారుతంలాగా వీచే గాలులతో, ఒక దివ్యమైన వాతావరణం ఏర్పడింది. కార్యక్రమాలంతా అయిపోయి అందరూ విశ్రాంతిగా కూర్చున్న సమయంలో అందరూ కార్యక్రమాల గురించిన కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలో శ్రీరామసుబ్బయ్యగారు, 'ఆర్.కె నన్ను హిమాలయాలకు తీసుకువెళ్ళమని అడుగుతుండేవాడిని గదా! ఆ హిమాలయాల వాతావరణం ఇక్కడికెలా వచ్చింది? అక్కడికి వెళ్ళాలనే కోరికను ఇక్కడే తీర్చేశావా?' అన్నారు. సరదాగానే అయినా అది యదార్థం కనుక ఆనందంగానే అడిగారు. మాస్టారేం చెప్తారా, అని అందరం అటే చూస్తున్నాం. మాస్టర్‌గారు మాత్రం ఏమాత్రం తొణక్కుండా ఉల్లాసంగా చిరునవ్వుతో "అంతేగా మరి" అంటూ ఆ ఆనందాన్ని అనుభూతిని ప్రకటించారు. శిబిరం అయిపోయిన తరువాత మూడురోజులున్నారు. అప్పుడు "పంచకోశసాధన"ను ఉత్సాహవంతులైన కొంతమంది సాధకులకు మాత్రమే నేర్పించారు.

# III "మేధ" – యజ్ఞ విజ్ఞానము

## అధ్యాయం-7
## అశ్వమేధ ఉపన్యాసాలు

1993లో అమలాపురంలో జరిగిన సాధనా క్యాంపులో మాస్టర్‌గారు అశ్వమేధయజ్ఞాలపై ప్రవచనాలు చెప్పడం జరిగింది. పరమపూజ్య గురుదేవుల మహాప్రయాణం తరువాత వందనీయ మాతాజీ ఈ సమస్తవిశ్వాన్ని దైవీచేతనత్వంతో సుసంపన్నం చేయడానికి అశ్వమేధయజ్ఞశృంఖలను దేశవిదేశాలలో నిర్వహించడానికి ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక, వైజ్ఞానిక ప్రయోగాన్ని ఆవిష్కరించారు.

సాధారణంగా యజ్ఞంలో భౌతికవిజ్ఞానం కూడా ఇమిడివుంటుంది. వాయుమండలాన్ని పరిశుభ్రం చేసే ఈ ప్రక్రియ మానవునికి అవసరమైన ప్రాణవాయువును అందించడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. ప్రస్తుత కాలంలో ప్రపంచమంతటా పర్యావరణ కాలుష్యం అతి తీవ్రగతిలో ముందుకు వెళుతున్నది. దాని నివారణార్థం యజ్ఞకార్యక్రమాలను పునరుద్ధరించి విస్తృతం చేయాలి. "ఏన్షియంట్ హిస్టరీ ఆఫ్ మెడిసన్" అనే పుస్తకంలో రోగకారకములైన క్రిములను నాశనము చేసే శక్తి, యజ్ఞాగ్ని యొక్క తేజస్సులో ఉందనీ, అంతటి సులభమైన, చౌకైన క్రిమిసంహారక మందులు ఇప్పటివరకు అన్వేషించబడలేదని తెలుపబడివున్నది. యజ్ఞప్రక్రియ శారీరిక, మానసిక రుగ్మతలను పోగొట్టడంలో విజయవంతమైంది. దీనికి ప్రమాణాలు ఋగ్వేద, యజుర్వేదాలలో ఉన్నాయి. యజ్ఞచికిత్సను పునరుద్ధరిస్తే శారీరిక, మానసిక రుగ్మతలను నివారించడంలో సత్ఫలితాలు లభిస్తాయి.

యజ్ఞంలో భౌతికవిజ్ఞానమే కాక అంతకంటే ఎక్కువైన శక్తివంతమైన, సమర్థవంతమైన సూక్ష్మవిజ్ఞానం ఇమిడివున్నది. యజ్ఞం వల్ల సూక్ష్మజగత్తులోని అదృశ్యవాతావరణంలో దైవత్వం విస్తరిస్తుంది. ఇది సర్వమానవాళికి సుఖశాంతులను అదృశ్యంగా ప్రసాదిస్తుంది. వాయుకాలుష్య

నివారణయే కాక వాతావరణ నిర్మాణమనేది కూడా యజ్ఞము యొక్క ప్రముఖ ప్రయోజనము. ప్రస్తుత అశ్వమేధయజ్ఞం-దేవసంస్కృతి జరిపిన దిగ్విజయయాత్ర యొక్క ఆధునిక రూపం. ఈ దిగ్విజయ యాత్రలో దేవత్వానికి విజయం తథ్యం. మహామాయ - ఇందుకు కావలసిన సాధనాలను సమకూర్చింది. పాపమనే మాటను అందరూ మర్చిపోవాలి. మంచిని కోరేవారందరూ దేవసంస్కృతి దిగ్విజయధ్వజం నీడకు చేరుకుని రాక్షసత్వాన్ని రూపుమాపడానికి కృషిచెయ్యాలి.

పరమవందనీయ మాతాజీ 'దేవసంస్కృతి-దిగ్విజయయాత్ర' అనే పేరు అశ్వమేధ యజ్ఞ శృంఖలను ప్రకటించిన తరువాత మాస్టర్‌గారు అమలాపురంలో 1993లో శ్రీశ్యామలరావుగారి కోరిక మేరకు 'అశ్వమేధము' అనే విషయంపై ప్రవచనాలు చెప్పారు.

## అసలు అశ్వమేధము అంటే ఏమిటి?

ఈ విషయంపై మాస్టర్‌గారు సమగ్రమైన, సరళమైన విషయాలను ఆనాటి సాధనాశిబిరంలో వివరించారు. మన భారతీయసంస్కృతిలో అశ్వమేధానికి చాలా విశిష్టమైన స్థానమున్నది. అశ్వమేధ యజ్ఞం భారతీయఋషి సంప్రదాయంలో యజ్ఞం యొక్క పరాకాష్ట. అయినప్పటికీ యజ్ఞమంటే కొన్ని విశేష అర్థాలను చెపుతాను. మొదటిది సద్గుణోపాసన. సద్గుణాలను పెంచుకోవడం ఒక యజ్ఞం అయితే అందరూ కలిసిమెలిసి పని చెయ్యటం ఇంకో యజ్ఞం, ఇంక అద్భుతమైన మూడవ యజ్ఞం త్యాగము. నీకు అవసరమైతే కూడా నీ అవసరాన్ని కూడా ప్రక్కన పెట్టి ఇతరుల అవసరాన్ని తీర్చడమనే యజ్ఞమునకు సమానమైన యజ్ఞం అశ్వమేధయజ్ఞం కూడా కాదు అంటున్నది మహాభారతం. (బంగారు ముంగిస కథ) మనమలాంటి త్యాగశీలమైన సంస్కృతికి వారసులం.

దధీచి కథ మనకందరికీ తెలిసినదే. దేవతలు వృత్రాసురుని చంప లేకపోయినప్పుడు 'నీ వెన్నెముకను ఇవ్వమని' ఇంద్రుడు దధీచి మహర్షిని అడుగుతాడు. 'సరే' తీసుకోమని మహర్షి తన దేహాన్ని త్యాగం చేస్తాడు. అలా ఎప్పుడెప్పుడు దేవతలకి కష్టాలు వచ్చాయో అప్పుడు అప్పుడు మనుష్యులు వెళ్ళి దేవతలకి సహాయం చేశారనే విషయం మన వేదవాఙ్మయంలోకి వెళ్ళి చూస్తే తెలుస్తుంది. ఈనాడు త్యాగం చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని చెప్తే త్యాగాలు చేస్తారు తప్ప త్యాగం కోసం త్యాగం ఎవ్వరూ చేయడం లేదు. దీనికి అర్థాన్ని గ్రహించండి. ఈ త్యాగశీల ప్రవృత్తి యజ్ఞమనిపించుకుంటుంది తప్ప మీరు యజ్ఞంలో ఎన్ని రత్నాలు వేశారన్నది యజ్ఞం కాదు.

ఈ మూడు గుణాలు ఎక్కడ పరాకాష్ట చెందుతాయో దానిని అశ్వమేధమంటారు తప్ప ఓ అశ్వాన్ని తెచ్చి దాన్ని బలి ఇస్తే అది అశ్వమేధం కాదు. యజ్ఞానికి పరాకాష్ట అశ్వమేధమంటే సద్గుణాల ప్రవృత్తిని, పరస్పర సహకారాన్ని, త్యాగమయ ప్రవృత్తిని మనలో పూర్తిగా పెంచుకోగలిగితే దాన్ని అశ్వమేధమంటారు. ఇలాంటి ప్రవచనాలను ఐదురోజుల పాటు చెప్పారు. ఈ ఉపన్యాసాలను పుస్తకరూపంలో శ్రీ ఎ. సీతారాంగారు 'అశ్వమేధ ఉపన్యాసాలనే' పేరుతో 1994లో ప్రచురించి ఆ అఖండమైనజ్ఞానాన్ని మనకందించారు.

## విశిష్ఠ సమర్పణ - సాధనా సత్రము : శ్రీశైలం

1993వ సంవత్సరంలో వచ్చే దేవీనవరాత్రులకు శ్రీశైలంలో 'విశిష్ఠసమర్పణ-సాధనా సత్రము' పేరుతో సాధనాశిబిరం పెట్టాలనీ అందుకవసరమైన ఏర్పాట్లుచెయ్యమనీ శ్రీసత్యనారాయణ గారికి పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఒకనెల ముందే చెప్పారు. సాధనాశిబిరానికి వచ్చేవారంతా రోజుకు మూడుమాలలు గాయత్రీ మంత్ర జపం చెయ్యాలనీ, రెండుగంటలు మౌనం పాటించాలనీ, శ్రీసూక్త, పురుషసూక్త పారాయణలతో పాటు ప్రతిరోజూ భగవద్గీతలోని 'విశ్వరూప సందర్శనయోగము' ను పారాయణ చెయ్యాలనీ, శిబిరానికి వచ్చేటప్పుడు ఆ పుస్తకాలన్నీ తెచ్చుకోవాలనీ ఉత్తరాల ద్వారా సందేశాన్ని పంపించారు.

నేను, మావారు శ్రీశైలానికి వెళ్ళి, సాధనాశిబిరానికి కావలసిన సమస్త సదుపాయాలను ఏర్పాటుచేసిపెట్టమని 'కరివెన సత్రం' యాజమాన్యాన్ని కోరాం. ఇంతకు ముందు అక్కడ మూడుసార్లు కార్యక్రమాలు పెట్టిన పరిచయంతో, 'దేవీనవరాత్రులు' అయినాసరే వారి యాజమాన్యం మనం అడిగిన తేదీలలో అన్ని సదుపాయాలనివ్వటానికి అంగీకరించారు. దీనికంతటికి వెనుక మాస్టర్‌గారు తమ సంకల్పశక్తితో అదృశ్యంగా పనిచేస్తూ ఆ అదృష్టాన్ని మనకు ప్రసాదిస్తూ వుంటారు. శ్రీశైలంలో తొమ్మిదిరోజుల పాటు సాధన చెయ్యడమనేది నిజంగా మాస్టర్‌గారి వరదానమే! అనుకున్న సమయానికి సాధకులందరూ క్షేత్రానికి వచ్చేశారు. శ్రీశైలం క్యాంప్ అంటే అందరికీ ఉత్సాహమే ఉత్సాహము. అది దివ్యమైనక్షేత్రం. ఎటు చూచినా ప్రకృతిసౌందర్యం, ప్రశాంత వాతావరణం ఆహ్లాదపరుస్తుంటుంది. అందరూ చాలా హాయిగా, ఆనందంగా మాస్టర్‌గారు ఈసారి ఏం సాధనలను చేయిస్తారోనని ఎదురు చూడసాగారు.

అఖండజ్యోతి వెలిగించి పూజ్యశ్రీ మాస్టర్‌గారే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అఖండజపం తొమ్మిదిరోజులూ అలా జరుగుతూనే వుండేది. ఈ శిబిరంలో ముఖ్యంగా పురుషసూక్తం, శ్రీసూక్తం మరియు విశ్వరూపసందర్శనయోగం మొదలైన అంశాలను సాధనాపరంగా నిత్యజీవితంలో వాటిని ఎలా ఉపయోగించుకోవాలనే విషయంపై సమగ్ర అవగాహన వచ్చేలాగా విశ్లేషణ చేస్తూ అత్యంత సరళంగా, సందేశాత్మకంగా, ప్రేరణనిచ్చే ప్రసంగాలను, సాధనలను ఈ తొమ్మిదిరోజులూ మాస్టర్ గారు చాలా చక్కగా చెప్పారు. ఇంతలో ఒక విశేషం జరిగింది.

శాంతికుంజ్‌లో పూజ్యశ్రీ గురుదేవులకు అత్యంత సన్నిహితులు, ఎక్కడ మాత గాయత్రీ విగ్రహప్రతిష్ఠ జరిగినా గురుదేవులతో పాటు వెళ్ళి కార్యక్రమాన్ని అత్యంత సమర్థవంతంగా చేయగల సమర్థులు, గొప్పసాధకులు, అత్యంత నిష్ఠాగరిష్ఠులు అయిన పూజ్యశ్రీ కపిల్‌జీ, వారితో పాటు కొంతమంది కార్యకర్తలు ఒక యజ్ఞ నిర్వహణార్థం మద్రాసుకు వచ్చారు. వారు మల్లికార్జుస్వామిని దర్శించుకోవాలని శ్రీశైలానికి వచ్చారు. భగవదిచ్ఛ అన్నట్లుగా అక్కడ కర్ణాకర్ణిగా ఇలా శ్రీశైలంలో గాయత్రీపరివార్ శ్రీరామకృష్ణగారు 'సాధనాశిబిరం' నిర్వహిస్తున్నారన్న విషయం విని చూచివెళ్ళాలని వారు సాధనాశిబిరానికి రావటం జరిగింది. అక్కడ జరుగుతున్న అఖండజపం చూచి చాలా సంతోషపడ్డారు. అలానే మాస్టర్‌గారు ఇస్తున్న అద్భుతమైన ప్రవచనాలను విన్నారు. అవి భగవద్గీత మీద ఇస్తున్న ప్రవచనాలు. భాష తెలియక పోయినా భావం అర్థమౌతుంది గదా!

శ్రీకపిల్‌గారు ఆ శిబిరంలో గురుదేవుల గురించి, అప్పుడే ప్రారంభమైన అశ్వమేధయజ్ఞాల గురించి వారు ఎంతో చక్కని ప్రవచనాలను హిందీలో చెప్తుంటే మాస్టర్‌గారు తెలుగులో అనువదించటం జరిగింది. వారు రావటంతో ఆ క్యాంపుకే నూతన శోభ వచ్చినట్లైంది. వారూ ఎంతో ఆత్మీయతతో మాస్టర్‌గారికి గురుదేవుల గురించీ, అక్కడ జరుగుతున్న కార్యక్రమాల గురించీ అనేక విషయాలను చెప్తూ ఉండేవారు. ప్రదోషకాలంలో స్వామివారినీ, అమ్మవారిని దర్శించుకుంటూ మూడురోజుల పాటు అలానే ఉండిపోయారు. ఎంతో క్రమశిక్షణతో జరుగుతున్న ఆ శిబిరాన్ని చూచిన వారి ఆనందం వర్ణనాతీతం. ఆ ఆనందాన్ని వారిలా వ్యక్తపరచారు, 'ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి సాధనాశిబిరాలను ఇంత అద్భుతంగా శాంతికుంజ్‌లో" మాదిరి నిర్వహించటం, తాము మొదటిసారిగా ఇక్కడే చూస్తున్నామని చెప్తూ ఇంతటి కార్యదీక్ష, కర్తవ్యపాలన కలిగిన సాధకులింత మంది ఉండగా 'మీరెందుకు అశ్వమేధయజ్ఞం చేయకూడదని' అంటూ, మళ్ళీ వారు ఇలా అన్నారు

'నేను మాతాజీతో ఈవిషయాలన్నీ వివరంగా చెప్పి "అశ్వమేధయజ్ఞానికి" అనుమతిని అడుగుతాను. మీరూ, మీ తరపు నుండి మాతాజీకి ఒక అభ్యర్ధన లేఖను వ్రాసి ఇవ్వండి అని చెప్పారు. దానితో అందరిలో నూతన ఉత్సాహం వచ్చేసింది.

ఆ రోజు విజయదశమి. నవరాత్రిసాధన అయిపోయింది. ఇంక ఆ రోజున పూర్ణాహుతి చేసుకోవాలి. ఏర్పాట్లన్నీ మాస్టర్‌గారు చెప్పినట్లే చేయటం జరిగింది. ఆ రోజు జీవితంలో మరచి పోలేనిది. శ్రీశైల పుణ్యక్షేత్రంలో నవరాత్రిసాధన పూర్తి అయింది. పూజ్యశ్రీ మాస్టర్‌గారి దివ్యసన్నిధితో పాటు పరోక్షంగా గురుదేవుల ఉపస్థితి శ్రీకపిల్‌గారిలో దర్శనమైంది. పరమాద్భుతంగా పరంధాముడైన శ్రీరామకృష్ణగారే పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆ రోజున మణికుమార్ అనే కార్యకర్తకు ఉపనయన సంస్కారం చేసి గాయత్రీమంత్రదీక్షను స్వయంగా పూజ్యులు శ్రీశ్రీరామకృష్ణ గారు, శ్రీకపిల్‌గారివ్వటమనేది, అతని అదృష్టం.

తర్వాత 'అశ్వమేధయజ్ఞం' చేయటానికి అనుమతి కోరుతూ ఒక వినతి పత్రాన్ని వ్రాసి దానిపై శిబిరానికి వచ్చిన సాధకులందరి చేత సంతకాలు చేయించి, పూర్ణాహుతి సమయంలో వాటిని యజ్ఞభగవానుని సమక్షంలో (అదే మూడు కాపీలు వ్రాయించి) పెట్టించి, తరువాత ఒకటి శ్రీలక్ష్మీనారాయణదంపతుల చేత, రెండవది మాతో, మూడవది శ్రీ సుబ్రమణ్యంగారి దంపతులు (అనంతపురం) చేత ఇప్పించారు. వాటిని శ్రీ కపిల్‌గారు తమ ఉత్తరియాన్ని ముందుకు చాపి ఆ మూడు వినతి పత్రాలను పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారి అమృతహస్తాల ద్వారా స్వీకరించారు. ఆ క్షణంలో అందరినీ శ్రీకపిల్‌గారు ఆశీర్వదించారు. అది ఒక అద్భుతమైన సన్నివేశం. అఖండజ్యోతి సమ్ముఖంలో యజ్ఞపూర్ణాహుతి మరియు 108జ్యోతులు దేదీప్యమానంగా వెలుగుతుండగా, ఆ యజ్ఞీయవాతావరణంలో, సాధకుల సమక్షంలో, శ్రీశైలమల్లీశ్వరస్వామి సాక్షిగా 'అశ్వమేధ యజ్ఞానికి' ఆహ్వానం పలికారు. ఆ సన్నివేశాన్ని చూచి ఆనందించి, తరించాలే గాని మాటలతో దానిని వర్ణించలేము. తర్వాత కొన్నాళ్ళకు ఆంధ్రాలో అశ్వమేధయజ్ఞం జరిగింది. అలా 'అశ్వమేధయజ్ఞానికి' కావలసిన బీజారోపణ కార్యక్రమం, మహాకాలుని దివ్యసన్నిధిలో అత్యంత వైభవంగా జరిగింది.

ఆనాడు ఇచ్చిన వినతిపత్రాల ప్రభావం అశ్వమేధానికంటే ముందు ఎవ్వరూ ఊహించని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో విచిత్రంగా సహస్రకుండీ యజ్ఞాల రూపంలో ఆవిర్భవించింది. అవి వరుసగా

1. పరాప్రకృతి పరిమార్జన: ఇది ఒంగోలులో 1994 సం. జనవరి 13,14,15 తేదీలలో జరిగింది.

2. సౌరశక్తి సందోహనప్రక్రియ: ఇది వేటపాలెంలో 1994 సం. జనవరి 9వ తేదీన జరిగింది.

3. విశ్వకుండలినీ మంథన: జరుగలేదు.

4. ఆవల్‌ఖేడాలో జరిగిన ప్రథమ పూర్ణాహుతి సందర్భాన్ని పురస్కరించుకొని, పరమగురువుల ప్రేరణగా పూజ్యశ్రీ శ్రీమాస్టర్‌గారే స్వయంగా వేటపాలెంలో 1995 నవంబర్ 4,5,6,7 తేదీలలో సహస్రకుండీయజ్ఞములు, సంస్కారములు నిర్వహించటం జరిగింది. శ్రీశైలంలో జరిగిన సాధనాశిబిరాల మహత్యం ప్రత్యక్షంగా అనేక రూపాలలో వ్యక్తమైంది. ఈ విధంగా పూజ్యులు డాక్టర్ శ్రీరామకృష్ణగారు తమ అంతఃకరణ సాధనను పైకి ఎవ్వరికీ తెలియనీయకుండా, కార్యక్రమాల నిర్వహణకు కావలసిన ప్రేరణను, స్ఫూర్తిని ప్రత్యక్షంగా, పరోక్షంగా అందిస్తూ ఋషుల కార్యక్రమాల్లో భాగంగా, అలుపు, సొలుపనేది తెలియకుండా ఆత్మీయ పరిజనులచేత పని చేయించి, పురస్కారాలను పరివారానికి పంచిపెట్టేవారు.

## ప్రకృతి ఇచ్చిన ప్రసాదం

తరువాత కొన్నాళ్ళకు మాస్టర్‌గారి దగ్గరనుండి ఒక కట్ట ఉత్తరాలు పోస్టులో వచ్చాయి. అందులో సప్తఋషుల సాధనా విధానాలను వర్గీకరించి, ఏ వర్గంవారు ఎంత సంఖ్య జపం చేశారు-నియమాలతో పాటు చెయ్యవలసిన జపసంఖ్య వర్గీకరించి ఇవ్వబడింది. రెండవది లేఖామాల. అందులో 1.పరాప్రకృతి పరిమార్జన. 2. సౌరశక్తి సందోహన. యజ్ఞాలను గురించిన విశేషమైన సమాచారం కూలంకషంగా ఇవ్వటం జరిగింది.

### పరాప్రకృతి పరిమార్జన అంటే ఏమిటి?

పరాప్రకృతి పరిమార్జన అంటే అననుకూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకొనుట. మహాభారతంలో దీనికి సంబంధించిన ఒక సంఘటనను పరిశీలిద్దాం. 12 సంవత్సరాల అరణ్య వాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాస కాలంలో పాండవులకు తినటానికి ఏ తిండి లేదు. జీవించటానికి అవసరమైన కనీస వనరులేమీ లేవు. ఎటు చూచినా అననుకూల పరిస్థితే! అయినా

వారు అధైర్యపడలేదు. మహాభారతయుద్ధానికి కావలసిన అస్త్ర, శస్త్రాలను సంపాదించుకున్నారు. సంయమనంతో, తపస్సాధనలను చేశారు. మహావీరుడైన అర్జునుడు, శివుని గురించి తపస్సు చేసి పాశుపతాస్త్రాన్ని సంపాదించాడు. మిగిలిన పాండు సోదరులు తమ యొక్క బాహుబలాన్ని, అస్త్రబలాన్ని ఎంతో ధృఢమైన మానసికస్థితితో పటిష్టం చేసుకున్నారు. అంటే బాహ్యపరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా స్పదించకుండా వాటిని, లక్ష్యసాధన దిశగా మలుచుకోవడమే పరాప్రకృతి పరిమార్జన. దీని తర్వాత సౌరశక్తి సందోహన. దాన్ని చాలా అద్భుతంగా వ్రాశారు.

బ్రహ్మవిద్యలో రెండవ సిలబస్‌గా నిర్ధారింపబడినది "సౌరశక్తి సందోహన ప్రక్రియ", సౌరశక్తి అంటే సూర్యుని శక్తి అన్న విషయమందరికీ తెలిసినదే! "సువతి కర్మాణి లోకం ప్రేరయతీతి సూర్యః" అంటే తన సుందరమైన ప్రేరణలతో ప్రపంచాన్ని జాగృతపరచేవాడే సూర్యుడు. సమస్త విద్యలూ, ఆదిభౌతిక, ఆదిదైవిక, ఆధ్యాత్మిక శక్తులన్నీ, మానవజాతికి సూర్యుణ్ణించే ప్రాప్తిస్తాయి. 'సూర్యఆత్మా జగతస్తుషశ్చ'– సూర్యుడు ప్రపంచానికి ఆత్మ మరియు కన్నుల్లాంటి వారు. 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అంటారు. శరీర అంగాలలో కన్ను చాలా ప్రధానమైనది. అలా సూర్యుణ్ణి గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ప్రాణాకర్షణ, పర్జన్యవర్షణలతో పాటు సమస్త విభూతులు ఈ విశ్వానికి అంద చేయుచున్న దివ్యశక్తిగా చెప్తూ, ఆదిత్యహృదయంలో సూర్యుడే సర్వదేవతా స్వరూపుడని చెప్పే శ్లోకం, "ఏషా బ్రహ్మ విష్ణుశ్చ శివః స్కందః ప్రజాపతిః" అని కీర్తించటం జరిగింది. త్రిమూర్తి స్వరూపుడిగా ఆరాధించబడే ఈ సూర్యనారాయణమూర్తే, గాయత్రీ మంత్రానికి అధిష్టాన దేవత. ఉదయించే బంగారురంగు సూర్యుణ్ణి "సవిత" అంటారు. పైకి సాధారణంగా కనిపించే ఈ మానవదేహం, "స్థూల, సూక్ష్మ, కారణ" అనే మూడు శరీరాలను కలిగివుంటుంది. ఇది వ్యక్తిగత శరీరమైతే, సమిష్టిగత శరీరాలన్నింటికీ కేంద్రం – సూర్యుడు. సూర్యుడనగా సవితాశక్తి. అలాంటి సవితాశక్తిని సామూహికసాధన, ఆరాధనలు చేసి దివ్యశక్తిని సముపార్జించి, దానిని విశ్వకళ్యాణార్థం వినియోగించాలి. "సందోహన" అంటే పితకటం. "గోదోహన" అంటే పాలు పితకటం, అలానే సౌరశక్తి సందోహన అంటే సామూహిక సాధనా అనుష్టానములతో, సూర్య ఉపాసన చేసి, గాయత్రీమంత్రంతో ఆ శక్తిని ఏకత్రితం చేసి, యజ్ఞప్రక్రియలో ఆ దివ్యశక్తిని "వాతావరణ కాలుష్య నివారణకొరకు, సద్బుద్ధిని పెంపొందించేందుకు, విశ్వకళ్యాణం కొరకు" దానిని దింపుతారు. ఇది ఒక ఆధ్యాత్మిక ప్రయోగం.

ఈ సాధనను వశిష్ఠ, విశ్వామిత్ర, జమదగ్ని, భరద్వాజ ఋషుల సాధనలో భాగంగా జప సంఖ్యను వర్గీకరించి మాస్టర్‌గారు ఒక ఛార్ట్‌ను పంపారు. వేర్వేరు ఋషులకు సంబంధించిన జపం లక్షల సంఖ్యలో ఇవ్వబడింది. నియమిత గడువు లోపల వ్యక్తిగతంగా కానీ, సామూహికంగా కానీ ఆ జపం పూర్తి చేసిన తరువాత సౌరశక్తి సందోహన, సహస్రకుండీయ యజ్ఞాలు నిర్వహించాలి.

ఇదే ప్రక్రియ పరాప్రకృతి పరిమార్జనలో కూడా అనుసరించబడుతుంది. అయితే ఇక్కడ ఇవ్వబడిన ఋషుల సాధన, జపసంఖ్య వర్గీకరణ మారుతుంది. అంతే మిగిలిన ప్రక్రియంతా ఒకేలాగా ఉంటుంది.

తర్వాత మాస్టర్‌గారు మరొక సర్క్యులర్ పంపారు. యధాతధంగా దానినిక్కడ పొందు పరుస్తున్నాము.

1993 అక్టోబర్ 22,23,24 తేదీలలో ఒంగోలులో పరాప్రకృతి పరిమార్జన కొరకు జరిగే త్రిదివశీయ, సహస్రకుండీయ గాయత్రీమహాయజ్ఞము సందర్భంగా అనుష్టింపబడుతున్న గాయత్రీ మహాపురశ్చరణకు, 24 కోట్ల గాయత్రీమంత్ర జపము చేయబడుచున్నది. వేదముల ప్రవృత్తి యజ్ఞకర్మల కొరకే "యజ్ఞో వేదేషు ప్రతిష్ఠితః" (గోపథబ్రాహ్మణం 1-1-38). యజ్ఞము మూడు లక్ష్యాలతో చెయ్యాలి. 1. దేవపూజనము అంటే దైవీ సద్గుణముల అనుసరణ. 2. సంగతీకరణము అనగా సంఘీభావము. 3. దానము అనగా ఉదారమైన సహృదయత.

భౌతిక ప్రగతికి ఆధారమైన శిక్షణ, శ్రమ అనేవి ఆధ్యాత్మిక జగత్తులో యోగము, తపస్సుగా పరిణతి చెందుతాయి. యజ్ఞాగ్ని మనకు తెలిపే అనేక ఆదర్శాలు -1. ఎల్లప్పుడు వేడిగా (స్ఫూర్తి, ఉత్సాహము), సక్రియముగా ఉండుట. 2. జ్యోతిర్మయముగా అంటే అనుసరించదగిన అదర్శములను కలిగివుండి, ఇతరులకు మార్గదర్శనము చేయుట. 3. తన సంపర్కములోనికి వచ్చిన వారిని తన వలె తయారుచేయుట. 4. పొందిన ఉపలబ్ధిని సమాజమంతటికి పంచిపెట్టుట. 5. నిరంతరము అగ్నిశిఖల వలె ఎత్తుగానుండుట అంటే ఆలోచనా సరళి, స్వాభిమానము క్రింద పడకుండావుంచుట. పైన చెప్పిన ఐదు ఆదర్శములను యోగము, తపస్సులనుపయోగించుకుంటూ యజ్ఞము యొక్క మూడు లక్ష్యాలను (పరిష్కృత వ్యక్తిత్వము, సంగతీకరణము, దానము) సాధించుటే మనకు కలిగే లాభం. దీని కొరకు సిద్ధించిన మంత్రము, నిర్ధారింపబడిన హవనసామగ్రి ఉపయోగించబడతాయి.

"పౌర్ణిమాస్యేష్టి" యజ్ఞము ద్వారా సూర్య, చంద్ర నాడుల రహస్యమును తెలుసుకొని, ప్రాణ విద్యలో ప్రతిష్ఠాపితుడై, పశుబంధ యజ్ఞము చెయ్యాలి. అనగా పంచకోశసాధన, ఆత్మబోధ ద్వారా ఐదు ఇంద్రియములు, ఆరవదియైన మనస్సును బంధించాలి. ఆ తర్వాత శరీరములో ఉన్న ఇంద్రియాధిష్ఠాన దేవతలకు, శరీరములోని వీర్యము యొక్క సూక్ష్మరూపము యొక్క శీర్శ్యస్థానమునకు తీసుకువెళ్ళి, సోమపానము చేయించుటే "వాజపేయయజ్ఞము". ఈ విధంగా తిరిగి, తిరిగి యజ్ఞము చేయుట వలన శతక్రతు అనగా ఇంద్రపదవి లభిస్తుంది. ఈ విధముగా రాజసూయ యజ్ఞము (పేజీ16... అశ్వమేధము) ద్వారా తనపై సామ్రాజ్యమును స్థాపించుకున్న సాధకుడు ఆత్మరూపమైన (విశ్వరూపమైన) "సామ్రాజ్యమును" స్థాపించటానికి త్రిదివశీయ సహస్రకుండీ మహాయజ్ఞాన్ని చేస్తాడు. త్రిరాత్రం యజ్ఞ క్రతుం... యజతే.... శతపథ బ్రాహ్మణము. 13-4-1-1) అందువల్ల శతక్రతు స్థాయి నుండి మూడురోజుల సహస్రక్రతువు చేయవలసి ఉంటుంది. (సహస్ర శీర్షాపురుషః సహస్రాక్షః సహస్రపాత్...).

**విశ్వరూపం హరిణం జాతవేదసం, పరాయణం జ్యోతిరేకం తపంతం ।**
**సహస్ర రశ్మిః శతథావర్తమానః ప్రాణ ప్రజనా ముదయ త్యేషసూర్యః ॥**

అనగా "సహస్రరశ్మి" అయిన "శతథా" మరియు ఈ ప్రపంచాన్ని పాలించే ప్రాణ స్వరూపుడైన సూర్యుడు ఒక్కడే. అందువల్ల ప్రాణశక్తిని పూర్తిగా ఉపయోగించుకునే విధివిధానము గాయత్రీ మంత్రము మీద ఆధారపడి ఉంటుంది. ఒంగోలులో అక్టోబర్ 22,23,24 తేదీలలో జరగబోయే త్రిదివశీయ సహస్రకుండీయ గాయత్రీ మహాయజ్ఞమునకు కావలసిన సవితాశక్తి, ప్రాణశక్తి కొరకు 24కోట్ల గాయత్రీమంత్ర జపసంపత్తి కావాలి. దీనిని క్రింద వివరించబడిన విధంగా సాధించవచ్చు.

లక్ష్యము : 24,00,00,000; కాలము: 50 రోజులు అంత కంటే తక్కువ.

ఈ క్రింది పట్టిక ప్రకారం 25 లక్షల జపం ఎలా పూర్తౌతుందో చూద్దాం.

నిత్య జప సంఖ్య ........రోజులు...........సాధకులసంఖ్య........మొత్తం జప సంఖ్య.

3000 దధీచివర్గం ......50....................5మంది...............7,50,000.

1500 వశిష్టవర్గం ......50....................10మంది.............7,50,000.

500 విశ్వామిత్రవర్గం ...50....................40 మంది............10,00,000

50 రోజులలో మొత్తం జప సంఖ్య .......25,00,000.

ఈ విధముగా 4 గ్రామాలలో 25లక్షల జపము జరిగితే 1 కోటి అవుతుంది. అలాగా 96 గ్రామాలలో జరిగితే 24కోట్ల జపము సులభంగా సాధించవచ్చు. పై సాధకులు తమ సాధనా పూర్ణాహుతిగా సహస్రకుండీ యజ్ఞంలో పాలు పంచుకుంటారు. గట్టిగా చేస్తే 50 రోజుల సాధన. కానీ కొంత మంది సాధకులు అంత కంటే తక్కువ సమయంలో, జపసంఖ్య పూర్తి చేసి, జపమును ఆపి వేయవచ్చును. అలా చేసిన వారు కూడా త్రిదివశీయసహస్రకుండీ మహాయజ్ఞంలో పాలు పంచుకోవచ్చు. పైన ఇచ్చిన పట్టిక ప్రకారం ఎంత మంది ఎన్నిరోజులు వారు చేసిన మొత్తం జపం ఎంత చేశారో తెలియపరచండి.

దధీచి వర్గ జపసంఖ్య + వశిష్ట వర్గ జపసంఖ్య + విశ్వామిత్ర వర్గ జపసంఖ్య వల్ల ఆ గ్రామానికి 25 లక్షల మంత్ర జపం పూర్తి కావాలి. రోజుల సంఖ్య 50 రోజుల కంటే ఇంకాస్త తగ్గించుకోవచ్చు. వీలైతే నగరాలను విభిన్న సమూహాలుగా, పేటల వారీగా, ఒక్కొక్క సమూహము 25 లక్షల జపసంఖ్యను సాధించవచ్చు. ఈ వివరాలన్నీ నాకు త్వరలో తెలుపుతారని ఆశిస్తూ......
మీ...శ్రీరామకృష్ణ.

ఈ ఉత్తరం అన్ని ఊళ్ళ వాళ్ళకు అందింది. దానిని చదివిన అన్ని గ్రామాల కార్యకర్తలు పైన సూచించిన జప సంఖ్యను పూర్తి చేయటానికి శతధా కృషి చేయటం ప్రారంభించారు.

## యజ్ఞ ఆయోజన - నిర్దిష్ట సూచనలు

ఈ కార్యక్రమాల గురించిన లేఖామాల అందిన తరువాత మాస్టర్‌గారిని కలవటానికి ఒంగోలు నుంచీ సీతామహలక్ష్మిగారితో పాటుగా మౌన స్వామిగారు, ఇంకొంత మంది కార్యకర్తలు గుంటూరుకు వెళ్ళారు. వారు నిజంగా మౌనస్వామియే. శాంతికుంజ్‌కు వెళ్ళి పరమపూజ్య గురుదేవులను, మాతాజీలను దర్శించుకున్న వ్యక్తి ఆయన. మౌనసాధనతో విశ్వకళ్యాణార్థం తమ సాధనను చేస్తున్నారు. అయితే వారు గ్రామ, గ్రామాలలో తిరుగుతూ 'ఆ మౌనంతోనే' గాయత్రీ ప్రచారం, యజ్ఞాలు చేయిస్తుండే వారు. ఒంగోలు పరివార్ శ్రీమతి సీతామహలక్ష్మి, లక్ష్మినారాయణ గారూ, రంగనాధ్, కిశోర్, శ్రీమతి భవానీగారు ఇలా కొంతమంది వారికి సహకరిస్తుండేవారు. వీరందరూ పరాప్రకృతి యజ్ఞనిర్వహణ విషయమై మాస్టర్‌గారితో మాట్లాడాలని వచ్చారు. అలానే వేటపాలెం నుంచీ కొంత మంది కార్యకర్తలు నాతో కలసి గుంటూరుకు వచ్చారు.

ఉభయకుశలోపరి అయ్యాక 1. పరాప్రకృతి పరిమార్జన అనే విరాట్‌యజ్ఞ కార్యక్రమాన్ని చేస్తామని ఒంగోలు వాళ్ళు చెప్పిన తరువాత రెండవయజ్ఞం 'సౌరశక్తి సందోహన యజ్ఞమును, మేము చేస్తా'మని వేటపాలెం కార్యకర్తలం అన్నాం. అంతా విన్నాక మాస్టర్‌గారు, ఆ యజ్ఞాల నిర్వహణకు సంబంధించిన వివరాలు చెప్తూ ఏ యజ్ఞము చెయ్యాలన్నా ముందుగా, " ప్రయాజ, యాజ, అనుయాజ" అనే మూడు ప్రక్రియలుంటాయి. వాటిని పాటించి తీరాలని చెప్తూ సంక్షిప్తంగా వాటివివరణను ఇలా చెప్పారు.

**ప్రయాజ:** ప్రయాజ అంటే ఒక మహాయజ్ఞం చేయడానికి ముందు చేయవలసిన ప్రధాన అంశాలు, 1. జపసంఖ్య, 2. వనరుల సమీకరణ, 3. జనబలం, ధనబలం. ఆ తరువాత దానికి కావలసిన ఏర్పాట్లు చూసుకోవాలి. జపం విషయానికి వస్తే ఋషుల సంప్రదాయ పద్ధతిలో నియమాలను పాటిస్తూ గాయత్రీజపం 24,000 అంటే ఒక అనుష్టానం పూర్తి చేసినటువంటి కుటుంబాలు వెయ్యి అయిన తరువాతే ఈ సహస్రకుండీయ యజ్ఞం సుసంపన్నమౌతుంది. దానితో పాటు మిగిలిన వనరులను కూడా సమీకరించుకోవాలి. ఇలా సాధకులను సమీకరించడానికి మీరు ఇంటింటికి వెళ్ళి దీపయజ్ఞాలు చేసి వారిని ఉత్సాహవంతులుగా చేసి ఆ కుటుంబ సభ్యులతో జపం చెయ్యడానికి కావలసిన దీక్షను ఇవ్వండి. మాతాజీకి మీరు చేసిన ఈ యజ్ఞాలను గురించి, దీక్ష తీసుకుని జపం చేస్తున్నవారి వివరాలు తెలియపరుస్తూ ఉత్తరాలను వ్రాయండి. ప్రతిరోజు ఎవరెంత జపం చేస్తున్నారు అనేది పేర్లతో సహా మాతాజీకి తెలియచేయండి.

**యాజ:** యాజ అంటే ఇలా సాధన చేసిన వ్యక్తుల చేత మాత్రమే యజ్ఞము చేయించాలి. వీరందరు తమకు చేతనైనరీతిలో ఆవునెయ్యి, సమిధలు, హవనద్రవ్యం లాంటి వస్తుసామాగ్రిని ఇచ్చి తమ సహాయసహకారములను అందించాలి.

**అనుయాజ:** మూడవది అనుయాజ. ఈ మహాయజ్ఞాలు అయిపోయిన తర్వాత వాతావరణంలో అద్భుతమైన దైవీశక్తి ఆవిర్భవిస్తుంది. మనం ఆ దైవీశక్తిని విశ్వకళ్యాణార్థం ఎలా వినియోగించుకోవాలనేది మాత్రం పూజ్యగురుదేవులిచ్చిన ప్రణాళిక ప్రకారం ఒక చక్రీయక్రమంలో కొనసాగించాలి. ఈ యజ్ఞాలకు వచ్చిన వారంతా ఒకే కుటుంబంలాగా మెలుగుతూ అనుయాజ ప్రక్రియను వారివారి గ్రామాలలో ఏర్పాటు చేసి ఆ దైవీశక్తిని అనంత విశ్వానికి అందించే కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి.

అలా మాస్టర్‌గారిచ్చిన సూచనల ప్రకారం ఈ యజ్ఞకార్యక్రమాలను చేయాలనే సంకల్పాన్ని అటు ఒంగోలు పరివార్, ఇటు వేటపాలెం వాళ్ళు తీసుకొని దానికి తగిన కార్యాచరణలను ప్రారంభించి, వాటి వివరాలను వివరిస్తూ మాతాజీకి చెరొక ఉత్తరం వ్రాశాం. ఇక ఎవరి పద్ధతులలో వారు తమ, తమ కార్యాచరణలను మొదలుపెట్టారు. చుట్టు ప్రక్కల గ్రామాలలో తిరుగుతూ యజ్ఞాలు, దీపయజ్ఞాలు చేస్తూ గాయత్రీమంత్ర దీక్షలనిస్తూ, ఉధృతంగా ప్రచారకార్యక్రమాలను కొనసాగించారు. ఒంగోలువారు శ్రీమౌనస్వామిగారి అధ్వర్యంలో తిరుగుతున్నారు. వేటపాలెంలో నాతోపాటు చురుకైన కార్యకర్తలు సూర్యకిరణాల్లాగా ఏడుమంది శ్రీమతి సీతమ్మ, భువనేశ్వరి, లక్ష్మి, విజయలక్ష్మి, ప్రసాదు, హైమగార్లు తిరిగితే, చీరాల నుండి సుబ్బారావుగారు, పార్వతి, లీలావతి వాళ్ళంతా కలిసి తిరిగేవారు. ఏ రోజు ఎంతమందికి దీక్షలనిస్తే వారందరి పేర్లు, అడ్రస్సులు వ్రాసుకుని ఆ లిష్టు ఒక కాపీని మాతాజీకి, ఒక కాపీని పూజ్యశ్రీ మాస్టర్‌గారికి పంపుతుండేవాళ్ళం. అలా కార్యకర్తల కృషితోపాటు పూజ్యశ్రీమాస్టర్‌గారి అనుగ్రహంతో దాదాపు వందల కుటుంబాలవారు ఈ యజ్ఞకార్యక్రమాలకు నమోదయ్యారు.

ఒంగోలులో అక్టోబర్ 22,23,24 తేదీలలో దేవీనవరాత్రులలో యజ్ఞం నిర్వహించాలనే నిర్ణయం జరిగిపోయింది. గాయత్రీసాధనకు, దాని పూర్ణాహుతికి ఇంతకంటే పవిత్రమైన రోజులు మనకెక్కడ దొరుకుతాయి. మౌనస్వామివారి ఆధ్వర్యంలో సీతామహాలక్ష్మిగారు, మిగిలిన కార్యకర్తలు యజ్ఞానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖరాజకీయ నాయకులు సైతం ఈ యజ్ఞంపట్ల ఆకర్షితులై తమ వంతు కృషిని ప్రారంభించారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు వేటపాలెం యజ్ఞానికి 09-01-1994 సరైన తేదీగా నిర్ణయించారు. ఈ తేదీలో విచిత్రమైన సంఖ్యాశాస్త్రం ఇమిడి ఉన్నది. అది సర్వదేవపూజనకు సంబంధించినది. మనకు అతి ముఖ్యమైన దేవతా శక్తులు... ద్వాదశాదిత్యులు (12) + ఏకాదశ రుద్రులు (11) + అష్టవసువులు (8) + ఇద్దరు అశ్వనీ దేవతలు = మొత్తం సంఖ్య 33. వారే పురాణాలలో చెప్పబడిన 33 కోట్ల మంది దేవతలు. అవే మన శరీరంలో వున్న వెన్నెముకలోని 33 పూసలు. హవనద్రవ్యంలో గల 33 వనమూలికలూ అవే! ఇంకా ఈ యజ్ఞాని కిచ్చిన తేదీ ఎంత మహత్తరమైనదో చూద్దాం.

తారీకులో మొదటి సంఖ్య=9. సంఖ్యాశాస్త్రంలో తొమ్మిది పరిపూర్ణసంఖ్య. అవే నవగ్రహాలు, నవరత్నాలు. నవరాత్రులు, ఇంకా ఇలా చాలానే వున్నాయి. విశేషంగా జనవరినెల అంటే

సౌరమాసానికి మొదటినెల. ఇక్కడ '1' అనేది సూర్యునికి సంబంధించిన సంఖ్య కనుక మనమిప్పుడు చేస్తున్న 'సౌరశక్తిసందోహన'కిది ఖచ్చితంగా సరిపోతుంది. ఆ రోజు తిథి ద్వాదశి-12సూర్యులకు ప్రతీక. తిథి, వార, నక్షత్రాలతో అద్భుతమైన కలయికతో జరిగిన నిర్ణయం. సాధనతోపాటు, ప్రచారం ఇంకా ఏర్పాట్లు కూడా ఉధృతంగా జరిగిపోతున్నాయి.

మాతాజీ నుంచీ అనుమతి పత్రం కొరకు ఎదురుచూస్తున్నారు. ఆ రోజులలో ఏవిధమైన టెలిఫోన్ సౌకర్యాలు లేవు. అందరి వద్ద ద్విచక్రవాహనాల వసతి కూడా ఉండేది కాదు. కార్లు అనేవి చాలా అరుదుగా వుండేవి. కేవలం ఉత్తరాల ద్వారా మాత్రమే కమ్యూనికేషన్ వుండేది. ఒక శుభతరుణంలో మాతాజీ నుంచీ అనుమతి పత్రం వచ్చింది. 'మీరు చేస్తున్న కృషికి మేము ఎంతో ఆనందిస్తున్నాము. మా చిన్నారిబిడ్డలు ఎంతో ఉత్సాహంతో చేస్తున్న ఈ యజ్ఞానికి మా సంపూర్ణమైన ఆశీస్సులు వుంటాయి. మీరు నిర్ణయించుకున్న తేదీకి 1008 కుండీలలో సౌరశక్తి సందోహన మహాయజ్ఞం సుసంపన్నమౌతుంది', యజ్ఞసమయంలో మా సూక్ష్మ ఉపస్థితిని మీరనుభూతి చెందగలరని వేటపాలెం వారికి జవాబు వచ్చింది. రెట్టింపు ఉత్సాహంతో వేటపాలెంలో ఏర్పాట్లతోపాటు, ప్రచారాన్ని కూడా ఉధృతం చేశారు.

'పరాప్రకృతి పరిమార్జన' యజ్ఞనిర్వహణకై అనుమతి కోరుతూ ఒంగోలు నుండి సీతామహలక్ష్మిగారు వ్రాసిన ఉత్తరానికి సర్వజ్ఞురాలైన మాతాజీ, 'మీరు చేయబోతున్న యజ్ఞానికి ప్రస్తుతం ప్రకృతిలో అనుకూల పరిస్థితులు లేవు. సాధన కొనసాగించండి. తగిన వాతావరణం ఏర్పడినప్పుడు మేమే మీకు యజ్ఞానికి అనుమతినిస్తాము' అని జవాబు వ్రాశారు. కానీ అప్పటికే స్థానిక కార్యకర్తలు విస్తృతమైన ఏర్పాట్లు చెయ్యటం, అందరికీ ఆహ్వానాలు పంపటం జరిగిపోయి నందున వాళ్ళు మానసికంగా కొంత సంకటంలో పడ్డా పనిని ఆపకుండా కొనసాగించారు.

అసలే ఆశ్వయుజమాసం, దేవీనవరాత్రులు, దుష్టశిక్షణ చేయటానికి మాత దుర్గాదేవి తన కరవాలంతో సిద్ధంగా వుంటుంది. కానీ అమ్మ-అమ్మేగా. ఏ విధమైన సంకట పరిస్థితులు, అరాచకం జరగకుండా, తన చిన్నారి బిడ్డలను ఆమె కాపాడుతూనే వుంటుంది. యజ్ఞనిమిత్తం ఒంగోలు పి.వి.ఆర్. స్కూలు ఆవరణలో షామియానాలు, తాటాకు పందిళ్ళు వేశారు. ఇంక 1008 యజ్ఞ కుండాలు పెట్టాలి. అంతే కనీ, వినీ ఎరుగని రీతిలో ముసురుపట్టి, ఉధృతమైన తూఫాన్ వచ్చి ఆగకుండా 5,6 రోజులు వర్షాలు కురిశాయి. వేసిన పందిళ్ళు నేలకూలాయి. పాఠశాల ఆవరణలో

మొలలోతు నీళ్ళు. ఎటూ పాలుబోని పరిస్థితి. మాతాజీ సర్వజ్ఞురాలు, భవిష్యద్రష్ట. ఎలాంటి అననుకూల పరిస్థితిని దర్శించారో మరి, ముందుగానే యజ్ఞాన్ని ఆపివేసి ఎంతటి అరిష్టాన్ని ఆపారో తెలియదుగదా! కార్యకర్తలు కాస్త నిరాశపడ్డా పూజ్యశ్రీ మాస్టర్‌గారిచ్చిన ఊరటతో కాస్త కుదుటపడి సాధన కొనసాగించారు. ఆ సమయంలో మాస్టర్‌గారిచ్చిన 'మోరల్ సపోర్ట్' వారికి ఎంతో ధైర్యాన్నిచ్చింది. 1993 అక్టోబర్‌లో జరుగవలసిన 'పరాప్రకృతియజ్ఞం' మళ్ళీ మాతాజీ అనుమతి లభించే దాకా అందరూ మాస్టర్‌గారి సూచనల ప్రకారం అనుష్టాన పరంపరను కొనసాగించారు. సాధన సాగిపోతున్నది. దీని తర్వాత చేయవలసినది,

## సౌరశక్తి సందోహన అంటే ఏమిటి?

మాతాజీ నుంచీ అనుమతి లభించాక, మాస్టర్‌గారి నుండి యజ్ఞానికి కావలసిన ఏర్పాట్ల గురించిన వనరుల వివరాలు అందాయి. ఈ యజ్ఞం చేయటానికి ముందు అసలు సౌరశక్తి సందోహన అంటే ఏమిటి? ఇది చేసినందువలన వచ్చేలాభాలేమిటి? అనేది తెలుసుకోవాలి.

మానవజీవితంలో సూర్యుని పాత్ర తెలుసుకోవాలంటే కంటికి కనిపించే భౌతికలాభాలను గురించి మాత్రమేకాక, ఆ సందర్భంలో భారతీయ ఆధ్యాత్మికత తెలియచెప్పే విశేషాలు కూడా తెలుసుకోవాలి. గెలీలియో ఈ సూక్ష్మసంబంధమును గురించి చెప్తూ ఇలా అన్నారు 'కనిపిస్తున్న సూర్యుడు సంపూర్ణుడు కాడు. నిజమైన సూర్యుడు ప్రతి పరమాణువులోనూ తన చేతనత్వ ప్రభావాన్ని చూపిస్తున్నాడు. అంతే కాక ప్రతి పరమాణువులోనూ ఉన్న ఈ సౌరశక్తి బీజము సూర్యుని అంత సామర్థ్యమును కలిగివున్నది. ఈనాటి వైజ్ఞానికులు కూడా తమ ప్రయోగాల ద్వారా సూర్యుని వలన మన భౌతికజీవితమేకాక, ఆధ్యాత్మిక క్షేత్రాలు కూడా పూర్తిగా ప్రభావితమౌతాయని తెలుసుకున్నారు. సూర్యునితో మానసికసంబంధము ఏర్పరచుకునే విద్యయే గాయత్రీ-మహావిద్యగా చెప్పబడుతున్నది. మన శరీరాలలో పృథ్వీతత్వ రససేవన వలన ఆక్సిజన్, హైడ్రోజన్, కార్బన్, ఇనుము, గంధకము మొదలైన తత్వాలు ఏర్పడతాయి. కానీ ప్రాణతత్వము వీటన్నింటి కంటే సూక్ష్మమైనది కనుక గుర్తించలేము. గాయత్రీమహావిజ్ఞానము ద్వారా ఈ సూక్ష్మశక్తులతో సంబంధమును ఏర్పరచుకుని, విస్తృతమైన శక్తులను పొందవచ్చును.

ఖగోళశాస్త్రజ్ఞుల అభిప్రాయప్రకారం సూర్యునిలో హైడ్రోజన్, హీలియం అనే రెండు తత్వాలున్నాయి. సూర్యుడు హైడ్రోజన్‌ను ఆహారంగా స్వీకరించి హీలియంగా మారుస్తాడు. తద్వారా

శక్తి ఆవిర్భవించి వేడి, వెలుతురు ఏర్పడతాయి. ఈ చర్యే కనుక జరిగి ఉండకపోతే ఇప్పుడు కనిపిస్తున్న సూర్యుడు కూడా కనిపించడు. ఇప్పుడు కనిపిస్తున్న సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు అయిన సూర్యునిలో పైన చెప్పిన చర్యలు ఒక్క భాగము మాత్రమే! టెలిస్కోప్‌తో సూర్యుని చూచినప్పుడు, యజ్ఞకుండంలో జ్వలించే జ్వాలలే గాక ప్రచండమైన శక్తిధారలు బహిర్గతం కావడం కనిపిస్తుంది. సూర్యుని యొక్క శక్తి అనంతమూ, విశాలమూ కనుక ఆయన సృష్టికి నిరంతరము శక్తిని ప్రసాదిస్తుంటాడు. అందువలన ఆయనను 'దేవత' అనే ఆదర సూచక శబ్దాలతో సంబోధిస్తుంటారు.

అందుచేత మనం సూర్యుని భావనాత్మక-ఆలోచనాత్మక శక్తుల ఉద్గమస్థానముగా గుర్తించి, వాటి సందోహనప్రక్రియ అంటే పితకటం అనేది చేపట్టగలిగితే శారీరిక, మానసిక, ఔద్యోగిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక వరదానాలనెన్నింటినో పొందవచ్చు. ఈ విద్యకు సంబంధించిన ప్రక్రియ గాయత్రీమంత్రము ద్వారా ఈనాడు పృధ్విమీద చేయబడుతున్నది. **'సూర్యాత్మా-జగతస్తుషశ్చ' అనగా సూర్యుడే ఈ జగత్తుకు ఆత్మ. మన చేతనత్వము-శరీరజగత్తుకు ఆత్మ. ఈ రెండింటి మధ్య తత్వాల ఏకత్వము ఉండటం వలన, 24అక్షరాల స్పందనతో మన చేతనత్వాన్ని సూర్యశక్తితో ఏకీకరణచేసి, అనంత శక్తిని పొందటమే గాయత్రీమహామంత్రోపాసన.** అందువలన గాయత్రీ ఉపాసనలో ఉదయిస్తున్న సూర్యమండలంలో గాయత్రీమాత స్వరూపాన్ని ధ్యానించాలని చెప్తారు.

**నమస్తే సూర్య సంకాశే సూర్యగాయత్రీ కేమలే ।**

**బ్రహ్మ విద్యే మహావిద్యే వేదమాత నమోస్తుతే ॥**

సూర్యుడు-గాయత్రీల ఏకత్వాన్ని అగ్ని- వేడిల మధ్య వున్న ఏకత్వంగా గుర్తించవచ్చు. సాధకుడు ఈ భౌతిక శరీరంలోనే వుంటూనే సూర్యుని వలె సర్వవ్యాపి, సర్వసమర్ధుడు అయిపోతాడు. వాతావరణాన్ని, ఆరోగ్యాన్ని, ఇతర వ్యక్తుల మనస్సులలోని ఆలోచనలను తెలుసుకునే సామర్థ్యాన్ని పొందుతాడు. అంతేకాక అనేక సూక్ష్మాతి, సూక్ష్మమైన అంశములపై స్వామిత్వమును పొందుతాడు. కరుణ, సద్బుద్ధి, పరమార్థములను గురించిన ఆలోచనలు ఎక్కువ కావడంతో సద్గుణములు, సదాలోచనలు తీవ్రరూపం దాల్చి అవి సత్కర్మలుగా పరిణతి చెందుతాయి. ప్రశాంతంగా ఉన్న సరస్సులో ఒక చిన్నరాయి విసరి తరంగాలను ఉత్పత్తి చేయవచ్చు. భారతీయ ఋషులు ఈ సిద్ధాంతాన్ని ఉపయోగించుకొని అనేక సాధనా పద్ధతులను వికశింపచేశారు. పరమపూజ్య

గురుదేవులు విశిష్ట విధానముతో, విశిష్ట సమయాలలో గాయత్రీ ఉపాసనను, యజ్ఞములను చేయటం వలన సూర్యుని నుండి ఆధ్యాత్మిక శక్తులను ఆకర్షించుకొని, తమ కొరకే కాక సంపూర్ణ విశ్వానికి శాంతి – సమృద్ధి – సుఖమును అందించవచ్చని నిరూపించారు.

'సౌరశక్తి సందోహన'ను గురించి గురుదేవులు పండితశ్రీరామశర్మఆచార్యగారు ఎంతో వివరణను ప్రసాదించారు. ఈ సౌరశక్తి గాయత్రీ మహాయజ్ఞానికి, పూజ్యశ్రీ మాస్టర్‌గారు "సహస్రయుగ్మ గాయత్రీ మహాయజ్ఞం" అని పేరు పెట్టారు. దీని కొరకు అనేక అనుష్ఠానాలను ముందుగానే చేయించటం జరిగింది. గాయత్రీ జపం వలన సూర్యునిలో అనుకంప ఏర్పడుతుంది. తద్వారా వ్యక్తిగతంగానే కాకుండా ప్రకృతిలో కూడా దాని దివ్య ప్రభావం అసామాన్యంగా ఏర్పడు తుంది. అలాంటి అద్భుతమైన విభూతులను ప్రసాదించి, సాధనలను చేయించి, ఇంత పెద్ద విరాట్ కార్యక్రమాలను చేయించి, సాధకుల చేతనత్వంలో అనంతమైన ఔన్నత్యాన్ని దివ్యాత్ములైన మాస్టర్‌గారు మనకు ప్రసాదించారు.

## సహస్రయుగ్మగాయత్రీ మహాయజ్ఞం

మాతాజీ నుంచీ సౌరశక్తి మహాయజ్ఞానికి అనుమతి లభించిన తర్వాత స్థానిక కార్యకర్తలు ఇనుమడించిన ఉత్సాహంతో రాత్రింబవళ్ళు అలుపనేది ఎరుగకుండా ప్రచారం ముమ్మరంగా సాగించారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను నా కోరికపై పూజ్యశ్రీ మాస్టర్‌గారి అనుంగుశిష్యులైన శ్రీ పప్పువిశ్వనాథంగారు మహదానందంతో స్వీకరించారు. ఎంతో సమర్థత, ఓర్పు, నేర్పున్న శ్రీవిశ్వనాథ్‌గారి పర్యవేక్షణలో ఏ రోజుకారోజు ఎవరెంత పని చేశారు, ఎంతమందిని యజ్ఞానికి సమాయత్తం చేశారనేది అంచనా వేయటం జరిగింది. ఈ యజ్ఞనిర్వహణ బాధ్యతను శ్రీగొల్లపూడి సీతారాం, ఇందిరగార్లు కార్యనిర్వహణ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తే, ఆర్థిక వ్యవహారాలను స్టేట్‌బ్యాంక్ మేనేజర్ శ్రీకృష్ణమూర్తిగారు చూచుకుంటే, యజ్ఞశాల నిర్మాణాది కార్యక్రమాలను శ్రీశివప్రసాద్‌గార్లు ఎంతో సమర్థతతో నిర్వహించారు. ప్రత్యేకంగా ఎవరికి వారే ఈ మహత్కార్యాన్ని తమ భుజస్కంధాలమీదకు ఎత్తుకున్నారు.

1994 జనవరి 9వతేదీ నాటికి అన్ని ఏర్పాట్లు దివ్యంగా జరిగి పోయాయి. 8వతేదీ ఉదయం స్థానిక కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో యజ్ఞం చేసి అమ్మ ఆశీస్సులతో అక్కడి నుంచే సాయంత్రం ప్రారంభించబడిన కలశయాత్రలో సుమారు మూడువేలమంది స్త్రీ, పురుషులు

గాయత్రీమంత్రాన్ని పాడుకుంటూ, గురుదేవులు, మాతాజీకి, గాయత్రీమాతకు జయజయధ్వానాలు చేసుకుంటూ ఉత్సాహంగా ఊరేగింపుతో యజ్ఞశాలకు వచ్చారు. సహస్రదీపయజ్ఞం ప్రశాంతమైన చల్లటి సాయంసంధ్యలో సాక్షాత్ పార్వతీ, పరమేశ్వరుల దివ్య ఉపస్థితిలో జరిగిందా అన్నంత దివ్యంగా, భవ్యంగా జరిగింది. అందరికీ ఆనందమే ఆనందం! కార్యక్రమాలు ఇంత ఉత్సాహంగా ముందుకు సాగుతున్నా మనస్సు, కళ్ళు మాత్రం మాస్టర్‌గారి రాకకోసం ఎదురుచూస్తున్నాయి. దీపయజ్ఞం చేసి ఇంటికి వచ్చి భోజనాల ఏర్పాట్లు చేస్తున్నా నా మనస్సులో చెప్పలేనంత దిగులు, వెలితి ఎంత దాచాలన్నా దాగటం లేదు. మాస్టర్‌గారింకా రాలేదు. విషయం తెలుసుకుందామన్నా ఆ రోజులలో ఫోన్ అవకాశం కూడా ఉండేది కాదు. ఇంతలో విశ్వనాథ్‌గారు వచ్చి, "మాస్టర్‌గారు రావటంలేదు, వాళ్ళ తమ్ముడు విశ్వనాథ్‌కి బాగలేక హైదరాబాద్‌కు తీసుకు వెళ్ళారుట. ఈ లెటర్ పంపించారు. యజ్ఞసమయంలో మాస్టర్‌గారి సందేశంగా దీనిని వినిపించాలి" అని చెప్పారు. అంతే తెలియని నీరసం, నిరుత్సాహంతో నేను డీలాపడిపోయాను.

రేపు ఉదయం ఆరుగంటలకే యజ్ఞము ప్రారంభించాలి. ఆ రాత్రంతా బి.బి.హెచ్.జూనియర్ కాలేజీలోనే ఏర్పాట్లను సమీక్షించుకోటానికి సీతారాంగారు, కృష్ణమూర్తిగారు, ప్రసాద్‌గారు ఇంకా కార్యకర్తలందరూ ఆ ఆవరణలోనే ఉన్నారు. హోమకుండాల అలంకరణ, సమిధలు, హోమద్రవ్యం ఇంకా కావలసిన వస్తువులనన్నింటినీ రాత్రికి రాత్రే ఏర్పాటు చేసి ఇళ్ళకు వెళ్ళి స్నానాదికాలు పూర్తి చేసుకుని మళ్ళీ యజ్ఞశాలకు వచ్చేశారు.

గత మూడుమాసాలుగా, గాయత్రీ అనుష్టానాలు చేసిన వారికి మాత్రమే యజ్ఞంలో కూర్చునే అవకాశం ఏర్పాటు చేయబడింది. 1008కుండాల దగ్గర అలాంటి శ్రద్ధ, నిష్ఠ గలవారితో మాత్రమే యజ్ఞము చేయించాలనే సంకల్పంతోనే మాస్టర్‌గారు ఈ మహాయజ్ఞానికి, 'సహస్రయుగ్మ గాయత్రీ మహాయజ్ఞమని' పేరు పెట్టారు. సహస్రయుగ్మ అంటే 1000×2 = 2000 మంది నిష్ఠాపరులైన సాధకులతో యజ్ఞం జరిపించాలనీ, వారు అంశదానంగా 24 రూపాయలు ఇవ్వాలనే ఒక చిన్న నియమాన్ని కూడా పెట్టారు. తరువాత ఎవరికి తోచిన అంశదానం వారివ్వటం జరిగింది. ఈ యజ్ఞానికి బి.బి.హెచ్ జూనియర్ కాలేజీ యాజమాన్యం వారి సహకారంతో కాలేజీ ఆవరణలో మూడు, నాలుగు రోజుల ముందు నుంచే యజ్ఞశాల నిర్మాణం, మిగిలిన వనరుల సమీకరణ, వచ్చినవారికి విడిది ఏర్పాట్లన్నీ ఈ కాలేజీ ఆవరణలోనే ఏర్పాటు చేయటం జరిగింది. శ్రీ ఎం.ఎస్.కె

నారాయణరావుగారి ద్వారా, 'గురుసత్తా ఫొటో' ను మాస్టర్‌గారు పంపించారు. మొట్టమొదటిసారిగా గురుసత్తా ఫొటోను 'ఈ సహస్రయుగ్మగాయత్రీ మహాయజ్ఞము'లో ఆవిష్కరించటం జరిగింది. శ్రీసత్యనారాయణరావుగారు, శ్రీప్రసాద్‌గార్లు యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ మహాయజ్ఞాన్ని తిలకించటానికి సుమారు ఇరవై గ్రామాలనుంచీ భక్తులు తరలివచ్చారు. పూజ్యగురుదేవుల, మాతాజీల సూక్ష్మ ఉపస్థితిలో మాస్టర్‌గారి అఖండాశీస్సులతో ఎంతో తృప్తిగా, దివ్యంగా ఎలాంటి ఎక్కువ, తక్కువలు లేకుండా హాయిగా యజ్ఞం జరిగిపోయింది. ప్రసాదవితరణ కూడా శ్రీ సీతారాం శ్రీమతి కళ్యాణి దంపతుల పర్యవేక్షణలో ఎంతో క్రమశిక్షణతో జరిగిపోయింది.

అయితే మనమిక్కడ ఒక చిన్నవిషయాన్ని గుర్తు చేసుకోవాలి. ఈ యజ్ఞానికి వందనీయ మాతాజీ అనుమతినిచ్చిన విషయం ముందుగానే చెప్పుకున్నాం. యజ్ఞం దాదాపుగా పూర్తి కావస్తున్నది. సరిగ్గా పూర్ణాహుతి సమయానికి వందనీయ మాతాజీ శాంతికుంజ్ ప్రతినిధిగా శ్రీ జోషిగారిని పంపించారు. ఆయన రాకతో యజ్ఞానికి ఒక వినూత్నమైన వన్నెతో కూడిన కళ వచ్చింది. శ్రీజోషీగారికి చక్కగా తెలుగువచ్చు. అందుచేత వారే వివరణనిస్తూ పూర్ణాహుతి నుండి మిగిలిన కార్యక్రమాన్ని ఎంతో వినోదంగా చేయించారు. యజ్ఞకార్యక్రమం చేయిస్తూ మధ్యలో వారు చెప్పిన విషయం అందరినీ ఆశ్చర్యపరిచింది.

భువనేశ్వర్‌లో జరుగుతున్న 'అశ్వమేధయజ్ఞాని'కి మాతాజీతో పాటు జోషీగారు కూడా అక్కడికి వెళ్తే, 'వేటపాలెంలో జరిగే సహస్రకుండీయజ్ఞానికి నీవు వెళ్ళి రావాలనీ' చెప్పి మాతాజీ తనను ఇక్కడకు పంపించారనీ వారు చెప్తుండగా ఆనందంతో అందరూ మిన్నంటేలా చప్పట్లుకొట్టారు. ఆ తల్లి కృపకు అందరి కళ్లల్లోనూ ఆనందాశృవులు జాలువారాయి. ఆ అవ్యాజకరుణామూర్తి, మూర్తీభవించిన ప్రేమకు ప్రతిరూపమైన ఆ తల్లి కృపకు అందరం ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాము. ఇదంతా మాస్టర్‌గారి పరోక్ష ఆశీర్వాదాలుగా అవగతమైంది. చల్లని తండ్రి. ఎలా, ఏమని వర్ణించగలం? అమాయకంగా కనిపించే వారు, పరోక్షంగా ఆయన చేస్తున్న లీలను అనుభూతిచెందగలితే అదే అదృష్టం మరి!

సర్వాంతర్యామిని, సర్వజ్ఞురాలైన ఆ జగన్మాత మాతాజీ అంతటి అశ్వమేధయజ్ఞం నిర్వహిస్తూ కూడా ఈ చిన్ని వేటపాలెం గ్రామంలో జరుగుతున్న యజ్ఞాన్ని గుర్తుంచుకొని తన చిన్నారి బిడ్డలు చేస్తున్న యజ్ఞాన్ని తలచుకొని ప్రతినిధిరూపంలో సాక్షాత్ ఆ తల్లే వచ్చి ఆశీర్వదించడమనేది ఆమె

అపార కృపకు ప్రత్యక్ష నిదర్శనం కాక మరింకేమిటి? అందుకా తల్లికి మనస్సులోనే కోటికోటి ప్రణామాలతో ధన్యవాదాలు చెప్పుకున్నాము. ఈ యజ్ఞం ఏర్పాట్లన్నీ చూచి వారెంతగానో ఆనందించారు. సభాముఖంగా అందరికీ మాతాజీ తరపున ఆశీర్వాదాలనందించి, ఎంతగానో ప్రశంసించారు. తర్వాత నేను పూజ్యశ్రీ మాస్టర్‌గారు పంపిన సందేశాన్ని చదివి వినిపించాను. సందేశ సారాంశం – ఆత్మీయపరిజనులకు, నేను రాలేదని మీరు కంగారుపడవద్దు. సాక్షాత్ పూజ్యగురుదేవుల, మాతాజీల సూక్ష్మ ఉపస్థితి మీ ప్రక్కనే ఉన్నది. వారి పర్యవేక్షణలోనే ఈ యజ్ఞ కార్యక్రమం సుసంపన్నమౌతున్నది. వారి దివ్యానుగ్రహ అమృతధారలను గ్రోలుతున్న మీరెంతో అదృష్టవంతులు. నా ఆశీస్సులు, అండదండలు మీకు నిరంతరం వుంటాయని వ్రాశారు. పూజ్యులు శ్రీజోషీగారు కూడా అక్షరసత్యాలుగా అవే మాటలు చెప్పటం ఆశ్చర్యమనిపించింది.

ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా ఇంతటి మహత్తరమైన యజ్ఞకార్యక్రమాన్ని నిర్వహించటానికి కావలసిన స్ఫూర్తి, ధైర్యంతో పాటు పరోక్షంగా వారు ప్రసాదించిన మనోబలం, ఆత్మస్థైర్యాలను అనుభూతి చెందాలే గాని మాటలతో వర్ణించలేము. యజ్ఞం అయిపోయాక శ్రీజోషీగారు కార్యక్రమం గురించి కార్యకర్తల సమావేశంలో చాలా చక్కగా అందరినీ అభినందించి, పూజ్యగురుదేవుల, మాతాజీల ఆశీస్సులనందించారు.

ఈ యజ్ఞానికి విచ్చేసిన ఒంగోలు కార్యకర్తలందరూ శ్రీజోషీగారిని ఒంగోలుకు రమ్మని ఆహ్వానించారు. అదే రోజు సాయంత్రానికి అందరూ ఒంగోలుకు వెళ్ళారు. కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేసి, నవరాత్రులలో జరుగవలసిన పరాప్రకృతి పరిమార్జన యజ్ఞం మళ్ళీ ఎప్పుడు నిర్వహించాలనేది శ్రీజోషిగారి సమక్షంలో చర్చించుకున్నారు. అందరూ ఏకగ్రీవంగా ఒక నిర్ణయానికి వచ్చి ముఖ్యమైన నలుగురు కార్యకర్తలు జోషీగారితో పాటు శాంతికుంజ్‌కి వెళ్ళారు. మాతాజీతో సంప్రదించి, యజ్ఞ నిర్వహణకు అనుమతిని పొంది, యజ్ఞము జరిపించటానికిగాను శాంతికుంజ్ ప్రతినిధులను పంపించమని మాతాజీని అర్థించారు. కరుణామయి మాతాజీ వీరి కోరికను మన్నించి, యజ్ఞానికి అనుమతినిస్తూ, యజ్ఞనిర్వహణకు శాంతికుంజ్‌నుంచీ కార్యకర్తలను పంపుతామని ఆశ్వాసననిచ్చారు. అన్నట్లుగానే ఆమె ఆ యజ్ఞం అయిపోయేంత వరకు వారికి పరోక్షంగా తమ అండ, దండలను అందించారు.

## పరాప్రకృతి పరిమార్జన మహా యజ్ఞ పూర్ణాహుతి

ఒంగోల్లో అతివిశాలమైన పి.వి.ఆర్.పాఠశాల ఆవరణలో, అంతకుముందు అనుకున్నట్లుగానే 1008కుండీలలో ఈ యజ్ఞం శాంతికుంజ్ కార్యకర్తల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఎంతో దివ్యంగా జరిగింది. మాతాజీ అనుమతితో జరిగిన ఈ యజ్ఞం వలన సూక్ష్మజగత్తులో 'పరాప్రకృతి పరిమార్జన' జరిగిందనటానికి ఇంక ఎలాంటి నిదర్శనాలు అవసరంలేదుకదా! మాతాజీ స్థూల శరీరంలో ఉండగా అనుమతినిచ్చి ,చేయించిన యజ్ఞాలు ఆంధ్రప్రదేశ్లో ఇవే చివరివని చెప్పవచ్చు. కరుణామయి అమ్మ 1994 సెప్టెంబరు 19వతేదీన తన భౌతిక లీలకు స్వస్తి చెప్పి తన ఆరాధ్య దైవమైన గురుదేవులతో కలసి పని చేయటానికి సూక్ష్మలోకాలలోకి వెళ్ళిపోయారు.

మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు ఆయుధాలు చేపట్టలేదు, యుద్ధం చేయలేదు. కానీ మహాభారతయుద్ధమంతా శ్రీకృష్ణుడు చేయటం చూశానని బర్బరీకుడు చెప్తాడు. కానీ యుద్ధమంతా అయిపోయాక శ్రీకృష్ణుడు ఆ కీర్తి కిరీటాలన్నీ అర్జునునికే కట్టబెట్టాడు. అలానే మన పరమాత్మ పూజ్యశ్రీ మాస్టర్గారు ప్రత్యక్షంగా కనిపించకపోయినా వారి సూక్ష్మ ప్రేరణతోనే ఈ రెండు మహాయజ్ఞాలు ఇంత దిగ్విజయంగా జరిగేలా చేసి వాటి నిర్వహణ గొప్పదనం మనకు అందేలా చేశారు. మహామనీషుల మనస్సుల గొప్పదనం 'కోహి విజ్ఞాతు మర్హసి' అన్న శాస్త్రప్రమాణంలాంటిది. ఇదంతా వారి అనుగ్రహం-మన అదృష్టం. అసలు ఇదంతా ఎందుకు చేయించారు? ఇదంతా చేస్తే ఏమిటి లాభం? ఎవరికిలాభం? లాభమైతే, ఆ లాభం ఎలా వుంటుంది? ఇలాంటి అనుమానాలు చాలా మందికి చాలానే వచ్చాయి. దానికి వివరణ ఇవ్వవలసిన అవసరం ఎంతైనా వుంది. దానికి సమాధానంగా మాస్టర్గారు ఇచ్చిన వివరణ మరియు పూజ్యగురుదేవులచే ఇవ్వబడిన గాయత్రీ, సవితలతో పాటు యజ్ఞము ప్రాముఖ్యతల గురించి ఇక్కడివ్వటం జరుగుతున్నది.

**గాయత్రీ, సవితల సంబంధం :** శాస్త్రాలలో గాయత్రీ మంత్ర అధిష్టాన దేవతగా 'సవిత'ను వర్ణిస్తారు.

**గాయత్రీ మంత్రాధిష్టాన దేవత సవిత అయినందున, మనకు తెలిసేదేమిటంటే ఈ మంత్రము యొక్క దివ్యశక్తి సవితయనీ, సవిత యొక్క ప్రాధాన్యతవలన ఈ మంత్రానికి సావిత్రీయనే రెండవ పేరు వచ్చింది. ఒకటి కేంద్రమైతే, రెండవది శక్తియనీ, ఈ రెండూ ఒకదానికొకటి పూరకాలుగా వుంటాయని తెలిపారు.**

గాయత్రీమంత్రమందలి మూడు పాదాలలో నిక్షిప్తమై ఉన్న విజ్ఞానం వల్ల మానవునికి శ్రీ, ప్రతిష్ఠ, జ్ఞానము కలుగుతాయి. గాయత్రీ అనుష్ఠానం చేసి యజ్ఞం చేయటం వలన వాయువు శుద్ధమై, ఉత్తమోత్తమమైన పర్జన్యవర్షము కురిసి దివ్యమైన వనస్పతులు, పంటలు, పాలు ఉత్పత్తి అయి మానవజీవితం శాంతి, సుఖము, సంతోషాలతో పరిపుష్టి చెందుతుంది. ఇదే సౌరశక్తి సందోహన ప్రక్రియలోని అంతరార్థం. పరాప్రకృతి పరిమార్జన యజ్ఞం వలన ప్రకృతిలోని అననుకూల పరిస్థితులు ప్రక్షాళనమైపోతాయి. దివ్యమైన వాతావరణం ఏర్పడుతుంది. అలానే సౌరశక్తి మహాయజ్ఞం వలన విశిష్టమైన, ఉన్నతమైన, ఉత్తమోత్తమమైన వనరులు ఈ పృథ్వి మీదకు ఆకర్షింపబడి, దివ్యమైన వాతావరణంతో పాటుగా దివ్యమైన చైతన్యం వర్షిస్తుంది. ఆవు నుండి పాలు పితికినట్లుగా ఈ సౌరశక్తి సందోహన మహాయజ్ఞం ద్వారా సవిత నుండి సమస్త వనరులను పుష్కలంగా ఈ భూమి మీదకు పిండుకోవటం జరుగుతుంది. ఇంతటి మహామహా యజ్ఞాలను సూచన ప్రాయంగా చెప్పినట్లుగా చెప్తూనే పరోక్షంగా పరమగురువుల ప్రణాళికలను అలవోకగా మనచేత చేయించిన ఆ మహామనీషి, సిద్ధపురుషులు అయిన మన మాస్టర్‌గారి కృపకు మనమేమిచ్చి ఋణం తీర్చుకోగలం చెప్పండి?

## అధ్యాయం-8

# ఋషికల్ప సాధనా శిబిరం

అది 1994వ సంవత్సరం. అమలాపురంలో ఏ కార్యక్రమాన్ని అయినా శ్రీశ్యామలరావుగారు ఎంతో శ్రద్ధ, నిష్ఠలతో పాటు మంచి క్రమశిక్షణతో ఏర్పాటు చేసేవారు. అమలాపురంలో మే 2వ తేదీ నుండి 22వతేదీ వరకు 'ఋషి కల్ప సాధనాశిబిరం' గీతాశ్రమంలో శ్రీశ్యామలరావుగారి నేతృత్వంలో ఏర్పాటు చేయబడింది. ఎండాకాలం సెలవులు కావడం వలన అనేక గ్రామాల నుండి పరివార్ సభ్యులు ఎంతో ఉత్సాహంగా ఈ క్యాంప్‌కు వచ్చారు. శిబిరం ప్రారంభిస్తూనే మాస్టర్‌గారు సాధకులనుద్దేశించి 'ఈ సాధనాకాలంలో మీకు చర్దుశభువనాల జ్ఞానాన్ని నేర్పిస్తానని' చెప్పటం జరిగింది. ఈ క్యాంప్‌లో సూర్యవిజ్ఞానం, ఆత్మకథ, గాయత్రీమంజరి, సూక్ష్మీకరణసాధన, కుండలినీమహావిజ్ఞాన్, అశ్వమేధం మొదలైన గురుదేవుల రచనల మీద ప్రవచనాలు చెప్పటం

ఎంతో విశేషం. తరువాతి కాలంలో ఒక్క క్యాంప్‌లో ఇన్ని పుస్తకాల మీద క్లాసులు చెప్పటం అనేది ఇంకెక్కడా జరగలేదు. ఇక్కడ 'చెప్పడం' అనడం కంటే 'అధ్యయనం' చేయించారు అంటేనే బావుంటుందేమో! ఆనాడు ఆ సాధనా శిబిరానికి వెళ్ళినవారు అంత గొప్పగా ఈ క్లాసులు జరిగాయని చెప్తారు. ఉదయం 5గంటల నుండే శ్రీభైరవస్వామిగారి యోగాసనాలతో శిబిరం ప్రారంభమైంది. శ్రీరామానందగారు సూర్యనమస్కారాలను, శ్రీశ్యామలరావుగారు ప్రాణాయామాలను చేయించేవారు. ఇంక పది గంటల నుండి మాస్టర్‌గారు 'సూర్యవిజ్ఞానం' మీద వివరణ చెప్పేవారు. సూర్య విజ్ఞానమనేది చాలా లోతైన విషయం కనుక ఎంతో సావధానంగా, పరిపూర్ణమైన శ్రద్ధా, నిష్ఠలతో చెప్పడంతో అందరికీ దానిపై చక్కటి అవగాహన వచ్చింది. ప్రతిరోజూ యజ్ఞం మాస్టర్‌గారే స్వయంగా నిర్వహిస్తూవుండేవారు.

ఒక రోజు యజ్ఞం ప్రారంభించబోతూ 'ఈ వేళ సూక్ష్మీకృత యజ్ఞం చేయబోతున్నాను, ఏం జరగబోతున్నదో అందరూ మౌనంగా గమనించండి' అని చెప్పారు. ఆయన అగ్నిస్థాపన అనగానే ఒక సూర్యకిరణం దట్టమైన పూరికప్పును చీల్చుకుంటూ యజ్ఞకుండంలో సాక్షాత్కరించింది. అలా వచ్చిన మూడు కిరణాలు–ఒకటి త్రిభుజాకారంగా, ఒకటి డైమండ్ ఆకారంగా, ఒకటి వృత్తాకారంగా వచ్చి యజ్ఞకుండంలోకి దిగి స్థిరంగా నిల్చిపోయాయి. గాయత్రీ స్తవనం చదవటం అయిపోగానే అవి అగ్నిలో విలీనమైపోయాయి.

సాధనాశిబిరం యొక్క మూడవరోజున మాస్టర్‌గారు అమిత ఉత్సాహంతో, 'శాస్త్రజ్ఞులు చెప్పిన సూర్యకళంకాల ప్రమాదం మనకు తప్పిపోయిందని ప్రకటించారు. అప్పుడు అందరికీ గుర్తుకువచ్చింది. ఆనాటి వార్తాపత్రికల్లో, 'సూర్యకళంకాలు ఏర్పడిన కారణంగా 1994 మే నెలలో 16 వ తేదీ ఉదయం 11 గంటలకు ఊహించని రీతిలో విపత్తులను ఎదుర్కొనవలసి వస్తుందని' వ్రాశారు. సర్వసమర్థులైన మన మాస్టర్‌గారు, పూజ్యగురుదేవుల ఆశీస్సులతో చేసిన ఈ యజ్ఞం ద్వారా ఆ ప్రమాదం నుండి మానవజాతి బయటపడింది. ఆ తరువాత సంస్కారాలు, దీక్షాకార్యక్రమాలు యథావిధిగా జరిగాయి. విషయపరిజ్ఞానంతో పాటు ప్రమాదం నుండి కాపాడిన ఆ సాధనా శిబిరాన్ని ఎన్నటికీ మర్చిపోలేని రీతిలో సాధనకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఆనందానుభూతిని పొందారు. ఆ క్యాంప్‌లో మాస్టర్‌గారు చెప్పిన సూర్యవిజ్ఞాన ఉపన్యాసాలను పుస్తకరూపంలో ప్రచురించిన కుమారి రమణకుమారి, సీతగార్లు ఎంతో అదృష్టవంతులు. గాయత్రీపరివార్‌లోకి

వచ్చినప్పటి నుండి మాస్టర్‌గారితో కలిసి దాదాపు 108 ఊళ్ళల్లో యజ్ఞాలు చేసారు. వారు సాధనాశిబిరాలకు వచ్చినప్పుడు చేతనైనంత సేవ చేస్తుండేవారు.

## దశవేదీయ శతగ్రామ గాయత్రీహవన మహోత్సవములు

అది 1995 వ సంవత్సరం మే నెల. ఎండాకాలం సెలవులకు మాస్టర్‌గారు అమలాపురం వెళ్ళారు. మే నెల 11వ తారీకు ఉదయం 6 గంటలకు అత్యవసరమైన సాధనాత్మకమైన సందేశాన్ని మాస్టర్‌గారు అన్ని గ్రామాలకు ఒక బృహత్ ప్రణాళికగా అందచేశారు. భారతీయ సంస్కృతికి గాయత్రీ తల్లి అయితే యజ్ఞము తండ్రి. ఈ యుగసంధి కాలంలో యజ్ఞము ద్వారా సూక్ష్మలోకాలలో గత 20సంవత్సరాల నుండి నూతన యుగనిర్మాణానికి ప్రతిరోజు 24కోట్ల కంటే ఎక్కువ సంఖ్యలో గాయత్రీజపము చేసే ఒక ప్రణాళికను గురుదేవులు అందించారు. అలా సాధన చేస్తున్న భావశీల, త్యాగప్రవృత్తి కల ప్రజ్ఞావతరణకు ఉపయోగపడే అయాచక, అపరిగ్రహ తపోనిష్ఠుల ద్వారా సద్భావనలు (హ్రీం)-సమృద్ధి(శ్రీం)-శక్తి (క్లీం) శక్తిధారలు ఏర్పరచబడ్డాయి. వీటిని క్రిందికి దింపి అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామగ్రామాల్లోను ఒక్కొక్క చోట పది యజ్ఞకుండములను ఏర్పాటు చేసి గాయత్రీజయంతి నాడు (8.6.95) 108 ఆహుతులను ఇచ్చే విధంగా అందరూ సిద్ధపడాలి. ఉదయం 5.30 గంటలకే యజ్ఞం ప్రారంభించాలి. అలా 100 ఊళ్ళలో ఒకేసారి చేయాలి అనే ఒక సందేశాన్ని పంపించారు. తక్షణమే ఈ సందేశం అన్ని ఊళ్ళకు పంపటం జరిగింది. యజ్ఞాలు కూడా ఒక ప్రభంజనం మాదిరి అనేక ప్రాంతాలలో స్థానిక కార్యకర్తలు అత్యంత ఉత్సాహంతో చేసి గురుదేవులందించిన సాధనలో భాగస్వాములయ్యారు. ఇలా చిన్న చిన్న కార్యక్రమాల ద్వారా పెద్ద పెద్ద లాభాలను సూక్ష్మంగా వచ్చేలా మాస్టర్‌గారు చేయించేవారు.

## పరాశక్తి అవతరణ అభిషేక అనుష్ఠానాలు

అది 1995వ సంవత్సరం. పూజ్యగురుదేవుల అనుష్ఠాన ప్రథమ పూర్ణాహుతి చేయవలసిన సమయం. అంతకు ముందు అఖండజ్యోతిలో ఒక సందేశాన్ని పంపారు. ఈ ప్రథమ పూర్ణాహుతి సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ నుండి సాధకులు వచ్చి ఒక నెల పాటు సాధన చేయవలసిందిగా వ్రాశారు. ఈ సాధన నిమిత్తం ఒక్కొక్క రాష్ట్రంవారికి ఒక్కొక్కనెల కేటాయించారు. ఆంధ్రదేశానికి జూన్‌నెలలో సాధనా సమయం కేటాయించబడింది. మాస్టర్‌గారి దగ్గరకు కొంతమంది వెళ్ళి, 'మేము వెళ్ళలేని పరిస్థితి మాస్టర్‌గారూ! మరి ఆ సాధన మేము ఎలా చేసుకో

గలుగుతామని' అడిగారు. ఆయన వెంటనే జవాబు చెప్పలేదు, కాస్త ఆలోచించి ఇలా అన్నారు. 'ఒక పని చెయ్యండి. ప్రతి పూర్ణిమకు అఖండజపాలు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు చేసి దీపయజ్ఞంతో పూర్ణాహుతి చెయ్యండని చెప్పారు. దాంతో అందరికీ ఆనందమైంది. అన్ని గ్రామాల వారూ ఎంతో ఉత్సాహంతో ఎంతో అద్భుతమైన ఆ సాధనను మాస్టర్‌గారు చెప్పినట్లుగానే, ఒక్కొక్క ఇంట్లో ఒక్కొక్క పూర్ణిమకు అఖండ జపాలు చేయించటం జరిగింది. పూర్ణిమనాడు చేసే సాధన ఎప్పుడూ గురువులతో అనుసంధానమును (లింక్) నేర్పరుస్తుంది. అంత అద్భుతమైన ఆ అవకాశాన్ని ఎంతో సరళంగా అందరికీ అందుబాటులోకి తేవటం మన అదృష్టం! అలా ఆ పరాశక్తి అవతరణ ఆంధ్రప్రదేశ్‌లో ధగధగాయమానంగా తన వెలుగులను దశదిశలా వ్యాపింపచేసింది. అలా చేసిన ఆ సాధన వలన ఆవిర్భవించిన దివ్యశక్తి ప్రభావం వల్లనో, ఏమో తెలియదు కానీ ఆ తర్వాత కాలంలో పరమపూజ్య గురుదేవుల అనుష్టాన ప్రధమ పూర్ణాహుతి వేటపాలెంలో 1008కుండీలలో గాయత్రీ మహాయజ్ఞం మూడురోజుల పాటు స్వయంగా మాస్టర్‌గారే నిర్వహించటమనేది ప్రకృతిలో నిర్ణయించబడిన ఒక తథ్యముగా స్వీకరించాలి. అంతంత పెద్ద, పెద్ద సాధనలను సూక్ష్మంలో మోక్షం అన్నట్లు మన చేత చేయించి ఆ ఘనతను తిరిగి మనకు ప్రసాదించటమనేది ఆ మహానుభావుని అవ్యాజకరుణకు నిదర్శనం.

## భారతదేశం జగద్గురు పీఠాన్ని అధిరోహించి తీరుతుంది

1995వ సంవత్సరంలో దేవీ నవరాత్రులు వచ్చాయి. సాధనకు అత్యంత శ్రేష్టమైన, దివ్యమైన సమయం. మాస్టర్‌గారి దగ్గర నుండి గాయత్రీ లఘు అనుష్టానం చేయమని అందరికీ సందేశం వచ్చింది. అన్ని ఊళ్ళల్లో ఏకనిష్టతో, సాధన అనుష్టానాలు మొదలయ్యాయి. అప్పటికింకా ఆశ్రమాలు, అనుగ్రహ పీఠాలు స్థాపించబడలేదు. అందువలన నవరాత్రుల తొమ్మిదిరోజులూ ఒక్కొక్క ఇంటిలో ఒక్కొక్క రోజు చొప్పున అఖండ జపాలు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు చేసి ఆరతి ఇచ్చి ఆనాటి సాధనను విరమించేవారు. విజయదశమినాడు సామూహికంగా పూర్ణాహుతి చేసుకునేవారు. సాధన శ్రద్ధా, భక్తులతో సాగిపోతున్నది.

ఒక రోజున వేటపాలెం గాయత్రీపరివార్ వరిష్ఠ కార్యకర్త శ్రీమతి విజయలక్ష్మిగారు కుటుంబ పరమైన ఒక సమస్య గురించి, గుంటూరుకు వెళ్ళి మాస్టర్‌గారిని కలిసి వారి సలహా తీసుకునేందుకై తోడుగా నన్ను రమ్మని అడగ్గా సరేనని నేను ఆవిడతో బయల్దేరాను. మాస్టర్‌గారు ఇంట్లోనే

ఉన్నారు. మమ్మల్ని చూస్తూనే హాయిగా నవ్వుతూ పలకరించారు. సరే విజయలక్ష్మిగారు తమ విషయం చెప్పుకున్నాక మాస్టర్‌గారితో, 'మాస్టారూ నవరాత్రి సాధన చాలా బాగా జరిగింది. పూర్ణాహుతికి మీరు వేటపాలెం రావాలి' అని కోరాను. ఆ రోజు నుండి దసరా సెలవలు. అప్పటికే మాస్టర్‌గారు అమలాపురం, శ్యామలరావుగారింటికి వెళ్ళటానికి సిద్ధపడి వున్నారు. సాధారణంగా ప్రతి సెలవలకు మాస్టర్‌గారు అమలాపురం వెళ్తారు. శ్యామలరావుగారి పిల్లలు మాధవి, సుబ్రమణ్యం, శ్రీరాం వాళ్ళకు మాస్టర్‌గారంటే ప్రాణం. శ్యామలరావుగారు, సూర్యంగారికి కూడా మాస్టర్‌గారంటే ఎంతో అభిమానం. అక్కడ ఉన్నన్ని రోజులూ మాస్టర్‌గారు, శ్యామలరావుగారితో కలిసి పరివార్ కార్యక్రమాలను చేస్తూ పిల్లలతో సరదాగా గడపటానికి చాలా ఇష్టపడేవారు. అందుచేత, 'అయ్యో, నేను అమలాపురం వెళ్తున్నాను కదమ్మా! పూర్ణాహుతి ఎలా చేసుకోవాలో మీకు వ్రాశానుగదా! అలా చేసుకోండి' అని చెప్పారు. తర్వాత క్షణం ఆలోచించి, 'అక్కడికి ఎప్పుడూ వెళ్తూనే వుంటాను గదా! సరే మీరు సాధన చేశామంటున్నారుగదా, ఈసారి మీ దగ్గరకే వస్తాను' అంటూ మీరెలాగూ జాండ్రపేటలో ఇల్లు కట్టుకున్నారు కాబట్టి గృహప్రవేశంతో పాటు సాధనాక్యాంప్ లాగించేద్దాం అన్నారు.

"భారతదేశం జగద్గురు పీఠాన్ని అధిరోహించి తీరుతుంది" అనే బ్యానర్ మీద ఐదురోజుల సాధనా శిబిరం ఏర్పాటు చేసి అందరినీ పిలవండి. 'న్యూ ఎరా'కు నూతనగృహంలో బీజారోపణ చేద్దాం' అని చెప్పారు. మాస్టర్‌గారు వస్తానని చెప్పటంతో ఎంతో ఆనందమైంది. ఆనందంగా ఇద్దరం వచ్చి బస్సు ఎక్కాం. దోవలో అన్నీ ఆలోచనలే. మేము కట్టుకున్న ఇల్లు మరీ అంత పెద్దదేమీగాదు. పూర్తి వసతులన్నీ ఇంకా ఏర్పాటు చేయలేదు. సాధనకు వచ్చే వారికి కనీస వసతులనైనా ఇవ్వాలి గదా! ఎలాగా! సరే సర్వజ్ఞులైన వారికి తెలియనిదేముంది? ఏ మహత్తర కార్యకారణ సంబంధాలకు, ఏ బీజారోపణకి నాందీ కాబోతోందో ఈ శిబిరం. ఎలాగైనా కావలసిన ఏర్పాట్లు బాగా చెయ్యాలి అనుకున్నాం.

అనుకున్న ప్రకారం సాధనాశిబిరానికి కావలసిన ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. సెప్టెంబర్1 నుండి 5వతేదీ వరకు జరుగబోయే సాధనాశిబిరానికి మాస్టర్‌గారు, మాస్టర్‌గారి చెల్లెలు లక్ష్మి, ఇంకా పరివారమంతా వచ్చేశారు. క్యాంప్ మొదలైంది. ఆరోజు ఉదయం ఆరుగంటలకల్లా అఖండ జ్యోతిని వెలిగించి, అఖండజపం మొదలు పెట్టించారు. ఈసారి జపంతోపాటు గాయత్రీ మంత్రార్థం

కూడా ప్రత్యేకం, 'నా మనో, వాక్కాయ, కర్మలలో ఆ శ్రేష్ఠమైన సవితాతేజస్సును ధారణ చేస్తున్నాను. అది మా అందరి బుద్ధులను సన్మార్గములో నడిపించును గాక!' అనే సాధన చేయించారు. అదొక విశిష్టమైన, సాధనాత్మక ప్రయోగం. అలా ప్రతీ మంత్రం భావనాపూర్వకంగా మంత్రోచ్చారణ చేయటం వలన ఉత్పన్నమైన దివ్యశక్తి తరంగాలు వాతావరణాన్ని, పరిసరాలను, ఎంతో ప్రభావితం చేస్తాయి. ఆ సవితా తేజస్సు సాధకుని అంతరంగాన్ని పవిత్రం చేయటమే కాకుండా నిర్మలమై ప్రశాంతితో నింపుతుంది. అందరి హృదయాలలోకి అత్యంత సూక్ష్మమైన ఆ సవితా తేజస్సు ప్రవేశించి, తీవ్రమైన కార్యాచరణ శక్తిని, ప్రేరణాత్మకమైన ప్రచోదన చేసిందనేది తర్వాత జరిగిన కార్యక్రమాల వలన బోధపడింది.

సాధన ప్రారంభించిన నాటికే ఒంగోలు, గుంటూరు, తెనాలి, విజయవాడ, (చీరాల, వేటపాలెంవారు ప్రతీ రోజూ వెళ్ళి వచ్చేవారు) వరంగల్ మొ॥ ప్రాంతాల నుండీ వచ్చిన సాధకులతో రోజువారీ సాధన కార్యక్రమాలని ప్రారంభించారు. మాస్టర్‌గారు ఈ సాధనా కాంప్‌లో "విజ్ఞానమయ కోశము" మరియు "ఋషిమయ జీవనం" అనే విషయాలపై సమగ్రమైన సాధనా, విధానాల నందించారు.

భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలకు ఆధార భూతమైనది ఋషిపరంపర కనుక ఋషి అంటే ఎవరు? ఋషుల యొక్క సాధనామయ జీవనవిధానం ఎలా వుంటుందీ అనేదాన్ని గురించి చాలా చక్కగా వివరంగా చెప్పారు. యుగయుగాలనుంచీ గాయత్రీసాధన చేసిన మహనీయులెందరో ఋషులుగా మారారు. పంచముఖీ గాయత్రీకి ప్రతీకలుగా ఋషులు కూడా ఐదు స్థాయిల్లో ఉత్తమోత్తమమైన సాధనాస్థాయి శిఖరాగ్రాలను చేరుకున్నారు. రోజుకు 21000సార్లు శ్వాస తీసుకునేవారు హంసారూఢులు, వారినే ఋషులనీ చెప్తారు. ఋషి నోటితో ఏదంటే అది జరిగి పోతుంది. శమీక మహర్షి కుమారుడు శృంగి చిన్నబాలుడు. ఎవరో తన తండ్రి మెడలో చచ్చిన పామును వేశారని తెలియగానే, విపరీతమైన కోపంవచ్చింది. అంతే, వెంటనే చేతిలోకి నీరు తీసుకొని, 'నా తండ్రి మెడలో చచ్చినపామును వేసిన వాడు వారాని కల్లా మృత్యువాత పడుగాక!' అని శపిస్తాడు. ఋషి ఒక్కసారి మాట అన్న తర్వాత ఇంక వెనక్కు తీసుకోలేరు. మరీ అవసరమైతే కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను సూచించగలరు. అదీ ఋషి వాక్ అంటే! ఋషి అంటే ఎవరు అనేదానికి కాస్తవివరణ చూద్దాం.

"ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోనుధావతి" అని 'ఋషి' అనే మాటకు భవభూతి మహాకవి తన "ఉత్తర రామచరిత్ర" నిర్వచనం చెప్తారు. (ఈ నిర్వచనం కొన్ని సందర్భాలలో మాస్టర్‌గారి జీవితంలో ప్రత్యక్షంగా అనుభూతిని చెందటం జరిగింది.) సరే–ఋషి అంటే ఏమిటో చూద్దాం.

శ్వాస ద్వారా వాక్కును ఉపయోగించుకునే వ్యక్తిని 'ఋషి' అంటారు. 'ఋషి' అనేది మొదటి స్థాయి. తర్వాత స్థాయిని మహర్షి అంటారు. వాల్మీకిని మహర్షి అనే పిలుస్తారు. దాని తర్వాత మూడవ స్థాయి రాజర్షి. మనం జనకమహారాజును రాజర్షి అంటాం అలానే, విశ్వామిత్రులవారిని రాజర్షి అనే అంటాం. దీని తర్వాత నాల్గవ స్థాయిని "బ్రహ్మర్షి" అంటారు. వశిష్ఠులవారిని "బ్రహ్మర్షి"గా చెప్తారు. చివారిగా ఐదవ స్థాయిలో "నారదులవారి"ని దేవర్షి అని వర్ణిస్తారు. దేవర్షి అంటే శ్రీరామాయణంలో

**తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరం ।**
**నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవం ॥**

అంటే నిరంతరం స్వాధ్యాయం, తపస్సు చేసేవాడు తన తపశ్శక్తితో వరాలనిచ్చే స్థాయి ఏదైతే ఉందో అది దేవర్షిస్థాయి. ఇలా ఋషులలో స్థాయి భేదాలు చెప్తూ ఇంకా ఏం చెప్పారంటే రాబోయే రోజులలో శ్వాసను బట్టి వైద్యం చేసే విధానం రాబోతోందనీ, శ్వాసను కొలిచే "మెషీన్సు" కూడా రాబోతున్నాయనీ చెప్పారు. ఏకముఖీ హంసవాహినీ గాయత్రీ ద్వారా ఉచ్ఛ్వాస,నిచ్ఛ్వాసల నియంత్రణనర్థం చేసుకోవాలి. అదే వాక్శక్తికి ఆధారమనీ వివరించారు. ఇలా నాలుగురోజులూ సాధనలతో పాటు ప్రవచనాలు కూడా అత్యంత అద్భుతంగా నడిచాయి. ఇంక ఐదవరోజున పూర్ణాహుతిని చేద్దామని చెప్పారు.

## విజయదశమి పూర్ణాహుతి

విజయదశమినాడు పూర్ణాహుతికి అన్ని గ్రామాలవారూ వచ్చేశారు. ఆరోజు ఉదయం 8 గం॥లకే మాస్టర్‌గారే యజ్ఞం ప్రారంభించారు. దేవావాహన వరకు మాస్టర్‌గారు చేసి, అక్కడ్నుంచీ యజ్ఞాన్ని శ్రీసత్యనారాయణగార్ని కొనసాగించమని చెప్పి వెళ్ళి పడుకున్నారు. (సాధారణంగా యజ్ఞం మొదలుపెట్టిన తర్వాత అలా వెళ్ళి పడుకున్నారూ అంటే ఏదోవిశేషమైన కార్యనిర్వహణార్థంగా

వెళ్ళటం కధాచిత్‌గా జరుగుతుండేది.) మళ్ళీ సరిగ్గా ఆహుతుల సమయానికి వచ్చి యజ్ఞందగ్గర కూర్చున్నారు. వచ్చినవాళ్ళంతా ఆహుతులు వెయ్యటం అయిపోయింది. 'పూర్ణాహుతి చేద్దామా, మాస్టర్‌గారు' అని అడగ్గా, 'ఇంకా రావలసిన వాళ్ళున్నారు. వాళ్ళను రానివ్వండి' అంటూ ఆహుతుల కార్యక్రమాన్ని కొనసాగించారు. అలా అంటుండగానే వేటపాలెం నుండీ గొల్లపూడి సీతారాం దంపతులు, శ్రీకృష్ణమూర్తిగారు, శాంతి, శ్రీరంగనాధ్‌గారూ వచ్చేశారు. వాళ్ళు వచ్చాక పూర్ణాహుతీ చేయించారు. ఆ రోజు అనిర్వచనీయమైన దివ్యతేజస్సుతో యజ్ఞంలో కూర్చుని పూర్ణాహుతినిస్తున్న మాస్టర్‌గారిని చూచినవారి జీవితాలు ధన్యమైనాయనే చెప్పాలి.

తర్వాత ఎంతో ప్రశాంతంగా, హాయిగా, ఉత్సాహంగా అవల్‌ఖేడాలో జరుగబోయే పూజ్య గురుదేవుల ప్రథమ పూర్ణాహుతి, దాని విశిష్టతను చెప్పి అందరూ ఆ మహాయజ్ఞానికి తప్పనిసరిగా వెళ్ళండని ఎంతో భావభరితమైన ప్రేరణాత్మక సందేశాన్ని ఇస్తూ "అదృష్టముంటే గురుదేవులను సశరీరంగా కూడా దర్శించవచ్చునే" మాట కూడా అన్నారు. ఆ సందేశాన్ని విన్న అందరిలో హృదయాలలో ఒక విచిత్రమైన దైవీ స్పందన ఏర్పడింది. భోజనాలయిపోయాయి. మళ్ళీ అందరూ కూర్చుని మాస్టర్‌గారితో, "ప్రధమపూర్ణాహుతికి వెళ్లాలని అందరికీ వున్నది. కానీ కొంత మందికి మాత్రమే వెళ్ళగలిగే అవకాశం కనిపిస్తోంది. మరి అందరికీ ఆ కోరిక ఎలా తీరుతుంది? దానికి మాకేదైనా ఉపాయం మీరే చెప్పాలని ఎంతో ఆర్తితో అడిగారు. మాస్టర్‌గారేం మాట్లాడలేదు, మౌనంగానే ఉన్నారు. కాసేపయ్యాక, "మీలో వెళ్ళగల్గిన వాళ్ళెవరైనా ఉంటే వెళ్ళటం మంచిది. లేదంటే ఒక పని చేద్దాం. అదే తారీకులలో, త్రిదివశీయ సహస్రకుండీయజ్ఞం, మీరంతకు ముందు చేసినట్లుగానే అక్కడే చేద్దాం. ఇంక ఎక్కువ సమయంకూడా లేదు. ఏర్పాట్లు చెయ్యగలరా?"అని అడిగారు. మాస్టర్‌గారి మాటలు వింటూనే అందరికీ ఆనందం ఉవ్వెత్తున పొంగుకు వచ్చింది. ఒక్కసారిగా అందరూ "చేస్తాం మాస్టారూ" అంటూ ఏకగ్రీవంగా తమ అంగీకారాన్ని తెలిపారు. వాతావరణంలో ఎంతో ఉత్సాహం వెల్లివిరిసింది.

తర్వాత కార్యక్రమాలనెలా చెయ్యాలని అందరూ కూర్చుని వివరంగా మాట్లాడుకుని 'మాస్టర్ గారి' కి నమస్కరించుకొని ఎంతో సంతోషంగా వెళ్ళిపోయారు. ప్రకృతిలో ఎప్పుడు, ఏది ఎలా జరగాలని ఉంటుందో, దానిని పరమాత్మ విచిత్రమైన పరిస్థితులను కల్పించి దాని మాధ్యమంతో, లక్ష్యప్రాప్తిని సుగమం చేస్తాడు, అనేది సునిశ్చితమైన తథ్యం. దానిని సాధకుడు నిరంతరం గమనంలో

పెట్టుకోని తదనుగుణంగా నడుచుకోవటం నేర్చుకోవాలి. అప్పుడే మనమూ పరిణామక్రమంలో ముందుకు వెళ్ళటం సాధ్యమౌతుంది.

కార్తీకపూర్ణిమకు అవల్‌ఖేడాలో జరిగేయజ్ఞాలు ఏ,ఏ తేదీలలో చేస్తారో అవేతేదీలలో ఇక్కడ యజ్ఞాలు, సంస్కారాలు మూడురోజుల పాటు జరగాలని మాత్రమే చెప్పారు. మిగతా వివరాల గురించి మాస్టర్‌గారేం చెప్పలేదు. యజ్ఞము అనగానే ముందుగా చూసుకోవలసినది సమిధలు, దాని తర్వాత హోమద్రవ్యం. హోమద్రవ్యం శాంతికుంజ్‌నుంచీ తెప్పిస్తాము. ఆ తర్వాత మిగిలినవన్నీ ఎక్కడోక్కడ దొరుకుతాయి. అది వర్షాకాలం. విపరీతమైన వర్షాలు కురుస్తున్నాయి. సమిధలను ఏర్పాటు చేసే బాధ్యత పందిళ్ళపల్లి శ్రీనివాస్ తీసుకున్నారు. కానీ ఆ వర్షాలలో సమిధలను ఏర్పాటు చేయటమనేది అసంభవమైన విషయంగా తోచింది.

ఒక రోజున మమ్మల్ని గుంటూరుకు వచ్చి కలవమని మాస్టర్‌గారు చెప్పారని శ్రీరామసుబ్బయ్య గారు టెలిఫోన్ ఆఫీస్‌లో పనిచేస్తున్న మా చెల్లెలు కృష్ణకుమారి ద్వారా కబురు చేశారు. మాస్టర్‌గారు చెప్పినట్లుగానే మేం మా చెల్లెలింటికే వెళ్ళాం. అనుకున్న సమయానికి మాస్టర్‌గారు, రామసుబ్బయ్య గారూ అందరూ వచ్చేశారు.

ఎందుకు పిలిపించారంటే, యజ్ఞం దగ్గర పడుతున్నది. యజ్ఞశాలనిర్మాణం – మూడు రోజులపాటు జరిగే యజ్ఞాలలో మొదటిరోజు సంస్కారాలు, మిగిలిన రెండు రోజులు మేధాయజ్ఞాలు, మరోరోజు పూర్ణాహుతి యజ్ఞాలు జరగాలి. దానిక్కావలసిన సాధనా సామగ్రి ఇంకా తత్సంబంధమైన అనేక విషయాలతో పాటు యజ్ఞశాలనిర్మాణం వేరుగా వుండాలి, సంస్కారమంటపం వేరుగా ఏర్పాటు చెయ్యాలని చెప్పారు. ఒక పేపర్ మీద కొలతలతో వాటి బొమ్మలను గీచి ఇచ్చారు. చెప్పిన విషయాలను శ్రద్ధగా విని వ్రాసుకుని వేటపాలెంకు వచ్చి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాస్టర్‌గారు చెప్పిన విషయాలను యధాతథంగా అందరికీ వివరించాం. కార్యకర్తలందరూ చర్చించుకుని సంక్షిప్తంగా కార్యాచరణ పథకాన్ని తయారు చేసి ఎవరు ఏఏ పనులు చెయ్యగలరో అలా పథకాన్ని తయారుచేశారు.

## త్రిదివసీయ సహస్రకుండీయ యజ్ఞము

అందరూ పనులు ప్రారంభించారు. పనులు, ప్రచారం సాగుతున్నాయి కానీ విపరీతమైన వర్షాలు. యజ్ఞానికి ముఖ్యంగా కావలసినవి సమిధలు. బురదవల్ల బండి పొలాల్లోకి వెళ్ళలేక

పోతోంది. ఎలా? సమయమా దగ్గర పడుతున్నది. సమిధలదే పెద్ద సమస్య అయిపోయింది. నేను ఈ విషయాన్ని అతి కష్టంమీద శ్రీరామసుబ్బయ్యగారికి ఫోన్‌ద్వారా, "పరిస్థితి ఇంత కష్టంగా వుంది. ఈ విషయం కాస్త మాస్టర్‌గారికి తెలియపరచమని కోరాను". దానికి వారు, 'మాస్టారికన్నీ తెలుసు. మీరేం కంగారు పడకండి రాజ్యలక్ష్మిగారూ! ముఖ్యంగా దాదాగురుదేవుల అనుగ్రహం కూడా మన మీద వుందని రాత్రి మాస్టర్‌గారు నాతో అన్నారు. మీరు ఉత్సాహంగా ఎప్పటిలా పనులు సాగించండి. అంతా ఆయనే చూసుకుంటారు. ముందు మీరు ధైర్యంగా వుండండి, అప్పుడందరూ ఉత్సాహంగా పని చేస్తారు' అని చక్కటి ఆశ్వాసననిచ్చారు. మళ్ళీ అంతా మామూలుగా పనులు ప్రారంభించారు. అన్నట్లుగానే యజ్ఞసమయానికి సంపూర్ణంగా అన్నీ సమకూరాయి. అదీ 'ఋషి' స్థాయి అంటే. మాస్టర్‌గారు అన్నారూ అంటే అది జరిగి తీరవల్సిందే కదా! సరే, ఇక్కడ ఈయజ్ఞం గురించి కాస్త చెప్పాలి. మూడు రోజులపాటు, ఈ యజ్ఞం మూడు అంచెలుగా జరుగుతుంది. యజ్ఞానికి మూడు అర్థాలున్నాయి.

**1. దేవపూజనము:** అంటే పరిష్కృత వ్యక్తిత్వము. దైవీగుణముల అనుసరణ.

**2. సంగతీకరణ:** అనగా ఏకత్వము, అందరూ కలిసి మెలిసి సహకారముతో జీవించుట. సంఘీభావంతో పని చేయుట.

**3. దానము:** దానము అనగా సమాజపరాయణత. విశ్వకౌటింబికత, ఉదారసహృదయత, ఈ మూడు ప్రవృత్తుల ప్రతినిధిత్వమే యజ్ఞము. ఈ ప్రక్రియలో సద్భావనలను, సత్కర్మలుగా పరిణితి చెందించాలనే ప్రేరణ వున్నది. జ్ఞాన, కర్మల సమన్వయమే ప్రగతికి ఆధారం. సత్కర్మలను–తపస్సనీ, సద్భావనలను–యోగమనీ చెప్తారు. ఆత్మప్రగతికి ఇవే ఆధారాలు. భౌతిక ప్రగతికి కూడా శ్రమ, శిక్షణ ఇవే ప్రధాన సోపానాలు. ఇలాంటి వ్యక్తిత్వ నిర్మాణము చెయ్యాలనేదే యజ్ఞము యొక్క ప్రధాన ఉద్దేశ్యము

ఆ రోజు స్వయంగా మాస్టర్‌గారే వేదిక మీద కూర్చొని యజ్ఞమును ప్రారంభించారు. సంస్కారమంటపంలో యజ్ఞోపవీత సంస్కారముతో సహా మిగిలిన సంస్కారములన్నీ శ్రీసత్యనారాయణరావుగారు, సీతామహాలక్ష్మిగారు చేయించి వారందరినీ ప్రత్యేక ఆహుతుల నిమిత్తం పూర్ణాహుతి సమయానికి యజ్ఞశాలకు తీసుకువచ్చారు. ఈ మూడు రోజులు యజ్ఞనిర్వహణతో పాటు మాస్టర్‌గారు పూజ్యగురుదేవుల సూక్ష్మీకరణ సాధన దాని ప్రయోజనములను గురించి

సమగ్రంగా వివరించడం జరిగింది. ఆ ప్రవచనాల సంక్షిప్త సారాంశము, గురుదేవులు చేసిన సూక్ష్మీకరణ సాధనకు ఆవల్‌ఖేడాలో జరుగుతున్న ప్రధమపూర్ణాహుతికి ఇది ప్రతిబింబము. పూజ్యగురుదేవుల, మాతాజీల జీవితం గాయత్రీమయం, యజ్ఞమయం, సేవామయం. మహాకాల స్వరూపులైన గురుదేవులు 1984 నుండి 87 వరకు చేసిన సూక్ష్మీకరణ సాధన యొక్క ప్రచండ పురుషార్థ పరిణామాలను గురించి గురుదేవుల సందేశంగా ఇలా చెప్పారు.

**గురుదేవుల వెలుగు విస్తారంగా ఉంటుంది.** ఇది యుగసంధి కాలము. ఇప్పుడిది చాలా చిన్నదిగా కనిపిస్తుంది. రాబోయె రోజులలో ఇది విశాలమైన బోధివృక్షంగా మారుతుంది. సిద్ధార్థుడు ఈ వృక్షం క్రింద తపస్సు చేసి బుద్ధుడుగా మారి తన దివ్యసందేశాన్ని దేశ, విదేశాలలో వినిపించారు. విత్తనాలు వేసే సమయం కొద్దిగానే వుంటుంది. కానీ వృక్షం యొక్క అస్తిత్వం చాలా కాలం వరకు వుంటుంది. 1990 సం॥ నుండీ2000 సం॥ వరకు గల ఈ పదిసంవత్సరాలలో దున్నటం, విత్తనాలు నాటటం, పెంచటం, నీరు పోయటం, ఎరువులు వేయటం జరుగుతుంది. ఇంక 21వ శతాబ్దం నుంచీ వాతావరణం మారుతుంది. పరిస్థితులలో గొప్ప,గొప్ప మార్పులు వస్తాయి. ఇవన్నీ విస్తరించటానికి ఒక వందసంవత్సరాలు పడుతుంది. 2000-2099 సంవత్సరంనాటికి గొప్ప, గొప్ప మార్పులను చూస్తారు. అయితే 1990-2000 సం॥ల మధ్యన గల ఈ 10సం॥లలో పూర్తిగా గందరగోళ పరిస్థితులు నెలకొని వుంటాయి. దానిని మార్చటానికి మానవుల ప్రయత్నం సరిపోదు. దైవీశక్తి ఇక్కడ తన పాత్రను పోషించి తీరాలి. ఈ రోజులలో జరిగే పనులు అద్భుతాలని చెప్పవచ్చు. ఈ మార్పు యొక్క శుభారంభం శాంతికుంజ్ నుంచే ప్రారంభమౌతుంది. ఈ 10 సంవత్సరాలలోనే రాబోయే వందసంవత్సరాలలో జరగబోయే ఆధ్యాత్మిక, భౌతిక ఉన్నతికి కావలసిన ఆధ్యాత్మిక బీజాలను అనేక కార్యక్రమాల ద్వారా బీజారోపణ చేశారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఈ 10 సంవత్సరములలో రాత్రింబవళ్ళు కృషి చేసి వంద సంవత్సరాల పనిని పూర్తిచేశారు. దాని కోసమే 2000 సంవత్సరం వరకు వారు చేసిన పనులను చెప్పటానికి ప్రయత్నించాము.

యుగసంధిపురశ్చరణలన్నీ శాంతికుంజ్ నుంచే ప్రారంభించబడతాయి. ఇందులో ఆధ్యాత్మిక ఉన్నతికి జప, యజ్ఞ, ధ్యానాలుంటాయి. దానితోపాటు ఐదురోజుల దివ్యప్రశిక్షణా సత్రములు నిరంతము జరుగుతూ వుంటాయి. ఈ శిక్షణ విశిష్టమైనది. శక్తితో పాటు ప్రాణశక్తిని ప్రసాదిస్తుంది. దీని ప్రభావం చాలా కాలం వరకు స్థిరంగా వుంటుంది. 1996 వసంతపంచమినాటికి ఒక లక్ష

దీపయజ్ఞాలను మనం సర్వేసర్వత్రా చేయవలసి వుంటుంది. ఇక్కడ మనం ఈ సంకల్పాన్ని తీసుకుంటున్నాము. 1995 సం॥లో ప్రథమపూర్ణాహుతి తర్వాత రెండువేల సంవత్సరంలో రెండవ పూర్ణాహుతి నిర్వహించాలనేది నిర్ణయమైనట్లుగా వివరించారు. ఈ మహాపూర్ణాహుతి యజ్ఞాలను నిర్వహించదలచినవారు నియమంగా ప్రతీ ఆదివారమూ సత్సంగాలతో పాటు దీపయజ్ఞాలను చేసి ప్రవచనాలనివ్వాలి. యుగసాహిత్యాన్ని ఒక పద్ధతిలో స్వాధ్యాయం చేయాలనేది ఖచ్చితమైన నియమం. ఇలాంటి విశాలమైన ప్రణాళిక వలన రెండువేల సం॥ నాటికి రెండుకోట్ల మంది దేవమానవులు ఇందులో పాల్గొనేలా చెయ్యాలి. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న మీరు మీ, మీ ప్రాంతాలకు వెళ్ళి ఈ నవయుగ సందేశాన్ని వాడ, వాడలా వినిపించవచ్చు. దీని కొరకే యుగ సందేశంగా "క్రాంతిధర్మీసాహిత్యాన్ని" పూజ్యగురుదేవులు మహాపూర్ణాహుతి ప్రసాదంగా అందించటం జరిగింది. (నిత్యనూతన, శాశ్వత, సనాతన ధర్మాల్లాంటి ఆపుస్తకాలను అందరూ అధ్యయనం చెయ్యాలని మాస్టర్‌గారు వాటిని తెలుగులోకి అనువదించి తెలుగుజాతికి అంకితమిచ్చారు.

భారతీయ సంస్కృతికి గాయత్రీ తల్లి అయితే యజ్ఞము తండ్రి. ఈ ఇరువురి కలయికతోనే యజ్ఞము రూపొందించబడింది. ఈనాడు ప్రకృతిలో ఈ గాయత్రీయజ్ఞానికి గల విశిష్టత, ప్రత్యేకత అందరికీ తెల్సినదే! అయితే మానవులు తమ సమస్యలను పరిష్కరించుకోటానికి, కోరుకున్న ప్రయోజనాలను పొందటానికి, "ఈ దీపయజ్ఞమ"నే విశేషసాధన వెలికి తీయబడినది. శాస్త్రముల యందు దీని వివరణ చాలా స్పష్టంగా వున్నది. **గాయత్రీమంత్రం చేసేవారందరూ – ఒక దీపాన్ని వెలిగించి, అగరుబత్తీలను వెలిగించి దానినే సమగ్రమైన దేవతగా భావించాలి. ఈ తేలికైన కర్మకాండను ఇంట్లో వారందరూ కల్సి చెయ్యాలి. అగరుబత్తీని హవనసామగ్రిగా భావించాలి. దీపము–వెలుగు–సద్జ్ఞానానికి అధిష్ఠాత్రి అయిన మాతగాయత్రిగా భావిస్తూ, చేసుకునే "ఈ దీపయజ్ఞాన్ని" నవయుగానికి ఆరతిగా అందరికీ చెప్పాలి.** చివరగా సూర్యార్ఘ్యదానం ఇచ్చి కార్యక్రమానికి స్వస్తి చెప్పాలి. ఇలాంటి దీపయజ్ఞాలు దశదిశలా జరగాలి. ఇది నవయుగావతరణకు కావలిసిన దివ్యమైన వాతావరణాన్ని కల్పించి ఆ పుణ్యాన్ని మన ఖాతాలో జమ చేస్తుంది. ప్రగతిమార్గానికిది అత్యంత సూక్ష్మమైన, శక్తివంతమైన ప్రక్రియ. ఇందులో మీరు, మీ బంధుమిత్రులందరూ భాగస్వాములై మాత కృపకు పాత్రులు కావాలి అంటూ మాస్టర్‌గారు గురుదేవుల సూక్ష్మీకరణసాధన ప్రయోజనాలను వివరించారు.

రెండురోజుల పాటు జరిగిన ఈ సహస్రకుండీ మహాయజ్ఞాలతోపాటు సంస్కార మహోత్సవాలను ఎంతో దివ్యంగా, భవ్యంగా నిర్వహించటం జరిగింది. యజ్ఞాలైన తర్వాత ప్రతీరోజు సాయంత్రం పూట పూజ్యశ్రీ మాస్టర్‌గారి ప్రవచనం చెప్పేవారు. దాని తర్వాత కార్యకర్తలను సమావేశ పరచి, అందులో రేపటి కార్యక్రమాలకి అవసరమైన సరంజామా, విశేషంగా ఇంకా ఏమైనా కావాలో చూసుకొని వాటి ఏర్పాట్లన్నీ శ్రీమాస్టర్‌గారి సూచనల ప్రకారం స్థానికకార్యకర్తలు ఏర్పాటు చేసేవారు.

రాత్రికి జాంగ్రపేటకు వచ్చి పడుకుని శాంతంగా నిద్రపోయి, మర్నాడుదయం తెల్లారు ఝాముననే లేచి కాఫీ తాగాక, తలంటుస్నానం చేసి ఆరోజు యజ్ఞానికి అవసరమైన వస్త్రధారణ పద్ధతిప్రకారం ధరించి రామసుబ్బయ్యగారితో కల్సి లూనా మీద యజ్ఞశాలకు వెళ్ళిపోయేవారు. ముఖ్య కార్యకర్తలందరూ సిటీబస్‌లో ముందుగానే వెళ్ళిపోయేవారు.

మూడవరోజు మేధాయజ్ఞాలు జరగాలి. ముందు రోజునే మేధాయజ్ఞాల కవసరమైన ఏర్పాట్లన్నీ చేయటం జరిగింది. మేధాయజ్ఞాలలో "దీక్షలు" తీసుకోదలచినవారు ముందురోజే దానికి సంబంధించిన ప్రవేశపత్రాలను పూర్తిచేసి ఇచ్చి వెళ్ళటం జరిగింది. ఇంతకీ అసలు

## మేధాయజ్ఞాలంటే ఏమిటి ?

యజ్ఞప్రకరణలో "మేధాయజ్ఞాల" స్థానం చాలా మహత్వపూర్ణమైనది. వేర్వేరు కాలాల్లో "మేధా" శబ్దానికి భిన్న, భిన్న అర్థాలు ఇవ్వబడ్డాయి. మధ్యకాలం తమ స్వార్థాన్ని సిద్ధింపచేసుకోటానికి "ధర్మ" మంటే ఏమిటో తెలియని కొందరు "మేధా" శబ్దానికి "బలి" అని అన్వయము చెప్పి యజ్ఞాల మీద కలుషితమైన ముద్రను వేశారు. ఈ నాటి వివేకప్రధానమైన యుగంలో ఋషులు యజ్ఞాలనెలా దర్శించారో తెల్సుకోవటం ఎంతో అవసరం. వేదవాఙ్మయంలో నాలుగు రకాల మేధాయజ్ఞాలు బహుళ ప్రచారంలో ఉండేవి. అవి

1. సర్వమేధము. 2. నరమేధము. 3. గోమేధము. 4. అశ్వమేధము.

**1. సర్వమేధము:** స్వయముగా సంపాదించిన సంపద, ప్రతిభ, ఆయువులను సమిష్టి సత్ప్రయోజనాలకు పూర్తిగా సమర్పణ చేయుట. స్వంతానికంటూ ఏమీ వుంచుకోకుండా దాన, ధర్మాలు చేయుట. హరిశ్చంద్రుడు, వాజస్రవసువులాంటి వారు ఆ కాలంలో సమయానుకూలంగా సర్వమేధయజ్ఞాలను చేశారు.

**2. నరమేధము:** తపస్సంపన్నమైన జీవనవిధానము. అలవాటు పడిన లోభ, మోహ, అహంకారము లాంటి కుసంస్కారములను పరిత్యాగము చేయుట. పుత్రేషణ, విత్తేషణ, లోకేషణ ల్లాంటి కోరికలనుండీ విముఖులగుట. జీవితాన్ని తపోమయం చేసుకొనుట. ఆలోచనలలో ఉదారత్వమును పెంచుకొని, జీవనవ్యవహారములలో ఆత్మీయతను నింపుకొనుట. అంతఃకరణలో సదాశయముల ఎడ ప్రగాఢశ్రద్ధను పరిపక్వమొనరించుకొనుట.

**3. గోమేధము:** నిద్రాణమై వున్న సత్ప్రవృత్తుల జాగరణ కొరకు స్వాధ్యాయ, శిక్షణ, కౌశలములను బాగా పెంచుకోటమే కాకుండా వ్యక్తి, సమాజములో దైవీగుణములను పెంపొందింపచేయాలి. నిజానికి "గో" అనే పదానికి తాత్పర్యము-వాణి లేక మాట. వాణి అనగా వాక్, కామధేనువు కూడా. దీని వలననే ఈ ప్రపంచంలో అవసరమైన పనులు జరుగుతున్నాయి. "వాచామే విశ్వభేషజం"- నా మాట విశ్వానికి ఔషధి. ఔషధిగా మార్చటానికి పదార్థాన్ని అనేక రకాలుగా నలిపి, కాచి, పుఠం పెట్టి భస్మీకృతం చేస్తారు. అప్పుడే అది మందులాగా పని చేస్తుంది. కానీ మన "వాక్ - ప్రపంచానికి ఔషధం"గా మారాలంటే దానిని మనం ఎన్నిరకాలుగా నియంత్రించుకొని సాధించవలసివుంటుంది. ఇదీ "గోమేధము" అంటే. దీనినే గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు.

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితంచయత్।**
**స్వాధ్యాయాభ్యాసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే॥ (భ.గీ..17-15)**

## యజ్ఞపూర్ణాహుతి

ఆనాడు సహస్రకుండాలలో యజ్ఞపూర్ణాహుతి జరుగబోతున్నది. నలుదిక్కులలో దివ్యమైన వాతావరణం దేదీప్యమానమై విరాజిల్లుతున్నది. వేదిక మీద గల గురుదేవుల, గాయత్రీ, మాతాజీల చిత్రపటాలనుంచీ తేజోవంతమైన కాంతి కిరణాలు యజ్ఞశాలనిండా పరుచుకొని పరిసరాలను శక్తివంతం చేస్తున్నాయి. వింతశోభతో యజ్ఞశాల దేదీప్యమానమై మాస్టర్‌గారి రాక కోసం ఎదురు చూస్తున్నదా అన్న భావప్రాకట్యం కనిపించింది. పసుపు పచ్చని వస్త్రాలతో, నుదిటిమీద ఎఱ్ఱని సింధూరాన్ని ధరించి, దేదీప్యమానంగా వెలిగిపోతూ గురుదేవుల ముద్దు బిడ్డడు వేదికనెక్కి ముందుగా గురుదేవులకు, గాయత్రీమాతకు, మాతాజీలకు ఎంతో వినయవిధేయతలతో, ప్రేమతో శిరస్సు వంచి నమస్కరించి వేదిక నలంకరించారు. అప్పటికే యజ్ఞశాల భక్తులతో నిండిపోయింది. అందరి చూపులు ప్రజ్ఞాపుత్రులైన ఆ పరంధాముడి పైననే. సభకు నమస్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆనాటి ప్రధాన కార్యక్రమమైన మేధాయజ్ఞాల గురించి ముందుగా వివరించి–మేధాయజ్ఞాల వారిని ఒక ప్రక్కన కూర్చోబెట్టారు. ఆరోజు నరమేధము, గోమేధములకు సంబంధించి దీక్షల నివ్వబోతున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యతను, పూజ్యశ్రీ మాస్టర్‌గారు శ్రీ సీతారాంగారికి ఇచ్చారు. మేధాయజ్ఞాలకు ప్రత్యేకించి యజ్ఞశాలలో ఒక ప్రక్కగా రెండు రాటలను పాతించారు. ఆ రాటలకు సరిగ్గా 4 అడుగుల ఎత్తులో అడ్డంగా పొడవాటి బొంగును రెండు వైపులా కట్టించారు. నరమేధ దీక్షకు సంబంధించిన నియమాలను ముందుగా వివరించి, వాటిని పాటిస్తామన్నవారిని మేధాయజ్ఞాలను చేసే ప్రదేశం దగ్గరకు పిలిచి ఆబొంగుమీదకు వంగి వారి తల, చేతులు క్రిందికి వ్రేళ్ళాడేలా నిలబెట్టించి – వారి చేత మాస్టర్‌గారు చెప్తున్న ప్రతిజ్ఞలను పలికించారు. అలానే గోమేధానికి పేర్లు ఇచ్చిన వారి చేత కూడా అలానే ప్రతిజ్ఞలను పలికించారు. ఎన్నడూ, ఎక్కడా అలాంటి కార్యక్రమం చూడకపోవటంతో ప్రేక్షకులు ఎంతో ఉత్సుకతతో ఆ ప్రక్రియను దర్శించసాగారు. అలా ఆ నాడు దీక్ష స్వీకరించిన వారి జీవితాలు సంపూర్ణంగా మాస్టర్‌గారి మార్గదర్శనంలోకి వెళ్ళి పోతాయి. ఒక అద్భుతమైన దీక్షను కనీ, వినీ ఎరుగని రీతిలో, అతి సామాన్యులమైన మనకి ప్రదానం చేసి మన జీవితాలకు ధన్యతను చేకూర్చారనిపించింది. ఆరోజున సంస్కారములను కూడా స్వయంగా మాస్టర్‌గారే చేయటం వారి అదృష్టం. పూర్ణాహుతి సమయంలో అందరికీ గాయత్రీ మంత్రదీక్షలనిచ్చారు. అత్యంత శోభాయమానంగా జరిగిన ఆ కార్యక్రమానికి వచ్చిన సుమారు ఐదువేలమంది భక్తులు మాస్టర్‌గారి దివ్యదర్శనం చేసుకుని పులకించి పోయారు. ఎవరినోట విన్నా మేధాయజ్ఞాల వైభవమే! **"మేధాయజ్ఞాలు"అంటే సదరు గోవును, మనిషిని లేదా మేకను చంపటం కాదు. వారిలో గల ఆ పశుసంస్కారాలను తీసివేసి, సత్ప్రవృత్తులను నాటటమేనని ఆనాటి ప్రవచనంలో వివరించటం వలన అప్పటి వరకు మేధాయజ్ఞాల పట్ల వున్న అనుమానాలు అందరిలో నివృత్తి అయ్యాయి.**

ఆరోజు మధ్యాహ్నంతో యజ్ఞకార్యక్రమాలు అయిపోయాయి. అందరి భోజనాలు పూర్తయి పోయాయి. యజ్ఞములను గురించి ఆరోజులలో జరిగిన వింతలూ, విశేషాలను గురించి భాస్కరవల్లి వ్రాసిన చిన్న సంఘటన గురించి యధాతథంగా ఇక్కడ వ్రాయాలి. "నేను, లక్ష్మిఅత్త, గౌరీ, గాయత్రి, ఉమ మేమంతా భోజనాలను విస్తళ్ళల్లో సర్దుకుని కాలేజీక్లాసురూముకు వెళ్ళి అక్కడ వ్రాతబల్ల వుంటుంది గదా, దానిమీద విస్తళ్ళను పెట్టుకుని, అన్నీ పదార్థాలను ఒక్క విస్తరిలోనే కలుపుకుని అందరం కల్సి ఆనందంతో గోల చేస్తూ నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ, కిందా

పైనా పోసుకుంటూ తింటున్నాము. తలుపులు వేసుకున్నాంలే, ఇంక ఎవ్వరూ రారులే అనుకుని బాగా గోల చేసేస్తున్నాం. ఇంతలో ధనామని తలుపు తోసుకొని మాస్టర్‌గారు లోపలికి వచ్చేశారు. ఎక్కడి వాళ్ళం అక్కడే గప్,చిప్‌గా లేచి నిలబడ్డాం. మాస్టర్‌గారు మా దగ్గరికొచ్చి, "వెరీగుడ్ భలేతింటున్నారే అన్నాన్ని, నన్నూ పిలిస్తే నేనూ వచ్చి ఇలానే తినేవాణ్ణి గదా! అబ్బా, నేను తినేసి వచ్చాను, సర్లెండి. మీరు తినండని వెనక్కు తిరిగి వెళ్ళి పోయారు. అందరం మౌనంగా అన్నాన్ని కలుపుతున్నాం. ఆధరువులన్నీ ఒకేసారి వేసి ఇష్టంవచ్చినట్లుగా కలుపుతున్నాం.

వెళ్ళిపోతున్న మాస్టర్‌గారు హఠాత్తుగా వెనక్కితిరిగి వచ్చి, "నాకూ పెడతారా? నేనూ తింటాను" అన్నారు. "మీకా" అంటూ అందరం నోళ్ళు తెరిచాం. "ఏం, నేను తినకూడదా? ఏరా వల్లీ నువ్వు చెప్పు నేను తినవచ్చా? తినకూడదా?" అన్నారు. కాస్తంత తేరుకొని ధైర్యంగా, "తినవచ్చు మాస్టర్‌గారు" అన్నాను. "అదీ సంగతి మా వల్లీ చెప్పింది కాబట్టి నాకు నమ్మకం వచ్చింది నేనూ తినవచ్చని" అంటూ చెయ్యి చాపారు పెట్టమన్నట్లు. వేరే అన్నం కలుపబోయాను. "వద్దమ్మా నాకు అదే పెట్టు" అన్నారు. "మాస్టర్‌గారూ, ఇదంతా ఎంగిలి అన్నం. అందరం ఇందులోనే తింటున్నాం. మీకు వద్దు" అంది. "లేదమ్మా తింటాను, మీ ఎంగిలి నేను తినకూడదా ఏం? నువ్వు ముందు పెట్టు" అంటూ చెయ్యి పట్టారు. సరే, అదే తీసి పెట్టాను. తిన్నారు. "ఇప్పుడు మీ మీద నమ్మకం వచ్చింది. మీరూ తలో ముద్ద పెట్టండని" అడిగి అందరి చేతా పెట్టించుకుని తిని, చెయ్యి కడుక్కుని మంచినీళ్ళు తాగి, అదే రూంలో చివరి బెంచీ దగ్గరికి వెళ్ళి పడుకుని నిద్ర పోయారు. ఇంతలో మాస్టర్‌గారి కాళ్ళు పట్టటానికి ఎవరో వచ్చారు. మేమందరం మౌనంగా లేచి బయటకు వెళ్ళిపోయాం.

మా అందరికీ ఆనందంతో పాటు ఆశ్చర్యం కలిగింది. ఇంత మహత్తరమైన యజ్ఞాన్ని నిర్వహించిన బ్రహ్మవేత్త, మహాజ్ఞానీ, అపర సరస్వతీ స్వరూపులూ అయిన మాస్టర్‌గారు యజ్ఞం అయిపోగానే ఒక మామూలు మనిషిలాగా మా దగ్గరకొచ్చి అన్నం తిన్నారు అనుకుంటుంటేనే, ఒడలు పులకించి పోయినట్టయింది. అలనాడు శ్రీరాములవారు ప్రేమతో, భక్తితో శబరి పెట్టిన ఎంగిలి పండ్లు తిన్నారు. శ్రీకృష్ణుడు గోపబాలురతో కల్సి చల్దులారగించిన విధంగా, ఈనాడు ఆ శ్రీరామకృష్ణులవారు మేమే తపస్సులు చేయకపోయినా, మమ్మల్ని అంతలాగా అనుగ్రహించారు. అంతటి పరమపావనపుణ్యమూర్తి, యజ్ఞకర్త, అంతమహాయజ్ఞాన్ని చేసి మాదగ్గర అన్నం పెట్టించుకుని తిన్నారు అంటే ఆయన ప్రేమ అలాంటిది. ఆ ప్రేమామృతంలో కరిగిపోవటము తప్ప చేయగలిగింది

ఇంకేమీ లేదు. ఆ అవ్యాజకరుణామూర్తి కురిపించిన ప్రేమామృతధారలు, ఇంకా ఎంతమంది జీవితాలలో ఇంకా ఎలాంటి మహాభాగ్యాలను అనుగ్రహించారో మనకుతెలియదుగదా!

**యజ్ఞమైపోయిన రోజు సాయంత్రం అందర్నీ సమావేశపరచి మాస్టర్‌గారు కార్యక్రమాన్ని గురించి చెప్తూ, "ఈ యజ్ఞము వలన ఆంధ్రప్రదేశ్ ఎంతో శక్తి వంతమైంది. మీకు తెలియదు ఎంతమంది మహాత్ములు ఈ మహాయజ్ఞానికి వచ్చి తమ అనుగ్రహాన్ని ప్రసాదించి వెళ్ళారో. నికటభవిష్యత్‌లో దీని ప్రభావం ఎంత ఉదాత్తంగా వుంటుందంటే, ఆంధ్రప్రదేశ్ అత్యంతశక్తివంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా రూపొందుతుంది" అని చెప్పగా వెంటనే ఒకరు లేచి, "మాస్టర్‌గారు, యజ్ఞం జరిగినంత సేపు ఒక వ్యక్తి ఎవరో తెలియదు కానీ పొట్టిగా, నల్లగా వున్నాడు. కాషాయవస్త్రాలు ధరించి, తలచుట్టూ కూడా కాషాయం బట్ట కట్టుకుని దూరంగా ఒక ప్రక్కకి తిరిగి, చెయ్యి తలకింద పెట్టుకొని, ఈయజ్ఞాన్ని మొత్తాన్ని దీక్షగా చూసి తర్వాత వెళ్ళిపోయారు" అని చెప్పాడు. దానికి మాస్టర్‌గారు, "అవును వారు అగస్త్యమహర్షులవారు, నేనూ చూశాను", అని చెప్తుండగా ఒక్కొక్కరు అలా తమ, తమ అనుభవాలను, దర్శనాలను చెప్పసాగారు.**

మరునాడు మాస్టర్‌గారు, రామసుబ్బయ్యగారు గుంటూరుకు వెళ్ళి పోయారు. తర్వాత రామసుబ్బయ్యగారు యజ్ఞానికి ముందు జరిగిన ఒక సంఘటనను మాకు చెప్పారు. రెండవ రోజు యజ్ఞానికని నేను, మాస్టారూ లూనా మీద వేటపాలెం వైపుకు వెళ్తున్నాము, మాస్టర్‌గారు ముందు కూర్చుని లూనాను నడుపుతున్నారు. నేను వెనుకన కూర్చున్నాను. కాస్త దూరం వెళ్ళాక; "రామసుబ్బయ్య, అదుగో చూడు, మనకంటే ముందు దాదాగురుదేవులు యజ్ఞశాలకు వెళ్తున్నారు" అన్నారు. ముందుకు చూశాను. నిజమే దాదాగురుదేవులు వడి, వడిగా ముందు సాగిపోతూ కనిపించారు. అలా సాక్షాత్ దాదాగురుదేవుల ఆధ్వర్యంలో ఆ మహాయజ్ఞాన్ని మన ప్రియతమ మాస్టర్‌గారు ఎలా నిర్వహించారో చెప్పారు శ్రీరామసుబ్బయ్యగారు.

ఒక వారంరోజుల తర్వాత మాస్టర్‌గారి దగ్గర్నుంచీ ఒక ఉత్తరం వచ్చింది. అందులో ఇలా వుంది "అపూర్వంగా జరిగిన ఈ ప్రథమపూర్ణాహుతి మహాయజ్ఞానికి శారీరికంగా, మానసికంగా బడలి వున్న మీరు కాస్తంత విశ్రాంతి తీసుకోండి. రాత్రీ, పగలు అనక కష్టపడిన మన కార్యకర్తలనందరినీ పేరు, పేరునా అడిగానని చెప్పండి. త్వరలోనే మిమ్మల్నందర్నీ కలుస్తానని" ఎంతో ప్రేమతో వారు వ్రాసిన ఉత్తరాన్ని అందరికీ చూపించాను నేను. దానిని అందరూ పదే,

పదే ఆనందభరిత అశ్రునయనాలతో చదువుకొని ఆనందించేశారు. అలా కార్యకర్తలమధ్య ఒక అందమైన, ఆత్మీయతతో కూడిన ఆత్మానుబంధం వెల్లివిరిసేది.

## దుర్వాసమహర్షి తపఃస్థలి

ప్రథమపూర్ణాహుతి యజ్ఞాలయిపోయాక మాస్టర్‌గారు ఒకపరి జాంద్రపేటకు వచ్చారు. అది కార్తీకమాసం కావటంచేత శ్రీగొల్లపూడి సీతారాంగారు వచ్చి పూజ్యశ్రీ మాస్టర్‌గార్ని, శ్రీసత్యనారాయణగార్ని వనభోజనాలకని మామిడితోటకు తీసుకువెళ్ళారు. అసలే కార్తీకమాసం. అందమైన మామిడితోట. ప్రశాంతమైన చల్లటి, ఆహ్లాదకరమైన వాతావరణం. అందరూ ఉల్లాసంగా ఎవరి ఆనందాలలో వారు, ఎవరి కబుర్లలోవారు తేలిపోతున్నారు. స్టూడెంట్స్ అయితే మాస్టర్‌గారి దగ్గరే కూర్చుని తమ సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. వారికి ఆయనంటే ఎంత అభిమానమో చెప్పలేం. కబుర్లు, కాలక్షేపాలయ్యాక భోజనాలు అయ్యాయి. సాయంత్రం కార్లో తిరిగి వస్తున్నప్పుడు మాస్టర్‌గారు చెప్పిన కొన్ని విషయాలను తర్వాత శ్రీసీతారాంగారు చెప్పారు. సంక్షిప్తంగా దాని సారాంశమిలా చెప్పారు. కార్లో వస్తుండగా మాస్టర్‌గారు కార్లోనుంచీ చెయ్యి ఇలా బయటపెట్టి చూపిస్తూ, "రాబోయే రోజులలో ఈ ప్రాంతంలో పెద్ద, పెద్ద విద్యాసంస్థలు వస్తాయని చెప్తూ ఇంకాస్త దూరం పోయాక, ఇంకో ప్రదేశాన్ని చూపిస్తూ, "ఇక్కడ ఒక గొప్ప ఆధ్యాత్మిక సాధనా స్థలి రాబోతున్నదని" చాలా స్పష్టంగా సీతారాంగారితో చెప్పిన విషయాలను, వారు చెప్పటం జరిగింది.

అది విన్నాక నాకు హటాత్తుగా ఒకసారి మాస్టర్‌గారన్నమాటలు గుర్తుకు వచ్చాయి. ఒక రోజు వేటపాలెంలో యజ్ఞమైపోయాక ఇంటికి వచ్చి పడుకొని చాలా గాఢంగా నిద్రపోయారు. నిద్ర లేస్తూనే ఇలా చెప్పారు. "అంతకు ముందు ఈ మార్గంలో వెళుతుంటే ఏవో తెలియని దివ్య తరంగాల స్పర్శ నాకు కలుగుతుండేది. అవి దుర్వాసమహర్షివని అర్థమైంది. ఆయన ఇక్కడ, ఈప్రాంతంలోనే తపస్సుచేశారనిపిస్తున్నది. అయితే ఆ ప్రదేశమెక్కడో ఇన్నాళ్ళు బట్టీ ఎంత ప్రయత్నించినా దొరకలేదు. దానికోసమే ఈ హైస్కూల్లో ఇన్ని కార్యక్రమాలను పెట్టాల్సివచ్చింది" అన్న మాస్టర్‌గారి మాటలు గుర్తుకు వచ్చి నేను "మాస్టారూ, మీరిది వరకు దుర్వాసులవారి తపఃస్థలి కోసం అన్వేషిస్తున్నానని చెప్పారుగదా! మరి ఆస్థలం ఇదేనా? అని అడగ్గా, సరిగ్గా అదే! ఇప్పుడు కార్లోవస్తుంటే ఆప్రదేశాన్ని గుర్తించగల్గాను. త్వరలోనే ఆ ప్రదేశం ఎంతో అద్భుతంగా

డెవలప్ అవుతుందని "అన్నారు. (మాస్టర్‌గారు తర్వాత కాలంలో అదే ప్రదేశంలో అద్భుతమైన ఆశ్రమాన్ని 'నిత్యావతార దత్తక్షేత్రం' పేరుతో స్థాపించి, దత్తసాధనలను, దత్తదీక్షలను, దత్తజయంతికి సాధనాశిబిరాలను నిర్వహిస్తూ సహస్రకుండీ యజ్ఞాల్లాంటి కార్యక్రమాలనెన్నింటినో నిర్వహించారు). మాస్టర్‌గారి భవిష్యద్దర్శనానికి ఇదో ప్రత్యక్షసాక్ష్యం.

## అధ్యాయం-9

# 2400 కుండీలతో గాయత్రీ మహాయజ్ఞం – అద్దరోడ్డు

వేటపాలెంలో జరిగిన ఈ ప్రథమపూర్ణాహుతీ మహాయజ్ఞానికి గాయత్రీపరివార్ సభ్యులు యావదాంధ్రప్రదేశ్ నుంచీ వచ్చారు. అలా వచ్చినవారిలో "యుగసంధిప్రభోధం" పత్రికసంపాదకులు శ్రీవిజయభాస్కరరెడ్డిగారు కూడా వచ్చారు. అద్భుతంగా జరుగుతున్న ఆ యజ్ఞాన్ని చూస్తూ, "మేడంగారూ, ఈ మహాయజ్ఞం చూట్టం మన పూర్వజన్మల పుణ్యం. 1000 కుండీలలో అగ్నిదేవుడు జాజ్వల్యమానంగా అలా ప్రకాశించటం చూస్తుంటే ఒక్కసారిగా నా ఒళ్ళుపులకరించి పోతున్నది. చెప్పలేనంత ఆనందంగా" వుందని భావోద్వేగంతో చెప్తూ ఈ క్షణంలో గురుదేవులు నాకొక స్ఫూర్తినిచ్చారు. మేమందరం కల్సి ఇంకా చుట్టు ప్రక్కల గ్రామాలనన్నింటినీ కలుపుకొని 2400 కుండీలతో ఇలానే యజ్ఞం చెయ్యాలనే సంకల్పం ఈ మహాయాగశాలలో కల్గింది. మాస్టర్‌గారితో మాట్లాడి, వారు అనుమతిస్తే యజ్ఞం చెయ్యాలని వుందని చెప్పటం జరిగింది. ఆరోజే వారు మాస్టర్‌గారితో మాట్లాడటం, అనుమతి పొందటం అన్నీ క్షణాలమీద జరిగిపోయాయి.

పృథ్వీపై స్వర్గావతరణ జరగాలనీ, మానవులలో దైవత్వం అవతరించాలనేది గురుదేవుల అకాంక్ష. దాని కొరకే గురుదేవుల జీవితమంతా ఆ సాధనాక్రమంలో నడిచింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని చేసిన ఈ ప్రథమ పూర్ణాహుతికి అనుబంధంగా అద్దరోడ్డులో కూడా చెయ్యాలనే ఆ గ్రామస్తుల ఆకాంక్ష సాకారం కాబోతోంది. 03-03-1996 తేదీ ఆదివారం ప్రకాశంజిల్లా, సంతమాగులూరు మండలంలోని అద్దరోడ్డులో చేయటానికి, ఇనుమడించిన ఉత్సాహంతో ఈ మహాయాగ క్రమానికి సన్నాహాలు అద్భుతంగా జరిగాయి. స్వయంగా మాస్టర్‌గారే, వేదికనలం కరించి ఏకదివశీయ అంటే ఒక్క రోజు జరిగే ఈ యజ్ఞాన్ని బహుముఖీ ప్రజ్ఞతో చేశారు. చుట్టుప్రక్కల

గ్రామాల సహకారంతో, ప్రోత్సాహంతో శ్రీవిజయభాస్కరరెడ్డిగారు, గురుదేవుల ప్రణాళికను విజయవంతంగా పూర్తిచేశారు. మాడం బ్లావెట్స్ వ్రాసిన "గుప్తవిద్య" పై మాస్టర్‌గారిచ్చిన ప్రవచనాలను అచ్చువేయించి తీసుకు వెళ్ళాను, ఈ మహాయజ్ఞంలో దానిని, మహదానందంతో మాస్టర్‌గారు ఆవిష్కరించటం జరిగింది. (ఆ రోజు ఆపుస్తకాన్ని బయటకు తీసుకురాకపోతే, ఇంక థియోసాఫికల్ సొసైటీతో నాకు సంబంధం ఉండదు కనుక ఎలాగైనా అచ్చు వేయించి దానిని తీసుకురమ్మని నాతో ప్రథమపూర్ణాహుతి సమయంలోనే చెప్పారు.) మాస్టర్‌గారి సంకల్పబలంతో సమయం తక్కువగా వున్నా దానిని ఆరోజున ఆవిష్కరించటం అనేది మాస్టర్‌గారిచ్చిన మనోబలమేననిపించింది.

## శక్తి ప్రచోదనా శిబిరం - జాండ్రపేట

ప్రతి సంఘటన వెనుక ఏదో ఒక కార్యకారణ సంబంధం వుండి తీరుతుంది. కాలం ఎప్పుడూ ఒకే రకంగా నడవదు గదా! జీవితం అన్నాక సుఖ-దుఃఖాలు, కష్ట-సుఖాలు, రోగాలు, ఈతిబాధలు ఇలాంటి అనేక బాధలు ఎవరి ప్రారబ్ధకర్మలను బట్టి వారికా పరిస్థితులు ఎదురౌతుంటాయి. అలానే పూర్వజన్మకృతం పాపం వ్యాధిరూపేణ పీడితం, అని పెద్దలంటూవుంటారు. ఏది ఏమైనప్పటికీ హటాత్తుగా మా పెద్దమ్మాయి, భాస్కరవల్లికి బాగా అనారోగ్యం చేసింది. ఆమెకు గుంటూరులో ఒక హాస్పటల్‌ల్లో పదిరోజుల పాటు ట్రీట్‌మెంటు ఇప్పించటం జరిగింది. ఆ సమయంలో మాస్టర్ గారు గుంటూరులో లేనందున వారికీవిషయం చెప్పలేక పోయాం. వల్లీకి కూడా ఏమాత్రం నయం కాలేదు. అందుచేత అక్కడ వైద్యం చేస్తున్న డాక్టర్, మద్రాసుకు తీసువెళ్ళి చూపించమని చెప్తూ అక్కడున్న డాక్టర్‌కు ఒక లెటర్ వ్రాసి ఇచ్చి, హాస్పిటల్ నుండీ డిశ్చార్జ్ చేశారు. ఇంక వెళ్ళబోతుండగా మాస్టర్‌గారు, రామసుబ్బయ్యగారు కార్లో వచ్చారు. ఏమీ మాట్లాకుండా అదే కార్లో మమ్మల్ని ఎక్కించుకొని జాండ్రపేటకు వచ్చేశారు. దారిలో వల్లీని అడిగి వివరాలన్నీ కనుక్కున్నాక ఇలా అన్నారు, "ఇప్పుడు సూర్యుడిలో మచ్చలు వస్తున్నాయి. వాటి వల్ల మానవజాతి అనారోగ్యం పాలౌతుంది. ఈ సూర్యకళంకముల వల్లనే నీ ఆరోగ్యం దెబ్బతింది. (ఇంతకు కొద్ది కాలం క్రిందటనే మాస్టర్‌గారిక్కూడా చాలా సుస్తీనే చేసింది.) ఆవిషయం గుర్తుకు వచ్చి, "మరైతే మీక్కూడానా మాస్టారూ", అంది వల్లీ. "అవును వల్లీ మొదట ఎఫెక్ట్ అయింది మనమిద్దరమే" అన్నారు. ఇంటికి వచ్చిన దగ్గర నుంచీ మాస్టర్‌గారే హోమియో మందులు తెప్పించి, క్రమం తప్పకుండా మందులు వేసేవారు. వల్లీ ఆరోగ్యం కొద్దిగా మెరుగైంది.

ఈ పరిస్థితుల కంటే ముందే వివేకానంద జయంతి, జనవరి 12వ తేదీనాటికి జాంగ్రపేట హైస్కూల్లో మూడురోజుల సాధనాశిబిరం ఏర్పాటు చెయ్యటం జరిగింది. అనుకున్న సమయానికి అన్ని వూళ్ళనుంచీ సాధకులు వచ్చారు.

"శక్తి ప్రచోదన" పేరులోనే సమస్త సాధనల అంతరార్థం – తద్వారా పొందేశక్తి, దాని క్రియాశీలత అంతా అవగతమౌతోందిగదా! ఇదొక విలక్షణమైన సాధనా శిబిరం. పూర్వకాలంలో ఋషులు ఏసాధన చెయ్యాలన్నా అడవులలోనే చేసేవారు. ఎందుకంటే ఆధ్యాత్మిక సాధనలకు, చెట్లకు ఎంతో అవినాభావ సంబంధం వుంది. ఈ హైస్కూల్లోనే సాధనా శిబిరం ఎందుకు పెట్టమన్నారంటే, ఇక్కడ పెద్ద,పెద్ద విశాలమైన చెట్లు చాలా, చాలా వున్నాయి. తద్వారా ఎంత మంది సాధకులు వచ్చినా తలో చెట్టు క్రింద ప్రశాంతంగా కూర్చుని సాధన చేసుకోవచ్చునేది పరమ సత్యం.

మూడు రోజుల పాటు జరిగిన ఈశిబిరంలో మొదటగా గాయత్రీమాత ధ్యాన విధానాన్ని ఎంతో అద్భుతంగా, హృదయానికి హత్తుకు పోయేలా చెప్పారు. దివ్యానుభూతిని కల్గించే ఈసాధన ప్రతీ రోజూ రెండు పూటలా తన్మయత్వంతో చేయించేవారు.

దీని తర్వాత "ఓం"కార సాధన. మొట్టమొదటి సారి ఈ ఓంకార సాధనను ఈ క్యాంప్‌లోనే చెప్పారు. అ – ఉ – మ లు కలిస్తే "ఓం"కారమౌతుంది. దీనితో పాటు విడి, విడిగా ఈసాధన, కేవలం "అ"కారం, "ఉ"కారం, "మ"కారంతో చేస్తే ఏ, ఏ లాభాలు వస్తాయి? నిత్యజీవితంలో ఈసాధనను ఎలా ఉపయోగించుకోవాలి? అనే విషయాలపై అద్భుతమైన అనేక సాధనా రహస్యాలను చెప్పటం జరిగింది. ఇంకో క్రొత్త సాధనను కూడా ఈ క్యాంప్‌లో పరిచయం చేశారు.

**షట్చక్రాలంటే ఏమిటీ?** శరీరంలో వాటి స్థానాలు ఎక్కడున్నాయి? వాటి ఆకారాలు, రంగులు, గుణాలు, వాటి పని తీరు, ఈ విధంగా ప్రతీ ఒక్కదాన్ని గురించీ సావకాశంగా చిన్నపిల్లలకు సైతం అర్థమయ్యేవిధంగా చెప్పారు. ఈసాధనను ఒక్కొక్కరు, ఒక్కొక్క చెట్టును ఆనుకుని నిటారుగా కూర్చుని చేయమని చెప్పారు. వేదిక మీద కూర్చుని సరళంగా అందరికీ అర్థమయ్యే పరిభాషలో సాధకుడు ఆ సాధనలో లీనమైపోయే విధంగా చక్రాల గురించి, వాటిరేకులు–రంగుల గురించి వివరిస్తూ ధ్యానం చేయించారు. ఈసారి క్యాంప్ మొత్తం సాధనలు చేయించటానికే కేటాయించారు. విచిత్రంగా ఈసాధనాక్యాంప్ చివరి రోజు పూర్ణిమ రావటం అద్భుతం. మాస్టర్‌గారు ఈక్యాంప్‌లో

"యూత్ ప్రోగ్రాం" ను కూడా కలిపారు. విశేషంగా యువతకు సరైన మార్గదర్శనం చేయటానికి ప్రత్యేకించి సాయంత్రాలు కేవలం వారి కొరకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. దీనికి "టీం" లీడర్‌గా చీరాల సుబ్బారావుగారి అబ్బాయి, అమ్మాయి, ప్రకాష్, సుమలను నియమించారు. ప్రకాష్‌తో పాటు సుమ ఎంతో ఉత్సాహంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించటానికి పూనుకున్నారు. వారిద్దరు ఆధ్వర్యం వహించి యువత చేత వేర్వేరు విషయాలపై చక్కటి ఉపన్యాసాలను ఇప్పించారు. పూర్ణిమరోజున కూడా పిల్లలచేతనే పూర్ణాహుతి యజ్ఞాన్ని చేయించి వారిలో ఒక ధృఢమైన ఆత్మవిశ్వాసాన్ని వచ్చేలా చేసి చక్కటి స్ఫూర్తినిచ్చారు. అలా ఈ క్యాంప్ వివేకానంద జన్మదినాన్ని పురస్కరించుకొని అటు పెద్దలకు, ఇటు యువతకు ఎవరికి ఏది అవసరమో దానిని ప్రశాంత వాతావరణంలో అందించిన పూజ్యశ్రీ మాస్టర్‌గారికి అందరూ హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకున్నారు.

ఇంకా ఈ క్యాంప్‌లో శక్తిచాలినీ ముద్ర – దానివలన వచ్చే విశేష లాభాలు ఇంకా శ్వాసను షట్చక్రాలలో ఎలా తిప్పాలీ, నేర్పించారు. చెట్లను ఆనుకుని కూర్చుని సాధన చెయ్యమన్నారు, ఎందుకు? దాని ప్రయోజనం కూడా చెప్పారు. చెట్టు ఎప్పుడూ మనిషికంటే కూడా లోతుగా శ్వాసను పీల్చగలుగుతుంది. దాని వలన చెట్టు అనేక లాభాలను పొందుతున్నది. అందువలననే "స్లో డీప్ బ్రీతింగ్" ఎవరు చేయదల్చుకున్నా మంచిగా చెట్లు ఉన్న దగ్గరికి వెళ్ళి చెట్టునానుకొని ఈసాధన చేస్తే ఫలితాలు అనూహ్యంగా వుంటాయి అని పదే, పదే చెప్పి చేయించారు. ఎంతో ప్రశాంతంగా శిబిరం ముగిసింది. తరువాత కొద్దిరోజులకే అంటే 1997 ఫిబ్రవరిలో గాయత్రీ పరివార్ పద్ధతిలో చి. సౌ.సుమంగళి, చి.వల్లభభాయ్‌పటేల్ గార్ల వివాహం ఎంతో ఘనంగా పూజ్యశ్రీ మాస్టర్‌గారి సమక్షంలో రంగ,రంగ వైభోగంగా చేశారు శ్రీసుబ్బారావు దంపతులు. కన్నులపండువుగా జరిగిన ఈ వివాహసంస్కారంతో ప్రేరణ పొందిన అనేక మంది, వారిపిల్లల వివాహాలు ఈపద్ధతిలోనే జరిపించారు.

## గొలగమూడికి ప్రయాణం

గొలగమూడి అనగానే మనకు భగవాన్ శ్రీవేంకయ్య స్వామివారు గుర్తుకు వస్తారు. మాస్టర్‌గారి శిష్యులు శ్రీచంద్రశేఖర్‌గారికి మాస్టర్‌గార్ని గొలగమూడికి తీసుకువెళ్ళి చూపించాలనేది వారి కోరిక. దశ సహస్ర దీప యజ్ఞనిర్వహణ నిమిత్తం ఒంగోలులో వున్న సమయంలో, వారు మాస్టర్

గారిని గొలగమూడికి తీసుకువెళ్ళటానికి ఏర్పాట్లు చేశారు. సరే, మాస్టర్‌గారితో పాటు వల్లీ, చీరాలసీత, నర్సమ్మ, ఇంకా చాలా మంది బయల్దేరారు. ఆరోజు ఉగాది పండుగ. గొలగమూడికి వెళ్ళి శ్రీవేంకయ్యస్వామివార్ని దర్శించుకుని అక్కడనుంచీ సోమశిల, పెంచలకోన, చూసి నేరుగా చౌడేపల్లి వెళ్ళి కాంతమ్మ అవధూతను దర్శించారు. అక్కడ్నుంచీ అనంతసాగరంలో గల నాగమల్లేశ్వర స్వామి సమాధిని దర్శించారు. ఎక్కడ సమాధివున్నా మాస్టర్‌గారు ధ్యానం చేస్తారు. ధ్యానమై బయటకు వచ్చిన తర్వాత అక్కడున్నవారిని ఆ సమాధి గురించిన వివరాలు అడిగారు.

వాళ్ళు చెప్పారు, "ఈ స్వామి 12సంవత్సరాలపాటు భద్రగిరిలో తపస్సుచేశారు. ఒకనాడు శ్రీరామచంద్రమూర్తి వారికి కలలో కనిపించి, "నీవు అనంతసాగరం వెళ్ళు. అక్కడ నీకు రామశిల లభిస్తుంది. నీవు ఇక అక్కడనే ఉండు" అని ఆదేశించారు. వారి గురువు 'శేషముని' అనే సర్పరాజము. వారి సూచనల మేరకు రామశిలను గుర్తించి పూజ, అర్చనాదికములను చేస్తూ అక్కడనే సమాధిచెందారని" చెప్పగా మాస్టర్‌గార్కి, "పాము గురువా?" అన్న ఆలోచన వారి మదిలో మెదిలింది. ఇంతలోనే దారికడ్డంగా ఒక పెద్ద పాము వచ్చి దర్శనమిచ్చింది. దివ్యాత్మ స్వరూపులైన మహాత్ముల అనుమానాలకు సమాధానాలు అలాగే ప్రత్యక్షసాక్ష్యంగా వుంటాయెమో! తర్వాత సోమశిలకు చేరుకొని, అక్కడనుంచీ పెంచలకోన లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకొని మళ్ళీ బయల్దేరి, విశ్వశాంతికై కృషి చేయుచున్న 'మాతావిజయేశ్వరీదేవి'గారి ఆశ్రమాన్ని చేరుకున్నారు. ఆవిడ 'విశ్వశాంతికై ' అందర్నీ గాయత్రీ చేయమని చెప్తున్నారు. వారి ఆశ్రమం పేరు 'శ్రీపురధామం'. ఎంతో అందంగా, ప్రశాంతంగా, దివ్యచైతన్యశక్తి ధారలతో అందరికీ ఆనందానుభూతినిస్తూ నిజమైన 'శ్రీపురధామంగానే' విలసిల్లుతున్నది.

తర్వాత నెల్లూరు, మూలాపేటలో మాకాని వేంకటరావుగారి ఇంటి ప్రాంగణంలో వున్న శ్రీవేంకయ్యస్వామివారి గుడిలోకి వెళ్ళారు. అక్కడ వేంకటరావుగారు, మాస్టర్‌గారి చేత శ్రీస్వామివారి ఉచ్ఛిష్టము, కంబళి, విస్తరాకు, నీళ్ళు త్రాగినచెంబు మొదలైన వాటిని తాకించారు. వల్లీని కూడా తాకమన్నారు. వాటిని తాకుతూనే ఆ అమ్మాయి షాక్ తగిలినట్లుగా అలా పడిపోయింది. తరువాత మాస్టర్‌గారు తననులేపి ప్రక్కన్నే ధ్యానానికి కూర్చోమన్నారు. తను ప్రశాంతంగా అలా కూర్చుండి పోయింది. కాసేపటికి ఒళ్ళో పూలు, ఆల్బం పడ్డట్లనిపించింది. కళ్ళుతెరచి చూచేసరికి అదే ఆల్బంని వేంకటరావుగారు తెచ్చి అందరికీ చూపించారు. ఇంకా ఇలాంటి మరెన్నో విశేషాలతో

ఆ యాత్ర ఎంతో ఆనందదాయకంగా జరిగింది. మాస్టర్‌గారితో వెళితే వచ్చే ఆ అనుభూతులను, ఆనందాన్ని అనుభూతి చెందాలేగానీ, మాటల్లో చెప్పాలంటే అది ఎవరికీ సాధ్యం కాదేమో!!

## తిరుమల యాత్ర

శ్రీమతివల్లీ, శ్రీనివాస్ దంపతులు ప్రతీ సంవత్సరం మే9వ తేదీన తిరుపతి వేంకటేశ్వర స్వామికి కళ్యాణోత్సవం చేయిస్తారు. అది 1997వ సంవత్సరం. ఈసారి మాస్టర్‌గారిని కూడా తిరుమలకు తీసుకువెళ్ళారు. మే 7వ తేదీకి తిరుమలకు చేరుకున్నారు. మాస్టారు తిరుపతికి వచ్చి అప్పటికి 20 సంవత్సరాలైందిట. మే 10వ తేదీ నుంచీ కాకివాయి, శ్రీహంసరామ ఆశ్రమంలో సాధనాశిబిరం ఉన్నది. అలా రెండు సందర్భాలు కలిసి వస్తాయని బయల్దేరారు. తిరుమలకు వెళుతూనే ముందు తలనీలాలు ఇచ్చేశారు. వల్లీ, వాళ్ళబాబు కార్తీక్‌లు కూడా తలనీలాలు ఇచ్చారు. **తలనీలాలు ఎప్పుడు ఇచ్చినా ఏమీ తినకుండానే ఇవ్వాలని చెప్పారు.**

ఆరోజు సాయంత్రం ఖాళీయే కాబట్టి తిరుమలలో వుండే ఏదో ఒక తీర్థాలకు వెళితే బావుంటుందని అందరూ అనుకున్నారు. మాస్టర్‌గారు ఎక్కడికి వెళ్ళినా ముందు చూసేది "సమాధి మందిరాలు". తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామికి అత్యంత ప్రియతమ భక్తుడు హాథీరాంబాబా. వారి సమాధి చాలా ప్రసిద్ధి చెందిన క్షేత్రం. మాస్టర్‌గారు ఇచ్చిన సూచన ప్రకారం దగ్గరే కాబట్టి అందరూ నడుచుకుంటూ హాథీరాంబాబావారి సమాధి మందిరానికి చేరుకున్నారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారికి ఆ సమాధిమందిరం నుంచీ ప్రసరిస్తున్న ఆధ్యాత్మిక దివ్యశక్తిధారలు అంతఃచక్షువులకు గోచరిస్తున్నాయి. ఆ దివ్యకాంతిలో వారు విలీనమైపోయారు. ఆ ప్రదేశంలో వున్న ఒక విశాలమైన చెట్టు క్రిందన అందరినీ ధ్యానానికి కూర్చోమన్నారు. ముందుగా ధ్యానానికి ఎలా కూర్చోవాలీ అనే విషయమై కొన్ని నిర్దిష్టములైన సూచనలనిచ్చారు. ఆ ధ్యానానికి ముందు అక్కడున్న ప్రకృతి, పరిసరాలు, వాటి పవిత్రత శ్రీవేంకటేశ్వరస్వామిపట్ల బాబావారికి గల అనంతమైన భక్తి శ్రద్ధల గురించి చెప్తూ అలా ఇంక ధ్యానాన్ని కొనసాగించారు. దాదాపు అలా అక్కడ ఓ మూడుగంటలపాటు సాధనలో గడపటం అందరికీ ఎంతో శాంతిని చేకూర్చింది. మరునాడు ఉదయం అందరూ స్వామివారి దర్శనానికి వెళ్ళారు. దర్శన సమయంలో మాస్టర్‌గారిని ఎవ్వరు ముందుకు జరగమన లేదు. ప్రక్కకు నెట్టలేదు. విచిత్రం. వారు మాత్రం అక్కడే గర్భగుడిలో ఓ ఐదు నిమిషాల పాటు దర్శనదీక్షలో ఉండిపోయారు. ఆ మరునాడు వల్లీవాళ్ళు కళ్యాణోత్సవానికి వెళ్ళారు. మాస్టర్‌గారు ఏదో పుస్తకం చదువుకుంటూ గెస్టుహౌసులోనే ఉన్నారు.

ఆసాయంత్రానికి వేంకటగిరికి వెళ్ళారు. ఆ రోజు శంకర మఠంలో శ్రీవిద్యను గురించి అద్భుతమైన ప్రవచనం చెప్పారు. శంకరమఠం యాజమాన్యం వారు మాస్టర్‌గారి ప్రవచనానికి ముగ్ధులైపోయారు. ప్రతీ సంవత్సరం ఇక్కడ తమ ప్రవచనాలను ఏర్పాటుచేస్తాం "తమరు రావాలని" ఎంతగానో ప్రాధేయపడ్డారు. ఇంక ఆ మరునాడే శ్రీ హంస రామ ఆశ్రమానికి వెళ్లటం అక్కడ సాధనా శిబిరాన్ని నిర్వహించటం అపూర్వం. ఆ తర్వాత సంవత్సరం మళ్ళీ 1998 మేనెల ఏడవ తేదీ నాటికి యధాప్రకారంగా వల్లీ శ్రీనివాస్‌వాళ్ళతో కలసి మాస్టర్‌గారు తిరుమలకు వచ్చారు. ఈసారి మాస్టర్‌గారి కోసం స్వామివారి ప్రత్యేక "అష్టదళ పద్మ" ఆర్జితసేవకు ముందుగానే టిక్కెట్లు తీసుకోవటం అయిపోయింది. ఏడవతేదీ సాయంత్రం మాస్టర్‌గారు ఏడు మందితో కలిసి స్వామివారి దర్శనానికని గుడి దగ్గరకు వెళ్ళటం జరిగింది. ఈ ఏడు మందిని తీసుకొని స్వామివారి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయటం ప్రారంభించారు. ప్రదక్షిణకు వెళ్ళే ముందు గుడి ముందు నిలబడి చేతులు కట్టుకొని అలా గుడిని చూస్తూ నిలబడ్డారు. ఎందుకో చాలా గంభీరంగా కనిపించారు. ఆయనకి, స్వామివారికి మధ్య ఏదో జరుగుతున్నదని మాత్రం అర్థమౌతున్నది. అదే నిజమైంది. మూడు ప్రదక్షిణలు పూర్తి అయ్యాయి. అంతే ! శ్రీనివాస్‌గారు, గుడికి సంబంధించి నరసింహారావు అనే ఆయనతో కలిసి గుడి దగ్గరికి వచ్చారు. వస్తూనే మాస్టారిని ఇంకా వారితో పాటుగా ఉన్న వారందరినీ వి.ఐ.పి దర్శన ద్వారంగుండా లోపలికి తీసుకుపోయారు. వారే దగ్గరుండి గర్భగుడి దాకా తీసుకు పోయి మంచిగా దర్శనం చేయించి వెళ్ళి పోయారు. ఆరోజున మామూలుగా దర్శనం అయ్యే పరిస్థితి లేనే లేదు. మరి అంత దివ్యమైన దర్శనం అయిందీ అంటే మాస్టర్‌గారికి, స్వామివారికి మధ్య ఏదో అద్భుతం జరిగింది.

మరునాడు "అష్టదళ పద్మ ఆర్జిత సేవకు" టిక్కెట్లు ఉందిగా. ఈసేవ గర్భగుడిలో దాదాపు పదినిమిషాల సేపు జరుగుతుంది. అందుచేత మాస్టర్‌గారు చాలా ప్రశాంతంగా స్వామివారి సేవలో కూర్చోవటం వారిచ్చిన దీక్షను స్వీకరించటం జరిగింది. దర్శనం అయ్యాక సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ అవీ చూడటంతో సరిపోయింది. ఇంతకు ముందు 1997 మే నెలలో వచ్చినప్పుడు వేంకటేశ్వరస్వామి దగ్గర దీక్ష తీసుకున్నారుట. అప్పగించిన పనిని వచ్చే సంవత్సరాని కల్లా పూర్తి చేస్తానని చెప్పారు. ఈ 1998 మే నెలలో మళ్ళీ దర్శనం చేసుకొని, **"స్వామీ ఇంతకు ముందుసారి నీవు చెప్పిన పనిని పూర్తిచేశాను"** అని చెప్పారుట. "వాయించి పడేస్తాడమ్మా, ఈయన. ఈసంవత్సరం లోపల ఎన్ని ఆశ్రమాలు పెట్టించాడు. ఎంత సాధనలు చేయించాడు. ఊపిరి

సలపనివ్వడు. టైం ఎక్కువ ఇవ్వడు" అంటూ అలా, చాలానే చెప్పుకుంటూ వచ్చారు. ఈసారీ అలాగే దీక్ష నిచ్చారు. ఈ సంవత్సరం చాలా కార్యక్రమాలు జరుగుతాయి అన్నారు. (నిజంగానే చాలా యజ్ఞాలు చేయించారు. ఆశ్రమాలు స్థాపించారు. సాధనా క్యాంపులు పెట్టారు. జగజ్జనని అమ్మవారి దర్శనమైంది. అలానే మాస్టర్‌గారి ఇంటినే ఒక ఆశ్రమంగా తీర్చిదిద్దారు. సప్తఋషులను ఆ ప్రాంగణంలోనే ప్రతిష్ఠించారు. నిరంతర గురు సాన్నిధ్య అనుభూతి సాధనా శిబిరాన్ని ఒక సంవత్సరం పాటు నిర్వహించారు.)

ఇవంతా ప్రత్యక్ష నిదర్శనాలు. కానీ అంతరంగంలో జరిగే ఆ సాగరమధనాన్ని దర్శించటానికి, వారి హృదయంలోకి తొంగిచూచి, ఇదీ పరిస్థితి అని అర్థం చేసుకోగలవారెవరైనా ఉన్నారా? ఏమో....? ఇక్కడ ఇంకో ముఖ్యమైన విషయాన్ని చెప్పాలి. అదేమంటే 1998 మే నెలలో 8వ తేదీ రాత్రి 9 గంటలకు అందరినీ తమ కాటేజీ దగ్గరకు రమ్మన్నారు. తిరుమలలో శ్రీవారి దివ్య సమక్షంలో "రామనామ" దీక్ష నిచ్చారు. అదీ కూడా చాలా నిశ్శబ్దంగా ఇచ్చారు. అందరినీ కూర్చోబెట్టి "రాం, రాం, రాం..." అనే నామ జపం చెయ్యమన్నారు. ఎవరు ఎంత జపం చేసిందీ నోట్ చెయ్యటానికి పేపర్లు ఇచ్చారు. అందరూ ఒక గంట జపం చేశారు. అది అయ్యాక ఎవరికైనా రామరక్షాస్తోత్రం వస్తే పాడమన్నారు. అప్పట్లో ఆస్తోత్రం ఎవరికీ రాదు. శ్రీమతికృష్ణకుమారి గారు ఎంతో శ్రావ్యంగా పాడారు. తరువాత రామనవరాత్రులకు 11సార్లు రామరక్షాస్తోత్రం పారాయణ చెయ్యమని చెప్పారు. ఆనాటి నుండీ అది అందరికీ నిత్యపారాయణగా అయిపోయింది. "రామనామం" ఎందుకు చేయించారో తరువాత చెప్పారు. సింగరకొండ క్షేత్రం బాగా అభివృద్ధిలోకి రావటానికి కారణం ప్రక్కనే పారుతున్న నది, ఆ నది కాలుష్యానికి గురైంది. ఆ కాలుష్యనివారణకు ఈ నామజపం ఎంతో ఉపయోగపడుతుందని చేయించారు. సాధనంతా అయ్యాక ఎవరి గదులకు వారు వెళ్ళిపోయారు.

ఈసారీ స్వామివారి దగ్గర దీక్ష తీసుకున్నారుట. స్వామివారే స్వయంగా దీక్ష ఇచ్చారుట. దానికి సంబంధించిన వివరాలేమీ చెప్పలేదు. కానీ ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తాయి. ఈ సాధనా కాలంలో, మజ్జిగ అన్నం మాత్రమే తినాలనుకుంటున్నానని, తీవ్ర సాధనలు చేయవలసి ఉంటుందనీ, ఈ సాధనా కాలంలోనే శ్రీహంసరామ ఆశ్రమం అభివృద్ధి చేస్తాననీ చెప్పారు. తిరుగు ప్రయాణంలో శ్రీనరసింహారావు గారింటికి వెళ్ళి కాసేపు కూర్చొని వాస్తుపరంగా ఆ

ఇంట్లో ఉన్న సమస్యలకు నివారణోపాయాలను చెప్పి వారికి సంతోషాన్నందించారు. స్వామి దర్శనం విషయంలో వారు చేసిన సహాయానికి ప్రతిగా మాస్టర్‌గారు వారింటికి వెళ్ళి వారినీ, వారిగృహాన్ని పావనం చెయ్యటమనేది వారి సహృదయతకు నిదర్శనం. అదీమనం వారినుంచీ నేర్చుకోవలసిన దివ్యవిభూతి. అలా ప్రతీసంవత్సరం మే నెలలో మాస్టర్‌గారు తిరుమలకు రావటం, స్వామివారు ఇచ్చే దీక్షలు తీసుకోవటం, తత్సంబంధమైన పనులను చేయటం లాంటి పరమార్థాలెన్నో అంతర్వాహినిగా జరిగిపోతూ వుండేవి.

1998వ సంవత్సరంలో వెళ్ళినప్పుడు వేంకటేశ్వరస్వామివారు, "నేను కూడా గుంటూరుకు వస్తానన్నారుట". దానికి మాస్టర్‌గారు. "ఇక్కడిలాగా నైవేద్యాలూ, అర్చనలు, పూజలూ అవేమీ అక్కడ ఉండవయ్యా" అన్నారుట. "పరవాలేదు లేవయ్యా నీవు ఉన్నావు గదా" అన్నారుట. అదీ విషయం అని చెప్పారు. అలా శ్రీవేంకటేశ్వరస్వామి, మాస్టర్‌గారి దగ్గరకు రావటానికే నిశ్చయించు కున్నారు. ఒక రోజున ఎవరో తెలియదు, ఒక వ్యక్తి వచ్చి మూడు అడుగుల ఎత్తు వున్న శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని తెచ్చిచ్చి వెళ్ళారు. మరి స్వామివారు తమంత తామే వచ్చేశారు. ఎంతో ప్రేమగా వచ్చిన ఆయనను ఎక్కడంటే అక్కడ ఎలా ప్రతిష్ఠించుతారు. అందుచేత ఆశ్రమానికి దక్షిణ భాగంలో ఉన్న స్థలంలో తిరుమల ఆలయగోపురం నమూనాను తెప్పించి దాని ప్రకారంగా అందంగా "శ్రీనివాసుడి" కి చక్కటి మందిర నిర్మాణాన్ని చేయించారు. ప్రతిష్ఠకు 8 రోజుల ముందు నుంచీ అఖండంగా "సుదర్శన" యజ్ఞాన్ని చేయించారు. అప్పటి వరకు ఎంతో భద్రంగా ఉంచిన ఆ స్వామి వారి విగ్రహాన్ని, అంతా సిద్ధమైనాక మాస్టర్‌గారే స్వయంగా "శ్రీనివాస ప్రతిష్ఠా మహోత్సవ" కార్యక్రమాన్ని రంగ, రంగ వైభోగంగా చేయించారు. ఇంక అప్పటి నుంచీ అర్చనలు, పూజలు, యథావిధిగా జరిగిపోతుండేవి. అప్పటి నుండీ అందరూ అక్కడే మొక్కులు తీర్చుకోవటం, తలనీలాలు ఇవ్వటం చేసేవారు. అలా శ్రీవేంకటేశ్వరస్వామి సప్తర్షి ఆశ్రమం గుంటూరులో కొలువై ఉన్నారు. ఆ స్వామి అనుగ్రహంతోనే సుదర్శన యజ్ఞం చేశారు. ఆ తరువాత రత్నగిరికి వెళ్ళాక అది "శ్రీనివాసవిద్య" గా సాధనా పరంగా రూపొందించారు.

కాలక్రమంలో "ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం" మంత్రానికి సాధనలో భాగంగా ప్రతీ సంవత్సరమూ మే నెలలో వచ్చే పూర్ణిమకు తిరుమలలో సాధనా శిబిరం పెట్టటం ఆచారమైంది. సాధారణంగా మాస్టర్‌గారు ఎప్పుడు తిరుమలకు వచ్చినా, ఆరోగ్యపరిస్థితి ఎలా ఉన్నా అత్యంత,

భక్తి శ్రద్ధలతో ఏడు కొండలూ ఎక్కేవారు. వారితో పాటు వందమందికి పైనే హుషారుగా కొండ ఎక్కేవారు. కొండ ఎక్కేటప్పుడు ఆ ప్రదేశాలలో ఆగి, ఆగి సాధనలు చేయిస్తూ పైకి తీసుకువెళ్ళేవారు. ఒక సాధనా క్యాంపులో శ్రీవారి పాదాల దగ్గర ఉన్న పైన్ (ఆధ్యాత్మిక సాధనకు, ఈ చెట్లు ఎంతో ఉపకరిస్తాయిట). చెట్ల క్రింద ప్రవచనం చెప్తూ ఋగ్వేద సూక్తాన్ని ఆ నెలలో చేయవలసిన సాధనగా ఇచ్చారు. అలానే నామాలగిరి దగ్గర ఒక సాధనను ఇచ్చారు. ఆ తరువాత శ్రీఆంజనేయ స్వామి జన్మస్థలమైన జాపాలీతీర్థంలో ఒక రోజంతా సాధన ఆ తర్వాత యజ్ఞం చేయించారు. అలా మాస్టర్‌గారితో తిరుపతికి అనగానే సాధకులందరిలో ఎక్కడలేనీ చైతన్యం పరవళ్ళు తొక్కుతూ ఒక ప్రభంజనంలాగా ఎగసి పడేది. ఎంతలేని వారైనా తిరుపతికి అనగానే ఎలగోలాగా డబ్బు సమీకరించుకొని ఆయనతో కలసి కొండ ఎక్కుతూ, సాధనలు చేసుకుంటూ, తీర్థాలను దర్శించుకుంటూ జీవితాన్ని పండించుకునేవారు. ఆ ఆనందాన్ని మదిలో దాచుకొని ఎన్నో జన్మల సంస్కారాలకు బీజాలు వేసుకొని, ఆనందంతో ఆ యాత్రా విశేషాలను పదే, పదే పదిమందికీ చెప్పుకుని, మురిసిపోతూ ఆనందమయకోశంలో హాయిగా జీవించేవారు. ఎంతటి మధురాతి మధురమైన జీవితమది. మాస్టర్‌గారితో కలసి సాధనాక్యాంపుల కెళ్ళటమనేది, అదొక మహర్లోకంలో జీవించటం. ఆ అనుభూతి వర్ణనాతీతం. మరి సాక్షాత్ కలియుగదైవం శ్రీనివాసుడికే ఆయనతో కలిసి ఉండాలనిపించిందంటే మనలాంటి వాళ్ళ గురించి ఇంకేం చెప్తాం ? అలా తిరుమలలో చెప్పలేనన్ని సాధనాశిబిరాలను మాస్టర్‌గారు నిర్వహించారు.

## దశసహస్ర దీపయజ్ఞం

పరమగురువుల ప్రణాళికలు ఎంత విచిత్రంగా వుంటాయో ఎవ్వరూ కనీసం ఊహించనైనా ఊహించలేరు. ఒకసారి మాస్టర్‌గారు, శ్రీనారాయణరావుగారి కోరిక మేరకు వరంగల్‌కు వెళ్ళారు. వరంగల్‌లో భద్రకాళీ ఆలయం ఎంతో ప్రశస్థమైనది. శ్రీనారాయణరావుగారు అక్కడ మొట్టమొదటి సారిగా నవకుండీయజ్ఞానికి ఏర్పాట్లు చేశారు. ఆ రోజులలో నవకుండీయజ్ఞమనేది ఒక పెద్దకార్యక్రమముగానే భావించి అందరూ అన్ని విధాల సహకరించేవారు. అనుకున్నట్లుగానే యజ్ఞం ఎంతో దివ్యంగా జరిగింది.

ఆ యజ్ఞమైపోయిన తర్వాత కొన్నాళ్ళకు మాస్టర్‌గారు ఒంగోలుకు వచ్చారు. కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయబడింది. అందులో వారు, "పరమగురువుల ఆదేశంతో ఒక నూతన

కార్యాచరణ ప్రణాళికను అమలు చేయబోతున్నాము. జాగ్రత్తగా వినండి. ఈ కార్యక్రమాన్ని మనం "ఒం"గోలు నుంచే మొదలెట్టాలి" అంటూ మొదలెట్టారు. తక్షణమే మీరు గ్రామ, గ్రామాలకు వెళ్ళి దీపయజ్ఞాల మాధ్యమంగా గాయత్రీమంత్రాన్ని, యజ్ఞాన్ని విస్తృతంగా ప్రచారం చెయ్యాలి. అందరికీ మంత్రదీక్షలనిచ్చి, రోజుకు ఒక రూపాయిని అంశదానంగా తీసి ప్రక్కన ఉంచమని చెప్పాలి. అలా పది వేలమందిని మనం తయారు చేశాక 1008కుండీలు పెట్టి దశసహస్ర దీప యజ్ఞాన్ని చెయ్యాలి. ఇదంతా పరమగురువుల ప్రణాళిక. వెంటనే పని ప్రారంభించాలని సూచన చేశారు. ఆ రోజులలో సీతామహలక్ష్మిగారితో పాటుగా లక్ష్మీరాజగోపాల్, భవానీగారు, లీల, విమల, మలసాని శ్యామల, రంగనాథ్, కిషోర్ మొదలైన వాళ్ళు కూడా యజ్ఞాలుచెయ్యటం, ప్రవచనాలు చెప్పటం చేసేవారు. మాస్టర్‌గారి ఆదేశాలమేరకు జతలు, జతలుగా ఎవరికి వీలైనరీతిలో వాళు ్ళ గ్రామ, గ్రామాలలో దీపయజ్ఞాలు చేయిస్తూ మాస్టర్‌గారి ఆదేశాలను అక్షరాలా పాటిస్తూ ప్రచార కార్యక్రమాలను ఎంతో ఉత్సాహంగా చేయసాగారు. మాస్టర్‌గారిచ్చిన మరొక సూచన ఏమిటంటే ఈకార్యక్రమానికి ఎలాంటి పాంప్లెట్లుగానీ, ప్రచారసాధనాలనుగానీ ఉపయోగించరాదు. మనిషి, మనిషికీ ముఖా, ముఖీగానే ప్రచారం సాగాలని ఖచ్చితమైన నిర్దేశాలనిచ్చారు.

పదివేల దీపయజ్ఞం అంటే మాటలా? ఎక్కడా, ఎప్పుడూ చూసివుండలేదు. అద్భుతమైన ప్రణాళికను చేసే అదృష్టాన్ని మాస్టర్‌గారు కలిగించినందుకు అందరికీ ఎంతో ఆనందంగావున్నది. పనులు చురుకుగానే సాగుతున్నాయి. కార్యక్రమానికి 'డేట్' కూడా ఇచ్చారు. కార్యక్రమం ఇంకో పదిరోజులుందనగా మాస్టర్‌గారు, రామసుబ్బయ్యగారితో కల్సి ఒంగోలుకు వచ్చి శ్రీరంగనాథ్ గారింట్లో ఉంటూ ప్రతీ రోజూ ఉదయం 9-00గం॥లకు గుప్తవిద్య మీద ప్రవచనాలు చెప్పేవారు. సాయంత్రం వేళల్లో కార్లో చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్ళి ప్రచారం చేస్తుండేవారు. దశసహస్రదీప యజ్ఞానికి సమయం దగ్గర పడింది. పి.వి.ఆర్ హైస్కూలు ఆవరణలో యజ్ఞకుండాలు పెడుతున్నారు. ఏర్పాట్లు ఎంతో చురుకుగా సాగుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు ఎందుకు చేస్తున్నారో తెలుసుకోవాలని ప్రెస్సువాళ్ళు వచ్చారు. మాస్టర్‌గారితో అంతా మాట్లాడినతర్వాత, "మాస్టర్‌గారూ, ఇది అసలే "మే"నెల. ఎండలు విపరీతంగా వున్నాయి. ఇంత మండే ఎండలలో ఈ యజ్ఞాన్ని ఎలా చేస్తారని" సందేహాన్ని వెలిబుచ్చారు. వేంటనే మాస్టర్‌గారు, "మీకెన్ని డిగ్రీల ఎండ తగ్గాలో చెప్పండి. యజ్ఞం రోజున మీకలాంటి వాతావరణం వస్తుందని" వాళ్ళకు హామీ ఇచ్చి పంపించేశారు.

ఈ లోపల మాస్టర్‌గారు, 'దేవమాత గౌతమీట్రస్టు' అనే బ్యానరు మీద ఈ మహాయజ్ఞం జరగాలని చెప్పగా దానికి సంబంధించి బ్యానర్లు, కటౌట్లు తయారుచేయించి యజ్ఞశాలలో అందంగా అమర్చిపెట్టారు. యజ్ఞశాల విద్యుద్దీపాల కాంతులతో ఎంతో దేదీప్యమానంగా కళ, కళలాడి పోతున్నది. 16వతారీకు నుంచే అన్నీ గ్రామాలనుంచీ సాధకులు తరలివచ్చారు. ఆరోజు సాయంత్రం భవ్యమైన రీతిలో శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది.

అది 1996వ సంవత్సరం 'మే'17వ తేదీ. ఉదయం నుంచే చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. ఆరోజు ఉదయం ఒంగోలు శ్రీకిషోర్‌గార్కి ఉపనయన సంస్కారం జరిగింది. మాస్టర్‌గారు స్వయంగా వారికి యజ్ఞోపవీత ధారణ చేశారు. మాస్టర్‌గారు తాము ఇచ్చిన మాట ప్రకారం ఆరోజు వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చివేశారు. ఎవ్వరికీ ఎండ భయంగానీ, అలసటగానీ తెలియటంలేదు. సాయంత్రానికి ఎంతో శోభాయమానంగా, అలంకరించ బడిన యజ్ఞవేదిక విద్యుద్దీపాల కాంతితో దేదీప్యమానంగా వెలిగిపోతున్నది. దశ, దిశలూ దేవతలకు ఆహ్వానం పలుకుతున్నాయా అన్న దివ్యవాతావరణం వెల్లివిరిసింది. శ్రీకృష్ణభగవానులవారు ద్రష్టగావుంటూ, అన్ని కార్యక్రమాలకి సారధ్యం వహించినట్లుగా, ఈ యజ్ఞంలో మాస్టర్‌గారు కూడా దూరంగా వుండి యజ్ఞనిర్వహణను నాతో, శ్రీవిజయభాస్కరెడ్డి గార్లతో చేయించి పూర్ణాహుతికి ముందు తమ సందేశాన్ని అద్వితీయంగా చెప్పారు. ఆ రోజు అక్కడొక విచిత్రం జరిగింది. యజ్ఞశాలలో మధ్యభాగంలో ప్రధానయజ్ఞకుండమును ఏర్పాటుచేసి ప్రక్కనే పెద్దకలశాన్ని స్థాపించి వాటి పూజ, యజ్ఞనిర్వహణలను, బాధ్యత గల కొంతమంది స్థానిక కార్యకర్తలకప్పగించటం జరిగింది. అయితే వీరు అక్కడికి వెళ్ళేసరికే ముగ్గురు అందమైన స్త్రీలు, చక్కగా అలంకరించుకోని వచ్చి అక్కడ కూర్చుని వున్నారు. మనవాళ్ళు వెళ్ళి, ఇక్కడ మేము కూర్చోవాలి. దయచేసి మీరు ఆ ప్రక్కనున్న యజ్ఞకుండం దగ్గర కూర్చోమని ఎంతో వినయంగానే అడిగారు. దానికి వారెంతో సున్నితంగానే, "మాస్టర్‌గారే మమ్మల్ని ఇక్కడ కూర్చోమన్నారు. దయచేసి మమ్మల్ని కదపకండి" అని చెప్పి వారి పనిలో, వారు మునిగిపోయారు. యజ్ఞసమయంలో అగ్నిప్రజ్వలన మంత్రం చదివినప్పుడు, ప్రతీకుండం మీద ఎనిమిది దిక్కులలో ఎనిమిది దీపాలు, మధ్యలో రెండు దీపాలను వెలిగించినప్పుడు వాతావరణంలో దైవీ చేతనత్వపు సుగంధపరిమళాలను వెదజల్లింది. దివ్యంగా, భవ్యంగా, ప్రశాంతంగా యజ్ఞం అయిపోయింది. ప్రసాదవితరణ కూడా అయిపోయింది.

ఇంటికి వచ్చాక మాస్టర్‌గారు, "హమ్మయ్య, యజ్ఞం (సక్సెస్) విజయవంతం అయింది. మీ అందరి కృషి ఫలించింది. పరమగురువులు కోరిన విధంగా, "షో ఆఫ్ స్ట్రెంగ్త్ "అంటే సమూహాన్ని, అంచెనాలకి మించి చూపించ గలిగామని చాలా ఆనందపడిపోయారు. జమా, ఖర్చులను కూడా యజ్ఞానికి ముందే చూపించారని, కార్యకర్తలనెంతో అభినందించారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన, శ్రీలక్ష్మినారాయణగారి దంపతులు ఇంకా వారితో సహకరించిన కార్యకర్తలందరు, నిజంగా ఎంతటి పుణ్యాత్ములో! మాస్టర్‌గారితోపాటు పరమగురువులందరి ప్రత్యేక ఆశీర్వాదాలు వారికెప్పటికీలభిస్తాయి. అనుకున్నదానికంటే ఎంతో వైభవంగా దశసహస్రదీపయజ్ఞం అయిపోయింది.

భవిష్యత్తులో మాస్టర్‌గారు రచించబోయే మహత్తరప్రణాళికలకిది ఒక చిన్న శిలాన్యాస కార్యక్రమమని తర్వాత, తర్వాత అర్ధమైంది. ఇక్కడ మీ కొక చిన్న సత్యాన్ని తెలపాలి. యజ్ఞసమయంలో ప్రధానయజ్ఞకుండం దగ్గర కూర్చున్న "ముగ్గురుస్త్రీల" ప్రస్తావన వచ్చి, "వాళ్ళెవరు మాస్టారూ! మేము ఎప్పుడూ చూడలేదు అని" ఆ కార్యకర్తలు అడిగారు. దానికి మాస్టర్‌గారు, 'అవును నేనూ చూశాను'. అంతమాత్రమే చెప్పి నవ్వి వూరుకున్నారు. అర్ధమైపోయింది. ముగ్గురమ్మలు, ముచ్చటగా వచ్చి ఆ మహా యజ్ఞంలో పాల్గొని ముగ్ధమనోహరంగా మానవజాతి మొత్తంమీద ఆశీస్సుల వర్షం కురిపించారని అర్ధం అయింది.

## ఓడరేవులో సాధనాశిబిరం

దశ సహస్రకుండీయ మహాయజ్ఞం అయిపోయిన మర్నాడు ముందు అనుకున్న ప్రకారంగా మాస్టర్‌గారు, నాతో పాటు జాండ్రపేటకు వచ్చారు. జాండ్రపేట చాలా పల్లెటూరు, ప్రశాంతంగా చెట్ల మధ్యన ఆశ్రమంలాగా వుండే ఆ చిన్న ఇల్లంటే మాస్టర్‌గారికి ఎంతో ఇష్టం. మే నెల 22వ తారీకు నుంచీ ఓడరేవులో సాధనాక్యాంప్ వుంది. నాలుగు రోజులిక్కడ విశ్రాంతి తీసుకుని మళ్ళీ అక్కడ సాధనాక్యాంప్ చేయవచ్చని అందరూ జాండ్రపేటకు రావటం జరిగింది. భోజనం చేసి మాస్టర్‌గారు ప్రశాంతంగా నిద్ర పోయి లేచారు. అందరం కాఫీ తాగుతూ ఉండగా, "ఇందాక నాకొక ఆలోచన వచ్చింది." అది "ప్రథమపూర్ణాహుతీ యజ్ఞానికి వ్రాయించిన 24లక్షల మంత్ర లేఖనాలు వున్నాయి గదా! వాటిని భూగర్భంలో స్థాపించి దాని మీద గాయత్రీ స్థూపాన్ని నిర్మించాలి. ఇంక ఇక్కడి నుంచే మన కార్యక్రమాల ప్రణాళికలు విస్తరించబోతున్నాయి. మనం కార్యక్రమాలు

చేసుకోవటానికి ఒక కేంద్రం కావాలి. దాని కోసం మనకో స్థలం కావాలి. అయితే ఆ స్థలాన్ని మనం కొనకూడదు. ఎవరైనా దానిని ప్రేమతో ఇవ్వాలి, అప్పుడే ఆ కార్యక్రమాలకు సాఫల్యం చేకూరుతుంది. ఎక్కడైనా అలా దొరుకుతుందేమో చూడు" అని చెప్తూ అది మళ్ళీ ఎప్పుడో కాదు, వచ్చే గురుపూర్ణిమనాటికి మనం అక్కడ కార్యక్రమం చేసుకోవాలి, అంటూ నియతితో కూడిన నిర్దేశాలనివ్వటం జరిగింది. "చూస్తాను మాస్టర్‌గారూ" అన్నాను. అన్నానే గానీ అంత పెద్ద పని చేయగల సామర్థ్యం నాకు వున్నదా? ఎలా? అయితే ఒక ధైర్యం మాత్రము ఉన్నది. మాస్టర్‌గారు సర్వసమర్థులు. సర్వశక్తి సంపన్నులు. వారు అనుకున్నారంటే కచ్చితంగా అది జరిగితీరుతుంది. మనల్ని కేవలం నిమిత్త మాత్రంగా అడ్డు పెట్టుకుంటారు అంతే ! అలా అని మనం నిర్లక్ష్యంగా వున్నామూ అంటే పప్పులో కాలేసినట్లే. "కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచనా" అన్నట్లు పని చేయటం మన వంతు అంతవరకే అనుకొని మనస్సులో, దాని నెలాగైనా సాధించాలనే సంఘర్షణ ప్రారంభమైంది. ఆ స్థలం కొరకు వెతుకులాట ప్రారంభించేశాం. ఒక గట్టిధైర్యం. మాస్టర్‌గారు చెప్పారూ అంటే ముందుగానే వారు దాని ప్రణాళికను సిద్ధం చేసి వుంటారు. ఇంక అక్కడ చేయవల్సిందల్లా ఒక్క మానవ ప్రయత్నం మాత్రమే. దానిని త్రికరణశుద్ధితో కనుక చేయగల్గితే పని దానంతట అదే జరిగిపోతుంది. కానీ మార్గ మధ్యంలో అనేక అవరోధాలనేవి ఖచ్చితంగా వచ్చితీర్తాయి. చేయలేమనే నిస్పృహ కూడా వస్తుంది. పట్టుదలతో వీటిని దాటగల్గితే, పరమగురువుల ఆశీర్వాదాలు మనలను ముందుకు నడిపిస్తాయి అనే గట్టి విశ్వాసంతో నేను పని మొదలు పెట్టాను. ఏపని చేస్తున్నా "సుషుప్తమనస్సులో" ఇదే ఆరాటం. ఎంత మందితో కల్సి ఎన్నిరకాలుగా చెప్పినా, ఆశాజనకమైన సమాధానం రావటంలేదు. ఓడరేవుకు వెళ్ళే ముందు రోజున శ్రీమతి ప్రసూనాంబ గారి అబ్బాయి శ్రీనివాస్ వివాహానికి మాస్టర్‌గారు వాళ్ళ ఊరుకు వెళ్ళారు. వధూవరులను ఆశీర్వదించి తిరిగి వచ్చే ముందు మాస్టర్‌గారు కారెక్కుతూ ప్రసూనాంబగారితో, 'రేపు క్యాంపుకు రండి' అని చెప్పి కారెక్కారు. ఇంక ఆ మరునాడే సాధనా శిబిరానికని మాస్టర్‌గారు ఓడరేవుకు వెళ్ళిపోయారు.

ఈ సాధనాశిబిరంలో పాల్గొనాలని శ్రీమతి ప్రసూనాంబగారు జాండ్రపేటకు వచ్చారు. ఆ రాత్రంతా మేమిద్దరం ఈ స్థలం ఎలా సాధించాలనే ఆలోచించసాగాం. ఇంతలో నేను 'మీ బంధువులలో ఎవరో మినిష్టర్‌గారున్నారు గదా. వాళ్లనడిగితే పని అవుతుందేమో. ప్రయత్నించుదామా?' అన్నాను. దానికామె, 'వాళ్లతో కూడిన పని అంత తొందరగా కాదు రాజ్యలక్ష్మిగారు. ఆ రకంగా పని

కావటం చాలా కష్టం. ఒక పని చేద్దాం. కాకివాయిలో మాకున్న తోటలోనుంచీ ఐదు ఎకరాలు ఇస్తాము. మాస్టర్‌గారికి చెప్పండి', అన్నారావిడ. సరే కొంచెం మార్గం దొరికింది. ఏదైనా దైవాను గ్రహమేగదా! మాస్టర్‌గారికి చెబుదామని ఉదయాన్నే ఇద్దరం చీరాలకు వెళ్ళాం. సాధనాశిబిరంలో కాస్త విరామ సమయంలో, మెల్లగా ఆశ్రమానికి స్థలం ఇచ్చే విషయాన్ని ఇద్దరం కల్సి చెప్పాం. మాస్టర్‌గారేం మాట్లాడలేదు. 'సరే' అన్నట్లు నవ్వి ఊరుకున్నారు. ఆ ప్రస్తావన అక్కడ ఆగిపోయింది. మేమనుకున్నంత స్పందన మాస్టర్‌గారిలో ఏ మాత్రం కనబడలేదు.

ఓడరేవు క్యాంప్ అయిపోయాక మాస్టర్‌గారు గుంటూరు వెళ్ళిపోయారు. ఇంక మామూలుగా కాలేజీకి వెళ్ళిరావటం, రోజువారీ కార్యక్రమాలతో కాలం జరిగిపోతున్నది.

ఒక రోజున నన్ను, మా వారిని గుంటూరుకు రమ్మని మాస్టర్‌గారి దగ్గర్నుంచీ కబురు వచ్చింది. ఇద్దరం వెళ్ళాం. అప్పటికే శ్రీరామసుబ్బయ్యగారు వచ్చి వున్నారు. మాస్టర్‌గారు చాలా హుషారుగా వున్నారు. మామూలు మాటలంతా అయ్యాక అప్పుడన్నారు మాస్టర్‌గారు, ఈ మధ్య మార్కాపురం నుంచీ శ్రీసునందనరావుగారు కాలేజీకి వచ్చి, 'మాతోటను ఆశ్రమానికి ఇస్తాం మాస్టారూ. రిజిస్ట్రేషన్ ఎప్పుడు చెయ్యమంటారు' అని చెప్పటానికి రెండుసార్లు వచ్చివెళ్ళారు. వాళ్ళ వైపు నుంచీ అంతా క్లియర్‌గా వుంది. ఇంక మనమే పని మొదలు పెట్టాలి. ఇంక మీరు, మీరూ మాట్లాడుకొని ఏం చెయ్యాలో చూడండని చెప్పి లోపలికి వెళ్ళి పోయారు. ఆ రోజు అక్కడ మాస్టర్‌గారి చెల్లెలు లక్ష్మి ఉన్నది. అంతలో ఆవిడ అందరికీ కాఫీలు తెచ్చి ఇచ్చి కాసేపు కబుర్లు చెప్పి లోపలికి వెళ్ళి పోయింది.

మాస్టర్‌గారు మళ్ళీ తిరిగి వచ్చి, 'ఈ గురుపూర్ణిమకే మనం అక్కడ కార్యక్రమం చెయ్యాలి. చూడు రామసుబ్బయ్య రెండు, మూడు రోజులలోనే కాకివాయికి వెళ్ళిపోయి, ఆస్థలాన్ని పరిశీలించి, ఆ స్థలానికి ఆగ్నేయంలో 14 కుండీలు పెట్టి అందులో యజ్ఞం చెయ్యాలి. ఆస్థలంలో ఎక్కడా ఏమీ తాక వద్దు. కనీసం ఒక్క ఆకు ముక్క కూడా తెంపకూడదు, సరేనా అంటూ అనేక జాగ్రత్తలు చెప్పి పంపించారు.

# IV క్షేత్రములు – శక్తి

## అధ్యాయం-10

## శ్రీ హంసరామ ఆశ్రమానికి శ్రీకారం

ఒక శుభముహుర్తాన నేను, రామసుబ్బయ్య, భవానీగార్లు నెల్లూరుజిల్లాకు 65కి.మీ.దూరాన ఉన్న కాకివాయి గ్రామానికి వెళ్ళాం. అప్పటికే శ్రీ సునందనరావు, ప్రసూనాంబగార్లు వచ్చి తోటను కొంత శుభ్రం చేయించి 14 కుండీల యజ్ఞానిక్కావల్సిన వస్తువులను ఏర్పాట్లను, ఇంకా కొంత మంది మనుషులతో కార్యక్రమాన్ని చేయటానికి సిద్ధంగా వున్నారు. ఇంక వీళ్లు వెళ్తూనే మాస్టర్‌గారిచ్చిన ఆదేశాల ప్రకారం ఆశ్రమానికి వారిచ్చిన స్థలానికి ఆగ్నేయంలో 14 కుండీలను పెట్టాం, ఈశాన్యంలో ఒకబిందె నీరు పెట్టి యజ్ఞం చేశాం. యజ్ఞమంతా పూర్తి అయ్యాక అభిషించన మంత్రాలతో మొత్తం ఆశ్రమంలో నీళ్ళు చల్లాం.

సాయంత్రానికల్లా స్థలం కొలతలు, ఎక్కడ ఏమున్నదీ అంతా కాగితం మీద యధాతధంగా వ్రాసుకొని శ్రీరామసుబ్బయ్యగారు గుంటూరుకు వెళ్ళారు. వెళ్ళిన వెంటనే, మాస్టర్‌గారికి ఆశ్రమానికి ఇచ్చిన స్థలం గురించి వివరించడం జరిగింది. ఆశ్రమం గురించి చెప్తున్నప్పుడే మాస్టర్‌గారి అంతరంగంలో ఆ స్థలవైభవం దర్శనమైనది. భౌతికంగా ఆ స్థలాన్ని చూడడానికి మాస్టర్‌గారు రాలేదు కానీ వారి దివ్యదృష్టికి అది ఏనాడో దర్శనమైపోయివుంది. అంతా విన్న తరువాత ఈసారి గురుపూర్ణిమ కార్యక్రమాలను మనం నూతన ఆశ్రమ ప్రాంగణంలో చేసుకుందాం. త్వరగా అన్ని ఏర్పాట్లు జరిగేలా ప్లాన్ చెయ్యండి. పరివార్ సభ్యులందరినీ ఈ గురుపూర్ణిమ సాధనకు కాకువాయికి రావాలని చెప్పమని శ్రీరామసుబ్బయ్యగారికి చెప్పారు.

గురుపూర్ణిమకి రెండురోజుల ముందుగానే మాస్టర్‌గారు, మరి కొంతమంది కార్యకర్తలు కాకివాయికి చేరుకున్నాం. ముందు స్థలాన్ని అంతా ఒక్కసారి తిరిగిచూశారు. ఆ తరువాత మాస్టర్

గారు ఒక్కరే ఆ స్థలంలో అణువణువును పరిశీలించికుంటూ, చూసుకుంటూ తిరిగారు. మధ్యాహ్నం అందరినీ సమావేశపరచి అక్కడ చేయవలసిన కార్యక్రమాలను గురించి, నిర్మాణాలను గురించి పూర్తిగా వివరించారు. ఆ మరునాడు ఉదయం నుంచే సాధకులే మాస్టర్‌గారి సూచనల ప్రకారం పంచతత్వాలకు ప్రతీకలుగా నలుచదరపు ఆకారాలతో నాలుగు దిక్కులలోను నాలుగు మట్టిదిమ్మలను, మధ్యలో ఒక పెద్ద దిమ్మెను ఏర్పాటుచేశారు. ఇంక ఆ శిబిరంలో ఎలాంటి ప్రవచనాలు కానీ, సాధనలు కానీ చెప్పలేదు. మాస్టర్‌గారి పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

గురుసమర్పణ జీవితానికి కావలసిన మానసికస్థితిని శ్రమదానం ద్వారా చేయించారు. స్త్రీలందరూ భోజన, వసతి సౌకర్యాలు చూసుకుంటే, పురుషులంతా ఆ స్థలంలో ఉన్న ముళ్ళచెట్లను కొట్టి, నేలంతా చదును చేసే సేవను చేశారు. ఆ ప్రాంతంలో విపరీతమైన ముళ్ళు ఉండి అవి కాళ్ళలో దిగుతుండేవి. దానికి మాస్టర్‌గారు ఆ ముళ్ళు గుచ్చుకోవడం వల్ల మీ కర్మలన్నీ పోయాయి అని చెప్పారు. ఆ క్యాంపులో అందరితో మాస్టర్‌గారు చేయించిన సాధన అదే. మాస్టర్‌గారి సాధన పూర్తిగా అలౌకికజగత్తుతో మిళితమైవుండేది. వారి దృష్టి ఎప్పుడూ ఏదో లోకాలలో దేనినో చూస్తున్నట్లుగా ఉండేది. ఒక విధమైన డివైన్ డిసెంట్ వారి ముఖంలో తాండవిస్తుండేది.

గురుపూర్ణిమ నాడు త్రిముఖీగాయత్రీతో పాటు దత్తాత్రేయులవారి నిలువెత్తు చిత్రపటాలను (శ్రీమల్లిఖార్జునరావుగారు తెచ్చినవి) ఆశ్రమస్థలంలో ఈశాన్యంలో స్థాపించి గురుపాదుకాస్తవం చదివించారు.

**ఓం దత్తాత్రేయాయ విద్మహే గాయత్రీశాయ ధీమహి తన్నో గురుఃప్రచోదయాత్ ॥**

అను దత్తగాయత్రీ చేయించారు. ఆ రోజే ఆశ్రమానికి 'శ్రీ హంస రామ ఆశ్రమం' అని నామకరణం చేశారు. ఇప్పుడు ఎక్కడైతే పంచముఖ శివలింగాన్ని ప్రతిష్ఠించారో ఆ ప్రదేశంలో అఖండ దత్త, గాయత్రీ సాధనలను నిర్విరామంగా చేయించారు. తరువాత అదే రోజు సాయంత్రం అదే ప్రాంగణంలో మట్టిలోనే లోతుగా 40 గుంటలు త్రవ్వించారు. 40 మందితో 40 దీపాలు పెట్టించి యుగయజ్ఞం చేయించారు. తరువాత ఆ గుంటలను మూయించారు.

ఇప్పుడెక్కడైతే పంచముఖీ శివలింగాన్ని స్థాపించారో ఆ స్థలంలో 24 గాయత్రీ, 16 దత్త చేతనత్వాలకు ప్రతీకపూజలు చేయించారు. 40మందితో సాధన చేయించారు. ఆ తరువాత శ్రీ-హంస-రామ ఆశ్రమాన్ని తమ భవిష్యత్ కార్యక్రమాలను కేంద్రంగా ఏర్పరుచుకొని గురుపూర్ణిమ

నుండి అన్ని ఆశ్రమాలకు అవసరమైన నర్సరీని, మొక్కలను అక్కడ తయారుచేసి తరువాత సమయం వచ్చినప్పుడు వాటిని ఏ క్షేత్రంలో ఎక్కడ నాటాలో దానిని అక్కడ నాటడం జరిగింది. తరువాత 2007 వసంవత్సరంలో పంచముఖీ శివలింగాన్ని ప్రతిష్ఠించి దానిని మహాకాలక్షేత్రంగా ప్రకటించారు.

కాకివాయి ప్రాంతంలో నిమ్మతోటలు ఎక్కువ. కానీ నీటి సమస్య చాలా ఎక్కువ. దాదాపు నూటయాభై, నూట అరవై అడుగుల లోతుకు బోరింగ్ వేసినా నీరు పడదు. కానీ ఈ ప్రదేశంలో ఆశ్రమం పెట్టాక మాస్టర్‌గారు చూపించి టెంకాయ కొట్టిన స్థలంలో సునందనరావుగారు బోరు వేయిస్తే కనీ, వినీ ఎరుగని రీతిలో గంగామాత ప్రవాహం పరవళ్ళు త్రొక్కుతూ పైకి వచ్చింది. ఆ దెబ్బకి అటు స్థల దాతలకు, ఇటు ఆశ్రమానికి పుష్కలంగా నీరు పడింది. అది గురువుగారి అనుగ్రహం, మాస్టర్‌గారి ఆశీర్వచనం మాత్రమే తప్ప మరొకటి కానే కాదు.

## త్రిముఖీ గాయత్రీ

1996 సంవత్సరం మార్చి 24వతేదీ. ఆ రోజు రాత్రి మాస్టర్‌గారికి ఒక విచిత్రమైన దివ్య దర్శనం కలిగింది. ఆకాశంలో ఒక తోకచుక్క, అందులో నుండి దేదీప్యమానమైన తేజస్సుతో ఆరుచేతులలో దివ్యాయుధాలతో త్రిముఖీ గాయత్రీమాత దర్శనమిచ్చింది. దర్శించిన ఆ రూపాన్ని వివరించి అప్పటికప్పుడే ఆ బొమ్మను గీయించారు. త్రిముఖీగాయత్రీతో పాటు దత్తాత్రేయుల వారి నిలువెత్తు ఫొటోలను చేయించారు. ఈ రెండు చేతనత్వాలు ఒకదానికొకటి పూరకాలు. ఆ రెండు దేవతాశక్తుల మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని 'ఓం దత్తాత్రేయాయ విద్మహే గాయత్రీశాయ ధీమహి తన్నో గురుః ప్రచోదయాత్॥' అనే దత్తగాయత్రి నిర్వచిస్తుంది.

త్రిముఖీగాయత్రీలో పరుశువేది, కల్పవృక్షము, కామధేనువుల విరాట్‌రూపాన్ని అందులో నిక్షిప్తం చేయడం జరిగింది. బ్రాహ్మి, వైష్ణవి, శాంభవి శక్తుల ఏకీకృత రూపమే త్రిముఖీగాయత్రి. ఇక్కడ బ్రాహ్మీశక్తి అంటే ప్రకృతిలో ఉన్న సమస్తశక్తులను సృజనాత్మకంగా మలిచే సామర్థ్యాలను సాధకుడు పెంచుకుంటాడు. రెండవ ముఖము వైష్ణవీశక్తి. ఇక్కడ పనికిరాని అనవసరమైన పదార్థాలు, శక్తులు ఏవైతే ఉంటాయో వాటిని నాశనం చేస్తూ సద్భావనలను, సత్కర్మలను ప్రోదిచేసుకుంటాను అనే సంకల్పం తీసుకోవాలి. ఇక మూడవది శాంభవీశక్తి. ఇందులో మనం తెలుసుకోవలసినది ఏమిటంటే శాంభవీ శిరస్సులో నుండి వచ్చే జ్ఞానగంగ, మనకు అర్థనారీశ్వర తత్వాన్ని గురించి

చెప్తుంది. త్రిముఖీగాయత్రీ సాధన సాధకునిలో ఈ మూడు శక్తులను ఉద్దీపన చేస్తుంది. త్రిముఖీ గాయత్రీతో పాటు మాస్టర్‌గారు దత్తాత్రేయులను కూడా దీనితో కలిపారు. దత్తాత్రేయుల వారు అంటే బ్రహ్మ, విష్ణు మహేశ్వర శక్తుల ఏకీకృత స్వరూపమైన ఆదిగురువు అవతారం. ఈ రెండు సాధనావిధానాలను మెల్లమెల్లగా సాధనాశిబిరాల ద్వారా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. ఒకదాని కొకటి పూరకాలైన ఈ రెండు చేతనత్వాలు సంపూర్ణమైన అవినాభావ సంబంధం కలిగిన పరబ్రహ్మ తత్వాలు. అందుకే దత్తాత్రేయాయ విద్మహే... మంత్రాన్ని ఉపాసనకు ఇచ్చారు. ఇక్కడ త్రిముఖీ గాయత్రీ, దత్తాత్రేయులవారి ఆగమన విశేషాన్ని చెప్పాలి.

సహస్రదీప యజ్ఞ నిర్వహణార్ధం మాస్టర్‌గారప్పుడు ఒంగోల్లో శ్రీరంగనాథ్‌గారింట్లోనే ఉన్నారు. ఆ రోజు ఉదయం కార్యక్రమాలు అయ్యాక మధ్యాహ్నం భోజనం చేసి పడుకుని నిద్రపోయారు. హటాత్తుగా నిద్ర లేచి, “మనం వెంటనే సీతామహలక్ష్మిగారింటికి వెళ్ళాలి” అంటూ గబ, గబ చెప్పులు వేసుకొని అంత ఎండలో బయల్దేరి వెళ్ళారు. సీతమ్మగారింట్లోకి వస్తూనే, “ఆరతికి సిద్ధం చెయ్యండి, దత్తస్వామీ, త్రిముఖీగాయత్రీ మాత చిత్ర పటాలు వస్తున్నాయని” చెప్పి బయటే కూర్చున్నారు. (ఏ విధమైన ఫోను రాలేదు. మనుషులెవరూ వచ్చి చెప్పలేదు. కానీ సరిగ్గా ఆ దేవతామూర్తులను ఆహ్వానించటానికి స్వయంగా మాస్టర్‌గారే రావటం చాలా ఆశ్చర్యం కలిగింది). నిలువెత్తు ఫోటోలు అవి. మంచి ఆర్టిస్టు చేత శ్రీఘటకాల మల్లికార్జునరావుగారు, నర్సరావుపేటలో వేయించారు. అవి ఫొటోలనిపించటం లేదు. ఎంతో జీవకళ ఉట్టి పడుతున్నది ఆ ఫోటోలలో. ఆ ఫోటోలను ముందుగా ఒంగోలులో శ్రీమతి సీతమ్మక్కింటికి తీసుకు వచ్చారు. మాస్టర్‌గారు ఎదురేగి ఎంతో ఆదరంగా వారిని లోపలి తీసుకువచ్చి లోపల పెట్టించి, దీపం వెలిగించమన్నారు. ఆ తరువాత వెలిగించిన అగరుబత్తీలను తామే తీసుకొని దీర్ఘచతురస్రాకారంగా మూడుసార్లు తిప్పి నమస్కారం పెట్టుకున్నారు. మాస్టర్‌గారితో పాటు అందరూ నమస్కారాలు పెట్టుకున్నారు. పండ్లు నివేదన చేయించారు. ఆ ఫోటోలను అంత అందంగా తయారు చేయించిన శ్రీమల్లికార్జునరావు గారిని ఎంతో అభినందించారు. (ఈ మల్లికార్జునరావుగారే తరువాత కాలంలో శ్రీ సొరకాయల స్వామి, జగజ్జనని మహాయోగేశ్వరీ దేవీ ఫొటోలను మాస్టర్‌గారు చెప్పినట్లుగా చేయించి వారి మన్ననలను పొంది జీవితాన్ని ధన్యం చేసుకున్నారు.) తరువాత దశ సహస్రదీప యజ్ఞంలో వాటినావిష్కరించారు. ఈ ఫోటోలనే తర్వాత శ్రీహంసరామ ఆశ్రమానికి తరలించారు. అక్కడ వారికి ప్రాణ ప్రతిష్ఠను చేశారు. ఇంక ఆనాటి నుంచీ దత్త, త్రిముఖీ గాయత్రీ సాధనను ప్రారంభించారు.

## దాదాగురుదేవుల లీల

ఆ మధ్య కాస్త బాగానే ఉంది వల్లీకి. మళ్ళీ అనారోగ్యంతో బాధపడుతోంది. మద్రాసు డాక్టర్లు ఏడు నెలలు ట్రీట్మెంటు ఇచ్చి నయం కాక, ఇంక మావల్ల కాదని వదిలి వేశారు. ఇంక మాస్టర్‌గారు చెప్పారు వల్లీని నాదగ్గర ఉంచండి అని. (వల్లీ 8 సంవత్సరాల పిల్లగా ఉన్నప్పట్నుంచీ మాస్టరుగారితో అనుబంధం. అందుకే వారితో అంత చనువుగా ఉండేది.) అప్పుడు మా మనవడు కార్తీక్‌కి 2 సంవత్సరాలు. ఇద్దరూ మాస్టర్‌గారి దగ్గరే ఉన్నారు. ఆసన, ప్రాణాయామాలు, పచ్చికూరలు ఆహారం, వీటితో పాటు హోమియోమందుల వైద్యం జరుగుతున్నది. మాస్టర్‌గారు కాలేజీకి వెళ్ళిపోతే ఇంక సాయంత్రందాకా పుస్తకాలు చదువుకోవటం, పిల్లాడిని చూసుకోవటం మళ్ళీ మాస్టర్‌గారు వచ్చేసరికి టిఫిన్ ఏదో ఒకటి చేసి పెట్టటం అలా జరుగుతుండేది.

ఒకరోజున మాస్టర్‌గారు కాలేజీకి వెళుతుంటే, "మాస్టర్‌గారు, ఇవాళ పిన్ని వాళ్ళింటికి వెళ్ళి, మళ్ళీ మీరు వచ్చేసరికి ఇంటికి వచ్చేస్తాను" అన్నది. సరేనని చెప్పి మాస్టర్‌గారు కాలేజీకి వెళ్ళిపోయారు. సరే, గబ, గబా ఇల్లు సర్దుకొని ఇంటికి తాళం వేసి ఆటోలో వాళ్ళ పిన్ని కృష్ణకుమారి గారింటికి బయల్దేరింది. మాస్టర్‌గారి కాలేజీ మీదుగా బ్రాడీపేటకు వెళ్ళాలి. ఎదురుగా మాస్టారు బండి మీద ఇంటికి వచ్చేస్తున్నారు. వేంటనే ఆటో ఆపించుకొని మాస్టర్‌గారి దగ్గరకువెళ్ళి, "మాస్టారూ, ఏమైంది" అని అడుగుతుండగానే, "తాళాలు ఇవ్వమ్మా" అంటూ తాళాలు తీసుకొని రివ్వున వెళ్ళి పోయారు. సరే, వల్లీ కాసేపు వాళ్ళపిన్ని కృష్ణకుమారి దగ్గర ఉండి సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చేసింది.

ఇంట్లోకి వెళ్లగానే ఇల్లంతా ఏదోకళతో, చాలా శుచిగా, శుభ్రంగా ప్రశాంతంగా ఉంది. "మాస్టారూ ,ఇంట్లో ఏదో మార్పు కనిపిస్తున్నదే" అన్నది వల్లీ. "అవునమ్మా ఇల్లంతా వెతికి, వెతికి దుమ్ముదులిపాను" అన్నారు. "ఎందుకండీ" అన్నది. "దాదాగురుదేవులు వచ్చారుకదా, మరి ఆయన వచ్చేసరికి ఇల్లు ఎలా ఉండాలి? అందుకే ఇల్లంతా క్లీన్ చేశాను" అన్నారు. "అవునా మాస్టారు, మరి నేను వెళతాను అంటే ఎందుకు వెళ్ళనిచ్చారు, ఉంటే నేను ఇవంతా చేసేదాన్ని, ఇంకా దాదాగురుదేవులను చూసేదాన్ని గదా" అన్నది వల్లీ. దానికి మాస్టర్‌గారు, "నాకూ తెలయదమ్మా, కాలేజీకి వెళ్ళే సరికి పిల్లలు బాయ్‌కాట్ చేస్తున్నారు. అందరూ ఇళ్ళకు బయల్దేరారు. సరే, నీవు లేవు గదా సాయంత్రందాకా జె.బి. శాస్త్రిగారి (మాస్టరుగారి కొలీగ్, ఆప్తులు కూడా) ఇంట్లో

ఉండి వద్దామనుకుని బయల్దేరాను. దారిలో నీవు కనిపించి తాళాలు ఇచ్చావు. కానీ ఇందంతా గురువుల ప్లానే గదమ్మా. ఆయన ఆగమనానికి సూచనలు కనబడ్డాయి. వెంటనే ఇల్లంతా శుభ్రం చేసి వారికోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను, వచ్చారు. చెప్పవలసిందంతా చెప్పేశారు. వెళ్ళిపోతుండగా రామసుబ్బయ్య వచ్చాడు. కానీ చూశాడు" అన్నారు. "అయ్యో, నేను చూడలేక పోయానే" అంటూ వల్లీ లబ,లబలాడింది. "వాళ్లంతా పరిస్థితులను అలా క్లియర్ చేసుకుంటారు. అందరూ ఉంటే వాళ్ళు రారమ్మా. మరి రోజూ వెళతానని అడగని నీవు ఇవాళే ఎందుకు వెళ్లావు అంటే వాళ్ళు వచ్చేసరికి ఎవరూ ఉండకూడదు. అందుకే అంతా సెట్ చేసుకొని వస్తారు. నీవేం దిగులు పడకు వల్లీ. వాళ్ళతో పెట్టుకుంటే నెత్తిన బరువు పెట్టటానికే వస్తారు. ఇప్పుడు చూడు నానెత్తిన ఎంత బరువు పెట్టి వెళ్లారో" అన్నారు. "మరి ఇల్లంతా ఎందుకు ఇంత క్లీన్ చేశారు?" అంటే, మాస్టర్‌గారు "మన ఇంటికి ఎవరైనా అతిధి వస్తాడూ అంటేనే మనం శుభ్రంగా పెడతాంగదా, మరి దాదాగురుదేవులంతటి వారు మన ఇంటికి వస్తే మన స్వాగతం ఎలా ఉండాలి" అంటూ, "సరే నాకేదైనా ఇస్తావా, లేక ఇలానే కూర్చోమంటావా?" అంటూ ఆ అమ్మాయి ధ్యానాన్ని మళ్ళించేశారు. దాదా గురుదేవులు వచ్చివెళ్ళిపోయారు. చూసే అర్హత నాకు లేదేమో, అయినా నాకు మీరున్నారుగా మాస్టారూ, అనుకుంటూ మాస్టారికి టిఫిన్ తేవటానికి లోపలికి వెళ్ళింది.

**భగవంతుని లీలలు చాలాచిత్రంగా వుంటాయి. ఎవరైనా అనారోగ్యం అనగానే భయపడి పోతుంటారు. కానీ అదీ ఒక్కోప్పుడు వరంగానే ప్రకృతి ప్రసాదిస్తూ ఉంటుంది. మనకేదో నేర్పించ టానికే ప్రకృతి మనకలాంటి పరిస్థితి కల్పించిందీ, అని గమనించుకొని తదనుగుణంగా జీవించ టానికి సిద్ధపడినప్పుడు, ఖచ్చితంగా మనకు ఏదో ఒక అండ లభిస్తుంది. మనమాపరిస్థితి నుంచీ చాలా సులువుగా బయట పడతాం.** ఇది చాలా విచిత్రమైన సంఘటన.

1997 ఆగష్టు నెలలో ఆంధ్రాలో కొన్ని ప్రాంతాలలో వరదలు వచ్చి బీభత్సాన్ని సృష్టించాయి. ఆ సమయంలో చాలా మంది ఆ వరదలకు కొట్టుకు పోయారు. విపరీతమైన ప్రాణనష్టం, ఆస్థినష్టం బాగా జరిగింది. ఎన్నో ఆత్మలు అలా గాలిలో కలిసి పోయాయి. ఎంతో మంది సహాయంకోసం తపించి, తపించి తమ ప్రాణాలను వదిలి వేశారు. మాతృహృదయం, దయ, కరుణ గల కొంత మంది గురువులు వీరికి తమవంతు సహాయం అందించాలని భావించారు. ఆ సమయంలో మాస్టర్‌గారి దగ్గర వల్లీ ఒక్కతే ఉన్నది. తోటే బాబు కూడా ఉన్నాడు. ఒకరోజు రాత్రి

చెప్పారు, "వల్లీ, ఈ రోజురాత్రి నుండీ మేము కొంతమందిమి ప్రాణులను కాపాట్టానికి వెళు తున్నాము", ఎవరెవరు వెళ్తున్నారు, మాస్టారూ?" అని అడిగింది. "ఈ బాధ్యతను దుర్వాసమహర్షి ఇచ్చారు. ఆయన శిష్యులు కొంతమంది వస్తారు. అందరం కలిసి వెళతాము" అన్నారు. మరి ఎలా వెళ్తారు మాస్టారూ అన్నదీ అమ్మాయి. దానికి మాస్టర్‌గారు "ఇప్పుడు విద్యార్థులకు ముందు కొన్ని ట్రెనింగ్ క్లాసులుంటాయి. తర్వాత పరీక్షలూ, అవీ ఉంటాయి కదా. అలానే అక్కడా దుర్వాస మహర్షి కొంతమందికి ట్రెనింగ్ ఇచ్చారు. వాళ్ళను పరీక్షకు పంపటంలాంటిదీ కార్యక్రమం. **ఆధ్యాత్మిక జగత్తులో ముందు చేయవల్సింది అదేగా ! కష్టాల్లో వున్నవాళ్ళకు చేయూత నివ్వటం. ఇప్పుడు వాళ్ల, వాళ్ళ సామర్థ్యాలను ఆయన చూస్తారు.** అందులో కొంతమంది సీనియర్లు ఉన్నారు. వాళ్ళు పర్యవేక్షకులు. ఇందులో కొంతమంది మొదటి సారి వెళుతున్నారు" అని చెప్పారు. "మరి మీరు పర్యవేక్షకులా?" అని అడిగింది వల్లీ. "కాదమ్మా, నేనూ మొదటిసారే వెళుతున్నాను, ఎలా ఉంటుందో చూడాలి మరి" అన్నారు. "వాళ్ళంతా ఎలా వస్తారు మాస్టారూ" అని అడిగింది. "సూక్ష్మశరీరధారులై వస్తారు" అన్నారు. మరి వాళ్ళు వచ్చింది మీకెలా తెలుస్తుందీ, అని మళ్ళీ ప్రశ్నించింది. "వాళ్ళు గంట కొడతారు. అంటే క్లాసురూములోకి వెళ్ళే బెల్ లాగా. అందరూ వస్తారు. అన్నారు. "ఏరీ ఇంకా రాలేదు" అన్నది, "యాజ్ యూజువల్, లేటుగా వస్తారేమోనమ్మా, వాళ్ళు వచ్చి గంట కొట్టగానే నేను నా రూంలోకి వెళ్ళిపోతాను" అన్నారు. మళ్ళీ ప్రశ్న "మాస్టారూ వాళ్ళు వచ్చినట్టు ఎలా తెలుస్తుందీ", ఇంకా ఏదో తెలుసుకోవాలనే ఆదుర్దాతో అడిగింది. "నాకు తెలుస్తుందమ్మా" ఇద్దరూ కాసేపు మౌనంగా కూర్చున్నారు. ""వేడి, వేడిగా మంచి స్ట్రాంగ్ కాఫీ ఇవ్వు" అన్నారు. ఐదు నిమిషాల్లో మంచి వేడి, వేడి కాఫీ త్రాగారు. మళ్ళీ ఎదురు చూపులు. మాస్టారు కూడా చాలా అస్థిమితంగానే ఉన్నారు.

రాత్రి 11 గంటలైంది. "వాళ్ళు వస్తున్నట్లుంది" అని, లోపలికి వెళుతూ కొన్ని సూచనలు ఇచ్చారు. 1. నేను లోపలికి వెళ్ళాక ఇంక తలుపు తీయను. 2. నేను తలుపు తీసే వరకు తలుపు కొట్టవద్దు. పిలవవద్దు. 3. తర్వాత ఏదైనా దడ – దడ, ధభ్–ధబ్ మనే శబ్దాలు వస్తే భయపడకు. అన్నారు. ఈ అమ్మాయి, మళ్ళీ అడిగింది, "ఎందుకు మాస్టారూ అలా శబ్దాలు వచ్చేది" అన్న దానికి మాస్టర్‌గారు, "ఇప్పుడు నేను అక్కడికి సూక్ష్మ శరీరంతో వెళతాను గదా ! అక్కడ మునిగి పోతున్న వాళ్ళను పైకి లాగాల్సి ఉంటుంది. అలాంటప్పుడు సూక్ష్మశరీరంలో జరిగే కొన్నిమార్పుల

వలన, ఒక్కోక్కసారి కూర్చుని ఉన్న శరీరం క్రింద పడిపోవటం, దెబ్బ తగిలి రక్తం కారటంలాంటివి జరుగుతుంటాయి. కానీ భౌతికశరీరం స్పృహలోకి రాగానే అవేవీ బయటకు కనిపించవు" అని చెప్తున్నారు, ఇంతలో "వాళ్ళు వచ్చేశారు, నేను వెళుతున్నానంటూ" చెప్పేసి లోపలికి వెళ్ళి తలుపు వేసుకున్నారు.

అప్పుడు దాదాపు రాత్రి 12గంటలైంది. అంటే వాళ్ళకోసం 2గంటలు ఎదురు చూశారు. లోపల ఏం జరుగుతున్నదోనని వల్లీకి ఆతృతగా ఉన్నది. ఏమైనా వినిపిస్తుందేమోనని చెవులు రిక్కించి వింటున్నది. మాస్టారు మూడుసార్లు "ఓం" కారం చెప్పటం వినిపించింది. తరువాత కాసేపు గాయత్రీ మంత్రం వినిపించింది. అటు తరువాత అంతా నిశ్శబ్దంగా అయిపోయింది. దాదాపు గంటొకటిన్నర అవుతున్నది. అప్పుడు లోపలినుంచీ ధబ్-మనే శబ్దంవచ్చింది. ఆ తర్వాత ఇంకేమీ లేదు. గంట అర్ధరాత్రి 2-30 అయింది. దాదాపు 3 గంటలైంది. సరే, అని పడుకుంది. దాదాపు 4 గంటలకు బయటకు వచ్చి దిండు వేసుకుని పడుకున్నారు. "ఏం మాస్టారు వెళ్ళిన పని అయిందా ?" అనిఅడిగింది, ఆ...

ఇవ్వాల్టికి అయిపోయింది. మళ్ళీ రేపు వెళ్ళాలి అంటూ పడుకొని నిద్ర పోయారు. కొన్ని రోజుల పాటు ఈ ప్రక్రియ ఇలానే కొనసాగింది.

ఒకరోజున రత్నాకర్‌గారి భార్య శ్రీమతి కామేశ్వరిగారు రక,రకాల కూరలు చేసుకువచ్చారు. ఇంకా ఏదో మాస్టారికి ఇష్టమైన టిఫిన్ కూడా చేసుకొని వచ్చారు. ఆమె వచ్చే సమయానికి మాస్టారు బయట అరుగు మీద కూర్చుని ఉన్నారు. ఆమె వచ్చి మాస్టారి దగ్గర కూర్చొని, "అన్నా, నీకిష్టమని... చేసుకు వచ్చాను. లోపలికి రా అన్నా కొంచెం తిందువుగాని " అని బ్రతిమాలుతున్నారు. మాస్టారు మాత్రం లేవటంలేదు. కొద్ది సేపు అలా బ్రతిమాలాక, "అమ్మా, నీకళ్ళ ముందు ఎవరైనా నీళ్ళల్లో మునిగి పోతే చావు, బ్రతుకుల మధ్య రక్షించమని వేడుకుంటుంటే, నీవు గట్టున కూర్చుని చూస్తూ ఉండగలవా?" అన్నారు. "ఉండలేము కదా" అన్నదావిడ. "ఆపరిస్థితిలో ఎవరైనా పంచ, భక్ష్యపరమాన్నాలు తింటారా" ? అని అడిగారు. "తినలేము" అన్నారు కామేశ్వరిగారు. "ఇప్పుడు నా పరిస్థితి అదేగదమ్మా ! నీవేమో తినమంటావు. మీ కళ్ళ కెవరికీ కనిపించనివి నా కళ్ళకు కనబడుతున్నాయి. ఈ పరిస్థితిలో నేనెలా తినగలను అని ఎంతో బాధతో" అన్నారు మాస్టర్‌గారు. (ముందురోజు రాత్రి జరిగిన సందర్భం గురించి మాస్టారు చెప్తున్నారు. నిన్నటి విషయాలేవీ ఆమెకు

తెలియదుగదా!) అందుచేత ఆమెకు ఇవేవీ అర్థం కాలేదు. ఏవో కబుర్లు చెప్తూ ఆమె అలాగే కూర్చున్నారు మాస్టర్‌గారు లోపలికి వస్తే భోజనం పెట్టి వెళ్లాలని. అలా కొంత సేపయ్యాక, మాస్టర్‌గారు మనస్సులో ఏమనుకున్నారో లేచి వచ్చి భోజనానికి కూర్చొని కామేశ్వరిగారు తీసుకు వచ్చినవి తిన్నారు. ఆమె అంత ప్రేమగా చేసుకొని వచ్చింది. ఆమె మనస్సును కష్టపెట్టటం ఇష్టం లేక మాస్టర్‌గారు మామూలుగా మాట్లాడుతూనే భోజనం చేశారు. అలా ఆయన అవతలి వారు నొచ్చుకోకుండా, మనస్సు కష్టపెట్టుకోకుండా ఉండేలా అన్ని విషయాలలోనూ జాగ్రత్తగా ఉండేవారు. మహనీయుల మనస్సు అంత కోమలంగా ఉంటుందనిపించిందాక్షణంలో. సరే, తరువాత ప్రతీ రోజూ రాత్రిళ్ళు వెళ్ళి అలా సేవాకార్యక్రమాలు చేసేవారు. దాని ప్రభావం వల్లనో, ఏమో బాగా ఒళ్ళునొప్పులుగా ఉంటుంన్నాయని అంటుండేవారు. ఆప్రమాదంలో ఇరుక్కున్నవాళ్ళనెంతమందిని రక్షించారో, ఎంతమంది జీవితాలను కాపాడారో ఆపరమాత్మకే తెలియాలి.

## ఇల్లునే ఆశ్రమంగామార్చారు

మాస్టారి చెల్లెలు లక్ష్మీగారు వాళ్ళు విజయవాడలో కెనరా టవర్స్‌లో ఉండేవారు. మాస్టర్‌గారు ప్రతీ ఆదివారం చెల్లెలుగారింటికి తప్పనిసరిగా విజయవాడ వెళుతుండేవారు. అక్కడ చాలా కుటుంబాల వారిని మాస్టారికి పరిచయం చేసింది లక్ష్మీ. అలా అక్కడ శ్యామల, రమామణి, జి.వి.ఎస్‌గార్ల కుటుంబాలతో, వాళ్ళ పిల్లలతో మంచి అనుబంధం ఏర్పడింది. అలా ఒకసారి విజయవాడకు వెళ్ళిసాయంత్రానికి వచ్చారు. గుమ్మంలోకి రాగానే యజ్ఞకుండం కనిపించింది. “వల్లీ యజ్ఞం చేశారా?”అని అడిగారు. “అవును మాస్టారూ, రాత్రి నాన్న వచ్చారు. వద్దని చెప్తూనే ఉన్నాను. ఫరవాలేదు, మాస్టర్‌గారు ఏమీ అనరంటూ యజ్ఞం చేశారు” అంటూ కాస్త జంకుతూనే చెప్పింది. “చాలా మంచి పని చేశారు. అయినా ఈ ఇంట్లో యజ్ఞం చేసి ఎన్నో సంవత్సరాలైంది. ఈ రోజు మళ్ళీ మా డి.సి అంటే డైరెక్టర్ ఆఫ్ సెరిమొనీస్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో యజ్ఞం చేశారు (మాస్టర్‌గారు వల్లీ కొడుకు కార్తీక్‌ను డి.సి అని పిలిచేవారు). ఇహ మళ్ళీ ఇక్కడ త్వరలోనే యజ్ఞాలు ప్రారంభమౌతాయి. అదీ రోజుకు ఆరు, ఏడు గంటల పాటు యజ్ఞాలు జరుగుతాయి అన్నారు.

ఆ రోజే మళ్ళీ ఇంకో మాట కూడా అన్నారు, ఈ ఇంటినే చివరకు ఆశ్రమంగా మార్చవలసి వస్తుంది. ఆ రోజు కూడా అతి దగ్గరలోనే ఉన్నది అన్నారు. అప్పట్లో మాస్టర్‌గారు ప్రతీ రోజూ

ఉదయాన్నే గురుపాదుకా స్తవం చదవటం, తర్వాత దిక్ నమస్కారాలు, స్థల ప్రదక్షిణ, దత్త నమస్కారాలు చేస్తుండేవారు. దత్తప్రదక్షిణలు అయ్యేసరికి ఒళ్ళంతా చెమటలు కారిపోతుండేవి. ఆ తర్వాత సూర్యనమస్కారాలు చేస్తుండేవారు. ప్రొద్దుటే ఎవరైనా వస్తే వాళ్లకూ అదే సాధన. ఇక అవి అయిపోయేంత వరకు వారు ఎవ్వరితోనూ మాట్లాడేవారు కాదు. మాస్టర్‌గారిని కలవాలని ఎవరైనా వస్తే వారినీ సాధన చెయ్యమనేవారు. చేశాక మాట్లాడుతారు. అంత ఓపికగా ఉండి మాట్లాడాలీ అనుకునేవారు వుండి పోయేవారు. లేనివాళ్లు వెళ్ళిపోతుండేవారు. అదంతా అయిపోయాక గదిలోకి పోయి మళ్లీ 10 గంటలకు బయటకు వచ్చి ఏదైనా తినేవారు. నియమాలు చాలా ఖచ్చితంగా ఉండేవి. హాలులో ఎవ్వరూ ఏమీ తినకూడదు. తాగకూడదు, కనీసం మంచినీళ్లైనా వంట ఇంట్లోకి వచ్చి తాగాల్సిందే. ఆ సాధనాకాలంలో అంత పద్ధతులు పాటించేవారు.

ప్రతీరోజూ సాయంత్రం హాలులో 12 ఇటుకలుపెట్టించి 5 అగరు బత్తీలు వెలిగించి 4 వేదాలను అక్కడ పెట్టేవారు. కొన్నిరోజులు హోమకుండంలో దీపం వెలిగించేవారు. కొన్ని రోజులు హోమకుండం మీద దీపాలు వెలిగించేవారు. 4 వేదాలు, అవీ పెట్టించి సుబ్రమణ్య సహస్రనామాలు, గణపతి, శివ సహస్రనామ స్తోత్రాలు చదువుతుండేవారు. ఒక్కొక్కసారి చదివేవారు కాదు. ఏరోజు ఏం చెప్తే అది చెయ్యటమే. కొన్ని రోజులు యజ్ఞం చేసి 24సార్లు గాయత్రీ ఆహుతులు వేయించేవారు. తరువాత ఎంత మంది ఉంటే అంత మందితో ఒక గంటసేపు గాయత్రీ మంత్ర జపం చేయించేవారు. అలా యజ్ఞం చేసే రోజులలో ఆ యజ్ఞానికి, "అష్టోత్తర శత నక్షత్రపాద మహాకాల యజ్ఞం" అనే పేరు పెట్టటానికి ఈ పదాలను తిప్పి, తిప్పి చెప్తూ చివరకు ఈ పేరును ఖరారు చేశారు. ఈ యజ్ఞమే తరువాత ద్వాదశరాశి నవగ్రహ అష్టోత్తర శత నక్షత్రపాద మహాకాల యజ్ఞాలుగా రూపుదిద్దుకొని వేల సంఖ్యలో జరుపబడ్డాయి. **పూజ్యగురుదేవులు అందించిన యజ్ఞవిద్యపై చాలా కాలం ఎక్సెపెరిమెంట్స్ చేసి, నేటి పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని మార్పులు చేసి తమ తపస్సు, స్వాధ్యాయ జ్ఞానాన్ని జోడించి ద్వాదశరాశి నవగ్రహ అష్టోత్తర శత నక్షత్రపాద మహాకాల యజ్ఞాలుగా అందించారు.**

## ఇంటినే దేవాలయంగా

అది అక్టోబర్ నెల. కొంచెం చలిగా ఉన్నది. ఉదయాన్నే 5.30 గంటలకు గురుపాదుకాస్తవంతో సాధన మొదలైంది. ఎందుకో ఆరోజు ఉదయాన్నే జయరాంగారు వచ్చారు. గురుపాదుకాస్తవం

తర్వాత దత్తప్రదక్షిణలు, సూర్యనమస్కారాలు వరుసాగ్గా చేయిస్తూ మధ్య, మధ్యలో వివరణ చెప్తూ సాధన కొనసాగించారు. ఈ సాధనలో జయరాంగారూ పాల్గొన్నారు. ఎంతో ఉల్లాసంగా ఉంది మాస్టర్‌గారు రోజూ వస్తాను అని చెప్పి ప్రతీ రోజూ తెల్లారేసరికి వచ్చేసేవారు. అలా నాలుగు రోజులయ్యాక జయరాం ఓ ఐదారు మందిని తీసుకువచ్చాడు. తరువాత ఆ సంఖ్య పదిమంది అయ్యారు. మెల్లగా 24 దాకా అయ్యారు. పోను, పోను ఆ సంఖ్య పెరిగింది. ఐదారు బ్యాచ్‌లుగా తయారు చేసి టైం టేబులు ప్రకారం క్లాసులు పెట్టటం, అటెండెన్సు రిజిష్టరులో అటెండెన్సు వెయ్యటం అలా మొత్తం కాలేజీ లాగా రూపొందించారు. అలా సాధనతో పాటు సాయంత్రం 6 గంటలకు ప్రవచనాలు మొదలయ్యాయి. మెల్ల,మెల్లగా ఆ ఇంటి చుట్టుప్రక్కలవారు ఇంకా గ్రామాల నుంచీ కూడా జనాలు రావటం మొదలైంది. సాయంత్రమయ్యేసరికి వాకిలి జనంతో నిండిపోయేది. ఇంక అక్కడనుంచీ మూడు రోజుల సాధనాశిబిరాలు ప్రారంభమయ్యాయి. సాధకుల సంఖ్య పెరిగింది. "త్వరలోనే ఈ ఇల్లు దేవాలయంగా మారుతుంది" అన్నారు ఒక రోజున. అన్నట్లుగానే రెండు సంవత్సరాల లోపలే "జగజ్జనని సహిత ఏకైక అఖండ గురుసత్తా దేవాలయాన్ని" మాస్టర్‌గారు నిర్మించటం జరిగింది.

## హెలీస్ తోకచుక్క

ఒకసారి ఎండాకాలం సెలవులకు మాస్టర్‌గారు జాంద్రపేటకు వచ్చారు. జాంద్రపేట పల్లెటూరు కావటం, ఇంకా చెట్లు విపరీతంగా ఉండటం మూలాన అక్కడ చల్లగానే ఉండేది. ఉమ, ఉష, గౌరీ, వల్లీ, బాబి ఇలా పిల్లందరూ ఉండటం వల్ల మాస్టారికీ సరదాగా ఉండేది. మామూలుగా కబుర్లు చెప్తున్నట్లుగానే, చెప్తూ జీవితానికి కావలసిన జ్ఞానాన్ని వాళ్లకు చెప్తూనే ఉండేవారు. రాత్రిళ్ళు బాగా చల్లగావుండటం వలన అందరూ డాబా మీదకు వెళ్ళి కబుర్లు చెప్పుకునేవారు. ఆ రోజున గ్రహాల గురించీ, నక్షత్రాల గురించి సంభాషణలు వచ్చాయి. మాటల మధ్యలో గుర్తుకు వచ్చింది. ఎన్నాళ్ళ క్రిందటనో చెప్పారు. "ఏప్రియల్ ఒకటవ తేదీన హెలీస్ తోకచుక్క కనబడుతుందీ" అని. విచిత్రంగా ఆ రోజు ఏప్రియల్ ఒకటవ తేదీ అయింది. ఇంక అందరి ఆలోచనలు హెలీస్ తోకచుక్క అంటే ఏమిటి? ప్రకృతి మీద దాని ప్రభావం ఎలా వుంటుందనే చర్చ వచ్చింది. ఆ రోజు చాలామంది ఉన్నారు. మాస్టర్‌గారు ఏం చెబుతారా అని అందరూ చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు.

"చాలా విచిత్రాలు జరుగుతాయమ్మా అంటూ మొదలు పెట్టారు. అది "హెలీస్"గా 70 సంవత్సరాల క్రిందట ప్రత్యక్షమైనప్పుడు మాస్టర్ సి.వి.వి. దాని శక్తిని ఆకర్షించి భూమ్మీదకు దింపుకున్నారు. దానితో ప్రపంచానికెంతో మేలు చేశారు. ఇంకా దానిప్రభావం ఎలా ఉంటుంది, సి.వి.వి గారు దాని గురించి ఎంత సాధన చేశారు, ఆ సమయంలో ఎలాంటి సమస్యలనెదుర్కొన్నారు, ఎటువంటి ఫలితాలను ప్రపంచానికందించారు, అలా చాలా విషయాలు చెప్పారు. అలా వింటూ మెల్లిగా అందరూ నిద్రలోకి జారుకున్నారు. ఆ రాత్రి మాస్టర్‌గారు నిద్ర పోలేదు. తెలియదు, కానీ పూర్తిగా ధ్యానంలోకి వెళ్లిపోయారు. ధ్యానం నుంచీ బయటకు వచ్చాక చాలా అసౌకర్యంగా, ఏదో చెప్పలేని బాధ, ఒళ్ళునొప్పులు. చాలా ఇబ్బందిగ ఆ రాత్రి గడిపేశారు. ఈసారి ఆ శక్తిని మాస్టర్‌గారు దింపుకున్నారు అని తరువాత అర్థమైంది. తెల, తెలవారుతుండగా నిద్రపోయారు. ఎనిమిదిగంటల వరకు ఒంటి మీద స్పృహలేదు. తరువాత కాస్త, కాస్త తేటపడ్డారు. ఇంక ఆ తరువాత మాస్టర్‌గారి కార్యక్రమాలు అనుకోని రీతిలో ఊపందుకొని ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు చేయటం జరిగింది.

## ఋషుల కార్యక్రమాల విస్తరణ - ఆశ్రమాల నిర్మాణాలు

1971 జూన్ 18వతేదీన పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్యగారి దగ్గర దీక్ష స్వీకరించిన తరువాత మన మాస్టర్‌గారికి తమలక్ష్యంతో పాటు తాము చేయవలసిన కార్యక్రమాల రూపు రేఖలు స్పష్టంగా గోచరించాయి. అసలు మానవ జాతి పరమావధి ఏమిటీ? ఋషులు, యుగపురుషుల యొక్క కార్యక్రమాల వివరణ, రాబోయే రోజులలో మానవజాతి పరిణామాలు, ఈ మొత్తం ప్రణాళిక సాకారం కావటానికి భారతదేశ పాత్ర ఏమిటి? అనే విషయాలను పరిపూర్ణంగా అవగాహన చేసుకుని

1. భారతదేశం తిరిగి జగద్గురు పీఠాన్ని అధిరోహిస్తుందనే తథ్యాన్ని సాకారం చేయటానికై,
2. త్రిమూర్తులకంటే ఉన్నతుడైన 'గురువు' సాంప్రదాయాన్ని పునఃప్రతిష్టించటానికై,
3. పూజ్యగురుదేవుల ఉద్ఘోషణ, "21వ శతాబ్ది ఉజ్జ్వలభవిష్యత్" అనే నినాదాన్ని నిజము చేయటానికై,
4. ఒకే విశ్వం, ఒకేధర్మం, ఒకేభాష అన్నఋషుల ప్రణాళికకు కార్యరంగం సిద్ధంచేయటానికై,

5. ఈ యుగసంధికాలం గురించి వేల,వేల సంవత్సరాలగా కృషిచేస్తున్న గురుసాంప్రదాయాల మధ్య సమన్వయాన్ని తీసుకురావటానికై,

6. ప్రత్యేకించి గత 200సంవత్సరాలలో ఈ ప్రణాళికకై జన్మించిన, 'పరమగురువులు'వారి సాంప్రదాయాల నడుమ గల సమన్వయతను అవగాహన చేసుకొనుటకు,

7. ముఖ్యంగా 12 మంది గురువులు పరిణామక్రమములో మానవజాతిని ఉద్ధరించేందుకై వారందించిన వివిధసాధనా విధానాలను, అందులోను ముఖ్యంగా

సి.వి.వి-బ్లావెట్స్కీ, లాహిరీమహాశయ-పరమహంసయోగానంద, శ్రీఅరవిందో-శ్రీమాతా, శ్రీశిరిడీసాయి-సత్యసాయి, శ్రీరామకృష్ణపరమహంస-శారదామాత, శ్రీరామశర్మఆచార్యా -మాతాభగవతీదేవీ శర్మగార్ల కార్యక్రమాలకు వివరణనిస్తూ,

8. సైన్సు, ఫిలాసఫీ, రెలిజియన్ (శాస్త్రము, దర్శనము, ధర్మము)ల యొక్క సమన్వయాత్మకమైన గుప్తవిద్యను మానవజాతికందిస్తూ, మహాకాలుని ప్రణాళికననుసరించి, భూమాతదీక్ష తీసుకున్నటు వంటి ఈ యుగసంధి పర్వవేళలో దైవత్వసిద్ధి ప్రదాయినీ, దేశకాలాతీతమైన ద్రష్టాస్థితి(సమాధి)కి తీసుకు వెళ్ళగలిగే "ద్వాదశరాశి నవగ్రహ అష్టోత్తరశతనక్షత్ర పాద మహాకాల యజ్ఞాన్ని" మానవ జాతికి బహుమతిగా ఇస్తూ,

9. గురుసత్తా కార్యక్రమాలకు కేంద్రంగా 1996 గురుపూర్ణిమనాడు అగ్నివిద్యనందించే సాధనాస్థలిగా, 'శ్రీ హంస రామ ఆశ్రమమును', అదే ప్రాంగణములో సమస్త కోరికలు తీరటానికి, బాధలనుండీ ఉపశమనాన్ని పొందటానికి, 'స్మర్తుగామి సిద్ధక్షేత్రమును' కాకివాయి (నెల్లూరుజిల్లా) లో స్థాపించారు. ఆ తరువాత

10. చంద్రవిద్యా కేంద్రంగా, 'శ్రీ అగస్త్యాశ్రమం', రేపల్లె దగ్గర గల కొత్తపాలెంలో స్థాపించారు.

11. సూర్యకిరణ విజ్ఞాన అనుసంధాన కేంద్రమును, గుంటూరుకు సమీపానగల కొప్పురావూరులో వ్యవస్థీకృతం చేశారు.

12. 1998 ఏప్రియల్ 25వ తేదీన, నూతన విశ్వధర్మస్థాపనకు కేంద్రంగా, ప్రకాశంజిల్లా, వేటపాలెంలో గురుసాంప్రదాయానికి ప్రధానకేంద్రంగా నిత్యావతార దత్తక్షేత్రాన్ని రూపకల్పనచేసి అందులో ఆదిగురువు శ్రీదత్తాత్రేయస్వామివారిని ప్రతిష్ఠించారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు కాలాంతరంలో

పంచదత్తులను, షోడశదత్తావతారాలకు ప్రాణప్రతిష్ఠ చేయటం జరిగింది. తర్వాత మెల్లగా దానిని ఆశ్రమంగా రూపొందించారు.

13. 'శ్రీసహ్యాద్రి దత్తాశ్రమము' – ఓడరేవు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు 1998 మే 21వ తేదీన చీరాలకు 7కి.మీ.దూరంలో గల ఓడరేవు వద్ద సహ్యాద్రి దత్తాశ్రమాన్ని స్థాపించారు. కాలక్రమములో ఆ ఆశ్రమాన్ని పండిత శ్రీరామశర్మఆచార్య గురుదేవుల సాధనలకు కేంద్రంగా 'శ్రీరామ హంస సహ్యాద్రి ఆశ్రమము' పేరుతో సాక్షాత్ దక్షిణ శాంతికుంజ్‌గా దానిని అభివృద్ధి చెయ్యాలనీ చెప్పారు.

ఒకవైపున వేర్వేరు సాధనలనిమిత్తం వేరు, వేరు ప్రదేశాలలో ఆశ్రమాల నిర్మాణాలు కొనసాగు తూనేవున్నాయి. పూజ్యశ్రీ మాస్టర్‌గారు అప్పుడు గుంటూరులో 50 సుకృతవిల్లాలో ఉంటుండేవారు. అక్కడ వారు ఉద్యోగ నిర్వహణతో పాటు వ్యక్తిగతమైన రహస్యమయసాధనలు చేసుకుంటుండేవారు. కొన్ని విచిత్రమైన పరిస్థితులలో మహాకాలుని నిర్దేశాలననుసరించి అఖండ అగ్నిని స్థాపించి అఖండ హోమాన్ని ప్రారంభించారు.

## నిరంతర గురుసాన్నిధ్య అనుభూతి సాధనా శిబిరం

గురు అనుగ్రహం అన్నిటికన్నా గొప్పది. దానిని సాధించటానికి, అందరికీ తత్ఫలితాలను అందించాలని, ఈ యుగసంధి కాలంలో దాని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది కనుక ఒక నిర్దుష్టమైన ప్రయోజనం కోసం మాస్టర్‌గారు ఈ "నిరంతర గురుసాన్నిధ్య అనుభూతి సాధనా శిబిరాన్ని" తమ గృహప్రాంగణంలోనే ఆగ్నేయదిశలో ఒక చిన్న పర్ణశాలను వేసి అందులో చిన్న హోమకుండాన్ని స్థాపించారు. ఇది మహత్తరమైన యజ్ఞం. ఇంతకు ముందు ఎవరూ ఇలాంటి ప్రయోగాన్ని చేసివుండలేదు. కనీ, వినీ ఎరుగని రీతిలో ఈ యజ్ఞం అఖండంగా అలా జరుగుతూనే వుండేది. దాదాపు ఒక సంవత్సర కాలం పాటు ఈ యజ్ఞాన్ని జరిపించారు. ముందుగానే అన్ని ఊళ్ళ కార్యకర్తలు అక్కడికి వచ్చి వారికి కేటాయించిన సమయంలో, అక్కడే వుంటూ ఒక్కొక్కరు మూడు రోజులపాటు ఈయజ్ఞాన్ని చేసుకుని తిరిగి వెళ్లి పోతుండేవారు. ఒకే ఒక్కమంత్రం

ఓం నమః శ్రీగురుదేవాయ పరమపురుషాయ, సర్వదేవతావశీకరాయ సర్వారిష్టవినాశాయ

సర్వమంత్ర ఛేదనాయ త్రై లోక్యం వశమానయ స్వాహా....స్వాహా

అంటూ గంటకు ఇద్దరు సాధకుల చొప్పున ఆహుతులను వేస్తూ అఖండయజ్ఞాన్ని నిర్వహించటం జరిగింది. ఇది భౌతికంగా జరిగిన అఖండయజ్ఞం. నిజానికి ఇది ఒక విశుద్ధమైన ఆధ్యాత్మిక ప్రయోగము. అఖండ యజ్ఞము చేస్తున్నప్పుడేమౌతుందీ? మంత్రశక్తిని సూక్ష్మీకృతం చేయటం వలన అది ఉచ్ఛలోకాలకు వెళుతుంది. ఉచ్ఛలోకాలకు వెళ్ళిన ఆ మంత్రశక్తి, తనకనుకూల మైనటువంటి ఆలోచనావిధానాలను ఆకర్షిస్తుంది. అలాగ ఒక చక్రీయక్రమంలో ఒకటి, రెండు సంవత్సరాల పాటు యజ్ఞమును ఈవిధంగా కొనసాగించినట్లైతే అప్పుడు ఆ స్థలం ఆ మంత్రాధి దేవత యొక్క అనుగ్రహ వర్షానికి ఆధారభూతమౌతుంది. నిజం చెప్పాలంటే దేవాలయాల వెనకాతల వున్నటువంటి విజ్ఞానం ఇదే! నిరంతరం దేవాలయాలలో, ఆలయంలో నెలకొని ఉన్న దేవతా మంత్రంతో ఇలా యజ్ఞాలను చేయగలిగితే ఆ దేవాలయాలలో దేవతా అనుగ్రహం విపరీతంగా కురుస్తుంది. ఇది ఒక విశుద్ధమైన శాస్త్రీయ ప్రక్రియ.

మాస్టర్‌గారు తమ జీవిత లక్ష్యంగా రూపొందించుకున్న అనేక ప్రణాళికలను విస్తృతంగా వ్యాప్తిచేయటానికి ఈ యజ్ఞాన్ని మాధ్యమంగా చేసుకుని తమ కార్యక్రమాలను కొనసాగించారు. తర్వాత కొంత కాలానికి ఇక్కడ ఇప్పుడున్న సప్తర్షి ఆశ్రమాన్ని నిర్మించటం జరిగింది. ఇంతలో దుర్గానవరాత్రులు వచ్చాయి. ఈ నవరాత్రులలో ఏ సాధనలు ఎలా, ఎందుకు చెయ్యాలో ఒక సాయంత్రం ఇచ్చిన ప్రవచనంలో ఇలా చెప్పారు.

## ఋషులు ఇచ్చిన కార్యక్రమం

ఆ రోజు ఇచ్చిన ప్రవచనం అద్భుతం. దాని సారంశం ఇలా ఉన్నది. మానవజాతి యొక్క కోటానుకోట్ల పరిణామ క్రమంలో మనం చివరి దశలోకి అడుగు పెట్టబోతున్నాం. ఋషులు, మహర్షుల నుంచీ దేవర్షుల దాకా రాబోయే ఒకటిన్నర సంవత్సర కాలము యొక్క ప్రాముఖ్యతను గురించి ఎంతో ఉదాత్తంగా చెప్తున్నారు. ఈ విజయదశమినాడు ఆ ఋషులు మనకిచ్చిన కార్యక్రమాలను ఎలా నిర్వర్తించాలనే దానికి ఒక పంచవర్ష ప్రణాళికను వేయబోతున్నాం అంటూ మొదలు పెట్టారు.

గాయత్రి అనే అద్భుతశక్తిని ఋషులు మనకందించారు. వశిష్టుడు, విశ్వామిత్రుడు ఇంకా వీళ్ళతో పాటు ఇంకా ఎందరో మహాత్ములు, మహనీయులు ఈ మహామంత్ర అనుష్టానంలో దివ్యత్వాన్ని సిద్ధింపచేసుకుని, తమ అనుభవాలను మానవజాతికి అందించటానికి మనిషి మానసిక స్థితిని ఐదురకాలు విభజన చేశారు. అవి ఏమిటంటే 1.బలం 2.బుద్ధి 3.కౌశలం 4.యశస్సు

5.ప్రతిష్ఠ. ఈ ఐదింటి సాధన ఈ నవరాత్రుల్లో చేస్తే మీరు ఋషులైపోతారు అని చెప్తూ వాటి యొక్క సూక్ష్మరహస్యాలను సంక్షిప్తంగా వివరించారు.

**పృథ్వీగ్రహం అమితవేగంతో భ్రమణం చేస్తోంది. లక్ష్యంకోసం అదే వేగంతో మనమూ ప్రకృతితో పోటీపడి పని చెయ్యాలి. అయితే మా పరిస్థితులు అనుకూలంగాలేవు, చాలా కష్టాలలో వున్నాము అంటారు. ఒకటి బాగా గుర్తుంచుకోవాలి. మీ కష్టాలకు కారణం మీరెక్కడున్నారో అక్కడ సుఖంగాలేరు. అంతేగానీ నిజమైన కష్టాలు మీకు లేవు, ఇతరులతో పోలిస్తే ! మీ మానసిక స్థితిని మార్చుకొని జీవించగలుగుతే మీరిప్పుడే ఋషులైపోతారు. కోరికల భ్రమ నుంచీ బయట పడాలి. కేవలం ఈ చిన్న రహస్యాన్ని అర్థంచేసుకోండి. ప్రకృతి మీకేదైతే ఇచ్చిందో దానిని అర్థం చేసుకొని ఒప్పేసుకోండి. నేనిక్కడనుంచీ పారిపోతానని అనుకోకూడదు. మీరందులో వుండే మంచిని చూడగలగాలి. దానికోసం ప్రయత్నించాలి. ప్రకృతి తల్లి. ప్రకృతి బాధిస్తోందీ అంటే ప్రకృతి మనకేదో నేర్పటానికి ప్రయత్నిస్తున్నదని అర్థం చేసుకోవాలి. తల్లి చెయ్యి పట్టుకొని అడుగులు వేయిస్తుంది. మరి మీరిప్పుడున్న పరిస్థితులకంటే మెరుగైన పరిస్థితులకు వెళ్ళాలంటే వున్న మెట్టును ముందు వదిలి పెట్టాలి. దాని కోసం రక, రకాలైన కష్టాలను కల్పిస్తుంది ప్రకృతి. మరి వాటన్నింటినీ దాటగల్గాలి. అదే ఋషిమయ జీవితం. మీరెక్కడవున్నారో అక్కడే వుండి దానికి తగినట్లుగా మీ మానసికస్థితిని మార్చుకోండి. ఋషిమయ జీవితానికి కావలసిన విత్తనాలను నాటుకుంటే ఖచ్చితంగా అవి మొలకెత్తుతాయి.**

**రైదాస్ చెప్పులు కుట్టేవాడు. కబీర్ నేత పని చేసేవాడు. వృత్తితో సంబంధంలేదు. వాళ్ళు జీవితం ఎలా జీవించారు, ఋషిమయ జీవితం జీవించారు. ఇది అర్థం చేసుకుంటూ, ఎక్కడున్న వాళ్ళు అక్కడే వుంటూ ప్రకృతికి లోబడి జీవించవచ్చు. గమ్యం మాత్రం ఎప్పుడూ మీరు కోరుకొనే భగవంతుని వైపే వుండాలి.** గాయత్రీమంత్రము యొక్క గొప్పదనాన్ని అర్థం చేసుకోండి. అది మిమ్మల్ని ఋషిమయ జీవితం వైపుకు తోస్తుంది. గాయత్రీ మంత్ర ఉచ్చారణ వలన ప్రకృతి శక్తులు అనుకూలిస్తాయి. ఆ మంత్రాన్ని ఎలా చేసినా మీరు ఋషులైపోతారు. ఎందుకంటే ఆ మంత్రము యొక్క కూర్పు అలా జరిగింది. అందుచేత ప్రతీ రోజూ ఉదయం ఒకగంట, సాయంత్రం ఒక గంట గాయత్రి జపం చెయ్యాల్సిందే! 24 కోట్ల సంవత్సరాల తర్వాత వచ్చిన అద్భుతమైన అవకాశం ఇది. మళ్ళీ ఎప్పటికి ఇలాంటి సమయం వస్తుందో తెలియదు. జపం సామూహికంగా

చేస్తే ఫలితాలు అనంతంగా వుంటాయి. మీరా సాహసం చూపించి ఋషుల ఆనుగ్రహంతో కనీసం పర్వదినాల్లోనైనా సామూహిక జపం చెయ్యండి. దీంతోపాటు వారానికి 4 గంటల పాటు స్వాధ్యాయం చేయండి. విజయదశమి వరకు చెయ్యవలసిన సాధనలలో మొదటిది ఋషిమయ జీవితం జీవించాలి, దాని తరువాత ఖచ్చితంగా రోజుకు 2గంటలు జపంచెయ్యాలి. ఇంక మూడవది వారానికి 4గంటలు స్వాధ్యాయం చెయ్యాలి. ఇదే మీ నవరాత్రి సాధనా సిలబస్. ఎంత శ్రద్ధగా చేస్తే అంత మంచి ఫలితాలు వస్తాయని చెప్పి ముగించారు.

**సాధన వలన సిద్ధి:** నవరాత్రి సాధనను మాస్టర్‌గారు చెప్పింది చెప్పినట్లు తు.చ. తప్పకుండా ఎంతో శ్రద్ధతో చేశారు. పూర్ణాహుతి అయిన తరువాత పూజ్యశ్రీ మాస్టర్‌గారు, "ఈ నవరాత్రి సాధన ఎంత అద్భుతమైన ఫలితాన్ని ప్రపంచానికందించిందో మీకు తెలియదు. మీరు చేసిన సాధన ముఖ్యంగా అష్టమినాటి రాత్రి సాధన, **మానవశరీరధారిని లేక వేరే లోకాల జీవాత్మలను మొదటి మెట్టు ఎక్కించారు.** దానిక్కావలసిన నిరూపణలు చాలానే వున్నాయి. కానీ వాటిని గురించి చర్చించను" అని చెప్తూ ఇంకా ఇలా చెప్పారు. **మీలో కొంత మంది అలాంటి బీజాలను, అనేక జన్మలలో ఆత్మాహుతి చేసుకొనే తీవ్రప్రయత్నంతో చేశారు. దాని ఫలితం చాలా చిత్రంగా రావటం జరిగింది. కాని జరిగిందేమిటంటే పృథ్వి స్వయంగా దీక్ష తీసుకున్నది.** అంటే భూమి మిమ్మల్ని వుండనిచ్చింది. మిమ్మల్ని భరిస్తున్నది. ఈ తొమ్మిదిరోజులలో భూమి క్రొత్త దీక్షను తీసుకున్నది. క్రొత్త సాధనారంగంలోకి ప్రవేశించినా, ఈ పృథ్విని మనం ఎంత హింసిస్తున్నా, ఎందుకు భరిస్తున్నదీ అనే రహస్యం నాతో వున్న కొద్దిమందికి మాత్రమే తెలుసు. (ఆ వివరాలు చాలా గోప్యంగా వుంచారు).

మీకు తెలియకుండా మీరు ధరణికి సహకరించారు. మీరూ ఆ దీక్ష తీసుకున్నారు. ఈమహత్కార్యంలో మీ పాత్ర అద్భుతం. ఈ నవరాత్రులలో ధరణి దీక్షకు మీరు సహకరించారు. పృథ్వీ దీనిని గుర్తుంచుకుంటుంది. గత సంవత్సరం తీసుకున్న దీక్ష అది, ఈ నాటికి ఫలించింది. ఈ సమయంలో మీరు చేయవలసిది ఇంకా చాలా వున్నది. షట్చక్రసాధన చేయండి. అద్భుతమైన ఫలితాలు వస్తాయి. షట్చక్రాల జ్ఞానం - వాటి రంగులు - దళాలు వాటిమీద నేను చెప్పిన ప్రయోగాలు చెయ్యండి. ఖచ్చితంగా పూజ్యగురుదేవులే స్వయంగా మీకు దీక్ష నివ్వటానికి సిద్ధంగా వున్నారు. ఈ సంవత్సరం లోపల ఆ సాధన పూర్తై పోవాలి.

1971 నవరాత్రుల నుంచీ ఈ దీక్ష ప్రారంభమైందని చెప్పాను గదా ! ఎప్పుడూ జరుగని రీతిలో జీవాత్మలు, అనేక దివ్యాత్మలు భూమి చుట్టూ పరివేష్టించి వున్నారు. ఆ దివ్యశరీరధారులతో సంపర్కం ఏర్పరుచుకోవాలంటే ఈ సంవత్సర కాలంలో మాత్రమే అది సాధ్యమౌతుంది. కానీ వాళ్ళతో సంపర్కం అనేది అంత సులువైన విషయమేమీ కాదు. ఆ దివ్యశరీర ధారులు కోట్ల, కోట్ల సంవత్సరాల పరిణామ క్రమములో ముందున్నారు. వారితో సంపర్కం పెట్టుకోవచ్చును కానీ నా మార్గం అది కాదు. నవరాత్రి సాధనలో జరిగిన విశేషాలను చూడాలంటే, దానికి తగిన మానసిక సాహసం రావాలంటే మీరు రోజుకు నాలుగు గంటలు సాధన చేయ్యాలి. లేక పోతే మీరీ కార్యక్రమాలకు పనికిరారు. **మనలను, మన సమూహాల సాధనలను సంరక్షిస్తూ గమనిస్తూ ఉన్న ఋషులు మనకు 'సైనికులు' అని పేరు పెట్టారు. యుద్ధంలో పని చేస్తున్న సైనికుల పని ఎంత గొప్పదీ అంటే, 'నేనెందుకు యుద్ధం చెయ్యాలీ అని ఏ సైనికుడు' అనడు.** ఈ జ్ఞానాన్ని మనస్సులో వుంచుకొని, "రోజుకు 15నిమిషాల సేపు మౌనం" పాటించండి. అప్పుడు ఋషులు, తాము చెప్పాలనుకున్న దానిని, మీ అంతఃకరణలలో నాటుతారు. మీకిష్టం వున్నా లేక పోయినా వాళ్ళా పనిని చేసి తీరుతారు. మిమ్మల్ని మీరు ఒక మిలటరీ సైనికుడిలాగా భావించుకొని చెప్పిన విషయాలపైన మనస్సును కేంద్రీకరించి సాధనలు ప్రారంభించమని చెప్పారు. ప్రతీ రోజూ సాయంత్రాలలో వీటిపై తరగతులు నిర్వహించారు. కారల్‌మార్క్సులాగా కష్టపడాలి. సాధారణ ప్రయత్నాలు చాలవనేవారు. చాలా బాగా కష్టపడాలి. దానిక్కావలసిన ఆ శ్రమను మీరు చేయగలుగుతే ఈ సృష్టికే కొత్త అందాలను మీరివ్వగలరు. ఇదీ మనం నడుపుతున్న 'గురుసాన్నిధ్య సాధనా శిబిరం'లో గల అంతరార్థం. ఇంతే కాకుండా రాబోయే 15 సంవత్సరాలలో మనం చాలానే చెయ్యాలి. ఏ ఒక్క సంస్థగానీ ఆ పనులనన్నింటినీ చెయ్యలేదు. సమస్త మానవజాతి నడుంబిగిస్తేనే గాని ఆ పనులు జరుగవు.

మహాభారత యుద్ధాన్ని ఎదుర్కోబోతున్నాం. మీకు దమ్ముంటేనే రండి. అనేక కష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది. బలరాముడు, ఉద్ధవుడు యుద్ధసమయంలో తీర్థయాత్రలకు వెళ్ళారు. మీరూ ఆలోచించుకోండి. నిర్ణయం మీదే! కత్తి మీద సాము లాంటి జీవితాన్ని మీరు కొన్ని సంవత్సరాల పాటు జీవించాల్సి వుంటుంది. కురుక్షేత్రయుద్ధము లాంటి పరిస్థితుల్లో వున్నాం. ఇప్పుడు మనం అసిధారా వ్రతం చేస్తున్నాం. ఈ పరిస్థితులలో గురుసాన్నిధ్యం కొరకు తప్ప ఇంక దేన్ని గురించీ ఆలోచించవద్దు. మీ సాధనలో మీకు గురువు తప్ప ఇంకెవ్వరూ కనిపించకూడదు.

గురువేం చెప్తే అదే చేస్తాం అని గట్టిగా అనుకోగలిగే వాళ్ళు మాత్రమే నాకు కావాలి. అలాంటి వాళ్ళుంటేనే ఏదైనా సాధించగలుగుతాం. దానికి నిరంతరం మీరు గురుసాన్నిధ్యంలో, "అంతరాత్మలో" వున్న ఆ గురువును అనుభూతి చెందగలగాలి. ఈ క్షణం నుంచీ మీ జీవితాలను గురించి మీరు నిర్ణయించుకోండి. అన్నింటికీ మీరు సిద్ధపడితే, "నేను ఇవాళ మీకు ఎవరికి ఏ బీజమంత్రము ఇవ్వాలో వాళ్ళకది ఇస్తాను. ఎలా సాధన చెయ్యాలో కూడా చెప్తాను" అని కొంత విరామాన్నిచ్చారు. కొంతసేపటికి దీక్ష తీసుకోవటానికి కొంతమంది ముందుకు వచ్చారు. అలా ముందుకు వచ్చిన వాళ్ళకు ప్రత్యేకంగా దీక్షలనిచ్చారు. ఇంక వారు నిరంతర మౌనంలో వుంటూ తమకిచ్చిన బీజమంత్ర సాధనలో లీనమై గురువుకు సమర్పణ చేసుకుంటూ కాలానుగుణ్యంగా మాస్టర్‌గారి నిర్దేశాలననుసరించి సాధనలో ఒక్కొక్క అడుగు ముందుకు వేయటం జరిగింది. అలా సాధన చేసిన కొంతమంది వ్యక్తులు ఋషుల ప్రణాళికలో భాగంగా మాస్టర్‌గారు చేసిన అనేక కార్యక్రమాలలో చివరంటా వారితో సహకరించి తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. అలా మాస్టర్‌గారు అనేక మంది జీవితాలకు ప్రేరణనిచ్చి కార్యోన్ముఖులను చేసి వారి జీవితాలకు చక్కటి దిశానిర్దేశానివ్వటమనేది అందరికీ అనుభవైక వేద్యమే !

## అధ్యాయం-11

# అనుగ్రహపీఠాల స్థాపన

అది 1996 వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఒకరోజు, మాస్టర్‌గారు 'కాలేజీకి వెళ్ళాలి, భోజనం వడ్డించమన్నారు'. వడ్డించిన తరువాత భోజనం చేస్తూ 'అనుగ్రహపీఠాలను పెట్టాలను కుంటున్నాను. నేను చెప్పే సాధనలకు, కార్యక్రమాలకు ఊరూరా ఒక్కొక్క కేంద్రం ఉంటే ఇంకా బావుంటుందనిపిస్తున్నది. గురువుగారు శక్తిపీఠాలు స్థాపించి గాయత్రీని, యజ్ఞాలను విస్తృతం చేసినట్లే, మనం వీలైనన్ని చోట్ల అనుగ్రహ పీఠాలు పెడితే మన కార్యక్రమాలు ఇంకా తీవ్రగతితో ముందుకు సాగుతాయి' అన్నారు. 'అయితే పీఠాలను స్థాపించాలంటే కొన్ని నియమాలు, సాధనలను కలుపుతూ ఒక అనుగ్రహపీఠస్థాపన నియమావళిని తయారుచెయ్యి, కాలేజీనుండి వచ్చిన తరువాత ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో చెప్తాను' అన్నారు మాస్టర్‌గారు.

గాయత్రీ శక్తిపీఠాలకు వలెనే గాయత్రీ అనుగ్రహపీఠాలకు బ్రహ్మవర్చస్‌లోని 24 గాయత్రీ శక్తుల పేర్లు ముందుగా వ్రాసి, పీఠనిర్వహణకు అవసరమైన నియమనిబంధనలతో పాటు సాధనలు తెలియచేస్తూ ఒక కరపత్రాన్ని సిద్ధం చేశాను. మాస్టర్‌గారు వస్తూనే అది చదివి మొదట ఏ పనిచేసినా ఒంగోలు నుండే కదా చేస్తాము, అందుచేత మొదటిపీఠం, "వేదమాత గాయత్రీ అనుగ్రహపీఠాన్ని" ఒంగోలులోనే పెడదాము అన్నారు. సీతామహాలక్ష్మీగారితో చెప్పి తగిన ఏర్పాట్లు చేస్తే నేను వచ్చి పీఠాన్ని స్థాపిస్తాను అన్నారు. ఒంగోలు వచ్చి మాస్టర్‌గారి ఆలోచనలను అక్కా వాళ్లకు వివరించగా వారు పీఠాన్ని పెట్టేందుకు సంసిద్ధులై తక్షణమే పనులు ప్రారంభించారు. 1996 నవంబర్ 4వతేదీకి మాస్టర్‌గారు వచ్చారు. విశాలమైన ఖాళీప్రదేశం. సాధనకు ఎంతో అనువైన ప్రశాంత వాతావరణం కలిగిన శ్రీలక్ష్మీనారాయణగారి ఇంటి వెనుకభాగంలో, అప్పటికప్పుడే ఒక పాక వేయించి కొన్ని మంత్రలేఖన పుస్తకాలను పీఠం క్రింద స్థాపించి, పైన గాయత్రీమాత చిత్రపటాన్ని ప్రతిష్ఠించారు. అలాగే యజ్ఞశాల, నవగ్రహమండపం, గురుపాదుకలు అన్నీ టకటకా సాయంత్రానికల్లా ఏర్పాటుచేసి సాధనలు కూడా చేయించేశారు. కొన్ని సంవత్సరాల తరువాత అక్కడే శ్రీదత్తాత్రేయస్వామి వారిని కూడా స్థాపించారు.

ఎక్కడైతే గాయత్రీమాతను స్థాపించారో అక్కడ రాత్రింబగళ్ళు మంత్రజపం జరగాలి, అప్పుడే ఆ స్థానంలో ఉన్న దైవీశక్తులు జాగృతం అవుతాయి, ఇందుకోసం మీరు చాలా కష్టపడి పనిచేయాలని నిర్దేశించారు. సీతామహాలక్ష్మీగారు మాస్టర్‌గారి నిర్దేశాలను తు.చ తప్పకుండా అమలు చేసేవారు. ఉదయం పూట ఆసనాలు, ప్రాణాయామాలు తరువాత యజ్ఞము జరిగేది. రెండుపూటలా ఆరతులు ఇస్తూ, అఖండజపం చేసే సాధకుల సమూహాన్ని ఏర్పాటు చేశారు. అది మాస్టర్‌గారు తమ అఖండ తపశ్శక్తితో స్థాపించిన ప్రథమ అనుగ్రహపీఠం. ఎంతో శక్తివంతమైన పీఠం. ఈనాటికీ అక్కడ ప్రదక్షిణలు, సాధనలు, నవరాత్రి సాధనలు, వ్రతాలు, పూజలు దేదీప్యమానంగా జరిగిపోతూనే వున్నాయి. ఈ అనుగ్రహపీఠంలో మాస్టర్‌గారు అనేక అద్భుతమైన సాధనా శిబిరాలను నిర్వహించారు, అనేకమంది సాధకులను తయారుచేసారు. మాస్టర్‌గారు ఇచ్చిన విశ్వఏకీకరణ యజ్ఞం ఇక్కడ ప్రతి ఆదివారం ఇప్పటికీ జరుగుతుంది. నిష్ఠగా పన్నెండు వారాలు చేసుకున్నవారి కోరికలు తీరుతున్నాయి. అదొక ప్రయోగాత్మక యజ్ఞం. శ్రీమతి సీతామాహాలక్ష్మీగారు ఈ అనుగ్రహ పీఠం నుండి చాలా మంది సక్రియ కార్యకర్తలను తయారుచేసారు.

తరువాత చీరాల శ్రీసుబ్బారావుగారి ఇంటి మేడ పై భాగాన్ని వారు పూర్తిగా పీఠం ఏర్పాటు చేసేందుకే కేటాయించారు. ఇక్కడ మాస్టర్‌గారు స్థాపించిన పీఠం పేరు 'బ్రాహ్మీ' అనుగ్రహపీఠం. ఈ పీఠంలో కూడా శ్రీసుబ్బారావుగారు, పార్వతిగార్లు నియమంగా పైన చెప్పిన అన్ని కార్యక్రమాలను యధావిధిగా చేస్తూనే ఉండేవారు. ఇక్కడ సాధనాశిబిరాలు కూడా చాలా జరిగాయి. తరువాత ఓడరేవులో ఆశ్రమాన్ని స్థాపించాక మాస్టర్‌గారి ఆదేశాల మేరకు ఆ పుణ్యదంపతులు అక్కడికి వెళ్ళి ఆశ్రమస్థాపనకు కృషి చేసిన విషయం అందరికీ తెలిసిన విషయమే. వేటపాలెంలో మందాకిని, శాంభవి అనుగ్రహపీఠాలు – వరంగల్‌లో సరస్వతీ అనుగ్రహపీఠం, 1996 కార్తీకపూర్ణిమకు ఉండవల్లిలో దత్తాత్రేయ అనుగ్రహపీఠం స్థాపించారు. ఆనాటి నుండి చెన్నకేశవరావుగారు, ఆయన కుమార్తె గౌతమిగారు నిత్యసాధనా అనుష్ఠానములను, యజ్ఞాలను చేస్తూ చుట్టుప్రక్కల గ్రామాలను జాగృతం చేశారు. 2006 నుండి గీతాయజ్ఞములు, భాగవత, చండీ హోమాలను అకుంఠిత దీక్షతో చేస్తూ కృష్ణమ్మకు హారతులు ఇస్తున్నారు. వారి కార్యక్రమముల శృంఖల బ్రహ్మాండంగా జరిగిపోతున్నది. ఇంకా అమలాపురం, గుంటూరు, విజయవాడ, రంగాపురం, ఏలూరు, కాట్రేనికోన, మేదరమెట్ల, నరసరావుపేటలో అనేక గ్రామాలలో నిష్ఠాపరులైన కార్యకర్తలు ఇలా ఎన్నో పీఠాలు స్థాపించారు. శ్రద్ధతో వీరు రోజువారీ అన్నీ కార్యక్రమాలను చేస్తున్నారు. ఇవన్నీ ఋషుల కార్యక్రమాలకు ప్రత్యక్ష సాధనా కేంద్రాలు. అక్కడ ఎవరు ఏ కార్యక్రమాలను చేస్తున్నా అదంతా అదృశ్యశక్తుల సహాయంతోనే జరుగుతుంటాయని చెప్పేవారు. ఎర్రబాలెంలో శ్రీశర్మగారు స్థాపించిన శ్రీకృష్ణానంద ఆశ్రమంలో కూడా గురుదేవుల ఆదర్శాల ప్రకారం కార్యక్రమాల నిర్వహణ అద్భుతంగా జరుగు తున్నది. ఆ ఆశ్రమం అంటే మాస్టర్‌గారికి ప్రత్యేకమైన అభిమానం. ఈ ప్రాంగణంలోనే కార్యసిద్ధి ఆంజనేయస్వామివారి విగ్రహాన్ని పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు తమ దివ్యహస్తములతో ప్రతిష్ఠించారు. అది ఆ క్షేత్రానికే ఒక దివ్యత్వాన్ని ప్రసాదించింది. శ్రీశర్మగారు వందలాది గోవులకు సేవ చేసుకుంటూ, గాయత్రీ పాఠశాలను స్థాపించి ఉచిత విద్యను చెప్పిస్తూ, పిల్లలను చక్కటి సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతూ గురుదేవుల ఆదర్శాలను అమలుచేస్తున్న ధన్యజీవి.

దీని తరువాత నంబూరులో రమణకుమారిగారు ఉన్నప్పుడు మూడురోజుల పాటు ద్రవాహారం తీసుకుంటూ గాయత్రీ అనుష్ఠానాలు చేయించి మాస్టరుగారే స్వయంగా 'శ్రీకృష్ణశ్యామకమలనయన' అనే అనుగ్రహపీఠాన్ని స్థాపించారు. ఈనాటికీ ఆ పీఠంలో అనుష్ఠాన, యజ్ఞాది కార్యక్రమాలు శ్రీమతి శివకుమారిగారి ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా జరుపబడుతున్నాయి.

## ఆశ్రమాలను, అనుగ్రహ పీఠాలను స్థాపించుటలో గల అంతరార్థం

1996వ సంవత్సరం నుండి అత్యంత వేగంతో ఆశ్రమాలను, అనుగ్రహ పీఠాలను మాస్టర్ గారు ఎందుకు స్థాపించారు? దీని వెనుకన గల పరమార్థం ఏమిటని ఆలోచించినప్పుడు ఒకసారి సప్తర్షి ఆశ్రమంలో వారిచ్చిన ప్రవచనం ద్వారా చాలా స్పష్టంగా జవాబు దొరికింది. ఆ రోజు సాయంత్రం మాస్టర్‌గారిచ్చిన ప్రచండమైన ప్రవచనాన్ని కనుక చాలా సూక్ష్మంగా వింటే, ఈనాటి పరిస్థితులు ఎంత భయంకరంగా వున్నాయి, వాటి నుండి ఈ పృథ్వీగ్రహాన్ని, మానవజాతిని రక్షించటానికి ఋషులు, మహాత్ముల స్థాయిలో ఎలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయో అర్థమౌతుంది.

**గురువుల దివ్యశక్తికి సమర్పణ చేసుకోలేకపోతున్నాం. వారికి మనము ఇవ్వవలసినంత ప్రాముఖ్యతను ఇవ్వలేకపోతున్నాం అని కూడా మనకు తెలియడంలేదు. ఈనాటి మనిషిలో ఒక లోపం వున్నది. ఈ సంపూర్ణ సృష్టి వాడి కోసమే సృష్టించబడిందనే ప్రలోభపూరితమైన ఆలోచనతో దూలాల కోసం చెట్లను నరుకుతున్నాడు. కంకర కోసం కొండలను పిండిచేసి పారేస్తున్నాడు. ఇసుక కోసం నదీతీరాల వెంబడి ఉన్న ఇసుకను పాడు చేస్తున్నాడు. ఇనుము, బంగారాల కోసం గనులను త్రవ్వుతున్నాం. అలా పృథ్వి యొక్క సమస్త సంపదంతా తన కోసమే అనే భ్రమలో మనిషి ప్రకృతి సంపదనంతా కొల్లగొట్టేస్తున్నాడు. ఇదంతా దేనికోసం? అనేది ఆలోచించం. దీనివలన భయంకరమైన శిక్షను అనుభవించబోతున్నామనేది కూడా అర్థం కావటంలేదు.**

రాబోయే రెండు సంవత్సరాలలో మానవజాతి కళ్ళుతెరవకపోతే ఈ పృథ్వీ మొత్తం సర్వనాశనమై పోతుంది. అలాంటి పరిస్థితులలో ఇంత తెలిసిన మీరేం చెయ్యబోతున్నారు? ఇంకొక రెండు సంవత్సరాల పాటు ఇదే పరిస్థితి కొనసాగితే కనుక మొత్తం ప్రపంచం సర్వనాశనమై పోవచ్చునని మేధావులు చెప్తున్నారు. ఇంత జ్ఞానాన్ని ఇచ్చిన ఋషుల ప్రణాళికలను మనం అర్థం చేసుకొని రాబోయే రెండు సంవత్సరాలలో వేయబోయే ప్రతి అడుగు పృథ్వీ యొక్క భవిష్యత్ నిర్మాణం కొరకు మాత్రమే వెయ్యాలి. ప్రపంచ పరిస్థితులు విచిత్రంగా మారిపోయి, ప్రభుత్వాలు వంద రోజులు కూడా పని చేయలేకపోతున్నాయి. కానీ భారతదేశం యొక్క సౌభాగ్యం ఏమిటంటే ఈ దేశంలో జన్మించిన మహాపురుషులు – వాళ్ళు చనిపోయినా కూడా ఇంకో శరీరంతో అనేక మందికి రక్షణ కల్పిస్తున్నారు. ఈనాడు విశ్వామిత్రుడులాంటి మహాపురుషుడు మన మధ్యకు వచ్చినా మనం గుర్తించలేకపోతున్నాము, వాళ్ళను ఉపయోగించుకోలేకపోతున్నాము. (ఇందులో గల అంతరార్థం ఏమైవుంటుంది?)

ఒక శిరిడీసాయి, ఒక రామకృష్ణ పరమహంస, రాముడు, కృష్ణుడు, శ్రీరామశర్మఆచార్య, రమణమహర్షి, జిల్లెళ్ళమూడి అమ్మ వీళ్ళంతా మన సమస్యలు తీర్చటానికి పుట్టారా? కేవలం ఒక్క మనిషి కోసం వాళ్ళు రాలేదు. సమస్త విశ్వాన్ని రక్షించేందుకే వారీ భూమ్మీదకు వచ్చారు. వాళ్ళు జీవించి వుండగా వాళ్ళను గురించి ఎవరూ ఏమీ అర్థం చేసుకోలేకపోయారు. ఇంత చెప్తున్నా మీలో రావలసిన స్పందన రావటం లేదు.

ఇన్ని ఆశ్రమాలు, అనుగ్రహ పీఠాలు స్థాపించటంలో గల ఉద్దేశ్యాలను, లక్ష్యాలను మీరు అర్థం చేసుకోలేక పోతున్నారు. సప్తఋషులతో సహా ఎంతోమంది భూమ్మీదకు వస్తున్నారు. ఈ యుగసంధికాలంలో వాళ్ళ పని వాళ్ళు చేసుకోవాలి. అది మనకు అర్థం కావటంలేదు. విశ్వామిత్రుడే స్వయంగా వచ్చి రామ,లక్ష్మణులను తనతో తీసుకువెళతానంటే దశరథుడు ఒప్పుకోలేదు. పరిణామ క్రమ విశిష్టతనెరిగినవారు కనుక వశిష్టులవారు వచ్చి రామ,లక్ష్మణులను పంపమని దశరథునకు చెప్తాడు. విశ్వామిత్రుడి లాంటి గురువు వచ్చినా ఆయన నేర్పే బల, అతిబల అనే విద్యలను నేర్చుకోగలిగే, ఉపయోగించగలిగే రామ, లక్ష్మణుల్లాంటి శిష్యులు కూడా రావాలి కదా! వారిద్వారా మాత్రమే దుష్టశిక్షణ, శిష్టరక్షణ జరిగి పరిణామక్రమములో సువ్యవస్థ వస్తుందనేది మనమీనాడు గుర్తించాలి.

సప్తఋషులు, అరుంధతితో సహా ఈ భూమ్మీదకు దిగారు. జూలై నాల్గవ తేదీ దాకా వాళ్ళు ఆగలేదు. వాళ్ళ ద్వారా కావలసిన పని తీవ్రత అంత ఎక్కువగా వున్నది. అందుకే భూమ్మీదకు దిగిపోయారు వాళ్ళు. గుర్తించగలిగారా మీ అదృష్టం లేకపోతే మీ దురదృష్టం. వాళ్ళయితే దిగి పోయారు. వాళ్ళ పనిని వాళ్ళు చాలా చురుకుగా, వేగంగా ముందుకు నడుపుకెళుతున్నారు. ఒక సంవత్సరంలో జరిగే పనిని వాళ్ళు మూడు, నాలుగు రోజులలోనే పూర్తి చేసేస్తున్నారు.

ఆశ్రమాలలో వున్నవాళ్ళు, అనుగ్రహ పీఠాలలో వున్న వాళ్ళు కాస్త కళ్ళు తెరచి చూస్తే వాళ్ళ ప్రణాళికలు అర్థమౌతాయి. యుద్ధం జరుగుతున్నప్పుడు మీరు యుద్ధంలోకి వెళ్ళలేకపోయినా, సైనికులకు అన్నపానాదులను అందించవచ్చు. వాళ్ళకు కావలసిన సహాయ, సహకారాల నందించవచ్చు. వాళ్ళు చేస్తున్న రక్షణ మీకేం తెలియకపోయినా మీకు చేతనైన సహాయాన్ని మీరు చెయ్యవచ్చు. అదీ ఎంతో అవసరమైనదేగదా! మీరు మీ ఆశ్రమాలు, మీ అనుగ్రహ పీఠాలు చాలా గొప్పగా పని చేస్తున్నాయనే భ్రమలో పడవద్దు. అందరూ కలిసి పని చేస్తేనే ఒక భవంతి

నిర్మాణం త్వరగా పూర్తౌతుంది. అలాగే గురువుల పనిని వారితో కలిసి మీరూ చేస్తే పనిలో పని మీ పనీ అయిపోతుంది. మిలటరీలో చేరిన వాడికి, వాడి కోటా ప్రకారం వాడి లాభం వాడికీ వస్తుంది. అర్థమైంది గదా ! మరి వ్యక్తి తన సుఖాన్ని, సౌభాగ్యాన్ని ప్రక్కన పెట్టి ఇలాంటి విపత్కర పరిస్థితులలో ఋషులతో కలిసి, మెలిసి గంటలు, గంటలు పని చెయ్యాల్సివుంటుంది. వారు అదృశ్యసహాయకులుగా మీ ప్రక్కనే వుంటారు. ఆశ్రమాలలో గానీ, పీఠాలలోగానీ నేనిచ్చిన సాధనలను నిర్ణీత సమయాలకు చేయించండి. గుడులలో, మిగతాచోట్ల జరిగే కార్యక్రమాలకు మన ఆశ్రమాల మరియు పీఠాలలో జరిగే కార్యక్రమాలకు చాలా తేడా వుంది. మీకు తెలియదు అదేమిటో, తెలియాల్సిన పని కూడా లేదు. యుద్ధంలో సైన్యాధ్యక్షుడి ఆదేశాల మేరకు పని చేస్తే సరిపోతుంది. ఇక్కడా అంతే! 14 కేంద్రాలశక్తి ఒక్కచోటనే కేంద్రీకరింపబడిందీనాడు. 14 భువనాలకు కావలసిన శక్తిని ఎలా పంచగలమో మీకేం తెలుసు? ఇంతటి మహత్తరమైన అవకాశం మీముందున్నది. అహంకారంతో దానిని దుర్వినియోగం చేసుకోవద్దు' అని హెచ్చరించారు. అలా దైవీ ప్రణాళికలను ముందుగా చెప్పడమే కాకుండా అందరినీ అందులో భాగస్వాములను చేసి పరిణామక్రమంలో వాళ్ళ ఉన్నతికి దోహదం చేయడమనేది వారి దివ్యత్వానికి నిదర్శనమని చెప్పాలి.

## జగజ్జనని ఆలయం

ఒక ప్రక్కన వివిధ ఆశ్రమాల నిర్మాణాలూ, వాటి సాధనాలను వ్యవస్థీకృతం చేస్తూనే గుంటూరులో తాము ఉంటున్న ఇంటి ముందు భాగాన్ని ఒక చక్కటి ఋష్యాశ్రమంలాగా మార్చేస్తున్నారు. మాస్టర్‌గారు చెప్పింది, చెప్పినట్లుగా తక్షణమే నిర్మించే బాధ్యతను సమర్పణా భావంతో శ్రీరంగనాయకులు, మణికుమార్ గార్లు చేస్తుండేవారు. ఆశ్రమానికి కరెంట్ వేసే పనిని రాత్రంతా శ్రీ జయరాం, కృష్ణమోహన్‌గార్లు ఎంతో శ్రద్ధా, భక్తులతో చేసేవారు. దీంతో పాటుగా ఆ రోజులలో మాస్టర్‌గారి సాధనంతా 'శ్రీచక్రం' చుట్టూనే జరుగుతుండేది. అందుచేత ఆశ్రమంలో ఒక విభాగంలో దాని నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు. పనులన్నీ వీలైనంత వరకు రాత్రిళ్ళు కూడా జరుగుతుండేవి. ఎప్పుడు ఏ ఆశ్రమంలో పనులు జరుగుతున్నా మాస్టర్‌గారు నిద్రపోయేవారుగారు. వాళ్ళతో పాటు తామూ మేలుకొని ఉండటమే కాకుండా, వాళ్ళతో కబుర్లు చెప్తూ మధ్య, మధ్యలో వారికి ఆకలౌతుందేమోనని తినటానికి ఏదో ఒక టిఫిను, కాస్త టీ, కాఫీల్లాంటివి చేయించి పెట్టించి దగ్గరుండి వాళ్ళు తినేదాకా సరదాగా ఏదో ఒకటి చెప్తుండేవారు. అంతటి దయ, ప్రేమ, కారుణ్యం వారిలో ఓతప్రోతమై వుండేవి. అసలు 'ఆత్మవత్ సర్వభూతేషు' అనే ప్రమాణానికి నిలువెత్తు

సాక్ష్యం మాస్టర్‌గారు. ఆనాడు వారితో కలిసి పనిచేసిన భాగ్యవంతులు అసలా రోజులను తలుచు కుంటేనే ఏమిటో తెలియని ఆనందంగా వుందంటారు. వారు తమ అనుభవాలను, అనుభూతులను ఎంత అందంగా వర్ణిస్తారో మాటలలో చెప్పలేం. అలా వుండేవి ఆ రోజులు.

ఆగష్టు 5వ తేదీ ఉదయం 'జగజ్జనని మహాయోగేశ్వరీ, ఏకైక అఖండ గురుసత్తా' ల గుడికి శంఖుస్థాపన చేశారు. తర్వాత దాని విశిష్టతను వివరిస్తూ ఆగష్టు15 జన్మాష్టమి నాటికి ఈ దేవాలయం పూర్తికావాలి. ఆ రోజున ఈ ప్రాంగణంలో విశేష కార్యక్రమాలు చెయ్యాలి. దానికి మీరు రాత్రీ, పగలు అవిశ్రాంతంగా ఎంతో ఉత్సాహంతో పని చేయవలసివుంటుందని చెప్పారు. తర్వాత శ్రీమల్లిఖార్జునగారితో 'మహాయోగేశ్వరీదేవి, అఖండగురుసత్తా'ల చిత్ర పటాలను ఆర్టిష్టుతో వేయించమని చెప్తూ వాటి కొలతలను కూడా వివరించారు. మాస్టర్‌గారిలో వున్న ఒక విశేషం, 'ఏ పనైనా తక్షణమే చెయ్యటం'. ఆ అనుభవంతోనే పనివాళ్ళు సైతం చెప్పిన సమయానికి పనిని పూర్తిచేశారు. శ్రీకృష్టాష్టమినాడు "జగజ్జనని మహాయోగేశ్వరీ సహిత ఏకైక అఖండ గురుసత్తా" ప్రతిష్టా కార్యక్రమం అద్భుతంగా జరిగింది. అశేష ప్రజానీకం ఆ మహాప్రయోగంలో పాల్గొని తమవంతు సహకారాన్నందించి జీవితాలను ధన్యం చేసుకున్నారు.

అలా ప్రారంభించిన నిర్మాణ కార్యక్రమాలు ఒక్కొక్కటిగా చెయ్యడానికి ప్రక్కనే ఉన్న స్థలాన్ని కొనుగోలు చేయటం జరిగింది. ఆశ్రమనిర్మాణంలో ప్రధమచరణంగా ఒకేసారి 500మంది కూర్చుని సాధన చేసుకోవటానికి వీలుగా వుండే విశాలమైన హాలు, దానితర్వాత శ్రీ శిరిడీసాయి, శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీ దత్తాత్రేయస్వామి వారలకు దివ్యమందిరాలు, వృత్తాకార యజ్ఞశాల మొదలైన వాటి నిర్మాణాల కార్యక్రమం చురుగ్గా ముందుకు సాగుతున్నది. వీటన్నింటితో పాటు సప్తఋషులకు, అరుంధతిమాతలకు రెండు అడుగుల ఎత్తులో సింబాలిక్‌గా సిమెంటు దిమ్మలను ఏర్పాటు చేశారు.

సాధారణంగా ఎవరైనా ఏదైనా పని చెయ్యాలనుకుంటే దానికి తగిన వనరులను పూర్తిగా సమకూర్చుకొని పని మొదలుపెడతారు. కానీ మాస్టర్‌గారిలో మనం ఎక్కడా చూడని ఒక ప్రత్యేకత వున్నది. అదేమిటంటే పని యొక్క ఆవశ్యకతను బట్టి దాని నమూనాను అక్కడ ఏర్పరచుకొని దాని ద్వారా ఆ చైతన్యాన్ని సమర్ధవంతంగా, సక్రియం చేసి తాము చేయదలుకున్న పనులను ఇట్టే చేసేవారు. అలా వారు, తమ ప్రజ్ఞతో అతి సరళమైన, విధివిధానాలతో, అసంభవాలను సంభవాలను చేయడమనేది, వారితో సన్నిహితంగా వుండేవారి అనుభవాలు.

ఆశ్రమంలో మెల్లిమెల్లిగా ఒక్కక్క నిర్మాణం తయారౌతున్నది. ఇంతలో భాద్రపదమాసం వచ్చింది. అంతే గణేశపూజతో ఆశ్రమంలో మొదటి కార్యక్రమం ప్రారంభమైంది. గణేశనవరాత్రులలో తొమ్మిదిరోజుల సాధన నిర్విఘ్నంగా జప, అనుష్టానాలతో పూర్తయిపోయింది. చివరి రోజున పూర్ణాహుతికి ఆశ్రమానికి వచ్చిన సాధకులతో ఆ ప్రాంగణం కళకళలాడిపోయింది. వెనువెంటనే సెప్టెంబరు 21 నుండి దేవీనవరాత్రులు ప్రారంభమయ్యాయి. అన్ని ఊళ్ళ నుండి సాధకులు వచ్చారు. ముందురోజే నవరాత్రులలో జరిగే సాధనా క్రమాన్ని వివరించారు. ప్రతిరోజూ ఉదయం – దుర్గాసప్తశతి 13 అధ్యాయాలతో, మధ్యాహ్నం లలితాసహస్ర నామాలతో, సాయంత్రం భగవద్గీత 18 అధ్యాయాలతో యజ్ఞం చేయించేవారు. ఇది కాకుండా నాలుగు గంటలు జపం. దీనితో పాటు స్త్రీలు వంటచేసి అందరికీ భోజనాల ఏర్పాట్లు కూడా చేసేవారు. అయినా అలసట అనేది తెలిసేది కాదు. ఎంతో ఉత్సాహంతో, ఆనందంతో కలిసిమెలిసి సాధనలు చేస్తూ, యజ్ఞాలను చేస్తూ, పనులు చేస్తూ, ఆశ్రమం అంటే ఇలా వుండాలనిపించేలా అందరూ కలసి 'జీవనదేవతా ఉపాసనను' చేశారు. తొమ్మిదిరోజుల పాటు ఇంత అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చిన పూజ్యశ్రీ మాస్టర్‌గారికి మనస్సులోనే పదేపదే ధన్యవాదాలు చెప్పుకునేవారు.

దుర్గాసప్తశతీ యజ్ఞంలో ఆహుతులివ్వటానికి "ముద్గొదనము" అనే మహాప్రసాదాన్ని చెయ్య మన్నారు మాస్టర్‌గారు. అది ఎలా చెయ్యాలంటే – బియ్యం... రెండు కిలోలు, బెల్లం.. అర కిలో, పాలు... పావులీటరు, ఆవునెయ్యి...120గ్రాములు, ఒక కొబ్బరికాయ తురుము, 12 అరటిపండ్లు వీటితో ప్రసాదం చేయించి మహాపూర్ణాహుతి నాడు ఆహుతులు వేయించారు. ఈ కార్యక్రమంలో మహాసరస్వతీ, మహాలక్ష్మీ ,మహాకాళీ సాధనా రహస్యాలను అత్యద్భుతంగా వివరించారు. ఇంక అప్పటినుంచీ అన్ని ఆశ్రమాలలో, అనుగ్రహపీఠాలలో దేవీనవరాత్రులకు సప్తశతీ పారాయణ మహాపూర్ణాహుతీ సాధన ఒక ఆనవాయితీగా వచ్చేసింది.

## ద్వాదశరాశి నవగ్రహ అష్టోత్తర శత నక్షత్ర పాద మహాకాలయజ్ఞము

గాయత్రీ మంత్రంతోపాటుగా గురుదేవులందించిన యజ్ఞాలు, దీపయజ్ఞాలు, కొన్ని కొన్ని సందర్భాలలో యుగయజ్ఞాలను చేయించేవారు. అయితే కొంతకాలం క్రిందట మాస్టర్‌గారుండే ఇంటిలో సాయంత్రం వేళలలో ఒక యజ్ఞంకుండం పెట్టించి దానిపైన ఐదుదీపాలు వెలిగించి, ఐదు అగరుబత్తీలు వెలిగించి రోజుకోరకమైన సాధనలు చేయించేవారని ముందు పేజీలలో

చదువుకున్నాం. కాలక్రమంలో మాస్టర్‌గారింటికి దాదాగురుదేవులు వచ్చారనీ కొన్ని విశేషమైన సూచనలనిచ్చారని చదువుకున్నాము. సూచనల అంతరార్థం ఏమిటనేది ఇదమిద్ధంగా తెలియదు కానీ ఆ తరువాత కాలం నుండి మాస్టర్‌గారు చేయించే యజ్ఞాలన్నీ మహాకాలయజ్ఞాలుగానే జరిగాయి. ముందుగా మహకాల యజ్ఞము అంటే ఏమిటో తెలుసుకుందాం. ప్రకృతిలోని శక్తులకు, సాధకుల అవసరాలకు మధ్య సమన్వయకర్తగా యజ్ఞవిద్య ఉపయోగపడుతుంది. మనిషి ఉపయోగించుకునే ప్రముఖమైన శక్తులన్నీ ద్వాదశరాసులలో వుండే 27 నక్షత్రాల యొక్క 108 పాదాల నుండి నవగ్రహముల ద్వారా లభిస్తాయి. ఇంకా కాలగణన కూడా వీటి మీదనే ఆధారపడి ఉంటుంది. అందుచేత వీటన్నింటి మీద సమగ్రమైన అవగాహనను పొంది అవసరాన్ని బట్టి, సమయానుకూలంగా ప్రకృతిగతమైన మార్పులు చేసుకునేందుకు ఈ యజ్ఞం ఉపయోగపడుతుంది.

ఈ యజ్ఞంలో అతి కీలకమైన పాత్ర వహించేది 12 ఇటుకలు. ఇవి ద్వాదశరాసులకు సంకేతాలు మాత్రమే కాక మన శరీరంలో, ద్వాదశరాసులకు సంకేతాలైన 12 విభిన్న అంగాలకు ప్రతీకలు. తరువాత యజ్ఞకుండం మీద 8 దిక్కులలో 8 దీపాలు, కుండం మధ్యలో ఒక దీపం వెలిగిస్తారు. ఈ 9 దీపాలు నవ గ్రహాలకు ప్రతీకలు. జగద్గురు శ్రీఆదిశంకరాచార్య విరచిత గురుపాదుకాస్తవం చదువుతూ యజ్ఞకుండానికి పూజ చేయాలి. అలాగే ఈ నవగ్రహాలు మానవశరీరంలో ఏఏభాగాలలో వున్నాయో చెప్తూ

**"బ్రహ్మామురారీ స్త్రిపురాంతకారీ భానుశ్శశి భూమిసుతౌ బుధశ్చ**
**గురుశ్చశుక్ర శ్శనిరాహు కేతవః స్సర్వేగ్రహా శాంతి కరాభవంతు"**

అనే నవగ్రహ శ్లోకం చదువుతూ శరీరంలో ఆ నవగ్రహాల ఉనికిని దర్శించాలి. మిగతా కర్మకాండ అంతా యధావిధిగా గాయత్రీ యజ్ఞంలానే చేస్తారు. ఈ యజ్ఞం ద్వారా గ్రహనక్షత్రముల వలన వచ్చే సమస్యలు నివారించబడి వ్యక్తి జీవితం శాంతి, సౌఖ్యాలతో ఉండగలదని, ఇంకా సర్వమానవ కళ్యాణం ఈ యజ్ఞంవలన జరుగుతుందని మాస్టర్‌గారు యజ్ఞనిర్వహణ సమయంలో తమ ప్రవచనాలలో చెప్పేవారు. ముఖ్యంగా దేశభవిష్యత్తును మార్చగల్గిన శక్తి గాయత్రీ యజ్ఞానికి ఉందనీ, ఈ యజ్ఞం ఒక ఆయుధంలాంటిదని, ప్రకృతి వైపరీత్యాల బారి నుండి రక్షణ పొందటానికి ఇది ఒక దివ్యాయుధమని, దీని వలన వాతావరణ కాలుష్యనివారణ జరిగి, వ్యక్తివ్యక్తిలో సద్బుద్ధి ప్రవర్ధన మరియు విశ్వకళ్యాణం జరిగి తీరుతుందని చెప్తూ ఈ యజ్ఞాన్ని ఒక ఉద్యమం లాగా

గ్రామగ్రామాలలో నిర్వహించినట్లయితే వ్యక్తికి, సమాజానికి శ్రేయస్సు కలుగుతుందని చెప్పటం జరిగింది.

'ద్వాదశరాశి నవగ్రహ అష్టోత్తరశత నక్షత్రపాద మహాకాల యజ్ఞ విధానం' పుస్తకాన్ని తయారుచేసి అచ్చువేయించాలని అనుకుంటుండంగా శ్రీమతి వరలక్షిగారు ఆ పనిని తాము చేయిస్తామని, ఈ మహాకాలయజ్ఞం చిలకలూరిపేటలో చేయమని మాస్టర్‌గారిని అడిగారు. చిలకలూరిపేటలో మొదటగా గాయత్రీ యజ్ఞాలను ప్రారంభించిన వారు శ్రీమద్దివేంకటేశ్వర్లు, వరలక్ష్మిగారి కుటుంబము. వీరి కుటుంబంలో పిల్లలు, పెద్దలు అందరూకూడా ఎంతో శ్రద్ధతో జపాలు, సాధనలు చెయ్యడంతో పాటుగా మాస్టర్‌గారి పట్ల అనన్య భక్తి, శ్రద్ధలు కలిగి ఉండేవారు. వీరి కుమార్తె వనజ జన్మదిన సంస్కారం చేసిన మాస్టర్‌గారు ఆ రోజు అనేక మందికి దీక్షలనిచ్చారు. ఆ తరువాత వారు 1008 కుండాలలో మహాకాల యజ్ఞం చెయ్యాలనే సంకల్పం స్వీకరించి మాస్టర్‌గారి అనుమతితో వేలాదిమంది సాధకులను తయారు చేసి వారి చేత ఈ యజ్ఞం కోసం లక్షలసంఖ్యలో జపాలు చేయించారు. 1997వ సంవత్సరంలో ఆర్.వి.ఎస్ హైస్కూలు ఆవరణలో యజ్ఞానికి అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటిసారి ఇంత భారీగా జరుగుతున్న యజ్ఞానికి వేలాదిమంది భక్తులు తరలి వచ్చారు. ముందురోజు 108 కలశాలతో స్త్రీ, పురుషులు యావన్మందీ పసుపు వస్త్రాలు ధరించి ఊరేగింపుగా వచ్చి హైస్కూలు ఆవరణలో కలశాలను స్థాపించారు. అనంతరం కలశపూజ యధావిధిగా చేశారు. మరునాడు ఉదయం 8 గంటలకే మాస్టర్‌గారు యజ్ఞశాలకు విచ్చేసి యజ్ఞం ప్రారంభించారు. సరిగ్గా అదేసమయానికి మహాకాల యజ్ఞపుస్తకాన్ని అచ్చు వేయించి ఈ యజ్ఞంలోనే దానిని పూజ్యశ్రీ మాస్టర్‌గారి చేత ఆవిష్కరింప చేశారు. అత్యంత సుందరంగా తయారై వచ్చిన ఆ పుస్తకాన్ని చూచి మాస్టారు ఎంతో ముచ్చటపడిపోయారు. ద్వాదశరాసి నవగ్రహ అష్టోత్తరశత నక్షత్ర పాద మహాకాల యజ్ఞం 1008 కుండీలలో స్వయంగా మాస్టర్‌గారే నిర్వహించిన ఈ యజ్ఞం ఎంతో భవ్యంగా జరిగింది. అందరూ దివ్యలోకాలలో విహరించినంత ఆనందాన్ని పొందారు.

దీని తరువాత పూజ్యశ్రీ మాస్టర్‌గారిచ్చిన అనన్య ప్రేరణతో అశేష ప్రజానీకంతో గాయత్రీ మంత్ర అనుష్టానాలు చేయించి నర్సరావుపేట పట్టణంలో స్థానిక మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో కార్తీక పూర్ణిమనాడు 14-11-1997వ తేదీన శుక్రవారం ఉదయం 7గంటలకు 1008 కుండీలలో

ఎస్.ఎస్.వై గురూజీ శ్రీమతి రాఘవమ్మగారు ఈ "ద్వాదశరాశి అష్టోత్తర శత నక్షత్రపాద మహాకాల యజ్ఞం"ను మాస్టర్‌గారితో చేయించారు. ఈ మహాయజ్ఞంలో 1008 దంపతులు కూర్చొని భక్తి, ప్రపత్తులతో యజ్ఞం చేసుకున్నారు. వేలాదిమంది ఈ మహాయజ్ఞాన్ని వీక్షించారు. ఎంతో శ్రద్ధతో, క్రమశిక్షణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్.ఎస్.వై గురూజీ శ్రీమతి రాఘవమ్మగారిని మాస్టర్‌గారు మనసారా అభినందించారు.

తరువాత కాలంలో శ్రీమతిశ్యామల, రాఘవమ్మగార్లు కలిసి గుంటూరులో మాస్టర్‌గారి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఈ మహాకాల యజ్ఞములను చేసి భగవంతుని పనిలో భాగస్వాములైనారు. అసలు యజ్ఞమనేది సమాజం పట్ల మనం ఋణమును తీర్చుకోగలిగే ఒక అద్భుతమైన పుణ్యకార్యం. యజ్ఞాల వలన యావత్ ప్రపంచమును సుగంధభరితం చేయటానికి హోమములో వేసే హవనద్రవ్యము, నెయ్యి, ఎండు కొబ్బరి ఇవంతా సకల ప్రాణులకు పుష్టిని, రోగనివారకశక్తిని అందించటానికి, తద్వారా సద్భావనలను ఉత్పన్నం చేయటానికి ఎంతో దోహద పడతాయి, ఇలా ఈ మహాకాల యజ్ఞపరంపర నిర్దిష్టమైన ఒరవడిలో వివిధ ప్రాంతాలలో విజయ వంతంగా స్థానిక కార్యకర్తల శ్రద్ధతో అనూహ్యంగా ముందుకు వెళ్ళిపోసాగింది.

ఇలాగే రేపల్లెలో భగవాన్ శ్రీసత్యసాయి ఉన్నతపాఠశాల ఆవరణలో పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు ఈ మహాకాల యజ్ఞాన్ని చేయటం జరిగింది. ఇందుకోసం అక్కడి కార్యకర్తలు శ్రీశాంతారావు, శ్రీమణికుమార్, రమణకుమారి, సీత మొదలైనవారి అకుంఠిత దీక్ష, దక్షతలతో శ్రమించారు. అందుచేత కార్యక్రమం కూడా ఎంతో అపూర్వంగా జరిగింది. ఈ కార్యక్రమం చేసిన కొంతకాలం తరువాత రేపల్లె దగ్గర ఉన్న కొత్తపాలెంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు చంద్రవిద్యా కేంద్రమనే పేరుతో "శ్రీ అగస్త్యాశ్రమాన్ని" స్థాపించడమనేది ప్రకృతి ప్రసాదించిన ఒక నియతి. ఇలాగే అమలాపురం, ఒంగోలు, వేటపాలెం, ఓడరేవు, మార్కాపురం, గుంటూరు, హైదరాబాద్ ఇంకా అనేక ప్రాంతాలలో స్థానిక కార్యకర్తలు అత్యంత శోభాయమానంగా అత్యంత సరళమైన ఈ మహాకాల యజ్ఞాలను నిర్వహించటం అపూర్వం.

## ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనం

మార్కాపురంలో కూడా ఈ మహాకాల యజ్ఞాన్ని జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో చేశారు. యజ్ఞం అయిపోయిన మరునాడు మాస్టర్‌గారు శ్రీశైలం వెళ్లి, అక్కడ నుండి శ్రీశైలం అడవులలో

వున్న ఇష్టకామేశ్వరీ అమ్మవారిని చూడాలన్నారు. అప్పటికప్పుడే శ్రీసునందనరావుగారు శ్రీశైలం వెళ్ళటానికి రెండు కార్లు సిద్ధం చేశారు. శ్రీశైలం అడవులలో అమ్మవారిని చూడాలంటే చాలా లోపలికి వెళ్ళాలి. బాట బాగా అనుభవం ఉంటేనే తప్ప లోపలికి వెళ్ళటం చాలా కష్టం. శ్రీపూర్ణానంద స్వామి శిష్యులైన శ్రీగంజాం విజయకుమార్‌గారు, శ్రీపూర్ణానందస్వామి వారి ఆశ్రమంలో వున్న ఆ బాట తెలిసిన ఇద్దరు కోయవాళ్ళను అక్కడి వెళ్ళడానికి సహాయంగా తీసుకువచ్చారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారితో పాటు మావారు, శ్రీరామసుబ్బయ్య, విజయకుమార్ వాళ్ళు మాత్రమే వెళ్ళారు. అమ్మవారికని పసుపు, కుంకుమ, పూలు, కొబ్బరికాయలు ఇంకా ఆ రాత్రి వీళ్ళు తినటానికని పులిహోర, పెరుగన్నం తీసుకొని ఉదయాన్నే బయల్దేరారు. ఆ రోజులలో దోవ సరిగ్గా వుండేది కాదు. నడవటం కూడా చాలా కష్టమే. ఇంకా పైన ఆ రోజున భరించలేనంత ఎండగా వుంది. ఆ ఎండ భరించలేక మాస్టారు, 'వరుణావాహన చెయ్యండి సత్యనారాయణగారూ' అన్నారు. తక్షణమే శ్రీసత్యనారాయణగారు 'వరణావాహన మంత్రం' చదువుతూ వరుణదేవుణ్ణి ఆహ్వానించారు. అంతే ఓ పదినిమిషాలలో ఆకాశం మేఘావృతమై కుంభవృష్టిగా వర్షం కురిసింది. (అలా వర్షం కురవటమనేది మాస్టరుగారి వాక్శక్తి ప్రభావమే !) తీసుకువెళ్ళిన పదార్థాలన్నీ తడిసి పోయాయి. అయితేనేం. వాతావరణం చల్లబడి పోయింది. అందరికీ హాయిగా అనిపించింది. ఎలాగైతేనేం సాయంత్రానికంతా వారు అమ్మవారి దగ్గరకు వెళ్ళారు. చాలా చిన్న గుడి. వంగి లోపలికి వెళ్ళాలి. గుడిలో నుండి అమ్మవారిని పైకి తెప్పించి మాస్టారుగారే స్వయంగా అమ్మవారికి పూజచేసి, కొబ్బరికాయలు కొట్టి నివేదన చేసి, కాసేపు ధ్యానంలోకి వెళ్ళిపోయారు. అమ్మతో మనసారా మాట్లాడుకొని వుంటారు. ఆమె ఏదో పెద్ద ప్రణాళికే ఇచ్చి వుంటుంది. అదేమిటో మనకు తరువాత తెలుస్తుంది. ఇంతలో చీకటి పడింది. అదే సమయానికి కోయవాళ్ళు వచ్చి నెగళ్లు వేశారు. 'సామీ, జాగ్రత్తగా ఉండండయ్యా. పులులు అవీ వస్తుంటాయి' అని హెచ్చరించారు. ఆ రాత్రంతా ఎవ్వరూ నిద్రపోలేదు. మాస్టర్‌గారు చెప్పే మాటలు వింటూ మధ్యమధ్యలో నిద్ర జోగుతున్నారు. తెల్లారుఝామైంది. లేచి 'అమ్మకు ఆరతి ఇవ్వమని' చెప్పారు మాస్టర్‌గారు. లోపల ఆరతి ఇస్తుండగా బయట వేసిన నెగళ్ళ నుండి ఠాప్, ఠాప్ మని పెద్దపెద్ద శబ్దాలు వచ్చాయి. గుడిలో వెలిగించిన ఆరతిలో నుండి ఒక వెలుగు నేరుగా వెళ్ళి ఆ యజ్ఞకుండంలో కలిసి పోయింది. అందరూ ఆ దృశ్యాన్ని చూచి తరించారు. తెల్లారిపోయింది ఇంక అందరూ తిరుగు ప్రయాణమయ్యారు. త్రోవలో అడిగారు, "ఆరతి సమయంలో అంత శబ్దాలు ఎందుకు వచ్చాయి."అని. మాస్టర్‌గారు

చెప్పారు, "ప్రతి రోజూ ఈ సమయంలో శ్రీ అగస్త్యమహర్షివారు వచ్చి అమ్మకు ఆరతి ఇస్తారు. ఇవాళ అలా యజ్ఞంలో ఆహుతినిచ్చారు. ఆ శబ్దం అదే" అన్నారు. ఆ మాటలు వింటూనే అందరూ పులకరించిపోయారు. ఆ మహనీయుని ఉపస్థితిని అలాగైనా లభ్యమైందిగదా అని ఆనందించారు. ఆ తరువాత కాలంలో ఇష్టకామేశ్వరీదేవి దర్శనానికి వేలాది మంది వెళ్ళి వస్తున్నారు. మార్గాన్ని బ్రహ్మాండంగా తయారుచేయించారు, ఇప్పుడంతా సరళతరమైపోయింది.

## పృథ్వీతత్వ జాగరణ

పూజ్యశ్రీ మాస్టర్‌గారు పంచతత్వసాధనను గురించి చెప్తూ ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలం నుండి తిరుమల వరకు షట్చక్రజాగరణకు సంబంధించిన ఏడు ఆధ్యాత్మిక శక్తి కేంద్రాలున్నాయి. పంచతత్వాలకు సంబంధించి మొదటగా శ్రీశైలం పృథ్వీతత్వానికి ప్రతీక. ద్వాదశజ్యోతిర్లింగాలలో రెండవస్థానంలో వున్న శివ,శక్తుల ప్రచండ దివ్యశక్తి గలిగిన శ్రీమల్లికార్జునస్వామి, శక్తిపీఠానికి ప్రసిద్ధిచెందిన భ్రమరాంబాదేవి కలిసివున్న సిద్ధక్షేత్రం శ్రీశైలం. పృథ్వీతత్వ సాధనకు అనుకూలమైన పవిత్రపుణ్య క్షేత్రం. అందుచేత పంచతత్వ సాధనలు చేయించటానికి మాస్టర్‌గారు ఒక చక్కటి ప్రణాళికను రూపొందించి వాటికి తగిన సాధనలను కూడా తయారుచేశారు.

మొదటగా పృథ్వీతత్వానికి సంబంధించి శ్రీశైలంలో సాధనాశిబిరం ఏర్పాటు చేయబడింది. ఈ శిబిరంలో సర్‌జాన్ ఉడ్‌రూఫ్‌గారు వ్రాసిన 'సర్పెంట్ పవర్', 'తంత్ర రాజ తంత్ర' అనే పుస్తకాలతో పాటు శ్రీచక్రంలో వున్న 1. సర్వానందమయ 2. సర్వసిద్ధిప్రద 3. సర్వరోగహర చక్రం వరకు శరీరంలో ఏఏ భాగాలలో ఈ సాధనలు ఎలా చెయ్యాలనేది సప్తర్షి ఆశ్రమంలో టూకీగా చెప్పారు. తరువాత ఆ సాధనలకు సంబంధించిన "ఛార్టులను" తయారుచెయ్యమన్నారు. వాటిని చూపిస్తూ శిబిరంలో క్లాసు చెప్పటానికి సులువుగా వుంటుందని చెప్పారు.

1998 నవంబర్ 19నుండి 22వతేదీ వరకు శ్రీశైలంలో పృథ్వీతత్వజాగరణ శిబిరం జరిగింది. దాదాపు 90మంది సాధకులు ఈ శిబిరంలో పాల్గొని శ్రీచక్రానికి సంబంధించిన మూడురకాలైన ఆధ్యాత్మిక సాధనలను నేర్చుకున్నారు. అయితే కాలేజీలో అత్యవసరమైన పని వున్నందున మాస్టర్‌గారు ఈ శిబిరానికి రాలేదు. శ్రీరామసుబ్బయ్య, నేను మాస్టర్‌గారిచ్చిన సూచనల ప్రకారం ఈ శిబిరాన్ని నిర్వహించాం. ఈ శిబిరంలో శ్రీచక్రం, మహాకాలచక్రవర్తి యంత్రం, సీక్రెట్‌డాక్ట్రిన్‌లను ఒకదానితో ఒకటి సమన్వయ పరుస్తూ – మూలాధార చక్రంతో వీటికిగల సమన్వయాన్ని వివరిస్తూ

మాస్టర్‌గారిచ్చిన క్యాసెట్లను ముందుగా వినిపించి ఆ పైన ప్రత్యక్షంగా "ఛార్టులను" చూపిస్తూ వాటిసాధనలను చేయించాను. అపూర్వమైన సాధనలతో, అనుభూతులతో ఎంతో సరదాగా జరిగిన ఈ శిబిరంలో చివరిరోజున అందరి కోరిక మేరకు 'ఇష్టకామేశ్వరీ' అమ్మవారి దర్శనానికి వెళ్ళటం నిజంగానే ఒక అదృష్టం. అంతే కాకుండా ఆ తల్లి సమక్షంలో దుర్గాసప్తశతి పారాయణ చేసి ముద్గాదనం నివేదన చేసి, అనంతరం ఎంతో వైభవోపేతంగా గాయత్రీయజ్ఞం చేసి, అమ్మ సమక్షంలో ఆ ఆహ్లాదకరమైన వాతావణంలో అందరం కలిసి సరదా సరదాగా ఆనందాన్ని పంచుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేయటం అనే ఆ దృశ్యం జీవితంలో మర్చిపోలేని క్షణాలు. అలా అందరూ కలిసిమెలిసి క్యాంప్‌లు చేయటం, పాఠ్యాంశాలను చెప్పుకోవటం, శిబిరాలను చక్కటి క్రమశిక్షణతో నిర్వహించుకోవటం, ఇవంతా నేర్పించటానికే మాస్టర్‌గారు, తాము రాకుండా మేమెలా చేసుకోవాలో అప్పట్నుంచే నేర్పించారు. శ్రీశైలంలో శిబిరం ముగించుకొని అందరం గుంటూరుకు వచ్చాం.

శ్రీశైలం శిబిరంలో జరిగిన కార్యక్రమాన్ని ఎప్పుడు ఏం జరిగింది, ఎలా జరిగిందనేది చెప్పబోతుండగా, స్వయంగా దగ్గరుండి చేయించినట్లుగా ఆ విషయాలను మాస్టర్‌గారు చెప్పటం చూచి అందరం అవాక్కైపోయాం. అంతటి సర్వజ్ఞులు మన మాస్టర్‌గారు. మాస్టర్‌గారితో వుండే చాలా మందికి ఇలాంటి అనుభవాలు సర్వసాధారణమనే చెప్పాలి. తర్వాత అందరినీ కూర్చోబెట్టి డిసెంబరు నెలలో జరగబోయే సహస్రకుండీయజ్ఞాలతో పాటు, పృధ్వీతత్వ సాధనాశిబిరాలు అన్ని ప్రదేశాలలో జరగాలని, ముందుగా ఆశ్రమాలలో తర్వాత మిగిలిన గ్రామాలలో జరగటానికి తగిన ఏర్పాట్లు చేసుకోమని ఆ రోజున సూచనలనిచ్చారు.

ఆనాడు మాస్టర్‌గారిచ్చిన సూచనల ప్రకారం సహస్రకుండీయజ్ఞాల పరంపర తీవ్రగతితో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేటందుకు రకరకాల సాధనలు, మంత్ర జపాలు, అనుష్టానాల పరంపరలను సప్తర్షి ఆశ్రమంలోనే కాక మిగిలిన ఆశ్రమాలలో కూడ నిష్ఠతో చేయించారు. 1995-2005 సంవత్సరాల మధ్యకాలం ఎంతో శక్తివంతమైనదని, ఈ సమయంలో ఎవరు ఎంత నాటుకుంటే అంతగా విశ్వప్రణాళికలో భాగస్వాములు కావటమే కాకుండా సమస్త మానవజాతి యొక్క ప్రగతికి దోహదం చేసిన పుణ్యపరమార్థాన్ని పొందే అర్హత వస్తుందని ప్రతి ప్రవచనంలోనూ మాస్టర్‌గారు చెప్తుండేవారు. దాంతో అందరిలోనూ ఊహించలేనంత చైతన్యం కలిగింది. చకచకా సహస్రకుండీ యజ్ఞాలు ఆశ్రమాలలో, గ్రామాలలో, పట్టణాలలో అత్యంత ఉత్సాహంతో చేయడం జరిగింది.

## ఋషియుగ్మము - అనుగ్రహవర్షము

ఆ కాలంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారిచ్చే సాధనలన్నీ పండిత శ్రీరామశర్మగురుదేవులందించే సాధనలే. అయితే వాటిని ఎప్పటికప్పుడు క్రొత్తక్రొత్త విధానాలతో లక్ష్యం వైపుకు ప్రేరణనిచ్చే విధంగా చేయిస్తుండేవారు.

శ్రీకృష్ణనిర్యాణంతో ఐదువేల సంవత్సరాల క్రితం ప్రారంభమైన కలియుగంలో మానవజాతిలో విశ్వాసరాహిత్యము, భ్రష్టచింతన, భ్రష్టాచారములు ప్రబలిపోయాయి. మానవసహజమైన గుణాలనేవి కరువైపోయాయి. ఎక్కడ చూచినా హింస, అన్యాయము, దౌర్జన్యంలాంటి పాశవిక కర్మలు సర్వసామాన్యమై పోయి మనిషి నరపశువుస్థాయి కంటే హీనమైన స్థితికి దిగజారిపోయాడు.

మానవుని స్వార్థము పరాకాష్ఠకు చేరుకుని ఈ భూమినంతటినీ సర్వనాశనం చేసే అణుబాంబులతో నింపివేసింది. పరిశ్రమలవల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోయి భూమి యొక్క మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. భూమి మన సౌరకుటుంబంలోని ఒక అభిన్న అంగం. భారతీయఋషి పరంపర, భారతీయ సంస్కృతి ఇలాంటి విషమ సమస్యలను పరిష్కరించడానికి యజ్ఞవిధానమును అందించిందనే విషయం ముందుగానే చెప్పుకున్నాము.

శాస్త్రవేత్తల కథనం ప్రకారం ప్రతి 11 సంవత్సరాలకొకసారి వచ్చే సూర్యకళంకాల వల్ల ప్రకృతి, పరిసరాల్లోనే కాక మానవుని ఆలోచనలలో, ఆచరణలలో విపరీతమైన మార్పులు కనిపిస్తాయి. ఇంకా వీటి దుష్ప్రభావం వల్ల భూమిపై అనేక ఉత్పాతాలు, భూకంపాలు, యుద్ధాలు, జలప్రళయాలు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తులు వచ్చి విపరీతమైన నష్టాన్ని కలుగచేస్తాయి. ఈ విపత్తుల నుండి మానవజాతిని రక్షించటానికి ఋషులందించిన తరుణోపాయం-గాయత్రీమంత్రము, గాయత్రీయజ్ఞము. వీటినుపయోగించుకొని కలుషితమైన వాతావరణాన్ని మార్చివేసి అందరిలోను సద్భావనలను ప్రేరేపింపచేసి, వాతావరణ కాలుష్య నివారణ చేసి విశ్వకళ్యాణము చేయడమనేదే దీని లక్ష్యము. పూజ్యగురుదేవుల సూక్ష్మీకరణ సాధన వెనుక వున్న రహస్యము కూడా ఇదే. వందనీయ మాతాజీ అందించిన అశ్వమేధయజ్ఞాల అంతరార్థం కూడా ఇదే. ఆ ప్రక్రియలోని భాగంగానే పూజ్యశ్రీ మాస్టర్‌గారు అత్యంత సరళమైన విధానంలో ద్వాదశరాశి, నవగ్రహ అష్టోత్తర శత, నక్షత్రపాద మహాకాల యజ్ఞములు నిర్వహించుటలోని అంతరార్థం కూడా ఇదే ! గ్రామ గ్రామాలలోను ఈ మహాయజ్ఞాలు నిర్వహించబడ్డాయి. సాధారణంగా మాస్టర్‌గారు ఎప్పుడు,

ఎక్కడ యజ్ఞంచేసినా గురుదేవులచే ఇవ్వబడిన సమయ, సందర్భాలను బట్టి హవనములు, దీపయజ్ఞాలు లేదా యుగయజ్ఞాలు చేయిస్తుండేవారు.

## త్రిపురాంతకంలో సాధన

1997వసంవత్సరం నాటికే పూజ్యశ్రీ మాస్టర్‌గారు శ్రీశైలంలో వేర్వేరు సందర్భాలలో ఆరురకాల సాధనాశిబిరాలను నిర్వహించారు. పరమపవిత్రమైన ఈ శ్రీశైలం శివ,శక్తుల కలయికతో ఏర్పడిన సిద్ధక్షేత్రం. మహాకాలక్షేత్రమైన శ్రీశైలానికి నాలుగు దిక్కుల్లోనూ నాలుగు దివ్యక్షేత్రాలు విరాజిల్లుతున్నాయి. శ్రీశైలానికి నాలుగు దిక్కులలోనూ నాలుగుద్వారాలుగా త్రిపురాంతకం, సిద్ధవటం, ఆలంపురం, ఉమామహేశ్వరం అని నాలుగు క్షేత్రాలున్నాయి. ఈ క్షేత్రాలలో గల దివ్యశక్తిని చైతన్యవంతంచేయటానికి నాలుగు చోట్ల సాధనా శిబిరాలను నిర్వహించాలన్నారు. మొట్టమొదట తూర్పున గల త్రిపురాంతకంలో మాస్టర్‌గారే స్వయంగా సాధనాశిబిరాన్ని నిర్వహించారు. మిగిలినచోట్లకు ఉత్సాహవంతులైన సాధకులను పంపి వారి ద్వారా శిబిరాలు జరిగేలా చేశారు.

త్రిపురాంతకంలో ఉన్న అమ్మవారు బాలాత్రిపురసుందరి. ఇక్కడ అమ్మవారు బావిలో ఉంటారు. మనం బావిలోపలికి దిగి అమ్మవారిని దర్శనం చేసుకోవాలి. జగద్గురువు ఆదిశంకరాచార్యులవారు శ్రీచక్రాన్ని స్థాపించి ఈ క్షేత్రవైభవాన్ని వినూత్నంగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. ఇక్కడ సాధనాశిబిరం జరగాలని చెప్పగానే కామాక్షి వాళ్ళు, శ్రీసునందనరావుగారు వాళ్ళు ఈ క్షేత్రంలో అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. అసలు ఈ క్షేత్రంలో రాత్రిపూట ఎవ్వరినీ ఉండనివ్వరు. మాస్టర్‌గారి కోరిక మేరకు ఆలయ అర్చకస్వాములు రాత్రిపూట ఉండటానికి అనుమతినిచ్చారు. ఈ క్షేత్రమహిమ చాలా చిత్రమైనది.

మూడురోజులపాటు జరిగిన ఈ శిబిరంలో మాస్టర్‌గారు "శ్రీవిద్యకు సంబంధించిన" ప్రవచనాలను చెప్పారు. శ్రీలోల్ల లక్ష్మీధర దేశికాచార్యులవారిచే సార్వజనీనం చేయబడిన షోడశీ మంత్రాన్ని గురుదీక్షగా ఇచ్చారు. మూడోరోజున అంటే ఆగష్టు పదవతేదీన పూర్ణాహుతికి ఏర్పాట్లు జరిగాయి. మాస్టర్‌గారు నిర్ణయించిన ప్రకారం ఈరోజు ఇక్కడ శ్రీ గంజాం రంగనాధప్రసాదుకి ఉపనయన సంస్కారాన్ని మాస్టర్‌గారే స్వయంగా చేసి యజ్ఞోపవీత ధారణ, గాయత్రీమంత్రదీక్షను ఇవ్వడంతో పాటుగా అమ్మవారి సన్నిధిలో మాస్టర్‌గారు కూడా నూతన యజ్ఞోపవీతాన్ని ధరించి నూతన ప్రణాళికలకు దీక్షను స్వీకరించారు.

ఈ సాధనాశిబిరంలో సాధకులకు ఇచ్చిన ముఖ్యమైన సూచన, ఈ ఆలయంలో చూసి చూసి జాగ్రత్తగా నడవండి. అడుగు తీసి అడుగు వేసే లోపల మీరు ఎలాంటి పొరపాట్లు చేయకూడదు. అనవసరంగా మాట్లాడకండి. మీ కంటికి కనిపించని అనేక దేవతాశక్తులు ఈ ఆలయ ప్రాంగణంలో తిరుగుతూ ఉంటాయి. ప్రతిక్షణం వారు మనల్ని గమనిస్తూనే ఉంటారు. చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ సాధనా క్యాంపులో భాగంగా ఒక రోజున ఆలయాన్ని శుభ్రం చేయమన్నారు. విచిత్రం ఏంటంటే ఏ చిన్న రాయి కదిలించినా దాని క్రింద 5,6 తేళ్ళు లుకలుకలాడుతూ బైటికి వచ్చేవి. కానీ అవి ఎవ్వరినీ ఏమీ చేసేవికావు. రాత్రిళ్ళు అలా ఆ ఆలయ ప్రాంగణంలోనే పడుకునే వారు. ఉదయం లేవగానే తలల ప్రక్కనా, కాళ్ళ దగ్గర చాలా తేళ్ళు కనిపించేవని అందరూ మాస్టర్‌గారికి చెప్తుండేవారు. ఆయన మాత్రం చాలా నిశ్శబ్దంగా, మౌనంగా అంతర్ముఖ ధ్యానంలో ఉండేవారు. ఆ సమయంలో ఆయన అతీంద్రియ లోకాలలో ఉన్నట్లుగా ఉంటూ ఎవరేం చెప్పినా నవ్వుతూ తలాడించడమే కానీ ఏ సమాధానం చెప్పేవారు కారు. త్రిపురాంతకంలో సాధన జరిగిన విధంగానే సిద్ధవటంలో శ్రీ మల్లికార్జునరావుగారు, మిగిలిన ప్రదేశాలలో శ్రీమణికుమారు, శ్రీరంగ నాయకులు, శ్రీవిజయభాస్కరరెడ్డిగార్లు మాస్టర్‌గారు ఇచ్చిన సూచనల ప్రకారం శిబిరాలను నిర్వహించారు.

## యుగసైనిక శిక్షణాశిబిరం

**దీని తర్వాత పూజ్యగురుదేవుల ప్రణాళికలో భాగంగా 1997 నవంబర్ ఒకటవ తేదీ నుండి మొట్టమొదటిసారిగా,'యుగసైనిక శిక్షణాశిబిరాన్ని' ఒంగోలులోగల పాపారావు రైసుమిల్లులో మూడు రోజుల పాటు ఎంతో క్రమశిక్షణతో చేయడం జరిగింది. యుగసైనికులు అంటే ఎవరు? వారి బాధ్యతలు ఎలావుంటాయి? అనే విషయం గురించి చెప్తూ భవిష్యత్తులో ఎలాంటి పనులు చెయ్యాలనే వాటి గురించి కూడా చాలా వివరంగా చెప్పారు. తర్వాత ఇటువంటి కార్యక్రమాలను చాలా పరిమితంగా చేశారు. డిసెంబరు నెలలో శ్రీమాస్టర్‌గారు సాధకులకు ఒక అద్భుతమైన సాధనను పరిచయం చేశారు. దాని విశిష్టతను గురించి మాటలలో వివరించలేము.** కుండలినీ సాధనకు సంబంధించిన సంక్షిప్తమైన సాధనాక్రమాన్ని చాలా సరళంగా ఇలా ఇచ్చారు.

## గురువు లేకుండా విద్య రాణించదు

ఇది అందరికీ తెలిసిన విషయమే! ఆధ్యాత్మికవిద్యలో ఇది పరమసత్యం. కబీర్‌దాసు చెప్తాడు.

**గురు గోవిందు దోవూ ఖడే కాకే లాగూ పాయ్ ।**
**బలిహారీ ఆప్‌నే గోవింద్ దియే బతాయ్ ॥**

*భావం:* గురువు, గోవిందు కలిసి వస్తే ముందు గురువుకే నమస్కరిస్తాను. ఎందుకంటే భగవంతుణ్ణి గురించి తెలియజేసినవాడు గురువు కాబట్టి. గురుచరిత్రలలోనూ ఇదే భావం వ్యక్తమౌతుంటుంది. ఆధ్యాత్మిక జీవితం మొదలు పెట్టటమే గురుచరణాలకు సమగ్ర సమర్పణతో ప్రారంభమౌతుంది. దీనినే సి.వి.వి అనుయాయులు మాస్టర్‌గారికి నమస్కారము పెడితే చాలు అన్నారు. ఈ ప్రపంచమంతా హిమాలయాలలో నివసించే పరమగురుమండలి ద్వారా శాసించ బడుతున్నదని మేడం బ్లావెట్స్కీ చెప్పారు. లాహిరీమహాశయులు ఒక్కరాత్రి తన గురువు దగ్గర గడిపి, ఆ విశేషాలను 'క్రియాయోగ'మనే పేరుతో మానవాళికందించారు. శ్రీరామకృష్ణపరమహంస గారి సాధనలన్నీ వారి గురువాజ్ఞతోనే ముందుకు సాగాయి. వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత శ్రీరామ శర్మగారు తన గురువు, 'తనబాస్'కు ఏవిధంగా సమర్పణ చేసుకున్నారో వారి ఆత్మకథను చదివితే అర్థమౌతుంది. గురువు యొక్క స్పర్శతో కానీ, దృష్టితోకానీ కుండలినీ జాగరణ జరుగుతుందనే విషయం ఆధ్యాత్మిక క్షేత్రంలో సువిదితమే!

## గురుసత్తా అనుగ్రహం - కుండలినీ జాగరణ

కుండలినీ జాగరణకు సాధకుడు చేసే ప్రయత్నాలలో అన్నింటికంటే ముఖ్యమైన సాధన షట్చక్రాలమీద మనస్సు నిలిపి ఆరోహణ, అవరోహణ క్రమంలో కొన్ని గంటలపాటు ఉపాసన చెయ్యాలి. రానున్న 200సంవత్సరాల వరకు కుండలినీ సాధనకు పాత్రత సంపాదించుకున్న సాధకులకు నేనే స్వయంగా వచ్చి దిశానిర్దేశం చేస్తాను అనేది పూజ్యగురుదేవుల వాగ్దానము. అందువలన గురువు ఎక్కడ వున్నాడు అని వెతకకుండా ఉపాసన, సాధన, ఆరాధన అనే త్రిపుటిలో పాత్రతను పెంచుకున్నచో గురువే స్వయంగా వచ్చి సాధకుని జీవితాన్ని పూర్తిగా తన చేతిలోకి తీసుకుంటాడు. (సంపూర్ణ సమర్పణ భావంతోసాగిన మాస్టర్‌గారి జీవితమే అందుకు ప్రత్యక్షసాక్ష్యం.) "గురుసత్తా అనుగ్రహం-కుండలినీ జాగరణ" అనే పుస్తకాన్ని గురుదేవుల 'ఆత్మకథ' ఆధారంగా షట్చక్ర జాగరణకు కావలసిన, సరళమైన రీతిలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు రచించారు. ఇందులో

పూజ్యగురుదేవుల నామావళిని మూలాధారం నుండి సహస్రారం వరకు 54 దళాల మీద భావన చేసుకుంటూ చదువుకోవాలి. మరల సహస్రారం నుండి మూలాధారం వరకు అదేవిధంగా చేస్తే 108 నామాలు పూర్తి అవుతాయి. అంతఃకరణ సాధనలో 8 నామాలు పూర్తౌతాయి. ప్రతి నామముతో దళమును, నామములో గల భావనను స్మరిస్తూ నామాన్ని ఉచ్చరించాలి. ఈ విధంగా ప్రతిరోజూ నిర్ణీతసంఖ్యలో సాధనచేస్తూ, దానికి తగిన ఆచరణాత్మక, భావనాత్మక మార్పులను వ్యక్తిగత జీవితంలో తెచ్చుకున్న సాధకునకు కుండలినీ జాగరణ రూపంలో గురుదేవుల అనుగ్రహం తప్పక లభిస్తుందని మాస్టర్‌గారు చెప్పడమే కాదు ఆ రోజులలో అందరి చేత ఆ సాధనను చేయించేవారు. ఈ పుస్తకము సాధకుడు గురుఅనుగ్రహమును పొందేందుకు, కుండలినీ జాగరణ యొక్క ప్రారంభిక పృష్ఠభూమిని తయారుచేసుకునేందుకు ఉపయోగపడుతుంది.

గాయత్రీసాధన తరువాత సావిత్రీసాధన గమనంలోకి వస్తుంది. సావిత్రీసాధన భౌతికపక్షం.

భౌతిక ప్రయోజనాలకోసం శక్తి కావాలి. శక్తి ఎప్పుడూ అగ్ని సహాయంతోనే వికశిస్తుంది. భౌతికశరీరంలో ఉండే పంచతత్వాలు, పంచప్రాణాలు ఇంధనం చేసే పనినే చేస్తాయి. వీటివల్ల క్రమంగా లోపల అగ్ని రగులుకుంటుంది. ఈ అగ్ని ప్రజ్వలననే సావిత్రీ లేక కుండలినీ అని అంటారు. కుండలినీజాగరణ ప్రయోగంలో నాడీశోధన, షట్కర్మలు, త్రినాడీ పరిమార్జన, చక్రవేధన, ప్రాణాయామ ప్రయోగాలు విచిత్రక్రమంలో జరుగుతాయి. బంధాలు, ముద్రలు, ఆసనాలు మొదలైనవి కుండలినీ జాగరణ ప్రక్రియలో చాలా తీవ్రంగా వుంటాయి. సావిత్రీసాధన విశుద్ధంగా మస్థిష్క అంతర్గత క్షేత్రం వరకే పరిమితమై వుంటుంది. సహస్రారకమలం, బ్రహ్మరంధ్రం, పుఱ్ఱెలో నిండివున్న ద్రవ్యములు తమ పద్ధతిలో తాము కదులుతూ జాగృతమౌతాయి. అంతర్గత విషయాల నన్నింటినీ బ్రహ్మరంధ్రం చూసుకుంటుంది. బహిరంగ విషయాలనన్నింటినీ తృతీయనేత్రమైన ఆజ్ఞాచక్రం చూచుకుంటుంది.

సావిత్రీ-కుండలినీ సాధనలు కలిపి చేస్తే ఫలితం కూడా విశేషంగానే వుంటుంది. కుండలినీ సాధన ఫల, పుష్పాలతో పూజ చేసేంతటి తేలికైన విధానంగా అనుకోకూడదు. దానితో ఆటలాడుకో కూడదు. అందుకు పాత్రత తప్పని సరి. సాధన ప్రారంభించేముందు విషయం బాగా తెలిసిన మార్గదర్శకుని సహాయం తీసుకొని తీరాలి. పూజ్యగురుదేవుల అష్టోత్తరశతనామావళి మీకు-మీ మార్గదర్శకునితో సంబంధం ఏర్పరుస్తుంది. మనిషి శరీరంలో శక్తివంతమైన విద్యుద్భాండాగారం

వున్నది. సాధారణంగా అది అంతా చెల్లాచెదరై వుంటుంది. దాన్ని సమీకరించి మూలాధార చక్రంలో కేంద్రీకరింపచేస్తే ఆశ్చర్యకరమైన సత్ఫలితాలను పొందవచ్చు. కుండలినీసాధన చెయ్యటానికి ఎవ్వరూ ఆతృత పడవద్దు. ఈ మహాప్రయోగము ఎవరికి ఎంత వరకు అవసరమో వారికి తగినంతగా లభింపచేయుట నా బాధ్యత. ఏ విధంగా దివ్యశక్తులు మాచేత 24 సంవత్సరముల గాయత్రీ మహాపురశ్చరణ చేయించి, మూడు సంవత్సరముల కఠోర తపస్సు చేయించి దేశ కుండలినిని జాగృతం చేసే విధానమును చెప్పి, చెప్పడమే కాక స్వయంగా నాకు తోడుగా నిలచి, దగ్గరుండి చేయించి, దానికి కావలసిన సరంజామాను కూడా సిద్ధం చేసినవో, మేము కూడా అదే రీతిలో కుండలినీ విజ్ఞానమును ఆశ్రయించి విశేష ఆత్మబలమును సంగ్రహించి సాధన చేయాలనుకునే వారికి అవసరమైన వాటిని సమకూర్చిపెట్టడం జరుగుతుంది. కుండలినీ జాగరణ వలన చేతనపై నియంత్రణను సాధించవచ్చు. మానవ సామర్థ్యం యొక్క రహస్యాలను తెలుసు కొనవచ్చు అని గురుదేవులు కుండలినీ జాగరణ పుస్తకంలో వివరంగా చెప్పారు. కనుక మన మాస్టర్‌గారు ఈ యుగసంధికాలంలో సమర్పణా భావంతో ఈ విశిష్ట సాధన చేస్తూ తమ జీవితాలను గురుదేవులకు అంకితం చేసుకోదలచిన ప్రబుద్ధ ఆత్మల కొరకు మాత్రమే గురుదేవుల జీవితాన్ని ప్రామాణికంగా తీసుకొని అష్టోత్తరశతనామావళిని రూపొందించి సాధనను సరళతరం చేశారు. దీనికి సంబంధించి మొత్తం సాధన "గురుసత్తాఅనుగ్రహము – కుండలినీ జాగరణ" అనే పుస్తకంలో అద్భుతంగా వివరించారు. ఆర్తితో ప్రతినిత్యం ఈ సాధనచేసి గురుసత్తా అనుగ్రహానికి పాత్రులు కావడం కోసమే మాస్టర్‌గారు దీనినింత సరళతరం చేసి మనకందించారు. సాధన చేయడమనేది ఇంక పూర్తిగా (మన) శిష్యుని బాధ్యతేగా మరి!

## "గురుసత్తా"

గురుసత్తా అంటే ఏమిటి? ప్రతి వాళ్ళు గురుసత్తా అనే మాటను తరచుగా వాడుతూనే వుంటారు. అసలు "గురువు" అనే పదాన్ని ఎవరికి వాడతారు అనే విషయం గురించి చక్కటి అవగాహననిచ్చే ప్రవచనాన్ని మాస్టారు 'శ్రీ హంస రామ ఆశ్రమములో చెప్పారు. ఎక్కడ, ఎప్పుడు ఏ పూజా కార్యక్రమాన్ని మొదలుపెట్టినా "గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః। గురుసాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీగురవేనమ" అనే ప్రార్థనా శ్లోకంతోనే కదా మొదలుపెడతారు. ఈ శ్లోకాన్ని చదువుతాం కానీ ఆ శ్లోకంలో వున్న అంతరార్థం బోధపడాలంటే మనకు చాలా విషయాలు తెలియాలి.

ఒకటి 'గురువు' అనేటటువంటి పదము. రెండు అవతారము అనేటటువంటి పదము. ఈ రెండు పదాలు భారతదేశంలో తప్ప మరింకే దేశంలోనూ వినిపించవు. అతి గహనమైన, లోతైనటు వంటి భావం ఈ పదాలలో వున్నది. ముందుగా

'గురుర్బ్రహ్మ' అనే పదానికి అర్థం ఏమిటి? బ్రహ్మ అంటే సృష్టికర్త, సర్వజ్ఞుడు. అణువు నుండి మహత్తు వరకు – భూత, భవిష్యత్, వర్తమానాలను తెలుసుకున్న వ్యక్తి. అందువలన గురువు ఎలాంటి వాడై వుండాలంటే బ్రహ్మలాగా సర్వజ్ఞుడై వుండాలి.

'గురుర్విష్ణుః' అంటే గురువు బ్రహ్మలాగా సర్వజ్ఞుడైతే చాలదు. గవర్నమెంట్ అనగానే పరిపాలనా శక్తి. ఆ శక్తి సూక్ష్మరూపంలో సర్వత్రా వ్యాపించి, సర్వవ్యాపక పరిపాలనా శక్తిని ఎలా కలిగివుంటుందో, గురువు అలా సర్వవ్యాపకుడై వుండాలి. హిరణ్యకశిపుడు, కొడుకుతో 'ఏడిరా, నీ శ్రీహరి?' అంటే 'ఇందుగలడందులేడని సందేహము వలదు' అని ప్రహ్లాదుడు చెప్పినట్లుగా – విష్ణువులాగా గురువు కూడా సర్వవ్యాపకుడై వుండాలి.

గురుర్దేవో మహేశ్వరః అంటే గురువు 'బ్రహ్మ' అయివుండాలి, 'విష్ణువు' అయివుండాలి. దీనితో సరిపోదు. గురువుకు ఇంకో శక్తి కూడా వుండాలి. మహేశ్వరుడిలా సర్వసమర్థుడై వుండాలి. మృత్యుముఖంలో వున్న మార్కండేయుడికి అమరత్వం ప్రసాదించగల అఘటన, ఘటనా సమర్థుడై వుండాలి. అదే భారతదేశ సాంప్రదాయంలో గురుసత్తా మరియు గురుతత్త్వము యొక్క గొప్పదనము. భారతదేశ సాంప్రదాయములో వున్న వైశిష్ట్యమేమిటంటే గురువును వెతుక్కుంటే లభించడు. సర్వ వ్యాపకుడైన వాడిని ఎక్కడని వెతకగలం? సర్వవ్యాపకుడైన గురువు కోసం ఎక్కడికీ పరుగెత్తనక్కర లేదు. సర్వవ్యాపకత్వాన్ని శరీరానికాపాదించలేం. అందుచేత గురువు శరీరధారి కాడు. సర్వ వ్యాపకుడైన గురువును ఒక చిన్న శరీరధారిగా చూపించడం అసంభవం. ఆ గురువు యొక్క విశాలత్వాన్ని అర్థం చేసుకుని ఆ గురువును అందరిలో చూడగలగాలి. గురువులోనే ఉంటూ గురువువలె జీవిస్తూ, ఆ అనుగ్రహాన్ని పొందుతున్న పవిత్రమైన అనుభూతిని పొందగలిగితే, ఆ గురువు నీలోనే దర్శనమిస్తాడు. ఆ గురువు నీలోనే ఆవహిస్తాడు. చివరకు భ్రమర కీటక న్యాయ ప్రకారం, ఆ గురువే నీవైపోతావు.

అలాంటి గురుసత్తాకి ప్రతిరూపాలైన పరమ పూజ్యగురుదేవులు, మాతాజీల అనుగ్రహంతో మనం కనుక ఈ కుండలినీ సాధనను చేసినట్లయితే మనమూ వారికి ప్రతిరూపంగా మారటం

సాధ్యమే! అదీ గురుతత్త్వము అంటే. మాస్టర్‌గారి జీవితంలో ఈ పరిస్థితులను వేరు, వేరు సందర్భాలలో దర్శించిన మహనీయులు తమ, తమ అనుభవాలను అనేక సందర్భాలలో చెప్పటం జరిగింది. ఈ మూడు చేతనత్వాలను అంతర్లీనంగా తమలోనే ఓతప్రోతం చేసుకుని, మన మధ్యనే వుంటూ మనకేమీ తెలియనీయకుండా, మనకు కావలసిన అవసరాలను మనం అడగకుండానే, పూర్తిచేస్తూ మనపై వరాల వర్షాలను కురిపిస్తున్న ఆ మహనీయుని గురించి చెప్పడం మన తరం కాదు కదా!

## అధ్యాయం-12

# అనుగ్రహమాలామంత్ర ద్రష్ట

1. సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడు అయిన గురువుకు ఎలా సమర్పణ చేసుకోవాలి?

2. ఆధ్యాత్మికంగా ముందుకు సాగాలంటే మనలోవున్న కుసంస్కారాలను ఎలా వదలగొట్టుకోవాలి? దానికి మనం ఎలాంటి సాధనలు చెయ్యాలి? అనేదానికి సంబంధించి ఒక అనుగ్రహమాలా మంత్రమనే దివ్యమైన మహామంత్రాన్ని 1996 దేవీ నవరాత్రులలో అష్టమినాడు అర్ధరాత్రి 12గంటలకు శ్రీహంస రామ ఆశ్రమంలో అనేకమంది ఋషుల దివ్య ఆశీస్సులతో, పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఎంతో అద్భుతంగా ప్రసాదించారు. మిమ్మల్ని మీరు వదిలివేసుకొని, మీ బాధ్యతలను యథోచితంగా చేసుకుంటూ సర్వజ్ఞత్వాన్ని, సర్వవ్యాపకత్వాన్ని, సర్వసమర్థతను పొందటానికి ఈ మహామంత్రాన్ని ఉపదేశించారు. మంత్రం ఇచ్చినప్పుడు తత్సంబంధమైన వివరాలు ఆ రోజున వివరించారు, మళ్ళీ ఆ మంత్రవిశిష్టతను 2004 దేవీ నవరాత్రులలో శ్రీ దుర్గా గాయత్రీ శక్తి పీఠంలో ఇచ్చిన ప్రవచనంలో ఆ మంత్రం ఎలా వచ్చిందో ఇంకా చాలా బాగా వివరించారు.

### పూజ్యశ్రీ మాస్టర్‌గారు చెప్పిన విషయం

"అనుగ్రహ మాలా మంత్రం చాలా విచిత్రమైన పరిస్థితులలో బయటకు వచ్చింది. మన వాళ్ళందరూ నవరాత్రి సాధనకని శ్రీహంసరామ ఆశ్రమానికొచ్చారు. విపరీతమైన వర్షాలు. అక్కడ 24లక్షల గాయత్రీ మంత్రలేఖనాలను భూగర్భంలో నిక్షిప్తం చేసి దానిపై స్థూపాన్ని మనవాళ్ళతో

దగ్గరుండి కట్టించాను. ఈ పనులు చేసింది మేస్త్రీలు కాదు, ఈ పనులు చేతకాని బ్యాంక్ ఆఫీసర్లు, లెక్చరర్లు. వారంతా కలిసి వర్షంలో ఆ స్థూపాన్ని కట్టారు. అది దసరా నవరాత్రులలో జరిగిన క్యాంప్. అందులో మాకు అక్కడ భగవంతుడు ఇచ్చిన వరం ఏమిటంటే ముళ్ళు. ముళ్ళు గుచ్చుకోనివాళ్ళంటూ ఎవరూ లేరు. నాతో చెప్తే, 'కష్టపడకుండా ఏం రాదు బాబూ, ముళ్ళు గుచ్చుకోకుండా ఉండాలి అంటే అది సాధన అవదు' అని చెప్పాను. ముళ్ళు గుచ్చుకోవటం వలన మీకు అనేక జన్మల ప్రారబ్ధకర్మలు పోతాయని కూడా చెప్పాను. అప్పుడు ఎవరో అన్నారు 'ఇవాళ దుర్గాష్టమి' అని. అసలు అదంతా మర్చిపోయాం. వచ్చింది నవరాత్రుల కోసమే అయినా ఈ కట్టడాలు, వాటిలో పడిపోయాం. సరే, విషయం చర్చకు రాగానే, 'సరే అయితే నేను స్నానం చేసి రెడీ అవుతాను, మీరు కూడా స్నానంచేసి సరిగ్గా 12 గంటలకు నా దగ్గరకు వచ్చేయండి' అన్నాను. ఎందుచేతనంటే,

**దుర్గాష్టమినాడు అర్ధరాత్రి సరిగ్గా 12గంటలకు ఎవరైనా ధ్యానంలో కూర్చోగలిగితే, గ్యారెంటీగా వాడికి ధ్యానసిద్ధి వచ్చేస్తుంది. ఆ టైం మహిమ అది. ఆ ఉద్దేశ్యంతోనే ధ్యానం చేసుకుందామని వాళ్ళందరినీ రమ్మన్నాను. రాత్రి పదకొండున్నరో ఎంతో అయింది. అందరూ మెల్లి,మెల్లిగా వస్తున్నారు, వర్షం కురుస్తున్నది. మామూలు వర్షం కాదు. రోడ్లు అవీ తెగిపోయాయి. ఎలాంటి వర్షం కురుస్తున్నదో మీరూహించుకోండి. కరెంటు లేదు. లాంతరో, క్యాండిలో మరి ఏదో చిన్న దీపం వెలుగుతున్నది. అందరూ పనులు ముగించుకొని వచ్చి కూర్చున్నారు. ఆ వాతావరణంలో ఈ అనుగ్రహ మాలామంత్రం డిసెంట్ అయింది. ఆ మంత్రఅక్షరాలు అలాగ దిగుతూ వుంటే బంగారు రంగులో ఉన్న వాటిని చూసి చదివాను. చదివాక అదేంటో నాకు అర్థమైంది. చదువుతున్నప్పుడు అదేంటో నాకు తెలియదు. సరే, వాళ్ళు దాన్ని దీక్షలాగా తీసుకున్నామని చెప్పారు.**

**అలా ఆ నవరాత్రులలో మాస్టారు "అనుగ్రహమాలామంత్ర ద్రష్ట" అయ్యారు.**

## అనుగ్రహ మాలా మంత్రం

ఓం భూర్భువఃస్వః హ్రీం శ్రీం క్లీం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్ హ్రీం శ్రీం క్లీం ఓం - క ఏ ఈ ల హ్రీం, హ స క హ ల హ్రీం, స క ల హ్రీం శ్రీం॥ ఇదీ మంత్రం.

గాయత్రీ మూడు రకాలుగా వుంటుంది. ఒకటేమో భౌతిక జగత్తులో ఉండే జ్ఞాన, విజ్ఞానానికి సంబంధించిన గాయత్రీ మంత్రము.

ఓం భూర్భువఃస్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనఃప్రచోదయాత్॥

ఇది కాక సూక్ష్మగాయత్రీ అని ఉంది. దాన్నే మనం షోడశీమంత్రం అంటాం.

క ఏ ఈ ల హ్రీం, హ స క హ ల హ్రీం, స క ల హ్రీం శ్రీం. ఇది షోడశీమంత్రం.

ఈ రెండు మంత్రాలకు అనుసంధానంగా మూడు బీజమంత్రాలను హ్రీం, శ్రీం, క్లీం అని కలుపుతాం. అవీ గాయత్రీకి సంబంధించిన బీజమంత్రాలే !

సరస్వతీదేవికి సంబంధించిన బీజమంత్రం హ్రీం. లక్ష్మీదేవికి సంబంధించిన బీజమంత్రము శ్రీం. కాళికాదేవికి సంబంధించిన బీజమంత్రం క్లీం. అందుచేత ఈ మూడు బీజమంత్రాలు, సూక్ష్మగాయత్రీ, భౌతిక గాయత్రీతో కలిసినాయి. అందుచేత ఈ మంత్రము అనుగ్రహమాలా మంత్రము. కానీ ఈ మంత్రము మిమ్మల్ని కారణ గాయత్రీలోకి తీసుకువెళ్ళాలి. కారణగాయత్రీ అంటే అజపా గాయత్రి అంటే సోఽహం. సోఽహం అని మీరు ఉచ్చారణ చేయకూడదు.

చాలామంది సోఽహం సాధన చేస్తున్నామంటూ గాలి పీలుస్తున్నప్పుడు 'సో' అని వదిలేటప్పుడు 'హం' అని నోటితో అంటారు. అప్పుడది 'జపగాయత్రి' అవుతుంది. అజపా గాయత్రి అవదు. ఆ పేరులోనే తెలుస్తున్నది కదా, అజపాగాయత్రీ అంటే మీరు జపం చెయ్యకూడదు. సోఽహం అనే శబ్దం మీకు వినిపిస్తుంది. అదీ కారణగాయత్రీ. అందుచేత గాయత్రీలో ఉన్న మూడు లక్ష్యాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకుంటే ఏం తెలుస్తుందంటే

1. మనిషిలో ఈ భౌతికగాయత్రీని నియంత్రించే శక్తిని 'సూర్యుడు' అంటాం. అదే 'సవితా'శక్తి.

2. సూక్ష్మగాయత్రీని నియంత్రించే శక్తిని చంద్రుడు అంటాం, సోముడు.

3. అజపాగాయత్రిని నియంత్రించే శక్తి 'అగ్ని'.

ఈ మూడింటిలో అజపాగాయత్రీని మనం ఉచ్చారణ చేయము. సూక్ష్మగాయత్రీలో అర్థం లేదు. భౌతిక గాయత్రీలో అర్థం ఉంది. లలితాసహస్రనామాలలో చంద్రసూర్యాగ్నిలోచనా అని వస్తుంది. గాయత్రీ, షోడశీ లాగానే అగ్ని ఉపాసన కూడా చాలా పెద్ద సైన్స్. అగ్ని ఉపాసన

అంటే కారణగాయత్రీ ఉపాసన, అజపాగాయత్రీ ఉపాసన. ఈ అగ్ని ఉపాసన దత్తాత్రేయ సాంప్రదాయంలో ఉన్నది. గురువుగారి యజ్ఞవిద్య కూడా అదే! ఈ మూడింటిలో స్థూలగాయత్రీ నుండి సూక్ష్మగాయత్రీకి వెళ్ళి, సూక్ష్మగాయత్రీ నుండి మనం అజపాగాయత్రీకి వెళ్ళాలి. అదీ మన లక్ష్యం. అందుచేత నిరంతరం గాయత్రీ చేస్తూ కూర్చోవడమే కాకుండా మొత్తం మన లక్ష్యం ఏమిటో గుర్తుంచుకోవాలి. మీలో ఒక వందమంది కాస్త నేను చెప్పింది చెప్పినట్లు చేయగలిగితే ఈ మూడు సంవత్సరాలలో మిమ్మల్ని లక్ష్యానికి తీసుకువెళ్ళిపోతాను. మనకి ఆధ్యాత్మికవిద్య అంటే ఏమిటో తెలియదు. చిన్నచిన్న తలనొప్పులు, రోగాలు పోగొట్టుకోటానికి పనికి వస్తుందను కుంటున్నాము. అసలు మొత్తం ప్రపంచాన్నే శాశించవచ్చు, సేవచేయవచ్చు.

అందుచేత ఈ మూడింటి కాంబినేషన్‌ని మీరు గుర్తుంచుకోవాలి. గాయత్రీ, సూక్ష్మగాయత్రీ, కారణగాయత్రీ లేదా అజపాగాయత్రీ. ఈ మూడింటి కలయిక ఆ మహామంత్రం. జపం చేసేది కాదు కనుక అజపాగాయత్రీని అక్కడ వ్రాయలేదు. కానీ అనుగ్రహమాలామంత్రం చేస్తూవుంటే ఆటోమాటిగ్గా అజపా గాయత్రీలోకి వెళ్ళిపోతాం. కానీ ముందు గాయత్రీని పట్టుకొని అవగాహన చేసుకోండి. తరువాత అనుగ్రహ మాలా మంత్రం. ముందు స్థూలగాయత్రీ అయ్యాకనే కదా, సూక్ష్మ గాయత్రి. కానీ మీలో ఉత్సాహం ఉన్నవారు సూక్ష్మగాయత్రీ గురించి నేర్చుకుంటాం అనేవారు 'శ్రీ చక్రానికి' సంబంధించిన పుస్తకాలను చదవండి. శ్రీచక్రం మొత్తం సూక్ష్మగాయత్రీయే! శ్రీచక్రం మీద త్రిపురారహస్యం అని ఒక ఉపనిషత్తు ఉన్నది. అవి నేర్చుకుంటూ అనుగ్రహమాలా మంత్రాన్ని మీకు వీలున్నప్పుడు చేసుకోండి. ఎటొచ్చీ మనస్సు దాని మీద పెట్టి చేస్తేనే ఫలితాలు వస్తాయి.

స్థూలంగా ఈ మంత్రంలో మొదటిది గాయత్రీ, రెండవది షోడశీ, మూడవది సోऽహం. వీటిద్వారా మనం గురు అనుగ్రహానికి పాత్రులం కావాలి. ఏ పని చెయ్యాలన్నా మనకు 'శరీరం' మాత్రమే కావాలి. ఈ శరీరం-పంచ కర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచతన్మాత్రలు, పంచప్రాణాలు, అంతఃకరణలనబడే 24 తత్త్వాలతో నిర్మించబడినది. ఈ 24 శక్తులే గాయత్రీమంత్రలోని 24 అక్షరాలు. గురు అనుగ్రహం పొందాలంటే ముందు గాయత్రీమంత్రాన్ని చక్కగా అనుష్టించాలి. అప్పుడే మన శరీరంలోని 24 శక్తులకు, గాయత్రీమంత్రానికి మధ్యవున్న సంబంధం పటిష్టమౌతుంది. ఇంతేకాక మనశరీరంలో "చిత్కళ" అనే చేతనత్వమున్నది. దానికి

16 కళలు వుంటాయి. ఈ 16 కళలను కలిగిన అవతారమే శ్రీకృష్ణావతారం. షోడశకళా పరిపూర్ణుడు కనుకనే ఆయనని జగద్గురువు అంటాము. ఆయన యొక్క 16 కళలతో నాయొక్క 16కళలను కలుపుతాననేదే షొడశీ విద్య. ఈ 16 కళలను 'శ్రీ' యంత్రంతో పూజించే సాంప్రదాయం మనది. అందుకనే మనదేశంలో ప్రతీ వ్యక్తి పేరు ముందర 'శ్రీ' అని పెడతారు. అలానే ప్రతి మంత్రానికి ముందు 'ఓం' పెడతారు. ఓంకార ఉచ్చారణ లేకుండా చేసే మంత్రమేదైనా తాంత్రికానికి వెళు తుంది. అది వేదవిరుద్ధమని పెద్దలంటారు. అసలు ఆ 'ఓం'కారముకూడా మీరే! ప్రతి వ్యక్తికీ జాగ్రత, స్వప్న, సుషుప్తావస్థలు ఉంటాయి. ఈ మూడు స్థితులను ఉపయోగించుకోవటమే 'యోగము'. అంత పెద్ద విరాట్ స్వరూపంతో సంబంధం పెట్టుకోవాలంటే మనం దానికి పరికరాలుగా మారాలి. మన శరీరమే ఒక ప్రయోగశాల కావాలి. మన శరీరంలో ఉన్న ఆ 24 శక్తులను మనమేం కోరుకుంటున్నాము అంటే –

నా యొక్క స్థూలశరీరము – విశాల స్థూలము; నా యొక్క సూక్ష్మశరీరము – విశాల సూక్ష్మము,

నా యొక్క నిద్ర విశాలమైన నిద్ర కావాలి. అంటే వీటి మధ్యన సమన్వయం కోరుకోవాలి. పూర్ణిమనాడు ఈ 16 కళలను ఉపయోగించుకోవటమే 'శ్రీవిద్య' అంటే 15కళలు–15అక్షరాలు. చివరన 'శ్రీం'కలుపుతాం. ఇదీ మొత్తం మన సిలబస్.

## జగజ్జనని మహాయోగేశ్వరీదేవి అవతరణ

ఈనాడు మానవులు స్థూలజగత్తులో ఉండే కోరికలను తీర్చుకోవడానికి మాత్రమే ఆధ్యాత్మిక జగత్తులోకి వస్తున్నారే తప్ప యోగవిద్యను నేర్చుకోవాలనే ఆసక్తితో ఎవరూ రావటం లేదు. భౌతికజగత్తులో మనం కష్టాలు అనుకునేవి సాధకులకు అవి కష్టాలు కానేకాదు. సాధనతో పరిణామక్రమంలో ముందుకు వెళ్ళటానికి అవి ఎంతో ఉపకరిస్తాయని గురుదేవులు ఎప్పుడూ చెప్తుండేవారు. వచ్చిన కష్టాలను సదుపయోగం చేసుకోగలిగితే అందులోనూ లాభలు వస్తాయి. అలా సాధనాత్మకంగా యోగస్థితికి వెళ్ళాలనుకునే సాధకులకు కావలసిన మూడు మెట్లను గీతాచార్యులవారు ఇలా చెప్పారుః

మొదటిది–ఆహారము. యోగవిద్యలోఉన్నతిని సాధించటానికి యుక్తమైన ఆహారాన్ని తీసుకోవాలి. రెండవది–విహారము. విహారములో మీరు సాధనలు చేసుకోండి, జపాలు చేసుకోండి,

స్వాధ్యాయ, సత్సంగాలను చేసుకోండి. అందుకే బుద్ధుడు ఆరామాలను, విహారాలను పెట్టాడు. అంటే అక్కడ మీరు మీ సాధనలతో విశ్రాంతిని పొందుతారు. మీరు చేసే సాధనలన్నీ విహారంలోకే వస్తాయి. ఈ సాధనలవీ చేసేస్తున్నామని ఇంటి భాధ్యతలను మరచిపోకూడదు. యోగవిద్యలో సాధకులమని మీరు చేసే ప్రతీ పనీ విహారమే!

ఇకపోతే మూడవది – 'యుక్త చేష్టస్య కర్మసు'. అంటే జీవితంలో ప్రతి విషయంలోనూ నిజమైన కర్మచెయ్యాలి. నిత్యజీవితంలో అనేక బాధ్యతలుంటాయి. కర్మసిద్ధాంతాన్ని అర్ధం చేసుకొని, మీరు చేసే కర్మ అది క్లర్కుగానో, విద్యార్థిగానో, తండ్రో, తమ్ముడో, అన్నో ఇలాంటి రకరకాలైన బాంధవ్యాలుంటాయి. అందులో నీవు వాటికి అవసరమైన, యుక్తమైన కర్మను మాత్రమే చెయ్యి. భగవద్గీత మరలమరల చెప్పేదిదే!

కర్మసిద్ధాంతాన్ని అర్ధం చేసుకోటానికి విశాలమైన స్థూల జగత్తు, అక్కడి నుంచీ విశాలమైన సూక్ష్మజగత్తు, ఆ తర్వాత విశాలమైన కామమయ–విశాలమైన మనోమయ జగత్తు–బుద్ధి, ఆత్మ, అనుపాదక, ఆది అనే ఇన్ని తలాలున్నాయి. ఈనాడు చాలా మందికి ఈ పేర్లే తెలియవు. అసలు యోగం అంటే మొట్టమొదట మనమేం తెల్సుకోవాలంటే స్థూలానికి, సూక్ష్మానికి మధ్యన ఉన్న కామమయ జగత్తుకు; స్థూలమును, సూక్ష్మమును కలిపే మనోమయ కోశానికి మధ్య సంబంధం పెట్టుకోవాలి. మనోమయకోశంలో మళ్లీ రెండు ఉంటాయి – అరూపామనస్సు, సరూపామనస్సు. ఇది గాయత్రీమంత్రము యొక్క ప్రాధమిక తత్వము. ఇంక 'ఓం భూర్భువః స్వః' ఇవి గాయత్రీ మంత్ర వ్యాహృతులు. గాయత్రీ మంత్రంలో గల అసలైన సాధనారహస్యం, ఏంటా సాధనా రహస్యం అంటే – యుక్త ః చేష్టస్య కర్మసు, అదీ అసలైన రహస్యం. మీరు చేసే జపాలు, తపాలు, పూజలు అన్నీ మీరు మీ కోసం, కుటుంబం కోసం అవసరమైన కర్మలు చేసి అలసి పోయినప్పుడు సినిమాకు వెళ్ళినట్లుగా చెయ్యాలే తప్ప అంతకు మించి చెయ్యనక్కరలేదు. బాగా పనిచేసిన తర్వాత విశ్రాంతిని తీసుకోకపోతే తరువాత యుక్తమైన చేష్టలు చెయ్యలేరు. అలా ఆధ్యాత్మిక జగత్తు మీ జీవితంలోని ప్రతి అంగాన్ని స్పృశిస్తూ ఉంటుంది. ఓం భూర్భువఃస్వః – స్థూలజగత్తు, సూక్ష్మజగత్తు, కారణజగత్తు; మనో, వాక్కాయ కర్మలు, ఈ మూడింటి మధ్య సమన్వయం కావాలి. దానికి కావలసిన యోగం ఎక్కడి నుండి వస్తుందంటే గాయత్రీ మంత్ర సాధనతో వస్తుంది. దానికి హ్రీం, శ్రీం, క్లీం అనే మూడు బీజమంత్రాలు కలపమన్నారు గురువుగారు. ఈ బీజాక్షరాలు యుక్తమైన చేష్టలు మీ జీవితంలోకి వచ్చినప్పుడు మిమ్మల్ని రిలాక్సు చేస్తాయి. ఎలా,

మొదటగా క్లీం బీజము (సాధనలను ఇంక నుండి విహారము అనే పదంతోనే వాడతాం.) అంటే ఏమిటి? ఏ విధమైన చేష్టను మీ జీవితంలోకి తీసుకురావాలి? క్లీం అంటే కాలాన్ని మీరు ఒక్క క్షణమైనా వృధా పోనీయ కూడదు. 'క్లీం' అంటే మహాకాళి. అంటే మహాకాలసాధన. టైం అంటే సైన్సు. కాలాన్ని జీవితంలో దురుపయోగం చేయనటువంటి వ్యక్తి ఖచ్చితంగా గొప్పవాడౌతాడు. క్లీం సాధన చేసేటప్పుడు కాలాన్ని సద్వినియోగం చేసుకోవటం ఎలాగా అనేది చాలాసార్లు చెప్పాను. దాని కోసం టైంటేబుల్ వేసుకొని మీ బాధ్యతలను సవ్యంగా చేసే విధానం గురించి అనేకసార్లు చెప్పాను. క్లీం సాధన తర్వాత శ్రీం సాధన గమనంలోకి వస్తుంది. క్లీం సాధన ఒక్కటీ చేస్తే సరిపోదు. 'శ్రీం' సాధన మిమ్మల్ని సూక్ష్మజగత్తుల్లోకి ప్రవేశపెడుతుంది. ఎలాగైతే క్లీం సాధన స్థూలజగత్తును మొత్తాన్ని ఆవహిస్తుంది, అదేవిధంగా శ్రీం సాధన మిమ్మల్ని సూక్ష్మజగత్తులోకి ప్రవేశపెడుతుంది. శ్రీరామకృష్ణపరమహంస చేసిన మొత్తం సాధనలోని అద్భుతమైన రహస్యం ఇదే. దీంతోనే ఆయన సమయాన్ని దాటారు. అనేక మందిని దాటించారు.

ఎలాగైతే ఒక శాస్త్రవేత్త తాను చేసిన ప్రయోగం వలన స్థూలజగత్తులో ఒక విశేషమైనటువంటి పరికరాన్ని ఆవిష్కరణ చేసి దానితో తాను సుఖంగా వుండటమే కాకుండా మిగతా వాళ్ళకు కూడా ఆ సుఖాలను అందిస్తాడు. (ఉదాహరణకు విద్యుత్ పరికరాలు) అయితే ఎప్పుడంటే ఆ టెక్నాలజీని ఉపయోగించుకున్నప్పుడు. ఒక వ్యక్తి తన కోసం కంప్యూటర్‌ని కనిపెట్టాడు. ఈనాడు మొత్తం ప్రపంచం దానిని ఉపయోగించుకుంటున్నది. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ వనరులనుపయోగించుకోవాలంటే ఆ టెక్నాలజీ తెలియాలి. 'శ్రీం' అంటే అది. అందుచేత కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఒక విశేషమైన మానసికస్థితికి వెళ్తారు.

శ్రీరామకృష్ణపరమహంస అవతార రహస్యం అదే! ఇప్పటికీ ఆయనంటే ఏమిటో చాలా మందికి తెలియదు. యోగవిద్య యొక్క అంతరంగాన్ని అర్థం చేసుకుంటే తప్ప రామకృష్ణపరమహంస అర్థంకారు. ఆయన ముందు మహాకాళీసాధనను చేశారు. కాలాన్ని ఉపయోగించుకోవడం ఎలా అనే రహస్యాన్ని పట్టుకున్నారు. ప్రకృతిలో అనేక దేవతాశక్తులు ఉన్నాయి. ఎలక్ట్రిసిటీ అంటే అదే కదా! ప్రకృతిలో ఉండే రకరకాలైన దేవతాశక్తులనే 'శ్రీం' అంటారు. శ్రీసూక్తంలో దానినే ధనం-అగ్నిః ధనం-వాయుః ధనం-సూర్యో అంటే ఇవన్నీ ప్రాకృతిక శక్తులే కదా! శ్రీరామకృష్ణపరమహంస మూడు, మూడు రోజులపాటు ఈ ప్రాకృతిక శక్తుల సాధన చేసి వాటిని అంతరిక్షంలో నిలబెట్టారు.

ఒక జెనరేటర్‌లోలాగా వాటిలో శక్తి నిక్షిప్తమై ఉండాలి. వేర్వేరు కాలాలలో ఋషులు సాధనచేసి దర్శించిన దేవతాశక్తులను రామకృష్ణపరమహంస అనే ఒకే ఒక్క వ్యక్తి వాటిని గురించి సాధన చేసి ఆ శక్తిని అంతరిక్షంలో నిక్షిప్తం చేసి ఉంచారు. ఈనాడు మనం ఉపయోగించుకోబోతున్న ఈ మహాయోగేశ్వరీదేవి శక్తిని కూడా ఆయన అంతరిక్షంలో పెట్టి ఉంచారు. రామకృష్ణపరమహంస జీవిత చరిత్ర చదివితే ఆయన చేతనత్వం యొక్క పరాకాష్ట అర్థమౌతుంది. అన్ని దేవతాశక్తులూ ఇప్పుడు మీకు అందుబాటులో ఉన్నాయి. గవర్నమెంటు కరెంట్ ఇచ్చిందీ అంటే మొత్తం మానవ సముదాయానికీ ఇస్తుందే తప్ప ఏ ఒక్క వ్యక్తికో కాదు. అలాగే రామకృష్ణ పరమహంస చేసిన సాధన అద్భుతమైన దేవతాశక్తుల సాధన. దేనినైతే ఆయన అంతరిక్షంలో నిలబెట్టారో, దానిని మీరు శ్రీం బీజసాధనకుపయోగించుకోండి. నా కోసం శ్రీం బీజసాధన చేసుకుంటానంటే రామకృష్ణ పరమహంస ఇవ్వరు. అందరికీ కావలసిన వనరులకోసం అంటే ఇస్తారు. నేను ఇల్లు కట్టుకుంటా నంటే ఎవరూ సాయం చేయరు. అదే ఏ ఆశ్రమానికో, గుడికో అంటే ఇస్తారు. ఇదీ అలాంటిదే! శ్రీం – ఆ శ్రీం శక్తిని మనం కామమయకోశంలో ఉపయోగించుకోటానికి మూడురకాల దేవతా శక్తులనక్కడ స్థాపించారు రామకృష్ణపరమహంస. ఆయన స్థాపించిన ఆ మూడు రకాల శక్తులను ఆయన అర్థరాత్రిపూట ఒక తాంత్రిక గురువు దగ్గర నేర్చుకున్నారు. తాంత్రిక అనగానే కంగారు పడతారు. తంత్ర అంటే టెక్నాలజీ అని అర్థం. ఆయనకు ఆ తంత్రవిద్యను నేర్పించిన గురువు భైరవీబ్రాహ్మణి. ఆ సూక్ష్మజగత్తులో వున్నదేవతాశక్తులను, 'మీరు నన్ను తలుచుకోండి ఇచ్చేస్తానన్నారు' ఏ అవసరంకోసం వాటిని ఉపయోగించుకోవాలో దానికోసమే వాడండి. లేకపోతే ఆ వనరులు వృధా అవుతాయి. సదుపయోగం చేసుకోటానికి మాత్రమే రామకృష్ణ పరమహంస పెట్టినటువంటి ఆ శక్తిధారలు ఉపయోగపడతాయి. నిరంతరం వాటి శక్తులను అవి అలా వర్షిస్తూనే వుంటాయి. వాటికెప్పుడూ బ్రేక్‌డౌన్ లేదు. కానీ ఆ పవర్‌ని ఉపయోగించుకోవాలి అంటే యంత్రాలు కావాలి. టెక్నాలజీ కావాలి. శ్రీం సాధనలోకి వెళ్ళటానికి అంటే సూక్ష్మజగత్తులోకి ప్రవేశించాలంటే యంత్ర విజ్ఞానాన్ని ముందు నేర్చుకోవాల్సి ఉంటుంది. సూక్ష్మజగత్తు నుండి ఎక్కడికి వెళ్ళాలి? మనోమయ కోశంలోకి వెళ్ళాలి. మనోమయకోశంలోనే ఈ మొత్తం యంత్రవిద్య నిక్షిప్తమై వుంటుంది. ఇది తెలియాలంటే కాస్త కంప్యూటరు టెక్నాలజీ తెలియాలి.

సరే, మనోమయకోశంలో వున్న ఒక్క బిందువు మూడు క్షేత్రాలలో విస్తరిస్తుంది. ముందు జ్ఞానంగా విస్తరిస్తుంది. జ్ఞానం నుండి ఇచ్ఛగా మారి ఆ తర్వాత అది క్రియగా మారుతుంది.

ఉదాహరణకు ఇల్లు కట్టుకోవాలనేది బిందువనుకుందాం. దాని చుట్టూ ఎలా, ఎంతలో కట్టుకోవాలనే దాన్ని జ్ఞానంతో అల్లుకుంటాం. నాకున్న వనరులు (శ్రీం) ఇవి. అంతలోనే దానిని క్రియాన్వితం చేస్తాం. అంటే ఇల్లు కట్టుకుంటాం. అంటే ఒక (.)బిందువు ఉన్నది. దాని చుట్టూ ఇచ్ఛ, జ్ఞాన, క్రియాశక్తులనే మూడు రేఖలతో త్రిభుజం ఏర్పడుతుంది. దాని ఆధారంతోనే పని మొత్తం పూర్తౌతుంది. ఏ రంగంలోకి వెళ్ళినా ఇదే ప్రాథమిక నియమం. దీని ఆధారం లేకుండా ఏ పనీ చేయలేము.

మనం మళ్ళీ అనుగ్రహమాలామంత్రం దగ్గరకు వెళదాం. అనుగ్రహమాలా మంత్రము యోగసాధనకు ఎలా ఉపయోగపడుతుందో చూద్దాము. గాయత్రీమంత్రములో భూఃభువఃస్వః అనేవి మూడు వ్యాహృతులు కదా! అయితే అనుగ్రహమాలామంత్రము 7 యోగాలకు ఎలా ఉపయోగపడుతుందో చెప్తున్నాను. మొదటిది స్థూలము నుండి సూక్ష్మము. రెండవ యోగము సూక్ష్మము నుండి కారణము లేదా మనస్సు. ఇంక మూడవ యోగంలో మనస్సు యొక్క రెండు తలాలైన అరూపామనస్సు-సరూపామనస్సులు. స్థూల, కామ, మనస్సుల తర్వాత బుద్ధితో యోగం చెయ్యాలి. ధియోయోనః ప్రచోదయాత్. అయితే వీటిని ఎలా అనుసంధానిస్తున్నాము అంటే ఈ 'హ్రీం,శ్రీం,క్లీం'లు ఓం భూర్భువః స్వః తో అనుసంధానం చేయబడతాయి. కానీ ఈ హ్రీం, శ్రీం, క్లీం లు ఎక్కడున్నాయి? ఈ మూడూ సరూపామనస్సులోనే ఉన్నాయి.

క్లీం-కాలాన్ని సద్వినియోగం చేసుకోవటం, శ్రీం-వనరులను సద్వినియోగం చేసుకోవటం. హ్రీం-పరిణామక్రమంలో ఎక్కడ వున్నామో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ప్రయత్నం చేసి మనమెక్కడికి వెళ్ళాలి? ధియోయోనః ప్రచోదయాత్ లోకి అంటే బుద్ధిలోకి వెళ్ళాలి. ఇక్కడ మనం 'స్వ' కేంద్రిత ఆలోచనల నుండి బయటపడి స్వార్థరహిత స్థితికి వెళ్ళాలి. ఇక్కడి నుండి మరోయోగం మొదలౌతుంది. అది బుద్ధి నుండి ఆత్మకు, ఆత్మ నుండి అనుపాదకకు, ఆ తర్వాత ఆది తలాలకు తీసుకెళుతుంది. ఈ ఏడు యోగాలకి కావలసిన అస్త్రాలు, దానికి కావలసిన విన్యాసాలు, కావలసిన రంగులు, అన్నీ కూడా ఈ మహాయోగేశ్వరీ దేవి రూపంలో చిత్రీకరించ బడ్డాయి. అందుచేత ఈ పరిణామక్రమం అర్థం చేసుకోవటానికి ముందు 7 రకాలైన యోగాలను స్వీకరిస్తున్నాము.

యోగాలు అనంతం కానీ మనం కేవలం ఏడు రకాల యోగాల కోసం మాత్రమే ప్రయత్నిస్తున్నాం. ముందు స్థూలస్థితి నుండి సూక్ష్మస్థితికి వెళ్ళాలి. అయితే సూక్ష్మస్థితి నుండి విడిపోకూడదు. ప్రతిరోజు రాత్రి మీరు సూక్ష్మజగత్తులోకి వెళ్ళిపోతున్నారు, కొత్తదేమీకాదు, గుర్తు చేసుకోవాలి అంతే. మీరు చేసేటటువంటి అనుగ్రహ మాలామంత్రము, ఆ మహాయోగేశ్వరీ స్వరూపం, యంత్రము (మహాకాల చక్రవర్తీయంత్రము) ఈమూడూ కూడా మీకు ఒకే విషయాన్ని బోధిస్తున్నాయి.

పూర్వకాలంలో ఋషులు ఒక విషయాన్ని భూమ్మీదకు దింపటానికి ముందు ఒక మంత్రాన్ని దర్శించేవారు. ఆ మంత్రాన్ని దర్శించిన ఋషులు ఏ స్థాయిలో దర్శించి ఉంటారు? మనకు ఏడు స్థాయిలున్నాయి. మొదట ఏ స్థాయిలో దర్శించి ఉంటారు? విశుద్ధి చక్రం దగ్గర దర్శించి వుంటారు. మరి విశుద్ధిచక్రం అంటే వాక్. వాక్కు ఎప్పుడూ కూడా ఆత్మను తెలుపుతుంది. ఆత్మ ఎప్పుడూ సత్యమే! అందుచేత వాక్కు ఎప్పుడూ సత్యముగానే ఉంటుంది? దానిని ఉపయోగించే వాడి వలన దానిరూపం మారిపోవచ్చునేమోగానీ వాక్ ఎప్పుడూ సత్యమే! సత్యం, శివం, సుందరం అనే ఈ మూడూ ప్రతి వాక్కుకూ ఉంటాయి. అసలైన వాక్కు ఎప్పుడూ సత్యమే! ఆత్మా సత్యమే. మొట్టమొదట అనుగ్రహమాలా మంత్రంగా దర్శించినటువంటి సత్యమైన యోగస్వరూపం మెల్ల మెల్లగా క్రిందికి దిగి మహాకాలచక్రవర్తీయంత్ర స్వరూపంగా మారింది. అది సరూపామనస్సులో జరుగుతున్నది. అందుచేత మహాకాల చక్రవర్తీ యంత్ర స్వరూపంగా ఆత్మతలంలో దర్శించినటువంటి ఆ యంత్రం ఒక విశేషమైన అనుగ్రహమాలా మంత్రంగా దిగింది. ఇంకాస్త క్రిందికి దిగి అది భౌతికజగత్తులో మీకళ్ళకు ఏడు శిరస్సులు, పదునాలుగు చేతులు గల్గిన మహాయోగేశ్వరీ దేవిగా సాక్షాత్కరించింది. అందుచేత ఆ ఒక్క అనుగ్రహమాలామంత్రమే మహాకాల చక్రవర్తీయంత్రంగా ఆ తర్వాత అదే జగజ్జనని మహాయోగేశ్వరీదేవి స్వరూపంగా ప్రకటితమయ్యాయి. ఈ మూడింటినీ అంటే యంత్ర, మంత్ర, స్వరూపాలను కనుక మీరు కలుపుకొని సాధన చేసుకోగలిగితే మీరు ఆత్మతలానికి మాత్రమే వెళతారు. అప్పుడు స్థూలజగత్తు నుండి ఆత్మతలంలో ఉన్న ప్రతీ యోగమూ మీకు అనుభవంలోకి వస్తుంది. ఇప్పుడు అనుగ్రహమాలా మంత్రం చేస్తున్నవాళ్లు ఈ విషయాన్ని బాగా గుర్తుంచుకోండి. ఇది విహారం మాత్రమే, సీరియస్‌గా చేసే సాధన కాదు. ఈ యోగవిద్యను అంటే 7తలాలలో పనిచేసే అద్భుతమైన విద్యను–ఈ మహాకాల యంత్రము, అనుగ్రహమాలా మంత్రము, జగజ్జనని మహాయోగేశ్వరీదేవి స్వరూపము. ఈ మూడింటినీ ఎప్పుడైతే మనం కలిపేసు

కోగలుతామో అప్పుడు మనమూ ఋషుల స్థాయికి వెళతాము. ఋషులకు దర్శనమైన మంత్ర, యంత్ర, స్వరూపంగా ఆత్మతలంలోని మంత్రంగా దీనిని మనం అర్థం చేసుకుంటూ.. ఒక్కసారి అందరం కలిసి చేసుకుందాము...

ఓం భూర్భువః స్వః హ్రీం శ్రీం క్లీం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్ హ్రీం శ్రీం క్లీం ఓం క ఏ ఈ ల హ్రీం హ స క హ ల హ్రీం స క ల హ్రీం శ్రీం.

ఈ మహాశక్తి అవతరణలో గల అంతరార్థం: పృథ్వి తన పరిణామక్రమములో ప్రస్తుతమున్న చేతన స్థాయి నుండి ఇంతకంటే ఉన్నతమైన స్థాయిని చేరుకోవాలి. దానికోసం యోగమాయ ఒక విశేషమైన రూపంతో సప్తముఖిగా, చతుర్దశభుజాలతో, సర్వాయుధాలతో 1998 దేవీనవరాత్రులలో రాత్రి 11 గంటల 42 నిమిషాలకు పూజ్యశ్రీ మాస్టర్‌గారికి దర్శనమిచ్చింది. ఆమె యొక్క సప్త ముఖాలు ఏడు చేతనత్వస్థాయిలైన భూః భువః స్వః మహః జనః తపః సత్యం, అనే ఏడు లోకాలకి ప్రతీకలు. సూర్యుడిలోని ఏడు కిరణాలు, ఏడు ముఖాలకు ప్రతీకలు. ఈ తల్లి ద్వారా ప్రసాదించబడిన విద్యయే సూర్యకిరణవిజ్ఞానం. ద్వాపరయుగంలో ఈ దివ్యశక్తి సహాయంతోనే శ్రీకృష్ణుడు తన ప్రణాళికలన్నింటిని నిర్విఘ్నంగా చేయగలిగాడు. ఈమె యొక్క 14 భుజాలు పదునాలుగు భువనాలకు ప్రతీక. ఈమె చేతిలో ధరించిన ఆయుధాలన్నీ విశిష్టమైన ప్రత్యేకతను కలిగి లోకకళ్యాణ కారకములై జ్ఞాన, విజ్ఞానములను విస్తరింపచేసేందుకు, సమయాన్ని సద్వినియోగ పరచుకునేందుకు వినియోగించబడతాయి. సూర్యుడి నుండి వచ్చే ఏడు కిరణాలలో ప్రస్తుతం మానవపరిణామ స్థాయి కేవలం ఆకుపచ్చ, పసుపు, కాషాయం మరియు ఎరుపు అనే నాలుగు రంగులను మాత్రమే ఉపయోగించుకుంటున్నది. ఈ దేవి ఉపాసన వలన మిగిలిన బ్లూ, ఇండిగో, వైలెట్ రంగులను ఉపయోగించుకోగల స్థాయికి మానవజాతి అభివృద్ధి చెందుతుంది. అందుకొరకు మహాయోగేశ్వరీదేవి తన అనుగ్రహాన్ని వర్షిస్తూ వున్నది. ఎక్కడ దివ్యప్రేమ నిండి వుంటుందో అక్కడ లోక కళ్యాణ కార్యక్రమాలు అంటే ఒకే విశ్వం, ఒకే భాష, ఒకే ధర్మస్థాపనకు తగిన ప్రయత్నములు జరుగుతూ వుంటాయి. ఆ దిశగానైనా, ఏ సంస్థ పేరుతోనైనా, ఏ రకములైన సాధనా విధానాలతోనైనా తమ వంతు ప్రయత్నం చేస్తూ వుండే సమూహాలన్నింటికీ ఈ దివ్యమాత ప్రేరణ, స్ఫూర్తి, వరదానములు నిరంతరమూ లభిస్తూనే వుంటాయి,అని మాస్టర్‌గారు జగజ్జనని మహాయోగేశ్వరీదేవి గురించి చెప్పటం జరిగింది.

## ధరణి దీక్ష

1999 ఫిబ్రవరి 14వతేదీ మహాశివరాత్రికి ఎఱ్ఱబాలెం గ్రామంలో ప్రదోషకాలంలో మహాకాల యజ్ఞం నిర్వహించటాని గ్రామస్తులందరూ అన్ని ఏర్పాట్లనూ చేసుకున్నారు. భౌతికమైన ఆ ఏర్పాట్లను వారు ఎందుకు చేసుకున్నారో వారికి తెలియదు. కానీ ప్రకృతి ఎప్పటికీ దాని నియతిని అది ఉల్లంఘించదు సరికదా ఎక్కడ, ఎప్పుడు ఏది జరగాలో అది జరిగే విధంగా తగిన ప్రణాళికను సరి చేసుకుంటూనే వుంటుంది. నియతితో పాటు భక్తి, శ్రద్ధలు కూడా మాస్టర్‌గారిని ఆ కార్యక్రమానికి వచ్చేలా చేశాయి. ఆ సాయంత్రం చేయబోయే యజ్ఞానికి వచ్చిన మాస్టర్‌గారు శ్రీకాశీనాథ్‌బాబు గారింటిలో దిగారు. గ్రామస్తులందరూ కలసి శోభాయాత్రకు భారీగా ఏర్పాట్లు చేశారు. మేదరమెట్ల నుండి అనుగ్రహనగర్‌వరకు శోభాయాత్ర ప్రారంభమైంది. అన్నిరకాల వాహనాలతో కలశయాత్ర ముందుకు సాగింది. వేలాది మంది గ్రామస్తులు గాయత్రీమంత్రం పాడుకుంటూ, నినాదాలు చేసుకుంటూ మంచి ఉత్సాహంతో ముందుకు కదిలారు. నయనానందకరంగా ఉన్న ఆ శోభాయాత్ర మెల్లగా యజ్ఞశాలకు చేరింది. ఇంతలో మాస్టర్‌గారు కూడా యజ్ఞశాలకు వచ్చేశారు. వేదికనలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆనాటి ప్రవచనంలో –

'ఈ మహాశివరాత్రి పర్వదినాన పృధ్వీ పరిణామక్రమంలో తనదైన రీతిలో విశేష ప్రాధ్యాతను కలిగి వున్నది. ఈ మహాశివరాత్రి మానవీయ చేతనత్వంతో పాటు పృధ్వీగ్రహ అధిదేవత కూడా తాను పవిత్రగ్రహంగా మారటానికి అంటే ద్విజత్వాన్ని పొందటానికి ఒక విశేష దీక్ష తీసుకోవటం జరిగింది. (ఈ విషయం తరువాత మాస్టర్‌గారు చెప్పారు.) మహాకాలుని నిర్దేశములో బ్రాహ్మీచేతన ద్వారా ఇవ్వబడిన ఈ దీక్షలో కొన్ని కోట్లసంవత్సరముల వరకు తమ జీవితములకు కావలసిన లక్ష్యనిర్ధారణ చేసుకున్న వ్యక్తులు ఈ కార్యక్రమములో పాల్గొనటం జరిగింది' అని ఆనాటి ప్రసంగంలో మాస్టర్‌గారు చెప్పారు.

ఆ రాత్రి ఎనిమిది గంటలకు సహస్రకుండీయ మహాకాల యజ్ఞమును సాక్షాత్ పార్వతీ, పరమేశ్వరులు పరవశించి పోయే విధంగా పూజ్యశ్రీ మాస్టర్‌గారే స్వయంగా నిర్వహించారు. మహత్తరమైన ఈ మహాశివరాత్రి ప్రకృతిలోనే మహత్తరమైన మార్పులను తెచ్చింది. యజ్ఞనిర్వహణ మాస్టర్‌గారే స్వయంగా చేయడంతో నూతనంగా దీక్ష తీసుకున్న పుడమితల్లి పులకరించిపోయింది. అటువంటి మధురక్షణాలలో మాస్టర్‌గారు, 'ఈనాడు పృధ్వీ పవిత్ర గ్రహంగా దీక్షను తీసుకున్నది' అని గంభీరమైన స్వరంతో ప్రకటించగా అందరూ అలౌకికమైన ఆనందంతో దిక్కులు మారుమ్రోగి

పోయే విధంగా ఆగని చప్పట్లతో తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని శ్రీరామునిచే కీర్తించబడిన ఈ పుణ్యభూమి దీక్ష తీసుకుంటున్న పవిత్రక్షణాలలో అక్కడవున్న దివ్యాత్మల అదృష్టాన్ని ఎవరు మాత్రం మాటలలో ఎంతని వర్ణించగలరు? కాలక్రమములో ఆ ప్రదేశములో మల్లవరం డాం కట్టటంతో చుట్టు ప్రక్కల అనేక గ్రామాలు ముంపుకు గురైనాయి. అనుగ్రహనగర్ కూడా అందులోనే కలిసిపోయింది. అయితే ఈ యాగమైపోయాక అద్భుతమైన రీతిలో నీటి వనరులు సమకూరి నీటిఎద్దడి తీరిపోవడం వల్ల ఇప్పుడు ఆ ప్రాంతమంతా సశ్య శ్యామలంగా సుక్షేత్రమై బంగారుపంటలు పండుతున్నాయి. అందరి జీవితాలలో శాంతి, సంతోషాలు విరబూశాయి. ఈ సామూహిక సాధన వలన ప్రకృతిలో దివ్యమైన అలౌకిక సంఘటన జరిగింది. యజ్ఞం జరుగుతున్నప్పుడు ఫొటోలు తీశారు. ఆ ఫోటోల్లో ఈ సహస్రదీపయజ్ఞం తాలూకు దివ్యకాంతులు అంతరిక్షంలో అద్భుతమైన ఒక 'గ్రిడ్'లా అంటే ఒక అయస్కాంతక్షేత్రం మాదిరి ఏర్పడి అంతరిక్షంలోని గగనతలమంతా పిండారబోసిన వెలుగుల వెన్నెలలాగా వ్యాపించిన దృశ్యం ఆ కెమేరాలో బంధింపబడి మనకు ప్రత్యక్షసాక్ష్యమైంది. అది నిజంగా ఒక అద్భుతం. అలా 'అనుగ్రహనగర్" జలరాశిలో విలీనమైపోయింది.

## భగవద్గీత-దీక్షలు

దీక్షలు అనగానే పనులు మానుకుని ఏ నిర్జనప్రదేశానికో వెళ్ళిపోయి బాధ్యతలను విస్మరించి ఇటు భౌతికజగత్తుకూ పనికిరాక, అటు ఆధ్యాత్మిక జగత్తులో ఏ దిశలో వెళుతున్నామో తెలియక గందరగోళపడడం కాదు. అయితే ఈనాడు మానవజాతి అలాంటి మానసిక స్థితిలోనే ఊగిసలాడు తున్నది. కానీ మానవజాతి సామూహికంగానే మూడవ దీక్ష వైపుకు పయనిస్తోంది. ఆ మూడు దీక్షల యొక్క వివరణ, సాధనలను 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు ఎలా మానవాళికి అందించాడో అలాగే దానిని పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఈనాటి మానవుడు నిత్యజీవితంలో ఆచరించేందుకు వీలుగా మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ సాధనలుగా అందంగా అందించారు.

### అసలు కాలమును, దేశమును పరిపూర్ణంగా వినియోగించుకోవటం ఎలా?

ఈనాటి వైజ్ఞానిక ఆవిష్కారాలు మానవజాతి జీవితాన్ని ప్రభావితం చేసే విధానాన్ని చూస్తే వారందరూ ఈ దీక్షకు లోబడిన వారేనని స్పష్టంగా తెలుస్తుంది. కాలాన్ని, అవకాశాన్ని వినియోగించు కోలేని వారు జీవితాన్ని ఎలా నష్టం చేసుకుంటున్నారో కూడా తెలుస్తూనే ఉంది గదా !

## 'క్లీం' బీజసాధన

దేశకాలాలను పరిపూర్ణంగా సద్వినియోగం చేసుకునే మహాకాళీ సాధనగా, మహాకాలసాధనగా, శివ-శక్తి సాధనగా, పరిపూర్ణక్రియాశీల స్థితిగా "క్లీం" బీజ సాధనను చెయ్యాలి. "శివం-శాంతం-అద్వైతం-చతుర్థం-మన్యంతే స ఆత్మ'. అది 'ఆత్మ' స్థితి. ఆ స్థితి నుండి దీనినే మహాకాళీ సాధనగా శ్రీరామకృష్ణపరమహంస చేస్తే, మహాకాల సాధనగా శ్రీరామశర్మఆచార్య గురుదేవులు చేశారని మాస్టారు చెప్పేవారు. 'క్లీం' బీజ సాధనకు గీతలోని 1 నుండి 6అధ్యాయాలను చదవాలి. సాధన చెయ్యాలి. సప్తఋషి ఆశ్రమంలో ఈ 'క్లీం'బీజ సాధనను పరిమిత కాలంలో, నియమిత జపం చేయించి, అలా సాధన చేసినవారికి 'సర్టిఫికేట్ల'ను స్వయంగా మాస్టర్‌గారు ఇవ్వటం జరిగింది.

## 'శ్రీం' బీజసాధన

శాంత ఆత్మస్థితిలో ఉంటూ శరీరధారి అయిన వ్యక్తి అతని కర్మానుసారం పుట్టిన ప్రదేశంలోని వనరులను సంపూర్ణంగా ఉపయోగించుకునే విద్య గీతలో 7వఅధ్యాయం నుండి 12వ అధ్యాయం వరకు చెప్పబడినది. దీనినే 'శ్రీం' బీజసాధన అంటారు.

## 'హ్రీం' బీజ సాధన

క్రొత్త వనరులను సృష్టించుకొనుట. ఈ స్థితినే బ్రాహ్మీస్థితి అంటారు. సృష్ట్యాదిలో బ్రహ్మ ఈ వనరులేమీ లేకుండా కోట్లసంవత్సరాల సృష్టిని, కాలక్రమములో, ప్రాణులతో సహా సృష్టించ గలిగాడు. ఈ విద్యను సూర్యకిరణ విజ్ఞానమనీ, యోగవిజ్ఞానమనీ ఋషులు పేర్కొన్నారు. అంటే వ్యక్తి పరిణామక్రమంలో ఉన్నచోటనే ఉంటూ తన బాధ్యతను పరిపూర్ణంగా నిర్వహించగలిగేస్థితి ఏదైతే ఉన్నదో అది 'హ్రీం'బీజ సాధన వలన వస్తుంది. గీతలో 13వ అధ్యాయం నుండి 18వ అధ్యాయం వరకు చెప్పబడినది.

## క్లీం, శ్రీం, హ్రీం, ఓం బీజ సాధనలు

పూజ్యశ్రీ డాక్టర్ మారెళ్ళశ్రీరామకృష్ణగారు కొన్నివేలసంవత్సరాల క్రిందట మరుగునపడిన కొన్ని విశిష్టమైన దీక్షావిధానాలను 1999 మార్చినెల నుండి ఇవ్వటం ప్రారంభించారు. అవి చాలా విచిత్రమైన దీక్షలు.

నాగ అంటే ఉన్నచోటనే ఉంటూ పని చేసేవారు. యక్ష అంటే టెక్నాలజీని ఉపయోగించేవారు. గంధర్వ అంటే వాక్ శక్తిని ఉపయోగించుకొనేవారు. వీరి సమూహముల యొక్క దివ్యశక్తి ధారలు సాధకులను దీక్షితులుగా రూపొందిస్తుంది. క్లీం బీజ సాధనను చైత్రనవరాత్రులలో మాస్టర్‌గారు ఎంతో క్రమశిక్షణతో చేయించారు. గీతలో చెప్పిన విధంగా ఈ క్లీం బీజ సాధన 'సాధకుని నిజమైన కర్మయోగిగా నిలబెడుతుంది.' ఇంకా ఈ సాధన వలన కోట్ల, కోట్ల జన్మల నుండి సాధనకు అడ్డుపడే కుసంస్కారాల యొక్క నాశనము సంభవమౌతుంది. ఇంకా ఈ క్లీం బీజ సాధన మనకున్న 24గంటల కాలంలో 125 గంటల పనిని ఎలా పిండుకోవాలనేది నేర్పిస్తుంది. **క్లీం బీజ అక్షర ఉచ్చారణ వలన భౌతిక శరీరంలో కణుపులుగానీ, గడ్డలుగానీ ఇంకా అనవసరమైన గ్రోత్ ఏదైనా వచ్చినా నివారణ చేసుకోవచ్చు.**

దీని తర్వాత ఏప్రియల్ 8వతేదీ నుండి 'శ్రీం' బీజ సాధనను చేయించారు. ఈ 'శ్రీం' సాధన వలన మనకు అందుబాటులో వుండే వనరులను ఎలా సదుపయోగం చేసుకోవాలనేది సాధకునకు అర్ధమౌతుంది. మానవశరీరం 33 కోట్ల దేవతల నివాసమని పెద్దలు చెప్తుంటారు. శ్రీం" బీజ దీక్ష ఆ దేవతాసాక్షాత్కారాన్ని కల్పిస్తూ సాధకుని అఖండ ఐశ్వర్యవంతునిగా తీర్చిదిద్దు తుంది. క్లీం, శ్రీం, సాధనల తర్వాత హ్రీం బీజసాధన. 'హ్రీం' బీజ సాధన. ఈ సాధన వలన పరిణామక్రమములో మన పాత్రను సమర్ధవంతంగా ఎలా పోషించాలనేది మెల్లిమెల్లిగా అవగాహన లోకి వస్తుంది.

ఇలా భగవద్గీతలోని 18 అధ్యాయాలను మూడు భాగాలుగా చేసి మొదట 1-6 అధ్యాయాల వరకు 'క్లీం' బీజ సాధనలో- సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, తర్వాత 7-12 అధ్యాయాల వరకు 'శ్రీం' బీజసాధనలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ, చివరిగా 13-18 అధ్యాయం వరకు 'హ్రీం' బీజ సాధనతో విశ్వ ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావటానికి అవకాశం లభిస్తుంది. అందుకని ఈ మూడు దీక్షలనందించటం జరిగింది.

ఇది 1999వ సంవత్సరం. ఈ సంవత్సరంలోపల దీక్షావిధానాలు కనుక బహిర్గతం కాకపోతే సుమారు 24 కోట్ల సంవత్సరాల వరకు మానవజాతికి ఈ దీక్షలు లభ్యం కావు. కాలగర్భంలో కొట్టుకుపోతాయి. మహాభారతయుద్ధంలో అర్జునుడిని ఉపాధిగా ఉంచుకొని శ్రీకృష్ణుడు సమస్త ఉపనిషత్తుల సారాన్ని భగవద్గీతగా అందించాడు. అలాగే పూజ్యశ్రీమాస్టారు ఆ గీతాజ్ఞానాన్ని,

లుప్తమైపోతున్న 'దీక్షావిజ్ఞానాన్ని' బీజమంత్రరూపంలో మనలను అడ్డుపెట్టుకొని మానవజాతి కందించిన మహానుభావులు. అలాంటి మహాజ్ఞాని, ప్రజ్ఞావంతులు, ప్రేమస్వరూపులు అయిన మాస్టర్‌గారు మానవజాతికిచ్చిన వరదానాల గురించి ఎంతని చెప్పగలం? ఈ ప్రవచనామృతాన్ని అందరికీ అందచేయాలనే తపనతో 'భగవద్గీత-దీక్షలు' అనే పేరుతో పుస్తకాన్ని ప్రచురించి, 2000 ఆగష్టు15వ తేదీన పూజ్యశ్రీ మాస్టర్‌గారి చేతనే దీనిని ఆవిష్కరింపచేయటం జరిగింది.

## సంపూర్ణ సూర్యగ్రహణము - దాని ప్రభావము

1999 ఆగష్టు 11వ తేదీన సంపూర్ణ సూర్యగ్రహణంనాడు సప్తర్షి ఆశ్రమంలో వేలాదిమంది సాధకులతో అద్భుతంగా ఒక పూర్ణాహుతి జరిగింది. భగవంతుని యొక్క వారసుడిగా, తన అనుపమానమైన మానవీయ లక్షణములతో దేవతలను సైతం సమ్మోహితులను చేయగలిగే మానవుడు తన సంకుచిత, స్వార్థపరమైన ఆలోచనా ధోరణి వలన తన మనుగడకే కాకుండా పృథ్వీమాత యొక్క మనుగడను కూడా సంకట పరిస్థితులలో పడవేశాడు. మానవుని ఆలోచనా ధోరణిలో ఏర్పడుతున్న స్వార్థసంకుచిత కోరికలకు పర్యవసానంగా 2000సంవత్సరం నాటికి ఏర్పడబోయే విపత్కర పరిస్థితులను దాదాపు ఆరువేల సంవత్సరాల క్రిందటే అనేక మంది ఋషులు, మహాత్ములు గుర్తించారు. ఆ విపత్తుల నివారణకై వారానాటి నుండి రకరకాల ప్రయత్నాలు చేస్తూ చివరకు ఐదువేల సంవత్సరాల నుండి ఒక అద్భుత ప్రయోగాన్ని హిమాలయాలలో చేపట్టారు. ఆ ప్రయోగాల ఫలితాలను రెండువేల సంవత్సరం నాటికి స్పష్టంగా గమనించగల్గుతాము అని అనేకమంది మహనీయులు తెలియచేస్తున్నారు. ఇక్కడ మనం గమనించవలసిన మరో అంశమేమిటంటే 5వేల సంవత్సరాల క్రిందట ద్వాపరయుగాంతంలో కురుక్షేత్ర మహాసంగ్రామ సమయంలో ఏర్పడిన సంపూర్ణ సూర్యగ్రహణం తిరిగి అదే విధమైన గ్రహస్థితులతో 1999 ఆగష్టు 11వ తేదీన ఏర్పడబోతున్నది.

ఈనాడు రాబోతున్న విపత్తులు, వాటి నివారణ తర్వాత రాబోయే అననుకూల పరిస్థితుల గురించి అనేక మంది మహనీయులు, భవిష్యవేత్తలే కాకుండా ఈనాటి గ్రహస్థితుల ఆధారంగా జ్యోతిషశాస్త్రవేత్తలు ఇంకా భవిష్యపురాణం, భృగుసంహిత, పండిత శ్రీరామశర్మఆచార్యగారు అఖండ జ్యోతిలో ఇచ్చిన వ్యాసాలవివరణ, సుప్రసిద్ధ జ్యోతిషవేత్త శ్రీబెంగుళూరు వెంకటరామన్, ఎడ్గర్‌కేసీ, 15వ శతాబ్దానికి చెందిన నాష్టర్‌డామస్, విశ్వవిఖ్యాత భవిష్యవేత్త కీరో మొదలైనవారు 20వ

శతాబ్దంలో జరిగే వైపరీత్యాలను గురించి తెలియజేస్తూ, ఇంకా ఏం చెప్పారంటే అవి ప్రచండ ఆధ్యాత్మికశక్తుల ప్రభావం వల్ల నివారించబడటమే కాకుండా, రెండువేల సంవత్సరం తరువాత నూతనయుగం వస్తుందని చెప్పారు.

ఈ క్రొత్త ఆధ్యాత్మిక చేతనకు సమిష్ఠి కృషి భారతదేశంలో జరిగి, 'భారతదేశం తిరిగి జగద్గురు పీఠాన్ని అధిరోహిస్తుంది' అని ఘంటాపథంగా చెప్పారు. ఇలాంటి పరిస్థితులను సంతులనం చేయటానికి పూజ్యశ్రీ మాస్టర్‌గారు,'ఆదిత్యహృదయం' ఐదుకోట్ల పారాయణ చేయించి ఆగష్టు 11వ తేదీన సప్తర్షిఆశ్రమంలో వేలాదిమంది సాధకులతో పూర్ణాహుతి చేశారు. అక్కడికి రాలేని కొంతమంది సాధకులు వారు ఎక్కడైతే ఉన్నారో అక్కడే తమ ఇరుగు, పొరుగు వారిని కలుపుకొని అదే సమయంలో యజ్ఞం చేసుకోమని చెప్పారు. అలా ఆ ఆదిత్యహృదయ పారాయణ వివిధ ప్రదేశాలలో సమర్ధవంతంగా జరగడం, దాంతో పాటుగా సమిష్టి కృషితో పూర్ణాహుతియజ్ఞాలను చేయడంతో ప్రకృతి దివ్యమైన సవితా తేజస్సుతో సుసంపన్నమైంది. దీని వలన సూక్ష్మజగత్తులో ఒక అద్భుతమైన, శాంతియుతమైన పరాప్రకృతి పరిమార్జన జరిగివుంటుందనేది ఒక తథ్యము.

# V ఆశ్రమములు – దర్శనములు

## అధ్యాయం-13
## సమర్థ సద్గురు స్పర్శ దీక్ష

మానవజాతి మీనయుగం నుండి కుంభయుగంలోకి ప్రవేశిస్తున్న శుభసమయమిది. ప్రస్తుత కుంభయుగంలో సహజీవనము, సామూహికత, పరస్పర సహకారములనబడేవి మానవజాతి నేర్చుకోవలసిన జీవన విధానములు. ఈ విధమైన జీవితవిధానానికి తగినరీతిలో వ్యక్తి తనను తాను మలుచుకుంటూ మాస్టర్‌గారు అందిస్తున్న సాధనను అమలుచెయ్యాలి. దీనికై మానవులు పరమప్రేమతో, అవ్యాజకరుణతో, ఆదరాభిమానాలతో జీవించటం నేర్చుకోవాలి. సాధనలకు మకుటాయమానమని చెప్పదగిన ఈ సమర్థ సద్గురు స్పర్శ ధ్యాన విధానమును 1999వ సంవత్సరం ఆగష్టు 15వ తేదీన సప్తఋషి ఆశ్రమములో ఇచ్చారు. **శరీరాన్ని 'ఓం' కారానికి అనుగుణంగా మార్చుకోవటం తప్ప అమరత్వానికి, భువిపై స్వర్గావతరణకు మరోదారి లేదు. వేదసాంప్రదాయానికి అనుగుణంగా జీవించటానికి ఈ సాధన ఎంతైనా అవసరం అనే విషయాన్ని సాధకులు గుర్తించాలి.**

శరీరంలో మాలిన్యాలు ఉన్నంతవరకు అక్షర పరబ్రహ్మమైన ఆ 'ఓం'కార శక్తిని మానవుడు ఉపయోగించుకోలేడు. ఈ మాలిన్యాలను పోగొట్టుకుని 'ఓం'కార శక్తిని సాధించటానికి, తద్వారా అమరత్వ సిద్ధిని పొందటానికి సాధకుడు నిశ్శబ్దంలోనికి ప్రవేశించాలి. దానికి ఖచ్చితంగా 21సార్లు 'ఓం' కారాన్ని ఉచ్చారణ చేసి తీరాలి. మన షట్చక్రాలలో జన్మ, జన్మల నుండి పేరుకుపోయి వున్నటువంటి మాలిన్యాలు పోతే తప్ప మనలోకి ఆ శక్తి, ఆ విద్యుత్తు రాదు. అంటే దైవీశక్తి మనలోకి రాదు. ఆ దైవీశక్తి మనలోకి దిగాలంటే 21సార్లు 'ఓం' కారాన్ని ఉచ్చరించాలి. అదెలాగంటే ముందుగా 'ఓం' కారాన్ని మూలాధారం దగ్గర మొదలు పెట్టి మెల్లిగ ఆజ్ఞ వరకు వెళ్ళి, మళ్ళీ ఆజ్ఞ నుండి మూలాధారం వరకు–మళ్ళీ మూలాధారం నుండి ఆజ్ఞ వరకు, అక్కడ నుండి అంతఃకరణ

సాధన అంటే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అంటే సహస్రారము వరకు వెళ్ళి, మళ్లీ సహస్రారం నుండి బుద్ధి వరకు వచ్చి ఆపేస్తాం. ఈ సాధన చేస్తున్నప్పుడు ఆయా చక్రాల దగ్గర ఎంతో జాగురూకతతో మనస్సును అక్కడ నిలపాలి. చివరగా 21వ 'ఓం'కారమును బుద్ధిలో నిలిపి గురుదేవులకు శరణాగతి చేస్తూ నిశ్శబ్దంలోకి వెళితే ఆ మహాశూన్యంలో నుండి పరమశాంతి, దాని నుండి అపారమైన జ్ఞానం అందులో నుండి క్రియాశీలతను పొందగలుగుతాము. అలాంటి ఈ సమర్ధ సద్గురు స్పర్శ ధ్యానాన్ని పూజ్యశ్రీ మాస్టర్‌గారు సప్తర్షి ఆశ్రమంలో 1999 ఆగష్టు 15వ తేదీన దీక్షగా ఇచ్చారు.

## సమర్ధ సద్గురు స్పర్శధ్యానం

ఈ యుగసంధికాలంలో మానవచేతనత్వంలో పరిణామక్రమమును గురించి ఎలాంటి మార్పులు తీసుకువస్తే బావుంటుందనే దానిని దృష్టిలో ఉంచుకొని దానికి అవసరమైన ధ్యాన పద్ధతులను మాస్టర్‌గారు రూపొందించటం జరిగింది. అందులో సమర్ధ సద్గురు స్పర్శ ధ్యానం చాలా మంచిది. ధ్యానంలో మొట్టమొదటగా సాధకుడు తన మనస్సు, కోరికల మధ్య సమన్వయాన్ని సాధించి వ్యక్తిత్వం కలవాడుగా రూపొందుతాడు. దాని తర్వాత ఆత్మ, బుద్ధి, మనస్సుల ఏకీకరణను సాధించి జీవాత్మగా రూపాంతరం చెందుతాడు. చివరగా పురుషోత్తముడికి, జీవాత్మయైన అక్షర పురుషుడిని, క్షరపురుషుడైన వ్యక్తిత్వాన్ని సమర్పించుకొని అద్వైతస్థితిలోకి ప్రవేశించి పురుషోత్తము డౌతాడు.

ప్రతి ధ్యానానికి నిర్దిష్టమైన లక్ష్యం ఒకటి వుంటుంది. ఈ సమర్ధసద్గురుస్పర్శ ధ్యానంలో కుండలినీ సాధన, సావిత్రీసాధన, పిండాండ బ్రహ్మాండ సమన్వయం, లాహిరీ మహాశయుల క్రియాయోగము, ప్రకృతే మన గురువు అని చెప్పిన సాయిమార్గము, శ్రీరామకృష్ణుల సకలదేవతా సాక్షాత్కారము, శ్రీరామశర్మ ఆచార్యగురుదేవుల గాయత్రీ మంత్రసాధన, శ్రీఅరవిందుల సుప్రామెంటల్ డిసెంట్ , పతంజలి యోగసూత్రాలు మొదలైన అన్ని సాధనలలో వున్న మకరందాన్ని సంపుటీకరణ చేసి 'సూత్రేమణిగణా ఇవ' అన్నరీతిలో ఈ ధ్యానంలో గుదిగుచ్చి వుంచారు. విశ్వంలో ఎక్కడెక్కడ పదార్ధం వున్నదో దానినంతా దాటవేసి పై తలానికి సాధకుడిని ప్రవేశపెడుతుందీ ధ్యానం. 'ఋచేఅక్షరే పరమేవ్యోమన్' అన్న ఋషిదర్శనాన్ని, ఆ దర్శనాన్ని ప్రసాదించిన 'మహా శూన్యాన్ని' వివరిస్తూ సాధకుడు తన సాధనాపరాక్రమంతో తానూ ఆ మహాశూన్యం అయిపోయేందుకే

మాస్టర్‌గారు మనకీ సాధననందించారు. విశ్వపరిణామప్రక్రియలో ప్రప్రథమంగా ఆత్మసామ్రాజ్యాన్ని మానవజాతికి సమర్థసద్గురుస్పర్శ ధ్యానవిధాన రూపంలో కానుకగా ఇచ్చారు.

పృథ్వీపై స్వర్గావతరణ జరగాలి. వేదసామ్రాజ్యస్థాపన, భారతీయ ఋషుల యొక్క ఆధ్యాత్మిక సత్యదర్శనం తిరిగి సుప్రతిష్ఠితం చేయాలనేదే మన ఉద్దేశం. ఈ భూమి మీద స్వర్గావతరణ జరగాలంటే భూమి మీద దేవతలు ఉండాలి. మరి మనుషులంతా ఏమవ్వాలి? అంటే మనుషులంతా దేవతలుగా మారాలి. అదీ పృధ్విపై స్వర్గావతరణ అంటే ! దానికొరకే పరమగురువులందరూ కూడా 'ఆ మహాకాలుని చక్రవర్తిత్వాన్ని' భూమీ మీద స్థాపించటానికే అవతరించారు. దానినే ఆత్మరాజ్యము, ఆత్మదర్శనము, ఆత్మజ్ఞానము అని అన్నారు. ఈ మహాకాల చక్రవర్తి పరిషత్ ఆధ్వర్యంలో జరిగేటటువంటి స్వ-ఆత్మరాజ్య-స్థాపన కేంద్రాలను మనం ఏర్పాటు చేసుకుంటున్నాము. ఈ 'సమర్థ సద్గురు స్పర్శ' ధ్యానమును నేర్పించటానికి ఈ "స్వ-ఆత్మరాజ్య-స్థాపన" కేంద్రం అనే ఈ కార్డులు అందరికీ ఇవ్వండి. అసలు ముందుగా సమర్థసద్గురుస్పర్శ అంటే ఏమిటో తెలుసుకోవాలి. అంటే అది ఆత్మ యొక్క స్పర్శ. ఆ స్పర్శను నిజంగా ఎవరైతే పట్టుకోగలుగుతారో అది వారి జీవితాలను అద్భుతంగా వ్యవస్థీకృతం చేస్తుంది. మన ఈ కేంద్రాలలో ఎవరైతే వచ్చి సాధనను నేర్చుకుంటారో వాళ్ళు సహజంగానే 'శ్రీమహాకాల చక్రవర్తి సామ్రాజ్యంలో' పౌరులౌతారు. వారు 'యతీనాం బ్రహ్మభవతి సారధిః' అవుతారు. అదేలా అనేది అర్థం కావాలి. దానికి సూర్యోదయ, సూర్యాస్తమాన సమయాలలో అగ్నిలో రెండు ఆహుతులు వేసి ధ్యానానికి కూర్చోవాలి. ముందుగా 4 పతంజలి యోగ సూత్రాలను ఉచ్చరించాలి. ఈ ధ్యానం 20 నిమిషాల కంటే ఎక్కువ సేపు చేయకూడదు. ఆ ధ్యానస్థితిలో మీరేం చెయ్యాలనేది చూద్దాం.

మనం ఇప్పుడు 21 సార్లు 'ఓం' కారాన్ని ఉచ్చరించాలి. ఈ 21 సార్లు చేసే ఓంకారంలో మన ప్రయత్న మేమిటంటే మనందరి శరీరాలలో ఏడు చక్రాలు ఉన్నాయి గదా! వాటి మీద ఈ ఓం కారాన్ని 21 సార్లు చేయాలి. ఈ చక్రాలు మూలాధారం, స్వాధిష్టానం, మణిపూరకం, అనాహతం, విశుద్ధి, ఆజ్ఞ, సహస్రారం. అనేక జన్మల నుండి మూలాధారంలో చేసిన తప్పులున్నాయి. స్వాధిష్టానంలో చేసిన తప్పులున్నాయి.. సరే ఇప్పుడా తప్పులను గురించి కాక ఒప్పులను గురించి మాట్లాడుకుందాము. ఆ ఒప్పులకు పరాకాష్ట ఏమిటంటే మనం చేసే వినాయక పూజ. వినాయకుడు, మూలాధారంలో ఉంటాడు. సరస్వతీదేవి, సహస్రారంలో ఉంటుంది. ఈ మధ్యలో ఉన్నదేవతా శక్తులను మనం మేల్కొలపాలి. దేవతాశక్తుల పరాకాష్ట

**'శ్రీమాతా శ్రీమహారాజ్ఞి శ్రీమత్సింహాసనేశ్వరి ।**
**చిదగ్ని కుండ సంభూత దేవకార్య సముద్యత ॥**

ఆ లలితాంబిక, లలితాపరమేశ్వరీదేవి దేవకార్య సముద్యత అనే అఖండ చేతనత్వానికి ప్రతినిధి.

ఇప్పుడు మనం ఈ ధ్యానంలో 'ఓం' అనే అక్షరంతో మనలోని చేతనత్వాన్ని ఈ అనంతమైన చేతనత్వంతో కలుపుతాము. బయటవున్న వినాయకుడేమీ చెయ్యలేడు. లోపల వున్న వినాయకుడు అన్ని విఘ్నాలను తీసివేయగలడు. సరే, ఆరు చక్రాల్లో ఓంకారం చేద్దాం అంటూ సాధన ప్రారంభించారు. ఎలా చేయాలనేది బొమ్మలో చూడండి. 21సార్లు ఓం కారం చేసిన తరువాత ఆ చక్రవర్తికి సంపూర్ణ సమర్పణ చేసుకొని ఒక పదినిమిషాల పాటు ఆ మౌనంలో ఉండిపోవాలి. హాయిగా, అప్రయత్నంగా, మౌనంగా వుండండి. ఏ అనుభూతి వద్దు. ఖాళీ, ఖాళీ, ఖాళీ...ఆ శూన్యం, శూన్యం, శూన్యం... ఆ నిర్విచార స్థితికి ప్రయత్నించాలి. చాలా సహజంగా పరమశాంత స్థితి వస్తుంది. ఆ స్థితిలో ఉత్తినే కూర్చోకండి. మహేష్‌యోగిగారిచ్చిన 'ట్రాన్‌సెండెంటల్ మెడిటేషన్' చెప్పబడే స్థితి ఇదే. ఇదొక అద్భుతమైన డైనమిక్ సైలెన్స్. మౌనం కాదది. ఏదీ వినబడదు. కానీ ఆ శూన్యాన్ని దర్శించాలి. మీ లోపల వున్న ఆ శూన్యాన్ని చూడండి. సమస్త దేవతాశక్తులు ఆ శూన్యంలోనే వున్నారు. అంత అద్భుతమైన ఆ దర్శనం పట్ల మీకు సహజంగానే ఆకర్షణ కలుగుతుంది. ఆలోచనారహిత నిష్కంప స్థితి. శక్తి యొక్క శాంత స్థితి. ప్రతిరోజూ మానకుండా చెయ్యండి. దానికి కృషి కావాలి. మనం సర్వశక్తిమంతులం. సార్వజ్ఞబీజం మనదగ్గరున్నది. దానిని బహిర్గతం చేయాలంటే కృషి చెయ్యాలి. "తత్ర స్థితౌ యత్న ః అభ్యాసః" అని పతంజలి యోగసూత్రాలు మనకు చెప్తున్నాయి. అలా చేసేవాళ్ళంతా ఒక సమూహంగా తయారు కావాలి. "యతీనాం బ్రహ్మాబవతి సారధిః" అనేది మన సిద్ధాంతం. మన సమూహమంతా ఆ సిద్ధాంత పరిధిలోనే జీవిస్తారు. యుగయుగాల నుండి అనేక మంది మహాత్ముల అనుభవాలు అందులోనే వున్నాయి. ఈ మొత్తం సృష్టికి ఆధారభూతమైన శక్తి అంతా కూడా ఆ 'ఓం'లోనే వున్నది. 'ఓం' అనే అక్షరంలో లేదు. 'ఓం' ఎక్కడ లయమౌతుందో అక్కడ ఉంది. 'ఓం' కారాన్ని జపం చేస్తూ కూర్చోమనికాదు నేను చెప్తున్నది. అది ఎక్కడ లయమౌతున్నదో దానిని పట్టుకోండి. దానిని పట్టుకుంటే ఇంక మీకే రోగాలు వుండవు. ఏ సమస్యలూ ఉండవు. గురువుల దగ్గరకు వెళితే అన్నీ రోగాలు పోతాయి.

ఎందుకంటే గురువు నిరంతరం ఆ మౌనంలోనే వుంటాడు కనుక. సమర్థ సద్గురు స్పర్శ ధ్యానాన్ని నిష్ఠతో చెయ్యండి. ఆ గురుస్పర్శ అనుభూత మయ్యేదాకా చెయ్యండి.

ఒక్కసారి కనుక ఆ స్పర్శ వచ్చిందనుకోండి, ఇంక మీ జీవితాలు ధన్యమైపోతాయి. దీనికి ఉదయం, సాయంత్రం రెండు పూటలా నిరంతర అభ్యాసం కావాలి. మన జీవితాలను అత్యంత సరళంగా, గురువుకు సమర్పించుకోగలిగిన గగనకుసుమంలాంటి ధ్యానం ఇది. ఈ ధ్యానం చేసి గురుచరణాలకు మన జీవితాలను సమర్పించుకొని ఈ జీవితాన్ని ధన్యం చేసుకుందాం.

భువిపై స్వర్గావతరణ అనే పదాన్ని మళ్ళీ మళ్ళీ అర్థం చేసుకొనండి. అందరూ అమరులుగా మారితేనే స్వర్గావతరణ జరుగుతుంది. అమరులుగా మారాలనే మాస్టర్ సి.వి.వి చెప్పారు. పూజ్యగురుదేవుల కోరికా అదే ! చచ్చిపోయిన నేను ఓంకారము చేయటం వలన మూడుసార్లు బ్రతికి బయటపడ్డానని, పరమగురువులు తనను బ్రతికించారని మేడం బ్లావెట్స్కీ చెప్పారు. ఎవరి శరీరం 'ఓం'కారానికి అనుగుణంగా వుంటుందో వారిని మాత్రమే గురువులు బ్రతికించగలరు. ప్రతివారి శరీరం 'ఓం' కారానికి అనుగుణంగా మారడం తప్ప మరో దారి లేదు. భువిపై స్వర్గావతరణ అంటే మన మందరమూ కూడా మృత్యువాత పడకుండా అమరుల వలె జీవించాలి. ఎవరు, ఎక్కడవున్నా ప్రతిరోజూ ఈ సాధన ఉదయం, సాయంత్రం రెండు పూటలా చెయ్యాలని చెప్పటమే కాకుండా సప్తర్షిఆశ్రమంలో విధిగా రెండు పూటలా చేయించేవారు.

సామూహికంగా వెయ్యిమంది సాధకులు 'రోగులను' తమ మధ్యన కూర్చుండబెట్టుకొని ఈ సాధన చేసినట్లయితే క్షణాల మీద వారికి రోగనివారణ జరుగుతుందని కూడా మాస్టర్‌గారు చెప్పారు.

## శ్రీ హంస రామ ఆశ్రమము

అనేక మంది పరమగురువులు వివిధ ప్రదేశాలలో వివిధ విధానాలలో, 'నవయుగావతరణకు' తమతమ శిష్యబృందాలతో పని చేస్తున్నారు. అందులో భాగంగానే పూజ్యశ్రీ మాస్టర్‌గారు ముగ్గురు ఋషుల కార్యప్రణాళికలను (అగస్త్యమహర్షి, కణ్వమహర్షి, దుర్వాసమహర్షుల) భూమి మీదకు దింపటానికి ప్రయత్నం చేస్తూ దానికి సంబంధించిన సాధనా విధానాలనందిస్తూ ఋషుల ప్రణాళికలలో భాగస్వాములమయ్యే అవకాశాన్ని మనకు కల్పించారు. శ్రీ హంస రామ ఆశ్రమానికి అనుబంధంగా

ప్రత్యేకంగా మూడురకాల వ్యవస్థలను వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించటానికి ఏర్పాటు చేశారు. అవే

## దేవమాత గౌతమీ ట్రస్టు

పూజ్యశ్రీ మాస్టర్‌గారి ద్వారా ఋషులందించేటటువంటి కార్యక్రమాలను శ్రద్ధాభక్తులతో నిర్వర్తించటానికి 'దేవమాత గౌతమీ ట్రష్టు' ఏర్పాటు చేయబడినది. పూర్వకాలంలో ప్రపంచములో భయంకరమైన క్షామం ఏర్పడినప్పుడు గౌతమమహర్షులవారు గాయత్రీమంత్ర శక్తితో ఆ క్షామం నుండి మానవజాతిని ఏ విధంగా ఉద్ధరించారో, అదే విధంగా ప్రస్తుతం ఏర్పడి ఉన్న సంకట పరిస్థితుల నుండి సమస్త విశ్వాన్ని ఉద్ధరించి తిరిగి శాంతియుత వాతావరణాన్ని నిర్మించటానికి ఈనాటి యుగఋషి పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్య రు అదే గాయత్రీమంత్ర ఉ పాసనను సార్వజనీనం చేశారు. అలాంటి గురుదేవుల ప్రణాళికను "దేవమాత గౌతమీ ట్రష్టు" ద్వారా జనబాహుళ్యానికి అందచేయడానికి 'శ్రీహంస రామ ఆశ్రమము'ను నెల్లూరు జిల్లాలో గల కాకివాయి గ్రామంలో ఏర్పాటు చేశారు. 'దేవమాత గౌతమీ సమాఖ్య' లోని మూడు ముఖ్యమైన విభాగముల ద్వారా కార్యాచరణ రూపొందించబడినది. క్లుప్తంగా వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

**1. వేదమాత సమాఖ్య:** విశ్వము యొక్క సమస్త జ్ఞానమును అందించే వేదవిజ్ఞానాన్ని జనసామాన్యానికి అందించటం. వేదవిజ్ఞానం అర్థం కావాలంటే సంస్కృత భాష వస్తే చాలదు. వేదవిజ్ఞానం అర్థం కావాలంటే 1. 'ఆనోభద్రా క్రతవో యంతు విశ్వతః' అంటే ప్రపంచంలో గల మంచి ఆలోచనలు మనకే వచ్చునుగాక! అనే పరమ పవిత్రమైన మానసిక స్థితి ఉండాలి, 2. 'వసుధైవ కుటుంబక' భావన అందరిలో రావాలి, 3. సమయదాన, అంశదానములనివ్వటం, 4. 'ఆత్మవత్ సర్వభూతేషు' అనే తీవ్రమైన భావ సంవేదనలనలవరచుకోవాలి. ఈ గుణాలను వేదమాత సమాఖ్యలో వుండే సాధకులు తమ సొంతం చేసుకోవాలి. అప్పుడే 'వేదమాత సమాఖ్య" అత్యంత శక్తివంతంగా, క్రియాశీలతతో పని చేయగల్గుతుంది.

**2. దేవమాత సమాఖ్య:** దక్షిణ భారతదేశం యొక్క పరిపూర్ణ బాధ్యతను స్వీకరించినవారు శ్రీఅగస్త్యమహర్షి, కణ్వమహర్షి, కణ్వమహర్షి తపఃస్థలినే ఈనాడు 'కండలేరు డాం'గా గుర్తించారు. ఆ కణ్వమహర్షి తపస్సు చేసిన పరిసర ప్రాంతాలలోనే "శ్రీ హంస రామ ఆశ్రమము" ఏర్పాటు చేయబడినది. ఇదే కణ్వమహర్షిగారి ద్వారా 101మంది ఋషుల పరిచయభాగ్యాన్ని పొంది ఆ

101 మంది ఋషుల కార్యక్రమాలకు పునాదులు వేసిన శ్రీవెంకయ్యస్వామివారు ఆనాడే ఈ ఆశ్రమ పరిసర ప్రాంతాలను వారి స్వహస్తాలతో కొలవటం జరిగిందని వాటినన్నింటినీ చూచిన పెద్దలు వారివారి అనుభవాలను చెప్పడం జరిగింది. భవిష్య ప్రణాళికలను దింపటానికి వారానాడే ఈ స్థలాన్ని ఎంపిక చేశారేమో! అందుకేనేమో మాస్టర్‌గారు ఇంతశక్తివంతమైన ఆశ్రమాన్ని ఈ క్రింది లక్ష్యాలతో ఇక్కడ స్థాపించారు.

1. భారతీయ సంస్కృతిలో కనిపిస్తున్న వివిధ దేవీ, దేవతల ఉపాసనలో గల అంతరార్థాలను అధ్యయనం చేయడం

2. ఆయా దేవీ, దేవతల ఆభరణాలు, ఆయుధాలు, వాహనాలను ఎందుకు ధరించారు? వాటిలోని ఏఏ లక్షణాలను సాధకుడు సాధించడానికి అవి ఉద్దేశింపబడినవనేది తెలుసుకొని అధ్యయనము చేయుట.

3. దేశంలోని ఏ క్షేత్రం ఏ విధంగా ఆధ్యాత్మికజగత్తులో ముందుకు వెళ్ళటానికి సాధకునకు ఉపకరిస్తుందో అధ్యయనం చేయడం. ఇవంతా ఈ దేవమాత సమాఖ్య ద్వారా జరుగవలసి వున్న కార్యక్రమములు.

**విశ్వమాత సమాఖ్య:** వేదవిజ్ఞానాన్ని, వివిధ దేవీ, దేవతల ఉపాసనల ద్వారా లభించిన శక్తిని ఉపయోగించుకొని ఆధ్యాత్మికత యొక్క వైజ్ఞానికతను సమాజంలోని వ్యక్తివ్యక్తికీ అర్థమయ్యేటట్లు తెలియచెప్పడం, ఇంకా "సకల సమర్ధ సద్గురువాణి విశ్వవిద్యాలయము"ను నడపటం ఈ సమాఖ్య యొక్క ప్రధాన కార్యక్రమములు.

## శ్రీ హంస రామ ఆశ్రమము అంటే ఏమిటి ?

ఈ ఆశ్రమము ద్వారా శ్రీ (శ్రీవిద్య), హంస (గాయత్రీ విద్య), రామ (అగ్నివిద్య)లను తిరిగి ప్రపంచానికి అందించే ప్రయత్నం ఇక్కడి నుండే మాస్టర్‌గారు ప్రారంభించారు. ఈ ఆశ్రమములో కొంతభాగం అన్నపూర్ణాలయానికి కేటాయించారు. సాధకుల అన్నమయకోశ జాగరణకు అన్నపూర్ణాలయం ఏర్పాటు చేయబడింది. సాధకులు వచ్చి సాధన చేసుకునేందుకు అవసరమైన కనీస వసతులు ఆనాడు ఇక్కడ ఏర్పాటు చేశారు. ఇప్పుడు మన కార్యకర్తలు ఆ ఆశ్రమాన్ని ఎంతో అందంగా, రమణీయంగా తయారు చేశారు.

## స్మర్తుగామీ సిద్ధ క్షేత్రం

శ్రీ హంసరామ ఆశ్రమానికి ఆగ్నేయ దిశలో స్థాపించబడిన ఈ స్మర్తుగామీ సిద్ధ క్షేత్రంలో 'శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ సొరకాయలస్వామి, శ్రీ శిరిడిసాయిబాబా'లను ప్రతిష్ఠించి తత్సంబంధమైన అర్చన, ఆరతులు నిత్యమూ జరిగే విధానాన్ని మాస్టర్‌గారు ఏర్పాటు చేశారు. అలాగే ఈ మందిరానికి అనుబంధంగా అఖండధునిని కూడా స్థాపించారు. ప్రపంచ మానవాళి యొక్క భౌతిక, ఆర్థిక, శారీరిక, మానసిక సమస్యల నివారణకు ఈ సిద్ధక్షేత్రమెప్పుడూ సిద్ధంగానే వుంటుంది. **తాను కొని తెచ్చుకున్న సమస్యలతో సతమతమౌతూ, భగవంతుని ఉనికినే విశ్వసించలేకపోతున్న విశ్వ మానవునికి, ఆధ్యాత్మికశక్తి ద్వారా తరుణోపాయం చూపించి, అతడిని దైవోన్ముఖుణ్ణి చేయటమే** స్మర్తుగామీ సిద్ధక్షేత్రము యొక్క **ప్రధాన ఉద్దేశ్యము.** ఈ క్షేత్ర వైశిష్ట్యాన్ని గురించి మాస్టర్‌గారు, "గురువుల నుండి గాని, భగవంతుడి నుండి గానీ ఏమీ ఆశించని వారు మాత్రమే నా దగ్గరకు రండి. అలా అని మిమ్మల్ని బాధలలో వుండిపొమ్మని నేను చెప్పడం లేదు. అలాంటి సమస్యలకు అతి పెద్ద నివారణోపాయాన్ని మీకు ఇచ్చాను. అదే స్మర్తుగామీ సిద్ధ క్షేత్రం. ముగ్గురు మహనీయులు వేంకయ్యస్వామి, సొరకాయలస్వామి, శిరిడీ సాయిబాబాలను తీసుకువచ్చి ఇక్కడ పెట్టాను. మీ సమస్యలను తీరుస్తామని వాళ్ళ దగ్గర మాట తీసుకున్నాను. స్మర్తుగామిలో మీరే కోర్కెనా కోరుకోండి. కానీ అది ఇతరులను బాధించేదిగా వుండకూడదు. అలాంటి కోరికలు తీరిపోతాయి. మనిషి యొక్క కష్టనివారణకొరకు మణిపూరకచక్రం వద్ద (అగ్నితత్త్వం-ధుని) - చిత్రరూపంలో వున్న జంతు సంస్కారాలను నాశనం చేసి, మనిషికి ఉండవలసిన దేవసంస్కారాలను నాటేలా చేయడం ఈ స్మర్తుగామీ సిద్ధక్షేత్రము ద్వారా చేయబడుతోంది. మీకు కావలసిన కోరికను స్మర్తుగామీలో చెప్పుకుని మూడు రోజులపాటు ద్రవాహారం మాత్రమే తీసుకుంటూ మీకిష్టమైన గురుచరిత్ర పారాయణ మూడురోజులలో పూర్తి చెయ్యాలి. నాల్గవరోజున మీ కోరికను కాయితం మీద వ్రాసుకొని ధునికి 11 ప్రదక్షిణలు చేసి ఈ కాయితంతో పాటు కొబ్బరికాయను ధునిలో వేస్తే చాలు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వసమర్థుడు అయిన గురుసత్తా తప్పక మీ సమస్యను తీరుస్తుంది. తర్వాత దీక్ష విరమణ చెయ్యాలి. ఈ నియమాలను ఖచ్చితంగా పాటిస్తే ఫలితాలు ఖచ్చితంగా వుంటాయి. ఇది అక్షరాలా అనేక మంది జీవితాలలో జరిగింది. పిల్లలు లేనివారికి పిల్లలు పుట్టారు. అనేక మంది యొక్క ఆర్థిక, అనారోగ్య సమస్యలు ఇలా సాధన చేయటం వలన తీరిపోయాయి.

## నాకు భగవంతుడు కావాలి

శ్రీ హంస రామ ఆశ్రమానికి నాకు భగవంతుడు తప్ప మరేదీ అక్కర లేదు అనే వాళ్ళు, వారివారి కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ నెలకో మూడురోజులపాటు వచ్చి మౌనంలో వుంటూ నేను చెప్పే సాధనలు చేస్తూ అంతర్ముఖులై జీవిత లక్ష్యాన్ని సాధించటానికి వస్తే, వారికి తగిన ఉపాయం ఇక్కడ ఏర్పాటు చేయబడి వున్నది. కనుక అవి నేర్చుకోవాలనుకునే సాధకులు మాత్రమే ఇక్కడికి రావాలని చాలా స్పష్టంగా చెప్పారు.

## సకల సమర్థ సద్గురు వాణి విశ్వవిద్యాలయము

ఆధ్యాత్మికవిద్యకు కూడా ఒక విశ్వవిద్యాలయం వుండాలని పూజ్యశ్రీ మాస్టర్‌గారు చెప్తుండే వారు. చెప్పడమే కాదు అందులో ఎలాంటి విద్య వుండాలి? దానిని ఎలా నేర్పించాలి అనేదానికి ఒక చక్కటి ప్రణాళికను కూడా రూపొందించారు. ఏవిధంగానైతే మెడికల్ కాలేజీ విద్యార్థి డాక్టరుగా, ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి ఇంజనీర్‌గా తయారై, తనకు విద్య నేర్పించిన లెక్చరర్ ప్రక్కన్నే తను ఒక లెక్చరర్‌గా ఎలా కూర్చోగలుగుతున్నాడో, అదే విధంగా ఆధ్యాత్మిక జగత్తులోకి ప్రవేశించిన వ్యక్తి కూడా తను గురువుల స్థాయికి ఎదిగి సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, సర్వసమర్థతలను పొందగలగాలి. ఆ విధంగా సాధకుని తయారు చేయటానికే సకల సమర్థ సద్గురువాణి విశ్వవిద్యాలయము స్థాపించారు. దానిని మూడు సంవత్సరాల కోర్సులాగా, దానికి తగిన సిలబస్‌ను తయారుచేసి శిక్షణాతరగతులను ప్రారంభించి, తత్సంబంధముగా పరీక్షలు నిర్వహించి సర్టిఫికేట్లను ఇవ్వటం కూడా చేశారు. ఈ ప్రక్రియ రెండువేల సంవత్సరం వరకు పద్ధతిగా జరిగింది.

## యోగ విద్యలో నిష్ణాతులు కావడం ఎలా?

1. 24గంటలు శ్వాసమీద ధ్యానమునుంచండి.

2. అపానముద్ర అంటే బొటనవేలు, మధ్యవేలు, ఉంగరపువ్రేలు కలిపి 15నిమిషాలపాటు ఉంచుకోవాలి.

3. సింప్లిఫైడ్ కుండలినీ ముద్ర అంటే ప్రాణముద్ర. అనగా బొటనవ్రేలు, చిటికినవ్రేలు, ఉంగరపు వ్రేలు కలిపి 15నిమిషాల పాటు ఉంచుకోవాలి.

4. ప్రాణముద్రలో కూర్చుని శరీరంలో శ్వాసను గమనిస్తున్నప్పుడు ఆ శక్తి ఐదు ఇంద్రియాలను ఉత్తేజ పరుస్తుంది. దాంతో ఎప్పుడూ ఉత్సాహంగా పనిచేసుకోటానికి వీలౌతుంది.

5. "Nature is always right" అనే నియమాన్ని జీవితంలో ప్రతిక్షణం పాటించండి. అది పాటించేవాళ్ళకు ఈ ముద్రలు అద్భుతంగా పనిచేస్తాయి.

6. మీ జీవితాలను ప్రకృతికి ఇచ్చేస్తే ఆ ప్రకృతే మిమ్మల్ని నడిపిస్తుంది. సాధారణంగా అనుకునేదేమిటంటే నేను ఇంత సాధనలు చేస్తున్నానుగదా, ఈ కష్టాలు నాకెందుకు వచ్చాయని మీరడగవచ్చు. కష్టాలనేవి మీ పూర్వజన్మ కర్మఫలాలు. అవి మారవు. కానీ సుకర్మల ద్వారా వాటిని మార్చుకోవచ్చు. ఎప్పుడు? ప్రకృతికి అనుగుణంగా మీరు నడిస్తే, ప్రకృతే మీ పరిస్థితులను మారుస్తుంది. అది ప్రకృతి సహజగుణం. నేను చెప్పిన ఈ సాధనలను చేస్తే, నిజంగా మీరు కష్టాలను వదిలెయ్యాలనుకుంటే ఆ కష్టాలు వాటంతటవే పారిపోతాయి. ఆ కాలమానంలో (టైం పీరియడ్) ఖచ్చితంగా అవి వెళ్ళిపోతాయి. చేసి చూడండి. జరిగే దానిని జరగనివ్వండి మీరు ద్రష్టగా వుండి చూస్తూవుండండి. ఈ నియమాన్ని పాటిస్తూ నేను చెప్పిన ఈ ముద్రలు రోజూ ప్రాక్టీస్ చేస్తూ వుంటే మీ ప్రాణ, అపానాలు ఎలా కదులుతాయో మీకే తెలుస్తుంది.

7. ఈ సాధనలు చేస్తున్నప్పుడు "Nature is always right" అనే భావన తీవ్రంగా వుండాలి. అప్పుడది అద్భుతంగా పని చేస్తుంది. ఈ మానసిక స్థితి లేని వాళ్ళకు ఆ ముద్రలు అంత త్వరగా పని చెయ్యవు. పరీక్షలు వ్రాసే సమయంలో పిల్లలు బాగా నీరసంగా వుంటారు. వాళ్ళకు ఈ ట్రిక్ నేర్పండి. ఫలితం అద్భుతంగా వుంటుంది.

## నిజమైన ఆధ్యాత్మికత

**నిజమైన ఆధ్యాత్మికతను గురించి మాస్టారు కొన్ని చక్కటి నిర్వచనాలను అప్పుడప్పుడు ఇలా చెప్పేవారు. 1. ఎప్పుడు, ఎక్కడ నీవు ఉన్నావో అక్కడ ఆ నిమిషం వరకు నీ బాధ్యతను పరిపూర్ణంగా అంటే 'అప్ టు ది మార్క్ ' చెయ్యాలి. 2. కుటుంబం పట్ల, పిల్లల పట్ల వారి చదువుల పట్ల, ఉద్యోగం పట్ల, వృత్తి ధర్మాల పట్ల నీ బాధ్యతను మనస్ఫూర్తిగా నిర్వహించాలి. ఆదర్శవంతంగా మీరు జీవిస్తూ పిల్లలకది నేర్పించాలి. చిన్నతనంలోనే వారికా శిక్షణనివ్వాలి. 3. బాధ్యత అనే దానికి గీత గీసుకోండి. మీ బాధ్యతగా అక్కడ ఎంత వరకు చెయ్యాలో అంతవరకే చెయ్యండి. ఏ పని చేసినా ఫలితం కోసం ఎదురుచూడవద్దు. ఎలాంటి పరిస్థితులలో కానీ ఆదుర్దా**

పడవద్దు, ఆవేశపడవద్దు. ఏ విషయం గురించి కానీ ముందుగా "ప్రీ కన్సీవ్డు నోషన్సు' (ఒక విషయం గురించి ముందుగా ఏర్పరుచుకునే ఒక అభిప్రాయం) పెట్టుకోవటం వద్దు. ఎప్పుడేది జరిగినా దానిని స్వీకరించండి. ఆచరించవలసిన వాటిని ఆచరించండి అదే నిజమైన ఆధ్యాత్మికత అని చెప్పేవారు. పాటించి చూస్తేనేకదా వాటి లాభాలు అర్థమయ్యేది.

## యజ్ఞప్రక్రియ - సైంటిఫిక్ వివరణ

1998వ సంవత్సరం దేవీ నవరాత్రులలో సప్తర్షి ఆశ్రమ ప్రాంగణంలో యజ్ఞం చేయిస్తున్నప్పుడు యజ్ఞం గురించి మాస్టర్‌గారిచ్చిన వైజ్ఞానిక వివరణ. వైజ్ఞానికపరంగా ఇచ్చిన ఆ వివరణ నిజంగా ఎంతో అద్భుతంగా, ఆచరణ యోగ్యమైనదిగా ఉన్నది. అతి ముఖ్యమైన ప్రక్రియలను మాత్రమే ఇక్కడ ఇస్తున్నాము.

**న్యాసము:** న్యాసములో నీటిని వాడుతాం. నీరు అనేది నారాయణ తత్వానికి ప్రతీక. అది సంపూర్ణ సృష్టికి మూలం. సృజనాత్మక శక్తికి ఆధారభూతమైన ఆ నీటిని చేతిలోకి తీసుకొని గాయత్రీమంత్రంతో దానికి శక్తినిచ్చి శరీరంలోని భాగాలను స్పృశిస్తాము. ముందుగా

**1. నోరు:** ఇతరులకు లేదా నాకు పనికి వచ్చే మంచి మాటలను మాత్రమే మాట్లాడటానికి నా రెండు పెదాలను ఉపయోగిస్తాననే సంకల్పంతో– 'వాఙ్మే ఆస్యేస్తు' అంటూ పెదాలను స్పృశించాలి.

**2. నాశిక–పృథ్వీతత్వం:** వాసనలు. మంచి వాసనలను మాత్రమే గ్రహిస్తాను. అంటే మంచి సంస్కారాలను ప్రోది చేసుకుంటాను అనేది దీని అంతరార్థం. దీనిని ఎవరు బాగా న్యాసము చేసుకోగలుగుతారో వాళ్ళు 'సన్యాసులు'. ఇందులో ముఖ్యంగా పట్టుకోవలసిన విషయం, మన దగ్గరకొచ్చిన వారిలో గల మంచి సంస్కారాలను గ్రహించి వారితో చక్కటి అనుబంధాలను పెంపొందించుకోవటం నేర్చుకోవాలి.

**3. కన్ను–అగ్నితత్వం:** ప్రకృతిలోని ప్రతి వస్తువులోనూ మంచినే చూస్తాననే సంకల్పం. ఉదాహరణకు గులాబీని మాత్రమే చూస్తాను. ముల్లును చూడను. అలాగే నా చేతులను, కాళ్ళను ఎల్లప్పుడు సత్కార్యములను చేసేందుకు వినియోగిస్తాను.

**4. పృథ్వీ పూజనం:** ఫౌండేషన్ ఎంత గట్టిగా వుంటే భవనం అంత దృఢంగా వుంటుంది. మన సంకల్పాలు హృదయంలోకి చొచ్చుకొనిపోవాలి. శీతలత్వాన్ని, శాంతిని మూలాధారం నుండి

ఆజ్ఞా చక్రం వరకు తీసుకు రావాలి. ఆజ్ఞాచక్ర జాగరణకు ప్రతిరోజూ రెండు, మూడు నిమిషాల పాటు దానిని కదపాలి. అదో అద్భుతమైన ప్రక్రియ. 'చందనస్య మహత్పుణ్యం' అనే శ్లోకం చెప్తూ కుంకుమను లేదా చందనాన్ని ఆజ్ఞాచక్రంలో పెట్టుకుంటే అక్కడ ఒకరకమైన నాడీ స్పందన జరిగి 'ఆజ్ఞాచక్రజాగరణ' జరిగే అవకాశం వున్నది. ఏ విషయాన్నయినా గుర్తు పెట్టుకోవాలను కున్నప్పుడు ప్రతి రోజూ ఉంగరపు వేలుతో ఆజ్ఞ దగ్గర 15 నిమిషాల పాటు అలా సున్నితంగా కదుపుతూవుంటే జ్ఞాపకశక్తి చాలా బాగా పెరుగుతుంది.

**రక్షా విధానం:** యజ్ఞంలో మూడు రంగుల దారాలను-రక్షాసూత్రం అని మణికట్టు దగ్గర కట్టుకుంటారు గదా. మణికట్టు దగ్గర వాత, పిత్త, కఫ తత్వాలు వుంటాయి. వీటిని స్పృశించే వైద్యులు రోగ నిర్ధారణ చేస్తారు. అదే విధంగా ఏ పూజలు కానీ, వ్రతాలు కానీ చేసేటప్పుడు ఈ రక్షాసూత్రాన్ని ఎందుకు కట్టుకుంటున్నామో తెలుసుకొని చేస్తే ఆ వ్రతం విజయవంతమౌతుంది.

**వరుణావాహన:** మాలిన్యాలను సూక్ష్మీకరణ చేసి, వాటిని పవిత్రం చేసి తిరిగి మన కందిస్తుంది. ఇక్కడ ఒక ఇచ్చి, పుచ్చుకునే అనుబంధాన్ని గమనించాలి. ఎలాగంటే సముద్ర జలాలు ఎండకు వేడెక్కి పైకి వెళ్ళి వర్షరూపంలో శుద్ధజలంగా మారి, తిరిగి భూమ్మీదకు దిగుతాయి. ఛత్రపతి శివాజీ తాను గెలిచిన యావత్ సామ్రాజ్యాన్ని తన గురువైన శ్రీసమర్థరామదాసుగారికివ్వగా, వారు తిరిగి దానిని శివాజీకిచ్చి తన ప్రతినిధిగా పరిపాలన చెయ్యమని ఆదేశిస్తాడు. అలా మనమూ మనలో వున్న మాలిన్యాలను తొలగించుకుని, మన కుటుంబాలకు కేవలం ట్రస్టీలుగా ఉంటూ నిమిత్తమాత్రంగా కర్తవ్యాన్ని బాధ్యతతో, నిర్వర్తిస్తాము అనే దీక్షను ఇక్కడ తీసుకోవాలి. సాధారణంగా యజ్ఞంలో మనం వనరులనన్నింటిని యజ్ఞభగవానునికి సమర్పించి తిరిగి మనమే వాటిని ప్రసాద రూపంలో స్వీకరిస్తుంటాము. అప్పుడు వరుణదేవుడు తన శక్తిని పర్జన్యవర్షరూపంలో అంతటా కురిపిస్తాడు. సకల దేవతాశక్తి అంతర్గతంగా మన శరీరంలోనే వున్నది.

**దీపం:** దీప పూజనంలో జ్యోతిని వెలిగిస్తాం. వరుణదేవుని శక్తికి, సూర్యకిరణాల స్పర్శ తగలగానే ఆ వేడి మనలో ఉన్న మాలిన్యాలను పోగొట్టేస్తుంది. ఇక్కడ అగ్ని, సూర్యుడు, జ్యోతి ఈ మూడూ మనలోని మాలిన్యాలను పోగొట్టేస్తాయి. అప్పుడు ఆ 'అఖండమండలాకారం' అంటే గురువు యొక్క రూపం మనలో చైతన్యాన్ని తెస్తుంది. ఆ గురుశక్తి, దేవతాశక్తులతో మనకు "లింక్" ఏర్పరుస్తుంది.

**నమస్కారం:** నా పంచకర్మేంద్రియాలను, పంచజ్ఞానేంద్రియాలను మనో, బుద్ధి, చిత్త, అహంకారాలను నీకిస్తున్నాను గురుదేవా ! నాకు, వాటిని తిరిగి మంచిగా ప్రసాదించు గురుదేవా! అని ఆర్తితో అడగటం నేర్చుకోవాలి. కర్మకాండలో ఈ భావన ప్రధానం.

**స్వస్తివాచనం:** సాధారణంగా నీరు, పల్లం వైపుకు ప్రవహిస్తుంది. నీటికి బీజాలను అంకురింప చేసే గుణం వున్నది. అలాగే మనమూ మనకు తెలిసిన మంచి విషయాలనే బీజాలను మన వాళ్ళందరికీ తెలియచెయ్యాలి. నిరంతరం ఎవరికి ఏ అవసరం వస్తే నీకు వీలైనంత సహాయం, ఎలా చెయ్యగలవో అలా సహాయపడు. అలాంటి భావనతో నీరు, అక్షతలు, పూలు కుడిచేతిలోకి తీసుకొని మంత్రం చెప్పాలి.

**పూలు:** పూలలో వున్న సువాసన దాగదు. వచ్చిన వాడు మంచి వాడా, చెడ్డవాడా, ఎక్కడి నుండి వచ్చాడు అనేదేమీ ఆలోచించకుండానే, ఆ సువాసన అందరికీ అలా వెళ్ళిపోతుంది. ఆ పూలమాదిరి మనమూ మంచి సంస్కారాలను అందరికీ అందచెయ్యాలి.

**అక్షతలు:** మీ వనరులు, వస్తువులు, ధనము, కాలము, మీ చేతలు, ఆచరణలు మొదలైన వాటిని ఎక్కడ అవసరమైతే అక్కడ ఇవ్వండి. ఎక్కడైనా సరే, ఒక యజ్ఞంగానీ, ఫంక్షన్ గానీ బాగా జరగాలి అనుకుంటే, "పూర్వే రక్షతువారాహః ఆగ్నేయాం గరుడధ్వజః, దక్షిణే పద్మనాభస్తు, నైఋత్యాం మదుసూదన, పశ్చిమేచైవ గోవిందో, వాయవ్యాంతు జనార్దన, ఉత్తరే శ్రీపతీరక్షేత ఈశాన్యాం .." ఈ మంత్రం చదువుకొని పని మొదలుపెడితే, ఏ విధమైన అవరోధాలు లేకుండా పని జరుగుతుంది. రక్షావిధానంలో దేవతలను ఆహ్వానించాలి, ఎలాంటి అవరోధాలు లేకుండా మన కార్యక్రమమును జరిపించమని కోరుకోవాలి.

**అగ్నిస్థాపన:** గాయత్రీ మంత్రాన్ని తల్లక్రిందులుగా చదివితే అది ఆగ్నేయాస్త్రమౌతుంది. అగ్ని లాగా మనం మారాలి. మనలో వున్న అగ్నిని, గురువుదేవుల అగ్నితో కలిపితే ఎలా అవుతుందంటే, ఒక మామూలు కట్టెను అగ్నిలో వేస్తే అది ఎలాగైతే అగ్నిలాగా మారుతుందో (అప్పుడు దానిని ఎవ్వరూ ముట్టుకోలేరు.) అలా శిష్యుడూ మారతాడు. ఆ అగ్నిని ఇక్కడకు ఆహ్వానించి, 'నేను ఉదాత్తంగా జీవిస్తాను. గురుదేవుల వేడితో, ఆయన ఆదర్శాలకు తగినట్లు జీవిస్తాను' అనే సంకల్పంతో అగ్నిస్థాపన చెయ్యాలి. ఇక్కడ 'యన్మండలం' 12 శ్లోకములు చదవాలి.

**అగ్ని ప్రదీపనం:** ఇది బుధగ్రహానికి సంబంధించిన మంత్రం. ఆ జ్ఞానాన్ని పొందటానికి నిరంతరం ప్రయత్నం చేస్తాననే సంకల్పం తీసుకోవాలి ఇక్కడ.

**సమిధాదానం:** ఇక్కడ నాలుగు సమిధలు వేస్తారు. ఎందుకు అంటే ఆ నాలుగు సమిధలు నాలుగు వేదాలకు, నాలుగు ఆశ్రమాలకు, చతుర్విధ పురుషార్థాలకు ప్రతీకలు. ఈ ప్రక్రియల పూర్తి అయ్యే లోపు అగ్ని ప్రజ్వలన జరిగి జ్వాలలు ఊపందుకుంటాయి. చల్లబడటానికి నాలుగు దిక్కులలోనూ కందకంలో నీరు పోస్తారు. ఆ నీరు ఆవిరి అయి నాలుగు వైపులా వ్యాపించి వాతావరణం పవిత్రమౌతుంది. సమాన ధర్మంగల మన ఆలోచనలు తిరిగి మనపైనే వర్షిస్తాయి.

**జలప్రసేచనం:** జల ప్రసేచనంలో ప్రధానమైనది గురు అనుగ్రహం. సాధకుడు దానిని పట్టుకోవాలి.

**సప్త ఆహుతులు:** ప్రకృతిలో ఏడురకాల ధర్మాలువుంటాయి. సప్తద్వీపా వసుంధరా అని అంటారు. మన శరీరంలో కూడా ఏడు చక్రాలే వుంటాయి. సూర్యకిరణాలూ ఏడే. గ్రహాలూ ఏడే వుంటాయి. వీటన్నింటితో సమన్వయముగా జీవించటానికి ఇచ్చే ఆహుతులే 'ఈ సప్త ఆహుతులు'. ఈవిధంగా యజ్ఞములో చేసే ప్రతి ఒక్క కర్మకాండలో గల వైజ్ఞానిక దృష్టికోణాన్ని-నిత్యజీవితంలో దానిని ఎలా భావనాత్మకంగా ఆచరించాలనే విధివిధానములను అందంగా వివరించారు.

## దేవీ మాహాత్మ్యము

**దేవీ మాహాత్మ్యము:** సప్తర్షి ఆశ్రమంలో దేవీనవరాత్రులలో దుర్గాసప్తశతి పారాయణ చేయించే ముందు ఆ పారాయణ వైశిష్ట్యాన్ని ఎంతో అందంగా, హృదయానికి హత్తుకునేలా చెప్పారు. ఈ పారాయణ ఎప్పుడు చెయ్యాలి, ఎలా చెయ్యాలి, దాని ఫలితాలు ఎలా వుంటాయనేది వివరించారు. ప్రతినెలా శుక్లపక్ష అష్టమినాడు దుర్గాసప్తశతీ పారాయణ చెయ్యాలి. ప్రకృతిలో నిరంతరం అత్యంత శక్తివంతమైన మూడుశక్తిధారలు మానవజీవితాన్ని ప్రభావితం చేస్తుంటాయి. అఖండమైన ఈ చైతన్యం ప్రకృతిలో మూడు రకాలుగా అంటే హ్రీం, శ్రీం, క్లీం శక్తులుగా, వాటినే బ్రాహ్మీ, వైష్ణవీ, శాంభవీశక్తులుగా చెప్తారు. ఆ శక్తులు మానవ జీవితంలో ఎలా ఓతప్రోతమై వుంటాయనేది ఆనాటి ప్రవచనంలో కొనసాగించారు.

మొదటగా క్లీం అంటే కాళీశక్తి. మానవ జీవితంలో దీని ప్రభావం ఎలా వుంటుందో చెప్పారు. ప్రధమచరితం మహాకాళీ సాధన. ఈ పారాయణ సాధకునిలోని తమోగుణాన్ని పోగొడు తుంది. అజ్ఞానాన్ని పోగొడుతుంది. అననుకూల పరిస్థితులను పోగొట్టి, సమస్యల నుండి బయటపడ వేస్తుంది. దీని తర్వాత శ్రీం అంటే మహాలక్ష్మి ఇది మధ్యమచరితం. మహాలక్ష్మి అనగా వనరులను సమకూర్చే సామర్థ్యం సాధించటం. చాలామంది ఇది మంచిది అని తెలిసి కూడా మంచి పనులు చెయ్యలేరు. మంచిదే కానీ ఇప్పుడెలా కుదురుతుంది, మేము రిటైర్ అయ్యాక చేస్తాం అని అంటుంటారు. నచికేతోపాఖ్యానంలో 'విశ్వవసువు' అనే ఋషి పనికిరాని గోవులను దానం చేస్తాడు. (అలానే మనమూ శరీరంలో శక్తి ఉడిగిపోయాక మంచి పనులు చేస్తాం అని అనుకుంటాం.) ఇది మంచిది అని తెలిశాక దానిని వెంటనే చేసే అలవాటు చేసుకోవాలి. శరీరం బలంగా, ధృఢంగా, ఉత్సాహంగా ఉన్నప్పుడే మంచి పనులు చెయ్యాలి. తరువాత చెయ్యాలన్నా శరీరం అందుకు సహకరించదు.

చివరిగా 'హ్రీం' – మహాసరస్వతి. నికట భవిష్యత్తులో ఏ అడ్డంకి రాబోతోందో, దానిని నేను తొలగిస్తాననే ప్రతిజ్ఞ. ఈ శక్తి నవరాత్రులలో చాలా బాగా పని చేస్తుంది. నవరాత్రులలో పారాయణ పూర్తి అయ్యాక పూర్ణాహుతిలో ఒక్కొక్క చక్రానికి వంద,వంద ఆహుతుల చొప్పున ఏడు చక్రాలకు 700 శ్లోకాలతో ఆహుతులు వేస్తాం.

**ఇందులో అర్గళస్తోత్రం చదవటం వలన బాధ్యతలను గుర్తుంచుకోవటం వస్తుంది. కీలకం చేస్తే సిద్ధపురుషులౌతారు. కవచం మన శరీరంలోని రక్తం, ఎముకలు, మజ్జలకు పరిరక్షణనిస్తుంది. ప్రతి దేవీనవరాత్రులో సప్తర్షి ఆశ్రమంలో తప్పనిసరిగా ఈ కార్యక్రమం ఎంతో ఆనందోత్సాహాలతో చేయించేవారు.** పూజ్యశ్రీ మాస్టర్‌గారికి 'సప్తశతీ పారాయణ' అంటే ప్రాణం. సప్తర్షి ఆశ్రమంలోనే కాకుండా ఈ సాధన అన్ని ఆశ్రమాలలో, అనుగ్రహపీఠాలలో కూడా చేయించేవారు. ఈ నవరాత్రులు దుర్గా ఉపాసనకు అత్యంత కీలకమైన ప్రీతిపాత్రమైన రోజులు. ఈ నవరాత్రి సాధనవలన భౌతిక సమస్యలు నివారించబడటమే కాకుండా, ఆధ్యాత్మిక ఉన్నతికి బహుధా శ్రేష్టమైవిగా శాస్త్రాలలో చెప్పబడివున్నది. అందుచేత ఈ నవరాత్రిసాధనను అందరినీ చెయ్యమని మాస్టర్‌గారు ప్రోత్సహించే వారు.

## అధ్యాయం-14

# సప్తర్షి ఆశ్రమము

శ్రీకృష్ణనిర్యాణానంతరం అనగా ఐదువేల సంవత్సరముల నుండి ఋషులు ఈ విశ్వ పరిణామక్రమానికి, అనేక ప్రణాళికలను గురువుల ద్వారా అందిస్తూ ప్రజలలో ఆధ్యాత్మిక వికాసమును, చేతనత్వంలో మార్పులను తెచ్చారు. అంతేకాక ప్రజలలో ఉన్న అజ్ఞానమును తొలగించి, వేద విజ్ఞానాన్ని పునరుద్ధరణ చేయటానికి తమ జీవితాలనే ఆదర్శంగా చూపించారు. సమయానుసారంగా ఆ సాధనలనందిస్తూ నవయుగ నిర్మాణానికి బీజాలను వేస్తూ 2 వేల సంవత్సరము నాటికి ఈ సాధనా ప్రయోగాల పరాకాష్ఠగా పూర్ణాహుతిని చేశాను అని మాస్టర్‌గారు చెప్పటం జరిగింది.

ఈ విశ్వపరిణామక్రమంలో భాగంగానే పృథ్వి - ఒక ఒడంబడిక ప్రకారం మానవుడు 'ఆత్మతత్వాన్ని' ప్రోది చేసుకొని, దానిని అభివ్యక్తీకరించేందుకు కావలసిన పరిస్థితులను కల్పించి, ఆ కార్యక్రమములో భాగంగా తానొక ప్రయోగశాలగా వ్యవహరించేందుకు సిద్ధపడింది.

ఐతే ఈ విశ్వపరిణామక్రమమును అర్థం చేసుకొని, మహాకాలుని అభీష్టానికి అనుగుణంగా జీవించే జాతి భారతజాతి!! అందుకే అది సమస్త విశ్వానికి 'జగద్గురువు'గా పీఠాన్ని అధిష్ఠించి, వేదసంస్కృతితో తను రత్నగర్భయై సుఖశాంతులను పొందుతూ, ఇతరులకు దానినందింపజేస్తూ అజేయంగా నిలిచింది. కానీ **"సకాలేన మహతా యోగోనష్టః పరన్తప"** అన్న భగవద్గీత ప్రమాణ మాధారంగా కారణాంతరాల వలన ఈ వేదవిద్య లుప్తమైపోయి (అది కూడా ప్రకృతి కోరికకు అనుగుణ్యంగానే) భారతజాతి బానిసగా మారి నిర్వీర్యమైన స్థితిలో ఉంది. కానీ ఈ భూమి వేదభూమి, కర్మభూమి! కనుకనే ఆ సంస్కారాలు మనలో నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఈ శాశ్వత సనాతన నిత్యనూతనమైన సంస్కృతిని అందజేసి, ఈ జాతి నిర్వీర్యమైపోయినా తిరిగి ప్రపంచానికి ఆ జ్ఞానాన్ని అందించవలసిన సమయమాసన్నమైనది. అంతేకాకుండా తిరిగి భారతజాతి - జగద్గురుపీఠంపై అలరారి, భూమిని స్వర్గంగా మార్చడానికి, మానవునిలో దైవత్వాన్ని నింపి, మనిషి చేతనత్వంలో మార్పు తెచ్చే ఆత్మవిద్యను అందించడానికి హిమాలయాలలోని ఋషులు - ఈ సమయంలో గురుమండలి ద్వారా ఆశ్రమాలను స్థాపించి వేదజ్ఞానమును తమ శిష్యులకందిస్తున్నారు.

ఆధ్యాత్మిక జీవితం అసిధారావ్రతంలాంటిదని ఋషులు చెప్తుంటారు కదా! అలాంటప్పుడు ఎక్కడికీ వెళ్ళకుండా, ఎవ్వరి దగ్గర ఏం నేర్చుకోకుండా మేము సాధువులమని ఎవరైనా చెప్పుకుంటే వారినేమనాలి?

అసలు మనిషి పృథ్వీమాత అనుగ్రహంతోనే ఈ భూమ్మీద పుట్టాడు. ఎంతో అద్భుతమైన యుగసంధిలో పుట్టిన మీరు గురువులు చెప్పింది నమ్మితే, చెప్పింది చెయ్యగలిగితే, ఆ సాహసాలన్నీ చూపించగలిగితే రెండువేల సంవత్సరము నాటికి మానవజాతి కలిసి ఉండటానికి త్యాగం చూపించగలిగితే గురువుల ప్రణాళికకు మనం సహకరించినట్లే! ఈ ప్రణాళికను సాకారం చెయ్యటానికి అత్యంత పవిత్రమైన శక్తికేంద్రంగా సప్తర్షిఆశ్రమాన్ని రూపొందించారు మాస్టర్‌గారు.

సప్తర్షి ఆశ్రమ ప్రాంగణంలో మాస్టర్‌గారు ఆవాహన చేసిన అఖండదైవీచేతనత్వం వివిధ రూపాలలో ప్రకటితమైంది. 1996, 1997 సంవత్సరములలో **"నిరంతర గురుసాన్నిధ్య అనుభూతి సాధనాశిబిరం"** జరుగుతున్న సమయంలో ఆప్రాంగణంలో దేవీనవరాత్రులు, చైత్ర నవరాత్రులు, గణేశనవరాత్రులు, గాయత్రీ జయంతి నవరాత్రులు, వసంతపంచమి, తత్సంబంధమైన విశిష్ట సాధనలను వేర్వేరు భూమికలలో నిర్వహించారు.

## మహత్వపూర్ణమైన మార్పులు

దీని వెనుక గల పరమార్థాన్ని గమనించినట్లయితే వ్యక్తిగత సాధనలు, వ్యక్తిగత మహత్వ కాంక్షలు 'మేమంతా ఉచ్ఛస్థాయికి చేరుకోవాలి. ఋషులమైపోవాలి'-అనే కోరికలు కూడా స్వార్థపూరితమైనవే. ఈ సామూహిక సాధనల వల్ల ఆ దిశ మారినదని తెలుసుకోవాలి. వ్యక్తిగత సాధనను వదిలిపెట్టడానికి, దానిని తీసివేయటానికే గ్రూప్ లివింగ్, **అంటే అందరూ కలిసి ఒకే చేతనత్వము యొక్క విభిన్న అంగాలుగా కలిసి బ్రతకగలగడం నేర్చుకోవాలి. ఈ సమూహంలోని అంగాల మధ్య అభివృద్ధి జరగటానికి కావలసింది ప్రేమ-పరస్పర అవగాహన ఆత్మీయతలు అని గుర్తించాలి. దీనికొరకు సంపూర్ణ సృష్టికి ప్రేరణనిచ్చి, బాధ్యతను నేర్పే సూర్యుణ్ణి ఆదర్శంగా తీసుకొనుటకు గాయత్రీమంత్రం సార్వజనీనంగా ఇవ్వబడింది. సద్గురుని ద్వారా దీక్ష అంటే కేవలం మంత్రజపం చేస్తూ కూర్చోవడమే కాకుండా బాధ్యతలను నూటికి నూరుపాళ్ళు సంపూర్ణంగా స్వీకరించగలగటము అని అర్థం. ఇదే వ్యక్తికి నూతన జన్మ. దీనినే ద్విజత్వము అన్నారు.**

దీనినే ఇ.కె. గారు సహజీవనమంటే; శిర్డీసాయి, సత్యసాయిల యొక్క సాయిపరివార్ "సేవాసమితి" కార్యక్రమాలని, శ్రీరామశర్మఆచార్య 'సంజీవనీవిద్య' కార్యక్రమమని అన్నారు. ఇవన్నీ వ్యక్తిగత స్వార్థచింతన మాని ఆధ్యాత్మిక వికాసానికి సోపానాలుగా మారే జీవిత విధానాన్ని అందిస్తున్నాయి.

ఆధ్యాత్మికతలో వచ్చిన మహత్తరమైన మార్పులను గమనించాలి. సామూహికత వల్ల మాత్రమే ఈనాడు ఏ పనులనైనా సాధించవచ్చు. అనేక కార్మిక సంఘాల సంఘటనలు దీన్ని నిరూపిస్తున్నాయి. అందువల్ల.

❖ వసుధైకటుంబకం అంటే ఈ మొత్తం ప్రపంచమంతా ఒకే కుటుంబం

❖ దీన్ని సాధించటానికి ఒకే తరహా జీవితవిధానం (ఒకే ధర్మం)

❖ ఈ విషయమును చెప్పటానికి కావలసినభాష (ఒకే భాష)

❖ వీటిని విశ్వవ్యాప్తంగా అందరికీ అందించటానికి, మీకు అభిరుచి ఉంటే ఎక్కడున్న వాళ్ళు అక్కడే ఉంటూ ఈ సందేశాన్ని కోట్లాదిమంది వ్యక్తులకు అందజేయాలి.

ఈ మహత్తరమైన జ్ఞానాన్ని అందించటానికే మాస్టారు ఆస్ట్రాలజీ, ఎక్స్టర్నలైజేషన్ ఆఫ్ హైయరార్కీ, ఫైనాన్స్, ఆరోగ్యము, విద్య, యజ్ఞాలు, సాంస్కృతిక వ్యవహారాలు, చిన్నతరహా పరిశ్రమలు, పర్యావరణపరిరక్షణ, వేదాలు, విశ్వధర్మస్థాపన అనే విషయాలపై మనస్సుకు హత్తుకుని ఆచరించే విధంగా అద్భుతమైన ప్రవచనాలను ఈ ఆశ్రమ ప్రాంగణంలో అందించారు.

వీటితో పాటు మాస్టర్‌గారు థియోసాఫికల్‌సొసైటీలలో సీక్రెట్ డాక్ట్రిన్ మరియు ది వాయిస్ ఆఫ్ సైలెన్స్ అనే బ్లావెట్స్కీమాత పుస్తకాలపైన ప్రవచనాలిస్తూ సాధనాపరమైన చైతన్యం తీసుకు వచ్చారు. అరవిందోసొసైటీ వాళ్ళ కోరిక మేరకు లైఫ్ డివైన్, సావిత్రి మొదలగు పుస్తకాల మీద ఉపన్యాసాలిచ్చారు. అలాగే రమణమహర్షి, జిల్లెళ్ళమూడి అమ్మ, సత్యసాయి, శిరిడీసాయి మొదలగు సంస్థలవారితో ఆత్మీయతాభావంతో మెలుగుతూ, వారి కోరిక మేరకు ఆయా సంస్థలలో వాటికి సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని పూలు విచ్చుకుంటే వచ్చే పరమాహ్లాద సౌరభాల మాదిరి వాళ్ళకు బోధించేవారు.

## జగజ్జనని మహాయోగేశ్వరీదేవి సహిత ఏకైక అఖండగురుసత్తా ఆలయం

1998 దేవీనవరాత్రులలో పూజ్యశ్రీ మాస్టర్‌గారికి జగజ్జనని శ్రీమహాయోగేశ్వరీదేవి దర్శనం అయింది. శ్రీకృష్ణ సహోదరియైన ఆ తల్లి, ఆయన కార్యప్రణాళికకు కావలసిన శక్తిని, వనరులను, సహకారమును అందించిన ఆ యోగమాయను పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారు నూతనయుగ ఆవిష్కరణకు 1998 దేవీనవరాత్రులలో "జగజ్జనని శ్రీమహాయోగేశ్వరీదేవి"గా సప్తముఖాలు, 14 చేతులు గలిగి, పృథ్వి వాహనముగా ధరించినట్లుగా దర్శించారు. ఆ జగన్మాతశక్తిని లోకానికందించారు. ఆమె రూపాన్ని గురించి చెప్పాలంటే సూర్యుని యొక్క 7 కిరణాలకు ప్రతీకలుగా సప్తముఖాలు, ప్రచండమైన ఆ జ్ఞానాన్ని 14 భువనాలకి అందించటానికి 14 రకాల ఆయుధాలను ధరించి 14 చేతులతో, పృథ్వి వాహనంగా దర్శనమిచ్చింది. నిరంతరం వర్షిస్తున్న గురు అనుగ్రహాన్ని సాధకుడు స్వీకరించ డానికి ఈ దివ్యశక్తిని అనుగ్రహమాలామంత్ర రూపములో మానవజాతికి అందించారు. ఈ అనుగ్రహమాలామంత్రాన్ని "శ్రీహంసరామాశ్రమం"లో దేవీనవరాత్రులలో అష్టమినాటి రాత్రి 12.00 గంటలకు అందరికీ ప్రసాదించారు.

### ఏకైక అఖండ గురుసత్తా

శ్రీకృష్ణ నిర్యాణానంతరం దేశ, కాల పరిస్థితులకు అనువైన రీతిలో మానవజాతికి నిత్య నూతనము, శాశ్వతము, సనాతనము అయిన సత్యాన్ని వివిధ సాధనల ద్వారా అందిస్తున్న పరమ గురువులందరికీ ప్రేరణ మరియు మార్గదర్శనము చేస్తున్నది సాక్షాత్ ఆ శ్రీకృష్ణచేతనత్వమే! దానినే మాస్టర్‌గారు "ఏకైక అఖండ గురుసత్తా" అన్నారు. ఈ చేతనత్వపు క్రియాకలాపాల వల్ల మళ్ళీ "భారతదేశం జగద్గురుపీఠాన్ని" అధిరోహిస్తుంది. ఈ శక్తి ప్రభావంవల్లనే ఋషులు, పరమ గురువులు కోరుకుంటున్న "ఒకే విశ్వం, ఒకే ధర్మం, ఒకే భాష" సమీప భవిష్యత్తులో సుప్రతిష్ఠితం కాబోతోంది.

"నవయుగావతరణ"కు చేయవలసిన బహుముఖీ కార్యక్రమాల నిర్వహణార్థం మాస్టర్‌గారు "సప్తర్షి" ఆశ్రమాన్ని నిర్మించాలని సంకల్పించారు. దానికోసమే మాస్టర్‌గారుంటున్న ఇంటి ప్రక్కన గల స్థలాన్ని మొత్తాన్ని కొనుగోలు చేయటం జరిగింది. దీనికి పరివార్ సభ్యులందరూ ఏకనిష్ఠతో యథాశక్తితో తమ అంశదానాన్ని మరియు సమయ, ప్రతిభాదానాలను గురుచరణాలకు సమర్పించారు.

ఆశ్రమ నిర్మాణం ప్రారంభమైంది. మాస్టర్‌గారిస్తున్న సూచనల మేరకు పూర్తి సమయాన్నిచ్చి పనిచేసే సమర్పిత సాధకులు కొందరు ఈ ఆశ్రమ నిర్మాణ బాధ్యతను స్వీకరించి రాత్రి పగలు

నిద్రాహారాలు మాని కట్టడాల పనిని పూర్తి చేశారు. సంపూర్ణ సమర్పణతో మాస్టర్‌గారి మాట వేదవాక్కుగా పాటించి శ్రీ జి.మణికుమార్, శ్రీ శివరామకృష్ణగారు, శ్రీరంగనాయకులుగారు నిర్మాణ కార్యక్రమాలను చేపట్టారు. మాస్టర్‌గారి పనులను బాధ్యతాయుతంగానే కాకుండా అత్యంత భక్తి, శ్రద్ధలతో చేసే పార్వతీ, సావిత్రి వాళ్ళు పూర్తి సమయాన్నిచ్చి గురుసేవ చేశారు. సావిత్రి మాత్రం రాత్రి పగలు అనక మాస్టర్‌గారి ఇంటి పనులే కాక, ఆశ్రమానికి ఎప్పుడేది అవసరమైనా దానిని వెంటనే సమకూర్చిపెట్టేది. అలా అందరూ అలుపు, సొలుపు లేకుండా అన్ని పనులు చేసేవాళ్ళు. శ్రీమణికుమార్, శ్రీనివాసరెడ్డి, సదానంద వీళ్ళంతా మాస్టర్‌గారి ప్రవచనాలను టేపులో రికార్డ్ చేసి కొరియర్ ద్వారా అందరికీ అందచేసేవాళ్ళు. వీళ్ళేకాక ఇంకా అనేకమంది ఈ నిర్మాణకార్యంలో సేవ చేశారు. సప్తర్షి ఆశ్రమ ప్రాంగణంలో వివిధ ప్రయోజనాల కొరకు తత్సంబంధమైన నిర్మాణాలను చేయటం జరిగింది. మాస్టర్‌గారి పనులేకాదు, ఆశ్రమానికి వచ్చిన సాధకులకు సైతం అన్ని సదుపాయాలను ఏమరుపాటు లేకుండా చేసేవారు. వీళ్ళ గురించి ఎంత చెప్పినా తక్కువే. అంత నిష్కల్మషంగా గురుసేవ చేశారు కాబట్టే వారి జీవితాలలో గురుఅనుగ్రహ సౌభాగ్యసూర్యోదయం శాంతి సౌఖ్యాల రూపంలో అనంతంగా వెల్లివిరిసింది.

## యాజ్ఞవల్క్య నవకుండీయ యజ్ఞమంటపం

ఈ మంటపంలో ఉదయం 9.30 గంటలకు గాయత్రీయజ్ఞం చేయబడేది. కోర్కెలను తీర్చుకోవటానికి - జీవితంలో శాంతి, సుఖము, సమృద్ధి పొందేందుకు వివిధ రకాల యజ్ఞాల నిక్కడ నిర్వహించటం జరిగింది. వివిధ ఆకృతులతో నిర్మించబడిన యజ్ఞకుండాలు వివిధ ప్రయోజ నాలకై ఉపయోగించబడుతుండేవి. నిరంతరం "అగ్నిసూక్తం" - వేదమంత్రఘోషతో ఆశ్రమం ప్రతిధ్వనించేది, సాధకుల విధినిర్వహణలో కళకళ్ళాడుతుండేది.

## గురునిలయం

నూతన మానవజాతి ఆవిర్భావానికవసరమైన వాతావరణాన్ని నిర్మించటానికి ఈ గురు నిలయంలో పారాయణాలు, అనుష్ఠానాలు జరుగుతూవుండేవి. విశ్వసంచాలనాశక్తి ఐన "ఓంకార చేతనత్వంతో" సాధకుడి చేతనత్వం ఏకీకృతమై అందులో లీనమై అందుండి అనంతమైన శాంతిని, తద్వారా జ్ఞానమును, అందుండి క్రియాశీలత పొందవచ్చునే విశేషమైన సాధన 'సమర్థ సద్గురుస్పర్శ ధ్యానం!'. దానిని మానవజాతికి ఒక వరంగా ప్రసాదించారు మన ఆరాధ్యదైవం. ఈ గురు

నిలయంలో ఈ ధ్యానాన్ని సాధకులు సూర్యోదయ, సూర్యాస్తమాన సమయాలలో నిష్ఠగా చేసేవారు. సాధకులు, స్వాధ్యాయం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో మాస్టర్‌గారు తమ లైబ్రరీ పుస్తకాలను ఈ గురునిలయంలోకి తరలించి అందరూ చదువుకోటానికి చక్కటి వీలును కల్పించారు.

## గౌతమ సంస్కార మంటపం

ఉపనిషత్ జ్ఞానం ప్రకారం మనిషిలోని జన్మాంతర కుసంస్కారాలను పోగొట్టి, సుసంస్కారాలను బీజారోపణ చేయటం, షోడశకళలకు అనుగుణంగా వ్యక్తి చేతనత్వంలో రావలసిన మార్పులను 16 సంస్కారాలను చేయటం ద్వారా తీసుకురావటానికి తగిన ఏర్పాట్లు ఈ మంటపంలో చేయబడ్డాయి.

## పంచలింగాల ధుని

వ్యక్తులను ప్రక్షాళన చేసి పునీతులను చేసి ఆత్మజ్ఞానాన్ని పొందేందుకై విశిష్ట లింగాకారంలో నిర్మించబడిన ఈ ధునిని 18.11.1999వ సంవత్సరమున ప్రారంభించారు. ఈ అగ్నిని శిరిడీ నుండి ఒంగోలుకు అశ్వమేధయాత్ర ప్రథమచరణంగా పూజశ్రీ భరద్వాజగారు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అశ్వమేధయాత్రలో రెండవ చరణంగా ఒంగోలు బాబామందిరం నుండి శ్రీరంగనాథ్ ప్రసాద్‌గారు అనేక వాహనాలను అన్ని గ్రామాల నుండి కలుపుకుంటూ ఊరేగింపుగా ఆ అగ్నిని గుంటూరు ఆశ్రమానికి తీసుకువచ్చారు. శ్రీమతి లక్ష్మీరాజగోపాలుతో పాటు మరి కొంతమంది కార్యకర్తలు ఆ అగ్నిని గుంటూరు వరకు సంరక్షిస్తూవచ్చారు. గుంటూరులో వేలాదిమంది భక్తుల సమక్షంలో ఈ అగ్నిని మాస్టర్‌గారు ధునిలో స్థాపించి, దానికి సాధనగా ప్రతి నిత్యం ఇక్కడ ప్రదక్షిణలు చేస్తూ అగ్నిసూక్తం చదవాలని నిర్దేశించారు. ఈ విశేషమైన సాధనను ఆశ్రమానికి వచ్చిన వాళ్ళందరూ తప్పనిసరిగా పాటించే సాంప్రదాయాన్ని సుస్థిరంగా ఏర్పాటు చేశారు.

## మహాకాలచక్రవర్తి యంత్రము

గురువుల ప్రణాళికను సాకారం చెయ్యటానికి కావలసిన శక్తిని ప్రోదిచెయ్యటానికి ఈ అద్భుతమైన యంత్రం స్థాపించబడినది. దీనికి సంబంధించిన పూజా విధానం రూపొందించి నిత్యం ఆ పద్ధతిలో పూజ జరిగేటట్టు చేశారు. గురుపాదుకాస్తవంతోనూ మరియు ఖడ్గమాలతోనూ యధావిధిగా అర్చన, పూజ జరిగేది.

## సప్తర్షి వేదవిశ్వవిద్యాలయం

రాబోయే నూతన యుగంలో వైదికవిద్యను పునఃప్రతిష్ఠించటానికి కావలసిన వేదవిహితమైన కర్మకాండలకు సంబంధించిన మంత్రములను నేర్పించటం, ఆర్షవిజ్ఞానాన్ని అందించే వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, ఇవే కాకుండా జ్యోతిర్విద్య, ఆయుర్వేదము, హోమియో, వాస్తు మొదలైన విషయాలపై సమగ్ర బోధన, సూర్యకిరణవిజ్ఞానం, గాయత్రీమహావిజ్ఞానం, కుండలినీమహావిజ్ఞానం, ఐశ్వర్యము యొక్క మానసిక స్థితి మొదలైన విషయాలను, వాటి అంతరార్థాలను బోధించడం జరిగింది.

సప్తర్షి వేదవిశ్వవిద్యాలయం, గుంటూరులో - యజ్ఞవిద్య, సూర్యవిజ్ఞానం, సంస్కారాలు, పతంజలి యోగసూత్రాలు, భగవద్గీతల గురించి చెప్తూ దత్తప్రదక్షిణలు, సూర్యనమస్కారాలు చేయించేవారు. వీటితో పాటు పురుషసూక్తం, శ్రీసూక్తం కంఠస్థం చేయించారు. వీటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వటం మొదలగు విషయాలను శ్రీధారా సత్యనారాయణగారు డీన్‌గా వ్యవహరిస్తూ చూచుకునేవారు. పరిణామ క్రమంలో పరమగురువులు నిర్వహించిన పాత్ర మొదలైన విషయాలపై కూలంకషంగా తరగతులు నిర్వహించి వాటిపై పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు మొదట సర్టిఫికెట్ ఇన్ సోలార్ కాన్షస్‌నెస్; రెండవ పరీక్ష బాచులర్స్ డిగ్రీ ఆన్ సోలార్ కాన్షస్‌నెస్ (బి.ఎస్.సి.) ఇంక మూడవ పరీక్ష మాస్టర్స్ డిగ్రీ ఇన్ సోలార్ కాన్షస్‌నెస్ (ఎమ్.ఎస్.సి.) అనే పేర్లతో నిర్వహించి వాటి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఆశ్రమంలో ప్రతిరోజు ఉదయం ఐదుగంటల నుండి పూజాకార్యక్రమాలు, అనంతరం త్రికాల సంధ్యావందనం జరుగుతాయి. ఏడు గంటల నుండి సమర్థ సద్గురు స్పర్శ ధ్యానం, దానికి ముందుగా ఉదయం, సాయంత్రం రాగిపాత్రలో అగ్నిని ప్రజ్వలింపచేసి రెండు విశేష ఆహుతులను నివ్వటం వలన గురువు అనుగ్రహం పొందటమే కాక; లక్ష్మీప్రాప్తికిది అమోఘ సాధనగా చెప్పారు, చేయించారు.

## సుదర్శనయజ్ఞం

28.11.99వ తేది ఆదివారంనాడు ఉదయం ఆరు గంటల నుండి సుదర్శనయజ్ఞం శ్రీసూక్త, పురుషసూక్త మంత్రాహుతులతో అఖండంగా 8 రోజుల పాటు జరిగింది. మంచి క్రమశిక్షణతో

జరిగిన ఈ యజ్ఞము యొక్క పూర్ణాహుతి డిసెంబరు 5వ తేదీన వేలాదిమంది భక్తులతో దైవీచైతన్యపు శక్తిధారలతో పునీతమైన వాతావరణంలో దివ్యంగా జరిగింది. దీని ఫలితం, ఈ యజ్ఞం వలన వచ్చిన లాభమేమిటి? అనే దానికి ఇది కేవలం సాధనాత్మకంగానే కాకుండా అనేకమంది భౌతిక జీవితాలలో వచ్చిన అనేక సమస్యలు తీరిపోయాయి. సాధకులకు సాధనాత్మక పరిపుష్టి చేకూరింది.

## సాయినాథుని ఆగమనం

అది 1999వ సంవత్సరము. అవి దేవీనవరాత్రులు జరుగుతున్న విశేష పర్వదినాలు. గత మూడు నెలలుగా సప్తర్షి ఆశ్రమంలోనే వుంటూ విశిష్ట సాధనలు చేస్తూ మాస్టర్‌గారి ప్రవచనాలను వింటూ క్రమశిక్షణతో సాధన జరుగుతున్న ఆ రోజులలో వేలాదిమంది భక్తుల సమక్షంలో కన్నుల పండుగగా ఒక అద్భుతం జరిగింది.

అప్పటికే సాయినాథుని మందిర నిర్మాణం జరిగివుంది. అమృతతత్వ ప్రదాయినియైన ఆ దేవాలయం సాయినాథుని ఆగమనానికై ఎదురుచూపులు చూస్తున్నది. మాస్టర్‌గారి తమ్ముడు శ్రీవిశ్వనాధ్‌గారు స్వయంగా ఆ విగ్రహాన్నితీసుకురావటానికి తగిన ఏర్పాట్లు చేశారు. నవంబరు 29వ తేదీ సాయంత్రం 6 గంటల 13 నిమిషములకు బాబాగారి విగ్రహం వచ్చింది. వేలాది మంది భక్తుల సమక్షంలో పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారు బాబాగారికి ఎదురేగి అత్యంత సాదరంగా ఆహ్వానం పలికి బాబాగారి విగ్రహం మీద చెయ్యి పెట్టి తమ శ్వాసద్వారా గురుత్వాకర్షణశక్తిని అధిగమించి ఒక క్రేన్‌తో కానీ దింపలేని అంత భారీవిగ్రహాన్ని కేవలం కొంత మంది వ్యక్తుల సహాయంతో అతి సులువుగా లారీ మీద నుండి క్రిందికి దింపి లోపలికి తెచ్చారు. అలౌకికమైన భక్తితో లోపలికి తెచ్చి వేదిక మీదకు ఎక్కించి, అత్యంత సూక్ష్మలోకాలనుండి ఆ దివ్యచైతన్యాన్ని ఆవాహన చేసి మాస్టర్‌గారే స్వయంగా సాయినాథుని విగ్రహప్రతిష్ఠ చేశారు. జయజయ ధ్వానాలతో బాబావారి విగ్రహ ప్రతిష్ట జరిగిపోయింది. ఆనాటి నుండి బాబావారి మందిరంలో యథావిధిగా అర్చన, అభిషేకాలు, పూజలు, ఆరతులను చేయటానికి ఒంగోలు నుండి శ్రీ పుట్టంరాజురంగారావు గారు వచ్చారు. మాస్టర్‌గారి మార్గదర్శనంలో వారు అనన్యమైన భక్తి శ్రద్ధలతో బాబావారికి సేవ చేసి వారి సేవలో తరించారు. సాయినాధునికి ఎదురుగా పంచలింగాల ధుని కూడా ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు ఈ ధునికి ప్రదక్షిణలు చేసి వారి సమస్యలకు తగిన ప్రతిఫలాన్ని కూడా పొందినారు. విగ్రహం రావటానికి ముందు ఒక సంవత్సరం నుండి అక్కడ బాబాచరిత్ర అఖండపారాయణ చేయించటం జరిగింది.

## గోశాల

సప్తర్షి ఆశ్రమ ప్రాంగణానికి అవతల వైపున "గోవింద గో అభివర్ధన" గోశాలను నిర్మించి గోసేవా కార్యక్రమాలను కూడా ప్రారంభించారు. రాము అనే వ్యక్తి ఈ గోవులకు అత్యంత భక్తితో సేవ చేసి తరించారు.

## అష్టలక్ష్మీ సహిత మహాకాలచక్రవర్తి మంటప నిర్మాణం

12.12.1999 వ తేదిన ప్రారంభించిన ఈ మంటప నిర్మాణం ఎంతో సుందరంగా తయారైంది. 20వ తేదిన మహాకాలచక్రవర్తీ మేరుయంత్రానికి ప్రాణప్రతిష్ఠను కూడా మాస్టర్‌గారే చేశారు. అనంతరం మందిరం పైన ఎనిమిది దిక్కులలోను అందమైన అష్టలక్ష్మీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. దీంతోపాటుగా ప్రక్కనే ప్రారంభించిన నవగ్రహమందిర నిర్మాణం కూడా పూర్తయినది. దీనికి పూజా అర్చనలను చేయటానికి శ్రీమతి లక్ష్మిగారిని నియమించారు.

దీంతోపాటుగా ధునిపై శివలింగాకృతి పూర్తైంది. అత్యంత సుందరమైన త్రిశూలాన్ని కూడా ప్రక్కనే స్థాపించారు. ఈ విధంగా పూజ్యశ్రీ మాస్టర్‌గారు, ఆశ్రమ వ్యవస్థతో పాటు ఆలయాల నిర్మాణాలు, విగ్రహప్రతిష్ఠలు, పర్వదినాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ 'నూతన యుగావతరణకి' కావలసిన దైవీచేతనత్వాన్ని అందంగా సప్తర్షి ఆశ్రమంలోకి ఆహ్వానించడమనేది ఒక అలౌకికమైన ఆధ్యాత్మిక ప్రయోగం.

2000 సంవత్సరం రావడానికి మూడు నెలల ముందు నుండి అంటే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో సాధకులందరిని సప్తర్షి ఆశ్రమానికి వచ్చెయ్యమన్నారు. నూతనయుగం రాబోతోంది. అద్భుతమైన యుగసంధికాలం! ఈ కాలంలో చేసే సాధనలకు విశేష ఫలితాలు లభిస్తాయి. అందులోనూ గురుసాన్నిధ్యంలో సామూహిక సాధనలు చేసుకోవటమంటే ఎంత పుణ్యం చేసుకొని వుండాలి. తర్వాత ఫలితాల గురించి ఎవరు వర్ణించగలరు? మాస్టర్‌గారి మాట వేదవాక్కు. అన్ని ఊళ్ళ నుండి సాధకులు వచ్చేశారు. వాళ్ళుండటానికి, తినడానికి, పడుకోవటానికి కావలసిన వ్యవస్థంతా ఏర్పాటైంది.

అపూర్వమైన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనే ఆర్తితో స్వర్ణయుగం శ్రీ'సీతారాముడు' గారు, శ్రీ ఆవంచ సీతారామాంజనేయులుగారు (సీతారాంగారు), శ్రీధారాసత్యనారాయణగారు,

శ్రీవిశ్వేశ్వరరావుగారు ఇంకా కొందరు వ్యక్తులు వారివారి ఉద్యోగాలను సైతం వదులుకొని కుటుంబాలతోసహా వచ్చి ఇక్కడ ఇళ్ళు అద్దెకు తీసుకొని ఆశ్రమ కార్యక్రమాల బాధ్యతలను స్వీకరించారు. శ్రీ సీతారాముడుగారు మాస్టర్‌గారు చెప్పిన ప్రవచనాలను ఎప్పటికప్పుడు డి.టి.పి.చేసి సాయంత్రానికి అందించేవారు. శ్రీ సీతారాంగారు సప్తర్షి వేదవిశ్వవిద్యాలయంలో ఆస్ట్రాలజీ, హోమియో, వాస్తు, మొదలగు విషయాలపై తరగతులు నిర్వహించేవారు. ధారా సత్యనారాయణగారు విశ్వవిద్యాలయం యొక్క డీన్‌గా వ్యవహరిస్తూ తత్సంబంధమైన ప్రశ్నాపత్రాలు, పరీక్షలు నిర్వహిస్తూ భవానీగారితో కలిసి పనులు చేస్తుండేవారు. ఇక శ్రీ యం.యస్.కె. నారాయణరావు గారు విబ్జియార్ వేదిక్‌ట్రస్ట్ ఇంటర్నేషనల్‌కి మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించేవారు. వారు ఆశ్రమ ప్రాంగణంలోనే ఉంటూ ఆదాయ, వ్యయ వ్యవస్థను మాస్టర్‌గారు చెప్పిన రీతిలో చేస్తుండేవారు. విబ్జియార్ వేదిక ట్రస్ట్ ట్రెజరర్‌గా నేను కూడా శ్రీనారాయణరావుగారితో కలిసి కొంత పని చేస్తుండేదాన్ని. మాస్టర్‌గారిచ్చే సూచనల ప్రకారం సాధనాశిబిరాన్ని నిర్వహిస్తూ, ఆశ్రమవ్యవస్థనంతటినీ సమన్వయం చేస్తుండేదాన్ని. కుమారి సావిత్రి మాస్టర్‌గారి ఇంటి పని నుండి ఆశ్రమానికి కావలసిన వ్యవస్థలను చూడడమే కాక అందరికీ తలలో నాలుకగా మెలగుతూ అందరికీ అన్ని పనులు చేసి పెడుతుండేది. మాస్టర్‌గారు "సావిత్రి చేసే సేవను" మనస్ఫూర్తిగా ప్రశంసించేవారు. ప్రవచనాలతో, సాధనలతో ఇలా నిరంతర కార్యక్రమాలతో అవిశ్రాంతంగా అందరూ ఎవరికివ్వబడిన బాధ్యతలను వారు ఎంతో శ్రద్ధ నిష్ఠలతో చేస్తుండగా, చూస్తూండగానే మిలీనియం అని పిలువబడే ఆ శుభతరుణం ఆసన్నమైంది.

మహాత్ములు భవిష్యవేత్తలు, ఋషులు ఇంకా ఎందరో నొక్కి వక్కాణించిన నవయుగం ముంగిట్లోకి వచ్చింది. భూమి స్వర్గతుల్యంగా మారుతుందని చెబుతూ స్థూల, సూక్ష్మ, కారణ జగత్తులలో రావలసిన మార్పుల కోసం దధీచి మొదలు ఈనాడు మన మధ్యన ఉన్న పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యగారు, పరమవందనీయ మాతాజీగార్ల వరకు ఎందరో ఋషులు, అవతారపురుషులు అహరహం శ్రమిస్తూ ఎదురుచూస్తున్న ఆ శుభతరుణం ఆసన్నమైంది. **మానవులు సుఖశాంతులతో జీవించటానికి కావలసిన జీవిత విధానాలను ఋషులు తమ వారసత్వంగా మానవజాతికి అందించారు. ఆ జీవిత విధానాలను మానవజాతికందించేందుకు, ఆరవ మూలజాతి నిర్మాణానికి (6th root race) దోహదం చేసేందుకు అవతరించిన సిద్ధపురుషులు పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారు. వారు జాతికి సనాతనధర్మ మార్గాన్ని ప్రసాదించారు.** ఆనాటి వైదిక విధానాలను

అందరికీ అందించేందుకు, భారతదేశమును జగద్గురుపీఠంపై అధిష్ఠింపచేసే దిశగా అడుగులు వేయిస్తూ, 'ఒకే ధర్మం–ఒకే విశ్వం–ఒకే భాష'యే తమ జీవిత ధ్యేయంగా 'విబ్జియార్ వేదిక్ ట్రస్ట్ ఇంటర్నేషనల్'ను స్థాపించారు. నలుగురు వ్యక్తులు శ్రీ యం.యస్.కె. నారాయణరావు, శ్రీ శివరామకృష్ణ, శ్రీ రమేష్ మరియు శ్రీ ఘటకాల మల్లికార్జునరావుగార్లతో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేయబడింది. వీరి ఆధ్వర్యంలోనే అన్ని కార్యక్రమాలు జరుగుతుండేవి.

## నవ్యసహస్రాబ్దికి స్వాగతం

కాలచక్ర పరిభ్రమణంలో అత్యంత కీలకమైన దశకు చేరుకున్నాము. ఇదొక అపురూపమైన అవకాశం. పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారి నిర్దేశకత్వంలో జరుగుతున్న అనేక ఆధ్యాత్మిక సాధనలకు మహాపూర్ణాహుతిగా, ఆధ్యాత్మిక మహాప్రస్థానంలో ఒక విలక్షణమైన మలుపు వచ్చేసింది.

ఈ మహత్తరమైన సమయంలో నూతన సహస్రాబ్దికి స్వాగతం పలుకుతూ ఆనందోత్సాహంతో వేడుకలను 1999 డిసెంబర్ 29,30,31 తేదీలలో చేసుకోవటానికి సప్తర్షి వేదవిశ్వవిద్యాలయ ప్రాంగణం అందంగా ముస్తాబైంది. ఆధ్యాత్మిక దివ్యశక్తి కాంతులతో సప్తర్షి ఆశ్రమం ప్రాంగణం కళకళలాడిపోతున్నది. ఎటు చూసినా ఆనందోత్సాహాలతో దేవమానవులు ఈ భూమి మీదకు దిగి వచ్చి ఈ మహత్వపూర్ణకార్యాన్ని చేస్తున్నారా! అన్నట్లుగా పరిజనులు తమతమ పనులను శీఘ్రాతి శీఘ్రంగా చేసుకుంటూ కోలాహలంగా అటు,ఇటు తిరుగుతూ ఆనందమయ లోకాలలో విహరిస్తున్నారా అన్నట్లుగా వున్నదా వాతావరణం. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలకు స్వామిజీలను, ఆధ్యాత్మికవేత్తలను ఉపన్యాసకులుగా ఆహ్వానించారు. మహాత్ములు, మహానుభావులు, మహామనీషులు అందరూ పాల్గొన్న ఈ సభావేదిక ఇంద్రసభను బోలిన దివ్యధామంలా అలరారుతూ ఆధ్యాత్మిక దివ్యకాంతులను దశదిశలా విరజిమ్ముతున్నది.

దివ్యాత్మల సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పాట కచేరీలు, నృత్యప్రదర్శనలు, శ్రీమతి భవానిగారు ప్రదర్శించిన ఎరెకలసాని వేషం, ఇలా అన్ని కోణాలలోను ఈ కార్యక్రమం పరిపూర్ణతను సంతరించుకున్నది. గత మూడునెలలుగా సప్తర్షి ఆశ్రమంలో మాస్టర్‌గారిచ్చిన ఉపన్యాసాలను శ్రీమతి లక్ష్మీరాజగోపాల్ వ్రాసి దానిని ఒక పుస్తకరూపంలోకి తీసుకురాగా నూతన సహస్రాబ్ది కానుకగా 'పృథ్విపై స్వర్గావతరణ' అనే పేరుతో శ్రీరంగనాధప్రసాద్‌గారు దానిని ముద్రణ చేయించి

తీసుకుని వచ్చారు. దానిని నూతన సహస్రాబ్ది వేడుకలలో మాస్టర్‌గారు ఆవిష్కరించి అందరికీ కానుకగా ఇవ్వటంతో ఆ కార్యక్రమానికి అందమైన ముగింపు వచ్చింది. అంతటితో ఆనాటి సభకు స్వస్తి పలకటం జరిగింది.

2000 సంవత్సరం మిలీనియం అయిపోయిన తర్వాత కొన్ని విశేషమైన మార్పులు జరిగాయి. మిలీనియం అనే మహాయజ్ఞం పూర్తయింది. తదుపరి చేయవలసిన నిర్మాణాత్మక కార్యక్రమాలను ఇంకొక విశాలమైన ఆయోజనతో పూజ్యశ్రీ మాస్టర్‌గారు సరికొత్తకోణంలో తమ పనిని ప్రారంభించారు.

1990 పూజ్య గురుదేవుల మహాప్రయాణం తర్వాత మాస్టర్‌గారు చేసిన పనిని అంటే పరమగురువుల పనిని కనుక మనం కాస్త గమనించినట్లయితే ఒక్క వ్యక్తి ఈ పది సంవత్సరముల లోపల పెట్టిన ఆశ్రమాలు, అనుగ్రహపీఠాల మొదలు, వేర్వేరు ప్రాంతాలకెళ్ళి చేయించిన సాధనా శిబిరములు, సహస్రకుండీయ మహాకాలయజ్ఞాలు, ప్రవచనాల ద్వారా అందించిన ఆధ్యాత్మిక విజ్ఞానం, గురుపరంపరలోని 12 మంది మహనీయుల జీవితచరిత్రల అధ్యయనం, వాటి సారాంశము -తదనుగుణ్యమైన సాధనలతో సహా ఆయా ప్రదేశాలకెళ్ళి వారిచ్చిన సూచనలు, సాధనలు సమగ్రంగా తమదైన శైలిలో సమస్తమానవజాతికి అందించటం ఎలా సంభవమైంది? ఇంత పని, దీని వెనుక వారు చేసిన తపస్సు, వారు చేసిన సాధన, పరమగురువుల ఆశీస్సులు, పండిత శ్రీరామశర్మ ఆచార్యజీకి వారు చేసుకున్న సర్వసమర్పణ ఎంతని చెప్పగలం!! ఈ కార్యక్రమాలన్నీ కూడా వాటన్నింటికి ప్రత్యక్ష సాక్ష్యాలే. అందరికీ తెలిసిన మన మాస్టర్‌గారి జీవితం, భౌతికంగా వారి బాహ్య వ్యక్తీకరణలను చూస్తే అది సాధారణస్థాయిలోనే కనిపిస్తుంది. అంతరంగంలో జరుగుతున్న ఆధ్యాత్మిక సాధనలోని ఆంతర్యం, అనుభవాలు, అనుభూతులని దర్శించటం అనేది అసలు మానవమస్తిష్కానికి అందని, అగోచరమైన పరమరహస్యం.

భౌతికజీవితంలో మాస్టారు టి.జె.పి.యస్. కళాశాలలో పనిచేసే కెమిస్ట్రీ లెక్చరర్. అందరి మాదిరే వారు నిత్యకృత్యంగా కళాశాలకు వెళ్ళటం, స్వధర్మాన్ని ఆచరించటం, తోటి అధ్యాపకులతో సరదాగా వుండటం – ఎక్కడ రిఫ్రెషర్ కోర్సులు జరిగినా అక్కడికి వెళ్ళి అందరి మాదిరే అక్కడ వారందించే విషయపరిజ్ఞానాన్ని పరిపూర్ణంగా నేర్చుకోవటమనేది వారి వ్యక్తిత్వంలోని సహజసిద్ధ స్వభావం.

## రిఫ్రెషర్స్ కోర్సు - రత్నగిరి

రసాయనశాస్త్రంలో రిఫ్రెషర్ కోర్సు ఒకటి 2000 సంవత్సరం ఫిబ్రవరిలో మహారాష్ట్రలోని రత్నగిరిజిల్లాలో జరిగింది. టి.జె.పి.యస్. కళాశాల నుండి ఆ కోర్సుకు మాస్టర్‌గారు ఎంపిక చేయబడ్డారు. తప్పని సరిగా ఆ కోర్సు చేయాలి అనే ఆకాంక్షతో ఆ శిక్షణా తరగతులకు వెళ్ళారు. ఆ కోర్సు 2000 ఫిబ్రవరి 5వ తేది నుండి మార్చి 5వ తేది వరకు జరుగుతోంది. సరే, మాస్టారు వెళ్ళారు. ఒక వారంరోజుల తరువాత పూజ్యశ్రీ మాస్టారు శ్రీ సీతారాంగారిని, నన్ను అర్జెంట్‌గా రత్నగిరికి రమ్మని ఫోన్ చేశారు. ఏదో అత్యంత అవసరమైన పని వుండివుంటుంది అందుకే రమ్మని పిలిపించి ఉంటారు, అనుకొని మేమిద్దరం మాస్టర్‌గారి ఆదేశాల ప్రకారం రత్నగిరికి వెళ్ళాము.

శ్రీనివాసవిద్య ప్రకటీకరణకు సమయం ఆసన్నమైంది. దాని పారాయణ క్రమాన్ని మీరు తయారుచెయ్యాలి, దానిని ప్రాచుర్యంలోకి తీసుకురావాలి. అనుష్టానానికి అనువుగా దానిని తయారు చెయ్యండి. ఈ 'శ్రీనివాసవిద్య'ను మన ఆశ్రమాలలో, అనుగ్రహపీఠాలలో చేయించాలి. సరే, ముందు మీరు సాధనా విధానాన్ని వ్రాయండి. వ్రాతప్రతి అయిన తర్వాత దానిని ముందు మనం సాధన చేద్దాం. ఆ తరువాత దానిని "మహాశివరాత్రి" లోపల అందరికీ వెళ్ళేటట్టు చూద్దాం అన్నారు. శ్రీనివాసవిద్యను ఉపాసించడానికి పాటించే నియమాలు, అహారపద్ధతులు, ఇంకా ఏమైనా కలపాల్సినవి వుంటే వాటిని కలుపుతూ సాధనాక్రమాన్ని తయారు చేయమని చెప్పి మాస్టర్‌గారు 'రిఫ్రెషర్ కోర్సు'కు వెళ్ళిపోయారు. ఇక ఆ రోజు నుండి మేము ఆ సాధన చేస్తూ ఆ క్రమాన్ని వ్రాయటం ప్రారంభించాము. సాధనా విధానం అద్భుతంగా తయారైంది. మాస్టర్‌గారు దానిని చూచి హాయిగా ఆనందించారు. ముగ్గురం సాధన ప్రారంభించాం.

రత్నగిరిలో ఉన్న రోజుల్లో మాస్టర్‌గారు పగటిపూట విధినిర్వహణకు వెళ్ళినా, ప్రతి రోజూ సాయంవేళల్లో చుట్టుప్రక్కల గల ఆశ్రమాలకి వెళ్ళటం, వాటి విశిష్టతను తెల్సుకొని అక్కడ సాధన చెయ్యటం, తత్సంబంధమైన పుస్తకాలుంటే కొని చదవడం-ఇదీ వారి దినచర్య. మధ్యలో ఆదివారం వచ్చింది. ఆ రోజు సెలవు. అందుచేత అక్కడికి దగ్గర్లోనే శ్రీసమర్థరామదాసుగారి నివాసస్థలం సజ్జన్‌గఢ్ వున్నది. అక్కడ వారి సమాధి ఉన్నందువలన మాస్టర్‌గారి ప్రణాళిక ప్రకారం అందరమూ సజ్జన్‌గఢ్‌కెళ్ళటం జరిగింది. పైకి వెళ్ళాలంటే కొన్నివందల మెట్లు ఎక్కి వెళ్ళవలసి వచ్చింది. ఆ

రోజున ఎండ కూడా బాగా వున్నందున ఎక్కటం చాలా కష్టమైపోయింది. అలాగే మెల్లిగా పైకి వెళ్ళాం. అక్కడి వాతావరణం చూసే సరికి పడిన శ్రమనంతా మరిచిపోయాం. అక్కడ చాలా ప్రశాంతంగా వున్నది. అద్భుతమైన పర్వతసానువులలో గల వారి నివాసస్థలం – వారి సమాధి, వారు ఉపయోగించిన పాత్రలు మొదలైన వస్తువులను భక్తి, శ్రద్ధలతో దర్శించటం, స్పర్శించటం జరిగింది. దాని వలన వారి అంతరంగ సాధన ఏ క్రమంలో జరిగిందనేది తర్వాత కాలంలో సాధనల రూపంలో బహిర్గతమౌతుంది.

అలాగే పావస్ అనే గ్రామంలో శ్రీరామకృష్ణపరమహంసగారి ఏకలవ్య శిష్యులు ఉన్నారు. అక్కడ వారి ఆశ్రమం, వారి సమాధి వున్నది. వారు మహాసాధకులు. యోగిపుంగవులు. 'సో2హం" సాధనలో నిష్ణాతులు.

**పావస్‌గారి ఆశ్రమము:** రత్నగిరికి అతి దగ్గరలోనే వీరి ఆశ్రమము ఉన్నది. ప్రతి రోజు సాయంత్రం వీరి ఆశ్రమానికి వెళ్ళి స్వామివారి సమాధి దగ్గర కూర్చుని ఏకాగ్రతతో ధ్యానంలో లీనమైపోయేవారు మాస్టర్‌గారు.

**పరమహంసగారిచ్చిన సాధన:** వారి పేరులోనే వారి సాధనావిధానము ప్రకటితమౌతోంది. శ్రీరామకృష్ణపరమహంసగారి ఏకలవ్య శిష్యుడు ఈ స్వామి! తమ యొక్క సాధనను గురించి అచంచలమైన, దృఢమైన విశ్వాసంతో ప్రయత్నపూర్వకంగా యోగపద్ధతిలో చేసిన సాధన. అది సాధకుడిని ఒక అనిర్వచనీయమైన ఆనందస్థితికి అంటే ఒక పీస్‌ఫుల్ స్టేట్‌కి తీసుకువెళుతుంది. అదెలాగంటే వ్యక్తి చేతనత్వమును, విశ్వచేతనత్వములో లీనమైపోయే స్థితికి తీసికెడుతుంది. అదే 'అద్వైతస్థితి!' ఈ సాధన చాలా సునిశితమైనది.

కచ్చితమైనపద్ధతిలో ఉద్దేశ్యపూర్వకంగా అత్యంత శక్తివంతంగా మైండ్ ప్రిన్సిపుల్ (Mind Principle) ని ఒక విధానములో ఛానలైజ్ చేస్తే, అది శ్వాసలో ఒక రింగింగ్ శబ్దము బొడ్డు దగ్గర నుండి బ్రహ్మరంధ్రం వరకు ప్రతి ఉచ్ఛ్వాస–నిశ్వాసలో ప్రస్ఫుటితంగా ద్యోతకమౌతుంది. అందుచేత సాధకుడు ఏకాగ్రమనస్సుతో శ్వాస పీల్చుకునేటప్పుడు వచ్చిన శబ్దమును సహజ శ్వాసగా దానిని గమనించాలి. ఆ విధముగా సాధకుడు సాధనలో భావ తీవ్రతను తెచ్చుకోవాలి. అదే 'సోఽ హం'లోని అంతరార్థం. I Am That I am అనేభావన రావాలి. ఇంకోరకంగా చెప్పాలి అంటే వ్యక్తి తన చేతనత్వమును, అసలైన అంతర్యామిత్వం వైపుకు మళ్ళించాలే తప్ప శరీరం

వైపుకానీ, మనస్సు మీద కానీ లేక బుద్ధిలోకి కానీ నేరుగా అంటే డైరెక్టుగా చెయ్యకూడదు. ఇది ఒక విచిత్రమైన పరిస్థితి. సాధకుడు తన యావత్ చేతనత్వమును ఆ పరమాత్మ తత్వములోకి మళ్ళించటానికి పూర్తి ప్రయత్నం చెయ్యాలి. ఇది లక్ష్యము (Nut-Shell). ఇదంతా సోఽహం సాధనపైనే ఆధారపడివుంటుంది. దీనిని స్వామివారు పూర్తిగా ఆచరించి, తన అనుయాయులందరి చేతా చేయించేవారు. ఈ విధానము కష్టతరమైనదేమీ కాదు. ఈ సాధనలో కూర్చునేదానికి పద్ధతులు ఏమీలేవు. ఏకాంతమూ అవసరము లేదు.

ఇది ఆడవాళ్ళు చెయ్యకూడదనే నియమము లేదు. ధనము దీనికి అవరోధము కానే కాదు. ఇందులో ఆకర్షణ-వికర్షణ ఏవీ లేవు. ఇది అతి సులభమైన, సున్నితమైన Self diciplineతో మనస్సును నిరంతరం శ్వాస మీద ఉంచగలిగే సాధనావిధానము. ఈ సోఽహం (Mystic Syllable) అనేది ఆత్మ-పరమాత్మలను కలిపే ఒక మాధ్యమము. సోఽహం మీదనే మనస్సు నుంచి శ్వాసను లోపలికి తీసికెళ్ళే స్థితిని 'అజపా' అంటారు. అంటే ఏ విధమైన మంత్రోచ్చారణా చెయ్యకుండానే సాధకుడు అంతర్యామి చేతనత్వములోకి ప్రవేశిస్తాడు. ప్రాణ-అపానాలనే రెండు వాయువులు నాభి వద్ద శ్వాసను కాస్తసేపు ఆపుతాయి. అప్పుడు మనస్సు తిన్నగా చిదాకాశంలోకి ప్రవేశిస్తుంది. ఇక్కడ సాధకుడు తనలో తాను లీనమై అసలైన చేతనత్వములో 'అహం'కారాన్ని పూర్తిగా వదిలివేసి వెళ్ళిపోతాడు. శ్వాసను తీసుకునే ప్రతిసారి మెల్లిమెల్లిగా అహంకారం బరువును వదిలించుకుంటూ వెళ్ళిపోతుంటాడు.

తర్వాత సాధన చిదాకాశం పరిధిలోకి వస్తుంది. అప్పుడు చిత్తంలో గల అవగుణములన్నీ వాటంతటవే తొలగిపోతాయి. ఇంద్రియానందం పొందాలనే కోరిక నశిస్తుంది. దాని కేంద్రస్థానం కూడా పూర్తిగా అంతరించిపోతుంది. ఆ విధంగా వాసనాక్షయం జరిగి, శరీరం మీద స్పృహ కూడా తొలగిపోతుంది. ధ్యానానికి-భావనలకు-గ్రహణశక్తికి కేంద్రస్థానం చిత్తం! మనస్సు, బుద్ధి, అహంకారాలు దీని చుట్టూ తిరుగుతూంటాయి. ఈ చిత్తం క్షణక్షణం మనస్సు నుంచి సమాచారమును సేకరిస్తూ, బుద్ధితో దానిని మంథన చేసి, దృఢమైన Impression గా రూపొందించి, తన యొక్క మేధస్సుతో అద్భుతంగా ప్రపంచములో ఇంక దేనితో సాటిరాని రీతిలో ఆ సమాచారాన్ని నిక్షిప్తం చేస్తుంది. ఈ సాధనంతా మాస్టర్‌గారికి పరమహంసగారు ధ్యానస్థితిలో అందించారు.

పరమహంసగారి జీవితచరిత్ర ఇంగ్లీషులో వుంటే దానిని కొని తెచ్చారు. మాస్టర్‌గారు చదివిన తర్వాత దానిని తెలుగులోకి అనువదించమని నాకు ఇచ్చారు. అక్కడ ఉన్నప్పుడే నేను ఆ

పనిని ప్రారంభించాను. తరువాత కాలంలో ఆ పనిని పూర్తిచేశాను. మాస్టర్‌గారు ఇక్కడున్నప్పుడే రమణకుమారి ఇంకా కొంత మంది ఆత్మీయ పరిజనులు ఇక్కడకు వచ్చి మాస్టారితో కలిసి ఇక్కడున్న మంచి, మంచి ప్రదేశాలను చూసారు.కోర్సు అయిపోయే సమయానికి రత్నాకర్‌గారు, పద్మజ, కిషోర్ వాళ్ళు మాస్టర్‌గారిని కలవటానికి వచ్చారు.

అందరితో కలిసి రత్నగిరిలో ఉన్న ముఖ్యమైన ప్రదేశాలు, శ్రీతిలక్ మహాశయుల ఇల్లు, అలానే భరతమాతను దాస్యశృంఖలాలనుండీ విడిపించటానికి స్వాతంత్ర సమరపోరాటంలో పాల్గొని తమ జీవితాలను సమర్పించి పోరాడి అసువులు బాసిన మహావీరుల స్మృతి చిహ్నాలను, ఇంకా మహావీరుడు ఛత్రపతి శివాజీ నిర్మించిన కోటను ఇలా ఎన్నో ప్రదేశాలను ఎంతో ఉత్సాహంగా తిరుగుతూ చూశాము. ఇంక గుంటూరుకు రావాలి. మహారాష్ట్ర దేశం దేశభక్తులకు, గురుపరంపరకు పుట్టిన ఇల్లు. ఇంకా పండరీపురం లాంటి పవిత్రమైన పుణ్యక్షేత్రాలకిది దివ్యధామం.

రత్నగిరి నుంచి తిరిగి వచ్చేటప్పుడు సహ్యాద్రికొండల దగ్గర కారు మరమ్మత్తుకు వచ్చి రెండుగంటల పాటు అక్కడ నిలిచిపోవలసివచ్చింది. మాస్టర్‌గారు, శ్రీరత్నాకర్‌గారు, పద్మ, కిషోర్, నేను అలా చెట్టు క్రింద నిలబడి, సరదాగా మాట్లాడుకుంటున్నాము. ఇంతలో కిషోర్ వచ్చి 'మాస్టారూ, సహ్యాద్రి పర్వతాలలో శ్రీ దత్తాత్రేయులవారుంటారు గదా! మీరు వెళ్లిపోవటం ఇష్టంలేక ఆయనే మన కారును ఇలా ఆపేశారా? 'అని అడిగారు. అది యథాలాపంగా అడిగినప్పటికీ మాస్టర్‌గారు "ఏమో మరి కావచ్చునేమో" అని ఒక్క మాటలో తేల్చేశారు. ఈ సంఘటన చిన్నదే కావచ్చు. కానీ పరమార్థాలు ఎన్నో వుంటాయి. అవి మన భౌతికనేత్రాలకి గోచరం కావేమో! లేదా మనలో వుండాల్సిన ఎవేర్‌నెస్ సరిగ్గా లేదేమోననిపిస్తుంటుంది. తరువాత కాసేపటికి కారు బాగైపోయింది. ప్రయాణం సుఖంగానే జరిగింది. అక్కలకోట అక్కడికి దగ్గరగా వుంటుందని ముందుగా అక్కడికే వెళ్ళాం.

అక్కల్‌కోటమహారాజ్ స్వామిసమర్థగారి సమాధి మందిరానికి వెళ్ళాం. చాలా అద్భుతమైన క్షేత్రమది. సమాధిమందిరాలకెళ్ళినప్పుడు మాస్టర్‌గారి అంతఃచేతన విచిత్రమైన సాధనా జగత్తులోకి వెళ్ళిపోతుంది. సాధన పరిపూర్ణమైన తరువాతే మాస్టర్‌గారు బయటకు వచ్చేవారు. ఆ తరువాతే మరో ప్రదేశానికి వెళ్ళడం జరిగేది. ఇంక అక్కడి నుండి గజనానమహరాజ్ వారి ఆశ్రమాలను చూశాము. మహాశివరాత్రి రోజు రాత్రికి నర్సోబావాడికి చేరాం. ఈ మహాపర్వంనాడు ఇక్కడ

శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి నిజపాదుకా దర్శనం వుంటుందని, అర్ధరాత్రి 12గంటలకు మీకా దర్శనం ఇప్పిస్తానని, అక్కడ ఉన్న అర్చక స్వామి మాస్టర్‌గారితో చెప్పారు.

మహాశిరాత్రి కనుక అందరూ ఉపవాసదీక్షలోనే ఉన్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడి పోతున్నది. ఆలయప్రాంగణం చుట్టూ భక్తులు అభిషేకాలు చేస్తున్నారు. పూజలు చేస్తున్నారు. ఎవరికి వీలైనరీతిలో వాళ్ళు దీపాలు వెలిగిస్తున్నారు. కొన్ని వెలుగుతున్నాయి. కొన్ని కొండెక్కాయి. బాగా పొద్దు పోయింది. దాదాపుగా అందరూ వెళ్ళిపోయారు. ఆలయమంతా కొబ్బరికాయ చెక్కలతో, పండ్ల తొక్కలతో వాడిపోయిన పూలతో ఏదోలా వుంది. మాస్టారు కాసేపు నిశ్శబ్దంగా వున్నారు. తర్వాత అన్నారు, ఎక్కడన్నా చీపురు దొరుకుతుందేమో తీసుకువచ్చి, ఆలయమంతా చిమ్మండి అన్నారు. తక్షణమే అలయాన్ని శుభ్రం చేశాము. అప్పుడు చెప్పారు, 'ఇలాంటి పవిత్ర క్షేత్రంలో దొరికిన మహదవకాశం ఇది. ఎక్కడ ఇలాంటి అవకాశం దొరికినా వదులుకోకండి. దీని వలన అనేక జన్మల ప్రారబ్ధ కర్మలు క్షయమైపోతాయి' అనే ఒక దేవరహస్యాన్ని ఆ రోజున చెప్పారు. ఆ తరువాత మాస్టర్‌గారు మాత్రం ఎంతో ప్రశాంతంగా మనోమయసాధనలో లీనమైపోయారు. ఇంతలో ఒక అర్చకస్వామి వచ్చి మాస్టర్‌గారిని తీసుకువెళ్ళి స్వామివారి ప్రధాన ద్వారం ముందర కూర్చోబెట్టారు. మాస్టర్‌గారితోపాటు కిషోర్, నేను కూడా వెళ్ళి అక్కడే కూర్చొని ధ్యానమగ్నులయ్యాము. సరిగ్గా అర్ధరాత్రి 12 గం॥లకు స్వామి వారి నిజపాదుకా దర్శన భాగ్యం కలిగింది. మాస్టర్‌గారు లోపలికి వెళ్ళి ఎంతో భక్తిగా స్వామివారి పాదాలను తాకి నమస్కారం చేసుకున్నారు. మహాశివరాత్రి పర్వంరోజున ఈ పవిత్ర క్షేత్రంలో దత్తావతారాలలో రెండో అవతారమైన శ్రీనృసింహసరస్వతీస్వామివారి నిజపాదుకాదర్శనభాగ్యం కలగడమనేది మాస్టర్‌గారిచ్చిన వరదానమే గదా! ఆ తరువాత మేము అక్కడ గల ప్రముఖ క్షేత్రాలను దర్శిస్తూ కొల్హాపూర్ మహాలక్ష్మీ అమ్మ వారి దేవాలయానికి వెళ్ళి అక్కడ ఆ తల్లి దర్శనంతో పాటుగా దీక్ష, ఆదేశాలను స్వీకరించారు. అటునుండి పండరీపురానికి వెళ్ళి విఠోబా ఆలయాన్ని దర్శనం చేసుకుని తిన్నగా గజాననమహారాజ్ గారి ఆశ్రమాన్ని చేరి, అదీ చూసుకొని తిరుగు ప్రయాణమయ్యాము. కిషోర్ గుంటూరు దాకా వచ్చి మాస్టర్‌గారిని, నన్ను వదిలిపెట్టి వెళ్ళారు. అలా దాదాపు ఒక నెలకు పైగా అటు వృత్తి రీత్యా వారి బాధ్యతలను చూచుకుంటూ, ఒక్క క్షణాన్ని కూడా వృథాపోనీయకుండా సాధనాక్రమంలో జీవన సాధన చేయటాన్ని మనం ఒక్క మాస్టర్‌గారి జీవితంలోనే పరిపూర్ణంగా చూడగలుగుతాం.

ఆ మరునాడే మాస్టర్‌గారు శ్రీశ్యామలరావుగారి అమ్మాయి చి.సౌ.మాధవి వివాహం కోసం అమలాపురం వెళ్ళారు. అమలాపురం నుండి వచ్చిన మరునాటి ఉదయమే ఒక అత్యవసరమైన ప్రవచనాన్ని ఇస్తూ సప్తర్షి ఆశ్రమ ప్రాంగణంలో ఆత్మవిద్యను నేర్చుకోవాలంటే ఎలా అనేది వివరించారు.

## ఆత్మవిద్యను నేర్చుకోవటం ఎలా?

**'గురుచేతనత్వాన్ని" ధారణ చేసే విద్య.**

**ప్రతి యిల్లు ఒక గురుకులము - ప్రతి శరీరము ఒక దేవాలయము**

ఆత్మవిద్యను నేర్చుకోవటం ఎలా?

భారతీయ సంస్కృతి ప్రపంచానికి అద్భుతమైన విద్యను ప్రసాదించే భవితవ్యతను కలిగి యున్నది. నిత్యనూతనమైన శాశ్వత, సనాతన ఆత్మవిద్య భారతదేశం నుండి నిరంతరం ప్రసరించ బడుతూనే ఉన్నది. అన్ని యుగాలలోనూ ముఖ్యంగా చీకటియుగమైన కలియుగంలో కూడా ఆత్మ విద్య యొక్క కిరణాలు భారతదేశం నుండి వ్యాపిస్తూనేవున్నాయి.

ఈ ఆత్మవిద్యను నేర్చుకోవటానికి ఋషులు రెండు విధానాలను అవలంభించారు. అవే-

(1) గురుకులాలు (2) దేవాలయాలు.

### గురుకులాలు

గురుకులాలలో కొంతమంది ఋషులు కలిసి ఒక కేంద్రంగా ఏర్పడేవారు. అది జ్ఞానమును అందించే కేంద్రము. అది సాధారణంగా ఒక నది ఒడ్డున కానీ లేదా పర్వతశ్రేణులలో కానీ ఉండేది. అక్కడ భౌతికశరీరధారియైన గురువు యొక్క సమక్షంలో అనేకమంది బ్రహ్మచారులు ఆత్మవిద్యను అభ్యసిస్తూ ఉండేవారు. స్థాయీ భేదం లేకుండా అతి బీదవాడి దగ్గర నుండి చక్రవర్తుల పుత్రుల దాకా అందరూ అక్కడికి వచ్చి ఆశ్రమ నియమాలకు లోబడి విద్యను అభ్యసించేవారు.

**ఏ ఒక్కటి తెలిస్తే అన్ని తెలుస్తాయో - ఆ విద్యను "ఆత్మవిద్య" అనేవారు.**

**యేనా శ్రుతం శ్రుతం భవత్య మతం మతవిజ్ఞాతం ।**
**విజ్ఞాత మితి కథం ను భగవస్స ఆదేశో భవతీతి ॥ (ఛాందోగ్యోపనిషత్ 6-13)**

ఋషులందరి ఆశ్రమాల్లోనూ ప్రతిరోజూ అనేకమంది రోగులు, అంగవైకల్యం కలవారూ వచ్చి తమ బాధలను నివారింపచేసుకునేవారు. రాజులు తమ రాజ్యంలో వచ్చిన అనావృష్టిని నివారణ చేసుకొనేవారు. శత్రువుల ఆక్రమణ నుండి రక్షణ పొందేవారు. అంతేకాక అవసరమైనప్పుడు గ్రహస్థితులను కూడా మార్చుకొనగలిగేవారు.

గురువు అనుగ్రహానికి ప్రతిగా ఆ రాజులు ఆశ్రమవ్యవస్థకు పూర్తి సహకారాన్ని అందించేవారు. ప్రతి పౌరుడు కూడా తనకున్నదాన్ని బట్టి ఆశ్రమానికి శ్రమను, వనరులను సమకూర్చేవారు. ఆశ్రమాలలో ఉన్న సాధకులు వారివారి సాధనను బట్టి సర్వజ్ఞత్వం, సర్వవ్యాపకత్వము, సర్వసమర్థతను పొందేవారు.

ఈనాడు విశ్వవిద్యాలయములో లేదా ఒకే కాలేజిలో ఎం.బి.బి.యస్. చదివిన విద్యార్థులలో ఒకరు రోగమునకు చికిత్స చేయటంలో ప్రసిద్ధి చెందితే జనం అతని దగ్గరికే వెడతారు తప్ప ఇంకొకడి దగ్గరికి వెళ్ళటానికే భయపడతారు. కానీ రోగనివారణావిద్య మీద అవగాహన ఇద్దరికీ ఒకేలా వుంటుంది. అలానే గురుకులాలలో ఆత్మవిద్యనభ్యసించిన బ్రహ్మచారులకు కూడా ఆ జ్ఞానంపై అవగాహన ఉన్నప్పటికీ వారు ఆ విద్యను ఉపయోగించుకునే సామర్థ్యంలో తేడా వస్తుంది. ఇటువంటి వ్యక్తులున్న దేశం కనుకనే భారతదేశం రత్నగర్భ అని పేరు పొందింది. ఇప్పటికీ ఆ జ్ఞానం పరిపూర్ణంగా ఉన్నప్పటికీ దాని యొక్క ఆచరణ విధానం తెలియకపోవడం వల్ల, ఆ సాంకేతికతను (టెక్నాలజీని) మర్చిపోవటం వల్ల ప్రపంచానికే మార్గదర్శనం చేయవలసిన భారతదేశం వెనుకబడిపోయింది. మళ్ళీ అతి త్వరలో గురుకులాల ఆనాటి స్వరూపం భారతదేశంలో ఏర్పడాలి.

## దేవాలయాలు

ఈనాడు ఎటు చూచినా విద్యాలయాలు ఎలా వెలుస్తున్నాయో మనందరికీ తెలుసు. ఆ విద్యాలయాలలో తమ బిడ్డలను చేర్పించటానికి తల్లిదండ్రులు పడే ఆవేదన పడుతూ తమకు సామర్థ్యం ఉన్నా లేకపోయినా వారి చదువు కొరకు ఎంత ఖర్చునైనా భరించేందుకు సిద్ధపడుతున్నారు. ఈనాటి విద్యాలయాలలో పొందే విద్య తాత్కాలికమైనది. క్రొత్త సాంకేతికపరిజ్ఞానము అందుబాటు లోకి వచ్చినప్పుడు ఎంత ఖర్చుపెట్టి కొన్నవైనా సరే పాత పరికరాలనన్నింటినీ వదిలివేయవలసిందే! ప్రకృతిలో ఉన్న శక్తులనే వైజ్ఞానికులూ ఉపయోగించుకుంటున్నారు. ప్రకృతిలోని శక్తులను మానవ

సమాజానికి ఉపయోగపడేట్టు , వారప్పుడు అవగాహన చేసుకున్న భౌతికపదార్థాల ధర్మాలను బట్టి విభిన్న యంత్రాలను తయారుచేశారు.

విద్యుత్తు యొక్క ధర్మాలలో మార్పులేకపోయినా పదార్థ ధర్మాల మీద మనకి అవగాహన పెరిగిన కొలదీ, సాంకేతికపరిజ్ఞానములో మార్పులు రావడంతో పాత యంత్రాలు మూలపడి, క్రొత్తయంత్రాలు ఎలా నిర్మించబడుతున్నాయో మనం చూస్తూనేవున్నాం. అలా జరిగినపుడు ఆ పాత నెట్‌వర్కును ఏ విధమైన బాధ లేకుండా వదిలేసి క్రొత్త సాంకేతికపరిజ్ఞానము వచ్చినప్పుడు – మళ్లీ ఆ నూతన టెక్నాలజీకి అనుగుణంగా కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టటానికి మానవులు ఎంతమాత్రము వెనుకాడరు. దానిని నేర్పే విద్యాలయాలను స్థాపించటానికి గానీ, ఆ విద్య నేర్చుకోవటానికి గానీ వెనుకాడరు. ఎంత శ్రమైనా, ఎంత ధనాన్నైనా, వనరులనైనా వెచ్చించేందుకు వెనుకాడరు. అది మానవుని జిజ్ఞాస యొక్క లక్షణము.

**ఏ విధంగా ఒక విద్యను తెలుసుకొని అన్ని విద్యలు నేర్చుకోవచ్చో (గురుకులాలో నేర్పే విద్య), అదేవిధంగా ప్రకృతిలో ఉన్న అన్నిరకాల శక్తులను (ఇప్పుడు వైజ్ఞానికులు గుర్తించిన శక్తులే కాక, ఇంకా అనేక శక్తులను) ఉపయోగించుకునే ఒక అద్భుతమైన యంత్రాన్ని గురించి తెలిపే ఆలయమే దేవాలయము.**

ఆత్మవిద్యను నేర్చుకున్న ఋషులు, మానవ శరీరముతోనే ప్రకృతిలో ఉన్న విశిష్టమైన దేవతాశక్తులన్నింటిని గుర్తించగలుగుతారు. ఒక్కొక్కసారి విశేష సామర్థ్యము గల కొంతమంది వ్యక్తులు, ప్రకృతిలో అప్పటి వరకు ఉపయోగించబడని క్రొత్త శక్తులను గుర్తించి, ఆ దేశ–కాల పరిస్థితులలో ఉన్నటువంటి లోపాలను అంటే ధర్మగ్లానిని సవరించటానికి ఆ శక్తిని ఉపయోగించు కున్నప్పుడు వారి పేరుతోనే ఆ క్రొత్త శక్తి యొక్క దేవాలయాలు నిర్మించబడతాయి. హనుమంతుడు, రాముడు, కృష్ణుడు, శిరిడీసాయి, రామకృష్ణపరమహంస, రమణమహర్షి మొదలైన వారందరూ ఈ కోవకు చెందినవారే. వారు ఉపయోగించిన దేవతామూర్తులు ప్రకృతిలోనే ఉన్నప్పటికీ ముందుగా వారు 'దర్శించి' ఆ శక్తిని మొట్టమొదటిసారిగా భూమ్మీదకు దింపగలిగారు. కనుక ఆ శక్తులకు వారి పేరు పెట్టడం సముచితమే కదా! ఈ శక్తులలోని మార్పులను గమనించి తగిన వ్యవస్థను ఏర్పరచటమే దేవాలయముల యొక్క ఉద్దేశ్యము.

ఋషుల యొక్క అద్భుత మేధస్సు ఏమిటంటే ఈ ప్రాకృతికశక్తులనన్నింటినీ కేవలం భౌతికశరీరం ద్వారానే ఉపయోగించుకొని, తద్వారా మిగిలిన సూక్ష్మశరీరాలలో మార్పులు తెచ్చుకొని

రెండు శరీరాలను పరిపూర్ణంగా వినియోగించుకోవచ్చునని తెల్పడం. అందువల్లనే ఎన్ని కోట్ల దేవాలయాలు ఏర్పడ్డా శరీరాన్నే "దేవాలయంగా" కీర్తించారు.

**ప్రతివ్యక్తి తన శరీరాన్ని ప్రకృతిలో ఉన్న అన్ని శక్తులకూ ఉపయోగపడేరీతిగా మలుచుకునే విద్యయే పూర్వం దేవాలయాలలో నేర్పబడేది.**

గురువులు లేక ఋషి ఆశ్రమాలలో నేర్చుకున్న విద్యను నిత్యజీవితంలో ఎలా ఉపయోగించుకోవాలనేది దేవాలయాలలో నేర్పబడుతుంది. ఇలాంటి **గురుతత్వము – దేవతత్వముల సంయుక్త సందేశమే భారతీయ ఆధ్యాత్మిక విద్య.** ఈ అనంతమైన విద్యను అనగా చేతనత్వములోని మార్పును పది దశలలో కానీ లేక 24 దశలలో కానీ నేర్చుకోవచ్చని ఆధ్యాత్మిక విజ్ఞానవేత్తలు తెలిపారు. అవే దశావతారాలు లేక 24 అవతారాలు.

దత్తాత్రేయస్వామివారికి ప్రకృతిలోని 24 మంది గురువులు. ఈ ఆధ్యాత్మికవిద్యను మళ్ళీ తనదైన రీతిలో ప్రపంచానికి అందివ్వటానికి – గురుచేతనత్వము యొక్క అనుగ్రహము, మార్గదర్శనము చాలా అవసరము. దానికొరకు భారతదేశంలో ఉన్నటువంటి గురువుల సమాధి మందిరాలు ఉపయోగించుకోవటం ఒక్కటే మార్గం. గురు చేతనత్వం అనేది కాలాతీతస్థితి కనుక వారి సమాధులే వారి భౌతికశరీరాలు. ఇదివరకు గురుకులాల్లో వారి ఆశీస్సుల ప్రభావం వలన రోగ నివారణ, మానసిక క్లేశాల నివారణ, ఆర్థిక బాధల నివారణ ఎలా జరిగాయని మనం చదువుకుంటున్నామో; అదే విధంగా ప్రతి గురుస్థానములో ఇప్పటికీ జరుగుతూ ఉండటాన్ని మనం గమనిస్తున్నాం. కానీ అక్కడికి వెళ్ళి ఆత్మవిద్యను నేర్పమని ఎవ్వరూ అడగడం లేదు. గురువుల వద్ద ఏది అడిగితే అది లభిస్తుంది అన్నది అందరికీ తెలిసిన విషయమే!!

ప్రతి గురుస్థానమును ఆధ్యాత్మిక విద్యాకేంద్రముగా మార్చాలని ప్రయత్నించదలుచుకున్న సాధకులందరికీ ఇదే మా ఆహ్వానం అని ఆ రోజు సప్తర్షి ఆశ్రమంలో సుదీర్ఘమైన ప్రవచనాన్ని చెప్పారు.

ఈ విధమైన అవగాహనతో గురువు ఎదుట వినయంగా నిలబడి "మీరు నేర్పదలచుకున్న విద్యను నేర్చుకోవటానికి సన్నద్ధులమై మేము మీ దగ్గరికి వస్తున్నాము. మా భౌతికశరీరాలను, సూక్ష్మశరీరాలను మార్చగలిగే సామర్థ్యం మీకున్నది. కనుక మమ్మల్ని చక్కగా తీర్చిదిద్దండని శరణు వేడుతున్నాము" అని మనమందరమూ ప్రార్థించాలి.

## శ్రీనివాసవిద్య

భారతదేశ గౌరవము, గొప్పతనము దానియొక్క ఆధ్యాత్మికతలో ఉన్నది. విదేశాల నుండి ఆధునిక విజ్ఞానాన్ని మనం దిగుమతి చేసుకున్నాము. కనక కర్మసిద్ధాంత ప్రకారం మనం వారికి మన వేదవిజ్ఞానాన్ని నేర్పించాలి. అంటే పురాతన ఋషులు దానిని నిత్యజీవితంలో ఎలా, ఏ విధంగా ఆచరించారో అలా మనము ఆచరిస్తూ ఇతరులకు మార్గదర్శనం చెయ్యాలి. ఇదే మనకు నిర్దేశించబడిన నియతి. దీనినుండి ఎట్టి పరిస్థితులలోనూ తప్పించుకోలేము. దానికి నిదర్శనం ఏమిటంటే మనము భారతీయులుగా పుట్టడమే.

ఆ పరంపరను కొనసాగించాలంటే వేదవిహితమైన కొన్ని కర్మకాండలతో పాటు సాధనలను చేయించటం అనివార్యం. అందులో భాగంగానే ఈనాటి దేశకాల పరిస్థితులకు అవసరమైన 'శ్రీనివాసవిద్యను' తరతమ భేదాలు లేకుండా అందరిచేత ఆచరింపచేయాలి. ఈ సాధన లోక కళ్యాణార్థం మాత్రమే ఉపయోగపడుతుంది. వ్యక్తిగత ఫలితాలు చాలా పరిమితం. ఈ సాధనను కేవలం ఆశ్రమాలు, అనుగ్రహపీఠాలలోనే కాదు, సామూహికంగాగానీ, వ్యక్తిగతంగాగానీ ఎవరైనా చేయవచ్చని చెప్పటంతో అదొక ఉత్తుంగతరంగంలా ఎగిసి పడి అందరూ ఆచరించటం జరిగింది. సామూహికంగా చేసిన శ్రీనివాసవిద్య భౌతిక, ఆధ్యాత్మిక జీవితాలలో అందరిలోనూ వెలుగును నింపింది. లోకకళ్యాణార్థం మాత్రమే ఈ సాధన ఉపయోగపడుతుంది తప్ప వ్యక్తిగత ప్రయోజనాల కొరకు కాదు. శ్రీనివాసవిద్య ద్వారా ఆసేతుహిమాచల పర్యంతం అందరికీ శాంతి, సమృద్ధి, సుఖములు కలగాలని ఈ సాధన చేయించారు. ఈ సాధన ప్రత్యేకించి సామూహిక హితం కోసం చేస్తారు. ఆ పరహితంలోనే స్వలాభాలు కోరకుండానే వస్తాయి. ఇది ఒక దైవీప్రణాళికగా ఆ రోజులలో చాలా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. కాలక్రమంలో మాస్టర్‌గారు ఇంకో క్రొత్త సాధనను ఇచ్చేవారు.

**జిందల్‌లో ప్రకృతి వైద్యం:** అలా గత 18 సంవత్సరాలుగా అలుపెరగని రీతిలో నిద్రాహారములు మాని పనిచేయటం వలన మాస్టర్‌గారి ఆరోగ్యం చాలా దెబ్బతింది. బి.పి., షుగరు, గుండెసమస్యలు మొదలగువాటితో బాగా నీరసించిపోయారు. అలోపతిమందులు వాడుతున్నా అవి తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే ఇవ్వటంతో మాస్టర్‌గారిలో హుషారు తగ్గింది. పరిస్థితిని గమనించిన పరివార్ సభ్యులు శ్రీశివరామకృష్ణారావుగారు బెంగుళూరులో గల ప్రకృతివైద్యశాల 'జిందల్' లో

మాస్టర్‌గారిని చేర్పించటానికి ఏర్పాటుచేసి, స్వయంగా వారే మాస్టర్‌గారిని తీసుకువెళ్ళి చేర్పించి తగిన ఏర్పాట్లు అవీ చేసివచ్చారు. సుమ, పటేల్ వాళ్ళు అప్పుడు బెంగుళూరులో ఉండేవాళ్ళు. మాస్టారికి కావలసిన అవసరాలను వాళ్ళు చూస్తూండేవారు. ఒక నెలరోజులు వైద్యం జరిగేసరికి మాస్టర్‌గారి ఆరోగ్యం మెరుగైంది. 8 కిలోలు బరువు తగ్గారు. బి.పి., షుగరు సమస్యలు పూర్తిగా తొలగిపోయి ఆరోగ్యం మామూలుగా అయిపోయింది. ఇంకొక నెలపాటు సుమావాళ్ళింట్లోనే ఉండి అక్కడ ఆహార విహారాదులను శ్రద్ధగా ఆచరిస్తూ మళ్ళీ కళాశాల (వేసవి సెలవులు తర్వాత) తిరిగి తెరిచే సమయానికి వచ్చేశారు.

జిందల్‌లో నేర్చుకొన్న ఆసన, ప్రాణాయామాలు, ఆహారవిహారాలను నేర్చుకోవటానికి మాస్టర్‌గారు సావిత్రిని, నన్ను బెంగుళూరుకు పిలిపించారు. ఒక వారం పాటు అక్కడ ఉండి, ఏ సమయంలో ఏం పెట్టాలి, ఎంత పరిమాణంలో పెట్టాలి, ఎలా వండాలి అనే వివరాలన్నీ నేర్చుకొని గుంటూరుకు వచ్చిన తర్వాత శ్రీమతి శ్యామలగారికి అన్నీ వివరించాం. ఇక ఆనాటి నుండి ఆవిడ ఎంతో శ్రద్ధతో మాస్టారు గుంటూరులో ఉన్నప్పుడు ఆయన ఆహార నియమాలను చూచుకునేవారు. మాస్టారిలో గల ఒక ప్రత్యేకత ఏమిటంటే, తాము నేర్చుకున్న విద్య అది ఏదైనా సరే పదిమందికీ ఉపయోగపడుతుందనుకుంటే దానిని తక్షణమే అందరికీ నేర్పించేవారు. ఈసారీ అదే జరిగింది. జిందల్‌లో తాము నేర్చుకున్న ఆసన, ప్రాణాయామాల వలన శారీరక ఆరోగ్యం ఎంతో చక్కబడుతుందనేది అనుభవ పూర్వకంగా తెలుసుకున్న మాస్టర్‌గారు ఆశ్రమంలో ప్రతీ రోజూ ఉదయం ఐదు గంటలనుంచీ ఒక గంట పాటు స్త్రీ, పురుషులందరికీ ఎంతో శ్రద్ధతో ఆసన, ప్రాణాయామాలను నేర్పించారు.

## అధ్యాయం-15

# గురుసత్తాయే కల్కి అవతారము

జిందల్ వెళ్ళి ఒక నెల అక్కడ చికిత్స తీసుకున్నాక మాస్టర్‌గారి ఆరోగ్యం ఎంతో కుదుటపడింది. ఆసనాలు, ప్రాణాయామాలు, ఇవికాక ఒక గంటసేపు నడక (ఒంటికి నూనెమసాజ్ వారానికొకసారి) మొదలైన యోగప్రక్రియలు ఎంతో క్రమశిక్షణతో చేసేవారు. ఆ చెయ్యటం

కూడా ఎంతో మనస్సు పెట్టి కచ్చితంగా ఏ సాధన ఎంతసేపు చెయ్యాలో అంతసేపు త్రికరణ శుద్ధిగా చేసేవారు. 'యోగి' అంటే గీతలో చెప్పినట్లు 'యోగః కర్మసుకౌశలం' అన్న ప్రమాణానికి మాస్టర్‌గారి జీవితం ఒక దర్పణం లాంటిది. యోగ ప్రక్రియలతో ఆహార విషయాలనన్నింటినీ శ్రీమతి శ్యామల, సావిత్రి వాళ్ళు శ్రద్ధగా ఏ సమయానికి ఏది, ఎంత పెట్టాలో అంత పరిమాణంలోనే ఇస్తుండేవారు. ఈ రెండు నియమాలను పాటించటం వలన మాస్టర్‌గారి శారీరక ఆరోగ్యం చాలా మెరుగుపడింది. నూతన ఉత్తేజం వచ్చింది. కాలేజీ విధినిర్వహణ బాధ్యతలను నిర్విర్తిస్తూనే, వారి జీవిత లక్ష్యంలో భాగంగా అంతరాత్మ ఆదేశాల మేరకు ఆధ్యాత్మిక కార్యక్రమం గురించి రాత్రి పగలు ఆలోచిస్తుండేవారు. ప్రతిరోజు సాయంత్రం 7 గంటల నుంచి ఒక గంట సేపు ఆశ్రమంలో సందేశాలు ఇస్తుండేవారు.

ప్రతి శని, ఆదివారాలు సాధనాశిబిరం జరుగుతుండేది. అన్ని గ్రామాల నుండి పరివ్రాజకులు ఆ సాధనకు వచ్చేవారు. అలాంటి సమయాలలో మాస్టర్‌గారు పరమ గురువుల ప్రణాళికలను అర్ధరాత్రైనా సరే చెప్తుండేవారు. అది 2001 వ సంవత్సరం మార్చి 7 వ తేది హఠాత్తుగా మాస్టర్ గారు రాత్రి 11.00 గంటలకు బయటకు వచ్చి సప్తర్షి ఆశ్రమంలోని సాధకులందరిని సమావేశపరచి ఒక విశేషమైన సందేశాన్నిచ్చారు. ఎప్పుడు ఎలాంటి ప్రేరణ అంతరంగంలో ఆవిర్భవిస్తే తక్షణమే దానిని సాధకులకు చెప్పడమనేది మాస్టర్‌గారికున్న అలవాటు.

జరిగిపోయిన కల్కి అవతారాన్ని గుర్తించండి అంటూ మొదలుపెట్టారు. ఈనాటి సమాజంలో ఉన్న అనేక పరిస్థితులను మనస్సులో ఉంచుకొని కొన్ని విషయాలు మనం సుస్పష్టంగా అర్థం చేసుకుంటే రాబోయే రోజులలో చాలా అద్భుతమైన కార్యక్రమాలు మన ద్వారా జరుగవచ్చును. అందుచేత ఇప్పుడు నేను చెప్తున్న మాటలను మీ మనస్సులో ముద్రించుకోండి. జాగ్రత్తగా వినండి. ఏ అవతారము కోసము మానవజాతి ఎదురుచూస్తున్నదో "ఆ కల్కి అవతార ప్రాకట్యము" జరిగి పోయింది. సాధారణముగా మనం వింటున్నటువంటి విషయములేమిటంటే బుద్ధుడు తిరిగి మైత్రేయునిగా పుడతాడనీ, క్రీస్తు తిరిగి వస్తాడనీ కదా! ఇదంతా కాకుండా అసలు జగద్గురువు శ్రీకృష్ణుడే "సంభవామి యుగేయుగే" అన్న ఒక ప్రతిజ్ఞ అందరికీ తెలిసినదే!

అందుచేత ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు పుడతారని కాదు. జగద్గురువే మళ్ళీ మళ్ళీ అనేక రూపాలలో పుడతాడు. అది ఆనాటి దేశ, కాల పరిస్థితుల అవసరం దృష్ట్యా జగద్గురువు యొక్క

"ఆవేశ అవతారాలు" కూడా వస్తుంటాయి. ఆ ఆవేశం తాత్కాలికమైంది. ఆ ఆవేశం దిగిపోగానే మళ్ళీ మామూలు మనిషైపోతాడు. అందుచేత క్రీస్తు పుట్టినా, బుద్ధుడు పుట్టినా పుట్టేది ఏమిటీ అంటే **అది గురుచేతనత్వమే!**

ఆకాశంలో సర్వవ్యాపియైన ఆ జగద్గురువు ఎప్పుడూ అంటే ఎప్పుడూ ప్రతి క్షణం అనంత సూక్ష్మలోకాలలో గురురూపంలో జీవించే వుంటాడు. పరిస్థితులను బట్టి ఆయన యొక్క "భౌతిక ప్రాదుర్భావం" జరుగుతూ వుంటుంది. దానికి మనం "గురుసత్తా" అని పేరు పెట్టుకున్నాము.

ఆ గురుసత్తాకి మనం ఉపయోగపడాలంటే కొన్ని బాహ్య పరిస్థితులను, కొన్ని శరీరగత పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఇవి అవగాహన చేసుకొని దానికి తగినట్లు జీవించేటటువంటి విధానమును మనం అలవరుచుకోవాలి. కల్కి అవతరణ చిత్రీకరణ మనకి ఎలా కనిపిస్తుందీ అంటే మేఘాలలో, ఆకాశంలో నుండి ఒక తెల్లని గుఱ్ఱం మీద కత్తి పట్టుకున్నటువంటి ఒక వీరుడు కనిపిస్తాడు.

దశావతారాలలో 10వ అవతారం – కల్కి అవతారం యొక్క చిత్రీకరణ ఇలాగే చూపిస్తుంటారు.

1. ఏ అవతారం కోసం మానవ జాతి ఎదురు చూస్తున్నదో "ఆ కల్కి అవతార ప్రాకట్యము" జరిగిపోయింది. అందుచేత అవతారం కొరకు వేచిచూడకుండా జరిగిపోయిన అవతారాన్ని గుర్తించగలిగితే ఆ అవతారాన్ని మీరు ఉపయోగించుకోగల్గుతారు.

2. కల్కి అవతారమంటే సాధారణంగా మనం ఒక యోధుడు తెల్లని గుఱ్ఱం మీద కత్తి చేత బట్టుకొని ఆకాశంలో పయనిస్తూ దుష్టులను దండించి ధర్మస్థాపన చేస్తాడు అని గదా మనం పురాణాలలో అక్కడ చదువుతుంటాం. కానీ ఆధ్యాత్మిక రహస్యాలను వివరించే యోగులు ఈ కల్కి అవతార ప్రక్రియను ఇంకొక విచిత్రమైన కోణంలో వివరిస్తుంటారు. అసలు **కల్కి అవతారమనేది ఒక్క శరీరంతో మాత్రమే రాదని, అది అనేక శరీరాల ద్వారా ప్రకటీకృతమౌతుందని తెలుపుతూ, దానిని గుర్తించటానికి కొన్ని సంకేతాలను సూక్ష్మంగా వివరించారు.**

తెల్లని గుఱ్ఱము అంటే స్వచ్ఛమైన మనస్సు, కత్తి అంటే జ్ఞానము, ఆకాశము అంటే ధ్యానస్థితి, అందుచేత నిరంతరము ధ్యాన స్థితిలో ఉంటూ జ్ఞానంతో కూడిన స్వచ్ఛమైన మనస్సు కలిగిన వ్యక్తుల అంతరంగాలలో కల్కి అవతారము 'ప్రజ్ఞ' లేదా Intution గా అవతరిస్తాడని, అటువంటి వ్యక్తులందరూ కల్కి అవతారములోని భాగమే అని ఆ మహాత్ములు వివరిస్తున్నారు.

శ్రీకృష్ణ నిర్యాణానంతరం ఇప్పటి వరకూ భూమిమీద అవతరించిన సద్గురువులందరూ ఆ కల్కి అవతారంలోని భాగమేననీ, వారందరూ భూమిని స్వర్గంగా మలిచే శ్రీకృష్ణుని ప్రణాళికలోని పాత్రధారులే ననీ, ఈ ప్రణాళిక 2011 నాటికి పూర్తి కాగలదనీ యోగులందరూ వివరిస్తున్నారు. కల్కి అవతారంలో కనిపించే గుఱ్ఱం నేల మీద నడవదనీ అది ఆకాశంలో మాత్రమే సంచరిస్తుంటుంది. ఆకాశంలో లీనమై పోగలిగే వ్యక్తులు ఆ కల్కి అవతారానికి సాయపడగలరు.

అయితే దానికేదైనా మార్గముందా అంటే ? ఉంది. అదే సద్గురు స్వర్శ ధ్యానముగా మాస్టర్ గారు అందించారు. చాలా అద్భుతమైన ధ్యానమది. అందుచేత కల్కి అవతారానికి మనం ఉపయోగపడాలి అంటే "ధ్యానం"లో నిష్ణాతులమవ్వాలి. నీలో ఉన్నటువంటి ఆ పరమశాంత స్థితి – అదే 'కల్కి అవతారం'. అది ప్రకటీకరింపబడాలి, ప్రతివ్యక్తి ద్వారా అది ప్రకటీకరింపబడాలి. మళ్ళీ మళ్ళీ ఈ అవకాశం రాదు. అవతారమూర్తితో కలిసి పని చెయ్యాలంటే ఈ కల్పాంతం అయిపోవాలి. మన అదృష్టమేమిటంటే "అవతారమూర్తి" ఈ భూమి మీద ఉన్నప్పుడు ఉన్నాము. కానీ దురదృష్టమేమిటంటే ఆ అవతారమూర్తి శరీరం వదిలేసిన తరువాతనే, ఆయన అవతారమూర్తి అని గుర్తించడం జరుగుతున్నది. ఇది మానవ జాతి యొక్క ఇంకొక దౌర్భాగ్యం.

3. కల్కి అవతారములో ఉండేటటువంటి గొప్పదనమేమిటంటే – అది ఒక్క శరీరంతోనే ఉండదు. కల్కి అవతారము సకల గురుస్వరూపములోనూ ఉన్నది. అందుచేత అవతారమూర్తితో కలిసి మేము పని చేయలేకపోతున్నామనేటటువంటి బాధ మీరు పడనక్కర్లేదు అని మనకు ఊరటను కల్గించారు.

## పరివ్రాజకా శిబిరాలు

**మిలీనియం అయిపోయిన తర్వాత మాస్టర్‌గారు ఒక విశేషమైన రీతిలో 'పరివ్రాజక' సాధనా శిబిరాలను కొనసాగించారు. పరమ గురువుల ప్రణాళికలో భాగంగా నవయుగావతరణకు అవసరమైన సాధనలతో పాటు శిక్షణా తరగతులను నిర్వహించటమేకాక; మంత్ర, యంత్రాలను కూడా ప్రయోగించటం జరిగింది. యుగసంధికాలంలో మనం ఒక మలుపును దాటాం. తరువాత చేయవలసిన కార్యాచరణ ఏమిటనేదానికి మాస్టర్‌గారు 'ఇంతవరకు నేను చేసింది పరమపూజ్య గురుదేవుల ప్రణాళికలోని కార్యక్రమాలు. ఇంక నేను చేయవలసింది పరివ్రాజకులను తయారు చేయుట. అసలు నా జీవితధ్యేయము అదే కనుక ఇకనుండి నేను ఆ పనిని చేయబోతున్నాను" అన్నారు.**

## అసలు పరివ్రాజకులు అంటే ఎవరు?

భారతీయ సనాతనధర్మ సాంప్రదాయంలో పరివ్రాజకవృత్తి అనేది ఒక విశేషమైన, విశిష్టమైన వ్యక్తిత్వాన్ని అభివృద్ధిపరచుకున్న వ్యక్తులకు ఇవ్వబడిన జీవిత విధానం.

పరివ్రాజకవృత్తి అంటే తాను అర్థం చేసుకున్నటువంటి పరమసత్యాలను అందరికీ అందించటం. ఈ పరివ్రాజకవృత్తిలో ఉన్న నియమమేమిటంటే సనాతన, శాశ్వతమైన, నిత్యనూతన మైనటువంటి ధర్మాలను మాత్రమే మనం ప్రచారంలోకి తీసుకురావాలి. భారతీయ సాంప్రదాయం లోని గొప్పతనం ధర్మం. ఈ ధర్మం అనేదానికి ప్రమాణం ఎక్కడ నుండి వస్తుందంటే, అది అపౌరుషేయాల నుంచి వస్తుంది. అపౌరుషేయాలు అంటే సనాతనమై, శాశ్వతమై, నిత్యనూతనమైనవై ఉండి, వ్యక్తిగత సంబంధం లేకుండా వుండేవి. సత్యాలను పట్టుకోవటము అనే బాధ్యత పరివ్రాజకులది. పరివ్రాజకులు తెలుసుకోవలసిన ప్రాథమిక సూత్రాలు ః

1. మొదట యుగధర్మం అంటే ఏమిటో తెలుసుకోవాలి.

2. రెండవది గురువుల మధ్య ఉన్నటువంటి ఏకసూత్రతను అర్థం చేసుకోవాలి. అలానే ఒకే విషయాన్ని అందులో వున్న పరమార్థం మారకుండా రకరకాలుగా చెప్పగలగాలి.

3. మూడవ విషయమేమిటంటే గురువులు చెప్పినవాటిని ముందు మనం మన శరీరంలో చూచుకోవాలి. గురువులు చెప్తున్న ఆ జ్ఞానం, తత్సంబంధిత విషయాలు మన శరీరంలో ఎంతవరకు దిగుతున్నాయో చూచుకోవాలి. వేదాలలో చెప్పినటువంటి జ్ఞానం – 'దేహో దేవాలయః ప్రోక్తః జీవోదేవస్సనాతనః' గురువులందరూ చెప్పేదదే! ఇక్కడ దేవాలయం అంటే వెలుగుతో ఉన్నటువంటి చేతనత్వం. అంటే వాళ్ళు చెప్పిన సత్యాలు మొత్తం శరీరగతమైన సత్యాలు – అవి మీ శరీరానికి గాని, వ్యక్తిగతంగా గాని ఉపయోగపడకపోతే అది ఆధ్యాత్మికమైన సూత్రం కాదు.

సమాజానికి ఉపయోగపడనటువంటి సూత్రాలను వాళ్ళు చెప్పలేదు, వాళ్ళు చెప్పిందేమిటంటే:

మీ శరీరము ఒక సంపూర్ణ జాగరూకతను, సమగ్రమైనటువంటి వ్యక్తిత్వాన్ని కలిగి, 'ఉన్నది ఒక్కటే' అనే చైతన్యస్థితి కి (అని) వెళ్ళగలిగేటువంటి వ్యక్తిత్వానికి పునాది. శరీరమే చేతనత్వము, శరీరమే దేవాలయము. ఆ సాధనలు, శరీరమే దేవాలయంగా మారటానికి మీకు ఎలా ఉపయోగపడుతున్నాయో చూచుకోవాలి. పరివ్రాజకులనేవారు ఆ మానసికస్థితిలో నిరంతరం ఉండగల్గాలి.

ఇటువంటివారు భారతదేశం నుండి విభిన్న దేశాలకు పరివ్రాజకులుగా వెళ్ళి ఈ శాశ్వత, సనాతన, నిత్యనూతనధర్మం యొక్క జ్ఞానాన్ని అందించారు. ప్రపంచంలో ఎక్కడికెళ్ళినా భారతీయ సంస్కృతి యొక్క అవశేషాలు కన్పిస్తూనే ఉంటాయి. మాయన్‌నాగరికత (అమెరికా), ఈజిప్ట్ నాగరికత, మలేషియా మొదలగు ఇంకా ఎన్నో దేశాలున్నాయి. చాలా చోట్ల మనకంటే వాళ్ళే ఎక్కువగా భారతీయ సంస్కృతిని గౌరవించటం, వాళ్ళ రూపాయి బిళ్ళ మీద, వాళ్ళ వ్యవస్థ మీద మన దేశపు చిహ్నాలు, ఆచార వ్యవహారాల ముద్రలు చాలా స్పష్టంగా మనకి కన్పిస్తుంటాయి.

### ఇది ఎలా జరిగింది?

ఈనాడున్నటువంటి రవాణాసౌకర్యాలు, సమాచారవ్యవస్థ లేకపోయినా ఇదంతా జరగటానికి కారణం పరివ్రాజకులే. ఈ పరివ్రాజకవృత్తి అంత ఉదాత్తమైనది. చరిత్రను చూస్తే ఈ పరివ్రాజకవృత్తి అనాదిగా వస్తున్నట్లుగా తెలుస్తుంది. అనేకమంది రాజపుత్రులు, అశోకుడి కొడుకు, కూతురు సిలోన్ మొదలగు చోట్లకు వెళ్ళినట్లు గమనిస్తాం. చాలా అద్భుతమైనటువంటి స్థితిలో ఉన్న వ్యక్తులు కూడా పరివ్రాజకస్థితికి ఎక్కువ విలువ చూపించారు. విలువ చూపించారు అనే దానికి నిదర్శనం భారతీయ సంస్కృతి దేశదేశాలకూ వ్యాపించడమే. అయితే పరివ్రాజకులుగా మారాలంటే ముందు వారికి ఎలాంటి మనఃస్థితి వుండాలి? వారి వద్ద ఎలాంటి శక్తులు వుండాలి? పరిణామ క్రమమంటే ఏమిటి? అనేవి తెలియాలి. ఇంకా వారికి అవసరమైన (1) జ్యోతిర్విద్య, (2) శ్వాస విజ్ఞానము, (3) యజ్ఞవిద్య, (4) గురువులు ఏర్పరచిన మార్గాలేమిటి? (5) సమయదానము–అంశదానములను ఎలా ఇవ్వాలి. (6) మంత్రజపములు, ఏ మంత్రసాధననెలా చెయ్యాలి. (7)వాతావరణ కాలుష్య నివారణకు, విశ్వకళ్యాణానికి ఏం చెయ్యాలి. (8) ఆరోగ్యానికి – హోమియో పతిని – ఆయుర్వేదాన్ని ఎలా ఉపయోగించాలి? (9) యజ్ఞీయ ప్రక్రియగా ఆహారాన్నెలా స్వీకరించాలి అనే విషయాలను తెలుసుకోవాలి.

ఈ విషయాలను సప్తర్షిఆశ్రమంలో, 'పరివ్రాజకాశిబిరాలలో' చాలా నిర్దిష్టంగా చెప్పారు. ఆ ప్రవచనాలను చక్కగా ఏర్చికూర్చి చక్కటి పుస్తకాన్ని "పరివ్రాజకులకు కరదీపిక" అనే సాధనాత్మక గ్రంథాన్ని శ్రీ సీతారాముడుగారు మనకందించారు. ఈ యుగసంధికాలపు మిలీనియంలో సాధనా శిబిరాలలో చెప్పిన ప్రవచనాలనన్నింటికీ అక్షరరూపాన్ని ఇచ్చి పుస్తకాల రూపంలో ప్రచురించిన అదృష్టం కొంతమంది సాధకులకు దక్కింది.

1999 వ సంవత్సరములో మాస్టర్‌గారు చెప్పిన ప్రవచనాలు, వాటితోపాటుగా చేయించిన సాధనలను ఆంధ్రప్రజానీకానికి అందించాలనే తపనతో వాటికి అక్షర రూపాన్నిచ్చి ముద్రించి మాస్టర్‌గారిచే 2000 సంవత్సరములో ఒక్కొక్క పర్వంలో ఒక్కొక్క పుస్తకాన్ని ప్రచురించటం జరిగింది. వాటి వివరాలను ఈ క్రింద పొందుపరచుచున్నాము.

## గురుసత్తా కార్యాచరణ

2000 సంవత్సరం తర్వాత మాస్టర్‌గారు సప్తర్షి ఆశ్రమంలో తరగతులు నిర్వహిస్తూ కూడా వేర్వేరు ప్రాంతాలలో సాధనా శిబిరాలను ఏర్పాటుచేసి అద్భుతమైన జ్ఞాన విజ్ఞానాలను "గురుసత్తా" జీవిత విధానాల ద్వారా అందించారు. ఒకసారి హైద్రాబాద్‌లో అలాంటి సాధనా శిబిరాన్ని ఏప్రియల్ నెల 29 వ తేది నుండి ప్రారంభించారు. ప్రత్యేకించి ఈ సాధనా శిబిరంలో (1) రెస్పాన్సిబిలిటీ, (2) కామన్‌సెన్స్, (3) ఇగోలెస్‌నెస్, (4) సైలెన్స్ అనే విషయాలతో పాటు ముఖ్యంగా గురువులందరూ కోరుకుంటున్న

**ది సైకాలజి ఆఫ్ టుగెదర్‌నెస్‌ను గురించి విశిష్టమైన తరగతులు నిర్వహించారు.**

సాధకుడు కార్యసిద్ధి కోసం లక్ష్యం వైపు నిరంతరం పయనిస్తూనే ఉండాలి. గురువులేం చేస్తారులే అనే అపోహ పోవాలి. ఒక్కటి గుర్తుంచుకోమనేవారు. "గురువు వచ్చి చెప్తాడు తప్ప నిన్ను వ్రేలు పట్టి నడిపించడు. అలనాడు శ్రీరాముడు హనుమంతుడికి 'సీత'ను వెతకమని చెప్పాడే తప్ప ఇంకేమీ వివరాలు చెప్పలేదు. హనుమంతుడే అంతా చేశాడు. **ఈ భూగ్రహం మీద మనిషి ఏదో నేర్చుకోవటానికి వచ్చాడే తప్ప ఈ గ్రహాన్ని తన స్వార్థం కోసం సర్వనాశనం చేయటానికి రాలేదని గ్రహించండి" అని చెప్పారు.**

ది సైకాలజి ఆఫ్ టుగెదర్‌నెస్ అనేది ప్రత్యక్షంగా సూర్యుని జీవితంలో కనిపిస్తుంది. గ్రహాలనన్నింటినీ క్రమం తప్పకుండా పని చేయిస్తాడు. అందుచేత ఆదిత్యహృదయం అంటే సూర్యుని హృదయం తెలియనివాడు రాక్షసత్వాన్ని అధిగమించలేడు. దీంట్లో ఆ టుగెదర్‌నెస్ వుంది. సౌరవ్యవస్థ యొక్క టుగెదర్‌నెస్ కొన్ని కోట్ల సంవత్సరాల నుంచి అలా కొనసాగుతూనే వున్నది. ఆ "టుగెదర్‌నెస్" ను తేవాలనే బుద్ధభగవానుడు, పూజ్యశ్రీ పండిత శ్రీరామశర్మ ఆచార్య, శ్రీరామకృష్ణపరమహంస మొదలగు గురువర్యులంతా చెప్తున్నదేమిటంటే అందరూ కలిసి జీవించమని." దానినే ఇ.కె.గారు సహజీవనమని చెప్తారు.

ధర్మరాజు జూదంలో ఓడిపోవటానికి కారణం సర్వనాశనాన్ని తప్పించటానికే! (ఈ విషయం ఎవ్వరికీ తెలియదు) అందర్నీ పణంగా పెట్టినా అన్నదమ్ములు కొట్టుకోలేదు. ఆ టుగెదర్‌నెస్ వాళ్ళల్లో వుంది. అందుకే పాండవులు ఎక్కడ వుంటే అక్కడ ప్రకృతి సశ్యశ్యామలంగా వుంటుండేది. దుర్యోధనుని మంట వాళ్ల పాలిట వరమైంది. టుగెదర్‌నెస్‌లో ఎదుటివాడు నిన్ను గుర్తించినా గుర్తించకపోయినా నీవు నీ పనిని చేసుకుంటూపోవాలి. కాలచక్రభ్రమణంలో ఒకళ్ళు ఈ జన్మలో గురువు అయితే మరుసటి జన్మలో ఇంకో చేతనత్వంలోకి మారిపోతారు. కుటుంబాలలో బాంధవ్యాలూ అలాగే మారిపోతుంటాయి. ప్రకృతిలో ఎక్కడున్నా ఆ టుగెదర్‌నెస్ తెచ్చుకుంటే పరిస్థితులు మారిపోతాయి.

ది సైకాలజి ఆఫ్ టుగెదర్‌నెస్‌లో సప్తర్షి మండలం ఎలా పనిచేస్తోంది, గురువులందరూ ఎలా పని చేస్తున్నారనే దాన్ని గమనించుకోవాలి. స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింలు ఎంత చావగొడుతున్నా 'భాయీ భాయీ' అనేగా మన నేతలు వాళ్ళతో కలిసి పనిచేశారు. కుటుంబాలలో, సమాజంలో ఈనాడు కలిసి ఉండగలిగే మానసికస్థితి రావాలి. ఎదుటివాడి కన్నా నేను గొప్పవాణ్ణి అనుకున్న మరుక్షణం నీవు క్రిందపడిపోతావ్. అందుచేత బట్టను సబ్బుతో ఉతికినట్లు నిన్ను నీవు ఉతుక్కో. పరిణామక్రమంలో ప్రతిదీ ముఖ్యమైనదే. అలా ఆ శిబిరంలో ది సైకాలజి ఆఫ్ టుగెదర్‌నెస్ గురించి ఎంతో విశదంగా చెప్పారు. ఈ తరగతిలో ఒక సాధన చెప్పారు.

సాధనకు కూర్చోవడం త్రిభుజాకారంలో కూర్చోవాలి. డిసైపుల్స్ ఆఫ్ న్యూ ఏజ్ ఎడ్యుకేషన్ లో మాస్టర్ జ్వాలాకూల్ ఏం చెప్పారంటే మొత్తం 129 మంది సాధకులు ఒక సమూహంగా ఏర్పడి త్రిభుజాకారంలో కూర్చోవాలి. అలా 43 త్రిభుజాలుగా కూర్చొని ధ్యానం చేసి షట్చక్రాలను జాగృతం చేసుకోవచ్చు. ఇది ఒక రోజులో మాత్రం కాదు. సాధనలో సిద్ధి వచ్చేటంతవరకు చేస్తూనే ఉండాలి.

## గురుసత్తా సమన్వయము

భారతదేశ ఔన్నత్యం, రాబోయే రోజులలో దాని పాత్ర ఏమిటి? - ఎలాంటి విచిత్రమైన పాత్రను భారతదేశం పోషించబోతున్నదనేది రాబోయే రోజులలో చూడబోతున్నాం. దానిని తెలుసుకోవాలంటే కావలసిన మూడు పుస్తకాలు (1) రామాయణం, (2) మహాభారతం, (3) శ్రీమద్భాగవతం. ఈ మూడు పుస్తకాలు తెలియనివాళ్ళు బహుశా వుండరేమో! తెలిసినా కచ్చితంగా వాళ్ళకు

ఉపయోగించుకోవటం రాదు. కారణం ఏమిటంటే మనం వాటికి ఇవ్వవల్సినంత విలువను ఇవ్వటం లేదు. దేనికి విలువ ఇస్తున్నాం. చదువులు, పెళ్ళిళ్ళు, పిల్లలు, ఉద్యోగాలు. వీటి కోసమే మనం సాధనలు చేసినా, గుళ్ళకు వెళ్ళినా! ఇదంతా ముసుగు కప్పిన ఆధ్యాత్మికత. నేను చెప్తున్న విషయాలను జాగ్రత్తగా అర్థం చేసుకోలేకపోతే నేను చేస్తున్న ప్రయత్నం మీకు అర్థం కాదు. అయితే అది వృథాగా మాత్రం పోదు. తపన ఉన్నవాళ్ళు ఎక్కడున్నా వాళ్ళకు ఈ సందేశం వెళ్ళి పోతుంది. వైశాఖపూర్ణిమ లోపల మీరు నిర్ణయించుకోండి. దానికి కావలసిన పాయింట్లు చెప్తాను గుర్తుంచుకోండి అన్నారు మాస్టర్‌గారు.

ఒక డాక్టర్, ఒక ఇంజనీర్ కావాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుంది. అదే ఒక ఆధ్యాత్మిక వేత్త కావాలంటే కొన్ని జన్మలు పడుతుంది. ఈ సాధనా శిబిరంలో మీరు కొనసాగాలంటే (దీని లోతులను స్పృశించండి). ఇవాళ నేను చెప్పబోయే క్లాసు కొన్ని జన్మల వరకు తీవ్ర ప్రయత్నం చేస్తే తప్ప పట్టుకోలేరు. వాల్మీకి ఒక్కక్షణంలోనే తన జీవితాన్ని మార్చేసుకున్నాడు. మరి మీ పరిస్థితి ఏమిటి? ఇన్ని సంధ్యావందనాలు, సాధనలు చేస్తూ ఉన్నా ఇతరులతో మీరు సరైన సంబంధ బాంధవ్యాలను (అంటే రైట్ రిలేషన్‌షిప్స్‌ని) ఏర్పరచుకోలేకపోతే మీరు ఎన్నటికీ ఆధ్యాత్మిక వేత్తలు కాలేరు. మానసిక మౌఢ్యాన్ని, మానసిక వివక్షతను వదిలించుకుంటేనే గానీ పరమగురువులు అందించే జ్ఞానం పొందలేరు.

మన గురుసత్తా మనకు ఎలాంటి సమన్వయ సాధనలనందించిందో అర్థం చేసుకుంటే మన లక్ష్యమేంటో మనకు బోధపడుతుంది.

**(1) మేడం బ్లావెట్స్కీ - మాస్టర్ సి.వి.వి.:** బ్లావెట్స్కీ మాత వ్రాసిన సీక్రెట్ డాక్ట్రిన్ మనకు పరిణామక్రమమును గురించి తెల్పుతుంది. పరిణామక్రమములో సాధకుడు ఎక్కడ వున్నాడు? అనేది తెలుసుకోవటానికి 'నమస్కారమ్స్ మాస్టర్ సి.వి.వి.' అని ధ్యానంలో కూర్చోవాలి అని మాస్టర్ సి.వి.వి.గారు చెప్పారు.

**(2) లాహిరీ మహాశయ మరియు యోగానందుల సాధన ఏమిటి?** లాహిరీ మహాశయులు పరిణామక్రమములో శ్వాసనుపయోగించుకుని త్వరత్వరగా ముందుకెళ్ళే సాధనా విధానాలను చెప్పారు. పరిణామక్రమమును దాటటానికి రోజుకు ఉదయం 4 గంటలు సాయంత్రం 4 గంటలు

క్రియాయోగ సాధన చేస్తే 5 సంవత్సరముల 9 నెలల 8 రోజుల్లో కోట్ల సంవత్సరాల పరిణామ క్రమమును దాటి ముందుకు వెళ్ళిపోవచ్చని చెప్పారు.

**(3) శ్రీ అరవిందో-శ్రీమాత:** భారతదేశం యొక్క మాతృతత్వాన్ని, మాతృశక్తిని గుర్తించటం ఆ సాధన యొక్క పరమార్థం. శ్రీఅరవిందో మనోయోగ సాధనను (మైండ్‌పవర్) -అమృతత్వవిద్య సాధనగా చేసి సావిత్రీ ఉపాసనతో అమృతత్వాన్ని భూమి మీదకు దింపాలని ప్రయత్నించి చివరకు నవంబరు 23వ తేదీనాడు శ్రీకృష్ణ చేతనత్వం భూమి మీదకు దిగిందని చెప్పిన మహనీయులు. వారు చెప్పినట్లుగానే సరిగ్గా ఆ రోజుననే భగవాన్ సత్యసాయి అవతరణ జరిగింది.

**(4) శ్రీరామశర్మ ఆచార్య-మాతాభగవతీ దేవి:** గాయత్రీమంత్రము, యజ్ఞములతో భారత దేశము యొక్క మాతృతత్వాన్ని విశ్వమాతగా ముందుకు తీసుకెళ్ళారు. ఇంకా ఏం చెప్పారంటే సాధన యొక్క పరాకాష్ఠగా స్థూలశరీరంలోని షట్చక్రాల జాగరణ, సూక్ష్మశరీరంలోని పంచకోశాల సాధనతో పాటు త్రిగ్రంథి వేధన చేయడమెలాగో వారు సాధన ద్వారా చేసి చూపించారు. గాయత్రీ పరివార్ అనే పేరుతో గురుదేవులు ఒక చక్కటి కుటుంబ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అందులో పనిచేసే వారందరూ ఆత్మీయ, అనుబంధాలతో, సోదరభావంతో కలిసి ఉండాలనేది ఆయన ఆకాంక్ష.

**(5) శ్రీరామకృష్ణపరమహంస-శారదామాత:** నవసన్యాస దీక్షకు నాందీప్రస్తావన చేసిన యోగిపుంగవులు శ్రీరామకృష్ణపరమహంస. నవసన్యాసదీక్షను దైవీశక్తులతో పూర్తిగా న్యాసము చెందుట అనే నూతన స్ఫూర్తినందించారు.

**(6) శ్రీ శిరిడీసాయి-సత్యసాయి:** దీనికంతటికీ కావలసింది శ్రద్ధ, సబూరి (ఓర్పు). వెయిట్ టిల్ యు గెట్ ప్రాపర్ రిజల్ట్.

శివ, శక్తుల కలయిక శిర్డీసాయి + సత్యసాయిగార్లు, వీళ్ళందరికి కామన్ బేసిస్ శ్రీరమణ మహర్షి మరియు జిల్లెళ్ళమూడి అమ్మ. నీ ఆత్మతత్వంలో నీవు జీవించు! ద్రష్టాస్థితిలో చూస్తూ వుండు.

ఇలా చేస్తే ఎక్కడికి వెళ్తారు? అంటే 'జగజ్జనని-జగద్గురువుల' దగ్గరికి వెళ్తారు.

In Life, lots of people know What to do, but few people actually do what they know.

ఆత్మ యొక్క లింకులను గురించి గురువులు ఈ యుగంలో చెప్తున్నారు. కనుక మనం ఒప్పుకొని తీరాలి, ఒప్పుకున్నాక చేసి తీరాలి అనే పరమసత్యాన్ని ఎంతో సున్నితంగా, ప్రభోదాత్మకంగా చెప్తూ మాస్టర్‌గారు మనలను జాగృతం చేయటానికి ప్రయత్నించారు.

## 2000 సంవత్సరం సాధనా శిబిరంలో మాస్టర్‌గారిచ్చిన శిక్షణ మెళుకువలు - సాధనాత్మక ప్రక్రియలు

భారతీయ జీవితవిధానంలో అతి ముఖ్యమైన మానసికస్థితి ఏమిటి అంటే మనకు మృత్యువు లేదు. మనం అమరులం అని వేదవాఙ్మయం చెప్తోంది. మనం భూసురులం కావాలి అంటే నడిచే దేవతలం కావాలి.

మానవ శరీరం ద్వారా అమరత్వాన్ని సాధించటానికి చేసే ప్రక్రియే యజ్ఞము. **య అంటే తెలిసి చేసే పని ఏదైనా యజ్ఞమే.** హుక్కాపీల్చటం, సిగరెట్ త్రాగటం కూడా యజ్ఞమే. అయితే దాని విలువ తెలిసి చేయాలి. అప్పుడది నిజంగానే యజ్ఞం అవుతుంది. అనేక దత్తావతారాలు, అవధూతలు ఈ పద్ధతిని రకరకాలుగా ఉపయోగించి ప్రకృతితో అనుసంధానము చేసుకొని కావలసిన ఫలితాలను పొందేవారు. (ఇక్కడ దత్తావతారాల ప్రస్తావన వచ్చింది కాబట్టి ఈ వివరణను ఇవ్వడం జరిగింది కానీ అందరూ వారిని అనుసరిస్తున్నామనుకుని చెడు అలవాట్లకు బానిసల్ని కమ్మని కాదు, తస్మాత్ జాగ్రత్త !!! విలువ తెలియకుండా చేస్తే ప్రాణం పోతుంది. తెలిసి చేస్తే ప్రాణం పోయగలుగుతారు.) ఈనాడు అందరూ యజ్ఞాలు చేస్తున్నారు. కానీ దాని విలువ తెలియకుండా చేస్తున్నారు. అనేక రకాల పారాయణాలు చేస్తుంటారు. ఎప్పుడు చెయ్యాలో, ఎలా చెయ్యాలో తెలియకుండా చేసేస్తుంటారు. అలా చేస్తే వాటికి ఏ విధమైన ఫలితమూ ఉండదు. యజ్ఞము గురించి గీతలో **'ఏషవోస్త్విష్ట కామధుక్'** అని చెప్పుకున్నాము. అంటే కోరికలు తీరుతాయనే గదా ఆ వాక్యం చెప్తోంది.

యజ్ఞవిద్యలో పాటించవలసిన ప్రధానమైన కొన్ని సాధనలను చెప్పుకుందాం. ముందుగా మనం 'ఓంకారం' చెప్తాము గదా! ఈ సృష్టి, గాయత్రీ మంత్రం మాత్రమే కాదు, అసలు సంపూర్ణ వ్యక్త అవ్యక్త జగత్తు అంతా కూడా ఒకే ఒక శబ్దం ' ఓంకారం' నుంచే ఉద్భవించిందని శాస్త్రాలు చెప్తున్నాయి. దివ్యమైన నాదోపాసననే ఋషులు "ఓం"కారోపాసన అన్నారు. ఈ విశ్వమంతటికీ ఆధారభూతమైనది 'నాదం'. ఆ నాదాన్నే ప్రణవనాదంగా ఉపాసించి భగవత్ సాక్షాత్కారాన్ని

పొందారు. గాయత్రీమంత్రం ఈ 'ఓం'కారము యొక్క వివేచననే చేసింది అనేది శాస్త్రాలు నిరూపించాయి.

"ఓం" జపయజ్ఞము గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన నివేదికలు పరిశీలిస్తే ఏం చెప్పారంటే –

**(1) పిల్లలు పుట్టటానికి:** సంతానం కలగడానికి ఓంకారమును అద్భుతమైన వరదానంగా చెప్పారు. ఇన్‌ఫెర్టిలిటీ అంటే పిల్లలు పుట్టనటువంటి, ఇక ఆ దంపతులకు పిల్లలు పుట్టరు అని వైద్యులు నిర్ధారణ చేసినటువంటి వందమంది దంపతులచేత 'ఓం' అనేటువంటి శబ్దాన్ని ఉచ్చారణ చేయించారు. ఆ తరువాత వారిలో 40 శాతం మందికి 6 నెలల లోపలే సత్ఫలితాలు కనిపించాయి.

**(2) ఎయిడ్స్‌వ్యాధి నివారణకు:** ఓంకారము. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, బోస్టన్ – అమెరికాలోని ఒక వైద్యుడు ఏమని చెప్పారంటే ఎయిడ్స్‌వ్యాధి నివారణకు 'ఓమ్ మ్మ్మ్మ్మ్మ్, ఓం' అంటూ ఉచ్చరించిన తరువాత 7 'మ'కారాలు చేస్తే రోగనివారణ జరుగుతుంది. 'అది ఏ రోగమైనా సరే' అనే వార్తను హిందూ వార్తాపత్రికలో ప్రచురించారు.

**(3) ఆసుపత్రి ఖర్చు తగ్గిస్తూ ఓంకారము :** ఆ వైద్యుడే ఇంకొక ప్రయోగ ఫలితాలనిలా వ్రాశారు.

ఈ 'ఓం' అనే శబ్దాన్ని మా ఆసుపత్రిలో ఉచ్చారణ చేయించినప్పుడు మెడికల్ బిలు 36% తగ్గింది. 'ఓం' శబ్దం వలన అనేక ప్రయోజనాలు సిద్ధిస్తున్నాయని వారా ఫలితాలతో సహా చెప్పారు. మన ఋషులు చెప్పింది మనం వినకపోయినా వైద్యవిద్యలో పారంగతులైనవారి ప్రయోగ ఫలితాల్ని విన్నైనా మనం 'ఓం'కార సాధనను చెయ్యాలి.

**యజ్ఞములోని మరొక సాధన :** చందన ధారణ.

**చందనస్యమహాత్మ్యం పవిత్రం పాపనాశం ।**
**ఆపదాం హరతే నిత్యం లక్ష్మీ స్తిష్ఠతి సర్వదా ॥**

మనల్ని శుద్ధి చేసి, పాపాలను నాశనం చేసి, ఆపదలను నివారించేది మాత్రమే కాక లక్ష్మీ దేవిని స్థిరంగా వుంచేది ఈ చందనం. చందనాన్ని 'ఆజ్ఞాచక్రం' అనే బొట్టుపెట్టుకొనే స్థానంలో

ధరిస్తాం. ఆజ్ఞ అంటే గురువు ఆజ్ఞను పాటిస్తాం. కరిష్యే వచనం తవ – అంతటి మహత్వపూర్ణమైన చందనధారణను ప్రతిరోజు అందరూ ఈ మంత్రం చెప్పుకుంటూ ధరిస్తే అనేక ఆపదల నుంచి రక్షించబడతారు.

(3) తులసిమొక్కను తప్పకుండా ఇంట్లో పెట్టుకోవాలి. నవగ్రహ శ్లోకం "బ్రహ్మమురారీ స్త్రీపురాంతకారీ..." అనే శ్లోకాన్ని 9సార్లు చదువుతూ ప్రదక్షిణలు చేస్తే సమస్త గ్రహ పీడా నివారణ జరుగుతుంది.

(4) కుటుంబంలో ఉన్న విద్వేషాలను, మానసికమైన ఒత్తిడిని పోగొట్టుకుని, సుఖశాంతులతో ఉండాలనకుంటే – ఉదయం మరియు సాయంత్రం వేళల్లో స్విష్టకృతహోమంలో బెల్లం సమర్పిస్తే పరిస్థితి అంతా చక్కబడుతుంది.

(5) అరకొరగా మిగిలిపోయిన పనులు పూర్తి కావాలంటే ఉదయం, సాయంత్రం రెండు పూటలా 40 రోజులు పూర్ణాహుతి మంత్రంతో అగ్నిలో ఆహుతి సమర్పిస్తే ఆగిపోయిన పనులు పూర్తైతాయి.

(6) మరొకరి వలన పనులు ఆగిపోతున్నాయి, ఏం చేయలేకపోతున్నామనే భావం పోయి పనులు సజావుగా జరగాలంటే వసోధారమంత్రం ఉపయోగపడుతుంది. నిత్యజీవితంలోని అనేక సమస్యల నివారణకు యజ్ఞవిద్యను ఈరకంగా ఉపయోగించుకోవచ్చు.

## అధ్యాయం-16

# "ప్రాణవిద్య"కు కేంద్రం సహ్యాద్రి దత్తాశ్రమము

**Thought Form**

**By the grace of Gurusatta let this knowledge enlighten Humanity**

ఇది మాస్టర్‌గారిచ్చిన అద్భుతమైన మంత్రరాజము! ప్రాణవిద్యకు ఆధారభూతమైన నదీ పరీవాహక ప్రాంతాలలోనే ఋషులు తమ ఆశ్రమాలను నిర్మించుకుని సాధనలు చేసేవారు. ఏ విధమైన తపస్సుకైనా, సాధనకైనా 'ప్రాణశక్తి' అనేది ఎంతో అవసరం. ఆధ్యాత్మికశాస్త్రంలో ప్రాణవిద్య అనేది ఒక ప్రత్యేకమైన విధానము. దీని ఆధారంతోనే సాధనా సంసిద్ధుడైన మనిషి ప్రాణశక్తిని అధిక ప్రమాణంలో సంపాదించి, దాని ప్రభావంతో తనను తాను ఉద్ధరించుకోవడమేగాక అనేక మందిని ఉద్ధరించగలుగుతాడు.

అఖిల బ్రహ్మాండములో ఆవరించివున్న ప్రాణతత్వం నుండి కోరినంత మేరకు ఆకర్షించుకొని దానిని అవసరమైన శరీర స్థానాలలోనికి చేర్చే విశిష్టమైన కళగా ప్రాణాయామాన్ని అర్థం చేసుకొని, దానిని అభ్యాసం చేయవలసివుంటుంది. శ్వాస ప్రాణము కాదు. శ్వాసతో పాటుగా ప్రాణమును మిళితము చేసి శ్వాస యొక్క పూర్తి ప్రాణతత్వమును ఆకర్షించుకోగలగడం ఒక విషయమైతే, కేవలం శ్వాస, ప్రశ్వాసల క్రియ రెండవది. ప్రాణాయామములో గట్టి సంకల్పాన్ని తీసుకోవలసి వుంటుంది. అందుకోసం ఆకాశంలో ఆవరించియున్న ప్రాణతత్వాన్ని ఆకర్షణ ద్వారా రాబట్టుకో గలుగుతాము. అలా పొందిన ప్రాణతత్వాన్ని కోరుకున్న స్థానాలలోకి పంపగలుగుట అనేది గట్టి సంకల్పశక్తి ద్వారా మాత్రమే సాధ్యము. శ్వాసక్రియతో పాటు గట్టి మనోబలం కూడా కలిస్తేనే ప్రాణాయామ ప్రక్రియ పూర్తి అవుతుంది. ప్రాణము అనేది శక్తి యొక్క పర్యాయపదము. భౌతికసంపదలు, ఆధ్యాత్మిక విభూతులన్నీ దీని పరిధిలోకే వస్తాయి. ఇలాంటి మహత్తరమైన విద్యకు కేంద్రముగా "సహ్యాద్రి దత్తాశ్రమాన్ని" మాస్టర్‌గారు స్థాపించారు. సముద్రపు ఒడ్డున మాత్రమే మనకు అనంతమైన ప్రాణశక్తి సంచారము లభిస్తుంది. కనుక ఇక్కడ విశిష్టమైన పర్వదినాలలో సాధనా శిబిరాలను నిర్వహించడం జరిగేది.

2000 సంవత్సరం ఏప్రియల్ 13,14,15,16 వ తేదీలలో "పరమహంస" సాధనను ఈ క్షేత్రంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రత్యేకించి మాస్టర్‌గారు మూడు ప్రత్యేక సాధనా విధానాలు నిర్ణయించారు.

(1) అఖండజ్యోతి – సాధన చేసే ఈ మూడు రోజులూ ఆవునేతితో వెలిగించిన అఖండజ్యోతి ఉండాలి.

(2) ఈ అఖండదీప సమ్ముఖంలో హంస గాయత్రీమంత్ర జపం ఇద్దరిద్దరు చొప్పున రాత్రీ పగలూచెయ్యాలి.

(3) సాధనకు వచ్చిన సాధకులు నిరంతరం మౌనంలో ఉంటూ శ్వాసను గమనించుకుంటూ వుండాలి.

మాస్టర్‌గారు అఖండ జపానికి ఇచ్చిన మంత్రం ...

**హంస హంసాయ విద్మహే, పరమ హంసాయ ధీమహి, తన్నో హంసః ప్రచోదయాత్ ॥**

ఇది విశ్వజనీనమైన విద్యగా ఈ సాధనా శిబిరంలో చెప్పడం జరిగింది. ప్రకృతి నియమాలు ఎప్పటికీ మారవు అని చెప్తూ మన ఋషులు మొత్తం వేదవిద్యను దత్తనమస్కారాలలోనూ, సూర్య నమస్కారాలలోనూ పొందుపరచారు. కాబట్టి మన శరీరంలోని మల, విక్షేప దోష నివారణకు ఈ శిబిరంలో ప్రతి ఒక్కరి చేత సూర్యనమస్కారాలు–దత్తనమస్కారాలను చేయించారు. గ్రహాల ప్రభావం నుండి రక్షించబడటానికి కూడా ఈ ప్రక్రియ ఎంతో ఉపకరిస్తుంది. శరీరాలలో శ్వాస వున్నంత వరకే ఈ గ్రహాల ప్రభావముంటుంది. దీనికి పరమహంస మంత్రముతో చేసే శ్వాస చాలా ముఖ్యం. శ్వాసను పీల్చుకోవటానికి ఏ రకమైన చదువూ అవసరం లేదు. కానీ శ్వాస విజ్ఞానం నేర్చుకోవాలంటే కొంత సాధన కావాలి. ఆ కోరిక ఉన్నవారికి ఈ సాధన వుపయోగపడుతుంది. దానికి నిరంతర మౌనం, దాంతో పాటు శ్వాస మీద ధ్యాస వుంటే చాలు.

గాయత్రీమంత్రం – ప్రకట గాయత్రి ఇది.

అజపా గాయత్రీ – పరమహంస సాధన

మన మనస్సే గురువు – శ్వాసే అసలైన గురువు

"మీ అనన్య చింత దేని మీద ఉండాలంటే మీ శ్వాస మీద – మీ మనస్సును శ్వాస మీద ఉంచుకోగలిగితే – మీ యోగ, క్షేమములు నేను చూచుకుంటాను" అని కదా గీతలో శ్రీకృష్ణుడు చెప్తాడు. పైన చెప్పిన 'మంత్రజపాన్ని' బలీయంగా మనస్సు పెట్టి చెయ్యండి. మీలోని చేతనత్వం జాగృతమౌతుంది. ఏ పని చేస్తున్నా 'శ్వాస' పీలుస్తూన్నామనే గమనం ఉండాలి. **శ్వాస ఎప్పుడూ గురుచేతనత్వము యొక్క అధీనములో వుంటుంది. శ్వాస మీద మనం ధ్యానం ఉంచితే గురు అనుగ్రహం లభిస్తుంది.** శ్వాస మీద గమనం లేకుండా గురువు అనుగ్రహం ఎన్నటికీ రాదు.

ఈ సాధనా శిబిరంలో మాస్టర్‌గారు సాధకులకు 'శ్వాస' విజ్ఞానం మీద చక్కటి శిక్షణ నిచ్చారు. అందునా సముద్రతీరం అంటే 'పాణశక్తి'కి నిలయమైన ఈ ప్రదేశంలో జరిగిన ఈ శిబిరంలో అందరికీ శ్వాస మీద ధ్యాస నిరంతరం ఎలా వుంచుకోవాలో అర్థమైంది.

ఈ ఆశ్రమంలో చెప్పవలసిన విద్య "ప్రాణవిద్య" – దీనికి గురుదేవులు వ్రాసిన17వ వాఙ్మయము "ప్రాణశక్తి ఒక అమూల్యమైన విభూతి" ఇక్కడి పాఠ్యపుస్తకము. శ్రీమతి పార్వతి, శ్రీసుబ్బారావుగార్ల కృషి ఫలితంగా ఈ శిబిరం ఎంతో క్రమశిక్షణతో, సాధనలతో, మాస్టర్‌గారి ప్రవచనాలతో, సముద్రస్నానాలతో జీవితంలో మరచిపోలేనంత ఆనందంగా గడిచింది.

## ఋషిప్రణాళికా అవతరణ కూటమి

2000 సంవత్సరం నుండి మాస్టర్‌గారు భూమిపై అవతరించిన ఋషుల ప్రణాళికలను సాకారం చేయటానికి రకరకాలు ప్రయోగాలు చేయడం అందరికీ అనుభవైకవేద్యమే. జూన్ 24వ తేదిన సప్తఋషి ఆశ్రమంలో సాధకులనందరినీ సమావేశపరచి ఒక సుదీర్ఘమైన ప్రణాళికను అందించటం జరిగింది. ఆ ప్రవచనంలో వారు 'మీ అంతట మీరే స్వయంగా బాధ్యతను తీసుకోవాలి. ఎవ్వరూ మీకు ఇలా చెయ్యాలని ఆదేశాల నివ్వరు. ఋషి అవతరణ జరిగింది. అంటే ఋషి ప్రణాళికలో మీరు భాగస్వాములైతే తప్ప ఆ అవతరణ ఎలా జరిగిందో మీకు అర్థం కాదు. కనుక నేను–వశిష్ట, కశ్యప, అత్రి, విశ్వామిత్ర, గౌతమ, జమదగ్ని, భరద్వాజ–ఈ సప్తఋషుల పేర్ల మీద 12 మినిస్ట్రీలను వేసి వాటికి సంబంధించిన బాధ్యతలను మీకు అప్పగించాను. అయితే ఆ బాధ్యతలను మీరెంత వరకు పూర్తి చేశారనేది నాకు కావాలి. క్రిందటి రామ నవరాత్రులప్పుడు మీచేత ఆదిత్యహృదయ పారాయణ, రామరక్షాస్తోత్రపారాయణ (1999) లను దివ్యాస్త్ర ప్రయోగంగా చేసి మీకు సర్టిఫికెట్లు ఇచ్చాము.

ఋషి ప్రణాళిక అవతరణ జరిగాక వేర్వేరు స్థలాలలో అంటే కాకివాయి, వేటపాలెం, నంబూరు, ఓడరేవులలో ఆశ్రమాలు స్థాపించాం. అన్నింటికీ ట్రస్టులు పెట్టాం. దీని అర్థం ఏమిటంటే ఋషి ప్రణాళిక అవతరణ కూటమికి నా వైపు నుండి నేను నిరంతరం కృషి చేస్తూనే ఉన్నాను. అయితే ట్రస్టులకు తగిన వాతావరణం రాలేదు. నాకు భగవంతుడే కావాలి అనే వారు మాత్రమే నాకు కావాలి. మీ ఆలోచనలు ఇక్కడ పనికిరావు. ప్రతి ట్రస్టుకు ఒక లక్ష్యం పెట్టాను. నాకెవరూ సహాయం చేయడం లేదు, అనుకోకుండా నాక్కావలసిన వనరులన్నీ గురువులే ఇవ్వాలి అని అనుకోకుండా, అలాంటి ఆలోచనలు కూడా రాకుండా పని చెయ్యండి. గురువేదో చేస్తాడని మాత్రం అనుకోవద్దు.

"VIBGYOR VEDIC TRUST INTERNATIONAL" దీన్ని బాగా సక్రియంగా (యాక్టివేట్) చేస్తాం. దీనికి అనుబంధంగా మిగిలిన ట్రష్టులన్నీ కలిసి పనిచేయ్యాలి. జమా, ఖర్చుల వివరాలు ప్రతి నెలా పంపే ఏర్పాటు చూడండి.'అని చెప్పారు.

### అసలు ఏ లక్ష్యాలను సాధించేందుకు ఋషి ప్రణాళిక అవతరణ కూటమి ఆవిర్భవించింది?

అనేకమంది భవిష్యత్ ద్రష్టలు గత ఆరు శతాబ్దాల నుండి రానున్న ఈ రెండు సంవత్సరాలలో అనేక అద్భుతాలు జరుగనున్నాయి అని తెలుపుతున్నారు. ప్రకృతి ఎంత అనుకూలించినా, వాతావరణము ఎంత సహాయకారిగా ఉన్నా, మానవ ప్రయత్నము లేకపోతే కాలపురుషుడు తాను సాధించదలచుకున్న మార్పులను సాధించటానికి అనేక కఠిన చర్యలు తీసుకోవలసివుంటుంది. అలా కాకుండా సమస్త మానవాళి ప్రేమతో, ఆనందంతో రాబోయే నూతన మార్పులను పరిపూర్ణమైన ఆదరణతో స్వీకరిస్తే మహాకాలునకు, అతని అనుచరులకు మార్గం సుగమమౌతుంది.

21వ శతాబ్ది–ఉజ్జ్వల భవిష్యత్తు అని చాటి చెప్పిన పూజ్యగురుదేవుల భవిష్యత్ కథనము – కేవలం మూడు లక్ష్యాలను సాధించటం వల్ల మాత్రమే సాధ్యమౌతుంది.

**1. వసుధైక కుటుంబకం:** ఏ విధమైన భౌగోళిక ఎల్లలు లేకుండా భూమి అంతా ఒకే రాష్ట్రంగా జీవించగలగడం, వనరులను అందరూ సమానంగా ఉపయోగించుకోవటం.

**2. ఒకే ధర్మం:** మానవ శరీరము, సూర్యకిరణములు.

**3. ఒకే భాష:** మౌనం

పై లక్ష్యాలు సాధించటానికి ప్రపంచములోని శిష్యపరంపర అంతా కూడా సమూహాలుగా ఏర్పడి ఆచరించడానికి ఏర్పరచుకున్న కొన్ని మార్గదర్శక సూత్రాలే ఈ "ఋషి ప్రణాళిక అవతరణ కూటమి". భారతీయ ఋషులు ఇచ్చిన ఆధ్యాత్మికవిద్యలో నిజంగా అర్థం కావల్సిందేమిటంటే దాని వలన వచ్చే లాభమేమిటి? అనేది.

**భారతదేశం యుగయుగాలుగా సమస్త విశ్వానికి అన్ని రంగాలలోనూ మార్గదర్శనం చేస్తూనే ఉన్నది. ఇంకా చేస్తుంది కూడా! దీనికి కారణం భారతదేశానికి ఉత్తరాన గల పావన హిమాలయాలే! ఈ హిమాలయం ఎందరో దివ్యాత్మలు, మహాత్ములు, దైవీ ప్రణాళికతో సంబంధం ఉన్న దివ్యపురుషుల సిద్ధక్షేత్రం, ఆవాసమందిరం, అంతర్గత వ్యవస్థ, పార్లమెంట్ గల భూలోక స్వర్గం. దేశాన్నే కాదు, యావత్ప్రపంచానికే మార్గదర్శనం చేయగల 'జన్యువులు' భారతీయ శరీరాలలో ఉన్నాయి. విజ్ఞాన రంగంలో అద్భుతమైన ఉన్నతిని సాధించి ఆర్థికంగా ఎదిగిన విదేశీయులు కూడా శాంతి, సహజీవన రహస్యం తెలుసుకోవడానికి భారతదేశానికి శరణాగతిని పొందారని యుగాయుగాల నుండి చెప్పుకుంటున్న అనేక గాథలు చెప్తున్నాయి.**

**ఋషిమయ జీవనం ప్రపంచానికి మార్గదర్శనం చేయగల శక్తిని ఇస్తుంది. పావనగంగ ప్రవహించే దివ్యస్థలం మన భారతదేశం. మృతాత్మలకు ముక్తి నిచ్చే పావనగంగ భారతదేశములో మాత్రమే ఉన్నది. జగద్గురువైన శ్రీకృష్ణపరమాత్మ గీతామృతాన్ని ప్రపంచానికి ప్రసాదించింది కూడా ఇక్కడే! అతీంద్రియజ్ఞానాన్ని అనుభూతి చెందిన మహనీయులెందరో ఈ భాగవత మార్గాన్నే విశదీకరించారు. చనిపోయినవారిని బ్రతికించే సంజీవనీవిద్య భారతీయ ఋషుల సొంతం. అద్భుతమైన వాక్‌శక్తితో అంతర్గ్రహాలలో జరిగే మార్పును ముందుగానే తమ దివ్యదృష్టితో గమనించిన రాజర్షులు ఈ దేశాన్ని రక్షించారు.** వారు దివ్యత్వము యొక్క శిఖరాలను అందుకోవడమే కాక; రాజ్యాన్ని కూడా సుభిక్షముగా పరిపాలించారు. పూర్వం ఒకసారి అంతర్గ్రహాలలో జరిగే మార్పులను గమనించిన వేదజ్ఞులు దశరథమహారాజు వద్దకు వెళ్ళి "రాజా! శనిగ్రహం రోహిణీ నక్షత్రంలో ప్రవేశించబో తున్నాడు. అలా జరిగిన పక్షంలో పన్నెండు సంవత్సరాలపాటు క్షామం తప్పదని" చెప్పగా దశరథుడు రథారూఢుడై వెళ్ళి శనిగ్రహాన్ని ఎదుర్కొన్నాడు. అలా దేశానికి సంభవించబోతున్న ఉపద్రవాన్ని నివారించాడు.

భూభారాన్ని భరించలేని భూదేవి మొర విన్న ఋషులు, దివ్యాత్మలు విరాట్ పురుషుడిని భూమి మీదకు దిగమని ప్రార్థిస్తారు. ధర్మస్థాపనార్థం అవతరిస్తానని భగవంతుడు మాట ఇచ్చాడు.

అయితే పరమాత్మ అవతరణకు సిద్ధంగా లేని భూమిని, కుసంస్కారాలతో నిండిపోయిన ఈ వాతావరణాన్ని ఋషులు తమ వాక్‌శక్తి నుపయోగించి "యజ్ఞమాధ్యమం"తో భగవంతుని అవతరణకు అనుగుణంగా మార్చివేశారు. నిశ్శబ్దంగా రాక్షసచర్యలు, పైశాచికశక్తులు నిరంతరం విజృంభిస్తున్నటువంటి విపత్కర పరిస్థితులలో కూడా ఎన్నో శ్రమలకోర్చి వారు అనంతుడిని మానవశరీరధారిగా దింపి ధర్మస్థాపనకు పూనుకున్నారు.

కాలక్రమంలో యవనులు భారతదేశంలో కాలుపెట్టారు. అప్పటి నుండి వ్యక్తులు స్వార్థపూరిత రాక్షసి కోరలలో చిక్కుకోవడానికి అలవాటు పడ్డారు. దాంతో దేశం పరతంత్ర పాలనకు లోనైంది. ఇటువంటి పరిస్థితులలో గతకాలపు శక్తులను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలను ఋషులు దివ్యగ్రంథాలలో నిక్షిప్తం చేశారు. ఈ యుగాంత సమయము, నూతనయుగారంభ సమయంలోని ఈ యుగసంధి కాలంలో ఋషులు తిరిగి **ఆ దైవీవిద్యను, ఆ వాక్శక్తి రహస్యాలను, అంతర్గ్రహ ప్రమాణ సాధనాలను భూమాత కందించటానికి ఆతురత పడుచున్నారు.** ఋషుల ప్రణాళికలనర్థం చేసుకున్న మహాత్ములందరూ అప్పటికే మౌనంగా గుప్తసాధనా జగత్తులోకి వెళ్ళిపోయి తమ కాలాన్ని సక్రమంగా వినియోగించుకున్నారు. (ఒక సమర్థరామదాసు, శ్రీరామకృష్ణపరమహంస, శ్రీఅరవిందో, శ్రీరమణమహర్షి, శ్రీ విద్యారణ్యస్వామి... ఇలా ఎందరో మహనీయులు). గురుస్థాయి వ్యక్తులకు విశ్వమానవుల పట్ల ప్రేమ అధికము. అందుకే వారు సమయమాసన్నమైనప్పుడు కోట్లాది మానవులనుద్ధరించే ప్రయత్నం చేస్తారు. మనమందరము ప్రస్తుతం అలాంటి కాలంలో వుండడం మన పూర్వజన్మ సుకృతం. గురుసత్తాకి మనపై గల అవ్యాజ కరుణ వలననే పరమ ప్రేమావతారులైన మాస్టర్‌గారి వాణి ద్వారా ఈ మాటలు, ఈ సాధనల ప్రణాళికలు మనకు బోధపడుతున్నాయి.

**భారతీయ ఋషులిచ్చిన ఆధ్యాత్మికవిద్య వలన మనకేమిటి లాభం అని గదా మన ప్రశ్న:**

ఏదైనా ఒకటి తెలుసుకోవాలంటే విషయపరిజ్ఞానం మనకు చాలా అవసరం. భౌతిక వేషభాషల ఆకర్షణల్లో జీవిస్తూ అదే ఆధ్యాత్మికత అనే భ్రమలో, అంధత్వములో ఈనాటి మానవజాతి మ్రగ్గి పోతోంది. గ్రుడ్డివాడు-గుడ్డివాని సాయంతో విశిష్టతను ఎలా సాధించగలడు? గుడ్లగూబ సూర్యుడిని చూడలేదు కదా! కాబట్టి ఆధ్యాత్మికత అంటే ఏమిటి? ఇది మానవునికేమి ఇస్తుంది? అంటే జనన-మరణ చక్రాన్ని తొలగించి, అమృతవిద్యను ప్రసాదించి, మానవుడిని చిరంజీవిగా నిలుపుతుంది!

ఇదే భారతీయ ఆధ్యాత్మికత! కాలానుగుణ్యంగా పంట పండించుకోవడమనేది తెలివైన రైతు లక్షణం.

ఇలా కాలమనే భగవద్దత్త వరాన్ని ఉపయోగించుకోగలిగే సాధకులందరూ ఈ ఋషి ప్రణాళికా అవతరణ కూటమి అందిస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలి అంటే ఆచరణ కావాలి. దానికి పూజ్యశ్రీ మాస్టర్‌గారు కొన్ని బాధ్యతలను అందించటం జరిగినది.

ఒకటి – బాధ్యతగా పని చెయ్యాలి. అంటే ప్రాణాలు పోయే క్షణం వరకూ ఆ పని మీరు చెయ్యాలి.

రెండు– ఋషుల కార్యక్రమాల కోసం నేను వెళ్తున్నాను. మీరు సహకరిస్తారా, లేదా? అనేది మీ ఇష్టం.

మూడవది – మూడు శక్తి కేంద్రాలు అభివృద్ధి చెందాలి. (1) సూర్య (2) చంద్ర (3) అగ్ని. ఈ శక్తి కేంద్రాలు ఎలా వృద్ధిచెందుతాయనేది నాకు తెలియదు. కానీ అవి శక్తికేంద్రాలు కావాలి. దానికి తపస్సు కావాలి. యుగయుగాల నుండి ఆధ్యాత్మికత యావత్తూ సూర్య, చంద్ర, అగ్నివిద్యల పైనే ఆధారపడివున్నది. సైన్సుకు ఎలాగైతే లాబోరేటరీ (పరిశోధనశాల) కావాలో అలానే ఆధ్యాత్మిక విద్యకు కూడా 'సుక్షేత్రము' యొక్క ఆవశ్యకత ఉన్నది. గురుసత్తా ఆదేశానుసారం అగ్నివిద్య, సూర్యవిద్యకు క్షేత్రాలు ఏర్పాటైనాయి. (2000 సంవత్సరం నాటి మాట)

## సూర్య, చంద్ర, అగ్నివిద్యల ప్రతిష్ఠాపన

**అగ్నివిద్య:** అగ్నివిద్యకు సంబంధించిన పరిశోధనలు శ్రీహంసరామ ఆశ్రమము–కాకివాయిలో జరుగుతున్నాయి. స్మర్తుగామి సిద్ధక్షేత్రంలో దానికి తగిన సాధనలు జరుగుతున్నాయి. 1996 వ సంవత్సరంలో వినాయకచవితి పర్వదినాన అఖండ ధుని ఏర్పాటు చేయబడింది. మాస్టర్‌గారు చెప్పిన ప్రకారం ఆరోజున త్రిభుజాకార ధునిని ఏర్పాటు చేసి అందులో అగ్నిని స్థాపించి మాతాజీతో పాటుగా అందరూ అందులోనే యజ్ఞం చేశారు. యజ్ఞసమయంలో తీసిన ఫొటోలలో యజ్ఞకుండం మధ్యలో స్వర్ణవినాయకుడి ప్రతిమ రావడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ రోజులలో కెమేరాతో ఫోటోలు తీసి కడిగి ఫొటోలు ఇవ్వడానికి కనీసం పది, పదిహేను రోజులు పట్టేది. అప్పుడు ఫోటోల్లో ఈ విషయాన్ని చూడడం జరిగింది. నిజంగా ఆశ్చర్యకరమైన విషయమేగదా!

మాస్టర్‌గారికి చెప్పగా వారు చాలా సహజంగా విని ఊరుకున్నారు గానీ దాని గురించి ఏరకమైన విశ్లేషణ చేయలేదు. అంతటి స్థిత ప్రజ్ఞతతో ఉండేవారు.

స్మర్తుగామి సిద్ధక్షేత్రంలో ఉదయం 6.00 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు గాయత్రీమంత్రము. సాయంత్రం 6 గంటల నుండి ఉదయం 6.00 గంటల వరకు షోడశీమంత్ర జపము–అఖండ జపయజ్ఞముగా సాగుతున్నది. అక్కడ సాధనకు కావలసిన సకల ఏర్పాట్లు ఉచితముగానే చేశారు.

**సూర్యవిద్య:** ఆధ్యాత్మికవిద్య అంతా సూర్యుని నుండే పొందవలెనని గీత చెప్తోంది కదా! సూర్యవిజ్ఞాన పరిశోధనా నిమిత్తము గుంటూరు జిల్లా నంబూరు గ్రామ రైల్వేస్టేషన్ వెనుకన గల విశ్వమాత ఎస్టేట్సులో ఒక ఆశ్రమ ఏర్పాటు జరుగవలసివున్నది. అక్కడ 73 చ.అ. వైశాల్యము గల ఒక సూర్యదేవాలయము, నవకుండీయ యజ్ఞపరిశోధనాకేంద్రము, 15 పడకల హోమియోపతి ఆసుపత్రి మరియు ఆయుర్వేద అనుసంధాన కేంద్రముల నిర్మాణానికి ప్రయత్నాలు చురుగ్గా సాగుతున్నాయి. అయితే కాలక్రమంలో వచ్చిన అనేక మార్పుల వలన ఆ సూర్యదేవాలయాన్ని, మాస్టర్‌గారే స్వయంగా గుంటూరు సప్తర్షి ఆశ్రమానికి తరలించి సూర్యసంబంధమైన సాధనా విధానాలను ఇక్కడ ప్రారంభింపచేశారు.

**చంద్రవిద్య:** చంద్రవిద్యకు సంబంధించిన పరిశోధన కొరకు అనువైన ప్రదేశము కొరకు అన్వేషణ జరుగుతున్నది. దానిలో భాగంగా 16 కోట్ల 'శ్రీం' మంత్రలేఖన కార్యక్రమం, ఒక స్థూప నిర్మాణమును చేయుటకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి. తర్వాత కాలంలో రేపల్లె దగ్గర కొత్తపాలెంలో సముద్రతీరప్రాంతంలో అగస్త్యాశ్రమ నిర్మాణము, "శ్రీం" స్థూప నిర్మాణము కూడా జరిగాయి. ఇవి మాస్టర్‌గారు ఆనాటి ప్రసంగంలో ఇచ్చిన క్షేత్ర వివరాలు.

## సెంట్రల్ ట్రస్టు

విబ్జియార్ వేదిక ట్రస్టుకు (1) జ్ఞానసాగర ట్రస్టు, వేటపాలెం, రత్నాకర ట్రస్టు, ఓడరేవు (2) కళానిధి ట్రస్టు, కొత్తపాలెం, (3) ఋతుంభరా పబ్లికేషన్స్ ఇంటర్నేషనల్, పుస్తకము ప్రింటింగు – ఈ మూడూ అనుబంధసంస్థలుగా తీర్మానించారు. చీరాల, వేటపాలెం కలిసి పనిచేయాలి. ఆగష్టు 1వ తేది నుంచి ఆదిత్యహృదయ పారాయణములు అఖండంగా జరగాలి. సూర్యదేవాలయ

నిర్మాణార్థం రోజుకు 108 మందితో ఆదిత్యహృదయ పారాయణలు చేయించాలి. సముద్రపుటొడ్డున గల కోణార్క్ సూర్యదేవాలయం మాదిరిగా సూర్యదేవాలయం రావాలి. తర్వాత వచ్చే రథసప్తమికి 1000 మంది సాధకులతో విశేష సాధనా శిబిరం జరగాలని ఆనాటి ఉపన్యాసంలో చెప్పటం జరిగింది. అయితే కాలక్రమంలో మాస్టర్‌గారు చెప్పినట్లుగా

అగ్నివిద్యకు కేంద్రంగా – శ్రీహంసరామ ఆశ్రమం, కాకివాయి.

సూర్యవిద్యకు కేంద్రంగా – సప్తర్షి ఆశ్రమం, గుంటూరు.

చంద్రవిద్యకు కేంద్రంగా – శ్రీ అగస్త్యాశ్రమం, కొత్తపాలెం. ఈ ఆశ్రమాలు మాస్టర్‌గారు చెప్పినట్లుగా ఎదుగుతూ వచ్చాయి. ఈ ఆశ్రమములన్నీ ఋషుల ప్రణాళికలకు అనుగుణంగా రూపొందించటం జరిగింది. పూజ్యశ్రీ మాస్టర్‌గారి ఆశయాల కనుగుణంగా ఈనాటికీ అవి సక్రమంగా పని చేస్తూ సాధకులకు శిక్షణ నిస్తున్నాయని చెప్పవచ్చు.

## జగద్గురు నవరాత్రి సాధనా శిబిరం

సాధారణంగా ఆషాఢపూర్ణిమను గురుపూర్ణిమ అంటారు. గురుసాంప్రదాయానికి చెందిన ప్రతివారికి ఈ గురుపూర్ణిమ ఎంతో పవిత్రమైనది. పూజ్యులు శ్రీ మాస్టర్‌గారు 2000 సంవత్సరం ఆషాఢపూర్ణిమను "జగద్గురు నవరాత్రి సాధన" అని ప్రకటించారు. గురుచేతనత్వాన్ని ప్రతి వ్యక్తి తమలోకి ఎలా దింపుకోవాలో శిబిరంలో అందించారు. క్రింద ప్రకృతిలో అత్యంత ప్రాచుర్యాన్ని సంతరించుకున్న నవరాత్రులు ఇవ్వబడ్డాయి.

1. రామనవరాత్రులు (ఉగాదినుండి) – ఈ దీక్ష వాక్కుకి సంబంధించినది.

2. గాయత్రీ నవరాత్రులు (జేష్టశుద్ధ దశమి నుండి) – ఇది శ్వాసకి, కాలానికి సంబంధించిన దీక్ష.

3. దేవీనవరాత్రులు (ఆశ్వయుజమాసంలో) – అంతఃకరణ విజ్ఞానానికి సంబంధించిన దీక్ష.

4. సమర్థ సద్గురు దీక్ష – ఆషాఢపూర్ణిమను గురుపూర్ణిమగా యావత్ప్రపంచం జరుపుకోవాలి అనే భావనతో మాస్టర్‌గారు సమర్థ సద్గురు నవరాత్రి దీక్షగా దీనిని ప్రకటించారు. ఇది నిజానికి శ్రీరామకృష్ణపరమహంస సాధన– జయవిజయుల కథ!!

9 రోజులపాటు జరిగిన ఈ జగద్గురు సాధనా శిబిరాన్ని ప్రప్రథమంగా వేటపాలెంలోగల క్షిప్రప్రసన్న దత్తక్షేత్రంలో శ్రీరామకృష్ణపరమహంస సాధనగా మూడు రోజుల పాటు శ్రీవిశ్వనాథ్‌గారు నిర్వహించారు.

మహాషాఢీ గురుపూర్ణిమ కార్యక్రమం "సహ్యాద్రి దత్తాశ్రమం" ఓడరేవులో జరపటానికి శ్రీ సుబ్బారావు దంపతులు ఎంతో వైభవంగా ఏర్పాట్లు చేశారు. పూర్ణిమకు ముందు మూడు రోజుల నుంచే ఒక విశిష్టమైన రీతిలో సాధనలు ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం మహాప్రార్థన, రుద్రాభిషేకం, దాని తరువాత యజ్ఞం చేసేవారు. సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు 'మహాషాఢీ గురుపూర్ణిమ–గోపద్మవ్రతం' అనే విశిష్ట గురుపూర్ణిమ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ శ్రీమాస్టర్‌గారి సారధ్యంలో శ్రీవిశ్వనాథ్‌గారు, నేను నిర్వహించాము.

ఆ రోజు గురుపూర్ణిమ. ఈ పర్వాన్ని పురస్కరించుని సాధకులు యావన్మంది ఆశ్రమాన్ని ఎంతో వైభవంగా అలంకరించారు. నిజంగా ఆ రోజు సాయంత్రం ఆశ్రమ అలంకరణను చూసినవారి జీవితాలు ధన్యమైనాయనే చెప్పాలి. వేలాదిమంది భక్తులు మాస్టర్‌గారికి చేసే గురు పూజను చూడటానికి వచ్చారు. అందరూ అనుకున్నది పూజ్యశ్రీ మాస్టర్‌గారికే గురుపూజ అనుకున్నారు. అందరూ ఊహించిన దానికి భిన్నంగా అక్కడ గురు పూజకు "కాళికామాత సహితంగా వున్న శ్రీరామకృష్ణ పరమహంస, శారదామాతలున్న" ఫొటోను ఎంతో అందంగా అలంకరించి వేదిక మీద స్థాపించారు. ఆ ఫొటోకు ముందుగా మాస్టర్‌గారే పూలమాల వేసి ఎంతో వినయవిధేయతలతో నమస్కారం చేసి తమ ఆసనాన్ని అలంకరించారు. గురుపూజ అంతా శ్రీరామకృష్ణపరమహంసగారి పటానికే చేయించారు. విశేషమేమంటే ఎప్పుడూ జరగని రీతిలో పూజ్యగురుదేవుల అష్టోత్తర శత నామావళిని ఒకరు చదువుతుండగా ఒక్కొక్కరే వెళ్ళి అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తిపుష్పాలను సమర్పించుకున్నారు. కలియుగ వైకుంఠమా? అన్న రీతిలో ఆ గురుపూర్ణిమ జరిగింది. ఈ నవరాత్రులలో పరమహంసమంత్రాన్ని గదా మాస్టర్‌గారు జపము చేయించారు. మరి పూజ కూడా శ్రీరామకృష్ణ పరమహంసగారికే కదా చేయాలి. ఎంతో విధిపూర్వకంగానే కార్యక్రమాలను చేయించారు. అసలు మాస్టర్‌గారి కోరిక ఏమంటే అన్ని నవరాత్రుల మాదిరే గురుపూర్ణిమను – సమర్థ సద్గురు నవరాత్రులుగా ప్రకటించి ప్రతి సంవత్సరం ఆ సాంప్రదాయాన్ని అందరూ అమలుచేయాలనే సంకల్పంతో ఆ కార్యక్రమాలను నిర్వహించారు. (జగద్గురు నవరాత్రులు అనే పుస్తకంలో ఈ శిబిరంలో జరిగిన సాధనలు ఇవ్వబడ్డాయి)

## రామరాజ్యస్థాపన జరుగుతోంది (తిరుమల అశ్వమేధం)

పూజ్యశ్రీ మాస్టర్‌గారు మన ఎదురుగా కూర్చొని ఎన్నో అద్భుతమైన పరమ రహస్యాల నందించారు. వారి నోటివెంట వింటున్న ఆ సమయంలో మనకి అవి అద్భుతాలుగా గోచరించేవి కాదు. అందుకే ఆ విషయాలు పట్ల అంత అవగాహనకానీ, పరిస్థితులు యొక్క ఆవశ్యకత గానీ అర్థమయ్యేది కాదు. కానీ మాస్టర్‌గారు ఇది చెప్పారు చేద్దామనే ఆలోచన తప్ప ఇంకేదీ తోచేదికాదు.

కానీ మాస్టర్‌గారు చెప్తున్న ప్రతీ అక్షరమూ 'వేదం' లాంటిది. ప్రతీ అక్షరమూ, ప్రతీ మాట భవిష్యద్రష్టా స్థితిలో ఉంటూనే చెప్తుండేవారు. ఒక్కొక్కసారి వారు ప్రవచనం చెప్తున్న సమయంలో శ్రద్ధగా వారి వంక చూచినట్లైతే ఆ 'డివైన్ డీసెంట్' యొక్క తీవ్రత కనిపిస్తుండేది. ఆ స్థితిలోనే వారు 2000 సంవత్సరం నాటికి ఎదురు చూచిన అద్భుత సంఘటన జరిగి పోయిందనే ఘాటైన సత్యాన్ని చెప్పారు.

1988 నుంచి 2000 సం॥ వరకు యుగసంధి కాలమని గురుదేవులు ప్రకటించారు. ఆనాటి నుంచి అత్యంత తీవ్రగతితో మాస్టర్‌గారు చేపట్టిన కార్యక్రమము గానీ, చేయించిన సాధనలు గానీ, ఏర్పాటు చేసిన ఆశ్రమాలు గానీ, సహస్రకుండీ యజ్ఞాలనుండి ఇవన్నీ ఆ దివ్యసత్తా ఆవిర్భావం కోసం ప్రకృతిని సమాయత్త పరచటానికి చేసిన ప్రయత్నాలే. అనుకున్నట్లుగా 2000 సంవత్సరం నాటికి ఎదురుచూచిన అద్భుతసంఘటన జరిగిపోయింది. ఎంత నిశ్శబ్దంగా జరిగిపోతుందో, ఎలాంటి సందడి సంబరాలు లేకుండానే ఆ అద్భుతం జరిగిపోయింది.

2000వ సంత్సరానికి ప్రపంచం ఎదురు చూచిన ఆ అద్భుత సంఘటన జరగటం వలన రాబోయే 20, 30 సంవత్సరాలలోనే అతి స్పష్టంగా శ్రీరామరాజ్యస్థాపన జరుగుతుంది. ఇది భవిష్యవాణి కాదు. జరగబోయే ఒక నియతి. రామరాజ్యస్థాపన జరుగుతుంది, శ్రీరామరాజ్య స్థాపన జరుగుతుంది, దానిని మనం గమనించాలి. ఆ విశేష పరిస్థితుల గురించి మనం చర్చించు కుంటూ సప్తఋషి ఆశ్రమం యొక్క కార్యప్రణాళికను నిర్ణయించుకుంటూ, ఆ ప్రణాళికను తొందరగా పూర్తి చేసి ప్రపంచానికి చెప్పగలగాలి. ఆ ప్రణాళికను ప్రజలు పాటిస్తారా, లేదా అనేది మనకు అనవసరం. పని మాత్రం చేసి తీరాల్సిందే !

ఎప్పుడైనా వాతావరణంలో మార్పు తేవటానికి రెండు విశేష ఉద్దేశ్యాలతో అవతారం దిగి వస్తుంది. 1) దుష్ట శిక్షణ 2) శిష్ట రక్షణ. ముందు దుష్టులను ఏరిపారేస్తారు. ఆ తర్వాత శిష్టులను

రక్షిస్తారు. ఈనాటి దుష్ట శిక్షణ కార్యక్రమం పూర్తైంది. పురాతన కాలంలో అశ్వమేధ యజ్ఞాలు ఎప్పుడు జరిగాయనేది కనుక మనం గమనిస్తే ఒక ఖచ్చితమైన సత్యం మనకి కనిపిస్తుంది.

అదేమిటంటే ఆసురీసంహారం జరిగిపోయాక వాతావరణంలో ఏర్పడిన అలజడిని, కాలుష్యాన్ని నిర్మూలించటానికి అశ్వమేధ యజ్ఞాలు జరిగాయి. రావణ సంహారం తర్వాత శ్రీరాముడు వశిష్ఠ మహర్షి ఆదేశానుసారం పది అశ్వమేధయజ్ఞాలు చేశాడు (కాశీలోని దశాశ్వమేధ ఘాట్ అదే). మహాభారత యుద్ధం జరిగిన చాలా కాలానికి అర్జునిని వారసుడు బభ్రువాహనుడు అశ్వమేధయజ్ఞం చేశాడు. అందుచే ఏ మాత్రం తెలివితేటలు వున్నా 2001 డిసెంబరులో తిరుపతిలో అశ్వమేధ యజ్ఞం జరగటం వలన ఏ కల్కి అవతారం కోసం మనం ఎదురు చూస్తున్నామో అది జరిగిపోయిందే మోనన్న అనుమానం మనకు రావాలి గదా! గమనించుకోవలసిన విషయం ఇది. కలియుగాన్ని అంతం చేసి రామరాజ్య స్థాపన చేస్తాడని ఏ అవతారమూర్తి కొరకు మనం ఎదురు చూస్తున్నామో ఆ అవతారం రావటం తన ప్రణాళికలో సగభాగంగా అయిన దుష్టశిక్షణ అనే పనిని ముగించు కోవటం పూర్తిచేసింది.

సశరీరంగా భౌతికంగా ఉంది. ఇది అందరూ అర్థం చేసుకోవాలి. మీరు మీ తెలివి తేటలను ఎంత ఉపయోగించినా ఆ అవతారమూర్తిని గుర్తించలేరు. అవతారమూర్తి సశరీరంగా ఉన్నా సరే మనం గుర్తించలేము. రావణ సంహారమైనాకనైనా శ్రీరాముడు అవతారమూర్తి అని ఎంత మంది గుర్తించారు? మహాభారతంలో శ్రీకృష్ణుడు అవతారమూర్తి అని ఎంత మంది గుర్తించగలిగారు ? మరి ఆయనను గుర్తించే విధానాలేవీ లేవా, అంటే ఉన్నాయి. **అంతఃప్రేరణ ద్వారా మాత్రమే తెలుస్తుంది.**

దుష్టశిక్షణ తర్వాత అవతారము యొక్క రెండవ పని ఏమిటంటే - శిష్టరక్షణ. సాధు, సత్పురుషులకు కావలసిన వాతావరణాన్ని ఏర్పరచటం. కానీ ఆ వాతావరణం కేవలం సాధు సంతులకి ఏర్పడుతుంది తప్ప అందరికీ ఏర్పడదు. మీరు కూడా సాధువులుగా మారితే, ఆ వాతావరణంలో, ఆ సమాజంలో ఉంటారు. కానీ మనమెవ్వరం సాధువులం కాలేకపోతున్నాం. ఎందుకలా ? ఎందుకంటే మనం ఏ గురువు దగ్గరికెళ్ళినా కోరికలతోనే గదా వెళుతున్నాము. అదే ఋషులు ఎవరినైనా వరాలు కోరినట్లు ఎప్పుడైనా విన్నారా ?

మరి కోరికలు కోరటం తప్పా అంటే తప్పు అనడం లేదు. గురువులు మీరు కోరినవన్నీ ఇస్తున్నారూ అంటే మీ నుండి ఏదో ఆశిస్తున్నారేమో ఆలోచించండి. ఒక అద్భుతమైన సమాజంలో మిమ్మల్ని సభ్యులను చేయడానికి మీలో గల మూడు శక్తులను లేపాలని గురువులు కోరుకుంటున్నారు.

అవి 1) సృజనాత్మకత: గురుర్బ్రహ్మా

2) సద్వినియోగం: గురుర్విష్ణుః

3) నిస్వార్థపరత్వం: గురుర్దేవో మహేశ్వరః

గురువులు ఎంత ప్రయత్నించినా, మనుషులకెంత చెప్పినా ఈ మూడు శక్తులు వారిలో మేల్కొనలేక పోవటం వలన మూడు విచిత్రమైన రోగాలు మానవ జాతిలో ప్రవేశించాయి...

అవి 1) కేన్సర్ 2) డయాబెటీస్ 3) హార్ట్ఎటాక్

గమనిక: ఈ రోగాలు రాకుండా ఉండేందుకు ఒక మార్గముంది. 1) సమయదానము 2)అంశదానం 3) ప్రతిభాదానం అనే మూడు పనులు చేయడం వలన ఆ విశేష శక్తులను మీ అంతట మీరే మీలో జాగృతం చేసుకోవచ్చు. పూజ్యశ్రీ పండిత శ్రీరామశర్మఆచార్యగారు పెట్టిన పేర్లు ఇవి. ఈ మూడు దానాలు ఎక్కడ ఉపయోగపడతాయో చూచుకొని అక్కడ వాటిని నాటుకోవాలి.

**ఎ. సృజనాత్మకత – సమయదానము చేయటం వలన సృజనాత్మకతను జాగృతం చేసుకోవచ్చు.** సృజనాత్మక శక్తి అంటే మట్టిని ముట్టుకున్నా అది బంగారమౌతుంది. అది లేకపోతే బంగారాన్ని ముట్టుకున్నా అది మట్టి అవుతుంది. కాలాన్ని సద్వినియోగపరుచుకోవడం కంటే పెద్ద సృజనాత్మకత ఎక్కడా ఉండదు. **ఎంత గొప్పవాడైనా సకాలంలో చేస్తేనే దాని ఫలితం వస్తుంది. అలా చేయకపోతే మీ శ్రమంతా వృధా అవుతుంది.** ఇప్పుడు అవతారమూర్తి స్వయంగా భూమ్మీద ఉన్నప్పుడు మీరు కాలాన్ని సద్వినియోగం చేయలేకపోతే మీలో కేన్సర్ ప్రబలుతుంది. అందుకని నేను పదే పదే చెప్పేదేమిటంటే కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. ఏ పనినైనా సకాలంలో చెయ్యండి.

**బి.పరిపాలనా శక్తి – అంశదానమును సద్వినియోగం చేయటం చాలా అవసరం** : పరిపాలనా శక్తి అంటే పాలించే శక్తి . వనరులను సద్వినియోగం చేసే శక్తి. మానవజాతిని గురు చేతనత్వం వైపుకు నడిపించడానికి గురువులు కనిపెట్టిన రెండవ రోగం డయాబిటీస్ లేదా మధుమేహం. అంటే మన శరీరంలో శక్తిగా మారాల్సిన షుగర్ శక్తిగా ఉండదు. ఎందుకంటే మీరు శక్తిని

దురుపయోగం చేస్తున్నారు. ప్రాణానికి, ధనానికి అతి దగ్గర సంబంధమున్నది. అంచేత శక్తిని సద్వినియోగం చేయాలంటే ధనాన్ని సద్వినియోగం చెయ్యాలి. అంశదాన రూపంలో మంచి కార్యాలకి ధనాన్ని సద్వినియోగం చేయడం నేర్చుకోవాలి.

**సి. నిస్వార్థత-ప్రతిభా దానము :** ప్రతిభాదానం మనిషిని హార్ట్‌ఎటాక్ నుంచి కాపాడుతుంది. భగవంతుడి ఇచ్చిన ప్రతిభ అది ఏదైనా సరే, దానిని భగవంతుని పొలంలో నాటుకోవడం నేర్చుకోవాలి.

ఈ విధంగా ప్రతి వ్యక్తి సమయదానం, అంశదానం, ప్రతిభా దానాలను మంచి కార్యాలకి వినియోగించాలి. దీని వలన మీకొక అద్భుత రహస్యం బోధపడుతుంది. అదేమిటంటే మీలో ఈ మూడు రోగాలు లేకపోవటం వలన సశరీరంగా ఉన్న ఆ కల్కి అవతారాన్ని మీరు గుర్తించ గలుగుతారు.

గురువుల కార్యక్రమాలలో సహాయపడేటప్పుడు మీరు గుర్తుంచుకోవలసిన మొదటి విషయము గురువులు మీ సేవకులు కారు. మీ కోరికలను తీర్చటానికి వాళ్ళు రాలేదు. గురువు దగ్గర విద్య నేర్చుకోవటానికి వెళ్ళాలనేది మీ అవగాహనకు రావాలి. మీ వ్యక్తిగతమైన స్వార్థ చింతన లేకుండా, ఆ గురువు పనిచేయడానికి సరైన అవగాహన ఉందా? అది ముఖ్యం. రోజుకు 4 గంటలు పాటు మీ స్వార్థ చింతన వీడి, మీ గురువు పని చెయ్యాలనే సంకల్పం ఉండే సమూహాన్ని తయారుచెయ్యాలని కోరుకుంటున్నాను. మీ గురువు ఏమనుకుంటున్నాడో దానిని అర్థం చేసుకొని, దానికి తగ్గట్టు ఇక్కడ అంటే ఈ సప్తఋషి ఆశ్రమంలో మీరు పనిచెయ్యాలి. రాముడి కోసం హనుమంతుడెలా పని చేశాడో, శ్రీకృష్ణుని కోసం ఆయన సహచరులు ఎలా పనిచేశారో, అలా పనిచేసే వాళ్ళు నాక్కావాలి. అలాంటి పట్టుదల కలవాళ్ళకే ఈ సప్తఋషి ఆశ్రమం ఉపయోగపడుతుంది.

**మీ విశేషమైన ప్రతిభను గురువుకి దత్తం చెయ్యండి. కుటుంబాలు కేవలం ఋణానుబంధాలతో ఏర్పడినవే. అది తీరిపోగానే నీవా కుటుంబంలో ఉండలేవు.**

**కానీ జన్మజన్మల నుండి మీతో పాటు ఉండి, రాబోయే జన్మలలో కూడా మీకు తెలిసినా తెలియకపోయినా మీ వెంట ఉండే గురువుకు మీ ప్రతిభను ఇవ్వలేకపోతున్నారు. మీ దగ్గర కాలముంది, ప్రతిభ ఉంది, వనరులూ ఉన్నాయి. వాటిని పరిపూర్ణంగా గురువుకు ఇచ్చేసుకోండి.**

**మీది అనుకునేది ఏదీ మీది కాదు. ఆ భ్రమ నుండి బయటపడితేనే గాని మీరు మీ మొత్తం వనరులను గురువుకు ఇచ్చేయలేరు.**

మీ సమయాన్ని, మీ ప్రతిభను, మీ వనరులను ఎలా సమర్పించుకున్నారనేది ఏ రోజుకా రోజు డైరీ వ్రాయండి. మీ ప్రతిభను ఎలా ఖర్చు పెట్టారు? మీ కాలాన్ని ఎలా ఖర్చుపెట్టారు? మీ వనరులను రోజుకు గురువుకెంత ఖర్చుపెట్టారు? ఇలా బేరీజు వేసుకుంటూ మీరు జీవించగలుగుతే రాబోయే రోజుల్లో ఒక అద్భుతమైన సమాజాన్ని మనం చూడగలము. ముందస్తు సూచన ఏమిటంటే రాబోయే 5, 6 సంవత్సరాలలోనే

1. ఆ అద్భుతమైన సమాజం ఏర్పడబోతుంది.

2. ఇప్పటికే ఆ సమాజం చాలా చోట్ల కార్యరూపం దాలుస్తున్నది.

3. ఆ సమాజం ధనాన్ని ఉపయోగించుకోవడం లేదు. శక్తిని వినియమ ముద్రగా వినియోగించుకుంటున్నది. నేను చెప్పిన మూడు దానాలను ఖచ్చితంగా మీరు చేస్తే, మీరు కూడా ఆ సమాజంలో చేరతారు. ఆ సమాజం ఇప్పటికే ఏర్పడివుంది. అందులోకి మీరు వెళ్ళాలనే కోరికతోనే మిమ్మల్ని ఇంతలాగా ముందుకు తోస్తున్నది. ఆ సమాజంలో మీరేం చెయ్యఖ్ఖర్లేదు. దానికి ఒకే ఒక్క కండిషన్ ఉన్నది.

"నేను" అనేది ఉండకూడదు. కోరికల పరంపర ఉండకూడదు. గురువుకు మీరు సేవ చేయాలి. తప్ప గురువు చేత మీరు సేవ చేయించుకోకూడదు. గురువుల ప్రణాళికనర్థం చేసుకోండి. రాబోయే 8,10 సంవత్సరాలలో నూతన సమాజం ఏర్పడబోతుంది. అందులో మీరు సభ్యులు కాదల్చుకుంటే, ఇప్పటి నుండే దాని కోసం మీరు సిద్ధపడాలి. దాని కొరకు నావైపునుంచి మీకిచ్చే సాధనాలను నేనిస్తాను అని చెప్పారు.

శిష్యులకి శిక్షణ నివ్వటానికి మాస్టర్‌గారు సప్తర్షి ఆశ్రమంలో ప్రతిరోజు ఉదయం 8-10 గంటల వరకు, మధ్యాహ్నం 12-2 గంటల వరకు, సాయంత్రం 4-6 గంటల వరకు పంచకోశ సాధన, షట్చక్రజాగరణ, త్రిగంథిబేధన అనే అంశాలపైన విషయ పరిజ్ఞానంతో పాటు సాధనా విధానాలను అందచేశారు. ఈ సాధనలనెంత ఎక్కువగా చేస్తే అంతమంచిది. దీంతో పాటు "ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం" అనే అష్టాక్షరీమంత్రాన్ని ఆవునేతి జ్యోతి సమ్ముఖంలో చేయండి అని చెప్పారు.

## అధ్యాయం-17

# మాస్టర్‌గారి ఒక లక్ష్యం-పరివ్రాజకులను తయారు చేయడం

2001వ సంవత్సరంలో మాస్టర్‌గారు చాలా స్పష్టంగా వివరించిన విషయమేమిటంటే ఇప్పటివరకు నేను చేసినదంతా పరమ గురువుల ప్రణాళికలను వారి ఆదేశాలు మేరకు నా ఇష్టంతో చేశాను. ఇంక ఇప్పట్నుంచీ నా పనిని ప్రారంభిస్తాను. అసలు నా జీవిత లక్ష్యం పరివ్రాజకులను తయారుచేయుట. పరివ్రాజకులు అంటే తెలుసు కదా అంటూ మొదలుపెట్టి పరివ్రాజకుల లక్షణాలు ఏమిటి? వారి జీవిత విధానమెలా ఉండాలి? దాని కోసమై ఎలాంటి శిక్షణా తరగతులను నిర్వహించ బోతున్నారు అనే విషయమై ఆ రోజు ప్రవచనంలో వివరించారు.

'ఈ పరివ్రాజకా శిబిరంలో మీకు కొన్ని ప్రారంభ విషయాలు చెప్పబోతున్నాను అని చెప్తూ, ముందుగా మీరు మీ మానసిక స్థితిని మార్చుకోనంత వరకు మీరెన్ని సాధనలు చేసినా దేవతలు కాలేరు. మానసిక స్థితి మారడానికి పాటలు వినటం చాలా మంచిది. మానసిక స్థితిని మార్చగలిగే కొన్ని పాటలను ఎంపిక చేసి వాటి ద్వారా పరివ్రాజకులకు శిక్షణ నిచ్చే నూతన విధానాన్ని మాస్టర్‌గారు ప్రారంభించారు. ఈ పరివ్రాజక శిబిరాలలో మాస్టర్‌గారు కొన్ని ముఖ్యమైన ఎంపిక చేసిన పాటల ద్వారా పరివ్రాజకులను చైతన్యవంతం చేయటానికి రాత్రిపగలు కృషి చేశారు. మొత్తం మీద ఒక్క క్షణం కూడా వృధా పోనీయకుండా 1) ధ్యానస్థితికి ఉపన్యాసాలు 2) శాంత స్థితికి సోపానాలు 3) దీక్షా విజ్ఞానము అనే విషయముల మీద ప్రవచనములనందించటం జరిగింది. మొదటగా అసలు పరివ్రాజకులైనవారు ఏమి చెయ్యాలి. 2001 మార్చి 4వ తారీఖు నుంచి ఈ శిక్షణ తరగతులను నిర్వహించారు. మొట్టమొదటిగా

## ధ్యానము యొక్క లక్ష్యం

ధ్యానము గురించి అనేక మందికి అనేక రకాలైన సందేహాలుంటాయి. కాబట్టి ధ్యానం గురించి అవగాహన చేసుకోవటానికి మొదట ప్రయత్నం చేద్దాం అంటూ ప్రారంభించారు.

ధ్యాన స్థితిలో భగవంతుని యొక్క లక్షణాలన్నీ కూడా మనలో ప్రతిబింబించాలి. ఇంజనీరింగ్ కాలేజిలో ఒక ఇంజనీర్ అయిన వాడు ఎలా ప్రవరిస్తాడో, అలా ప్రవర్తించటానికి కావాల్సిన

జ్ఞానమునందచేస్తారు. అలానే ఒక డాక్టర్ కావాలంటే అందకు తగిన జ్ఞానాన్ని అందజేస్తారు. అదే విధంగా ధ్యానములో నీవే సాక్షాత్ పరమాత్మవలె ప్రవర్తించటానికి కావలసిన జ్ఞానమును సంపాదించుకోవాలి. ఇక్కడ మీకీ తరగతులు ఏం నేర్పుతున్నాయంటే ధ్యానములో నువ్వే పరమాత్మనని ఆలోచించాలి, అలా ప్రవర్తించాలి. అయితే దానికి కావలసిన విద్య 'అంతరంగం' నుండి రావాలి. అంతరంగంలో నుంచి నీకు ప్రబోధం వస్తే, ఆ జ్ఞానము వస్తే నీవు ఒక యోగిలాగా ప్రవరిస్తావు. బాహ్యంగా వినేటటువంటి విషయాల వల్ల అలాంటి ఒక శక్తి, అలాంటి ఒక స్థితి ఉన్నదనేది మాత్రమే అర్థమౌతుంది తప్ప, అదెలా పొందాలో అర్థం కాదు.

కేవలం ఆధ్యాత్మిక ఉపన్యాసాల వలన ఆ జ్ఞానం రాదు. ఆత్మజ్ఞానమనేది యోగవిద్య, ఋతుంభరా ప్రజ్ఞ, అంతఃస్ఫురణ వలన రావాలి. అందుచేత ధ్యాన విధానమంటే అంతఃస్ఫురణను జాగృతం చేసే విద్య. అయితే అంతఃస్ఫురణను మనం జాగృతం చేయగలమా? అంటే దానికి కావలసిన పరిస్థితులను సృష్టించుకోవడమే 'ధ్యానం'. అందుచేత ధ్యానము యొక్క లక్ష్యాన్ని స్పష్టంగా గుర్తుంచుకోండి. ఏంటా లక్ష్యం–అంతఃస్ఫురణ, అంతఃప్రేరణ లేదా Intution. లోపల నుంచి వస్తున్న జ్ఞానం అది. అది ఎప్పుడైతే అలా రావడం మొదలైందో అప్పుడు మీకు శాంతి వస్తుంది. అది రానంత వరకు మీ జీవితాలలో శాంతి రాదు. అది యోగులు మనకు అందచేస్తున్నటు వంటి ధ్యాన రహస్యం.

మీ మనస్సేం బాగోలేదు. బయట నుంచి ఎవరి ద్వారానో సహాయం లభించి, దాని వలన మీకు శాంతి వస్తుందా అంటే లభించదు. బయటి వ్యక్తి అంటే గురువు మిమ్మల్ని ప్రేరేపించగలడు. ఆ దిశలో వెళ్ళేందుకు తగిన ఉత్సాహాన్ని నీకు ఇవ్వగలడు కానీ, ఆ ఉత్సాహాన్ని మాత్రం నీవే తెచ్చుకోవాలి. దానికి యోగులు పెట్టిన పేరు "శ్రద్ధ". ఈ శ్రద్ధ అనేది ఆశ అనే ఒక Intuitian ద్వారా వృద్ధి చెందుతుంది. ఆశ అనేది మీలో ఎంత ఎక్కువ ఉంటే అంత ఫలితమిస్తుంది. ఏంటీ మన ఆశ అంటే సర్వజ్ఞత్వం-సర్వవ్యాపకత్వం-సర్వసమర్థత. ఈ లక్షణాలన్నీ మనలో వచ్చేంతగా మనం మారాలి. ఇది అత్యాశే అని అనిపిస్తుంది. కానీ యోగులు ఏమంటారంటే అది అత్యాశ కాదు అది నీ సహజ ధర్మం, అసలు అలా ఉండకపోవడం అనేదే తప్పు అంటారు.

## భౌతిక శరీరధారి అయిన గురువు మీకు మార్గదర్శి మాత్రమే!

బాహ్యజగత్తులో వున్న గురువు ఏం చెప్పాడో ఆ జ్ఞానం, మీ లోపలికి వెళ్ళిపోయి, లోపలి నుంచి అవసరమైనప్పుడు మీకు సవ్యమైన ప్రేరణను ఇవ్వాలి – అంతఃప్రేరణ కానీ, Intution

కానీ ఎలా వచ్చింది? బయట గురువు చెప్పినటువంటి విషయ అవగాహన వల్ల వచ్చింది. ఆ తరువాత ఆయన అవసరం లేకుండా పరిస్థితులను బట్టి ఏం నిర్ణయించుకోవాలనే శక్తి వస్తుంది. ఇదంతా దేనితో వస్తుంది అంటే ఇంట్యూషన్‌తో వస్తుంది. అంటే ఏమిటి? ఆ సహజ ప్రజ్ఞ మీ అంతట మీరు నిర్ణయించుకునే శక్తి. ఆ శక్తి వచ్చాక కూడా గురువు కావాలనుకోండి, ఆ పరిస్థితి ఎలా ఉంటుందంటే 6, 7 సంవత్సరాలు పాటు ఎం.బి.బి.యస్. చదివి డాక్టర్ అయినవాడు, ఒక కేసు రాగానే మా ప్రొఫెసరుని అడిగి వస్తానంటే రెండో రోజు ఏ రోగీ ఆ డాక్టర్ దగ్గరికి రాడు.

అందుచేత గురువులు చెప్పినటువంటి విషయాలను ఆచరణలో పెట్టడం ఎంతో అవసరం. సాధన చేసుకోవడం నేర్చుకోవాలే తప్ప నిరంతరం వాళ్ళ మీదే మన బరువులు పడేసి జీవించటం కాదు. బయటకొచ్చేశాక గురువు యొక్క శరీరం లేకపోయినా, గురువు ఉంటే ఎలా ప్రవర్తిస్తామో అలా ప్రవర్తించడాన్ని అభ్యసిస్తాము. మొత్తం విద్య ఇంతే. ఏ విద్య అయినా అంతే, చిన్న సవరణ ఏమిటంటే భౌతిక జగత్తులో మీకెంత దగ్గరగా ఉన్న గురువైనా నిరంతరం మీతోనే ఉండడు కదా! కానీ ఆధ్యాత్మిక విద్యలో గురువు నుండి మీరు దూరం కాలేరు. గురువును మర్చిపోవచ్చునేమో కానీ గురువు యొక్క సమక్షము నుండి మీరెక్కడికీ పోలేరు. దానిని అభ్యసించడం ప్రాక్టీసు చెయ్యండి. ఇంక మీకేం కావాలి. అనన్యచింత అంటే ఇదే. ఈ భావభరితస్థితిలో అలా వుంటూ ఏ పనులైనా చెయ్యవచ్చు. అదే మీరు అభ్యాసం చెయ్యాల్సింది.

## అంతర్ యాత్ర

పరివ్రాజకా శిబిరంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు పరివ్రాజకుడైన వాడి మానసికస్థితి, నిరంతరం వారి లక్ష్యం గురించి చెప్తూ అద్భుతమైన ప్రయోగంగా ఈ 'అంతర యాత్ర' సాధననందించారు.

మానవజాతి యొక్క ఆధ్యాత్మిక చరిత్రలో ఒక విలక్షణమైన, అద్భుతమైన ప్రయోగం రూపుదాల్చుకుంటున్నది. దానికి కావలసిన ఏకైక పనిముట్టు అంతరయాత్ర అనే ప్రక్రియ. ఈ సాధనలో మన కళ్ళు లోపల వైపుకు చూడాలి. చెవులు లోపలి నుండి వచ్చేటువంటి ధ్వనిని పట్టుకోవాలి. లోపల మొదలైన ఆ గురుసత్తా కదలికను, స్పర్శను గుర్తించాలి. ముక్కు ఆ గురుచేతనత్వం నుంచి వచ్చేటటువంటి సువాసనలను ఆఘ్రాణించాలి. నాలుక ఆ దివ్యమైనటువంటి రసానుభూతిని ఆస్వాదించి అనుభూతిని చెందగలగాలి. పంచేంద్రియాలు కూడా అంతర్యాత్ర చేయాలి. నిరంతరం ఆ స్థితి అలా ఉండిపోవాలి.

మీరే పని చేస్తున్నా కూడా ఆ స్థితి నిరంతరం అలా ఉండిపోవాలి. మీరు దానిని మరువరు. ఆ జ్ఞానం ఉంటే దాన్ని ఎప్పటికి మీరు మరువరు. ఉదాహరణకు మీకు ఇంగ్లీషు వచ్చు. ఇంగ్లీషు పదం వినగానే మీరు ఆ భావానికి ప్రతిస్పందించగలుగుతారు. తక్షణం ప్రతిస్పందననిస్తుంది మీ జ్ఞానం. ఆ అనన్యచింతను అభ్యాసం చేస్తూ ఒక విలక్షణమైన, అద్భుతమైన ప్రయోగంలో మీరు పాలుపంచుకుంటున్నారు. దానికి మీరు చేయాల్సిన కార్యక్రమాలు కొన్ని ఉన్నాయి.

మీరాబాయి ఆ విద్యలో నిష్ణాతురాలు, తుకారాం ఆ విద్యను చాలా బాగా నేర్చుకున్నారు. అవధూతలందరూ ఈ విద్య యొక్క సజీవప్రతిమలే. కానీ మానవజాతికి పరిణామక్రమం అందచేయబోతున్నటువంటి ఆ విలక్షణమైన అద్భుతమైనటువంటి ప్రయోగంలో (మన జ్ఞానం ఉన్నంత వరకు) వారు పాలు పంచుకోలేదు. కారణం వాళ్ళ పాత్ర వేరు. మన పాత్ర వేరు. మన గురుపరంపర యొక్క పాత్ర వేరు.

మానవుడు విశ్వపరిణామక్రమాన్ని అర్థం చేసుకొని, తాను ఎక్కడ వున్నాడో, అక్కడ బాధ్యతలను పరిపూర్ణంగా చేస్తూ కూడా తాను ఆ స్థితిలో నిరంతరం ఉంటూ అనేకమందిని ఆ స్థితికి ప్రేరేపించుట అనే ప్రయోగం జరుగుతున్నది. లాహిరీమహాశయ దానికి పెద్ద ఉదాహరణ. సి.వి.వి.గారు చాలా పెద్ద ఉదాహరణ. లాహిరి మహాశయులు ఉద్యోగం చేస్తూనే ఉన్నారు. వారికి మిలటరీలో చిన్న ఉద్యోగం. కుటుంబం జరగాలంటే మిలటరీలో స్టోర్‌కీపర్‌గా ఉద్యోగం చేస్తూ కూడా ట్యూషన్స్ చెప్పేవారు ఆయన.

**ఏ స్థాయి వ్యక్తి ఆయన? జగద్గురువు స్థాయి వ్యక్తి. అంటే ఇప్పుడు మీకు ఒక అద్భుతమైనటు వంటి, విలక్షణమైనటువంటి ప్రయోగం చెప్పబడుతోంది. ఇంత ఎందుకు చెప్తున్నానంటే, ఆ స్థితి వచ్చినా మీ భౌతిక జీవితాలలో ఏ మార్పు రాదు. కానీ మీ అంతరిక స్థితి మాత్రం సర్వోత్కృష్టమైన స్థితిగా మారుతుంది. ఇంక ఆ స్థితిలో ఏదైనా సంభవమే!** లాహిరీ మహాశయులు కలకత్తాలో ఉద్యోగం చేస్తున్న సమయంలో ఒకసారి ఆయన వాళ్ళపై అధికారి దగ్గరకు వెళితే ఆయన చాలా దుఃఖంగా వున్నాడు. 'ఏమైంది సార్, అలా వున్నారు' అని అడగ్గా 'నా భార్య పని అయిపోయింది' అని దుఃఖించసాగారు. వెంటనే లాహిరీమహశయులు ఉండండి, మీరు బాధపడవద్దు, ఆవిడ వచ్చేస్తోంది. She is on her way to meet you అన్నాడు. ఆవిడ చనిపోతుందని టెలిగ్రాం ఇచ్చారు. మీరేంటిలా చెప్తున్నారు అన్నాడు. "లేదు సార్ ఆవిడ వచ్చేస్తోంది" అన్నారు లాహిరీ

గారు. (పూర్వకాలంలో ఈనాటి కమ్యూనికేషన్ వ్యవస్థ లేదు కదా!) ఇంకో రెండు నెలలు గడిచాక ఏం జరిగింది. లాహిరీ మహాశయులు కాబిన్‌లోకి వెళుతుంటే అధికారిగారి భార్య ఇంగ్లాండు నుంచి వచ్చింది. క్యాబిన్‌లోకి వెళ్తున్న ఈయనను చూసింది 'ఆయనే–ఈ వ్యక్తి' నా దగ్గరకు వచ్చారు. నేను చావు బ్రతుకుల మధ్య ఉంటే వచ్చి నన్ను రక్షించారు. ఇతని వల్లనే నేను బ్రతికానని ఆమె భర్తతో చెప్పింది. అప్పుడు ఆ ఆఫీసర్ గారికి లాహిరీ మహాశయుల పట్ల భక్తి భావం కుదిరింది.

'ఈ విద్య' ఇప్పుడు మీరు నేర్చుకునేటటువంటి విద్య ఆ విద్య అవ్వాలి. అలాంటి వాళ్ళు గురువులు మనకు. మీరు కూడా ఆ స్థితికి వెళ్ళవచ్చు. నేను మీకు ఆ రాజమార్గం చెప్పబోతున్నాను.

## ఆ నిశ్చల మౌనస్థితి

మాస్టర్‌గారు సాధనా విధానంలో ఒక క్రొత్త మలుపును తీసుకువచ్చారు. వారు కొన్ని ముఖ్యమైన తెలుగు సినిమా పాటలను ఎంపిక చేసి వాటిని ఒక క్రమంలో క్యాసెట్‌లోకి ఎక్కించమని చెప్పారు. అవి వేర్వేరు సినిమా పాటలు, వాటిలో గల సాధనా విధానాలు, సమాజానికి వాటి ద్వారా అందుతున్న సందేశాలు, ఆ వ్యక్తిత్వాలు చేసిన త్యాగాలు–అమర జీవులగాధలు–ఇలా రకరకాల చేతనత్వాలను అభివ్యక్తీకరించే పాటలను ఒక పద్ధతిలో (ఆ రోజుల్లో క్యాసెట్లు ఉండేవి) ఒక క్యాసెట్‌లోకి రికార్డు చేయించమని చెప్పారు. (ఈ పనిని సీత చేసింది) తర్వాత పూజ్యగురుదేవుల ప్రజ్ఞా గీతాలు, ప్రేరణాగీతాలు, శ్రద్ధాంజలి గీతాలు వీటిని ఒక క్రమ పద్ధతిలో ఎంపిక చేసి ఏ పాట ఎప్పుడు పెట్టాలో క్లాసుకు ముందు చెప్పేవారు. మాస్టర్‌గారిది బహుముఖీ ప్రజ్ఞ. ప్రతి అణువులోను అఖండత్వాన్ని దర్శించగల శ్రేష్ఠ దైవీచేతనత్వం కలిగినవారు. మానవ రూపంలో వచ్చి మనల్ని ఉద్ధరించటానికి రకరకాల ప్రక్రియలను నిత్యనూతనంగా క్రియమాణంగా చేసేవారు. ఏదేమైనా తన ఆత్మబంధువులు వీళ్ళు. ఏ మార్గంలో వీళ్ళు నా దగ్గరకు వచ్చినా, వీళ్ళకు నేను ఆ రాజ మార్గాన్ని నేర్పించాలి. వీళ్ళు ఈ యుగసంధికాలంలో అత్యంత ఉన్నతస్థితికి వెళ్ళిపోవాలనే ఆర్తి, తపన ఆయనది. నిరంతర అన్వేషణతో అద్భుతమైన సాధనా విధానాన్ని ఆనాటి క్లాసులో ప్రవేశపెట్టారు.

క్లాసుకు ముందు పాటలను 'ప్లే' చెయ్యమని చెప్పేవారు. ఆ పాటలను నేర్చుకుని 'ప్లే' చేసినపుడు వీళ్ళందరూ గొంతు కలపాలనే నియమాన్ని పెట్టారు. అందరికీ వినటానికిది వింతగా

తోచవచ్చు. కానీ ఇందులో ఓ పరమార్థమున్నది. టేపురికార్డులో వస్తున్న పాటను జాగ్రత్తగా గమనించాలి. వినాలి తర్వాత దాంతో కలిసి పాడాలి. ఆ పాటలు పాడటమనేది ఎందుకంటే పాటలు గుర్తున్నంత బాగా, పాటలు మనస్సులోకి చొచ్చుకుపోయినంత బాగా, ఎంత పెద్ద ఉపన్యాసమైనా చొచ్చుకుపోదు. ఇది ఒక రకంగా అంతర్యాత్ర లాంటిది, **అంతర్‌యాత్రకు-తాళంచెవి లాంటిది**

దీని ద్వారా ఆ నిశ్చల మౌనస్థితిని ఎలా పొందగలము? దానికి మార్గమేమిటి అంటే ఆ నిశ్చల మౌనస్థితిని మనం 'రామ' అనే పేరుతో పిలుస్తాం. లాహిరీ మహాశయులు దానిని "కూటస్థం" అనే పేరుతో పిలుస్తారు. పూజ్యగురుదేవులు శ్రీరామశర్మ ఆచార్యజీ దానినే గాయత్రి అనే పేరుతో పిలిచారు. సిక్కులు గురువాణి అన్నారు. బ్లావెట్స్కీ మాత అయితే అందరికి అర్థమయ్యే చాలా దగ్గర భాషలో "ది వాయిస్ ఆఫ్ సైలెన్స్" అంది. మౌనం యొక్క భాష అది. నిశ్శబ్దం యొక్క భాష. దానిని మీరు పట్టుకోవాలి. ముఖ్యంగా మీరు సప్తర్షి ఆశ్రమానికి వచ్చిన తర్వాత అంతా మర్చిపోయి నిశ్శబ్దస్థితిలో ఉండండి. కానీ ఆ నిశ్శబ్ద స్థితిలో ఉంటూ పనిచేయడమనేది క్రొత్తగా పరిచయం చేయబడుతున్నటువంటి సాధనావిధానమని, అద్భుతమైనది మరియు విలక్షణ మైనదని చెప్పారు. ఆ విధానమేమిటంటే ఇదివరకు తపస్సులు చేసి, సాధనలు చేసి ఏ 20 ఏళ్ళకో, ముప్పది ఏళ్ళకో దానిని పొందేవారు. సాయి ఏమన్నారు '12 ఏళ్ళ పాటు నేను, నా గురువును మాత్రమే చూస్తూ కూర్చున్నాను' అని చెప్పారు. అలానే వెంకయ్యస్వామి 13 ఏళ్ళ పాటు తిరిగి, తిరిగి మద్రాస్ హైకోర్టు మెట్ల మీద ఆ స్థితిని పొందారు. మీరు ఏమీ చెయ్యనక్కరలేదు.

మీరు మౌనంగా నిరంతరం ఆ కూటస్థ చైతన్యంలో ఉంటూ, నిత్యకృత్యంలో పనులు చేసుకుంటూ ఉండండి. ఇక్కడ ఉంటూ మౌనం పాటించాలని చెప్పాను గద. ఇక్కడ పరివ్రాజకులున్నారు. వారు చదువుకుంటారని నా పుస్తకాలనన్నింటినీ బయట పెట్టించాను. చదవమని చెప్పాను. 'రామ' ఆజ్ఞను శిరసావహించటం ఇంకా రాలేదు. నెమ్మదిగా అర్థం చేసుకోండి. సరే అసలు విషయానికి వద్దాం. ఆ నిరంతర మౌనస్థితిలో చెప్పింది తక్షణమే చెయ్యగలిగేటటువంటి శక్తిని ముందు మీరు సంపాదించుకోవాలి. అది ఒక ప్రయోగం-ఏది చెప్తే అది తక్షణమే జరిగిపోవాలి. ఎప్పుడో చేస్తానంటే కుదరదు. నేను ప్రయత్నించానండి, కానీ జరగలేదు అంటే మీరు ఆ స్థితిలో లేరు అనేగా అర్థం. తమాషా ఏమిటంటే మీరు అన్నమాటకు కావలసిన వనరులు

మీ దగ్గరకు కొట్టుకొని వస్తాయి. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మనం ఆ స్థితిలో ఉన్నామా, లేదా? అన్న దానికి పరీక్ష, నిరూపణ ఏమిటంటే మీ ఆలోచనలకు, కోరికలు అనుగుణ్యమైనటువంటి పరిస్థితులు వాటంతట అవే కొట్టుకొని మరీ వస్తాయి మీ దగ్గరకు. ఈ సందర్భంలో సుకృతవిల్లాలో జరిగిన ఒక సంఘటన చెప్పాలి. సప్తర్షి ఆశ్రమం నిర్మాణం చెయ్యాలంటే కేవలం సుకృతవిల్లా ఇల్లు సరిపోదు. మాస్టర్‌గారింటి ప్రక్కన గల రెండు స్థలాలను (ఇప్పుడున్న సప్తర్షిఆశ్రమం) కొనుగోలు చెయ్యాలనే సంకల్పం మాస్టర్‌గారికి కలిగింది. కార్యకర్తలను సమావేశపరచి విషయాన్ని వివరించారు. ముఖ్యంగా డబ్బును ఎలా సమీకరించాలి. దాని మీద కొంత తర్జనభర్జన జరుగింది. విక్రయించేవారు ఎప్పుడూ ఎక్కువ ఎక్కువ లాభం రావాలనే గదా కోరుకుంటారు. మాస్టర్‌గారి మానసిక స్థితి (అఖండ మౌనంలోనే ఉంటున్నారు అంటే కూటస్థ చైతన్యంలో), దాని శక్తి ప్రవాహం గురించి, లోపల జరుగుతున్న అంతర్మథనాన్ని ఎవరు గుర్తించగలరు? బేరసారల గురించిన కథ నడుస్తున్నది. మాస్టర్‌గారు లోపలికి వచ్చి అఖండ దీపం వెలిగించమన్నారు. దానిని ఇంటికి ఆగ్నేయంలో పెట్టించారు. ఇక అక్కడ నిరంతరం శ్రీసూక్త పారాయణ అఖండగా జరిగేలాగా చూడమని చెప్పారు. అలా అని ఇంటినిండా జనం చేరటానికి వీలు లేదు. మాస్టర్‌గారు చెప్పినట్లే గంట లేదా రెండు గంటల పాటు ఒక్కొక్కరు రావడం, పారాయణ చేసి వెళ్ళిపోవడం జరుగుతున్నది. మాస్టర్‌గారిది మాత్రం ఆ 'నిరంతర మౌనశాంత స్థితే' అదే ఆయన శక్తి. ఆ శక్తే ఆ రోజున ఆ స్థలానికి తాళం తెరిపించింది. అంతే ఆ స్థలాన్ని ఆశ్రమానికి మనకు అనుకూలమైన ధరకు విక్రయించటానికి ఆ స్థలం యొక్క యజమానులు తమ అంగీకారాన్ని తెలిపారు.

మాస్టర్‌గారి అంతరంగంలో జరుగుతున్న ఈ సాధన ఎవరికైనా తెలుసా! ఏమో మరి. సరే అసలు విషయానికి వద్దాం. **సాధనలో ఏ విధమైనటువంటి కోరికలూ, ఆలోచనలూ లేనటువంటి మానసిక స్థితిని మీరు పొంది ఉండగలిగితే అన్నీ మీ వైపు ప్రవహిస్తాయి. ఏ కోరికలు లేని మానసిక స్థితిని మీరు తెచ్చుకోగలిగితే ఏమౌతుంది. అన్నీ మీ వైపుకు వచ్చేస్తాయి. అతి సులభమైన కిటుకు ఇది.** దీనికి వేదాంతమేమీ అక్కరలేదు. అవగాహన ఉంటే చాలు. అంటే ప్రకృతి నియమాల యొక్క ప్రగాఢ అవగాహన. ఆ శూన్య స్థితిని గురించి 'బుద్ధ భగవానుడు' నిర్వాణం అన్నారు. కోరికలను తీర్చేటటువంటి స్థితి అది. దానిని ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా చెప్తారు కాని ఆ స్థితి ఇంత సులభమని మనకు అర్థం కాదు.

అదొక మానసిక స్థితి. ఆ మానసిక స్థితిని మీరు కళ్ళు మూసుకొని ప్రయత్నం చెయ్యండి. ఏమని ప్రయత్నం చేస్తారు? ఖాళీగా ఉండండి అంతే. దానికి ప్రయత్నం ఏం చెయ్యాలి. శాంతం–శాంతం–శాంతం దాంట్లోనుంచే సర్వజ్ఞత్వం, సర్వవ్యాపకత్వం సర్వసమర్థత అన్నీ వచ్చేస్తాయి. అర్జునునికి శ్రీకృష్ణుడు చెప్పిన స్థితి ఇదే! చలించకండి. నిష్కంపస్థితి, పరమ శాంత స్థితి.

ఒకసారి అనీబిసెంట్‌కు, హిమాలయాలలో ఉన్న ఆమె గురువు ఆమెకు ఈ ప్రక్రియను నేర్పుతున్నాడు. ఆవిడ లండన్‌లో ఉన్నది. గురువుగారు హిమాలయాలలో ఉన్నారు. అక్కడ నుంచి ఎలా నేర్పుతున్నాడు అని అడగకండి. నేర్పుతున్నాడు. ఆవిడ ఒక ప్రశ్న అడిగింది. 'లండన్‌లో విపరీతంగా రైయిట్స్ జరుగుతున్నాయి. నేను వీధిలోకి వెళ్ళాలంటే ఎలా! వెళ్తే ఏమౌతుంది' అని అడిగింది. గురువు ఏం చెప్పాడు 'నీవు పరమ శాంతి స్థితిలో ఉండు. నిష్కంప స్థితిలో ఉండు' అన్నాడు. అదే స్థితిలో నేను వీధిలోకి వెళితే ఇంకేమైనా వుందా అంది. దానికాయన "వెళ్ళిచూడు" అన్నారు. అంతే ఆమె వెళ్ళింది. ఆమె ఉన్న వైపుకు, నాలుగు వైపుల నుంచి 10 మంది రౌడీలు వచ్చి ఆమెపై దాడిచేసి కర్రలతో ఆమె నెత్తిమీద కొట్టారు. ఆవిడక్కడ లేదు. ఆవిడ ప్రక్కవీధిలో తేలింది. అంటే సశరీరంగా ఏమైందీ? నిజంగా జరిగిన సంఘటన ఇది. నిజంగా మీరు కనుక ఆ మానసిక స్థితిలో నిరంతరం ఉండగలుగుతే ఏ బాణాలు మిమ్మల్ని ఏమీ చెయ్యలేవు. అంతే రహస్యం, ఆ శాంత స్థితిలో ఉంటూ పని చెయ్యగలగాలి. ఆ పరమ శాంత స్థితిలో ఉండటం పెద్ద కష్టమైన పనేమీ కాదు. పరివ్రాజకులుగా వచ్చిన మీరు అలా ఉండిపోండి. అదే మిమ్మల్ని ముందుకు లాగుతుంది.

అందుచేత సకాలంలో నేర్చుకున్న విద్య ఫలిస్తుంది. ఇది సకాలమని చెప్తున్నాను. ఎందుకు అంటే ఈ విద్య, ఈ ధ్యాన స్థితి మహామహులకే దక్కలేదు. కాని మీకు ఎందుకు వస్తుంది అంటే సకాలంలో వింటున్నారు కనుక. అది మీ అదృష్టం. కానీ అభ్యసించాలి. విన్నాం కదా అంటే కాదు. అభ్యాసం–అభ్యాసమెలా చెయ్యాలో అందరికి అర్థమైంది కదా. ఇంక నిరంతరం ఆ 'శాంత మౌనస్థితిలో' ఉండండి. అలా ఉండగలగబట్టే అక్కడ ప్రహ్లాదుడికి ఏమైంది. క్రింది పద్యంలో అంతావుంది. అర్థమైంది గదా

**పానీయంబులు త్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్**
**హాసలీలానిద్రాదులు సేయుచున్, దిరుగుచున్, లక్షించుచున్**

**సంతత శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం**
**ధానుడై మఱచెన్ సురారి సుతుడేతద్విశ్వమున్ భూవరా ॥ భాగవతం ॥**

మీరే పనైనా మంచి నీళ్ళు త్రాగుతూ ఉండచ్చు, తింటూ ఉండచ్చు, సంభాషణ చేస్తూ ఉ ఒడవచ్చు. ఏం చేస్తున్నా వాడే స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని మీరు అభ్యాసం చేస్తే ఏమౌతుందో అప్పుడు మీకే అర్థమౌతుంది.

## చేతనత్వంలో మార్పు ఎలా వస్తుంది

మాస్టర్‌గారు సాధకులకు ఈ విషయం చెప్పారు. ఆ విషయం చెప్పాలని కాకుండా సాధనల్లో వుండే సకల మర్మాలనన్నింటినీ ఒక క్షణం వృథాపోకుండా చెప్తుండేవారు. ఏ సాధనకాసాధనే వజ్రం లాంటిది. కలికితురాయిలాంటిది. ఆనాడు, ఆయన చెప్తుండంగా అలాంటి మహత్తరమైన సాధనలను వినడమే కాక, శక్తివంచన అనేది లేకుండా చేసినవారు ఎంతటి పుణ్యాత్ములో మరి! ఎన్ని జన్మల పుణ్యఫలితం వాళ్ళను ఆ దివ్యాత్మ స్వరూపమైన మాస్టర్‌గారితో కలిసి ఉండేలా చేసిందో అది ఆ గురుదేవులకే తెలియాలి.

ఎండాకాలం సెలవలు ఇచ్చారు. సెలవులే కాబట్టి ఆ సాధనా శిబిరానికి చాలా మంది పరివ్రాజకులు వచ్చారు. ఆ రోజున పూజ్యశ్రీ మాస్టర్‌గారు మానసిక స్థితిని మార్చుకోగలిగిన విద్యను గురించి చెప్పటం జరిగింది.

మానసిక స్థితిని మార్చుకోగలిగేటటువంటి విద్యే శ్రీసూక్తము. ఎలా మార్చుకోవాలి? ఏ చేతనత్వంలోకి వెళ్ళాలి? దానికి ఏ విధానాన్ని అవలంబించాలి? అన్న ఈ ప్రశ్నలకు శ్రీ సూక్తాన్ని అవలంబించి చూడండి. ఆసేతు హిమాచల పర్యంతం ఏ దేవాలయాలలో పూజ జరిగినా అది పురుష సూక్తము, శ్రీసూక్తముతోనే జరుగుతుంది. ఎంతుచేతనంటే అది మనుషుల చేతనత్వమును మారుస్తుంది. చేతనత్వము మారాలి అంటే శ్రీసూక్తంతోనే చేతనత్వంలో మార్పు రావాలి. చేతనత్వమెలా మారాలో చెప్పేదే అకల్ట్ మెడిటేషన్. దానిని మీకు ఇంతకు ముందే చెప్పాను. అసలు శ్రీసూక్తమనేది చేతనత్వమెలా మారాలో చెప్పేటటువంటి సూక్తము. ఇప్పుడు మన ఎదురుగా ఏమున్నది. "A Treatize on white magic" అనే పుస్తకమున్నది కదా! దానిని ఎవరు వ్రాశారో తెలుసుకదా, శ్రీజ్వాలాకూల్ మహర్షి వ్రాశారు! ఆయన శ్రీకృష్ణునికి చాలా సన్నిహితుడు. ఆయన యొక్క సహచరుడు, సహాధ్యాయి కూడా. శ్రీకృష్ణులవారు శరీరం వదిలేస్తున్నప్పుడు వారికి దగ్గరగా

ఉన్నటువంటివారు. అప్పుడు శ్రీకృష్ణులవారు అతనిని ఒక విషయం అడిగారు. నేను వెళ్ళిపోతున్నాను. శరీరాన్ని వదిలేస్తున్నాను. అందుచేత నేను ఇక నుండి భౌతిక శరీరధారులైన వ్యక్తులతో మాట్లాడలేను. రాబోయే రోజులలో నాతో మాట్లాడగలిగేస్థాయిలో మనుషులు వుండరు. నీ యొక్క బాధ్యత ఏమిటంటే ఎక్కడో ఒకడుంటాడు. వాడికి నీవు ఈ విద్యను అందించాలి. దాని కోసం ప్రయత్నం చెయ్యి' అన్నారు. దాని కొరకు జ్వాలాకూల్ మహర్షి ఈ పుస్తకం వ్రాశారు. భగవద్గీతలో ఒక శ్లోకమున్నది.

**అజోఽపిసన్నవ్యయాత్మా భూతనామీశ్వరోపిసన్ ।**
**ప్రకృతిం స్వామధిష్టాయ సంభవాత్మామాయయ ॥**

అర్థం: నేను పుట్టుక లేనివాడిని. నాశరహిత స్వరూపమును కలవాడను. సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికీ స్వకీయమగు ప్రకృతిని వశపరచుకొని నా మాయా శక్తి చేత అవతరించు చున్నాను.

ఈ సంపూర్ణ సృష్టి ఏకరీతిలో నడుచుచున్నది ఈ అఖండచేతనత్వం వల్లనే. ఒంటరిగా జీవించేది రాక్షసత్వం. వ్యక్తిగతంగా నేను ఎదుగుతాను అన్నవాడు ఎప్పటికీ ఎదగలేదు. అలా ఎదిగిన రావణాసురుడు మొదలైన వాళ్ళందరూ ఏమయ్యారు? ఆసురీ ప్రవృత్తులు ఎక్కడోలేవు. వ్యక్తిగత సాధనలతో ఎదగడమనేది ఈ యుగధర్మం కాకపోవచ్చు. సామూహిక సాధనలు అలవాటు చేసుకోండి. దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోండి. ధియో యోనః ప్రచోదయాత్ అంటే అదే !

## సామూహిక దీక్షలు

నేను ఎన్ని సార్లు మీకు చెప్పినా 'ఒంటరిగా చేసుకోకండి. అది చాలా ప్రమాదము అనేగదా! దీక్షలనివ్వటం కూడా శ్రీరామకృష్ణ పరమహంస మార్చేశారు. అసలు దీక్షా విజ్ఞానాన్నే మార్చేసారు. శ్రీరామకృష్ణ పరమహంస దగ్గర నుండే సామూహిక దీక్షలు మొదలయ్యాయి. వ్యక్తిగత దీక్షల విలువ పోయింది. చాలా మంది ఒంటరిగా వచ్చి మాకు మంత్రదీక్ష నివ్వండి అంటారు. అది కోరుకోవద్దు. నేను 5 లక్షల మందిలో ఒకడిగా శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల దగ్గర గాయత్రీ దీక్ష తీసుకున్నాను. మీరు కూడా నారదుడి దగ్గర్నుండి మంత్ర దీక్ష తీసుకోవచ్చు, అయితే నాకిస్తారా? అనే అనుమానముంటే మాత్రం రారు. అందుచేత ఈ దీక్షా విజ్ఞానాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకొని నేను ఇవ్వబోయే దీక్షలను గురించి చింతన చెయ్యండి.

ఈ సామూహికతను గురించి చెప్పిన తర్వాత మాస్టర్‌గారు ఆ సామూహికత వైపుకు ప్రయాణించేందుకు కావలసిన ఒక అద్భుతమైన సూత్రాన్ని అందించారు. పైన చెప్పిన ఆ శ్లోకాన్ని క్లాసులో అందరిచేత పలికించారు. అజోऽపిసన్ అవ్యయాత్మా. ఇందులో చెప్పబడినటువంటి ఆత్మమాయ. ఈ ఆత్మమాయ, ఈ సంపూర్ణ సృష్టిని, ఏ విధంగా మీరు కూడా సృష్టించవచ్చునో చెప్పేదే శ్రీసూక్తం.

మీరు కూడా దేనినైనా ఎలా సృష్టించవచ్చు? సృష్టికి ప్రతిసృష్టి ఎలా చేయవచ్చు అని చెప్పేదే విద్య. అదే శ్రీవిద్య – శ్రీసూక్తము. ఆ విద్యలో నిష్ణాతులు అయినటువంటి భారతీయులు అందరి పేరు ముందు కూడా ఆ డిగ్రీ ఉంటుంది శ్రీ. ఈ శ్రీ అనేది ఒక డిగ్రీ. భారతదేశంలో అందరి పేర్ల ముందర శ్రీ అని ఎందుకు పెడతారో చాలా మందికి తెలియదు. అసలు శ్రీ విద్య అంటేనే ఏంటో తెలియదు. ఈ 'శ్రీ విద్యకు', షోడశ ఉపచార పూజలో ఉన్నటువంటి, శ్రీసూక్తానికి ఉన్నటువంటి సంబంధం కూడా ఎవరికీ తెలియదు. A treatize on white magic అనే పుస్తకంలో దాని గురించే చెప్పబడింది. భగవద్గీతలోని ఆ ఒక్క శ్లోకం అజోపిసన్....... యొక్క వివరణే శ్రీ విద్య. ఆ శ్లోకాన్ని ఎప్పుడు ఎక్కడ కలిసినా అందరూ కలసి ఒకే గొంతులో చదవండి.

## శ్రీవిద్యను నేర్చుకోవటానికి మూడు నియమాలు

శ్రీవిద్యను నేర్చుకోవాలి అనుకునేవారు ఖచ్చితంగా మూడు నియమాలు పాటించవలసి ఉంటుంది.

**మొదటి నియమం:** అదేంటి అంటే గురువు ఎవరూ అన్నది ముఖ్యం కాదు. గురువు చెప్పింది మనం చేస్తున్నామా, లేదా అనేది ముఖ్యం. ఇప్పుడు చెప్పే మాటలను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఈ మాట దగ్గరే సంపూర్ణ భారతీయ గురుపరంపర సర్వనాశనం అయిపోయింది. గురుపరంపర అనేదే లేదిప్పుడు. అసలు గురుపరంపర అంటే ఏమిటో మీకు అర్థమైందా? అదొక పరంపర.

ఒక గురువు తర్వాత మరో గురువు – ఆ గురువు తర్వాత మరో గురువు రావాలి. అలా వారి పరంపర ఆలోచన కొనసాగాలి. ఇప్పుడేమౌతున్నదంటే రామకృష్ణపరమహంస భక్తులు, షిరిడిసాయిని గమనించరు. సాయి భక్తులు శ్రీరామకృష్ణపరమహంసను గమనించరు, కానీ వాళ్ళిద్దరి మధ్య ఉన్న సంబంధం మీకు తెలుసా! శ్రీరామకృష్ణపరమహంస శరీరం వదిలే ముందు సాయి

మూడురోజులుపాటు శరీరాన్ని వదిలివెళ్ళి ఏం చేశారో తెలుసా? వాళ్ళిద్దరి మధ్య జరిగిన ఆధ్యాత్మిక ఒప్పందం మీకు తెలుసా? గురువుల మధ్య అద్భుతమైన సహాయ సహకారాలుంటాయి. శ్రీఅరవిందో శిష్యులకి శ్రీరామకృష్ణపరమహంస అక్కర్లేదు. కానీ శ్రీఅరవిందో అంత గొప్పవాడు అవటానికి కారణం వివేకానందస్వామి. ఆయన జైల్లో ఉన్నప్పుడు వివేకానంద గొంతే ఆయనకు మార్గదర్శనం చేసింది. గురువుల యొక్క ఆ పరంపరను అర్థం చేసుకోవాలి. ఇక్కడ ఎవరు గొప్ప అంటే ఏం చెప్తాం? ఎవరు గొప్ప అన్నది ముఖ్యం కాదు. మీ చేతనత్వం మారిందా, లేదా? అనేది ముఖ్యం. ఆ చేతనత్వం మారేందుకై వాళ్ళు చెప్పిన విధి, విధానాలలో మీరే విధి విధానమైనా ఆచరించవచ్చు. అదీ మొట్టమొదటి సూత్రం. గురువు చెప్పిన విధానము ముఖ్యము. రిపీటెడ్‌గా ఈ భావనను అర్థం చేసుకోండి. ఇది అర్థం చేసుకుంటే తప్ప మీరు శ్రీసూక్తంలోకి వెళ్ళలేరు. అందుచేత మొదట ఏం చెయ్యాలి. గురువు ఎవరన్నది ముఖ్యం కాదు. గురువు చెప్పింది ముఖ్యం. గురువు చెప్పింది చెప్పినట్లు ఆచరించుట ముఖ్యం.

శ్రీరామకృష్ణపరమహంస ఒకసారి కాళికామాత ఆలయపు ట్రస్టీ రాణీ రాసమణీదేవినే చాచి లెంపకాయ కొట్టారు. ఆవిడగారే ఆయనకు ఆ గుళ్ళో పూజారిగా ఉద్యోగం ఇచ్చింది. సరే ఇంతకి ఎందుక్కొట్టారు ఆయన అంటే ఆ రోజు పూజకు వచ్చిందావిడ. పూజకి వచ్చిన ఆవిడ మనస్సు కోర్టుకేసులో ఉంది. 'ఇక్కడ కూడా అదేనా' అని చాచి లెంపకాయ కొట్టారు ఆయన. మరి మనం కూడా అలాంటి తప్పులే కదా చేస్తుంటాము, మనల్ని మనం కొట్టుకుందాం. అలా మనల్ని కొట్టే వాడెవడూ లేడు కదా ! ఆ దెబ్బతో ఆవిడకు తాను చేస్తున్న తప్పు అర్థమైపోయింది, జ్ఞానోదయ మైంది. గురువు కాదక్కడ-గురువు అన్న మాటల సారాంశం, దాన్ని పట్టుకోగలగాలి.

**రెండవ నియమం:** మీకెప్పుడైతే జ్ఞానము వస్తుందో దాంతో బాధ్యతలూ పెరుగుతాయి. దీన్ని బాగా గుర్తుంచుకోవాలి. ఆధ్యాత్మిక జ్ఞానంతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి. అందుకే ఆశ్రమానికి వచ్చి పూజలు, అవి చేస్తూ ప్రవచనాలు వినేవారికి బాధ్యతలు పెరుగుతాయి. మాస్టర్‌గారూ, బాధ్యతలు పెరిగిపోయాయి, పూజా, జపం చేసుకోలేకపోతున్నామని అంటుంటారు. ఆ రెంటికి మధ్యన ఉన్న సంబంధం ఎవడూ మీకు చెప్పలేదు. ఒక డాక్టర్ ఉన్నాడు. అర్థరాత్రి ఫోన్ కాల్ వచ్చింది. అర్జెంట్‌గా ఆపరేషన్ చెయ్యాలి. రమ్మని అంటే ఆయనకున్న జ్ఞానం ఆయనకు బాధ్యతను పెంచింది కదా! అలా ఇక్కడ కూడా ఖచ్చితంగా బాధ్యతలు పెరుగుతాయి. ఆ పెరిగిన బాధ్యతలను నిర్వర్తించుకుంటూ సాధనలను చేసుకోగలిగేటటువంటి తెలివితేటలను సంపాదించు

కోవాలి. శ్రీరామకృష్ణపరమహంస, శిరిడీసాయి, సత్యసాయి వంటి మహాత్ముల జీవితం గమనిస్తే ఆధ్యాత్మికంగా ఉన్నతి సాధించేకొద్దీ, వారి బాధ్యతలు ఎలా పెరిగిపోయాయో తెలుస్తుంది.

**మూడవ నియమం:** నిష్ఠ–సబూరీ. ఈదారి నుంచి భ్రష్టులు కాకండి. ప్రపంచంలో సత్య యుగం నుంచి ఈ కలియుగం వరకు ఎన్ని యుగాలు వెళ్ళిపోయినా, 'ఈ దారే మంచిదైన దారి' అని మహాత్ములందరూ చెపుతున్నారు. ఆ దారి నుంచి చ్యుతులు కాకండి. దానినే నిష్ఠ అంటాం. అదే అచ్యుతస్థితి. తరువాత సబూరీ అంటే ఓర్పు. చాలా మంది 'మరి మేము చాలా సాధనలు చేస్తున్నాము మాస్టర్‌గారు, ఫలితం రావటం లేదు' అని అడుగుతుంటారు. ఫలితం రాలేదూ అంటే మరి ఏం చెయ్యాలి? ఎంత వరకు చెయ్యాలి అంటే – ఫలితం వచ్చేంత వరకు. దానినే సబూరీ అంటారు. ఈ మూడు నియమాలు ఆచరించడంలో అంతరార్థం అర్థం చేసుకోండి. ఆచరించాక మీ జీవితాలలో వచ్చే తేడాను చూడండి. మీకే తెలుస్తుంది.

## ఆధ్యాత్మిక జీవితానికి ఉన్న ఒకే ఒక్కదారి

ప్రతి వ్యక్తి యొక్క చేతనత్వంలో మార్పు తేవాలనేదే మాస్టర్‌గారి తాపత్రయం. ఆ మార్పు ఎలా తేవాలి అనే దానికి రకరకాల మార్గాలను ఆయన ప్రయోగాత్మకంగా చేయటానికి సప్తర్షి ఆశ్రమంలో తత్సంబంధమైన ప్రవచనాలను, ప్రయోగాలను సాధకులకందచేస్తుండేవారు. అందులోని భాగంగానే శ్రీసూక్తం, పురుష సూక్తం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ ఈ రెండు తప్ప ఈ ఆధ్యాత్మిక జీవితానికి ఇంకోదారి లేదని ఘంటా పథంగా చెప్పారు.

దీనికి మీరడిగే ప్రశ్న ఏంటంటే యోగులందరూ దీనిని చదివారా? ఒకవేళ చదివితే ఇంగ్లీషులో చదివారా? సంస్కృతంలో చదివారా? ఎలా చదివారూ అంటే చదివి ఉండవచ్చు, ఉండకపోవచ్చు కానీ నియమాలు గ్యారెంటీగా అవే. నియమాలు మారవు. అది మీరు అర్థం చేసుకోవాలి. ఇందులో పదహారు నియమాలు ఉన్నాయి. షోడశకళాపరిపూర్ణుడు, భౌతిక జగత్తులో ఉండే మానవీయ చేతనత్వ విజ్ఞానంలో పరిపూర్ణతను పొందినటువంటి వాడిని శ్రీ విద్యోపాసకుడు అంటాం. శ్రీవిద్య అంటే అది. షోడశకళాపరిపూర్ణుడంటే ఏమిటి, ఆ షోడశకళలు ఏమిటి? అంటే సూర్యుడికి, చంద్రుడికి మధ్య ఉన్నటువంటి సంబంధం. సూర్యుడికి, చంద్రుడికి మధ్యన ఉన్నటువంటి దానిని అగ్ని అంటాం. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి శ్రీసూక్తంలో 'జాతవేదోమమావహ' జాతవేదుడు అంటే అగ్ని.

**యశ్శుచిః ప్రయతో భూత్వాజుహూయా దాజ్యమన్వహమ్।**
**శ్రీయః పంచదశర్చంచ శ్రీ కామః సతతమ్ జపేత్ ॥**

అంటే శుచిమంతుడవై, ప్రయత్నశీలుడవై అనుదినము శ్రీసూక్తము యొక్క పదునైదు ఋక్కులను శ్రీకాముడైన వాడు నేతితో హోమము చేయుచూ జపించవలయును. శ్రీకాముడు అంటే ఐశ్వర్యం కావాలి అనుకునేవాడు. ఈ పురుష సూక్తము, శ్రీసూక్త నియమాలు, మంత్రాలు మిమ్మల్ని చదవమని, నేను ఎందుకు చెప్తున్నానంటే, ఆ మంత్రాలలో ఉన్న గొప్పతనం ఏంటంటే తెలిసినా, తెలియకపోయినా అవి మీ చేతనత్వంలో మార్పులుతెస్తాయి. అందుకే మాస్టర్‌గారు ఆశ్రమాలలో నియమంగా శ్రీసూక్తం, పురుషసూక్తం, మంత్రపుష్పం ఈ మూడింటినీ విధిగా చదివించేవారు.

ఒకప్పుడు ప్రతి దేవాలయంలోనూ ఈ సూక్తాలను ఉదయం, సాయంసంధ్యవేళలలో చదివే వారు. కనుకనే ఆ ఊరు సశ్యశ్యామలంగా ఉండేది. ఇప్పుడు దేవాలయాలలో ఈ ప్రక్రియ జరగటం లేదు. ఏదో ఒక క్యాసెట్ పెట్టి వెళ్ళిపోతుంటారు. క్యాసెట్ పెడితే ఏమౌతుంది? ఏ విద్యార్థి అయినా పరీక్షకు చదువుకోకుండా, లెక్చరర్ చెప్పిన పాఠాన్ని క్యాసెట్ పెట్టేసి ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటాడా? తిరగడు కదా! మరి ఇక్కడెందుకు ఆ పని చేస్తారు. అందుచేత పురుష సూక్త, శ్రీసూక్తములో చెప్పబడిన విద్యను మీరు అవగాహన చేసుకోండి. శ్రీరామశర్మ ఆచార్య ఎంతటి అద్భుతమైన చేతనత్వం. ఆ అద్భుతచేతనత్వం ఈనాటి ప్రపంచ జనాభా ఎంత వుందో అంతమందికి సరిపోయే గాయత్రీ మంత్రానుష్టానం, కోటానుకోట్ల గాయత్రీ మంత్ర జపం నేను చేసిపెట్టేశానయ్యా అన్నారు. ఇక మనమేం చెయ్యాలి? అంటే డౌన్ లోడ్ చేసుకోవాలి. ఆ దివ్య శక్తిని దింపుకోటానికి నీకూ శక్తి ఉండాలి గదా! భగీరథుడు తపస్సు చేసి గంగమ్మను భూమ్మీదకు దింపే ప్రయత్నం చేశాడు. కానీ ఆ గంగామాత శక్తిని భరించడం ఒక్క శివుని వల్లనే అయిది. అంటే శక్తిని భరించాలంటే మనకు కూడా కొంత శక్తి ఉండాలి. అలాగే గురుదేవులచే పెట్టబడిన గాయత్రీశక్తిని దింపుకునేందుకు మ్యాచింగ్ గ్రాంట్ లాగా మనము రోజుకు దానికి తగ్గ మంత్ర జపం చేస్తేనే అది దిగుతుంది. దానినే నాటు-కోసుకో, నాటు-కోసుకో, నాటు-కోసుకో అన్నారు గురుదేవులు.

భౌతికజగత్తులో శ్రీసూక్త విధానాలు తెలియని వ్యక్తుల జీవితాల వల్లనే భారతదేశం ఇలా ఉన్నది. శ్రీసూక్తమును ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకోండి. మీరు జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మీ జీవితాలలో ఐశ్వర్యం (మన దృష్టిలో ఐశ్వర్యం వేరు) అంటే మీ జీవితాలలో మీరు అనుకున్నది

అనుకున్నట్లుగా చేయగలిగారా? ఆలోచించి చెప్పండి. శ్రీసూక్తం పని చేస్తుంది అన్నదానికి ఈ ఆశ్రమమే నిదర్శనం. ఇంకా ఈ ఆశ్రమంలో చాలా నిదర్శనాలు ఎన్నో వున్నాయి.

1) సాయినాథుని విగ్రహం ఎన్నాళ్ళల్లో వచ్చింది? అనుకున్న వారానికల్లా వచ్చింది. మామూలుగా అయితే కనీసం 6 నెలలైనా పడుతుంది కదా.

2) వేంకటేశ్వరస్వామి విగ్రహం.

3) దత్తస్వామి విగ్రహం. ఇవన్నీ ఎలా వచ్చాయో మీరు చూశారుగదా! ఇదంతా చూచినా ఈ సూక్తాలు, వాటి పవర్ ఎలా పని చేస్తున్నాయో, మీకు అర్థం కాకపోతే ఇంక నేనేం చెయ్యగలను.

ఈ సూక్తాలు ఎంతలా పని చేస్తాయో తెలుసుకునేందుకైనా సాధన చెయ్యండి. అసలు ప్రయత్నించి చూడండి. మాకు చాలా సమస్యలున్నాయండి, అవి తీరాక నేర్చుకుంటామంటారు. కానీ ఒక్కమాటలో చెప్పాలంటే అసలు సమస్యలనేవి లేకుండా జీవించటానికి ఇవి నేర్చుకోండని చెప్తున్నాను. సమస్యలు తీరాక ఇంక అసలు మీకివేవీ అక్కర లేదు. వ్యక్తిగతంగా మీరీ విద్యను నేర్చుకోలేరు. విద్యనెప్పుడూ సామూహికంగానే నేర్చుకోవాలి. అలా సామూహికంగా నేర్చుకోని విద్య ఎందుకూ పనికి రాదు. ఋషులు ఎప్పుడూ ఏడు,ఏడు సమూహాలుగానే కలిసి వుంటారు. వారినే సప్తఋషులు అంటారు. కేవలం వారు ఏడుగురు కాదు. ఏడు సమూహాలు కలిసి వుంటాయి. అంత ఏకత్వం రావాలి. అలా ఉంటూ ఎవరి పనిని వారు చేసుకోవటం నేర్చుకోవాలి. ఒకరి పనిని ఇంకొకరు చేశారా, అనే అనుమానం రాకూడదు. అప్పుడే ఏడు రంగులు కలిసిన ఒకే ఒక్క సూర్యకిరణమౌతుంది. నేను చెప్పిన రెండు పుస్తకాలను చదివేసి మాకంతా వచ్చేసిందనే భ్రమలో మాత్రం జీవించకండి. (ఆ రోజులలో మాస్టర్‌గారు 1. ఎ ట్రియటీస్ ఆన్ వైట్ మాజిక్. 2. అకల్ట్ మెడిటేషన్ అనే రెండు పుస్తకాలను చదవమన్నారు.) అందులో చాలా విశాలమైన సైన్సు ఉన్నది. ఆ సైన్సులో మీరెప్పుడు నిష్ణాతులౌతారు అంటే మీకీ శ్రీసూక్తం, పురుషసూక్తం అర్థమైతే, అప్పుడు మీకందులో విషయం అర్థమౌతుంది.

వైట్ మ్యాజిక్ అనేటటువంటిది శ్వేతద్వీపంలో ఉండే కొన్ని చేతనత్వాల యొక్క నిత్యజీవిత విధానం. మనం గాలి పీల్చుకుంటున్నాము. మన ప్రయత్నం ఏమీ లేకుండానే హృదయం కొట్టుకుంటుంది. అన్నం అరగటం లాంటి అనేక పన్లు సహజంగానే జరిగిపోతాయి. అలానే

వైట్‌మ్యాజిక్‌లో చెప్పిన సూత్రాల ప్రకారం జీవించేటువంటి వ్యక్తులు నివసించే ప్రదేశాన్ని శ్వేతద్వీపం అంటారు. గురువులందరూ శ్వేతద్వీపం నుంచే వస్తుంటారు. తిరిగి అక్కడికే వెళ్ళి పోతుంటారు. అందుచేత ఈ జీవిత విధానం మీకూ అర్థమైతే మీలో కూడా ఆ గురుచేతనత్వం ఆవిర్భవిస్తుంది. మీకూ ఆ శ్వేతద్వీపవాసులతో చెలిమి ఏర్పడుతుంది. అయితే ఈ గురుచేతనత్వంలోకి రావటానికి ఎన్నిజన్మలు పడుతుందో మనకు తెలియదు. ఈ చెప్పినటువంటి సూత్రాల ప్రకారం జీవించేటటు వంటి వ్యక్తులు నివసించే ప్రదేశాన్ని శ్వేతద్వీపం అంటారు.

ఈ విధంగా పూజ్యశ్రీ డాక్టర్ శ్రీ రామకృష్ణగారు పరివ్రాజకులను తయారు చేయటానికి వారిలో ఉన్న చైతన్యాన్ని జాగృత పరచటానికి రకరకాలైన సాధనా సంపత్తిని అందచేస్తూ అందులోని భాగంగానే 500 మంది సాధకులు ఒకేసారి సాధనలు చేసుకోవటానికి వీలుగా "సప్తఋషి ఆశ్రమాన్ని" రీమోడల్ చేయడం జరిగింది. ఈ రీమోడలింగ్ వ్యవస్థను శ్రీమతి విజయ, శ్రీ విశ్వనాథ్ గార్లు చూచుకునేవారు. నిర్మాణ కార్యక్రమాలు ఒక వైపున జరుగుతూనే ఉన్నప్పటికీ మాస్టర్‌గారు 'సంజీవని' విద్యను 5 రోజుల శిక్షణా శిబిరంలో నిర్వహించటం జరిగింది.

## సప్తర్షి ఆశ్రమము యొక్క లక్ష్యం

సూర్యకిరణ విజ్ఞానము అనగా సూర్యరశ్మిలో గల ప్రధానమైన ఏడు రంగుల గురించి కూలంకషమైన విజ్ఞానమునందించుట. నిత్యజీవితంలో ఆ విజ్ఞానాన్ని ఉపయోగించుకొనుట. ఈ లక్ష్యం కోసమే సప్తర్షి ఆశ్రమం స్థాపించబడింది. తనను తాను తెలుసుకోగలిగే 'ఆత్మవిద్య' ఈ ఆశ్రమంలో నేర్పించే ప్రధాన పాఠ్యాంశము అన్ని విద్యలకు మూలం 'ఆత్మవిద్యయే'. అటువంటి శాశ్వతమైన, సనాతనమైన, నిత్యనూతనమైన విద్యాప్రదాయినిగా 'సప్తర్షి ఆశ్రమం'ను తీర్చిదిద్దాలనేదే మాస్టర్‌గారి లక్ష్యం.

వ్యక్తి తన సాధనా బలంతో, గురువుల అనుగ్రహంతో ఋషి, మహర్షి, రాజర్షి, బ్రహ్మర్షి, దేవర్షిస్థాయిలకు ఎదిగే అవకాశం ఉంది. ఈ 'సప్తర్షి ఆశ్రమములో' ఈ 5 రకాల ఋషి స్థాయిలకు సాధకులు ఎదగటానికి కావలసిన శిక్షణను ఇవ్వటానికి అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి. ఆశ్రమ వ్యవస్థ ఒక దశకు చేరుకున్నది. సాధనా శిబిరాల వ్యవస్థ కూడా క్రమంగా ఒక పద్ధతికి వచ్చేసింది..

ఈ శిబిరాలలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు పతంజలి అష్టాంగయోగము, శ్రీమద్భాగవత సప్తాహములు, నవరాత్రి సాధనా శిబిర నిర్వహణ, పర్వదినాలలో ప్రత్యేక సాధనలు వంటివి ఈ

ఆశ్రమంలో జరిగే నిత్యకృత్యాలని చెప్పవచ్చు. దీంతో పాటుగా దైవీప్రణాళిక, సౌరకుటుంబంలో పృధ్వీగ్రహ పాత్ర, మానవుని కర్తవ్యం, జగద్గురువు శ్రీకృష్ణుని చేతనత్వపు అంశామూర్తులైన గురువుల చరిత్రలు, వారి వారి కార్యప్రణాళికలలోని సమన్వయం, గురుచేతనత్వం, మౌనం, భారతజాతికి 'కర్మ' సిద్ధాంతం ప్రకారం విధిగా నిర్వహించవలసిన కార్యక్రమాలవంటి అమూల్యమైన, గుప్తమైన విషయాల గురించి అఖండజ్ఞాననిధియైన మాస్టర్‌గారు సాధనాత్మక ఉపన్యాసాలనిచ్చేవారు.

ఆయుర్వేద, హోమియోపతిలతోపాటు నేచురోపతిని కూడా జీవితంలో భాగంగా ఎలా చేసుకోవాలో కూడా నేర్పించేశారు. ఇంకా జ్యోతిషశాస్త్రమును సాధనకు ఎలా ఉపయోగించుకోవచ్చునో కూడా ఈ తరగతులలో వివరించేవారు. ముఖ్యంగా ఇక్కడ శిరిడీలో జరిగే మాదిరిగా సాయిబాబాకు ఉదయ, మధ్యాహ్న, సాయంత్ర, రాత్రి సమయాలలో హారతులు, పల్లకీ సేవ, ఊయలసేవ, గురువారాలలో అభిషేకాలు, సాయివ్రతాలు, సాయి చరిత్ర అఖండ పారాయణగా జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారు.

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారు కూడా సప్తర్షి ఆలయంలోకి వేంచేసిన నాటినుండి వారికి నిత్యపూజ, ధూప, దీప నైవేద్యాల పరంపరను ఏర్పాటు చేశారు.

## శక్తి సముపార్జన సాధనా శిబిరం

2001 అక్టోబర్ 17వ తేది నుంచి 26వ తేది వరకు దేవీనవరాత్రులలో శ్రీదేవీమహాత్మ్యంలోని మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతి శక్తుల-బీజమంత్రముల సాధన చేయించి చివరి రోజున పూర్ణాహుతిని ఎంతో భవ్యంగా జరిపించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సాధకులు వచ్చి ఈ శక్తి సముపార్జన శిబిరంలో పాల్గొన్నారు. ఈ మధ్యకాలంలో గాయత్రీ తీర్థము, శాంతికుంజ్ నుంచి ఆంధ్రాలో అశ్వమేధం జరుగుతుంది అనే సందేశం వచ్చింది.

# అధ్యాయం-18
# మేధాజాగరణ శిబిరాలు

1992 వ సంవత్సరంలో మాతాజీ అశ్వమేధ యజ్ఞాల గురించి అఖండజ్యోతి ప్రత్యేకసంచికను ప్రచురించారు. అది చదివిన వెంటనే మాస్టర్‌గారు దానిని తెలుగులోకి అనువదించి ప్రధాన కార్యకర్తలకు పంపించారు. అమలాపురంలో మొట్టమొదటసారిగా, అశ్వమేధాల మీద అద్భుతమైన ప్రవచనాలనిచ్చారు. మళ్ళీ రెండవసారి తిరుమలలో అశ్వమేధయజ్ఞమని ప్రకటించినప్పుడు సప్తర్షి ఆశ్రమంలో మళ్ళీ చెప్పారు. ఎప్పుడు చెప్పినా ఆ ఉపన్యాసాలలో నూతనవైవిధ్యం కనబడుతుండేది. యుగయుగాల నుండి అనూచానంగా వస్తున్న ఈ పరంపర కొనసాగించిన దివ్యాత్మస్వరూపులైన మాస్టర్‌గారికి మాత్రమే అది, అలా చెప్పటం సాధ్యమౌతుంది. అంతరంగం నుండి పెల్లుబికి వచ్చే ఆ జ్ఞానగంగ ఉత్తుంగ తరంగంలాగా ఆంధ్రావనిని పునీతం చేసింది. అలా చెప్పిన ఆ జ్ఞానాన్ని చదివి అనుభూతి చెందాలే గానీ ఇంకో రకంగా దానిని అనుభూతి చెందలేము. అలా అమలాపురంలో చెప్పిన ఉపన్యాసాలకు శ్రీ సీతారాంగారు, గుంటూరులో చెప్పిన ప్రవచనాలకు శ్రీరత్నాకర్‌గారు చక్కటి అక్షరరూపాన్నిచ్చి అందంగా అచ్చువేయించి ఆంధ్రలోకానికి అందించారు.

## అశ్వమేధయజ్ఞం

కలియుగంలో 'శ్రీవేంకటేశ్వరస్వామియే' ప్రత్యక్ష దైవం. ఆంధ్రులకే కాదు సమస్త విశ్వానికి ఆయన ఆరాధ్య దైవం. సర్వపాపాలను హరించువాడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధి తిరుపతిలో డిసెంబర్ 23 నుండి 27 వరకు సీతమ్మ నగర్ ఎం.ఆర్.పల్లిలో పృధ్వీగ్రహంలోని సకల ప్రాణికోటికి ఉజ్వల భవిష్యత్ కొరకు దేవసంస్కృతీ దిగ్విజయయాత్రగా అశ్వమేధం నిర్వహించబడింది. వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత శ్రీరామశర్మఆచార్య, పరమవందనీయమాతాజీగార్ల సంరక్షణలో అప్పటి వరకు 27 అశ్వమేధ యజ్ఞాలు నిర్వహించబడ్డాయి.

దక్షిణ భారతదేశంలోనే ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత పవిత్రపుణ్య స్థలమైన తిరుపతిలో పూజ్యగురుదేవులు, మాతాజీల సూక్ష్మసంరక్షణలో ఈ 28వ "అశ్వమేధ యజ్ఞం" సుసంపన్నం కాబోతుంది. స్వార్థపూరిత ఆలోచనలతో, నేను-నాది అనే సంకుచితత్వం నుంచి

బయటపడి అందరి సుఖంలోనే నా సుఖము ఉండగలదనే ఆలోచనా విధానాన్ని లక్షలాదిమందికి ఒకేసారి "ఈ యజ్ఞంలో" సమర్పించే విశేష ఆహుతుల వలన ఏర్పడుతుంది. తద్వారా నేటి విపత్కర, వినాశకర, విషపూరిత వాతావరణం మారి శాంతి, సహజీవనం నెలకొంటాయి, కాబట్టి ఈ మహాయజ్ఞంలో పాలు పంచుకునేందుకు అందరూ ముందుకు రావాలని మాస్టర్‌గారు తమ సందేశాన్ని న్యూస్ లెటర్స్ ద్వారా అందరికి అందజేశారు.

అశ్వమేధ యజ్ఞ విశిష్ఠతను గురించి గత నెల రోజులుగా ఉదయం, సాయంత్రం వేళలో గురుదేవులు వ్రాసిన 'అశ్వమేధం' ఆధారంగా మాస్టర్‌గారు ఉపన్యాసాలు ప్రారంభించారు. దాంతో పాటుగా ఇద్దరిద్దరు సాధకులను టోలీలుగా తయారుచేసి అశ్వమేధం గురించి ప్రజలను చైతన్య వంతులను చేయటానికి వివిధ ప్రాంతాలకు పంపించటం జరిగింది.

## అశ్వమేధ యజ్ఞం-సహస్రదీప యజ్ఞశృంఖల

ఈ అశ్వమేధ యజ్ఞము జరగడానికంటే ముందుగానే దానికి సరైన వాతావరణాన్ని నిర్మించటానికి సహస్రదీప యజ్ఞ శృంఖల సంకల్పించబడింది. డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారి సూచనల మేరకు తమ తమ ప్రదేశాలలో కార్యకర్తలు ఒక సమూహంగా ఏర్పడి సహస్ర దీపయజ్ఞం చేసే సంకల్పం తీసుకోవాలని అనుకున్నారు. అందుకు తగిన ప్రేరణగాను, సహస్రదీప యజ్ఞ శృంఖలలో భాగంగాను సప్తర్షి ఆశ్రమంలో రెండుసార్లు సహస్ర దీపయజ్ఞాలను నిర్వహించారు.

## అశ్వమేధ యజ్ఞం-రధయాత్ర

ఆంధ్రరాష్ట్రంలో గల అన్ని జిల్లాలలో అశ్వమేధ యజ్ఞానికి నాందిగా శక్తి కలశంతో పాటుగా మాస్టర్‌గారి చైతన్య రధం కూడా అన్ని జిల్లాలో పర్యటిస్తూ కార్యక్రమాలతో పాటు సహస్ర దీప యజ్ఞాలను కూడా నిర్వహిస్తూ డిసెంబరు 22వ తేదినాటికి తిరుపతికి చేరింది. మాస్టర్‌గారితో పాటు నేను, సావిత్రి, సుకృతలు కూడా కార్యక్రమాల నిర్వహణలో సేవలనందించాము.

కలశయాత్ర కంటే ముందుగానే నవంబర్ 5వ తేది నుంచి డిసెంబరు 22వ తేది వరకు తిరుపతిలో సాయంత్రం 3 గంటల పాటు సామూహిక మంత్ర జపాలు చేయిస్తూ, పగటి వేళ తిరుపతి చుట్టు ప్రక్కల గ్రామాలలో అశ్వమేధ యజ్ఞం ప్రచారం చేయుటకు, సాధకులను సమీకరించుటకు మన పరివ్రాజకులు కుమారి యు.రమణకుమారి, శ్రీ శాంతారావు, శ్రీ వెంకటేశ్వర్లు

మొదలైన వాళ్ళు తిరుపతికి వెళ్ళి విశేష కృషిచేశారు. భగవంతుని పనిలో భాగస్వాములై వారు తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు.

## అశ్వమేధయజ్ఞం

శాంతికుంజ్ నుంచి వచ్చిన శక్తి కలశంతో పాటుగా, మాస్టర్‌గారి చైతన్య రథం కూడా బయల్దేరి కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, హైదరాబాదు జిల్లాలో గల శక్తివంతమైన కార్య క్షేత్రాలలో ప్రచార కార్యక్రమాలను చేస్తూ మధ్యమధ్యలో ఎంతో భావభరితమైన ప్రసంగాల ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకువచ్చారు. అసలు అశ్వమేధ యజ్ఞాలు ఎందుకు చెయ్యాలి ? దీని వలన ప్రకృతిలో వచ్చే దివ్యమైన మార్పులు ఏమిటి ? మానవజాతి ఎలాంటి లాభాలను పొందబోతుంది మొదలైన విషయాలను వివరించారు. కార్యక్రమాలు సాయంత్రం వేళల్లో జరిగేవి. మాస్టర్‌గారి ప్రసంగము అయిపోయిన తర్వాత నేను సహస్రదీప యజ్ఞాలను చేయించేదాన్ని. అలా అలా గ్రామాలలో, పట్టణాలలో కార్యక్రమాలు చేసుకుంటూ తిరుపతికి సరిగ్గా యజ్ఞ సమయానికి చేరుకున్నాం.

అఖిల విశ్వ గాయత్రీపరివార్ ప్రతినిధి ఆదరణీయ డా॥ ప్రణవపాండ్యాగారు, శైలాదీదీగార్ల ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా అశ్వమేధ యజ్ఞం మూడు రోజుల పాటు తిరుపతిలో జరిగింది. మొదటి రోజు దేవపూజనం, రెండవ రోజు సంగతీకరణ, మూడవ రోజు దానం. పూర్ణాహుతి కార్యక్రమాలు చాలా క్రమశిక్షణతో దైవీ చైతన్యం తొణికిసలాడే వాతావరణంలో గొప్పగా జరిగింది. యజ్ఞశాలలోకి యజ్ఞాగ్నిని ఆదరణీయ శైలాదీదీ ప్రణవపాండ్యాగారితో పాటు మాస్టర్‌గారు కూడా తీసుకొని వచ్చి యజ్ఞకుండంలో స్థాపించే ఆ దృశ్యం కనులారా చూడాలే కానీ వర్ణించలేము.

వ్యక్తిలో విలువైన సామర్థ్యాలున్నాయి. వీటిని విశ్వకళ్యాణానికి ఉపయోగించుకోవాలంటే ముడి సరుకును శుద్ధి చేసినట్లుగా వ్యక్తిని పవిత్రుణ్ణి చెయ్యాలి. సమాజం కోసం వ్యక్తి ఉపయోగ పడాలి. దానికి వ్యక్తి సంస్కరింపబడాలి. భారతీయ సంస్కృతిలో అలా సంస్కరింపబడటానికి 16 సంస్కారాలు ఇవ్వబడ్డాయి. వీటినే షోడశ సంస్కారాలు అంటారు. సీమంతం, నామకరణ, అన్నప్రాసన, విద్యాభ్యాసం, జన్మదినం, వివాహదినం, ఉపనయనం, వివాహం మొదలైన ముఖ్య సంస్కారాలు చేయుటకు అశ్వమేధ యజ్ఞశాలలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. ఈ సంస్కార మహోత్సవ

కార్యక్రమాలను మనవాళ్ళకు పూర్తిగా తెలుగులో మాస్టర్‌గారే నిర్వహించారు. శ్రీమతి తేజ, జగన్‌ల కుమారుడు చిరంజీవి గార్గేయకు, మరికొంతమంది పరివార్‌పిల్లలతోపాటుగా మాస్టర్‌గారు స్వయంగా ఉపనయన సంస్కారమును సుసంపన్నం చేసి అందరిపై అనుగ్రహ వర్షం కురిపించారు.

గురుదేవులను గర్భందాల్చినప్పుడు వారి తల్లిగారైన దానకువరీదేవికి తొమ్మిదినెలలు తొమ్మిది రకాలైన స్వప్నాలు వచ్చాయి. వాటి వివరణనిస్తూ హిందీ అఖండజ్యోతిలో వ్యాసాలు వచ్చాయి. అద్భుతమైన ఆ స్వప్నాల గురించి మాస్టర్‌గారు అందమైన వివరణనిస్తూ "నేను చెప్పింది మీకు గుర్తుంటే, ఈ కలలను చిత్రీకరించండి. అవి మన సాధనకుపయోగపడతాయి. అలానే పాటగా కూడా వ్రాస్తే ఇంకా మంచిదన్నారు". ఆ మాటలను పదిలంగా గుర్తుంచుకొని శ్రీమతి భానుమతిగారు చక్కటి పాటను వ్రాశారు. అద్భుతమైన భావాలను ప్రకటీకృతం చేస్తున్న ఆ పాటకు అభినయం తోడైతే ఇంకెంత బావుంటుందోనని వారి అమ్మాయి తేజశ్రీ దానిని నృత్యరూపకంగా తయారుచేసి మాస్టర్‌గారి ముందు ప్రదర్శించారు, దానిని 2001 తిరుపతిలో జరిగిన అశ్వమేధయజ్ఞవేదిక మీద రెండవరోజు సాయంత్రం ఎంతో చక్కగా అభినయరూపకంగా ప్రదర్శించి అందరి మన్ననలను పొందారు. అంతేకాదు. **'మూర్తీభవించిన శాశ్వత, సనాతన, నిత్యనూతన సంస్కృతి శ్రీరామశర్మ ఆచార్య'** అను పుస్తకమును ముద్రించారు. దానిలో ఆ మాతృమూర్తి కలలను గురించి వర్ణిస్తూ... పూజ్య గురుదేవుల జీవితము కూడా విపులంగా అందించబడినది. శ్రీమతి సీతామహాలక్ష్మిగారు, శ్రీమతి వల్లీప్రసాద్, శ్రీమతి లక్ష్మీరాజగోపాల్‌లు దీనికోసం శ్రమించారు. అలా గురుదేవుల జీవితం అశ్వమేధయజ్ఞంలో అభినయరూపకంగా అందరి హృదయాలలోకి వెళ్ళిపోయింది. అలా మాస్టర్‌గారు గురుదేవుల గురించి ఎక్కడ ఏ చిన్న విషయం దొరికినా దానిని ఎంతో ఆర్తితో, సమర్పణా భావంతో, ఎంతో హృదయంగమంగా ఏదో ఒకరకంగా అందరికీ అందేలా చేసేవారు.

మూడవ రోజు పూర్ణాహుతి అయిపోయాక అశ్వమేధ యజ్ఞాగ్నిని పదిలంగా ఒక కుండలో భద్రపరచి తీసుకువచ్చి సప్తర్షి ఆశ్రమంలో గల ధునిలో స్థాపించి ఆ ధునిని మరింత శక్తివంతం చేశారు. అలా ఆనాడు మాస్టారు అశ్వమేధయజ్ఞానికి తమ వంతు సేవను చేసి గురుదేవులకు భక్తితో గురుదక్షిణను సమర్పించుకున్నారు. వారితో పాటు కలిసి పనిచేసిన వారికి ఆ భాగ్యాన్ని ప్రసాదించారు. ఈ యజ్ఞ కార్యక్రమం చేసిన తరువాత అందరి జీవితాలలో మునుపటి కంటే శాంతి, సౌఖ్యాలు వెల్లివిరిశాయి,

ఈ అశ్వమేధయజ్ఞ ప్రచారంలో భాగంగా ఒంగోలులో కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలోనే పాండురంగారావు అనే రిపోర్టర్ మాస్టర్‌గారితో అశ్వమేధయజ్ఞం గురించి అన్ని విషయాలు మాట్లాడి న్యూస్ అంతా రాసుకున్నారు. అంతా అయి వెళ్ళేటప్పుడు "మాస్టర్‌గారూ! ఈ యజ్ఞంలో ఇంత విషయమున్నదిగదా, దీని గురించి ప్రజలలో చైతన్యం తీసుకురావాలంటే ఒక పత్రిక ఉంటే బావుంటుంది. కాబట్టి మేధ అనే పేరుతో పత్రికను స్టార్ట్ చెయ్యండి బావుంటుం దన్నారు". ఆ మాటలు పూజ్యశ్రీమాస్టర్‌గారికి బాగా నచ్చి ప్రక్కనే ఉన్న నాకు ఆ బాధ్యతనప్పగించారు. అశ్వమేధ యజ్ఞం ప్రచారసందర్భంలో అలా 'మేధ' పత్రికకు శ్రీకారం చుట్టడం జరిగింది. అలా ఆవిర్భవించిన 'మేధా' పత్రికకు కొన్నేళ్ళపాటు నేను, లక్ష్మీరాజగోపాల్ కలిసి పనిచేస్తూ వచ్చాము. ఇప్పుడు శ్రీమతి విజయావిశ్వనాథ్‌గారు ఎంతో శ్రద్ధతో నడుపుతున్నారు. మాస్టర్‌గారిచ్చిన సందేశాలతో వస్తున్న ఆ పత్రికను పాఠకులు బాగా ఆదరిస్తున్నారు.

## అశ్వమేధ అనుయాజ

మనం ఏదైనా పని చెయ్యాలనుకుంటే దానికి తగిన వనరులను సమీకరించుకుంటాం. వనరులను సమీకరించుకున్న తర్వాత వాటిని ఒక క్రమపద్ధతిలో నిర్మాణాత్మక కార్యక్రమాలకు ఉపయోగించుకుంటాము. ఒక పంచవర్ష ప్రణాళికలో దేశానికి కానీ, రాష్ట్రానికి కానీ ఉపయోగపడే ఒక ప్రణాళికను రూపొందించుటను 'ప్రయాజ' అంటారు. దానికి కావలసిన ఫైనాన్షియల్ గ్రాంట్స్ మొదలైన వాటిని సాధించి, యజమాని దానిని అమలుపరచడాన్ని 'యాజ' అంటారు.

యజ్ఞ పూర్ణాహుతి తరువాత అందులో భాగస్వాములైన వారందరిని తృప్తిపరచుటకు యజ్ఞములో ఉపయోగించబడిన వస్తువులను కొంతవారికి ఇచ్చిన మిగిలిపోయిన వస్తువులను యధాస్థానమునకు చేర్చుట, యజ్ఞము ద్వారా ఉత్పన్నమైన శక్తిని లోకకళ్యాణ ప్రయోజనమునకు ఉపయోగించుట అనే ఈ ప్రక్రియ "అనుయాజలో" కి వస్తాయి.

అశ్వమేధ యజ్ఞములో 'ప్రయాజ'గా దేవసంస్కృతి దిగ్విజయ సాంస్కృతిక యాత్ర చేయబడుతుంది. యజ్ఞసాఫల్యము కొరకు గాయత్రీ ఉపాసన చేసే వ్యక్తులు లక్షల సంఖ్యలో తయారౌతున్నారు. శాస్త్రీయ నియమానుసారము యజ్ఞశాల నిర్మాణము, సుసంస్కారములు గల భావనాశీలుర సహయోగముతో సాధనా సామాగ్రిని సమీకరించుట జరుగుతున్నది.

యజ్ఞము కొరకు కావాల్సిన ఆధ్యాత్మిక శక్తి పూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీ ద్వారా ప్రచుర పరిమాణములో ఉత్పాదించబడుచున్నది. 'అనుయాజ' ప్రక్రియ కూడా చాలా వ్యాపకమైనది. యజ్ఞము ద్వారా సూక్ష్మజగత్ యజ్ఞములో పాలుపంచుకున్న వారందరిలోకి దివ్యశక్తి ప్రవహిస్తుంది. దీని ఉపయోగము మానవజాతి యొక్క ఉజ్వల భవిష్యత్ కొరకు జరుగుతుంది. ఈ ప్రక్రియ దేశ వ్యాప్తంగా నడిపించబడి, విశ్వవ్యాప్త స్థాయికి చేరుకోవాలి. పై ఫలితాలను దృష్టిలో ఉంచుకొని పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఈ మేధాయజ్ఞ శృంఖలల ద్వారా అనుయాజ ప్రక్రియలను యోజనాబద్ధంగా రూపొందించారు.

2001 డిసెంబరు నెలలో గురువుల యొక్క ప్రణాళికలో భాగంగా తిరుపతిలో అశ్వమేధ యజ్ఞము జరిగింది. ఈ యజ్ఞము ఒక మహామార్పుకు నాంది. కాలాన్ని మార్చదలుచుకున్నప్పుడు అశ్వమేధ యజ్ఞమును చేస్తారు. అంతటి విశేషమైన యజ్ఞము ఆంధ్రాలో జరిగినప్పుడు, మన రాష్ట్రము యొక్క బాధ్యత ఏమిటి? దానిని మనం ఎలా ఉపయోగించుకోవాలో తెలియచెప్పడానికే మాస్టర్‌గారు, అశ్వమేధ యజ్ఞము అయిపోయాక అందుండి ఆవిర్భవించిన అనంతమైన దైవీశక్తిని, అనుయాజ కార్యక్రమాల ద్వారా మొత్తం సమాజానికి వితరణ చేయటానికే, 'మేధాయజ్ఞ శృంఖల' అనే పేరుతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో పర్యటించి, ఆ గురుప్రణాళికలో అందరినీ భాగస్వాములను చేయడానికి ఊరూరా సాధనా శిబిరాలను నిర్వహించడం జరిగింది.

అందుచేత అశ్వమేధ యజ్ఞం అయిపోయిన తర్వాత 2002 జనవరి నుంచి అనుయాజలో భాగంగా మాస్టర్‌గారు 'మేధా యజ్ఞ శృంఖల' అనే ప్రణాళికను ప్రవేశపెట్టారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూ శని, ఆదివారాలలో సత్సంగాలు, ప్రవచనాలు, యజ్ఞ కార్యక్రమాల ద్వారా దైవీశక్తిని వినిమయం చేయడం జరిగింది. దాదాపు అన్ని ఊళ్ళల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. గురుసత్తా ఫోటోలను ఐ.డి. కార్డులుగా రూపొందించారు. ప్రతి సాధకుడు దీనిని ధరించి శిక్షణా తరగతులకు రావాలి.

ఈసారి శిక్షణా కార్యక్రమాలలో ముఖ్యంగా 1) ఆసనాలు 2) ప్రాణాయామాలు 3) జపము 4) ధ్యానము. దీనితోపాటు శ్రీమద్భగవద్గీతలోని శ్లోకాలతో యజ్ఞ పూర్ణాహుతిని చేయించటం జరిగింది. ఈ శిబిరాలు దాదాపు రాష్ట్రంలో చాలా ప్రదేశాలలో చేయించి 'అశ్వమేధీయ అనుయాజ' కార్యక్రమాలను ఒక ఒరవడిలోకి తీసుకువచ్చారు.

అందులో భాగంగానే 2002 జూలై 7,8,9 తేదీలలో భీమవరంలో ఈ శిబిరాన్ని స్థానికంగా ఉన్న శిరీష, శ్రీదేవి అచ్చుటి కార్యకర్తలను కలుపుకుని ఎంతో ఉత్సాహముతో ఏర్పాటు చేశారు. ఆ శిబిరంలో సాధకులనుద్దేశించి అనేక సాధనలు ఇంకా అనేక భవిష్య ప్రణాళికలను ఎంతో సుందరంగా వివరించారు. తరువాత కాలంలో గురుశీతారాముడుగారు వీటిని అచ్చువేసి అందరికీ అందించారు.

ఈనాడు జీవిస్తున్న మనమందరమూ కారణజన్ములమే! ప్రణాళికలోని భాగంగానే మనలను ఆయా గురువులు వాళ్ళతో పాటు మనలను పుట్టించారు. శ్రీరామాయణంలో శ్రీరామ, సుగ్రీవులిరువురూ ఒకే విధమైన పరిస్థితులలో అంటే ఇద్దరికీ రాజ్యం పోయింది. ఆ ఇద్దరి భార్యలూ అపహరించ బడ్డారు. ఇద్దరూ వనవాసాలు చేస్తున్నారు. అలాంటి ఇద్దరినీ హనుమ కలుపగా, అదీ అగ్ని సమక్షంలో, అప్పుడు ఇద్దరూ ఒకరికొకరం సహాయం తీసుకుంటామనే సంకల్పం తీసుకున్నారు. ఇక్కడ మనం ఒకటి గమనించాలి. చేతకానివాళ్ళు, సమర్థతలేనివాళ్ళు అగ్ని సమక్షంలో సంకల్పం తీసుకుంటే అది ఖచ్చితంగా నెరవేరుతుంది. సాధారణంగా ఇళ్ళల్లో పూజ చేసేటప్పుడు దీపం వెలిగిస్తాం. కానీ ఆ అగ్నిని ఎలా ఉపయోగించుకోవాలో ఎవ్వరికీ తెలియదు. సరే అసలు విషయానికి వద్దాము. తిరుపతిలో ఒక మహాయజ్ఞం జరిగింది. అది గురువుగారి చేతిలో అశ్వమేధంగా మారింది. తిరుపతిలో జరిగిన ఈ అశ్వమేధ యజ్ఞంలో గురువుగారు మానవజాతికి ఒక దిశ నివ్వడంతో పాటు, విశ్వప్రణాళికలోనే అద్భుతమైన అవకాశాన్ని మానవజాతికి కల్పించారు. ఆ వివరాలను చెప్పి తత్సంబంధిత వ్యక్తులను సమీకరించేందుకే ఈ మేధాజాగరణ శిబిరాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహింపబడుతున్నాయి!

మీరందరూ ఒక విశేష లక్ష్యంతో పుట్టినవాళ్ళు. దానిని గమనించటానికి మీకు కొంత కాలం పట్టవచ్చు. సుగ్రీవుడి దగ్గర పనిచేసినా రాముడితో చేతులు కలిపిన వెంటనే హనుమంతుడి జీవితం మారిపోయింది. ఈ సాధనాశిబిరంలో నేను చెప్పేది ఏమిటంటే మీరిప్పుడెలా జీవిస్తున్నారో అలాగే జీవించండి. మీరున్న చోటనే నేను చెప్పేసాధనలను విస్తృతంగా ప్రచారం చెయ్యండి. ఒక విశేషకార్యక్రమాన్ని ప్రపంచానికందచేయటానికే మీరంతా పుట్టారు. బాధ్యతలనెప్పుడూ గురువులు మీకప్పచెప్పరు. వాటిని మీ అంతట మీరే తీసుకోవాలి.

అశ్వమేధ యజ్ఞం ఎలాంటి పరిస్థితులలో జరుగుతుందంటే రామాయణ కాలంలో రావణ సంహారం అయిపోయిన తరువాత బ్రహ్మహత్యా దోష నివారణార్థం అశ్వమేధం జరిగింది. అందుచేత తిరుపతిలో అశ్వమేధం జరిగింది అంటే అవతారం వచ్చి తన పని పూర్తిచేసుకొని వుండాలి. ఏ అవతారం వచ్చినా అది రెండు పనులను చేస్తుంది. అది ఒకటి దుష్టశిక్షణ, రెండు శిష్టరక్షణ. ఈ రెండూ ఒక రకంగా అయిపోయాయి. అంతే కాకుండా అశ్వమేధం జరిగింది అంటే అవతారమూర్తి ఖచ్చితంగా ఈ భూమ్మీదనే ఉండి ఉంటాడు. గుర్తించగలిగితే గుర్తించవచ్చు.

మాస్టారు ఇలా ఎన్నో విషయాలపై వివరిస్తూ పృథ్వి పై స్వర్గావతరణ గురించి చెప్తూ అలా జరగాలంటే మీరు దేవతలుగా మారాలి. మీరు దేవతలుగా మారాలి అంటే వేదమయ జీవితాన్ని జీవించాలి. అందులో భాగంగా జపం ఎలా చెయ్యాలి, మంత్ర జపం వలన వచ్చే లాభాలు, ప్రాణాయామ, ధ్యానములనెలా చెయ్యాలి, చందనధారణ వలన కలిగే శుభ పరిణామాలేమిటి, నీరును ప్రాణశక్తి అని ఎందుకు అంటారు? ఇలా అనేక అంశాలను గురించి క్షుణ్ణంగా మనస్సుకు హత్తుకుపోయేలా చెప్పడమే కాదు, ప్రాక్టికల్‌గా అందరి చేతా సాధన చేయించటం జరిగింది. వేర్వేరు చోట్ల జరిగిన ఈ శిబిరాలలో శ్వాస మీద ధ్యానము, భారతీయ జీవితవిధానము, పది ఆసనాలు–వాటి భౌతిక, ఆధ్యాత్మిక ప్రయోజనాల గురించి చక్కగా వివరించారు. నిజం చెప్పాలంటే ఎంత కఠినాతికఠినమైన విషయాలనైనా అలవోకగా, అందరికీ ఆచరణయోగ్యంగా చెప్పడమనేది మాస్టర్‌గారిలో గల అద్భుతమైన ప్రతిభ. ప్రతిభే కాదు కళ కూడా!

## పూర్ణిమాధ్యానాల విశిష్టత

అఖండ జ్ఞానసాగరంలో దాగివున్న ఏ ఒక్క సాధన కూడా మాస్టర్‌గారి దృష్టికోణం నుంచి తప్పించుకోలేదు. ఆ రోజులలో మాస్టర్‌గారు జ్వాలాకూల్ మహర్షి వ్రాసిన పుస్తకాలను అధ్యయనం చేస్తుండేవారు. అందులో Externalisatian of Heirarchy – ఋషుల బాహ్యప్రకటీకరణ అనే పుస్తకంలో జ్వాలాకూల్ మహర్షి 'పూర్ణిమ ధ్యానాల విశిష్టత' గురించిన అద్భుతమైన ధ్యాన ప్రక్రియలను వివరించారు. ఆ ధ్యాన ప్రక్రియలనే మాస్టర్ ఇ.కె. గారు 'పూర్ణిమ ధ్యానాలు' అనే పుస్తకంలో ద్వాదశరాసులతో దానిని సమన్వయం చేసి విశిష్టమైన ధ్యాన ప్రక్రియలను ప్రతిపాదించారు. పరిణామక్రమంలో మానవజాతి ఉన్నత స్థాయికి చేరుకోవటానికి ఈ పూర్ణిమ ధ్యానాలు విశేషంగా ఉపకరిస్తాయి. ఈ ధ్యానాలను పరిపూర్ణంగా అధ్యయనం చేసిన మాస్టర్‌గారు ముఖ్యంగా మూడు

పూర్ణిమలను మూడు ప్రత్యేకమైన స్థాయిల్లో మూడు వర్గాలుగా విభజించి విశేష సాధనలను చేయించారు. అప్పటికే సప్తర్షి ఆశ్రమంలో మాస్టర్‌గారు అష్టాక్షరీ మహామంత్రాన్ని పరమ గురువుల ప్రసాదంగా ప్రసాదించారు. ఇందులో 'ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం' అనే ముగ్గురు మహావ్యక్తుల (దైవీ చేతనత్వంగల్గిన) చేతనత్వాలను అష్టాక్షరీమంత్ర రూపంలో ఇవ్వటం జరిగింది.

అందులో మొదటిది సాయి. సాయి సంస్థానంలో ఒక పూర్ణిమ అదే మేషపూర్ణిమకు (మార్చి 21 నుండి ఏప్రియల్ 19వ తేది వరకు) మూడు రోజుల పాటు సాధనజరపాలనీ, రెండో మంత్రము 'వేంకటేశ' దీనిని వృషభ పూర్ణిమకు (2001ఏప్రియల్ 20 నుండి మే 20 వరకు) తిరుమలలో మూడు రోజుల సాధనను మూడవ మంత్రము 'శ్రీరాం'ను శాంతికుంజ్‌లో మిథున పూర్ణిమనాడు (మే 21 నుండి జూన్ 20 వరకు) మూడురోజుల సాధనా శిబిరముగా చేయించాలనే ఒక ప్రణాళికను సిద్ధం చేసి చెప్పారు.

శ్రీ మారెళ్ళ విశ్వనాథ్ ప్రసాద్‌గారు ఈ మూడు పూర్ణిమలను శిరిడీలో, తిరుమలలో యథాతథంగా మాస్టర్‌గారు చెప్పినట్లుగా నిర్వహించారు. శిరిడీలో సాధనా శిబిరాలు జరిగినప్పుడు ప్రక్కనే గల సాకోరిలో గల ఉపాసనీబాబావారి సాన్నిధ్యంలో సాధనలు చేయించారు. బాబా వారు స్వాతంత్ర్య సమర పోరాటం జరుగుతున్న సమయంలో వ్యక్తిగతంగా ఏ ఏ సాధనాలు చేశారో అవన్నీ చెప్పడం జరిగింది. తిరుమలలో సాధన చేస్తున్నప్పుడు తిరుమలలో గల అనేక తీర్థాలను దర్శించడం అలానే అక్కడున్న హాథీరాంబాబా వారి సమాధి దగ్గర రాత్రిపూట సాధనలు చేయించేవారు. తీర్థాలలో తుంబురు తీర్థం వెళ్ళినప్పుడు సాధకులు పొందిన అనుభూతి జీవితమంతా గుర్తుంటుంది. సప్తర్షి ఆశ్రమంలో మిథున పూర్ణిమను చేయించడం పరమాద్భుతం.

## మేధా జాగరణ శిబిరం - శిరిడీ

**అది 2002వ సంవత్సరం. జూన్ 22 నుండి 26వ తారీకు వరకు శిరిడీలో జరిగిన సాధనా శిబిరం**

పూజ్యశ్రీమాస్టర్‌గారు "ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం" అనే అష్టాక్షరీ మంత్రమును ఆవిష్కరించిన తరువాత, దానికి అనుబంధంగా మూడు ముఖ్యమైన మేష, వృషభ, మిథున పూర్ణిమలను 2001 తరువాత మరల తిరిగి శిరిడీలో, తిరుమల, హరిద్వార్ లేదా సప్తర్షి ఆశ్రమాలలో జరపాలని నిర్ణయించారు. అనుకున్న విధంగా జూన్ నెలలో సాధకులందరూ శిరిడీకి చేరారు.

ఐదు రోజుల పాటు జరిగిన ఈ సాధనాశిబిరంలో మాస్టర్‌గారు చాలా అద్భుతమైన పరమ రహస్యాలతో పాటు సద్యఃఫలితాలనిచ్చే సాధనా విధానాలను కూడా అపారమైన కృపాకటాక్షాలతో సాధకులందరికీ అనుగ్రహించారు. 22తారీకు ఉదయం నుండి సాధనా శిబిరం ప్రారంభమైంది. ఆ రోజు సాయిదర్శనమైన తరువాత మధ్యాహ్నం మూడుగంటల నుండి ప్రవచనాలు ప్రారంభించారు.

"రాబోయే పూర్ణిమ ప్రపంచానికే ఒక మహత్తరమైనటువంటి సందేశాన్ని తీసుకువస్తున్నది. ఈ రోజు మనం ఒక విశేషమైన లక్ష్యంతో చాలా మంచి విషయాలను మాట్లాడుకోవాలని వచ్చాము. మనం అనుకుంటున్నది, గురువులు అనుకుంటున్నది సరిగ్గా నెరవేరితే కనుక వచ్చే సంవత్సరంలో వచ్చే ఏప్రియల్, మే, జూన్ పూర్ణిమలు ప్రపంచంలోనే ఒక విశేషమైన పద్ధతిలో జరుపుకోబడతాయి. నా ఈ భవిష్యవాణితో పాటు బాధ్యత కూడా కలిసివున్నది. భవిష్యవాణి ఏమిటంటే ఇది జరుగబోతున్నది అని, బాధ్యత ఏమిటంటే అది జరగడానికి మీరంతా చాలా కష్టపడాలి అని. ఈనాడు కంప్యూటర్‌ను గురించి ఇంత విశేషంగా చెప్పుకుంటున్నాం కానీ అది వచ్చిన కొత్తల్లో కంప్యూటర్ అంటే చాలా హీనభావం ఉండేది. ఈనాటికీ ఇంకా కొంతమందిలో ఈ కంప్యూటర్‌ని ఒక భూతంలాగా, దెయ్యంలాగా సమాజాన్ని నాశనం చేసేందుకే వచ్చిందనే భావన ఉంది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే కొత్తగా మొదలుపెట్టిన ఏ విషయమునైనా ఎదగకుండా చేసే ప్రయత్నాలే ఎక్కువగా ఉంటాయి. ఒక్కసారి అది స్థిరపడి పోయిందా ఇంక దాన్ని పెకలిద్దామన్నా వీలుపడదు. మనం ఈ క్లాసులు ఏప్రియల్ పూర్ణిమ నుండి మొదలుపెట్టాము.

ఏప్రియల్ పూర్ణిమకు హైదరాబాద్‌లో మనం ఈ క్లాసులు జరుపుకుంటున్నాము అని కూడా తెలియనంత నిశ్శబ్దంగా జరుపుకున్నాము. ఎక్కడ జరుపుకున్నామో గుర్తుందా? ఏప్రియల్ పూర్ణిమనాడు హరిద్వార్ వారితో కలిసి వాళ్ళు చేసేటువంటి 2400 దీపయజ్ఞంలో పాల్గొన్నాము. ఆ వేదికను ఉపయోగించుకొని దీన్ని నేను ఓపెన్ చేశాను. అందుకే ఇక్కడ వ్రాసినటువంటి పేర్లలో శ్రీరామ్ అనే పేరు శ్రీరాముడి పేరు కాదు, అది శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల పేరు. అందుచేత అది గురుదేవుల యొక్క ప్రణాళిక. గాయత్రీపరివార్, హరిద్వార్ వారి యొక్క కార్యక్రమాలతో కలిపి ఏప్రియల్ పూర్ణిమను జరుపుకున్నాము.

ఆ తరువాత "మే పూర్ణిమను" తిరుమలలో జరుపుకున్నాము. తిరుమలలో ఉండే క్షేత్రాల పునర్జాగరణ, సిద్ధక్షేత్రాల పునర్జాగరణ లక్ష్యంగా ఈ శిబిరాన్ని జరుపుకున్నాము. అలా ముందుగా

అనుకోలేదు. అసలు తిరుమలకు వచ్చేప్పుడు అనుకున్నది ఒకటి. కానీ అక్కడ జరిగిందేమిటి అంటే తిరుమల కొండలలో ఉన్న 108 సిద్ధ క్షేత్రాలు చాలా గొప్పవి. మనమిప్పుడు శిరిడీకి ఎక్కడ నుండి వస్తున్నాము? తిరుమల నుండి వస్తున్నాము. రాబోయే సంవత్సరానికి మనం కనుక ఈ సిద్ధక్షేత్రాలను గురించి ప్రపంచానికి సరిగ్గా అర్థమయ్యేట్లు చెప్పగలిగితే వేంకటేశ్వరస్వామిని చూడడానికంటే ముందు ఆ క్షేత్రాలకి వెళ్తారు. తిరుమలలో ఉన్న పవర్‌సెంటర్స్ (సిద్ధక్షేత్రాలు) గురించి మాట్లాడుతున్నాను. అలవాటు పడిపోయిన వారికది పవర్‌సెంటర్ అని అర్థం కాదు. భారతదేశంలో ఉన్న మనకు భారతదేశంలో ఉన్న పవర్‌సెంటర్స్ విలువ తెలియదు. సదానందమూర్తిగారి అమ్మాయి మెడిసన్ చదవేందుకు రష్యాకు వెళ్లింది. ఓ రెండు సంవత్సరాల తర్వాత ఇండియాకు వచ్చింది. ఢిల్లీలో దిగగానే నేలమీద పడిపోయి, ఎంత అద్భుతంగా వుంది నాన్నా మన దేశం అంటూ ఆనందపడిపోయిందిట. అలా పడిపోయిన వారిలో మేడం బ్లావెట్స్కీ ఒకరు.

శిరిడీలాంటి ఒక అద్భుతమైన క్షేత్రానికి వచ్చాం. ఈ క్షేత్రం గురించి చెప్తున్నాను. అసలు ఇక్కడ వున్న వాతావరణాన్ని గమనించారా? ఇక్కడ వున్న ఈ దివ్యత్వాన్ని అంతరంగంలోకి దింపుకునే ధ్యానంలో కూడా మీరుండరు. ఇక్కడున్న ఈ వాతావరణం ఎంత గొప్పదంటే సాయిలాంటి ఓ అద్భుతమైన వ్యక్తిని 60 సంవత్సరాలపాటు కట్టిపడేసింది. మరి దాని శక్తి ఎలాంటిదో ఊహించండి. అసలా సాయి ఎవరు? నా సమాధి దగ్గరకు వస్తేనే మీ కోరికలు తీరిపోతాయి అనేటటువంటి ఆ వ్యక్తి యొక్క చేతనత్వంలో ఏం మార్పు వచ్చింది. ఏ మార్పు రావడం వల్ల ఆయన ఆ స్థాయికి ఎదిగారు. అసలు ఆయన పేరు కూడా ఎవ్వరికి తెలియదు. ఈ సాయి అనే పేరును ఖండోబా ఆలయపూజారి ఇచ్చాడు. ఆయన్ను చూస్తూనే 'ఆవోసాయి' అన్నాడు. అంతే అదే ఆయన పేరైపోయింది. ఒక పెళ్ళివారి బృందంతో ఆయన శిరిడీకి వచ్చాడు. అలా వచ్చిన వ్యక్తి ఇక తిరిగి వాళ్ళతోపాటు వెళ్ళలేదు. ఎందుకు వెళ్ళలేదో మీరు చెప్పగలరా? ఎందుకంటే ఆయన గురుస్థానం అక్కడ ఉన్నది. ఆ గురుస్థానము యొక్క శక్తి శిరిడీలో ఉంది. గురుస్థానము అక్కడ ఉన్నవిషయం సాయికి తెలుసు కానీ శిరిడీలో ఉన్నవారికి తెలియదు.

ఒకరోజు ఒక పూనకం వచ్చిన వ్యక్తి ఆ ప్రదేశాన్ని చూపించి త్రవ్వమన్నాడు. అలా త్రవ్వగా లోపల గుహలో ఉన్న నాలుగు దీపాలు కనిపించాయి. అక్కడే ఆయన క్రిందటి జన్మలో తపస్సు

చేసుకున్నారు. అదే చోట ఆయన ఇప్పుడు మళ్ళీ తపస్సు చేసుకున్నారు. ఎలా చేసుకున్నారో మనకు తెలియదు. ఆ ఊరివారి వద్ద భిక్ష తీసుకుంటూ ఆ చెట్లు, తుప్పల మధ్య అలా తిరుగుతూ ఉండేవారు. ఆ తరువాతనే ఇంతమంది కోరికలు తీర్చేటటువంటి టెక్నాలజీని పట్టుకున్నారు. ఆయన మీరిలా చేసుకోండి నాలా అవుతారని ఎప్పుడైనా, ఎవరికైనా చెప్పారా? అలా చెప్పిన సంఘటనలు ఏమైనా ఉన్నాయేమో మనకు తెలియదు. తన గురించి మాత్రం "నా గురువుపై దృష్టి నిలిపి తదేకంగా పన్నెండు సంవత్సరాల పాటు నేను ఆయనను నిరంతరం చూస్తూ ఉన్నాను. అంత ఏకాగ్రతతో గురువుపై దృష్టి నిలిపితేనే నాకు ఈ స్థితి రావడానికి పన్నెండు సంవత్సరాలు పట్టింది." అని ఒక్క సూచన మాత్రమే ఇస్తారు బాబా.

ఒక్క ఉపాసనీబాబాతో మాత్రం 'నీవు ఖండోబా ఆలయంలో ఉండు. భాగవతం చదువుకుంటావో, ఏ సాధన చేసుకుంటావో నీ ఇష్టం. నేను తినే ఆహారమే నీకూ పంపిస్తుంటాను. అది తింటూ నీవు కదలకుండా అక్కడే నాలుగు సంవత్సరాలు ఉండు చాలు, నా స్థితే నీకు కలుగుతుంది, అయితే ఈ నాలుగు సంవత్సరాల పాటు నీవు శిరిడీ పొలిమేరలు దాటి మాత్రం వెళ్ళవద్దు" అని చెప్పారు బాబా. కానీ ఆయన మూడు సంవత్సరాల తొమ్మిది నెలలు మాత్రమే అతి కష్టం మీద శిరిడీలో ఉండగలిగాడు. తర్వాత సాకోరీకి వెళ్లిపోయాడు. అక్కడికి వెళ్ళిన తరువాత ఇంకా చాలా సాధనలు చేసి ఎంతో గొప్ప వ్యక్తి అయ్యారు. ఆయన చాలా అద్భుతమైన వ్యక్తి.

## శిరిడీకి వస్తే కోరికలు తీరుతాయి ఎలా?

మీరు తీర్థస్థానాలకు వెళ్ళినప్పుడు నేరుగా మొదటి దర్శనానికి అలాగే వెళ్ళిపోండి. దాన్నే ధూళిదర్శనం అంటారు. అలా వెళితే ఏదో తప్పు జరిగిపోతుందని భయపడి పోతుంటారు. తప్పు ఏమీ జరుగదు. అలా వెళితే ఇంకా మంచి ఫలితాలు పొందుతారు. మీకు తెలిసినా, తెలియకపోయినా శిరిడీలాంటి సిద్ధక్షేత్రాలన్నీ కూడా మీ శరీరంలో ఉన్నటువంటి షట్చక్రాలను జాగృతం చేస్తాయి. అందువల్ల మీకు ఆ శక్తులు వస్తాయి. ఆ పవర్ వల్ల మీ కోరికలు తీరతాయి. శిరిడీకి వెళ్ళిరాగానే మా పనులు అయిపోయాయి, మా కోరికలు తీరాయి అనుకుంటాము, కానీ అసలు జరిగే పని ఇది. అదీ అక్కడున్న సైన్సు. వేడిగా ఉన్న గదిలో నుండి బైటకు వస్తే మీ శరీరం వేడిగా ఉంటుంది కదా! అదే ఎ.సి. గదిలో నుండి బయటకు వచ్చామనుకోండి శరీరం

చల్లగా ఉంటుంది. అలాగే ఈ సిద్ధక్షేత్రాలకి వెళ్ళినప్పుడు మీ యొక్క షట్చక్రాలు బాగా చైతన్యవంత మవుతాయి. మీరు కనుక చక్రాలను గురించి అధ్యయనం చేయదలుచుకుంటే ఇలాంటి సిద్ధక్షేత్రాలకు వచ్చినప్పుడు ఏ చక్రం కదులుతున్నదో మీరు పట్టుకోగలగాలి. అప్పుడే ఈ క్షేత్ర సందర్శన ఫలితం కలుగుతుంది.

నిజం చెప్పాలంటే తిరుమలలో 360 సిద్ధక్షేత్రాలున్నాయి. అంటే ఒక్కొక్క రోజు ఒక్కొక్క సిద్ధక్షేత్రానికి వెళ్ళినా తిరుమలలోని సిద్ధక్షేత్రాలను చూడడానికే ఒక సంవత్సరం పడుతుంది. ప్రస్తుతం ఆధ్యాత్మిక తత్వవేత్తలు ఈ క్షేత్రాల మీద పరిశోధన చేస్తున్నారు. వాళ్ళు ఏ శక్తినైనా మనం విద్యుత్తుగా మార్చగలమా? అని ఆలోచిస్తున్నారు తప్ప విద్యుత్తును ఇంకో శక్తిగా మార్చగలమా? అనే విషయాన్ని వాళ్ళు ఆలోచించడం లేదు. **కానీ శిరిడీసాయి, వేంకటేశ్వరస్వామి, శ్రీరామశర్మ ఆచార్య ఈ యోగులందరూ కూడా విద్యుత్తును కాంతిశక్తిగా మార్చేటువంటి సాంకేతిక విద్యను తెలిసినవారు అనే విషయం బాగా అర్థం చేసుకోండి.** ఇదే సిద్ధక్షేత్రాలకు వెళ్ళినప్పుడు మనం నేర్చుకోవాల్సిన అతి ముఖ్యమైన విషయం.

**మొదటి అంశం:** సిద్ధక్షేత్రాలకు చక్రాలను చైతన్యవంతం చేసే గుణము ఉన్నది కనుక మీలో అవి జాగృతమైతే మీలో యోగశక్తి ఆవిర్భవిస్తుంది. అలా కుండలినీ శక్తి జాగృతమౌతుంది. కనుకనే మీరు కోరిన కోరికలు నెరవేరుతుంటాయి. శిరిడీ క్షేత్రము ఎందుకు చైతన్యవంతంగా ఉన్నదంటే సాయిబాబా ఇక్కడ చైతన్యముతో ఉన్నారు కాబట్టి. ఈక్షేత్రానికి వచ్చి చాలా పెద్దపెద్ద సాధనలు చేసిన వాళ్ళల్లో వచ్చినంత మార్పు మన చక్రాలలో రాకపోవచ్చు కానీ కనీసం ఓ పది లేక ఇరవై శాతమైనా ఖచ్చితంగా జాగృతమౌతుంది. మీకు తెలిసినా, తెలియకపోయినా అవి జాగృతమౌతాయి. దాన్ని నిలుపుకోటానికి మనం మరొక సాధన చెయ్యాలి.

**రెండవ అంశం:** మన ఈ శిబిరం పూర్తయ్యేలోపు గురుచరిత్ర అఖండంగా పారాయణ చెయ్యాలి. అఖండంగా జరిగితే లాభం ఏంటంటే ఫలితం అందరికీ సమానంగా వస్తుంది. జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఒక్కరే పుస్తకమంతా చదివే కంటే ఒకరు మొదలు పెట్టి ఒక రెండు గంటల పాటు చదివాక, మరొకరు వచ్చి అక్కడి నుండి చదవడం ప్రారంభిస్తే బావుంటుంది. ఎందుకంటే అలా ఒకరి తర్వాత ఒకరు వంతులవారీగా చదివితే ఫలితం అందరికీ సమానంగా వస్తుంది.

**మూడవ అంశం:** ఒక్క సాయిచరిత్ర చదివితే చాలదు. మంత్రజపం కూడా జరగాలి. మంత్రము అంటే మీకు తెలిసిన మంత్రమే 'ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం'. ఈ విశేషమైన మంత్రజపమే చేద్దాం. ఈ మంత్రంతో మనం మూడు క్షేత్రాలను కలుపుతున్నాం. శిరిడీ, తిరుమల, హరిద్వార్‌లలో కూడా ఇది అఖండంగా జరగాలి. ఈ సాధన వలన మరల మీరు శిరిడీ వచ్చేసరికి మీరిప్పుడున్న ఈ స్థితి నుండి పైకెదుగుతారు తప్ప క్రిందికి దిగరు. అందుకొరకై మనం ప్రతి సంవత్సరం జూన్ పూర్ణిమకు శిరిడీలో కలిస్తే చాలా మంచిది.

**నాలుగవ అంశం:** ఇక్కడ మీరు చేసే ధ్యానం మీ శ్వాసను మారుస్తుంది. ఎప్పుడైనా సమానశ్వాసలు తీసుకోగలిగితే దాన్నే 'సమాధి' అంటారు. సాయి సమాధి దగ్గరకు రాగానే మీ శ్వాస మారిపోతుంది. దాన్ని మీరు గమనించరు. అందుచేత మీరిప్పుడు ఇక్కడ మీ శ్వాసను సరిచేసుకోగలిగితే మీకు ఏ రోగాలు రావు. దీనినే శివుడు పార్వతికి చెప్పాడు. దీనినే "విజ్ఞానభైరవ తంత్రము" అంటారు. దీనినే రజనీష్‌గారు 'బుక్ ఆఫ్ సీక్రెట్స్' అనే పేరుతో ప్రచురించారు. దొరికితే చదవండి. అలా సమాధిస్థితిలో ఉన్న ఏ వ్యక్తి దగ్గరకు వెళ్ళినా, అతని చక్రము, ఆ క్షేత్రంతో మిళితమైపోతుంది. అప్పుడు కళ్ళు లేని వారికి కళ్ళు వస్తాయి. కాళ్ళు లేని వారికి కాళ్ళు వస్తాయి. ఇప్పుడు ఇందులో ఉన్న మాజిక్కును గురించి ఆలోచించండి. మీకే అర్థమౌతుంది. ఇంకా ఈ సమాధిని గురించి ఈ రెండు, మూడు రోజులలో చెప్పేస్తాను. అయితే దానికి తగిన అభ్యాసం మాత్రం మీ వైపు నుండి ఉండాలి. ఇక్కడ మనం రెండు రకాల ప్రాక్టీసులు చేద్దాం.

**1.అఖండ గురుచరిత్ర పారాయణ:** ఇప్పుడిక్కడ జరుగుతున్న సంఘటనలను మీరు పారాయణ చేస్తున్నప్పుడు చూడడానికి ప్రయత్నించండి. రేపు మళ్ళీ మీరు ఇంటికి వెళ్ళాక చదువుతున్నప్పుడు దానిని ఊహించుకోండి– తేడా మీకే అర్థమౌతుంది. అసలా పవరేంటో మీకే తెలుస్తుంది.

**2. సాయి వేంకటేశ శ్రీరాం:** ఈ మూడు క్షేత్రాలను కలిపాం. అక్కడ హరిద్వార్, ఉత్తరప్రదేశ్‌లో ఉన్నది. అది శిరస్సు అనుకోవచ్చు. శిరిడీ మహారాష్ట్ర మధ్యలో ఉంది. అందుచేత దానిని హృదయం అనుకోవచ్చు. తిరుమల ఆంధ్రప్రదేశలో ఉంది కనుక దీనిని కంఠస్థానముగా చెప్పుకుందాం.

**హరిద్వార్ – ఉత్తరప్రదేశ్ – శిరస్సు – శ్రీరామశర్మ ఆచార్య**

**శిరిడీ – మహారాష్ట్ర – హృదయం – సాయి**

**తిరుమల – ఆంధ్రప్రదేశ్ – కంఠస్థానం – వేంకటేశ్వరస్వామి**

ఒకటి బ్రెయిన్ సెంటర్, రెండు హార్ట్‌సెంటర్, మూడు థ్రోట్‌సెంటర్ – అంటే భావాలు, మాటలు, ఆలోచనలు మూడు సరిగ్గా ఉండాలి. అప్పుడే సాయి, వేంకటేశ, శ్రీరాం అనే ఈ మూడు శక్తుల ప్రభావం మానవజాతిపై సరిగ్గా పడుతుంది. ఈ మూడు చేతనత్వాలను ఒకే ఒక్క శ్లోకంలో చెప్పి ముగిస్తాను.

**సమం కాయ శిరో గ్రీవం ధారయన్నచలం స్థిరః ।**
**సంప్రేక్ష్యనాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥ గీత – 6అ, 13వ శ్లోకం**

'సమ' అంటే నిటారుగా ఉండడం. నిటారుగా ఏం ఉండాలి అంటే శిరస్సు, గ్రీవము, మొండెము. ఈ మూడు కూడా భౌతికజగత్తులో ఒకే గీతవలె కనుక ఉంటే తొంభై శాతం రోగాలు పోతాయి. ఒక రోగిని అలా నిటారుగా కూర్చోబెట్టి చూడండి, ఏమౌతుందో తెలుస్తుంది. ఒక్కరోజు చేశాము అంటే కుదరదు, తగ్గేదాకా చేయించండి. ఖచ్చితంగా తగ్గుతుంది. హాలీవుడ్‌లో ఈ పాయింట్ ఒక్కటి నేర్పడానికి 500 డాలర్లు తీసుకుంటారు. అక్కడ దీని పేరు అలెగ్జాండర్ టెక్నిక్. ఆస్ట్రేలియాలో అలెగ్జాండర్ అనే డ్రామా కళాకారుడు ఉండేవాడు. ఆ రోజులలో ఆయన షేక్స్పియర్ డ్రామాలలో మంచి పట్టు ఉన్నవాడు. దురదృష్టవశాత్తు ఆయనకు ఫేషియల్ పెరాలిసిస్ అంటే ముఖానికి పక్షవాతం వచ్చింది. నానా బాధలు పడ్డాడు. అనేక రకాల థెరపీలు చేయించినా ఏమీ తగ్గలేదు. చివరకు బైబిల్ చదువుతూ ఈ 'కీ'ని పట్టుకున్నాడు. ఆరునెలల పాటు ఈ సాధన చేశాడు. మామూలుగా అయిపోయాడు. బైబిల్‌లో ఆయన పట్టుకున్న 'కీ' ఏంటంటే ఈ 'సమం కాయ శిరోగ్రీవమే'. ముఖ్యంగా క్రానిక్ రోగాలన్నీ ఈ 'సమం కాయ శిరో గ్రీవం' అనే 'కీ'తో సరి అయిపోతాయి. ఎప్పుడైతే మీరు నిటారుగా కూర్చుంటారో అప్పుడు మీ ఆలోచనలు, భావాలు, వాక్కు అన్నీ ఒకే సరళరేఖలోకి వచ్చేస్తాయి. మీ రోగాలన్నీ పోతాయి.

కనుక ఈ 'సమం కాయ శిరో గ్రీవం' అనే శ్లోకాన్ని జీవనదేవతా సాధనగా ఉపయోగించుకోవాలి. మన శరీరంలో ఉన్న ఆరుచక్రాలను ప్రతి సిద్ధక్షేత్రమూ జాగృతం చేస్తుంది. గురుసమాధి ఉన్న సిద్ధక్షేత్రాలలో అవి ఇంకా మాగ్నిఫై అవుతాయి. ధ్యానం చేస్తున్నప్పుడు, మామూలుగా కూర్చున్నప్పుడు కూడా మీరు మీ శరీరాన్ని, మెదడును నిటారుగా పెట్టుకోండి. ప్రక్కనున్న వాళ్ళు ఏమనుకుంటారో అని మాత్రం అనుకోవద్దు.

ఈ సాధనాశిబిరంలో 'ఓం'కార సాధనను కూడా ప్రతిరోజూ చేయించారు. అనేక సమస్యల నివారణకు ఈ 'ఓం'కార సాధనను ఎప్పుడు, ఎక్కడ ఎలా చేయాలో కూడా వివరంగా చెప్తూ చేయించారు. సాధన అనేది నిత్యనూతన శాశ్వత సనాతన సత్యము. కనుక దీనిని పాఠకుల సౌకర్యార్థము ఇంతకు ముందు చెప్పినా మళ్ళీ చెప్తే మంచిదని మాస్టర్‌గారు చెప్పినదాన్ని యథాతథంగా చెప్పడం జరిగింది.

భారతీయ ఋషులు అందచేసిన వివిధ యోగపద్ధతులు ఆధ్యాత్మిక ఉన్నతిని కలిగించడమే కాకుండా, అన్ని రకాల శారీరిక, మానసిక రుగ్మతల నుండి విముక్తిని కలిగిస్తాయి.

ఓంకారాన్ని మూడు రకాలుగా ఉచ్చారణ చేయవచ్చు

**మొదటి సాధన జాగ్రదావస్థలో:** అంటే భౌతికజగత్తులో మీకు ఏ పనిలోనైనా ఫలితం రావాలంటే 'అ అ అ....'మీద ఒత్తిడి పెట్టాలి. అలా 'అ' కారం మీద వత్తిడి పెడితే భౌతికజగత్తులో మీకు అవసరమైన మార్పులు వస్తాయి. ఇంకో మఖ్యమైన విషయం "అ"కార ఉచ్చారణ వలన క్యాన్సర్ నయమౌతుంది.

**రెండవ సాధన సూక్ష్మజగత్తులో:** ఇప్పుడు మీరు 'ఊ ఊ ఊ....' మీద ఒత్తిడి పెట్టి చేస్తే మీ కలల ప్రపంచం మారుతుంది. మాండూక్యోపనిషత్తును కనుక చదివితే దీనిని గురించి మీకు సమగ్ర అవగాహన వస్తుంది. అది చదివితే మీ జీవితాలే మారిపోతాయి. అందులో కేవలం 12 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. చదువుకోండి. "ఉ"కార ఉచ్చారణ వలన షుగర్ వ్యాధి నయమౌతుంది.

**మూడవసాధన కారణజగత్తులో:** ఇప్పుడు మీ జీన్స్ మారాలి. అంటే మీ అలవాట్లు మారాలి, అంటే మీ ఆలోచనావిధానం మారాలి. అంటే 'మ్ మ్ మ్......' మీద ఒత్తిడి పెట్టి చేయాలి. అది కారణాన్నే మార్చేస్తుంది. ఇంకా ముఖ్యంగా "మ"కార ఉచ్చారణ వలన బి.పి ., గుండె జబ్బులు తగ్గుతాయి.

మన జీవితాలలో జాగ్రదావస్థలో కొన్ని కారణాలు ముందే వచ్చేసి ఉంటాయి. జాగ్రదాస్థలో ఎవరేం చేసినా ఒక ఆలోచన ఉంటుంది కదా! ఆలోచించకుండా ఎవరూ ఏ పనిని చేయలేరు. కానీ నిద్రాస్థితిలో అంటే గాఢనిద్రలో మీకు ఏ ఆలోచనా లేదు. బస్తాలో బియ్యం అడ్డదిడ్డంగా ఉంటే అటూ, ఇటూ కుదుపుతారు. దాంతో బస్తా నిటారుగా అయిపోతుంది. అలాగే 'మ' అంటే హార్మోనీ వస్తుంది. దీన్ని మీరు చాలా ఎక్కువసేపు చేసుకోవాలి. మీరు ఒక సమయాన్ని పెట్టుకొని

ఉదయం ఒక అరగంట, సాయంత్రం ఒక అరగంట చేస్తే సరిపోతుంది. మీరు ఏ పని మొదలు పెట్టాలన్నా ఓంకారం చేస్తే ఇదివరకటి నెగిటివ్ యాక్షన్స్ పోతాయి.

**జాగ్రదావస్థను ........... 'అ'కారం మార్చేస్తుంది**

**స్వప్నావస్థను ........... 'ఉ'కారం మార్చేస్తుంది**

**కారణజగత్తును ........... 'మ'కారం మార్చేస్తుంది**

'ఓం'కారంతో 'మ'కారం మీద ఒత్తిడి పెట్టి చేస్తే మేధా జాగరణ జరుగుతుంది. ఈ 'ఓం'కారాన్ని మీరు సీరియస్‌గా చేస్తే మీ అలవాట్లను ఖచ్చితంగా మార్చుకోగలుగుతారు. అంతేకాదు మీ శరీరం యొక్క జీన్స్ కూడా తమ అలవాట్లను మార్చుకుంటాయి. ఇదంతా ఋషుల యొక్క అనుభవం. అందుచేత మీరు ఈ సాధన వలన మీ అలవాట్లనేంటి, మీ జీన్స్‌నే మార్చుకుంటున్నారు. అద్భుతమైన విద్య అని తెలిశాక ఈ ఓంకార సాధన చెయ్యాలి. ఇంత తెలిసి సాధన చెయ్యకపోతే ఏం లాభం ఉంటుంది.

## సాధన

నిటారుగా కూర్చోండి. అది మీలో ఉన్న అశాంతిని పోగొట్టేస్తుంది. మనం ఒక నియంత్రణలేని పరిస్థితిలో ఇరుక్కుపోయి ఎటునుండి ఏ విధమైన సహాయము అందక నిస్సహాయస్థితిని అనుభవిస్తున్నాము. అప్పుడు ఈ 'ఓం'కార సాధనను చేసి చూడండి. ఎంత అద్భుతమైన శాంతి వస్తుందో మీకే తెలుస్తుంది. 'ఓం'కార సాధనతో అన్ని సమస్యలూ తీరిపోతాయి. 'మ్' మీద ఒత్తిడి పెట్టి చెయ్యండి. నా సలహా ఏమిటంటే రాత్రి పడుకునే ముందు చేసుకోండి. మంచి ఫలితాలు వస్తాయి. నిద్రలేవగానే అంటే కళ్ళు కూడా తెరవకుండా లేచి కూర్చుని ఒక నియమిత సమయం పెట్టుకొని చెయ్యండి. ఫలితం అద్భుతంగా ఉంటుంది.

గాలి లోతుగా పీల్చుకొని 'ఓ మ్ మ్ మ్.......' అని అంటూ ఉంటే పొట్ట లోపలికిపోతుంది. ఇలా చేస్తే వచ్చే మార్పు శాశ్వతంగా ఉంటుంది. ఈ సాధనతో ఊబకాయం అనే సమస్య తీరిపోతుంది. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అదే అన్నింటికంటే ముఖ్యం. అది సరైపోతుంది. జీన్స్ మారిపోతాయి. 'సమం కాయ శిరో గ్రీవం' అనేది 'ఓం'కారానికి ప్రాథమిక నియమం. ఇది నిరంతరం అమలు చేస్తూ ఉండండి.

ఒకసారి భరద్వాజ మాస్టర్‌గారిని వాళ్ళన్నగారు బలవంతంగా శిరిడీకి తీసుకువస్తారు. వాళ్ళన్నగారి కుమారుడు ఉపనయనం రోజు చనిపోతాడు. ఆ బాధతో భరద్వాజగారు కుమిలికుమిలి ఏడుస్తారు. అప్పుడు వాళ్ళన్నగారు శిరిడీకి తీసుకువస్తారు. ఆ కసి, బాధతో అక్కడికి వచ్చిన ఆయన సాయి విగ్రహం ముందు ఎనిమిది గంటల పాటు అలా ఉండిపోయారు. మీరూ శిరిడీకి వస్తారు, వచ్చినా అలా ఎందుకు కాలేకపోతున్నారు? ఆ శాంతి వస్తే తప్ప కదలను అనే మొండిపట్టు మీలో రావాలి. అలా పొందే సుఖం అత్యద్భుతంగా ఉంటుంది. మరి ఈసారైనా చేసి చూడండి.

ఈ 2002 జూన్‌లో శిరిడీకి సాధనకు వచ్చిన సాధకులంతా అదృష్టవంతులు. ఆ క్యాంప్‌లో మాస్టర్‌గారు విశ్వరూపం చూపించారు. ఒక్క క్షణాన్ని కూడా వృధా పోనివ్వలేదు. ఆ రోజు సాయంత్రం 7 గంటల 15 నిమిషాలైంది. తెల్లవారుఝామున ఐదు గంటల నుండి మాస్టర్‌గారు చెప్తూనే ఉన్నారు. అయినా సాయంత్రం 7 గంటల15 నిమిషాలకు ఇంకా ఇలా చెప్పారు. కల్కి అవతారం సంపూర్ణమైనటువంటి కళలకు చేరుకుంటున్నది. దశావతార ప్రక్రియకు సింబాలిక్‌గా (సూచనప్రాయంగా) పది ఆసనాలు ఎలా వెయ్యాలో చెప్తాను. వెయ్యడానికి సమయం లేదు మాస్టర్‌గారు అని చెప్పవద్దు. దానికంటే ఇష్టం లేదు అని చెప్పండి. ఇష్టం లేని వాడిని బ్రహ్మదేవుడు కూడా ఏం చెయ్యలేడు అంటూ ఆయన పద్ధతిలో ఆయన ఆసనాలు చెప్పడం మొదలుపెట్టారు.

ఆసనాలు వేయించడానికి ముందు ఆసనశుద్ధిలో గల రహస్యాలను, మానసికస్థితిని వివరించారు.

"స్థిరం సుఖమితి ఆసనం" అన్నారు. మీరు వెయ్యబోయే ప్రతి ఆసనం స్థిరంగా ఉండాలి, సుఖంగా కూడా ఉండాలి. అప్పుడే ఆసన ఫలితం వస్తుంది తప్ప ఏదో చేస్తే ఫలితం ఉండదు అని చెప్తూ మొత్తం పది ఆసనాలు వేసి చూపించారు. మొదటగా పడుకుని వేసే నాలుగు ఆసనాలు 1. అర్ధ హలాసనం, 2. అర్ధ పవనముక్తాసనం, 3. ఉత్తాన తాడాసనం, 4.కటిచాలనాసనం. కూర్చుని చేసే ఆసనాలు మూడు 1. పర్వతాసనం, 2. కటివక్రాసనం, 3. గోముఖాసనం. ఈ మూడు ఆసనాలు మీ స్వప్నస్థితిని మారుస్తాయి. వీటి తరువాత నిలబడి చేసే ఆసనాలు 1.తాడాసనం, 2. కటి త్రికోణాసనం, 3. కటిచక్రాసనం. ఈ మూడు ఆసనాలు కృష్ణ, బుద్ధ, కల్కి అవతారాలను గురించి చెప్తాయని, చెప్తూ అన్నింటికన్నా ముఖ్యమైనది, దేవతలను ఆకర్షించేది, ఆసనాలలో అతి శ్రేష్టమైనది అయిన ఒక ఆసనం గురించి చెప్పారు. అదే

## పద్మాసనం

మానసికస్థితిలో ఇది సుప్రీం ఆసనం. ఇవాళ మనం చెప్పుకునే తరగతులకి, మన జీవితాలకి ఇది చాలా ముఖ్యమైన ఆసనం. భారతదేశ భవిష్యత్తుకు సంబంధించిన ఆసనమేమిటి అంటే అది పద్మాసనం. మీరు ఖచ్చితంగా నా క్లాసులో పద్మాసనంలోనే కూర్చోవాలి. మేము కూర్చోలేము మాస్టర్‌గారు అంటున్నారు చాలామంది. కానీ మీరు కూర్చోగలరు. సాధనమున పనులు సమకూరు ధరలోన... ప్రయత్నించండి, సాధించండి, మీరు వెయ్యగలరు. కాంతికి–శక్తికి–ఈ పద్మాసనానికి ఉన్న సంబంధం ఏమిటి? సూర్యుడు ఉంటే తప్ప పద్మం వికసించదు. సూర్యునికి, పద్మానికి చాలా దగ్గర సంబంధమున్నది. మన శరీరంలో ఉన్న షట్చక్రాలను కూడా పద్మాలనే పిలుస్తాము. అందుచేత ఈ పద్మాసనం మీకు తెలిసినా తెలియకపోయినా, మీ షట్చక్రజాగరణకు ఉపయోగ పడుతుంది. దేవతామూర్తులన్నీ పద్మాసనంలోనే కూర్చుని ఉంటాయి. అది గుర్తుచేయడానికే పద్మాన్ని అక్కడ పెట్టారు. పద్మాసనం వేస్తే తప్ప దేవతాసాధన మీకు ఫలించదు. మిమ్మల్ని బైట వెయ్యమనడం లేదు. ఇక్కడ నేను ఉన్నప్పుడు, చెప్తున్నప్పుడు వెయ్యండి.

ఎప్పుడు మీరు బొట్టు పెట్టుకుంటున్నారో, అప్పుడు ఆజ్ఞా చక్రజాగరణకు బాటలు వేస్తున్నారు. పద్మాసనం వేస్తున్నారు అంటే ఖచ్చితంగా మూలాధారం తగులుతుంది. అందుచేత ఎప్పుడైతే మీరు బొట్టు పెట్టుకొని పద్మాసనం వేస్తున్నారో అప్పుడు మూలాధారానికి, ఆజ్ఞాకి మధ్య ఉన్న నాలుగు చక్రాలకి ఒత్తిడి వచ్చి తీరుతుంది కదా! మధ్యలో ఉన్న చక్రాలు వదులుగా ఉండలేవు కనుక మీకు తెలియకుండానే 'సమం కాయ శిరోగ్రీవం' జరిగిపోతుంది. పద్మాసనంలో చక్రాలు పద్మాలుగా వికసిస్తాయి. దానికి వేరే సాధన ఉంది. ఇప్పుడు ఇంతవరకు చెయ్యండి, చాలు అంటూ ఆసనాలు వేయించటం మొదలెట్టించారు.

## మేధాజాగరణ శిబిరం ఎందుకు?

త్యాగమయ, తపోమయ జీవితానికి పరాకాష్టగా పృథ్విపై ఆవిర్భవించిన దత్తావతారమైన శిరిడీ సాయినాథుని దివ్యధామంలో మాస్టర్‌గారి ప్రచండ వాక్‌శక్తి సాధకులను ఆమూలాగ్రం సాధనాప్రవాహాలలో ముంచెత్తింది. అది రాత్రి, పగలు అనే విచక్షణను కూడా మరిచిపోయింది. మళ్ళీ ఇలాంటి అవకాశం ఎప్పటికి వస్తుందోనన్న ఆదుర్దాతో, సాధకులు పరిపూర్ణ ఏకాగ్రతతో, ఏకనిష్ఠులై సాధనారతులైనారు. గంగాప్రవాహం వలెనే మాస్టర్‌గారి ప్రవచన దివ్యధారలు అమృతాన్ని

కురిపిస్తున్నాయి. ఇలాంటి శిబిరం ఎప్పుడూ జరుపబడలేదు అనుకుంటున్నారు కొత్తగా వచ్చిన కొంతమంది. దీన్ని మీరు అర్థం చేసుకోవాలి అంటూ మొదలుపెట్టారు మాస్టారు. **ఇది ఒక విశేషమైన ప్రణాళికతోపాటు, విశేషమైన ఉద్దేశ్యంతో మానవజీవితాన్ని ఎన్నుకొన్న వ్యక్తులకు, వాళ్ళు మర్చిపోయిన పనిని, వాళ్ళు మర్చిపోయిన సంకల్పాలను, వాళ్ళు మర్చిపోయిన లక్ష్యాలను గుర్తుచేయడానికి పెట్టిన శిబిరం. అందుకే దీనికి మేధాజాగరణ శిబిరమని పేరు పెట్టారు.**

ఒక విశేషమైన ఉద్దేశ్యంతో గత 200 సంవత్సరాలలో కొన్ని విశేషమైన ప్రయోగాలు చేసిన వారున్నారు-వాళ్ళను గురువులనండి, మహాపురుషులనండి, ప్రపంచ భాగ్యనిర్మాతలనండి, వారికి మీరు ఏ పేరైనా పెట్టండి-వారిలో గృహస్తులుగా ఉంటూ కూడా అద్భుతమైన ఆధ్యాత్మిక జీవితం జీవించినవారూ ఉన్నారు. ఒక లాహిరీ మహాశయ, ఒక శ్రీరామకృష్ణ పరమహంస వీరు మనకు తెలిసిన మహాపురుషులు. వీరు కాకుండా ఈ ప్రపంచంలో వాళ్ళు యోగులు అని తెలియకుండా యోగమయజీవితాన్ని జీవిస్తున్నటువంటి అనేకమంది వ్యక్తులున్నారు. వాళ్ళను అప్పుడప్పుడు గుర్తుచేసుకుంటూ ఉండాలి. ఊరు ఏదైనా సరే వీరు తమకు తెలుసున్న వాళ్ళ ఇళ్ళల్లో మంచిపని జరిగినా, ఇబ్బంది వచ్చినా వచ్చి నిలబడతారు. సహాయం చేస్తారు, అండగా ఉంటారు. వారి దగ్గరకు అనేకమంది మనుష్యులు వెళ్ళివస్తుంటారు కూడా! **నేను చెప్తున్న ఈ మాటలు విని అర్థం చేసుకోవడానికి మీలో స్పందన ఉండాలి. ఓపెన్‌మైండ్‌తో ఉండండి. వీళ్ళందరూ ఒక విశేషమైన ఉద్దేశ్యంతో మానవజన్మ తీసుకున్నారు. వారంతా తమ పని తాము చేసుకుంటున్నారు. వారిలాగానే మీరంతా కూడా ఒక విశేషమైన కారణం కోసమే ఈ భూమిమీద అవతరించారు.** కానీ అందరమూ మర్చిపోయాము. మనమే కాదు చాలామంది అవతారపురుషులు కూడా అలానే మర్చిపోయి సాధారణ మానవుల వలె కోరికల ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉంటారు. అలాంటివారిని ఒక్కసారి నిద్రలేపి, 'నువ్వులే! ఈ పని చేయి' అని చెప్పవలసిన బాధ్యత ఆ జ్ఞానం తెలిసినవారికి ఉంటుంది. అలా కొట్టుకుపోకుండా ఉండడానికి పాటించవలసిన కొన్ని నియమాలు ఉన్నాయి, ఆచరించాల్సిన కొన్ని సూత్రాలు ఉన్నాయి.

మీ జీవితాలలో మార్పు రావాలి అంటే మీరు వాటిని పాటించితీరాలి. వచ్చిన మార్పులని స్థిరంగా ఉంచుకోవాలి. సంక్షిప్తంగా కొన్ని పాయింట్లు ఇస్తే అర్థం చేసుకోగలుగుతారు.

1. ఇతరులు మీ గురించి అనుకునే దానికి మీరు విలువ ఇవ్వడం మానెయ్యాలి.

2. ఇతరులకు మీలో ఈ లోపం ఉంది అని మీరు వారికి చెప్పవద్దు.

3. మీరు చేస్తున్న పని ఇతరులకు నచ్చకపోతే వారికి అడ్డురాకుండా ప్రక్కన ఉండండి.

4. మీరు ఉన్నటువంటి పరిస్థితులను మార్చుకోవడానికి ప్రయత్నించవద్దు, మీరు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో అదే మీకు అన్నింటికంటే మంచి పరిస్థితిగా స్వీకరించండి.

వీటిని ఖచ్చితంగా పాటించండి. మీరు మూడు విశేషమైన బాధ్యతలను పూర్తి చేయమని చెప్పడానికి సాయి మిమ్మల్ని ఇక్కడకు రప్పించాడు. మీలో కొందరు ఇష్టంతోనే వచ్చారు. కొందరు వారి స్నేహితులున్నారని వచ్చారు. మరికొందరు రావాలననుకొని రాలేకపోయారు. ఏది ఏమైనా మీరు ఈ మాటలు వింటున్నారు. వినడానికి అర్హత ఉన్నది కనుకనే మీరు వింటున్నారు.

1. పృథ్విపై స్వర్గావతరణను తీసుకువచ్చే బాధ్యత పంచపాండవులది. వాళ్ళు ఎక్కడున్నారంటే విరాట్‌నగరంలో ఆ పని, ఈ పని చేసుకుంటూ ఉన్నారు. అయితే బాధ్యతను వాళ్ళు మర్చిపోలేదు. దానికోసమే పోరాడారు. వారు రాజాధిరాజులై ఉండి కూడా ఒక రాజు కొలువులో కూలి పనులు చేశారు. వారితో పోలిస్తే మీకున్న పరిస్థితులు చాలా బాగున్నాయి. ఇప్పుడు మీకు మూడు సంకల్పాలు చెప్తున్నాను.

**మొదటిసంకల్పం:** పృథ్విపై స్వర్గావతరణ. దీనికొరకు నా శాయశక్తులా నేను ప్రయత్నిస్తాను. దీనికి మూలం ఏమిటంటే 'సమం కాయ శిరో గ్రీవం' అనే సాధన. ఇది ఆహారంలో అన్నం వంటిది. అన్నం ఉంటే మిగతావి ఉన్నా, లేకున్నా సర్దుకోవచ్చు. రాత్రిపూట మెలకువ వస్తే లేచి కూర్చుని చెయ్యండి. ఇక్కడ ఈ అద్భుతమైన ప్రదేశంలో, ఈ పవిత్రమైన వాతావరణంలో ఉన్నాం, చేసుకోండి, రేపే పౌర్ణమి. ఈ రాబోయే పౌర్ణమి ప్రపంచాన్ని మార్చివేసేటువంటి పౌర్ణమి అని జ్వాలాకూల్ మహర్షి చెప్పారు. సంవత్సరంలో మూడు పౌర్ణమిలు ప్రపంచాన్ని మారుస్తాయని, అవి ఏప్రియల్, మే, జూన్ పూర్ణిమలుగా ఇంతకుముందు చెప్పాను. ఒక పూర్ణిమ ఆలోచనలను మారుస్తుంది. రెండవ పూర్ణిమ వాక్కును మార్చివేస్తుంది. మూడవ పూర్ణిమ ఆచరణను మార్చివేస్తుంది. శిరిడీలో మనం జరుపుకునేది మన ఆచరణలను మార్చివేస్తుంది. దానికోసమే ప్రత్యేకంగా మిమ్మల్ని ఇక్కడకు రప్పించాను.

**రెండవసంకల్పం:** శాంతి, సుఖం, సమృద్ధి అందరికీ కావాలనేదే మన లక్ష్యం. నా ఒక్కడికే కాదు, ప్రపంచంలో కోట్లకోట్లమందికి శాంతి రావాలి, సమృద్ధి రావాలి. ప్రస్తుతం సమృద్ధి వస్తోంది

కానీ శాంతి రావడం లేదు. ఎందుచేతనంటే మీరు తప్పుదారిలో వెళ్ళిపోతున్నారు. మీరు సమృద్ధి వలన శాంతి వస్తుందనే భావనలో ఉన్నారు. కానీ శాంతి నుండే సమృద్ధి వస్తుంది. సమృద్ధి నుండి సుఖం వస్తుంది. అదీ అసలైన పద్ధతి. ఆ విధానంలో ఆలోచించండి. జన్మజన్మలకి మానవ శరీరధారియైనటువంటి వ్యక్తి పాటించవలసిన లక్ష్యాలు.

1. ఎట్టి పరిస్థితులలోను నేను ఇతరుల ఉద్దేశ్యాలకు ప్రాముఖ్యతను ఇవ్వను. ఎవరేమన్నా పట్టించుకోను.

2. నా జీవితాన్ని నేను నా చేతుల్లోకి తీసుకుంటాను.

3. పృథ్విపై స్వర్గావతరణ అనే దాన్ని మనస్సుతో అంగీకరిస్తాను.

4. వేదమయ జీవితము అంటే సహజజీవితము.

5. శాంతి, సమృద్ధి, సుఖము అందరికీ రావాలని కోరుకుంటాను.

పై లక్ష్యాలను సాధించేందుకు కావలసిన తపశ్శక్తి, వాతావరణం, వనరులను గురువులు తయారుచేసి ఉంచారు. ఉపయోగించుకునే వాళ్ళు రావడం లేదు. దానికి మనం ముందుకు వస్తున్నామని నిర్ణయించుకుంటూ, అందుకు చేయవలసిన అసలైన సాధన పరమగురువులిచ్చిన ఏకైక సాధన 'సమం కాయ శిరో గ్రీవం'. కాబట్టి నిటారుగా కూర్చోండి, శ్వాసను గమనించండి, కదలవద్దు, మంత్ర జపాలు ఏమీ వద్దు. పరిపూర్ణమైన ఏకాగ్రతతో శ్వాసనే గమనిస్తూ ఉండండి చాలు. శాంతి, ఆ పరమశాంతిని అనుభూతిచెందండి. కాసేపు అలాగే ఉండండి. ఇది చేస్తే ఇంతకంటే గొప్ప లాభం మరేదీ లేదని జగద్గురువు శ్రీకృష్ణుడు గీతలో చెప్పాడు. అందరూ సుఖంగా ఉండాలని కోరుకుంటూ ... స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం .....శ్లోకంతో ప్రవచనాన్ని ముగించారు.

అదే రోజు మధ్యాహ్నం క్లాసులో మరికొన్ని విశేషమైన సాధనలు, పరమగురువుల ప్రణాళికతో పాటు వ్యక్తిగత సుఖశాంతులకు మరికొన్ని సరళమైన సాధనలను అనుగ్రహించారు. ఇంతకు ముందు మనం చెప్పుకున్నటువంటి మూడు లక్ష్యాలను ఒక్క సారి గుర్తుచేసుకుందాము. 1.పృథ్వి పై స్వర్గావతరణ. 2.వేదమయ జీవనము. 3.శాంతి, సమృద్ధి, సుఖము అందరికీ అందచెయ్యటానికి ఈ రోజు నుండి అంటే పూర్ణిమరోజు నుండి ఇంకొక గంట సమయాన్ని కేటాయించాల్సి వుంది. అదే మంత్రజపాన్ని మనమిక్కడ ఉపయోగిస్తున్నాము.

'ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం' ఎందుకు అదే అంటున్నామంటే ఈ మాటల వెనుక ఒక అద్భుతమైన ఆరా ఉంది. సాధారణంగా ఏదైనా ఒక మాట అనేసరికల్లా ఆ మాట వెనుక వున్న వస్తువులన్నీ గుర్తుకువస్తాయి. అలానే ఈ పేర్లకు, మన భారతీయ సంస్కృతికి మధ్య చాలా పెద్ద సంబంధం ఉంది. దానికి కారణం ఏమిటంటే

1. సాయిరాం అనే నామం భూమ్మీద స్వర్గావతరణ తీసుకురావటానికి ఉపయోగపడుతుంది.

2. వేంకటేశ అనే నామం – నాటు, కోసుకో అనే సిద్ధాంతాన్ని నేర్పుతుంది.

3. శ్రీరాం అనే నామం – త్యాగమయ జీవితం.

అంటే మీరు త్యాగం చెయ్యగలిగినప్పుడు మాత్రమే ఇతరులకు శాంతిని ఇవ్వగలుగుతారు. కనుక ఈ నామాన్ని ఇక్కడున్నవాళ్ళందరం కలిసి కళ్ళుమూసుకుని మెల్లిగా మంద్రస్వరంతో ఒక గంటసేపు ఆపకుండా జపం చేద్దాం. అందరూ నిటారుగా కూర్చోండి. దాంతో పాటు శ్వాసను గమనించండి. ఇక జపం ప్రారంభించుదాం. లక్ష్యాన్ని చెప్తున్నాను. పృథ్విపై స్వర్గావతరణ, వేదమయ జీవనం, అందరికీ శాంతి, సుఖము, సమృద్ధి. ఈ లక్ష్యసాధన కొరకు గురుసత్తా ఆశీర్వాదాలతో ఈమంత్రమును గంటసేపు చేద్దాం. జపం పూర్తి కాగానే దృష్టి శ్వాస మీదికి రావాలి. నిరంతరం మీరీశ్లోకాన్ని గుర్తుంచుకోవాలి...సమంకాయశిరోగ్రీవం ధారయన్ అచలం స్థిరః... స్వస్తి...

## మహాకాల చక్రవర్తి యంత్రం

శిరిడీలో చెప్పిన ప్రవచనాలలో ఇది ఒక కలికితురాయిలాంటి అద్భుతమైన సాధన. ఆ రోజు 26వ తేదీ. మాస్టారి క్లాసు ఉదయం ఆరుగంటలకే ప్రారంభమైంది. అసలు ఈ సాధనా శిబిరంలో మాస్టర్‌గారు సాధనలనన్నింటనీ అలా సహస్రబాహువులతో పంచి పెట్టారనేది యదార్థం. సాయి అనుహగ్రం అయిందేమో సాధన వర్షం అలా కురిసింది. ఈ రోజు ప్రవచనంలో శ్రీచక్రాన్ని నిత్యజీవితంలో ఎలా ఉపయోగించుకోవాలో చెప్పడం జరిగింది. మీ జీవితాలను మార్చుకోవడానికి శ్రీచక్రంలో రెండు విశేష ఆవరణలున్నాయి. అవి ఒకటి అంతర్దశారం, రెండు బాహ్యదశారం. అందులో అంతర్దశారం, సూక్ష్మశరీర యాత్రను గురించి చెప్తుంది. ఇక్కడ మీకు ఉపాసనీబాబాగారి జీవితంలో జరిగిన ఒక సంఘటన చెప్పాలి. నాసిక్‌కు 12కిలోమీటర్ల దూరంలో ఒక గుహ వున్నది. అక్కడి వరకు అందరమూ వెళ్లాము. ఈయనగారు అందర్నీ చాలా మాయ చేసి గుహ

లోపలికి వెళ్ళిపోయారు. అక్కడ ఆయన స్పృహ కోల్పోయారు. అంటే ఏమిటి? ఆయన అంతర్దశారంలోకి ప్రవేశించారు. బాహ్యంగా ఉన్న పది ఇంద్రియాలు బయటనే పనిచేస్తాయి కానీ లోపలికి వెళ్ళవు. బాబాగారు గుహలోకి వెళ్ళి పోగానే ఆ ఇంద్రియాలు అంతర్ముఖమైపోయాయి. తర్వాత లోపల చాలా చిత్రమైన సంఘటనలు జరిగాయి. లోపల ఆయన ఏం తిన్నాడో, ఏం తినలేదో ఏమీ తెలియదు. ఒక సంవత్సరం గడిచిపోయింది. ఆ మధ్య కాలంలో ఓ ముస్లిం, ఓ హిందువు పట్టుకుని ఈయన చర్మాన్ని వలిచేస్తున్నారు. లోపలి నుండి ఒక బంగారు శరీరం బయటకు వచ్చింది. అప్పుడు వారు చెప్తారు, 'బాబూ, ఇది నీ సూక్ష్మశరీరం – ఇది చావదు. నీవు చద్దామనుకున్నా ఇది చావదు. ఇది చాలా ప్రభావం కల్గినది. దీనిని ఉపయోగించుకుని నీవెన్ని చమత్కారాలనైనా చెయ్యగలవు' అని, తరువాత ఆయన చాలాచాలా మ్యాజిక్కులుచేశారు. ఆయన పుస్తకం చదవండి. చాలా లోతులు తెలుస్తాయి. శ్రీచక్రంలోని అంతర్దశార సాధనను గురువులెలా ఉపయోగించుకున్నారో ఇక్కడ మనకర్థమౌతుంది.

శ్రీచక్రంలో అసలు మొదట ఉన్నది బిందువు. అది మనలో ఉన్న ఆత్మ బిందువు. తర్వాత సూర్యుడు, చంద్రుడు కలిస్తే ఏర్పడేటటువంటిది అగ్ని. దానినే సర్వానందమయ చక్రము అని చెబుతాము. సూర్యుడు, చంద్రుడు, అగ్ని కలిసి ఏర్పడితే బ్రహ్మాండమైన ఆనందం. ఆ ఆనందానుభూతిని ప్రపంచానికి అందచేయడానికే సాయి ధుని పెట్టారు. ఆ ధునిలో విభూతిని పెట్టుకుంటే మీ కోరికలు తీరిపోతాయి, మీ బాధలు తీరిపోతాయి. సాయి ఉంటేనే కాదు, ఇప్పుడు కూడా ధునికి ఆ పవర్ ఉంది. కానీ మీరు దానికి ట్యూన్ అవ్వాలి. మీరా మానసిక స్థితిలో ఉండాలి. ఏ మానసిక స్థితిలో? ఈ త్రిభుజము కుడికన్ను, ఎడమకన్ను, ఆజ్ఞా చక్రము మధ్య ఒక బిందువు ఉంటుంది. ఆ బిందువు దగ్గర మీ మానసిక స్థితిని నిరంతరం పెట్టుకోగలిగితే మీకా విభూతి ఖచ్చితంగా పని చేస్తుంది. ఆ మానసిక స్థితిలో ఉండి, మీరిచ్చినా ఆ విభూతి పని చేస్తుంది.

ఈ సర్వానందమయ చక్రం నుండి మెల్లిగా అష్టకోణములోకి వెళ్దాం. దానిని సర్వరోగహర చక్రము అంటారు. అష్టకోణము అంటే అది మీ శరీరమే. మీ శరీరంలో ఉన్న సూర్యుడు, చంద్రుడు, అగ్ని అంటే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి – ఇది సర్వానందమయ చక్రము. ఇది లేకుండా మీ కోరికలు తీరవు. సాయి చెప్పే నిష్ఠా, సబూరి ఎప్పుడైతే రగులుతాయో అది అగ్ని. అగ్ని అంటే అది మిమ్ములను ముందుండి నడిపిస్తుంది.

నిష్ఠ, సబూరీ-సూర్యుడికి, చంద్రుడికి ప్రతీకలైతే, అగ్ని ముందుండి నడిపిస్తూ ఉంటే, అప్పుడా సర్వానందమయ చక్రము ఏమి చేస్తుంది అంటే

**భూమి, రాపో, అనలో, వాయుహు, ఖం, మనో, బుద్ధి రేవ చ ।**
**అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా ॥**

భూమి అంటే మట్టి, ఆపో అంటే జలము, అనల అంటే అగ్ని, వాయుః అంటే గాలి, ఖం అంటే ఆకాశం, ఇవికాక మనస్సు, బుద్ధి, అహంకారం అనే ఈ ఎనిమిదింటితో ఈ శరీర నిర్మాణం జరుగుతున్నది. ఎందుకు జరుగుతున్నదంటే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి వలన సర్వానందమయ చక్రం ఏర్పడి, మళ్ళీ సూర్య చంద్ర, అగ్నులతో పంచతత్వాలు కలిసి సర్వ రోగహర చక్రంగా మారతాయి. అంటే మీకే రోగాలు ఉండవు. పుట్టినప్పుడు ఎవరికీ ఏ రోగాలు ఉండవు. మెల్లి, మెల్లిగా సంకల్పాలు మారుతుంటాయి. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులు మారుతుంటాయి. దాంతో రోగాలు వస్తుంటాయి. ఈ మూడూ పరిపూర్ణంగా లోపించటం వల్లనే బి.పి., కాన్సర్, హార్ట్ ప్రాబ్లమ్స్ వస్తున్నాయి. అసలు రోగాలు ఎందుకు వస్తున్నాయంటే, ఏ నిర్ణయం తీసుకోలేని వ్యక్తులకు రోగాలు వస్తాయి. సంకల్ప రహితులు అంటే ఏ నిర్ణయం తీసుకోలేని వాళ్ళు. వాళ్ళకు రోగాలు వస్తుంటాయి. ఎప్పుడూ సత్సంకల్పాలు తీసుకుంటూ, సత్కర్మలు చేయటంద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. సర్వ రోగహర చక్రానికి సంబంధించిన చిన్న సాధన చెప్పారు. సర్వ రోగహర చక్రము బొమ్మలో చూపిన విధముగా ధ్యానము చేయవలెను.

ఇప్పుడు శ్రీచక్రంలోని బిందువు, త్రికోణం, అష్టకోణం, అంతర్దశారం, బాహ్యదశారములను పరిచయం చేయడం జరిగింది. దీని తర్వాత చతుర్దశారం. ఆ పైన వరుసగా నవగ్రహ, ద్వాదశరాశుల, షోడశకళల ఆవరణలు ఉంటాయి. గీతలో చెప్పిన అష్టవిధప్రకృతులు మరియు షట్చక్రాలు మొత్తం కలిపి 14. అదే చతుర్దశ భువనాల విద్య. ముందు షట్చక్రాలలో ఉన్నటువంటి పద్మాలను వికసింపచేసుకోవడం తెలియాలి. దానికి సాధన చెయ్యాలి. అప్పుడు మీ కుడికన్ను, ఎడమకన్నుల ద్వారా జరుగుతున్నటువంటి వ్యక్తిగత జీవితాన్ని వదిలి వేసి సూర్యచంద్రుల నుండి సమిష్టిగా వచ్చే షోడశ కళల విద్యను పట్టుకోవాలి, అదే షోడశీవిద్య. అప్పుడు మీకు అర్థమౌతుంది. అర్థమైనా, కాకపోయినా రోజూ ఆ చక్రాన్ని ఉపాసించడం లేక దర్శించడమైనా చెయ్యాలి. మెల్లిమెల్లిగా అదే మార్గదర్శనం చేస్తుంది. ఉపాసన అంటే ఇదే. మీలో పది ఇంద్రియాలున్నాయి. అష్టతత్వాలున్నాయి.

మీరు వీటిని సమన్వయపరచుకుంటూ శ్రీవిద్యను నేర్చుకోవాలి. మీరు శ్రీవిద్యను నేర్చుకుంటూ, అగ్నిని ఉపయోగించుకొని వాస్తు దోషాలను నివారించుకొని, నక్షత్ర దోషాలను పోగొట్టుకునేందుకు ఒక యజ్ఞ విధానాన్ని రూపొందించడం జరిగింది. ఆ యజ్ఞవిధానాన్ని నేర్పబోతున్నాను. మీరు ఇంటికి వెళ్ళినా కూడా సులభంగా చేసుకోవచ్చు. అందుచేత ఇప్పుడు చెప్పబోయే మొత్తం యజ్ఞవిధానం –

శ్రీచక్రోపాసనకు కావలసిన విధివిధానము. దీనికి సంబంధించిన కర్మకాండ ఈ రోజు చేద్దాం. అగ్ని అంటే మీ కోరికలు. ఇక్కడ మన కోరికలు ఏమిటీ?–భూమిపై స్వర్గావతరణ, వేదవిజ్ఞానము, అందరికీ శాంతి, సమృద్ధి, సుఖము. ప్రస్తుతం అదే లక్ష్యంగా పెట్టుకోండి. ఆ తర్వాత మీ ఇష్టం. ఇది మొదలుపెట్టిన దగ్గర నుండి మీ జీవితాలు మారతాయి. అందుకే ఈ యజ్ఞానికి పెట్టిన పేరు ఏమిటో తెలుసా?

## సమస్త వాస్తు దోషనివారణ నక్షత్ర శాంతి మహాకాల యజ్ఞము.

ఇది ఆరంభం మాత్రమే. అన్ని నక్షత్రాలు ఎలా ఉపశమిస్తాయో, ఈ యజ్ఞంలో నేర్చుకుందురు గాని, అంటూ యజ్ఞం ప్రారంభించారు. ఈ యజ్ఞంలో 9 దీపాలు వెలిగిస్తాము. ఇవి నవగ్రహాలకు ప్రతీక. మన జీవితం నవగ్రహాల మీద ఆధారపడి ఉంది. జ్యోతిషశాస్త్రం వచ్చినవాళ్ళు ఈ యజ్ఞాన్ని పూర్తిగా ఉపయోగించుకోగలుగుతారు. ప్రస్తుతానికి కర్మకాండ అర్థమైతే సరిపోతుంది. అందుచేత ముందుగా నవగ్రహాలకి సంబంధించినటువంటి 9 దీపాలను వెలిగిస్తాము. ఏ దిక్కులో దీపం వెలిగిస్తామో, ఆ గ్రహానికి సంబంధించిన శ్లోకం చదువుతూ వెలిగిస్తాము.

మొట్టమొదటగా మధ్యలో ఒక దీపాన్ని సూర్య మంత్రం చదువుతూ వెలిగిస్తాము. తర్వాత తూర్పు దిక్కులో శుక్రుని మంత్రాన్ని చదువుతూ దీపాన్ని వెలిగించాలి. అలాగే ఆగ్నేయంలో చంద్రుని మంత్రాన్ని చదువుతూ దీపం వెలిగించాలి. ఇక అలా వరుసగా, దక్షిణదిశలో–కుజునికి, నైరుతిలో–రాహువునకు, పశ్చిమంలో–శనికి, వాయువ్యంలో– కేతువుకు, ఉత్తరంలో–గురువుకు, ఈశాన్యంలో–బుధుడికి అలా మంత్రాలు చదువుతూ దీపాలు వెలిగిస్తాము. ఆ విధంగా నవగ్రహ శాంతి జరిగిపోతుంది.

ఈ తొమ్మిది గ్రహాలు 12 రాసులలో చేసే సంచారము వలననే మన జీవితాలలో సుఖ దుఃఖాలు, బాధలు, ఆనందాలు వస్తుంటాయి. ద్వాదశ రాసులలో ఈ నవగ్రహాల సంచారమును

మనకు అనుకూలం చేసేందుకై శంకరాచార్యుల వారిచే రచింపబడిన గురుపాదుకాస్తవంలోని 12శ్లోకాలను చదవాలి. అలా నవగ్రహాలకు, ద్వాదశ రాసులకు శ్లోకాలు చదివేస్తాం. ఆ తర్వాత కోరికను చెప్పుకుని పరిస్థితిని బట్టి గాయత్రీ మంత్రాన్ని 11సార్లుగానీ, 24సార్లుగానీ లేక 108సార్లు గానీ భావనా పూర్వకంగా ఆహుతులు వెయ్యాలి. ఈ యజ్ఞాన్ని కళ్ళుమూసుకుని ఆర్తితో, ఏకాగ్రతతో చేసుకోవాలి. ఈ యజ్ఞవిద్యే భారతదేశం రత్నగర్భ అవటానికి కారణం. (చిన్న సవరణ; తర్వాత కాలంలో 12రాసులకు ప్రతీకగా 12 ఇటుకలతో యజ్ఞకుండాన్ని ఏర్పాటు చేసి, మధ్యలో ఒక దీపం, 8 దిక్కులలో, 8 దీపాలు వెలిగించి, పైన చెప్పిన కర్మకాండ చేయించారు) ఎలాంటి దోషాలున్నా ఈ యజ్ఞం చేసుకుంటే అన్నీ తీరిపోతాయని చెప్పారు. దీనిని ప్రతి రోజూ చేసుకోవలసిందే. ఎలాంటి వాస్తుదోషాలున్నా ఇంటిని మార్పు చెయ్యకుండా, ఈ యజ్ఞం చేస్తే అంతా సర్దైపోతుంది. ఈ మార్గమంటే ఇష్టంలేని వారి దగ్గర ఈ విషయాలు మాట్లాడవద్దు. మీరు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో మీ సంకల్పాలను వదులుకోకండి. ఆ గురువుల యొక్క ఆశీర్వాదము ఖచ్చితంగా మనతో పాటే ఉంటుంది. శిరిడీసాయి చాలాసార్లు చెప్పారు. నేను పిలిస్తే తప్ప మీరు రాలేరు అని. మరి ఆయన పిలిపించుకున్నారని అర్థమౌతున్నది కదా, అలా పిలిపించుకొని, మీకు ఇన్ని విషయాలు ఆయన చెప్పమన్న తరువాతే చెప్పటం జరిగింది. దీన్ని మీరెలా ఉపయోగించుకుంటారనేది మీ మీద ఆధారపడి ఉన్నది.

## యోగవిద్యా రహస్యాలు

బ్రహ్మజ్ఞానియైన మన మాస్టర్‌గారికి జీవితము యొక్క ప్రధాన ధ్యేయము జ్ఞానసముపార్జన చేయడమే. అందుకొరకు ఆయన రకరకాల సాధనలను చేస్తుండేవారు. అయితే ఆ జ్ఞానసముపార్జనతో పాటుగా, లోకం కోసం అధిక సమయాన్ని వినియోగిస్తుండేవారు. తానొక్కడూ ముక్కుమూసుక్కూర్చుని, మౌనియై, జ్ఞానియై తాను తరించటం మాత్రమే చాలదు. ఇతరులను కూడా తరింపచెయ్యాలనేదే వారి ధ్యేయం. శంకరాచార్యులవారు ప్రపంచంతో సంబంధం లేకుండా ఎక్కడో ఏకాంతంగా ఉంటూ బ్రహ్మానుభవస్థితిలో ఉండిపోయినట్లయితే ఈ అద్వైతమత మహాప్రభంజనం, ఇన్ని పీఠాలు, ఇన్ని ఆశ్రమాలు, ఇందులో ఇంతమంది కాషాయవస్త్రధారుల దివ్యతేజస్సు దశదిశలా ప్రసరించి వుండేదా? **ఈ జాతిలో పుట్టిన ప్రతి వ్యక్తి తన మాతృభూమికి ఋణపడి వున్నాడు. ఋషులకు ఋణపడి వున్నాడు.** ఆ ఋణం తీర్చుకోవాలంటే ప్రతి వ్యక్తి తన జీవితంలో కొంత సమయాన్ని ధర్మప్రచారం కోసం వినియోగించి తీరాలి.

ఈ దేశం నిన్ను ఒక సాధువుగా, ఒక సన్యాసిగా, ఉండనిస్తున్నది. ఆశ్రమాలను నిర్మించుకోనిస్తున్నది. దేవాలయాలను కట్టుకోనిస్తున్నది. మీకిలాంటి అవకాశం కల్పించిన ఈ సమాజానికి మీరు సేవ చెయ్యాలి. దాని కోసం మీరు తపస్సు చెయ్యాలి, సత్సంగాలు చెయ్యాలి, దానాలు చెయ్యాలి, తద్వారా ప్రజలను చైతన్యవంతులను చెయ్యాలి, జ్ఞానవంతులను చెయ్యాలి. గీతలో భగవానుడు 'జ్ఞాని నాకు చాలా ఇష్టుడు' అని కదా చెప్తాడు. అందరినీ జ్ఞానవంతులను చేసేందుకే మాస్టర్‌గారు యోగవిద్యకు ఆధారభూతమైన పతంజలి యోగసూత్రాలను ఈ క్లాసులలో చెప్పారు.

## పతంజలి యోగసూత్రాల వివరణ

24వ తేదీ సాయంత్రం చెప్పిన ప్రవచనాలలో యోగవిద్యా రహస్యాలను గురించి మాస్టర్‌గారు అద్భుతమైన ప్రసంగాన్ని సాధకులు తల్లీనమైపోయేలా చెప్పారు. ముందుగా అందరిచేతా పతంజలి యోగసూత్రాలను చదివించారు. ఈ యోగసూత్రాలు ఖచ్చితంగా మీ అందరికీ కంఠతా వచ్చెయ్యాలి. యోగవిద్యకు అసలు ఆధారమే భగవద్గీత. 163 రకాల యోగశాస్త్రాలున్నాయి. భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు ఎన్నో రకాల సాధనా విధానాలను అందులో ప్రతిపాదించాడు. ఈ యోగవిద్యను మొట్టమొదట నేను సూర్యుడికి చెప్పాను అంటాడు భగవానుడు. బయోకెమిస్ట్రీ కూడా దాన్ని ఈనాడు ఒప్పుకుంటున్నది. సూర్యుడే లేకపోతే జీవితం లేదు. యోగవిద్య అంతా సూర్యుడిలోనే ఉంది. సూర్యుడి తరువాత అద్భుతమైన యోగవిద్యా రహస్యాలు పతంజలి యోగసూత్రాలలో ఉన్నాయి. ఈ రెండూ ఒకదానికొకటి పూరకాలు. ఇప్పుడు సూర్యశక్తి గురించి ఎందుకు చెప్తున్నాను? ఈనాడు భూమ్మీద ఎన్ని రకాల శక్తులున్నాయో అవన్నీ తరిగిపోతున్నాయి. ఎందుకంటే ఆ శక్తి మూలాలు (ఎనర్జీసోర్సెస్) లేవు. కానీ సూర్యశక్తిని మీరు ఉపయోగించుకున్నా, ఉపయోగించుకోకపోయినా ప్రతిరోజూ మీకు కావలసిన దానికంటే ఎక్కువ పరిమాణంలో ఆ శక్తి భూమి మీదకు వస్తున్నది. ఆ శక్తిని ఉపయోగించుకోలేకపోతున్నాము. ఆ శక్తిని ఉపయోగించుకునే విద్యయే యోగవిద్య. యోగవిద్య కాంతికిరణ విజ్ఞానం గురించి చెప్తుంది. మీలో కొంచెం సైన్స్ మీద అవగాహన ఉన్నవారు పతంజలి యోగసూత్రాల మీద ఒక గంట ధ్యానం చెయ్యండి. భారతదేశం తిరిగి తన పూర్వవైభవాన్ని పొందుతుంది. రత్నగర్భస్థితికి వస్తుంది. మీ జీవితాలు ధన్యమైపోతాయి.

ఇప్పుడు సూర్యకిరణాలను ఉపయోగించుకోవడం నేర్చుకుందాం. దాన్ని అవగాహన చేసుకోవడానికి పెద్దపెద్ద చదువులేమీ అవసరం లేదు. మీరు ప్రతి రోజు దీనిని ఒక గంట సేపు అధ్యయనం చేస్తాము అనుకోండి. ముఖ్యంగా విభూతి పాదము అని ఉంది. అందులో ఎన్నో యోగసిద్ధులను గురించి చెప్పాడు. ఎన్ని రకాల మ్యాజిక్‌లు మీరెలా చెయ్యాలో చెప్తాడు. కేవలం సూత్రాలు చదివినంత మాత్రాన ఆ మ్యాజిక్కులు చేయలేరు. దేవతాశక్తిని మీరు ఉపయోగించుకోగలిగితేనే పతంజలి యోగసూత్రాలు మీకు ఉపయోగపడతాయి. ఒక్క రోజులో రాదు. ఒక సంవత్సరం పాటు మంకుపట్టుతో **పతంజలి యోగసూత్రాలు అధ్యయనం చెయ్యండి. మీరు నేర్చుకొని మీ పిల్లలకి నేర్పండి. దానివల్ల వాళ్ళ జీవితాలలో ఎంతటి విద్య, వైభవాలు వస్తాయో చెప్పలేను. అధ్యయనం చెయ్యండి, అది ఎన్ని భౌతిక లాభాలను ఇస్తుందో మీరు ఊహించలేరు. మీ బ్రెయిన్ పాట్రన్ మొత్తం మారిపోతుంది.** పతంజలి యోగ సూత్రాలు ప్రతిరోజు చదవండి. మహేష్‌యోగి శిష్యుడైన టోనీనేదర్ ఈ పతంజలి యోగసూత్రాలపై రీసెర్చి చేసి కొన్ని నిజాలను బహిర్గతం చేశారు. శాస్త్రవేత్తలు, బ్యాంకు మేనేజర్లు వంటివారిని కొంతమందిని తీసుకొని వారి మెదడులను స్కాన్ చేశారు. వారందరి మెదడులలో పెద్దపెద్ద కన్నాలున్నాయి. అలాగే బాగా చెడు అలవాట్లకు బానిసలైన వారి మెదడులను కూడా తీసుకొని స్కాన్ చేశారు. అక్కడ అలానే కన్నాలున్నాయిట. ఇంక వెంటనే వారిలో కొందరిని తీసుకొని వారి చేత పతంజలి యోగసూత్రాలను కొన్ని నెలల పాటు బట్టీ కొట్టించి, మళ్ళీ వారికి పరీక్షలు జరుపగా కన్నాలన్నీ పూడుకుపోవడమే కాక, పద్మాసనంలో కూర్చొని ఎగరగలిగే స్థితి వాళ్ళకి వచ్చిందిట. మీరు మీ పిల్లలచేత చదివించండి. వాళ్ల జ్ఞాపకశక్తి ఎంత మెరుగౌతుందో మీరే చూడండి. అన్ని లాభాలున్న ఆ యోగవిద్యను నేర్చుకోండి.

ఈ పతంజలి యోగసూత్రాలను ఒక్కసారిగా ఎవ్వరూ నేర్చుకోలేరు. రోజూ కొంచెం, కొంచెంగా నేర్చుకోండి. అలాగా ఈ పనిని మెల్లి, మెల్లిగా మొదలు పెట్టండి, ఉద్యోగాలు అవే వస్తాయి. (మాస్టర్‌గారి దగ్గరకు వచ్చి ఒకరు ఉద్యోగ ప్రయత్నం గురించి చెప్పగా, సభాముఖంగా అందరికీ ఉపయోగపడే ఈ సాధనా విధానాన్ని చెప్పటం జరిగింది) ఇవాళ మీరిక్కడ 'నేను ప్రతి రోజూ ఒక గంట సేపు పతంజలి యోగసూత్రాలు చదువుతాను' అనే దీక్షను తీసుకుని ఇంటికి వెళ్ళండి. దానికి దైవీ శక్తులు సహకరిస్తాయి. మొత్తం పతంజలి యోగసూత్రాలను చెప్పగలిగే స్థితికి మీరు ఎదగాలి. అలా మీరు చెప్పగలిగిననాడు మీరిప్పుడున్న చేతనత్వస్థాయి నుండి సర్వజ్ఞత్వం,

సర్వవ్యాపకత్వం స్థాయికి వెళ్ళిపోగలుగుతారు. దాని పరిధి, అనంతం నుండి అనంతం వరకు. సూత్రం చూడగానే అర్థం చెప్పగలగాలి. దీనికంతటికీ సాధన చాలా అవసరం.

## సాధన

రోజు వారీగా టైం టేబుల్ వేసుకుని ఇక్కడ చెప్పిన సాధనలను రెగ్యులర్‌గా చెయ్యండి.

1. ఒక గంట శ్వాస మీద దృష్టిని ఉంచండి.

2. ఒక గంట 'ఓంసాయి వేంకటేశ శ్రీరాం ఓం' జపం.

3. ఒక గంట పతంజలి యోగసూత్రాల అధ్యయనం.

4. ఒక గంట యోగాసనాల అభ్యాసం.

ఇదంతా మీకు మీరే కష్టపడాలి తప్ప గురువేదో చేసేస్తాడు, లేకపోతే ఆయన చెయ్యనివ్వడం లేదు కనుక నేను చెయ్యలేకపోతున్నాననే అపోహల్లో వుండకండి. ఆ తర్వాత రాబోయే 2500 సంవత్సరాల వరకు ఈ విద్యే వుంటుంది. దాని తర్వాత విద్య సిరీస్ నక్షత్రం నుండి వస్తుంది. ఇవన్నీ జ్వాలాకూల్ మహర్షి వ్రాసిన 1.సోల్ ఎండ్ ఇట్స్ మెకానిజం. 2. రీ అప్పియరెన్స్ ఆఫ్ క్రైస్ట్ 3. ది ఎక్స్‌టర్నలైజేషన్ ఆఫ్ హైరార్కీ అనే ఈ మూడు పుస్తకాలలో ఈ విషయాలు స్పష్టంగా చెప్పబడ్డాయి. ఈ పుస్తకాలు సంక్షిప్తంగా తెలుగులో ప్రచురించబడ్డాయి. చదవండి. ఈ విధంగా శిరిడీలో ఇరవై ఐదువందల సంవత్సరాలకు సరిపోయే అద్భుతమైన జ్ఞానాన్ని వితరణ చేయటం జరిగింది.

# VII గురువులు – దేవతలు

## అధ్యాయం-19
## ఉద్యోగ విరమణ – సాయి సన్నిధి

అది 2002 సంవత్సరం 'మే' నెల. అప్పుడు మాస్టర్‌గారు హైదరాబాద్‌లో ఉన్నారు. ఎండాకాలం సెలవులు. సాధనా క్యాంపులేవీ ప్రకటించబడలేదు. అందరూ ఎవరెవరి పనులలో వాళ్ళు తలమునకలౌతున్నారు. అనుకోని రీతిలో మాస్టర్‌గారు శిరిడీకి ప్రయాణమయ్యారు. 'సాధనా శిబిరం' లాంటిది కాదు. కేవలం సాయి సన్నిధిలో మూడు రోజులు గడపడం కోసమే బయలుదేరారు. శిరిడీ ప్రయాణం అందరికి తెలిసిపోయింది. రాదల్చుకున్న వాళ్ళు స్వయం బాధ్యత మీద రావచ్చుననే సడలింపుని మాత్రం ఇచ్చారు. కేవలం సాయిదర్శనం చేసుకోవటం తర్వాత వీలైనంత ఎక్కువ సేపు ఆయన సమక్షంలో ధ్యానంలో మాత్రం కాలం గడిపేవాళ్ళు. పూజ్యశ్రీ మాస్టర్‌గారితో పాటు నేను, మహేంద్ర, ఒంగోల్ కిషోర్ ఉన్నాం. శిరిడీ వెళ్ళేసరికి మరికొంతమంది అక్కడ వచ్చి కలవడం జరిగింది.

సాయిదివ్యధామంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారితో కలిసి అందరం సాయిదర్శనం చేసుకొని అక్కడి నుండి ద్వారకామాయి, చావడి చూసుకొని దక్షిణాభిముఖ ఆంజనేయస్వామి సన్నిధిలో కూర్చున్నాం. ఎక్కడవున్నా మాస్టర్‌గారు ఏవో సాధనా రహస్యాలను చెప్తూనే ఉంటారు. అలానే చెప్తున్నారు, మైమరచిపోయి అందరూ వింటున్నాం. ఇంతలో హఠాత్తుగా ఫోనులో ఒక వార్త వచ్చింది. అనుకోని రీతిలో గుంటూరు నుంచి వస్తున్న మన పరివార్ సభ్యుల కారు ప్రమాదానికి గురైంది. ఆ కారులో సావిత్రి, సాగర్, ఇంకో ఇద్దరు ఆడవాళ్ళు ఉన్నారు. వాళ్ళు కూడా సాయిదర్శనానికే వస్తున్నారు. ఆ వార్త శ్రీవిశ్వనాథ్‌గారు, అన్నగారికి చెప్తూ దానికి సంబంధించిన కొన్ని ముందస్తు జాగ్రత్తలను తీసుకున్నామనీ ఏమీ కంగారు పడవద్దనే విషయంగూడా చెప్పారు.

అందరూ కంపించిపోయారు. బాబా! ఎలాగైనా వాళ్ళను సురక్షితంగా ఉండేలాగా చెయ్యమని అందరం బాబాను మనసారా వేడుకున్నాం. మాస్టర్‌గారు మటుకు తక్షణమే ప్రమాద స్థలానికి వెళ్ళమని శ్రీ ఆదిత్య శేఖర్, కిషోర్ వాళ్ళను ఒక కారు ఇచ్చి పంపారు. ఎందుకంటే వారప్పుడు మహారాష్ట్రలో ఉద్యోగం చేస్తుండేవారు. అక్కడి ఊళ్ళు వాళ్ళకు బాగా పరిచయమని వారిని పంపారు. ఏది జరిగినా భౌతిక ప్రయత్నం అనివార్యం కనుక వాళ్ళను అక్కడికి పంపించి వాళ్ళ సంరక్షణ భారంలో తమ వంతు సూక్ష్మకృషిని మాస్టర్‌గారు చేయటం వలన కారులో ఉన్న పిల్లలందరూ కొద్దికొద్ది దెబ్బలతో సురక్షితంగా బయటపడ్డారు. అయితే అప్పటికే కుమారి సావిత్రి బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని వారి క్షేమసమాచారాలను చూసుకున్నారనేసరికి అందరికీ ఇది ఎంతో ఆనందం కలిగింది. ఆ ప్రమాదం నుంచి వాళ్ళు బయటపడటానికి మాస్టర్‌గారు ఎంత శక్తిని అక్కడ వినియోగించారనేది కంటికి కనిపించే భౌతిక ప్రక్రియ కాదు కదా! అలా సర్వసమర్థులుగా అప్రత్యక్షంగా తమ బాధ్యతలను ఎంతో జాగరూకతతో నిర్వహిస్తుండేవారు. సరే మూడు రోజుల పాటు అందరూ సాధనలు చేసుకున్నారు. ఎవరి ఊళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. కాలేజీలు తెరిచారు. పూజ్యులు శ్రీమాస్టర్‌గారు గుంటూరుకు వచ్చారు. మళ్ళీ కాలేజీ పనితో పాటు సప్తర్షి ఆశ్రమంలో కార్యక్రమాలు యధావిధిగా జరిగి పోతున్నాయి.

ఉన్నట్లుండి మాస్టర్‌గారు తమ ఉద్యోగానికి రిజైన్ చేస్తానని ప్రకటించారు. 'అలా ఎందుకు మాస్టర్‌గారు' ఆశ్రమం ఉంది, కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉద్యోగానికి రాజీనామా చెయ్యటం ఎందుకు అని దగ్గరగా ఉన్న ఆత్మీయులు అడగ్గా సాయి "దీపం ఉన్నచోట మళ్ళీ ఇంకో దీపం వెలిగించటం ఎందుకు, అంధకారమున్న చోటనే కదా దీపం వెలిగించాలి" అని చెప్పాడు. అందువల్ల నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. గురువులు ఎప్పుడూ అంతా సూచన ప్రాయంగా మాత్రమే చెప్తారు. దానిని క్రియాశీలం చేసుకోవటం అనేది మన బాధ్యత. ఉద్యోగం మానేసి నేను రాజధాని హైదరాబాదుకు వెళ్ళిపోతాను. అక్కడికి వెళ్ళిన తర్వాత ఏం చెయ్యాలో అప్పుడాలోచిస్తానని చెప్పారు. 2002 ఆగష్టు నెలాఖరుకు 'వాలెంటరీ రిటైర్‌మెంట్' తీసుకుంటాని అందరితో చెప్పేశారు. ఎందుకో తెలియదు మళ్ళీ హైదరాబాదుకు వెళ్ళిపోయారు. సప్తర్షి ఆశ్రమంలోనే ఉంటూ శ్రీనారాయణరావు గారు శ్రీశిరిడీసాయి, వేంకటేశ్వరస్వామి మందిరాల నిర్వహణ బాధ్యతను చూస్తున్నారు. ఈ సాధనాశిబిరాల నిర్వహణ బాధ్యత అటు శిరిడీలో, ఇటు తిరుమలలో ఎక్కడ చేసినా అదంతా మాస్టర్‌గారి తమ్ముడు శ్రీవిశ్వనాథ్‌గారే చూసుకునేవారు. అసలు ఈ పూర్ణిమ ధ్యానాలను ఎందుకు

చెయ్యాలి? మేష పూర్ణిమ, వృషభ పూర్ణిమ, మిథున పూర్ణిమల సాధనా విశిష్టత తరువాత అధ్యాయాలలో వివరంగా ఇవ్వబడింది.

సెప్టెంబర్‌కి హైదరాబాద్‌కు వెళ్ళిపోయారు. అక్కడ విశ్వనాథ్ గారు ఏర్పాటు చేసిన ఒక ఆశ్రమ వ్యవస్థ ఉన్నది. అక్కడ సాధనా క్యాంపులను ప్రారంభించారు. దాంతో పరివారం పెరిగింది. ఉత్సాహవంతులైన సక్రియ కార్యకర్తలు ఏర్పడ్డారు. హైదరాబాద్‌లో మళ్ళీ నూతన ఉత్సాహంతో పని చేయడం మొదలెట్టారు. ప్రతి రోజు క్రొత్త జీవితమా అన్నంత స్ఫూర్తితో పనులు జరుగుతున్నాయి. విశ్వనాథ్‌గారు అప్పుడు ఆంధ్రాబ్యాంక్ కాలనీలో వుంటుండేవారు. ఇల్లు చాలా పెద్దది కూడా కావడం వలన ఒక మాదిరి సాధనా క్యాంపులనక్కడే పెడుతుండేవారు. విశ్వనాథ్‌గారికి అన్న అన్నా, అన్నమాట అన్నా వేదవాక్కు. అక్షరాలా ఆచరించేవారు. ఏమి చెబితే అది చేసేవారు. ఇంతలో భరద్వాజ మాస్టర్‌గారి 'ఆరాధన' పర్వదినం వచ్చింది. ఈ సందర్భంగా విమల వచ్చి మాస్టర్‌గారిని ఆహ్వానించింది. ఈ కార్యక్రమానికి వెళ్ళిన మాస్టర్‌గారికి వచ్చిన ప్రేరణ ఏమిటో తెలియదు. ఇక వారి జీవిత విధానం ఆ రోజు నుంచి మరో మలుపుకు తిరిగింది.

పూజ్యశ్రీ మాస్టర్‌గారి వ్యక్తిత్వాన్ని, కర్తృత్వాన్ని మాటల ద్వారా కాయితాం మీద పెట్టలేం. లక్ష్యాన్ని సాధించాలంటే నీ దారిని నీవే ఏర్పరచుకోవాలి. ఇతరుల నుంచి సహాయాన్ని ఆశిస్తే నిరాశే మిగులుతుంది. కనుక నీ మార్గంలో నీవే ముందుకు సాగు అనేది మాస్టర్‌గారి సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్నే వారు జీవితాంతం ఆచరించి చూపించారు.

## ఆశ్రమములు, సాధనలు

మాస్టర్‌గారు ఉద్యోగవిరమణ చేసేవరకు స్థాపించిన ఆశ్రమములు–అందించిన సాధనలు–భారతీయ సంస్కృతీ శంఖారావము

## అగ్నివిద్యాకేంద్రం-శ్రీహంసరామాశ్రమము

పూజశ్రీ మాస్టర్‌గారు తమ ప్రవచనాలలో భారతదేశపు గౌరవము, గొప్పదనము, దానియొక్క ఆధ్యాత్మికతలో ఉందని చెప్తుండేవారు. విదేశాల నుండి ఆధునిక విజ్ఞానాన్ని దిగుమతి చేసుకున్న మనము, కర్మ సిద్ధాంత ప్రకారం, వారికి మన వేదవిజ్ఞానాన్ని, దానిని నిత్యజీవితంలో పురాతన ఋషులు ఏ విధంగా ఆచరించారో, అలానే మనమూ వాటిని ఆచరిస్తూ తెలపాలి. మనకు నిర్దేశించబడిన ఈ నియతిని మనమెట్టి పరిస్థితులలోనూ తప్పించుకోలేము. మనము భారతీయులంగా

పుట్టటమే దీనికి నిదర్శనం. కానీ మహామహులకే వారి యొక్క ప్రతిభ కార్యదక్షతల మీద అప్పుడప్పుడు సందేహాలు వస్తూవుంటాయి. యుద్ధరంగంలో అర్జునుడు గాండీవాన్ని వదిలి వేయడం, సముద్రం దాటాల్సి వచ్చినప్పుడు హనుమంతునికి తన సామర్థ్యం గుర్తుకురాకపోవటం దీనికి కొన్ని ఉదాహరణలు. భారతదేశంలో పుట్టిన మనమంతా హృదయదౌర్బల్యాన్ని విడనాడి భారతీయసంస్కృతీ శంఖారావాన్ని దిగ్దిగంతాల వరకు వినిపించాలనే దీక్షను స్వీకరించాలి.

వ్యక్తి వ్యక్తిలో ఉన్న ప్రతిభ, శక్తి సామర్థ్యాలను ఈనాడు పరమగురువుల ప్రణాళికకై వినియోగించాల్సిన తరుణమాసన్నమైంది. దానికొరకే పూజ్యశ్రీ మాస్టర్‌గారు రకరకాల ప్రణాళికలను రూపొందించి మానవజాతిని సరైన సమయంలో, సరైన మార్గంలోకి తీసుకురావటానికి ప్రయత్నించడం జరిగింది. అందులో భాగంగానే ఒక ఆశ్రమాన్ని స్థాపించాలని ప్రయత్నించారు.

పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్యగారు ఋషుల ప్రణాళికలను ఎలాగైతే పునఃకార్యాచరణలోకి తీసుకువచ్చి సాధకుల జీవితంలో వాటిని ఓతప్రోతం చేశారో అలాగే మాస్టర్ గారు పరమ గురువుల ప్రణాళికలకు ఆయా దేశ కాలాలకి అవసరమైన రీతిలో విశిష్ట సాధనా విధానాలను రూపొందించి వాటిని ప్రాచుర్యంలోకి తేవడానికి చాలా కృషి చేశారు. భారతదేశం జగద్గురు పీఠాన్ని అధిరోహించాలన్నా, నేటి మానవుడు పురోగతి పేరుతో కనీస విలువలు లేని జీవితం నుండి తిరిగి ఒక నిజమైన భారతీయుని స్థాయికి ఎదగాలన్నా దానికి కావలసిన ఆధ్యాత్మిక మార్గదర్శనానికి తిరిగి గురుపరంపర మాత్రమే శరణ్యమని ఆ గురుపరంపరలోని గొప్పతనాన్ని మానవజాతికి తెలియచెప్పటానికి అతి తీవ్ర కృషిచేశారు.

### శ్రీ హంసరామ ఆశ్రమాన్ని ఎందుకు నిర్మించారు?

1995 గురుదేవుల ప్రథమ పూర్ణాహుతి సందర్భంగా వ్రాయించిన 24 లక్షల గాయత్రీ మంత్రలేఖనాలను భూమిలో స్థాపించి దానిమీద స్థూపాన్ని కట్టించాలి. దీని వలన ప్రకృతిలో సంతులన కలుగుతుంది. దీని తర్వాత మనుషులు నిత్యజీవితంలో అనేక శారీరక బాధలతో, సమస్యలతో, దిక్కుదోవ తెలియక సతమతమౌతున్నారు. పెళ్ళిళ్ళు కావాలని, సంతానం కలగాలని, కుటుంబ సమస్యలు తీరాలని ఇలా అనేక రకాలుగా తమ జీవితంలో పోరాటాలు సాగిస్తున్నారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారమార్గం చూపించడం, ఈ రెండే కాకుండా అసలు జీవిత పరమార్థాన్ని తెలుసుకొని ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించడానికి ప్రయత్నించే సాధకుల కోసం కూడా కలిపి "శ్రీహంసరామ ఆశ్రమాన్ని" స్థాపించాలనేది వారి అసలు ప్రణాళిక.

ఈ ప్రణాళికలో భాగంగా మొట్టమొదటగా 1996 దేవీ నవరాత్రులలో నవరాత్రి సాధనకు అక్కడ మొదట శ్రీకారం చుట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని పరివారమంతా "సాధనా శిబిరానికి" వచ్చేశారు. సాధనతో ఆశ్రమ నిర్మాణానికి తగిన కార్యాచరణ ప్రణాళిక కూడా మెల్లమెల్లగా రూపొందుతున్నది.

అందులో స్థూపనిర్మాణం మాస్టర్‌గారి మొదటి లక్ష్యం. విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. బయటకు అడుగుపెట్టడానికి కూడా సాహసించలేని పరిస్థితి. అయినా కార్యకర్తలందరి కృషి ఫలితంగా 12'x12'x12' అడుగులు భూమిలోకి త్రవ్వి అంత వర్షంలోనూ పాలిథిన్ పేపర్లు నేలమీద పరిపించి దాని మీద 24 లక్షల మంత్రలేఖనాలను పేర్పించి పైన స్థూపాన్ని నిర్మించారు. భవాని అనే అమ్మాయిని లోపలికి దింపి మొదటిగా ఈ మంత్రలేఖనాలను పెట్టించిన భాగ్యం ఆ అమ్మాయికి కలుగజేశారు. ఆనాటి నుండి ఆమెను 'భువన' అని పిలువసాగారు. భువన ఎంతో అదృష్టవంతురాలు. తరువాత కొంతకాలానికి మంచి నిదానస్తుడు యోగ్యుడు అయిన మోహన్‌తో ఒంగోలులో ఆమె వివాహం జరిగింది. మాస్టర్‌గారు దగ్గరుండి వారి వివాహం జరిపించి అఖండ ఆశీస్సుల నందించారు.

## స్మర్తుగామి సిద్ధక్షేత్రము-శ్రీ హంసరామ ఆశ్రమము

సజలశ్రద్ధ-ప్రఖరప్రజ్ఞల సమన్వయము. 1997 డిసెంబర్ 31వ తేదీన కాకివాయిలో స్మర్తుగామి సిద్ధక్షేత్రము-శ్రీ హంసరామ ఆశ్రమ ప్రాంగణంలో మాస్టర్‌గారు ఒక ప్రముఖమైన ప్రవచనంలో అసలు ఈ ఆశ్రమస్థాపన ఎందుకు చేశారు? దాని విశిష్టత ఏమిటనేది వివరించారు. రెండు వేరువేరు ఉద్దేశ్యాలతో ఈ స్మర్తుగామి సిద్ధక్షేత్రము, శ్రీ హంసరామ ఆశ్రమాలను స్థాపించారు.

ఆధ్యాత్మిక జగత్తులో ఒక నూతన అధ్యాయాన్ని ఇక్కడ ప్రారంభించాలనే కోరికతో, రెండు రకాలైనటువంటి పరిస్థితులు అక్కడ ఏర్పాటు చేయటం జరిగింది. ఒక పరిస్థితికి అంటే ఒక సిస్టమ్‌కు 'స్మర్తుగామి సిద్ధక్షేత్రము' అని పేరు. ఇంకొక వ్యవస్థకి, ఇంకొకరకమైన విధానాన్ని అవలంబించేటటువంటి మరొక సిస్టమ్‌కు 'శ్రీ హంసరామ ఆశ్రమము' అని పేరు. ఈ రెండూ వేరు వేరు ఉద్దేశ్యాలతో నిర్మించడం జరిగింది. వాటి ఉద్దేశ్యాలను అర్థం చేసుకొని సిద్ధక్షేత్రంలో ఉన్నప్పుడు ఒకవిధంగా – శ్రీ హంసరామ ఆశ్రమంలో ఉన్నప్పుడు ఒకలాగా ప్రవర్తించవలసినదిగా నియమాలను ఏర్పాటు చేశారు. ఆశ్రమంలో ఉన్నవారైనా, ఆశ్రమానికి వచ్చినవారైనా అక్కడ పెట్టిన నియమాలను చాలా చాలా స్పష్టంగా తెలుసుకుంటే తప్ప అసలు ఆశ్రమము పెట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ఎవరికీ అర్థం కాదు.

## ఆధ్యాత్మిక వేత్తలు అంటే ఎవరు?

ఏ పనినైనా అందరి కంటే బాగా చేసిన వాళ్ళు ఆధ్యాత్మికవేత్తలు. ఇది మిగతా ఆశ్రమాల్లాంటిది కాదు. అసలు దీని ఉద్దేశ్యం ఏమిటంటే – ఈ ఆశ్రమము 'సకల సమర్థసద్గురువాణి' లేదా" The voice of Gurus" అనగా గురువుల యొక్క వాణికి కేంద్రంగా రూపొందించబడుతున్నది. విభిన్న దేశకాల పరిస్థితులలో అనేకమంది మహనీయులు ఉద్భవించారు. ఒక్క భారతదేశంలోనే కాదు. భారతదేశంలో కూడా చాలామంది ఉద్భవించారు. మనకు తెలిసినవాళ్ళు కాక తెలియనివాళ్ళు ఎంతమంది వున్నారో మరి. వారంతా చెప్పిందేమిటంటే – ప్రాణం ఉన్నటువంటి వ్యక్తులు మాగ్జిమమ్ ఎఫిషియన్సీ చూపించగలగాలి. దానినే శ్రీకృష్ణుడు గీతలో 'యోగః కర్మసుకౌశలం" అన్నాడు. అంటే మీరు చేసేటటువంటి ఏ పని అయినా సరే ఎంత బాగా చెయ్యగలరో, అంత బాగా చెయ్యగలిగితే మీరు ఆధ్యాత్మికవేత్తలు. ఏ పని చేసినా సరే 'ది బెస్ట్' అయివుండాలి. ఇంక దానికంటే మించి ఇంకొకడు ఆ పనిని చేయలేడు. ఎవరైనాసరే ఆధ్యాత్మికవేత్తగా అంటే స్పిరిట్యులిష్టుగా జీవించదలుచుకుంటే 'ది బెస్ట్' గా తయారవ్వాలి. అదీ ఆధ్యాత్మికత అంటే. అందరికంటే ఆ పనిని మీరే బాగా చేయగలగాలి. అది వంట అయినా సరే! ఇల్లు ఊడ్చే పనైనా సరే!

## స్మర్తుగామీ సిద్ధక్షేత్రము

ముందు స్మర్తుగామి సిద్ధక్షేత్రమును గురించి వివరించాలి. అసలు సత్యమేమిటంటే భగవంతుడి గురించి ఏమి చెప్పినా అది తప్పే అవుతుంది. ఎందుకంటే వెలుతురు ఉన్నప్పుడు చీకటిలేదు. చీకటి ఉన్నది అంటే వెలుతురు లేనట్టు లెక్క, కానీ భగవంతుడిలో రెండూ వున్నాయి. 'క్రోధః క్రోధకృధ్' అని విష్ణు సహస్రనామంలో వస్తుంది. అంటే కోపాన్ని తెప్పించేవాడూ వాడే, కోపాన్ని నాశనం చేసేవాడు వాడే, ఈ ద్వంద్వం అనేక సహస్రనామాలలో వస్తుంది.

అందుచేత భగవంతుణ్ణి పాజిటివ్ నెగటివ్ కలిసిన 'తత్' అందామా? చేతనత్వము అందామా? సర్వజ్ఞుడు అందామా? అంతకంటే ఇంకేం పేరు చెప్పలేము. అంత గొప్ప వ్యక్తిత్వము మనకు ఎక్కడ లభిస్తుంది? ఆ గొప్ప వ్యక్తిత్వం సర్వేసర్వత్రా వుంది. రష్యాలో వుంది. అమెరికాలో వుంది. బ్రహ్మలోకంలో వుంది. భువన భువనాంతరాళాల్లోనూ వున్నది. అన్నిచోట్లా వ్యాపించి వుంది. కనుక స్మర్తుగామి అందాం. అయితే స్మర్తుగామి అంటే మనం స్మరిస్తే వచ్చేసేది. మనం స్మరిస్తే వచ్చేస్తారని ఆయనకి ఆపాదిస్తాం. కానీ ఆయనేం రారు. అయన అన్నిచోట్లా ఒకేలాగా వుంటారు.

కానీ ఒక ప్రత్యేక ప్రదేశంలో ఆ అనుభూతిని పొందటం సులభం అవుతుంది. డైనింగ్‌టేబుల్ మీద చదువుకోవచ్చు. స్టడీరూంలోనూ చదువుకోవచ్చు. బెడ్‌రూములోనూ చదువుకోవచ్చు. ఏ అభ్యంతరమూ ఉండదు. కానీ **ఎక్కడపడితే అక్కడ కూర్చొని చదివితే మనస్సు లగ్నం కాదు. అలాగే సర్వేసర్వత్రా వ్యాపించినటువంటి ఆ మహాశక్తిని గుర్తించగలిగే స్థాయికి మనం ఎదగాలి అనే భావనతో ఈ సిద్ధపీఠాన్ని స్థాపించటం జరిగింది.**

దీనిని సిద్ధపీఠమని ఎందుకు అంటున్నామంటే ఆయన ఎప్పుడూ సిద్ధంగానే వుంటాడు కనుక ఇది సిద్ధపీఠమే. మనం పిలవటం లేదు కనుక ఆయన రావటం లేదు. మీరిక్కడ ఏ స్తోత్రాలు చదవక్కరలేదు. స్విచ్ నొక్కితే చాలు వెలుగు వచ్చినట్లు శక్తి ప్రసరిస్తుంది. ఆ నొక్కుకోవటానికి కావల్సిన పృష్ఠభూమి ఏమిటంటే మౌనము. మౌనంగా వుండకపోతే గురువు ఏం చెప్పాడో అర్థం కాదు.

ఇక్కడకు ఎవరు వచ్చినా మౌనంగా ఉంటూ ఆ శక్తికి లోబడితే చాలు. ఈ వాతావరణంలో నిరంతరమూ ఆ శక్తి ప్రవాహాలు ప్రవహిస్తూనే వున్నాయి. అన్నిచోట్లా వస్తూనే వుంటాయి. కానీ ఇక్కడ చాలా స్పష్టంగా పట్టుకోగలుగుతారు. ఇక్కడ బయటకు ముగ్గురు మహాత్ములు వేంకయ్యస్వామి, శిరిడీసాయి, సొరకాయల స్వామి ఫోటోలు కనిపిస్తున్నా, ఆ ముగ్గురూ సర్వదేవతాస్వరూపాలేనని వాళ్ళ జీవితచరిత్రలు చెప్తున్నాయి. శిరిడీసాయిని తలచుకున్న అనేక సందర్భాలలో వేంకయ్యస్వామి అనేటటువంటి ఆ శక్తి వచ్చి రక్షించటం అనేది అనేకమంది జీవితాలలో వచ్చిన అనుభూతి అది. స్మర్తుగామి- తలుచుకుంటే ప్రత్యక్షమయ్యే శక్తి.

అద్భుతమైన శక్తికి ఇది కేంద్రంగా మలచబడింది. శిరిడీసాయి, వెంకయ్యస్వామి పేర్లు సర్వజన విదితమే. తర్వాత మనకు సొరకాయలస్వామివారి పేరు వినిపిస్తుందిక్కడ. బ్లావెట్స్కీ మాడం వాళ్ళు కూడా వచ్చి వీరిని దర్శించుకున్నారు. దర్శించుకున్నప్పుడు ఆయన అన్నారట "అబ్బో తెల్లకాకులు కూడా వస్తున్నాయే" అని. అద్భుతమైన జీవితచరిత్ర ఆయనది. అలాంటి స్మర్తుగామి సిద్ధక్షేత్రమిది. మీకు ఏదైనా బాధలు ఉన్నా, ఏ విధమైనటువంటి ఇబ్బందులు వున్నా ఇక్కడ అడగండి. ఇంతకంటే గొప్పగా ప్రపంచంలో ఏ శక్తీ మీ సమస్యలను నివారించలేదు. మీకిక్కడ నివారణ లభించకపోతే ప్రపంచంలో ఇంక ఎక్కడా దానికి నివారణ లభించదు. ఆ శక్తిని ఉపయోగించుకోవటం నేర్చుకోవాలి.

ఏ కోర్కెకైనా మీరు కోరుకోవచ్చు. అందుచేత మీకున్న బాధలు కానీ, మీ చుట్టుప్రక్కల ఉన్న ఇళ్ళల్లో ఉన్నటువంటి బాధలు కానీ ఏదైనా వుంటే మీరిక్కడికి వచ్చి ఈ క్షేత్రంలో వారి సన్నిధిలో కూర్చుని మీకిష్టమైన గురుచరిత్ర ఒక్కటి 3 రోజుల్లో పారాయణ చెయ్యాలి. ద్రవాహారం మాత్రమే తీసుకోవాలి. తర్వాత మీ సమస్యను ఒక కాగితం పై వ్రాసి ఆ కాయితాన్ని ధునికి 11 ప్రదక్షిణలు చేసి అందులో వేసి ఒక కొబ్బరికాయ ధునిలో వేస్తే చాలు. అంతటితో మీ సమస్యలు తీరిపోతాయి. మీరిక్కడికి రాలేకపోయినప్పుడు - మీ సమస్యను ఒక ఉత్తరంలో వ్రాయండి. ఇక్కడ మీ ఉత్తరాలు ఎవ్వరూ చదవరు. మీ ఉత్తరాలు నేరుగా ధునిలోకి వెళ్ళిపోతాయి. ద్రవాహారంతో గురుచరిత్ర పారాయణ, అది ఇంటి దగ్గర చేసినా మీకు ఫలితం వస్తుంది.

శక్తివంతులైన ముగ్గురు మహావ్యక్తులను నేను రిక్వెస్టు చేశాను. సొరకాయలస్వామి ఓ అద్భుతమైన వ్యక్తిత్వం. శిరిడీసాయి మహా అద్భుతమైన వ్యక్తి. ఇంక వేంకయ్యస్వామి మహానుభావుడు. వీరు ముగ్గురు వచనబద్ధులైవున్నారు. మీకు తెలియదు వాళ్ళు ఏ లోకాలనుంచి వచ్చారో. అంతటి మహాత్ములు పిలిస్తే పలుకుతారు. ఆ ముగ్గురు నాకు మాట ఇచ్చారు. మీ అందరి సమస్యలు తీరుస్తామని. ఇదంతా వారి అనుగ్రహమే. పద్ధతిగా ఎవరికివారు శ్రద్ధగా చేసుకుంటే ఫలితాలు ఖచ్చితంగా వస్తాయి. ఇదొక రిలేస్టేషన్. స్మర్తుగామీ సిద్ధక్షేత్రం సర్వార్ధసిద్ధి కొరకు స్థాపించబడిన ఒక అద్భుతమైన వ్యవస్థ.

## శ్రీ హంస రామ ఆశ్రమము

మొదటి యూనిట్ స్మర్తుగామి సిద్ధ క్షేత్రం. దాని సాధనా విధానాలు చెప్పినట్లే, ఇంక మాస్టర్‌గారిచే స్థాపించబడిన రెండవ యూనిట్ శ్రీ హంస రామ ఆశ్రమములో సాధన. ఈనాడు ఆశ్రమాలు ఎలా వున్నాయి అంటే ఎందుకూ పనికిరానివాళ్ళు, ఇళ్ళల్లో విసిగిపోయినవాళ్ళు, పిల్లలు నేను చెప్పినట్లు వినటం లేదని అనుకునే వాళ్ళకు అప్పుడు భగవంతుడు గుర్తుకువస్తాడు. ఆశ్రమాలు గుర్తుకువస్తాయి. అన్నీ బాగానే వుంటే ఆశ్రమాలు అక్కర్లేదు. భగవంతుడు అక్కర్లేదు. అయితే శ్రీ హంస రామ ఆశ్రమములో అలా కుదరదు, 'భగవంతుడు తప్ప మాకింకేమీ అవసరం లేదు, **సాధనే పరమావధి**' అనేవాళ్ళు మాత్రమే ఈ ఆశ్రమంలోకి అడుగుపెట్టాలి.

ఈ ఆశ్రమంలో సాధన కోసం వచ్చేవాళ్ళు పాటించవలసిన మొదటి నియమం - మౌనం: ఎన్నో జన్మల బట్టి మాట్లాడుతూనే వున్నాం. అందుచేత శ్రీ హంస రామ అశ్రమంలో మౌనంగా

వుండటం మొదటి నియమం. రెండవ నియమం: అందరూ సాధకులే. ప్రత్యేకమైన గుర్తింపులంటూ ఏమీ వుండకూడదు. ఇక్కడ చిన్నా పెద్ద అందరూ సాధకులే. అందరూ విద్యార్థులే. ఎవరి పనులు వాళ్ళు చేసుకోవాల్సిందే! అందుచేత మాస్టర్‌గారు కూడా 'నా పనులు నన్ను చేసుకోనివ్వండి. ఈ ఆశ్రమంలో ఉన్నంతవరకు నా పనులు ఎవ్వరూ చెయ్యవద్దని' ఖచ్చితమైన నియమం పెట్టారు.

ఈ ఆశ్రమంలో టైంటేబుల్ ప్రకారం ఉదయం-ఆసనాలు, ప్రాణాయామాలు, సూర్య నమస్కారాలు కాస్త విరామం తర్వాత గాయత్రీ యజ్ఞము జరుగుతుండేవి. ముఖ్యంగా జపము, ధ్యానము, ప్రాణాయామముల ద్వారా వ్యక్తిత్వం పరిష్కారము జరగటానికి విశేషమైన ప్రాధాన్యత నిచ్చేవారు. ముఖ్యంగా పంచ సహస్రకుండీ యజ్ఞము నిర్వహించేవరకు ఈ సాధన ఇలా కొనసాగించాలని ఆదేశించారు.

## సూర్య, చంద్రుల శక్తులను స్వీకరించి అగ్నికి లొంగిపోవాలి

ఇప్పుడు రెండు శక్తులను అర్థం చేసుకొని మూడవ శక్తికి లొంగిపోవాలి. ఆ రెండు శక్తులూ ఏమిటంటే – ఒకటి సూర్యుని యొక్క శక్తి, ఇంకొకటి చంద్రుని యొక్క శక్తి. ప్రకృతిలో సూర్యశక్తిని గాయత్రీ మంత్రం ద్వారా, చంద్రుని శక్తిని షోడశీమంత్రం ద్వారా స్వీకరించాలి. ఇంక లొంగిపోయేది దేనికి అంటే అగ్నికి. అగ్నివిద్యకు ప్రతీకగా ఇక్కడ ధునిని స్థాపించారు. ఈ మూడు శక్తులు అంటే గాయత్రీ, షోడశీ మరియు అగ్ని. ఈ శక్తులను మన సాధనలో ఉపయోగించుకోవటానికి వీలుగా ధునిని స్థాపించారు.

సూర్యుని శక్తిని ఉపయోగించుకోవటానికి గాయత్రీమంత్ర జపం ఉదయం 6.00 నుంచి సాయంత్రం 6.00 వరకు, అలానే చంద్రుని శక్తిని ఉపయోగించుకోవటానికి షోడశీమంత్రాన్ని సాయంత్రం 6.00 నుండి మర్నాడు ఉదయం 6.00 వరకు అఖండ జపంగా జరగాలి అని చెప్పారు.

## 1998 జూలై 4వ తేదిన వచ్చే ఋషులకు అనువైన పరిస్థితులు కల్పించాలి

పైన చెప్పిన సాధనలను ఎందుకు చేస్తున్నాము అంటే 1998 జూలై 4వ తేది. ఒక తేది ఫిక్స్ చేసి వుంది. నోస్టర్‌డామస్ చెప్పాడు ఈ డేట్‌ని. భవిష్యపురాణాలలో కూడా ఇది సరిగ్గానే చెప్పబడి ఉంది. కానీ ఈ విషయాన్ని ఎవ్వరూ అంతగా పట్టించుకోలేదు. ఆ తేదీ యొక్క ప్రత్యేకత

ఏంటంటే సప్త ఋషులు ఈ భూమ్మీద అవతరిస్తారు. సప్త ఋషులు ఈ భూమ్మీద అవతరించవలసి వచ్చినప్పుడు వారికి ఉండటానికి, ఇక్కడ దిగటానికి కావలసిన అనువైన ప్రదేశాన్ని ఏర్పరచి వుంచవలసిన బాధ్యత మానవజాతికి వున్నది. మొత్తం మానవజాతి వారి అవతరణకై ఎదురు చూస్తున్నది.

ఋషులు క్రిందికి దిగాలి అంటే మౌనం చాలా అవసరం. వాళ్ళను మునీశ్వరులని గదా అంటారు. అంటే మౌనంలో వాళ్ళు ఎక్స్‌పర్ట్స్ అన్నమాట. అందుచేత ఈ ఆశ్రమంలో ఉన్న ప్రతి ఒక్కరూ మౌనాన్ని పాటించితీరాలి. మౌనమే భగవంతుడు. మౌనం యొక్క శక్తిని చూస్తూ మౌనంగా వుండగలిగిన వారికి ఇంక ఆహారంతో పని వుండదు. ఋషులు చెప్పేదానిని మనం శ్రద్ధగా పాటించగలిగితే, మౌనంగా ఉండగలిగితే, ఆ శక్తి సంచయమనేది ఎలా జరుగుతుందో అది అందరికీ అనుభూతిలోకి వస్తుంది. కనుక చేయగలిగితే ఋషుల అవతరణకు కావలసిన పరిస్థితులను ఇక్కడ ఏర్పరచగలిగితే, వారికి కావలసిన స్థలాన్ని ఏర్పరచినవాళ్ళం అవుతాము. ఇంక వారికి కావలసిన పరిస్థితులు, ప్రశాంతవాతావరణం, పర్ణశాలలు – వీటన్నింటినీ మెల్లమెల్లగా ఎలా చెయ్యాలనేది చెప్తానన్నారు.

## సిద్ధక్షేత్రంలో అడగండి - ఆశ్రమంలో సాధనలు చెయ్యండి

'మళ్ళీ మళ్ళీ చెప్పటం ఎందుకంటే ఏ యూనిట్‌లో పని ఆ యూనిట్‌కి మాత్రమే పరిమితం కావాలి. ఎవరికి ఏ ఆవేదన వున్నా, ఏ బాధ వున్నా, ఏ కోరిక వున్నా ఏమీ సంకోచించకుండా స్మర్తుగామి సిద్ధక్షేత్రంలో వాళ్ళకు చెప్పుకోండి. అందుకే ఉన్నారు వాళ్ళు అక్కడ. (శిరిడీసాయి, సొరకాయలస్వామి, వేంకయ్యస్వామి) ఒక కాలేజి ప్రిన్సిపాల్ విద్యార్థుల కోరికలు అంటే అవసరాలైన త్రాగటానికి నీళ్ళు, బల్లలు, లాబోరేటరీ అవన్నీ ఇచ్చినట్లే ఇక్కడ సిద్ధక్షేత్రంలో కూడా అవసరాలను అడగండి. వాళ్ళు ఇస్తారు.

శ్రీ హంస రామ ఆశ్రమంలో సాధనలు చెయ్యండి. ఆ తేడాను ప్రపంచాన్ని గుర్తించనివ్వండి. ఆ ఆశ్రమంలో అన్నదానాలు జరుగుతున్నాయి. ఎవరో గురువుగారున్నారుట, ఆయన ఒకసారి ఇలా చెయ్యిపెడితే అలా రోగాలు పోతాయిట, దాని కోసం వస్తామనేవాళ్ళను ఆశ్రమ పరిధిలోకి రానివ్వకూడదు.

ఇది ఒక స్పిరిచ్యువల్ యూనివర్సిటి. దీనిని 'ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం' స్థాయిలోనే ఉంచుదాం. పర్మిషన్ లేకుండా ఏ విశ్వవిద్యాలయంలోనికీ ఎవరినీ రానివ్వరు. అలా కేవలం సాధనలో అభిరుచి ఉన్నవాళ్ళను మాత్రమే లోపలికి రానిద్దాం. కానీ సిద్ధక్షేత్రంలోనికి ఎవరైనా రావచ్చు. ఎవర్నీ ఆపేది లేదు. 'ఇచ్చేవాళ్ళు వాళ్ళు – తీసుకొనేవాళ్ళు వీళ్ళు. మధ్యలో ఎవరూ అడ్డురావద్దు' అని చెప్పేవారు మాస్టర్‌గారు.

ఆ విధంగా శ్రీ హంస రామ ఆశ్రమంలో నిత్యం జరిగే సాధనలకు రోజుకో క్రొత్త సాధనను కలుపుతూ సాధకులను దృఢమైన సాధనాపథం వైపుకు ముందుకు తోస్తున్నారు. హైయ్యర్ క్లాసులకు వెళ్తున్నప్పుడు దానికి తగిన సిలబస్ అదే నిష్పత్తిలో పెరిగినట్లు, ఆ రోజు సాధనకు మరో రెండు క్రొత్త విషయాలను కలిపి సాధనలో తీవ్రతను పెంచారు.

## 12 సూర్యనమస్కారాలు – 18 దత్తనమస్కారాలు

ప్రతి సాధకుడు సాధనా కాలంలో మరి రెండు అంశాలు అంటే రోజుకు 12 సూర్య నమస్కారాలు. 18 దత్త నమస్కారాలు చెయ్యాలనే నియమాన్ని పెట్టారు. అలా చేయటానికి వీలుగా సమయాన్ని కేటాయించారు. ఈ రెండు సాధనలు సాధకునిలోని మల, విక్షేప దోషాలను తొలగించి వ్యక్తిని శుద్ధ స్ఫటికంలా తయారుచేస్తాయి. సరళంగా సాధనామార్గంలో ముందుకు పోవడానికి తగిన మానసిక స్థితిని ఈ రెండు సాధనలు ప్రసాదిస్తాయి.

## శ్రీలోళ్ళ లక్ష్మీధర దేశికులు

గాయత్రీవిద్యను శ్రీరామశర్మ ఆచార్యగారిచ్చినట్లు, షోడశీవిద్యను శ్రీలోళ్ళలక్ష్మీధర దేశికులు ఇచ్చారు. షోడశీవిద్యకు వారిని గురువుగా స్వీకరించాలని మాస్టర్‌గారు చెప్పారు. ఈ శ్రీవిద్యను చాలా జాగ్రత్తగా, చాలా అధికారత్వము ఉన్నటువంటి శిష్యులకే చెప్పాలి.

గురువు లేకుండా ఈ విద్యను ఎవ్వరూ చేయలేరు కనుక నన్ను మీరు గురువుగా పెట్టుకొని చేసుకోండని శ్రీలోళ్ళలక్ష్మీధర దేశికులు బ్లాంక్ చెక్ ఇచ్చేశారు. శ్రీవిద్యను ఎప్పుడు ఎక్కడ ఎవరు చేసినా గూడా వారికి నేను రక్షణ కల్పిస్తుంటానని వారు వాగ్దానం చేశారు. అంత మంచి వ్యక్తి – 'ఆయన ఫోటో కూడా చూడలేదు. ఆయన పేరే విన్నానని' మాస్టారు చెప్పారు. అందుచేత ఆ గురునామాన్ని 108సార్లు స్మరణ చేయించి, అది అయ్యాక కుండలినీసాధన చేయించి, ఆ తర్వాత మంత్ర జపం చేయించారు.

## ద్వాదశరాశి నవగ్రహ అష్టోత్తర శత నక్షత్ర పాద మహాకాల యజ్ఞం

మాస్టర్‌గారి సూచనల ప్రకారం ఆశ్రమంలో పగలు గాయత్రీమంత్రము, రాత్రికి షోడశీ మంత్రమును చేయడానికి అందరూ అలవాటు పడిపోయారు. సూర్య, చంద్ర విద్యలకు అగ్నివిద్యను ఎలా కలుపుకోవాలనేది తెలపడానికి ఋషులే ఒక అద్భుతమైన యజ్ఞవిద్యను తయారుచేసివుంచారు. రేపు మకరసంక్రాంతి నాడు చేయబోయే 5000 కుండీల యజ్ఞము కూడా అదే యజ్ఞము.

ద్వాదశ రాశి నవగ్రహ అష్టోత్తర శత నక్షత్రపాద మహాకాల యజ్ఞము. ఆ యజ్ఞానికి కావలసిన ఒక యంత్రాన్ని కూడా మాస్టర్‌గారు అందించారు. శ్రీచక్ర నవావరణ సాధనకు ద్వాదశరాశులు కలిపి మహాకాల చక్రవర్తి యంత్రంగా దానిని సార్వజనీనం చేశారు. యజ్ఞము రోజున వేదిక మీద బ్యాక్‌డ్రాప్‌గా దానిని వుంచారు.

ద్వాదశ రాశి నవగ్రహ అష్టోత్తర శత నక్షత్ర పాద మహాకాలయంత్రము అంటే ఏమిటి? అది సాక్షాత్ మన శరీరమే. మనము పుట్టినప్పుడు ద్వాదశరాశులలో తిరుగుతున్నటువంటి తొమ్మిది గ్రహాల ప్రభావం మన శరీరం మీద వుంటుందని జ్యోతిషశాస్త్రం చెప్తున్నది. ఈ నవగ్రహాలలో ఉన్న చంద్రుని ప్రభావాన్ని పట్టుకొని దశలను లెక్కకట్టి 'జాతకాలలో ఈ దశ నడుస్తున్నది. ఈ సమయంలో ఈ గ్రహం శనిలో శుక్రుడో, శుక్రుడులో శనో నడుస్తున్నారు. అందుకే మాకీ బాధలు వస్తున్నాయని అనుకుంటుంటారు.' అంతే కాకుండా 108 నక్షత్ర పాదాలలో ఈ 9 గ్రహాలు తిరుగుతూ ఉండటం వలన మనిషి జీవిత గతి ఎలా మారుతుంది అని చెప్పేదే ఇది. ఈ గ్రహాలను, ఈ మంత్రాన్ని ఉపయోగించుకోవడానికి ఒక యజ్ఞ విధానమున్నది. ఒక మంత్రమూ ఉన్నది. దీనికి సంబంధించి సంపూర్ణ వివరణను 14వ తేదిన జరిగిన 5000 కుండీల యజ్ఞంలో చాలా బాగా వివరించారు.

ఈ ఆశ్రమంలో ఇంకా వేదజ్ఞానాన్ని అర్థం చేసుకునే సాధనా విధానాలు కూడ ప్రారంభించ బడతాయని చెప్పారు. ఋషులు దిగుతారని కదా అనుకున్నాము. ఋషులు క్రిందికి దిగి మీతో మాట్లాడే విజ్ఞానం గురించి పరిచయం చేస్తానని చెప్పారు. 'దేహోదేవాలయ ప్రోక్తః జీవభూత సనాతనః' భగవంతుడి కోసం ఎక్కడా వెతకనక్కరలేదు. ఈ శరీరమే భగవంతుని యొక్క అద్భుతమైన ఆలయం. ఈ ఆలయంలో భగవంతుణ్ణి ప్రతిష్ఠింప చేసుకోవడానికే ఈ ఆశ్రమంలో సాధనలు నేర్పించారు. సాధారణ విద్యను ఏ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోనో, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోనో,

బెనారస్ హిందూ యూనివర్సిటీలోనో కోట్లు కోట్లు ఖర్చుపెట్టి కట్టించినవాటిలో నేర్పిస్తున్నారు. ఇన్ని విద్యాలయాలు ఎందుకున్నాయి అంటే ఆ విద్యనంతటినీ మనిషి బుఱ్ఱలోనికి ఎక్కించటానికి. ఆ విద్య మన బుఱ్ఱలోకి వెళ్ళకపోతే ఇక ఆ విద్యాలయాలు ఇచ్చే సర్టిఫికెట్లు ఎందుకూ పనికిరావు.

అలానే ఈ ద్వాదశరాశి నవగ్రహ అష్టోత్తర శత నక్షత్రపాద యంత్రాన్ని మానవశరీరం మీద సూపర్ ఇంపోజ్ చేసుకొని, దీన్ని ఉపయోగించుకోలేకపోతే అది ఎందుకూ పనికి రాదు. మనం చేస్తున్న ఈ కార్యక్రమాలను చూస్తున్న ఋషులకి గూడా ముచ్చటేసింది. 'మనం చేస్తున్న పనులు వీళ్ళు కూడా చేస్తున్నారు. మనం గడ్డాలు పెంచుకుని చేస్తే వీళ్ళు గడ్డాలు పెంచుకోకుండా చేస్తున్నారు. అంతే తేడా' అనుకుని వాళ్ళిక్కడకు వచ్చి వాళ్ళ పనులు చేసుకోడానికి సిద్ధపడుతున్నారు. ఇదంతా మనకు అర్థమైతే తప్ప ఆ ఋషులు వచ్చి, వాళ్ళేదో మాట్లాడేస్తే మనకేమీ అర్థం కాదు. మాటలే అర్థం కాకపోతే ఇంక వాళ్ళు చేస్తున్న పనులు అసలేం అర్థమౌతాయి. అందుకోసం ముందు మన శరీరంలో ఉన్నటువంటి ఆ ద్వాదశరాశులను, మన శరీరంలో తిరుగుతున్నటువంటి ఆ నవగ్రహాలనూ, అలానే మన శరీరంలో ప్రతిబింబిస్తున్న 27 నక్షత్రాల యొక్క 108 పాదాలు, (ఇక్కడ లెక్కకడితే 27×4=108) వాటిని గురించి నేర్చుకోవటమే మన సిలబస్. ఋషులను దింపాలనుకుంటే వేదాలలో చెప్పబడిన జ్ఞానమునంతటినీ గూడా మనం అవగాహన చేసుకోవడానికి సంపూర్ణ ప్రయత్నం చేయవలసి ఉంటుంది. మకర సంక్రమణంనాడు పంచ సహస్రకుండీయ మహాయజ్ఞం జరిగిన తరువాత నుండి దానికి కావలసిన సాధన విధానాలను ప్రారంభిస్తానని మాస్టర్‌గారు చెప్పడం జరిగింది. అంతేకాకుండా మీరు ఇక్కడ నేర్చుకున్న ఆ సాధనా విధానాలను అభ్యసిస్తూ నెలకు ఓ మూడు రోజులపాటు ఇక్కడికి వచ్చి ఆ సాధనా విధానాలలో ఎంత పరిపూర్ణత వచ్చిందో పరీక్షించుకుని వెళ్తూ వుండాలనే నియమాన్ని ఖచ్చితంగా చెప్పారు.

## సప్త ఋషుల ఆగమనం

**అసలు ఎందుకింత కష్టపడాలి?:** 1998 జూలై 4న నందనవనంలో ఉన్నటువంటి మహా గురువుల కూటమి ఒక నిర్ణయానికి వచ్చింది. సప్తఋషులని చెప్తుంటారు కదా! ఆ సప్తఋషులు ఎవరంటే భారతదేశంలో కూడా చాలామందికి తెలియదు. వారంతా తమతమ ప్రణాళిక ప్రకారం భారతదేశంలో తిరిగి పని చెయ్యడానికి, మనుషుల మధ్యకి రావటానికి ఒక టూర్ ప్రోగ్రాము వేసుకున్నారు. ఆ లిస్టులో మనమూ మన ఆశ్రమం పేరు ఇచ్చాం. ఒక ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా

వస్తుంటే ఆయన లంచ్-మీటింగ్ ప్రోగ్రాం అంతా పకడ్బందీగా తయారుచేసి దానికి తగిన ఏర్పాట్లను ఒక ఐదు, ఆరు నెలలకు ముందునుంచే సమకూర్చి పెడతారు కదా మనమూ వారందరి రాకకోసం అలాంటి ఏర్పాట్లే చేయాలి.

(గమనిక: పూజ్యగురుదేవులు పండితశ్రీరామశర్మఆచార్యగారు శాంతికుంజ్ ఆశ్రమంలో సప్తఋషులకు ఆలయాలు కట్టించి వారి విగ్రహాలను స్థాపించి, ప్రాణప్రతిష్ఠ చేశారు. పూజ్య గురుదేవులు వారి ప్రణాళికలను తమదైన బాణిలో నూతన మానవజాతికి అవసరమైన రీతిలో వాటిని రూపొందించి సభ్యసమాజంలో అందరూ వాటిని ఆచరించేవిధంగా ప్రచారంలోకి తీసుకు వచ్చారు. ఈనాడు సప్తఋషులు టూర్ వేసుకొని వస్తున్నారూ అంటే అది కచ్చితంగా వారేనని మనం గుర్తించాలి. ఇది ఊహ మాత్రమే! వారి పనికి ఎల్లలుండవుగదా!)

అలాగా ఆ ఋషులు వస్తారు. 1998 జూలై 4వ తేది ఒక్కరోజు మాత్రమే భారతదేశానికి ఇచ్చారా? లేక ఇక్కడే ఉండిపోతారో మనకి తెలియదు. అదంతా మనందరి మీద ఆధారపడి వుంటుంది. అసలు వస్తారా? రారా? వస్తే వుండిపోతారా? ఋషులతో వచ్చిన ఒక లాభం ఏమిటంటే రేపు వాళ్ళు ఏం చేయబోతున్నారనేది ఋషి పత్నులకే తెలియదు. ఇక్కడ నచ్చింది అంటే ఉండిపోవచ్చు. నచ్చలేదు, రాకనేపోవచ్చు. కానీ మన ప్రయత్నం మనం చేద్దాం. కానీ ఋషులను మునీశ్వరులు అని గదా అంటాం. అందుచేత మౌనంగా లేనటువంటి వాతావరణంలోకి వాళ్ళురారు. అది గ్యారంటీ. అందుచేత ఇవాల్టి నుంచి ఈ వాతావరణంలో అద్భుతమైన 'మౌనం' పాటించాలి. ఇంకా సప్త ఋషులకి సంబంధించిన కొన్ని ఆకర్షణ సూత్రాలను వివరించారు. వాళ్ళను ఆహ్వానించడానికి, మన ఆశ్రమంలోకి తీసుకురావడానికి వాళ్ళకు ముఖ్యంగా నచ్చేదేమిటంటే ఉపవనములు, లతలు, తీగలు, పువ్వులు, ప్రశాంతవాతావరణం, అందంగా, ఆకర్షణీయంగా వుండే రంగురంగుల ముగ్గులు, సహజ అందంతో వుండే పచ్చికబయళ్ళు, అందంగా అలంకరించిన పర్ణశాలలు అనేవి వాళ్ళకు ఇష్టమైన వనరులు. ఇవన్నీ ఏర్పాటుచేయాలి. వాళ్ళు రావటానికిచ్చిన తేదికి ఇంకా 7 నెలలు సమయం వుంది.

ముందు ఈ 5000 కుండీల యజ్ఞం అయిపోయిన తర్వాత ఆ ఋషులకు కావలసిన వసతులను గురించి ఆలోచిద్దాం. వాళ్ళు వస్తారని నా నమ్మకం. భౌతికంగా వాళ్ళను చూడాలంటే ఒక కండీషన్ మౌనం. అయితే తర్వాత కాలంలో పర్ణశాలల ఏర్పాటుకు తగిన వనరులను

సమీకరించటం జరిగింది. ధన సమీకరణ జరిగింది. కష్టపడి పని చేసేవారు కొందరు బాధ్యత తీసుకున్నారు. కానీ అనుకున్న సమయానికి అక్కడ ఏర్పాట్లు చేయలేకపోయారు. సమయం దగ్గర పడుతున్నదని అందరికీ ఆదుర్దాగా వున్నది. కానీ మాస్టర్‌గారు ఎంతో శాంతంగా ఉన్నారు. 'సుకృత విల్లా'లోనే వారికి తగిన ఏర్పాట్లను సింబాలిక్‌గా ఏర్పాటు చేసి, ఆ తర్వాత 'సప్తర్షి ఆశ్రమంగా' దానిని ప్రకటించారు. మాస్టర్‌గారిలో వున్న గొప్పదనం అదే! అన్నివిధాల ప్రయత్నిస్తారు. కాకపోతే ఆ అవకాశాన్ని ఇంకోవిధంగా ఉపయోగిస్తారు.

## ఆశ్రమాన్ని ఒక ప్రయోగశాలగా ఉపయోగించుకుందాం

శ్రీ హంస రామ ఆశ్రమంలో ఉన్నన్ని రోజులు 'మాస్టర్‌గారు' ఆశ్రమాన్ని ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక శక్తికేంద్రంగా రూపొందించటానికి వివిధ పద్ధతులలో అనేక ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రయోగశాలలో ఎలాగైతే రకరకాల ప్రయోగాలు చేస్తారో అలాగా ఈ ఆశ్రమాన్ని ఉపయోగించుకోటానికి ప్రయత్నించారు. ఒకరోజు ప్రవచనంలో ఈ ఆశ్రమాన్ని ఎలా అభివృద్ధిలోకి తీసుకువస్తారనేది చాలా స్పష్టంగా చెప్పారు.

సైన్సులో ఒక విషయం మీద ప్రయోగశాలలో ప్రయోగములు చేసి ఆ ఫలితాలు చూచి, ఫలితాలు సక్రమంగా వస్తే, దానిని ఒక 'సిద్ధాంతం'గా నిర్వచిస్తారు. సక్రమంగా రాకపోతే మళ్ళీ మార్చి మార్చి ఫలితాలు వచ్చేదాకా ప్రయోగాలు చేస్తారు. ఇక్కడా అంతే. ఒకరోజు మాస్టారు 'ఎవ్వరినీ నన్ను కలవటానికి ఈ ఆశ్రమంలోకి రానివ్వకండి. నాతో ఎవ్వరూ మాట్లాడవద్దు. నన్ను ఎవ్వరూ డిస్టర్బ్ చేయవద్దు. నేను కూర్చొని గుఱ్ఱుపెడతాను, అయినా నన్ను కదిలించకండి. నేను చదువుకుంటున్నా నన్ను డిస్టర్బ్ చెయ్యకండి. స్వాధ్యాయకాలంలో నేను చేసుకునే ప్రయోగాలు, నిద్రలో చేసినటువంటి ప్రయోగాలు, గుఱ్ఱు పెట్టడంలో నేను చేసినటువంటి ప్రయోగాలలో నేనేదైనా సాధించగలిగితే ఆ విషయమును ఖచ్చితంగా ఆరోజుకారోజే మీకు చెప్పేస్తుంటాను' అని చెప్పారు. మాస్టారు. (గుఱ్ఱుపెట్టడమంటే గురకతో నిద్రపోవడమని పాఠకులు గమనించాలి.)

అయితే ఎవరైనా సరే వాళ్ళ బాధలు చెప్పుకోటానికి వస్తే, వారిని స్మర్తుగామిలోకి వెళ్ళి చెప్పుకోమనండి కానీ ఈ ఆశ్రమంలోకి రానీయవద్దు. సాధకులు మాత్రమే ఇక్కడకు వస్తారు. గాయత్రీమంత్రము, షోడశీమంత్రములు యధావిధిగా జరగాలి.

నేను అతి తీవ్రస్థాయి ఆధ్యాత్మిక ప్రయోగాలు చేసుకోవాలి. మీకు సాధనాత్మకంగా ఏమన్నా సందేహాలు ఉంటే అవి ఖచ్చితంగా ఈ వాతావరణంలో వాటంతటవే నిర్మూలించబడతాయి. జపం చేసుకుంటూ మిగిలిన సమయాలలో నేను చెప్పిన సాధనలు చెయ్యండి. నిరంతర మౌనం పాటించడం చాలా అవసరం. నిజంగా ఏదైనా చాలా ముఖ్యమైన మాటలు మాట్లాడుకోవలసి వస్తే స్మర్తుగామికి వెళ్ళి మాట్లాడుకొని వెంటనే వచ్చెయ్యండి. ఆశ్రమంలో మాత్రం మౌనమే. మిగతా ఆశ్రమాలకి ఈ ఆశ్రమానికి తేడా వుండాలి.

## ఎట్టి పరిస్థితులలోనూ నా జోలికి రావద్దు

"మరో విషయం. ఈ ఆశ్రమంలోకి వస్తే నేనూ సాధకుడినే. ఒక సాధకుడు ఇంకో సాధకుడికి దండం పెట్టడు. కాళ్ళ మీద పడడు. కాళ్ళు పట్టడు. ఒకరి పనిని ఇంకోడు చెయ్యరు. ఎవడి పనిని వాడే చేసుకుంటాడు. కాబట్టి నా పనులను నేనే చేసుకుంటాను. నా సామానులు నేనే చూసుకుంటాను. నా జోలికి రావద్దు. శ్రీహంస రామ ఆశ్రమంలో మాత్రము నాతో ఎవ్వరూ మాట్లాడవద్దు. దణ్ణాలు పెట్టవద్దు. పూజలు, పాద నమస్కారాలు, సేవలు ఏమీ వద్దు. నా సాధనలు, నా ప్రయోగాలు నన్ను చేసుకోనివ్వండని' గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. అలా ఆశ్రమంలో అందరూ నియమంగా ప్రవర్తించటానికి తగిన బాధ్యతలను కొందరికి అప్పజెప్పటం జరిగింది. స్త్రీలు గాని, పురుషులు గాని అక్కడ ఉన్నన్ని రోజులు అక్కడ ఏర్పరచిన నియమ-నిబంధనలను అతి కఠినముగా పాటించేవారు. నిజానికి చెప్పాలంటే ఇదంతా 'ఆత్మోన్నతికి' ఏర్పరచిన దగ్గరి మార్గాలు. మాస్టర్‌గారి అనుశాసనాన్ని పాటిస్తూ, మౌనంగా వుంటూ పగలు గాయత్రీమంత్రజపం, సాయంత్రం నుండి షోడశీమంత్రజపం చేయటానికి అందరూ బాగా అలవాటుపడిపోయారు. ఇది అలవాటైన తర్వాత దీనితో పాటు అగ్నివిద్యను ఎలా కలుపుకోవాలనేది తెలపటానికి ఋషులు యజ్ఞవిద్యను అంద చేశారు. ఐదువేల కుండీలతో ఈ యజ్ఞవిద్యను మాస్టర్‌గారు మహాకాల చక్రవర్తి యంత్రానికి జోడించి ద్వాదశరాశి నవగ్రహ అష్టోత్తర శత నక్షత్ర పాద మహా కాల యజ్ఞముగా చేయడానికి ఒక చక్కటి ప్రణాళికను రూపొందించారు.

**14-01-1998న శ్రీ హంస రామ ఆశ్రమములో జరిగిన పంచ సహస్ర కుండీయ ద్వాదశ రాశి, నవగ్రహ, అష్టోత్తర శత నక్షత్రపాద మహకాలయజ్ఞము.**

శ్రీ హంస రామ ఆశ్రమ ప్రాంగణంలో మకరసంక్రాంతి రోజు సాయంత్రం యజ్ఞం చేసేందుకై ఒకవారం రోజుల ముందు నుంచే 5000 కుండీలను ఆశ్రమ ప్రాంగణంలో స్థాపించటం జరిగింది. అన్ని ఊళ్ళ నుండి సక్రియ కార్యకర్తలు వచ్చి యజ్ఞనిర్వహణకు అవసరమైన వనరుల సమీకరణతో పాటు ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరంగా సాగించారు.

యజ్ఞశాల ఎంతో రమణీయంగా, సుందరంగా, ఆహ్లాదకరంగా తయారైంది. ప్రశాంత వాతావరణంలో మాస్టర్‌గారి లాంటి దివ్యచేతనత్వంతో కలిసి పనిచేసిన ఆ దివ్యాత్మల పురాకృత పుణ్యఫలం ఎంత బలమైందో ఊహించుకుంటేనే ఆనందం కలుగుతుంది. ఏ విభాగానికి ఆవిభాగం ఎంతో సమర్థవంతంగా తమకు కేటాయించిన పనులను నిర్విరామంగా వానర సైన్యంలాగా చేస్తున్నారు. అనుకున్న రోజు రానే వచ్చింది. మకరసంక్రాంతి రోజు సాయంత్రం ఆరుగంటలకు యజ్ఞశాల విద్యుద్దీపాల కాంతులతో, రకరకాల అలంకారాలతో ఎంతో శోభాయమానంగా ఉన్నది. వేదిక మీద ఆనాటి యజ్ఞము యొక్క ప్రతిరూపం మహాకాల చక్రవర్తీ యంత్రం బ్యాక్ డ్రాప్‌లో మెరిసిపోతున్నది.

వేదిక మీద దివ్యమంగళ రూపంతో మాస్టర్‌గారు అపర సూర్యుని వలె వెలిగిపోతున్నారు. యజ్ఞశాల స్త్రీ పురుషులతో నిండిపోయింది. 5000 కుండీలు అంటే మాటలా! వేలాదిమంది జనంతో యజ్ఞశాల అందాలను సంతరించుకున్నది. యజ్ఞం ప్రారంభమైంది. ముందుగా మాస్టర్ గారు ఆనాటి యజ్ఞము యొక్క ప్రాముఖ్యతను సవివరంగా చెప్తూ యజ్ఞమును చేయించారు. ఐదువేల కుండాల మీద దీపాలు వెలుగుతూ వుంటే ఆ దృశ్యం చూచితీరాలే గానీ వర్ణింపనలవిగాదు. జిలుగు వెలుగుల జలతారు వెండి జరీచీరను ధరించిన అపర లక్ష్మీదేవిలా భూమాత కళకళలాడి పోతున్నది. ఆ క్షణంలో అపార కరుణామూర్తి అయిన ఆ భూమాతకు సాష్టాంగనమస్కారం చేసుకున్నవారి జీవితాలు ధన్యమే ధన్యం! ఆ దీపాలు దాదాపు తెల్లవారిందాకా అలా వెలుగుతూనే వున్నాయి. ఈ యజ్ఞంతో ఆ ఆశ్రమం యొక్క ఆధ్యాత్మిక శక్తి ఎన్నో రెట్లు పెరిగిపోయింది. యజ్ఞము అయిపోయిన మరునాడు మాస్టర్‌గారు యజ్ఞశాలను పరికిస్తూ తిరుగుతున్నారు. వారితో పాటు కొంతమంది పరిజనులు వారిని అనుసరిస్తూ వారి వెనుకనే వున్నారు. అందరూ చూస్తూనే ఉండగా సూర్యుడి నుండి అత్యంత తేజస్సుతో 7 కిరణాలు యజ్ఞశాలలోకి దిగి మాయమైపోయాయి. అద్భుతమైన ఆ దృశ్యాన్ని చూచిన వారందరూ మైమరిచిపోయారు. కాసేపటికి తేరుకున్నారు. ఆ

దృశ్యం గురించి మాస్టర్‌గారిని అడిగితే 'సప్త ఋషులు దిగుతారని ముందుగానే చెప్పుకున్నాం కదా! ఇవాళ మీరు చూశారంతే. మరి తర్వాత ఏం చేయాలనేదే మన లక్ష్యం, చూద్దాం ఏం జరుగుతుందో!' అంటూ ఆ టాపిక్‌ని అంతటితో ఆపేశారు. ఇక మాట్లాడేందుకు ఎవరికీ అవకాశం ఇవ్వలేదు.

తర్వాత రెండు రోజులకి మాస్టర్‌గారు పరిజనులనుద్దేశిస్తూ ఒక ఉత్తరం ఇలా వ్రాసి అందరికీ పంపించారు. 17-01-1998వ తేదీన ప్రణాళికాబద్ధమైన సాధన గురించి వివరిస్తూ ఒక లేఖను వ్రాసి అందరికీ పంపించమని చెప్పారు.

ఆత్మీయ యుగసైనికులకు,

సూర్యుడు నుండి ఉద్భవించిన సప్తకిరణాలు సప్తఋషుల కుటీరాల వలె శ్రీ హంసరామ ఆశ్రమంలో 14వ తేది రాత్రి పంచసహస్ర కుండీయ యజ్ఞము ద్వారా దిగినవి.

ఈ సప్తఋషుల కార్యక్రమాలనే మనము గురుసత్తా పేరుతో సి.వి.వి. బ్లావెట్స్కీ నుండి శ్రీరామశర్మ ఆచార్య, మాతా భగవతీ దేవీగార్ల వరకు కార్యక్రమాలను విపరీతమైన వేగముతో చేపట్టవలసియున్నది. దానికి నాందీగా మన వాళ్ళందరూ ఉదయం ఆరు గంటల నుండి గాయత్రీ, సాయంత్రం ఆరు గంటల నుండి షోడశీమంత్రాలను, ఆశ్రమాలలోనే గాదు, ఇళ్ళల్లో కూడా అఖండంగా జరిగేలాగా చూచుకోండి. వ్యక్తులు లేని సమయంలో టేప్‌ను అతిమంద్రస్వరముతో మంత్రము వినిపించే మాత్రంగా పెట్టుకోండి.

ప్రస్తుతానికి మీ ఇళ్ళల్లో అఖండ గాయత్రీ, షోడశీ జపం జరగాలి. 15 రోజుల లోపల ఆ స్థాయికి చేరుకుని ఆ స్థాయికి చేరుకున్నట్లు నాకు ఉత్తరాలు వ్రాయండి. ఈ ఉత్తరాన్ని మీరు చదువుకుని మీ ఇంటిలో మీకు అర్థమైనరీతిలో అచరణలో పెట్టండి ఎవ్వరినీ సలహాలు అడగవద్దు. గాయత్రీ, షోడశీ మంత్రముల ద్వారా అతి త్వరలో మనము గురుసత్తా అనుగ్రహమును, శ్రీహంసరామ ఆశ్రమములో అచరణ యోగ్యమైన, నిత్యజీవితానికి సరిపడే వేదవిజ్ఞానాన్ని దింపుకో గలమని ఆశిస్తూ, నిరంతర మౌనాన్ని సాధించగలరని అభిలషిస్తూ, మీ ప్రయత్నాలలో గురుసత్తా ఆశీర్వాదాలు లభించాలని ప్రార్థిస్తూ ...

**మీ శ్రీరామకృష్ణ**

పై ఉత్తరాన్ని అందరికీ పంపించారు. ఈవిధంగా శ్రీ హంసరామ ఆశ్రమమును సప్తఋషులకి నిలయంగా, వేదవిజ్ఞానికి కేంద్రంగా తయారుచేయడానికి అనేకరకాలుగా కృషిచేశారు మన మాస్టర్‌గారు

## మహాకాలుని ప్రతిష్ఠ

పూజ్యశ్రీ మాస్టర్‌గారి నిర్దేశానుసారం శ్రీ కె.టి.నాయుడు, వెంకటేశ్వర్లుగారు మొదలైనవాళ్ళు 2000 సంవత్సరం మహాశివరాత్రినాడు ఉజ్జయినికి వెళ్ళి పంచముఖీ శివలింగాన్ని తెచ్చి అన్నపూర్ణాలయంలో స్థాపించి 'నిర్దిష్టమైన పూజ అర్చనాదులు' ప్రారంభించారు. 'న రుద్రో రుద్రమర్చయేత్' అనేది శాస్త్రప్రమాణం. మహన్యాసంలో వుండే అంతరార్థమదే. అందుచేత భక్తులు మాస శివరాత్రికి లేదా వాళ్ళకు వీలైన సమయంలో వచ్చి శివాభిషేకం చేయించుకొని, పూజ అర్చనలు చేస్తుండేవారు. కానీ మాస్టర్‌గారి ప్రణాళిక వేరు.

మహాకాలుని స్థాపనకు ఆశ్రమ ప్రాంగణంలోనే విశాలమైన ప్రదేశంలో ఒక దేవాలయాన్ని నిర్మింపజేసి అందులో దేవాధిదేవుడు మహాకాలుని ప్రతిష్ఠకు అన్ని ఏర్పాట్లు చేశారు. 2007 నవంబర్ 9వ తేదిన రంగరంగ వైభవంగా పంచముఖ శివలింగాన్ని అన్నపూర్ణాలయం నుండి తెచ్చి ఈ శివాలయంలో సాయంత్రం 6గంటల 30నిమిషాలకు ప్రదోషకాలంలో స్వామిని మాస్టర్ గారే స్వయంగా ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆ రోజున విపరీతమైన వాన. ఆ విధంగా ప్రకృతిమాతే మహదానందంతో పరవశించి పోతూ స్వయంగా మహాదేవునికి అఖండాభిషేకం చేసిందా అన్న అనుభూతి కలిగిందాక్షణంలో.

మామూలుగా అన్ని దేవాలయాలలో జరిగే ప్రాణప్రతిష్ఠ సమంత్రకముగా వేదపఠనంతో జరుగుతుంది. కానీ ఇక్కడ మాస్టర్‌గారు చేసిన ప్రాణప్రతిష్ఠ పరమాద్భుతంగా జరిగింది. ఆ రోజున జరిగిన ప్రాణ ప్రతిష్ఠను గురించి చెప్పాలంటే అది సాక్షాత్ ఆదిశంకరులు స్వయంగా కైలాసానికి వెళ్ళి మహాదేవుని ప్రసాదంగా ఐదు చంద్రమౌళీశ్వరలింగాలను తెచ్చి ఐదు చోట్ల స్థాపించిన విధంగా పూజ్యశ్రీ మాస్టర్‌గారు కూడ తమదైన అఖండ భక్తితో ఆ మహాదేవుని దివ్యశక్తిని ఆవాహన చేసి పంచముఖ శివలింగాన్ని ప్రాణప్రతిష్ఠ చేశారు. తరువాత మహాభిషేకం చేయించి పూజ చేశారు.

మహాకాల స్వరూపులైన పూజ్య గురుదేవులు 'పంచవీరభద్రసాధన' ద్వారా మహాతేజో సంపన్నులు, స్వయంప్రతిపత్తి కల్గిన పంచవీరభద్రులను 'ఈ విశ్వవ్యవస్థను' సంతులితం చేయటానికి ఆవిర్భవింపజేశారు. ఐదురకాల వ్యక్తుల క్రియాకలాపాలు ఈ ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తుంటాయి. వారికి సరైన మార్గదర్శనం చేసే బాధ్యత ఈ పంచవీరభద్రులకు ఇవ్వబడింది. ఈ క్రమానికి అనురూపంగా మాస్టర్‌గారు ఈ మహాకాల శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు.

ఆనాటి నుండి మహాశివరాత్రికి చుట్టుప్రక్కల గ్రామాల నుండి భక్తులు అశేషంగా తరలివస్తారు. అభిషేకాలు, అర్చనలు చేయించుకోవడం ఆ తరువాత శివరాత్రి జాగరణ చేసి ఉదయాన్నే 24 కుండీలతో యజ్ఞాలు చేయటంతో పూర్ణాహుతిని చేస్తారు. అలా ప్రతి సంవత్సరం అక్కడ పెద్ద ఉత్సవం జరుగుతోంది. ఆ ఉత్సవం కోసం అన్ని గ్రామాల వాళ్ళు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తుంటారు. అలా మహాకాలుని సేవ – ఆ ఆశ్రమంలో ఈనాటికీ నిరంతరం జరుగుతూనే ఉన్నది.

తరువాతి కాలంలో అక్కడ పృధ్వీతత్వజాగరణ అనే పేరుతో సహస్రకుండీయ యజ్ఞాలు మూడు రోజుల పాటు జరిగాయి. 5001 కుండీల యజ్ఞాలను కూడా మహాకాల యజ్ఞం పేరున మాస్టర్‌గారే స్వయంగా చేయించటం చరిత్రలోనే అరుదైన విషయంగా భావించి ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి వచ్చిన సాధకులతో ఆ యజ్ఞాన్ని సుసంపన్నం చేయడమనేది వారు మనకిచ్చిన మహదవకాశం.

ఈనాటికీ ఆ ఆశ్రమాన్ని అనేక రకాలుగా తీర్చిదిద్ది సాధన కోసం వచ్చే సాధకులుండటానికి కావలసిన వసతి సదుపాయాలను శ్రీ దేవమాత గౌతమీట్రస్టు వారు చక్కటి వ్యవస్థను ఏర్పాటు చేసారు. నిత్యనైమిత్తిక సాధనా కార్యక్రమాలను ఆనాటి నుండి మాస్టర్‌గారి ఆదేశానుసారం మాతాజీగారే చూచుకుంటూ, వచ్చిన వారికి చక్కటి ఆతిధ్యాన్ని ఇస్తున్నారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారి సూచనల మేరకు ట్రస్ట్ కన్వీనర్ శ్రీ కె.టి.నాయుడుగారితో కలిసి శ్రీమణికుమార్, రంగనాయకులు గార్లు ఆశ్రమానికి కావలసిన అన్ని సదుపాయాలను సమకూరుస్తూ ఆశ్రమంలో జరిగే అన్ని కార్యక్రమాల నిర్వహణను తమ భాగ్యంగా భావిస్తూ చేస్తుంటారు. ముఖ్యంగా ధునిని ఆ గ్రామస్తులు ఎంతో శ్రద్ధతో ఆనాటి నుండి చక్కగా నిర్వహిస్తున్నారు. ధుని యొక్క శక్తి అవర్ణనీయం. ఏ గురువైనా అగ్ని స్థాపన లేకుండా తమ కార్యక్రమాలను విస్తృతం చేయలేరు. శిరిడీ సాయికి ధుని వుంది. వెంకయ్యస్వామి వారు నిరంతరం అగ్ని సమ్ముఖంలో వుంటూ తమ సాధన చేస్తూండేవారు.

భక్తుల బాధలు తీరాలంటే వారి ప్రారబ్ధ కర్మలు నాశనం కావాలి. దాని కోసం ధుని ప్రదక్షిణ అనేది అనివార్యం. ఆ ప్రదక్షిణం ద్వారా అనేక జన్మలలో చేసిన పాపాలు క్షయమైపోయి మనిషి కర్మ విముక్తుడైపోయి గురు అనుగ్రహానికి పాత్రుడై, భౌతిక జీవితంలో శాంతి సుఖాలతో పాటు అచంచలమైన గురుభక్తితో ఆగామి కర్మల పుణ్యఫలాన్ని పెంచుకోవటం ధుని ప్రదక్షిణలోని అంతరార్థం.

**14.5.1997వ సంవత్సరంలో ఇచ్చిన ప్రవచనంలో 'శ్రీ హంస రామ ఆశ్రమం' గురించి చెప్తూ 'ఈ ఆశ్రమం హిమాలయాలలో ఉన్నటువంటి నందనవనము వలె, ప్రపంచంలో ఉన్నటువంటి కొన్ని దివ్యక్షేత్రాలవలె ఏ విధమైన మాలిన్యమూ లేనటువంటి పవిత్రమైన స్థితిలో ఉన్నది. మీరందరూ సహకరిస్తే ఈ ఆశ్రమం కూడా ఒక దివ్యక్షేత్రంగా మారుతుంది. దివ్యక్షేత్రాలుగా మారినవన్నీ మొదట అరణ్యాలే! ఒక పుటపర్తిలో గానీ, ఒక శిరిడిలో గానీ ఆ రోజుల్లో నాలుగు ఇళ్ళు అయినా వుండేవి గాదు. ఇప్పుడో! అందుచేత దీనిని మీరు మారనిస్తే ఇదీ ఆ స్థితికి వస్తుంది. అది మీ చేతుల్లోనే వుంది. నేను ముందే చెప్తున్నాను' అని ఒక సూచనను ముందే విసిరారు.**

శ్రీ హంసరామ ఆశ్రమం నిర్మించిన తర్వాత అనేక మంది ఋషుల, పరమ గురువుల ప్రణాళికలను వేగవంతంగా ముందుకు తీసుకువెళ్ళడానికి రకారకాలైన కార్యాచరణలను మాస్టర్‌గారు చేపట్టడం జరిగింది. అనేకమంది గురువులు వివిధ ప్రదేశాలలో వివిధ విధానాలలో "నవయుగ అవతరణకై" తమతమ శిష్యబృందాలతో అవిశ్రాంతంగా పని చేస్తున్నారు. పూజ్య గురుదేవులు ఋషుల ప్రణాళికలను తిరిగి మానవజాతికి అందించటానికి ఏ విధంగా ప్రయత్నించారో, వారి కార్యాచరణలను దింపటానికెంత కృషి చేశారో వారి "ఆత్మకథ"లో మనం చదువుకున్నాం.

పూర్వకాలంలో ప్రపంచంలో భయంకరమైన క్షామం ఏర్పడినప్పుడు గౌతమమహర్షి గాయత్రీ మంత్ర శక్తితో ఆ క్షామం నుండి మానవజాతిని ఉద్ధరించారు. అదే విధంగా ఈనాడు ఏర్పడివున్న సంకట పరిస్థితుల నుండి సమస్త విశ్వాన్ని ఉద్ధరించి తిరిగి శాంతిమయ వాతావరణాన్ని నిర్మించేందుకు పూజ్య గురుదేవులు ఆ గాయత్రీ మహామంత్రాన్ని సార్వజనీనం చేసారు. గురుదేవుల ప్రణాళికలను, తమ లక్ష్యాలను అమలు పరిచేందుకే మాస్టర్‌గారు వేర్వేరు ప్రాంతాలలో వివిధ ఆశ్రమాలను స్థాపించి సమర్థులైన కార్యకర్తలకు వాటి నిర్వహణ బాధ్యతలనప్పగించటం జరిగింది.

విశేష ప్రయోజనాల నిమిత్తమై ఆయా ఆశ్రమాలలో ఆనాటి పరిస్థితులకనుగుణమైన సాధనా

సంపత్తిని అందించటానికి మాస్టర్‌గారు తరచుగా ఆ ఆశ్రమాలకెళ్ళి సాధనాశిబిరాలను నిర్వహిస్తుండే వారు. పూజ్య గురుదేవులు ఋషుల కార్యక్రమాలను పునర్వ్యవస్తీకరిస్తే, పూజ్యశ్రీ మాస్టర్‌గారు పరమ గురువుల ప్రణాళికలను వారు చేసిన, చేయించిన సాధనలను జనబాహుళ్యంలోకి తీసుకురావడానికి కృషి చేశారు. అందులో భాగంగానే ఆయా ఆశ్రమ వ్యవస్థలకు సరిపడే విధంగా ఆనాడు గురువులు చేయించిన వివిధ సాధనా విధానాలనే తిరిగి నూతన ప్రక్రియలతో చేయిస్తూ "గురుసత్తా" ప్రణాళికగా వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడమనేది మన అదృష్టం. తరువాతి కాలంలో మాస్టర్‌గారి సూచనలప్రకారం ఆశ్రమ ప్రాంగణంలో "పంచవటి" మొక్కలను నాటి వాటిని పెంచి పెద్దవి చేశారు ఆశ్రమం కార్యకర్తలు. మహాలక్ష్మీసాధన చేసుకోటానికి ప్రత్యేకించి మారేడు చెట్లను కూడా పెంచి పెద్దచేశారు. చలువ పందిరిని తలపింప చేసే ఆ చెట్ల చుట్టూ విశాలమైన అరుగును కట్టించారు. ప్రతి నెలా అమావాస్యకు అందరూ ఆ చెట్ల క్రింద కూర్చొని మహాలక్ష్మీసాధనను అత్యంత భక్తిశ్రద్ధలతో చేస్తుంటారు. అలాగే మాస్టర్‌గారు దగ్గరుండి కట్టించిన ధ్యాన మందిరంలో వీలైన సమయాలలో భక్తులు వచ్చి ప్రశాంతంగా ధ్యానం చేసుకొని వెళు తుంటారు. ముగ్గురు తాతయ్యలకు అంటే శిరిడీసాయి, వెంకయ్యస్వామి, సొరకాయలస్వామివార్లకు మూడువేళల్లో ఆరతులు జరుగుతుంటాయి.

## అధ్యాయం-20

# చంద్ర విద్యాకేంద్రం - శ్రీ అగస్త్యాశ్రమం, రేపల్లె

నవయుగావతరణ కొరకు ఋషుల ప్రణాళికలో భాగంగా అగస్త్య మహర్షుల వారు తమ శిష్యబృందాలతో పనిచేస్తూ కొన్ని కార్యక్రమాలను ఈ భూమ్మీదకు దింపటానికి శతధా ప్రయత్నం చేస్తున్నారు. అగస్త్యమహర్షి చేస్తున్న ప్రయత్నానికి అనుబంధంగా పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారు భౌతిక జగత్తులో, దానికి సంబంధించిన సాధన విధానాలనందించటానికై "శ్రీ కళానిధి ట్రస్టు" పేరుతో రేపల్లె దగ్గర గల కొత్తపాలెం గ్రామంలో 24.04.1998వ సంవత్సరంలో అగస్త్య ఆశ్రమానికి శంఖుస్థాపన చేశారు. మొట్టమొదటిసారిగా మాస్టర్‌గారు ఈ స్థలాన్ని చూస్తూనే "ఇదొక మహత్తరమైన సాధనాస్థలి. కోట్ల సంవత్సరాల క్రిందట ప్రకృతిలో ఇదొక పరమ పవిత్రమైన గురుసాంప్రదాయానికి చెందిన తపఃస్థలి. ఆ రోజుల్లో ఇక్కడ 24 ఎకరాల స్థలంలో వేదవిద్యాలయం వుండేది. ఆ వేద

విద్యాలయం నుండే వేదపండితులు వేదవిద్యనభ్యసించి దశదిశలా ఆ జ్ఞానాన్ని వ్యాప్తి చేశారు" అని చెప్పారు. అలాంటి దివ్యశక్తి సంపన్నమైన ఈ ప్రదేశంలో విద్య నేర్చుకున్న శ్రీకృష్ణుడు విద్యాభ్యాసం అంతా అయిపోయాక లోకాచారం ప్రకారం గురుదక్షిణను ఇవ్వాలనుకుని గురువుగారి దగ్గరకు వెళ్ళాడు. ఆ సమయంలో గురుపత్ని ఎంతో దుఃఖంతో కనిపించింది. కారణమడుగగా తమకున్న ఒకే ఒక్క కుమారుడు కొన్ని సంవత్సరాల క్రిందట అదే రోజున సముద్రగర్భంలో కలిసిపోయాడని ఎంతో విచారంగా చెప్పారు. విషయం విన్న వెంటనే శ్రీకృష్ణుడు తన ప్రయత్నం మొదలు పెట్టాడు.

సర్వసమర్థుడైన శ్రీకృష్ణుడు గురుదక్షిణగా చనిపోయిన గురుపుత్రుణ్ణి పునర్జీవింపజేసి తీసుకువచ్చి గురుపత్నికి ఇచ్చిన ప్రదేశమదే– తిరిగి బ్రతికిన ఆ పిల్లవాణ్ణి "పునర్దత్తుడని" పిలవటం జరిగిందని మాస్టర్‌గారు చెప్పారు. ఆ తర్వాత కొద్దికాలానికి 1,60,000 'శ్రీం' బీజమంత్రాన్ని వ్రాయించి వాటిని భూగర్భంలో స్థాపితం చేసి దానిపై శ్రీ స్థూపం నిర్మించటం జరిగింది. కానీ మాస్టర్‌గారిచ్చిన లెక్క 16 కోట్లు. దానిని పూర్తి చేయడానికి శ్రీశాంతారామ్, మణికుమార్‌గార్లతో పాటుగా మిగిలిన సాధకులు ఆ మంత్రాలను వ్రాయించి అందులో స్థాపించటానికి కృషి చేస్తున్నారు.

**ఆశ్రమానికి వేంచేసిన దేవీదేవతలు:** రేపల్లె సమీపంలో పెనుమూరు అనే గ్రామం ఉన్నది. 24.09.2000 సంవత్సరం మధ్యాహ్నం ఒంటిగంటకు ఆ ప్రాంతంలో కృష్ణానది ఒడ్డుకు గణపతి, హనుమంతుడు, శ్రీకృష్ణుడు, రుక్మిణీ, సత్యభామల విగ్రహాలు కొట్టుకువచ్చి ఉన్నాయట. ఒడ్డున గల ఆ విగ్రహాలను చూసిన శ్రీశాంతారాంగారు మాస్టర్‌గారికి ఫోన్ చేసి 'ఈ విగ్రహాలిలా వచ్చి వున్నాయి. వీటినేం చేయమంటారు' అని అడుగగా వెంటనే స్పందించిన మాస్టర్‌గారు 'ఆ విగ్రహాలు సజీవశిల్పాలు. వాళ్ళు మన ఆశ్రమానికి రావాలని కోరుకుంటున్నారు. ఆశ్రమంలో నైరుతీమూల ఒక పాకను వేసి వారిని సగౌరవంగా ఆహ్వానించి ఊరేగింపుతో తీసుకువచ్చి స్థాపించండి' అని చెప్పారు. అంతే గ్రామస్తులందరు ఈ విషయం తెలుసుకొని అత్యంత వైభవంగా అలంకరించిన బండి మీద మహాశక్తి సంపన్నమైన విగ్రహాలను తెచ్చి ప్రతిష్ఠించి పూజలు చేశారు. మాస్టర్‌గారి మార్గదర్శనంలో ట్రస్టువారు, మిగిలిన గ్రామస్తులందరూ ఎంతో ఐక్యతతో ఆ శ్రీక్షేత్రాన్ని అభివృద్ధి చేయటానికై బహుధా కృషి చేయుచున్నారు. అక్కడ వున్న పరివార్ సభ్యులు గ్రామస్తులందరిని ప్రోత్సహించి ప్రతీ అమావాస్యకు ఐదురోజుల పాటు శ్రీమహాలక్ష్మీసాధన చేసి పూర్ణాహుతిని చేస్తారు.

మాస్టారు 'శ్రీవిద్యా' పారంగతులైన శ్రీ అగస్త్యమహర్షి వారి కార్యకమాలకు ఈ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆ ఆశ్రమానికి స్వయంగా ఆ జగద్గురువే వేంచేశారు. ఇలాంటి పరిణామాలను ముందుగానే దర్శించి ఆ అంతరార్థం బోధపడే సర్వజ్ఞులైన మాస్టర్‌గారు ఋషుల కార్యక్రమాలకు కేంద్రస్థానంగా ఈ అగస్త్యాశ్రమాన్ని స్థాపించారు. ఇలాంటి రహస్యార్థాలు ఇప్పుడు బోధపడు తున్నాయి. ఇందులో ఆశ్చర్యం ఏముంటుంది. చంద్రవిద్య అంటే షోడశకళల సాధనాసంపత్తి. చంద్రుడు షోడశకళా పరిపూర్ణుడు. అలాగే జగద్గురువు శ్రీకృష్ణుల వారు కూడ షోడశకళా పరిపూర్ణులు.

ప్రపంచానికి యోగవిద్యనందించిన యోగీశ్వరులైన శ్రీకృష్ణపరమాత్మ యొక్క లీలాకథల నందించిన శ్రీమద్భాగవతంలోని దశమస్కంధం ఇక్కడ అధ్యయనం చెయ్యాలి. అదే ఇక్కడ ఇవ్వబడిన సిలబస్. మాస్టర్‌గారందించిన శ్రీ మద్భాగవతయజ్ఞం ద్వారా శ్రీకృష్ణచేతనత్వం విశ్వవ్యాప్తమౌతుంది. కనుక జన్మాష్టమికి భాగవత యజ్ఞపరంపర కొనసాగాలి. శ్రీకృష్ణుని అర్ధాంగిని శ్రీమహాలక్ష్మి. అందుచేత ఇక్కడ ప్రతి అమావాస్యకు 'శ్రీ విద్యారణ్య ప్రోక్త బీజమంత్ర సంపుటిత శ్రీసూక్త మహాలక్ష్మి సాధన' కూడా జరుగుతుంటుంది.

దాంతోపాటుగా ఒక విశేష ప్రయోజనంతో మహాకాలుని శివలింగ స్థాపన కూడా ఈ ఆశ్రమంలో జరిగింది. మహా శివరాత్రికి అశేష ప్రజానీకం ఈ క్షేత్రానికి వచ్చి భక్తిశ్రద్ధలతో, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, శివరాత్రి జాగరణ, ఉదయం యజ్ఞం చేసి పూర్ణాహుతి చేసుకొని వెళతారు. ఈ కార్యక్రమాలనన్నింటినీ శ్రీకళానిధి ట్రస్ట్ వారు ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా ఏర్పాటు చేస్తారు. ఆ క్షేత్రానికి మాస్టర్‌గారు ఇచ్చిన అపూర్వ వరదానం 'చంద్రవిద్యా కేంద్రం'.

## సూర్య విజ్ఞానకేంద్రం - కొప్పరావూరు

'సూర్య ఆత్మ జగతస్తుషశ్చ' అనేది వేదప్రమాణం. సూర్యుడు ఈ జగత్తుకు కన్నులాంటివాడు. అలాగే సూర్యుణ్ణి గురించి 'సువతి కర్మాణి లోకం ప్రేరయతీతి సూర్యః' అన్నారు. ఈ ప్రపంచానికి సుందరమైన ప్రేరణలన్నింటినీ ప్రేరణగానిచ్చే జగద్రక్షకుడు సూర్యనారాయణ మూర్తియే! అందుకే మన మహర్షులు సూర్య ఉపాసన - గాయత్రీ మంత్రంలో జోడించి అద్భుతమైన సంధ్యావందన కార్యక్రమాన్ని రూపొందించారు.

## సవితారాధన

వేదకాలానికి ముందున్న మతములలో సౌరమతము చాలా ప్రాచీనమైనది. అప్పటి నుండే సూర్యారాధన చేసి మానసిక, శారీరక దారుఢ్యాన్ని సంపాదించడం, సూర్యుడి నుండి ఉత్పన్నమయ్యే కిరణ సముదాయముపై అధ్యయనం చేయడం మానవ చరిత్రలో ప్రారంభమైంది. మానవుని నిత్యనైమిత్తిక కర్మల్లో సూర్యునిదే ప్రధాన పాత్ర. వేదవాఙ్మయాల్లో, ఉపనిషత్తుల్లో సూర్యదేవుని మహాత్మ్యాన్ని, విశ్వసంచాలనలో ఆయన యొక్క చేతనాత్మకమైన భూమికను, సూర్యోపాసనవలన లాభాలను అపారంగా వర్ణించారు. యజుర్వేదంలో సూర్యుడు స్వయం ప్రభువు. ఆయన సర్వశ్రేష్ఠుడు. ఆయనే ఈ జగత్తునంతటినీ ప్రకాశింపచేస్తాడు. ఎవరైతే సూర్యోపాసనను నియమనిష్ఠలతో చేస్తారో వారికి తేజస్సు, వర్చస్సులను ప్రసాదిస్తాడు ఆ సూర్యభగవానుడు.

సూర్యుడు అనగా సవిత. సవితయే గాయత్రీమంత్రాధిష్ఠాన దేవతయని గురుదేవులు చెప్పుంటారు. ఆయనను సవితృమండలాంతర్వర్తిగా యజ్ఞంలో అభివర్ణించారు. అగ్ని, దీపము – సవితకు ప్రతిరూపములు. తత్సవితుర్వరేణ్యం – మా బుద్ధులను సన్మార్గంలో ప్రేరేపించమని వేడుకొనడమే గాయత్రీ మంత్రమునకర్థము.

**గాయత్రీ ఉపాసన, గాయత్రీ జపము, సవితాధ్యానములు ఈనాటి విపత్కర పరిస్థితులకు సరైన ఆధ్యాత్మిక ఔషధంగా భావించి పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు దీనినొక ఉద్యమంగా చేపట్టి గాయత్రీ జపము, యజ్ఞము, దీప యజ్ఞములను సార్వజనీనం చేశారు.**

ఈ రోజులలో అణ్వాయుధాల నుండి ఉత్పన్నమయ్యే రేడియో ధార్మికతను ఎదుర్కోవాలంటే ఆర్థర్ కొస్లర్ అనే శాస్త్రవేత్త ఆధ్యాత్మిక ఉపచారముల నాశ్రయించాలని నొక్కివక్కాణించారు. బ్లిట్జ్ పత్రిక సంపాదకులు కరంజియాకు ఆయన చెప్పిన విషయాలను 'నవనీత' అనే పత్రికలో మార్చి 3వ తేదిన ప్రచురించారు. వారు ఇలా చెప్పారు. అణ్వాయుధాలకంటే ఎక్కువ సామర్థ్యము సూర్యపరమైన గాయత్రీ మంత్రములో ఉన్నది. కోట్లాది భారతీయులు గాయత్రీమంత్రమును ఒక్కసారి ఉచ్చారణ చేసినట్లయితే (పురశ్చరణరూపములో) ఆ అనుష్ఠానము నుండి ఉత్పన్నమయ్యే ఊర్జా బ్రహ్మాండములోని సూర్యున్ని కూడా ఛేదించగల మిస్సైల్ మాదిరి పనిచేస్తుంది. అది 'భర్గ' పదముతో కలిసి అణుశక్తి వినాశనాన్ని కూడా చేయగలదు. దీనికి సంబంధించి పండిత శ్రీరామశర్మఆచార్యగారు సవితా ధ్యానాన్ని వైజ్ఞానికపద్ధతిలో సార్వజనీన ఉపాసనా విధానంగా

క్రాంతిధర్మీసాహిత్యం–రెండవభాగంలో ఇచ్చారు. ప్రతిరోజు ఆ ధ్యానం చేసినట్లయితే శారీరక, మానసిక ఆరోగ్యాలతో శాంతి, సుఖములను పొందవచ్చు.

ఇంతటి మహత్తరమైన 'సూర్య విజ్ఞానం' మీద మాస్టరుగారు అమలాపురం, సాధనాశిబిరంలో ఎన్నో ఉపన్యాసాలనిచ్చి, సాధనలను కూడా చేయించారు. సాధనలో భాగంగా చేయించిన యజ్ఞంలో సూర్యకిరణాలు పైనున్న పూరికప్పులో నుండి చీల్చుకుని వచ్చి యజ్ఞకుండంలోనికి ప్రవేశించి వివిధాకృతులను ధరించి తిరిగి సూర్యునిలోకి వెళ్ళిపోవడం ఆనాటి సాధకులు గమనించారు. తద్వారా సూర్యకళంకాల వల్ల రాబోయే అనేక ప్రమాదాల నుంచి రక్షించబడ్డామని ఆ రోజు వారు ప్రకటించారు. పూజ్యగురుదేవులు వ్రాసిన 'సూర్యవిజ్ఞానం' అనే పుస్తకంలో అద్భుతమైన సూర్యవిజ్ఞానం పొందుపరచబడి మనకివ్వబడింది. ఇంతేకాక 'సూర్యచికిత్సా విజ్ఞానం' అని గురుదేవులు వ్రాసిన వాఙ్మయంలో సూర్య ఉపాసన వలన రోగాలనెలా రూపుమాపుకోవచ్చునో కూడా చాలా విశదంగా వ్రాశారు.

అలాంటి మహత్తరమైన విజ్ఞానాన్ని మానవజాతికి అందించటానికి **"సూర్యకిరణ విజ్ఞాన అనుసంధాన కేంద్రాన్ని"** కొప్పురావూరులో ఏర్పాటు చేసి అందులో సూర్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు మాస్టర్‌గారు. ఆ విజ్ఞానాన్ని నిత్య జీవితంలో ఎలా ఉపయోగించుకోవాలనే దానికి తరగతులను నిర్వహించి, శిక్షణనిచ్చే బాధ్యతను వారు శ్రీ డి.వి.యన్.బి విశ్వనాథంగారికి అప్పచెప్పారు. అప్పటికే శ్రీ విశ్వనాథంగారు గురుదేవుల ఆదేశాలపై "గాయత్రీ మహావిజ్ఞాన్ మూడవ భాగం" తెలుగులోనికి అనువదించి ప్రచురించారు. అలానే వారు ఇంకా గురుదేవుల రచనలైన సూర్యవిజ్ఞానం, కుండలినీ విజ్ఞానం మాత్రమే కాక అనేక పుస్తకాలను తెలుగులోకి అనువదించి ఆంధ్రలోకాని కందించి గురుదేవుల సేవలో తరించారు. కొన్ని అననుకూలపరిస్థితులలో 2011వ సంవత్సరం వసంతపంచమికి శ్రీ విశ్వనాథం గారి కోరికపై ఆ సూర్య విగ్రహాన్ని సప్తర్షి ఆశ్రమానికి తరలించడం జరిగింది. సప్తర్షి ఆశ్రమమనేది ఏడుగురు ఋషుల సాంప్రదాయాలకు, సాధన, శిక్షణలకి కేంద్రం. అందుకే సప్తాశ్వరథమారూఢుడై వున్న ఆ సూర్య విగ్రహం ఆశ్రమానికి తరలివచ్చిందేమో!

ఏడు సూర్య కిరణాలకి – సప్త ఋషులకి మధ్య గల అన్యోన్యాశ్రిత అనుబంధం ఆ పరమ గురువులైన మహనీయులకే తెలియాలి. వారి ఆదేశాలను అమలు చేసే మన మాస్టర్‌గారికి అందులోని అంతరార్థం తెలుసు కనుకనే ఆ ఆశ్రమం అలా రూపొందించబడింది.

శ్రీ హంసరామ ఆశ్రమం – అగ్ని విద్యకు

శ్రీ అగస్త్యాశ్రమం – చంద్ర విద్యకు

సప్తర్షి ఆశ్రమం – సూర్య విద్యకు

కేంద్రాలుగా మాస్టర్‌గారు స్థాపించారు. వాటిని పరమగురువుల ప్రణాళికలను అమలుపరిచే కేంద్రాలుగా మలిచి తత్సంబంధమైన విషయములను, సాధనలను నేర్పించడం జరుగుతున్నది.

## సూర్య-చంద్ర-అనలాత్మక విద్య

శరీరమే దేవాలయం. "దేహోదేవాలయ ప్రోక్త ః జీవభూతస్సనాతనః" అనే ప్రమాణం ఈ సాధనతో మిళితమై వున్నది. బాహ్యంగా ఉన్న సూర్యుడు, చంద్రుడు, అగ్నుల వలెనే మన శరీరంలో కూడా ఇవన్నీ ఉన్నాయి. సూర్య అంటే – పింగళనాడి, కుడి ముక్కు. కుడి వైపు నుండి వచ్చే శ్వాస సూర్య విద్యకు ప్రతీక. చంద్ర అంటే ఇడానాడి, ఎడం ముక్కు. ఎడంముక్కు నుండి వచ్చే శ్వాస చంద్రవిద్యకు ప్రతీక. ఇక పోతే మూడవది అగ్ని. అగ్ని అంటే – సుషుమ్న అంటే మూడవ కన్ను. శరీరంలో వుండే 21600 నాడులలో ఇవి మూడు అతి ప్రధానమైనవి. ఈ ఇడ, పింగళ, సుషుమ్న నాడుల గురించి శ్వాస మహా విజ్ఞానంలో సంపూర్ణమైన సాధనా విధానాలివ్వబడ్డాయి. అంతటి జ్ఞానాన్ని ప్రచుర పరిమాణంలో ఈ ఆశ్రమాలలో చెప్పాలనేది వారి ఆశయం.

## సప్తర్షి ఆశ్రమం, గుంటూరు

అది 1998వ సంవత్సరం మేనెల 7వతేది. ఆ రోజున మాస్టర్‌గారు ఒక ప్రచండమైన ఉపన్యాసాన్నిచ్చారు. ఇప్పటికి కూడా మీరు అనుగ్రహ పీఠాలను, ఆశ్రమాలను, స్థాపించడంలో గల ఉద్దేశ్యాలను, లక్ష్యాలను అర్థం చేసుకోలేకపోతున్నారు. ఈ యుగసంధి కాలంలో సప్త ఋషులు, ఇంకా అనేకమంది దివ్యాత్మలు ఈ భూమ్మీదకు వస్తున్నారు. వాళ్ళ పని వాళ్ళు చేసుకోవాలి. అది మనకర్థం కావటంలేదు. విశ్వామిత్రుడే స్వయంగా వచ్చి రామలక్ష్మణులను తీసుకువెళ్తానంటే దశరథుడు ఒప్పుకోలేదు. పరిణామక్రమం యొక్క విశిష్టతను ఎరిగినవాడు కనుక వశిష్టుడు వచ్చి రామలక్ష్మణులను పంపమని దశరథుడికి చెప్పాడు. విశ్వామిత్రుడిలాంటి గురువులు వచ్చినా బల, అతిబల అనే విద్యలను నేర్పాలన్నా, రామలక్ష్మణుల్లాంటి శిష్యులు రావాలి. వారి ద్వారానే దుష్టశిక్షణ జరిగి, శిష్ట రక్షణ జరిగి పరిణామక్రమంలో సువ్యవస్థ వస్తుందనేది మనమీనాడు గుర్తించాలి.

## సప్తర్షి ఆశ్రమ నిర్మాణం

1998 ఆగష్టు 3వ తేది నుండి మాస్టర్‌గారు నివసిస్తున్న ఇంటి ముందు భాగాన్ని ఆశ్రమం లాగా రూపొందించే పనులు ప్రారంభించారు. దానికి మొదటి చరణంగా 'నిరంతర గురుసాన్నిధ్య అనుభూతి సాధనా శిబిరము'ను ఏర్పాటు చేసి రాత్రిపగలు యజ్ఞం చేస్తూ -

**ఓం నమః శ్రీగురుదేవాయ పరమ పురుషాయ సర్వదేవతా వశీకరాయ ।**
**సర్వారిష్ఠ వినాశాయ, సర్వమంత్రచ్ఛేదనాయ త్రైలోక్యం వశమానయస్వాహా॥....స్వాహా...**

అనే మంత్రంతో ఆహుతులనివ్వటం జరిగింది. అలా ఒక సంవత్సరం పాటు చేయమన్నారు. అనేక గ్రామాల నుండి సాధకులెందరో వచ్చి స్వయం సేవకులుగా పనిచేస్తూ ఆ అఖండ యజ్ఞాన్ని సుసంపన్నం చేశారు.

ఆ తరువాత జగజ్జనని మహాయోగేశ్వరీ దేవి, ఏకైక అఖండ గురుసత్తాలకు అలయనిర్మాణం చేసి యథావిధిగా అత్యంత శ్రద్ధ, నిష్ఠలతో పూజలు, అర్చనలను చేయించేవారు. గురువు ప్రణాళికకు అనుసంధానంగా చేస్తున్న ఈ ప్రక్రియ పృధ్వీగ్రహంలో జరగబోయే అనేక విపత్తుల నివారణ కొరకు అనేది అంతర్వాహినిగా అర్ధం చేసుకోవాలి.

కాలక్రమంలో ప్రక్కనే వున్న స్థలాన్ని (ఇప్పుడు ఆశ్రమంగా వున్న ప్రదేశాన్ని) కొనడం జరిగింది. అంత స్థలాన్ని ఒక్క వారం రోజులలోనే కొనడం అనేది మాస్టర్‌గారి సంకల్ప శక్తికి ఒక గొప్ప నిదర్శనం. ఆ సమయంలో వారి ఉగ్రమానసిక స్థితి శ్రద్ధగా గమనించేవారికి మాత్రమే అర్థమౌతుంది. వారు పైకి నిశ్చలంగా ప్రవహించే గంగానదిలా, అతి సాధారణంగా కాలేజీకి వెళ్ళివస్తుండేవారు. అందరితో సహజమైన చిరునవ్వుతోనే మాట్లాడుతూ ఉండేవారు. కానీ అంతరంగంలో వారు చేస్తున్న అఖండసాధనను అవలోకించటం ఎవరి తరమౌతుంది? అసంభవమని అనిపించిన ఆ స్థలం అంత సులభంగా మాత్రం ఆశ్రమానికి దక్కలేదు. పూజ్య గురుదేవులు హరిద్వార్‌లో శాంతికుంజ్ ఆశ్రమ స్థలసేకరణకెలాంటి పరిస్థితులనెదుర్కొని ఆ విశ్వామిత్ర తపః స్థలాన్ని సేకరించారో అచ్చంగా అలానే ఈ సప్తర్షి ఆశ్రమం కొనుగోలు జరిగింది. అదృశ్య దివ్య శక్తుల సహాయ సహకారాలను మనం భౌతిక దృష్టితో చూడలేంగదా!

అలా ఆ స్థలాన్ని సేకరించిన తర్వాత సప్తర్షి ఆశ్రమాన్ని గురుదేవుల ఆశ్రమానికి నమూనా వలె నిర్మించారు. అత్యంత స్వల్ప సమయంలోనే యాజ్ఞవల్క్య యజ్ఞశాల, మహాకాలచక్రవర్తి

యంత్రస్థాపన, నవగ్రహమండపం, సంస్కార మరియు ప్రవచన కక్ష్యలను బహుసుందరంగా నిర్మింపచేసారు. మాస్టర్‌గారికి అత్యంతకీలకమైన ఈ సమయంలో పూర్తి సమర్పణతో పనిచేసే దివ్యాత్మలు ఈ ఆశ్రమ నిర్మాణంలో తమ సహాయ సహకారాలను, సమయ, అంశ, ప్రతిభా దానాలను సమర్పించుకుని తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు.

2000వ సంవత్సరం లోపల పరమగురువులందిస్తున్న విషయ పరిజ్ఞానాన్ని, సాధనలను సమస్త మానవజాతికి అందించవలసిన సమయమాసన్నమైంది. ఆ దీక్షా విజ్ఞానం ఇప్పుడు కనుక బయటికి రాకపోతే అది లుప్తమైపోయే ప్రమాదం పొంచి ఉన్నది. అందుచేత సమయం యొక్క గొప్పదనాన్ని, అవసరాన్ని గుర్తించిన మాస్టారు రాత్రి పగలు సాధనలు చేయించేవారు. ప్రవచనాలు చెప్పేవారు.

గురుదేవుల లక్ష్యమైన (1) పృథ్విపై స్వర్గావతరణ, (2) మానవులలో దైవత్వం అవతరణ అనే ఈ రెండు కలలను సాకారం చెయ్యాలంటే ఎంత తపస్సు చెయ్యాలి. తపస్సనేది ఒంటరిగా చేసేదిగాదు. ఈ యుగంలో సామూహిక సాధన అత్యవసరం. అప్పుడే సత్ఫలితాలను సాధించగలుగుతాము. అందుకే ఈ ఆశ్రమాలను స్థాపించామని మాస్టారు పదేపదే చెప్తుండేవారు.

## తపస్సంటే ఏమిటి?

తపస్వి అంటే ఎవరు, తపస్సంటే ఏమిటి అంటే తృష్ణల మీద, కోరికల మీద అంకుశము నుంచుట అని గురుదేవులు చక్కటి నిర్వచనాన్ని చెప్పారు. రాబోయే కాలంలో పరివ్రాజకా ప్రణాళికకు శుభారంభం చేస్తున్నారు. కనుక ఆ ప్రణాళికలో పాలు పంచుకునేవారు ఎంతో అదృష్టవంతులు. ఈ పరివ్రాజకా ప్రణాళికలో మీరు చెయ్యబోయే తపస్సు ద్వారా మానవుడు తనలోని బలహీనతలను నశింపచేసుకుని స్వచ్ఛమైన మణిలాగా మారాలి. మనస్సు చేస్తానంటుంది. శరీరం ఒప్పుకోదు. శరీరం ఒప్పుకుంటే మనస్సు సహకరించదు. ఈ ద్వంద్వ యుద్ధం చేయడాన్నే తపస్సు అంటారు.

**వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకొని, మీలోని దురలవాట్లను తరిమికొట్టడానికి తపస్సనే అంకుశాన్ని ప్రయోగించాలి. తపస్సు చేయడం వల్ల చెడు అలవాట్లు సమసిపోతాయి. చెడు అలవాట్లను ఎంతగా నశింపచేసుకుంటే భగవంతుడు అంతగా దగ్గరౌతాడు. జీవిత సాఫల్యంలో వ్యక్తిగత ఉన్నతితోపాటు సమాజసేవ చేయడం మానవుని కర్తవ్యం మరియు బాధ్యత కూడా.**

రాబోయే రోజులలో మన కుటుంబాల నుండి వేలాది మంది పరివ్రాజకులు వెలువడాలి అయితే వారికుండే విశేషత ఏమిటన్న ప్రశ్న వచ్చినప్పుడు "తపస్వీ జీవితం" అనేది వారికి వున్న మహత్వపూర్ణ అంశం. మీరు మీ అంతరంగాన్ని కుదిపివేయాలి. అదెలాసాధ్యం? మీరు మా ప్రణాళికలను అమలుపరిస్తే మేము మీ అంతరంగంలోకి ప్రవేశించి అక్కడ కలకలం సృష్టిస్తాము. మీ ద్వారా ఋషుల ప్రణాళికలను సాకారం చేసి తీరుతాం అని చెప్పారు.

1999 సెప్టెంబర్ నుండి సప్తర్షి ఆశ్రమం చుట్టుప్రక్కల గల అనేక గృహాలను అద్దెలకు తీసుకొని సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో సాధనా శిబిరాలను నిర్వహించి అఖండ గురుసత్తా గురించి వివరణలు, భగవద్గీత దీక్షలు, నవరాత్రి సాధనలు, దశావతార ప్రక్రియ మొదలైన అంశాలే కాక ఆయుర్వేదాన్ని గురించి, హోమియోగురించి, వాస్తు గురించి, జ్యోతిర్విద్య మొదలైన అంశాలపై విశేష ప్రవచనాలనందించారు.

నభూతో నభవిష్యతిగా ఈ యుగసంధికాలాన్ని అత్యంత సాధనాత్మకంగా సప్తర్షి ఆశ్రమంలో నిర్వహించి "నవయుగానికి ఆహ్వానం" గా డిసెంబరు 31వ తేది రాత్రి పెద్ద సదస్సునేర్పాటు చేసి బ్రహ్మాండమైన ఉత్సవాలను జరిపించి మన లక్ష్యానికి అనుగుణంగా "పృధ్విపై స్వర్గావతరణ" అనే పుస్తకాన్ని ఆవిష్కరించి – ఆనాటి కార్యక్రమాలకు ముగింపు పలికారు. అయితే ఆశ్రమం నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా విరాజిల్లుతూ ఉన్నది. అర్చకులున్నారు, నిత్యనైమిత్తిక పూజలు జరుగుతున్నాయి. వారు శ్రీశిర్డిసాయికి అదే ఆలయంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారికి అర్చనాది కార్యక్రమాలను ఈనాటికీ చేస్తునే ఉన్నారు.

2000సంవత్సరం నుండి ఆశ్రమంలో "ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం" అనే మంత్ర జపాన్ని ప్రారంభింపచేశారు. రాబోయే నూతనయుగం సాయి, వేంకటేశ్వరస్వామి, శ్రీరామశర్మ ఆచార్యగార్ల దివ్యవైభవంతో, దివ్యచైతన్యంతో అలరారుతుందని చెప్పారు. సప్తర్షిఆశ్రమంలో ఒక రోజు చెప్పిన ఉపన్యాసంలో, 'తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికంటే ముందు శ్రీ వరాహ స్వామి దర్శనం చేసుకోవడమనేది అక్కడి ఆచారం. అలానే ఈ సప్తర్షిఆశ్రమానికి వచ్చేవారు ముందుగా వేణుగోపాల్‌నగర్‌లోని శ్రీవేణుగోపాలస్వామివారిని దర్శించి ఇక్కడికి వస్తే వారి సంకల్పాలు నెరవేరుతాయి' అని చెప్పారు.

## నిత్యావతార దత్తక్షేత్రం

గురువులకు గురువు, ఆదిగురువు, జగద్గురువు, అత్రి అనసూయల ముద్దుల తనయుడు, యుగయుగాల నుండి గురుచేతనత్వానికి ప్రధానకేంద్ర బిందువు దత్తస్వామివారు. ఒకానొక అత్యవసర సమయంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు 'శ్రీ దత్తాత్రేయుల వారి విగ్రహప్రతిష్ట'కు వేటపాలెంలో శ్రీకారం చుట్టారు.

1982వ సంవత్సరంలో నేను వేటపాలెం, జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయినిగా పని చేస్తున్నాను. కొన్ని విశేష పరిస్థితులలో మా మేనత్తకుమారుడైన శ్రీ డి.వి.ఎన్.బివిశ్వనాథంగారు మాకు గాయత్రీపరివార్ గురించి, శ్రీరామకృష్ణ మాస్టర్‌గారి గురించి చెప్పటం జరిగింది. దాంతో మాకు వేటపాలెంలో కూడా గాయత్రీ యజ్ఞం చేయిస్తే బావుంటుం దనిపించి "మీరు ఒకసారి వచ్చి వేటపాలెంలో యజ్ఞం చేయమని కోరాం". వారూ తమ అంగీకారాన్ని తెలిపారు. ఒక శుభ ముహూర్తంలో వారు, మూర్తిగారు, రఘుపతిగారు యజ్ఞం చెయ్యడానికి వేటపాలెం వచ్చారు.

మొట్టమొదటిసారిగా 1982 సంవత్సరం సెప్టెంబరు నెలలో వేటపాలెం గ్రామంలో కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో గాయత్రీ మంత్రము, యజ్ఞములకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఆనాడు చేసిన ఆ యజ్ఞం విశేషంగా అందరినీ ఆకర్షించింది. ఇంక ఆనాడు అందరూ దీక్షలు తీసుకోవడం, ప్రతి రోజూ గాయత్రీ మంత్ర జపం చెయ్యడమనేది అందరికీ అలవాటైంది. అలా ఆనాటి నుండి వేటపాలెంలో ప్రతి వారం ఎవరో ఒకరి ఇంట్లో యజ్ఞాలని, సంస్కారాలని తరచూ కార్యక్రమాలు జరుగుతుండేవి. వాటితో పాటుగా దీపయజ్ఞముల సందడితో ఇంటింటా గాయత్రీ మంత్రసాధన అవిశ్రాంతంగా జరిగింది. 1994వ సంవత్సరంలో ఒక సహస్రకుండీయ గాయత్రీ యజ్ఞము జరిగింది. 1995 కార్తీక పూర్ణిమకు మూడు రోజులపాటు సహస్రకుండీయ యజ్ఞములతో పాటు మేధాయజ్ఞములు, మూడవరోజున పూర్ణాహుతి కార్యక్రమాన్ని పూజ్యశ్రీమాస్టర్‌గారే స్వయంగా ఎంతో దీక్ష, దక్షతలతో నిర్వహించారు.

తర్వాత ఒకసారి అది 1998 మార్చి 31వతేదీ ఉదయాన మాస్టర్‌గారు, నేను, సాయిగౌరి కార్లో పర్చూరు మీద నుండి జాంద్రపేటకు వస్తున్నాము. ఆ దారిలో ఉన్న పర్వతశ్రేణులను చూస్తూ మాస్టర్‌గారు ఒక విచిత్రమైన స్థితిలో, "ఈ పర్వతాలలో దత్తుడు ఏకాకిగా సంచరిస్తున్నాడు'

అన్నారు. ప్రక్కనే ఉన్నగౌరి, 'అయితే మీరు పిలవండి మాస్టారు. దత్తుడు వస్తాడు' అన్నది. "పిలవమంటావా, అయితే పిలుద్దాం" అన్నారు, సంభాషణ అంతా సరదాగానే సాగింది. ఆ తరువాత ఆ విషయాన్ని మర్చిపోయాము.

ఒకసారి పనిమీద గుంటూరుకు వెళ్ళాను. మాస్టర్‌గారు గురుదేవులు వ్రాసిన వేదాలనధ్యయనం చేస్తూ తత్సంబంధమైన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు. ఆ రోజుకు వ్రాతపని పూర్తయింది. సాయంత్రం ఆరుబయట ఈజీచైర్లో కూర్చున్నారు. అప్పటి వరకు వ్రాసిన వేదాల గురించి మాట్లాడతున్నారు. నేను ప్రక్కనే కూర్చుని వింటున్నాను. ఉన్నట్లుండి "వేటపాలెంలో దత్తుణ్ణి పెట్టాలి. వెంటనే వెళ్ళి వేటపాలెంలో ఉన్న మన వాళ్ళకి ఫోన్ చేసి ఈ విషయం చెప్పిరా" అన్నారు. ఆ రోజులలో ఎవ్వరి ఇళ్ళల్లోనూ ఫోనులుండేవి గావు. సరే, పబ్లిక్ టెలీఫోన్ బూత్‌కు వెళ్ళి ఒకరిద్దరికి ఫోన్ చేశాను. ఎవ్వరూ దొరకలేదు. రాత్రి పదిగంటలైంది. మాస్టర్‌గారు అలాగే బయటనే కూర్చున్నారు. దాదాపు 11గంటలప్పుడు మళ్ళీ వెళ్ళాను. ఈసారి శ్రీమతి ప్రమీలమ్మ గారింటికి ఫోను చేశాను. ఆ రోజులలో ఆమె అప్పుడప్పుడే కార్యక్రమాలకు వస్తుండేది. ఉద్యోగరీత్యా ఆమెకు ఈ కార్యక్రమాలకు వచ్చే సమయం దొరికేది కాదు. సరే, ఆ రాత్రి సమయంలో ఆవిడ ఫోన్ తీశారు. విషయం చెప్పాను. ఒక్కసారిగా 'ఆశ్రమం-దత్త ప్రతిష్ట' అనేసరికల్లా ఆమె కంగారు పడ్డారు. విషయాన్ని వివరించి "రేపు ఉదయం మనవాళ్ళను వీలైనంతమందిని మాస్టర్‌గారి దగ్గరకు పంపండి. మాస్టర్‌గారే వాళ్ళకు వివరం చెప్తారని" చెప్పి ఇంటికి వచ్చాను. వారికీ విషయమంతా చెప్పాకనే వారు లోపలికి వచ్చిభోజనం చేశారు.

ఆ మరునాడు ఉదయం పదిగంటలకు వేటపాలెం నుండి ఎనిమిది మంది కార్యకర్తలు మాస్టర్‌గారింటికి వచ్చారు. చిరునవ్వుతో వారిని పలకరించి ముందు వారికి భోజనాలు పెట్టమన్నారు. వారందరూ భోజనం చేశాక నిమ్మళంగా వారితో, "మనం వేటపాలెంలో దత్తాత్రేయుల వారిని ప్రతిష్టించబోతున్నాము. దానికి స్థలం కావాలి. అది మనదైవుండాలి, అక్కడే దత్తవిగ్రహ ప్రతిష్ట జరగాలి. మూడున్నర అడుగుల దత్తవిగ్రహం కావాలి. ఈ విషయం అందరికీ చెప్పండి. ఒక వారంరోజులలో అన్నీ అవే సమకూరుతాయి. మీరేం కంగారుపడకుండా ఏర్పాట్లను చేసుకుంటూ ఉండండి." అని చెప్పి 1800 రూపాయలను సీతమ్మగారి చేతిలో పెడుతూ, ముందుగా ఈ డబ్బుతో ఈశాన్యంలో బావి త్రవ్వించండి అని చెప్పారు. ఇన్నేళ్ళ జప, సాధనల, తపఃఫలితంగా

సాక్షాత్ ఆదిగురువు మనదగ్గర కొస్తున్నాడన్న ఆనందంతో వారందరూ, మాస్టర్‌గారు చెప్పిన విధంగా వేటపాలెం వెళ్ళి పనులు ప్రారంభించారు.

అద్భుతం, పరమాద్భుతం. మాస్టర్‌గారు చెప్పిన కొలతలు గల దత్తస్వామి విగ్రహం తెనాలిలో తయారుచేసి సిద్ధంగా ఉంది. ఇంతకంటే మహిమ మరేమైనా ఉంటుందా? ఆనందంగా విగ్రహాన్ని తెచ్చి ప్రమీలమ్మగారింట్లో పెట్టి మాస్టర్‌గారిచ్చిన నిర్దేశాల ప్రకారం పూజలు, హారతులు చేస్తున్నారు. మాస్టర్‌గారు కోరిన విధంగా కొంత స్థలాన్ని ప్రమీలగారు, కొంత మిగిలిన కార్యకర్తలందరూ కలసి ఏర్పాటు చేశారు. మాస్టర్‌గారిచ్చిన కొలతల ప్రకారం చిన్న పర్ణశాలను వేశారు. పందిళ్ళపల్లి శ్రీనివాస్ ఎంతో నిష్టతో మూడు రోజులు ఉపవాసం ఉండి ఈ పర్ణశాల నిర్మాణకార్యాన్ని పూర్తి చేశాడు. ఏప్రియల్ 25వతేదీ ప్రతిష్టకు చక్కటి ఆశ్రమవాతావరణం తయారైంది. ఏప్రియల్ 25వతేదీన స్వామివారినలంకరించి ఊరేగింపుగా తేవటానికి సన్నాహాలు మొదలెట్టారు. ఆ రోజు ఉదయం నుండి సన్నటి చిరుజల్లు పడుతూ ఉండటం వలన అందమైన ప్రశాంత వాతావరణం హాయిగొలుపుతూ ఉన్నది. అందంగా అలంకరించిన స్వామివారిని ఊరేగింపుతో, బాజాభజంత్రీలతో, భజనలతో, చప్పట్లు, తాళాలతో భక్తులందరూ ఆనందతాండవం చేస్తూ, కోలాహలంతో స్వామిని క్షేత్రానికి తీసుకువచ్చారు. అనసూయాత్రికుమారుడు, స్మర్తుగామి అయిన నల్లనివాడు, పద్మ నయనంబులవాడిని అందాలోలికే ఆ చిన్ని పాకలోకి తీసుకువచ్చి ప్రతిష్టకు తగిన ఏర్పాట్లు చేశారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారి సంకల్పశక్తితో గ్రామస్తుల సహకారంతో అంగరంగవైభోగంగా ఎన్నో అవాంతరాలను, ఆటంకాలను అధిగమించి, మాస్టర్‌గారి తపఃశ్శక్తి, సంకల్పశక్తి ప్రభావంతో వేటపాలెం గ్రామ సమీపంలో గల చల్లారెడ్డిపాలెం గ్రామంలో ఒక చిన్న అందమైన పర్ణశాలలో చక్కగా అలంకరించబడిన వేదిక మీదికి "శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీశ్రీపాద శ్రీవల్లభుల నామంతో ఉన్న దత్తాత్రేయస్వామి వారి దత్తయంత్రం" సావిత్రీ వాళ్ళు సమయానికి తేవడంతో దానిని ముందు పీఠవేదిక లోపల అమర్చి అనంతరం మన దత్తస్వామి ప్రతిష్ట చేసారు, ప్రత్యక్ష దత్త స్వరూపులైన శ్రీశ్రీరామకృష్ణగారు ప్రతిష్టించిన స్వామివారికి ముందు అనుకున్నవిధంగా 'శ్రీకృష్ణ శ్యామకమలనయన' అనే నామకరణాన్ని సభాముఖంగా ప్రకటించారు. ఎంత అందమైన పేరు. పేరుకు తగ్గ రూపం. రూపానికి తగిన సౌందర్యం. దానికి తగిన లాలిత్యంతో ప్రేమ, దయ, కరుణలు జాలువారే దివ్యమైన కన్నులతో స్వామి అపారమైన కాంతికిరణాలను దశదిశల

ప్రసరింపజేస్తున్నారు. పరమనిష్ఠతో ప్రతిష్ఠాకార్యక్రమాన్ని స్వయంగా మాస్టర్‌గారే చేశారు. ఇక ఆనాటి నుండి అక్కడ జరుగవలసిన పూజ, అర్చనాది కార్యక్రమాలను శ్రీసింహాద్రిగారి కుటుంబం అక్కడే వుంటూ భక్తి శ్రద్ధలతో చేయటం జరిగింది.

1995సంవత్సరం కార్తీక పూర్ణిమకు వచ్చి మాస్టర్‌గారు సహస్రకుండీ యజ్ఞములు చేయించిన తర్వాత గొల్లపూడి సీతారాంగారి ఆహ్వానం మేరకు కార్తీక వనభోజనాలకని ఈ చల్లారెడ్డి ప్రాంతంలోగల మామిడి తోటల్లోకి మాస్టర్‌గారు వెళ్ళటం జరిగింది. వనభోజనాలై తిరిగి వస్తుండగా ఆ స్థలంలో కార్లో ప్రయాణిస్తున్నంతసేపు శ్రీ దుర్వాసమహర్షి వారి దివ్యచైతన్య తరంగాలను మాస్టర్‌గారు అనుభూతి చెందటం జరిగింది. వనభోజనాలంతా అయ్యాక తిరిగి వచ్చేటప్పుడు శ్రీసీతారాంగారితో కార్లో నుండి చెయ్యిచాపి ఇలా మొత్తం ప్రదేశాన్ని చూపిస్తూ "రాబోయే రోజులలో ఈ ప్రాంతమంతా విద్యాలయాలు వస్తాయి. ఆ పై ప్రాంతంలో 'గురుచేతనత్వ విద్యకు' అవసరమైన సాధనాకేంద్రం ఇక్కడ రాబోతుందని స్పష్టంగా వివరించారు."

ఆనాడు చూపించిన ఆ ప్రదేశంలోనే ఈనాడు మన దత్తస్వామి ప్రతిష్ఠ జరిగింది. మాస్టర్‌గారు స్థాపించే ఆశ్రమాన్ని ఋషుల ప్రణాళికలకు అనుసంధానంగా ఉండే సాధనా కేంద్రముగా నిర్మించడం జరిగింది. ఈ ఆశ్రమాన్ని స్థాపించటానికి ముందుగా జ్ఞానసాగర ట్రస్టును ఏర్పాటు చేసి సమర్థులైన వారిని ట్రస్టు మెంబర్లుగా, కన్వీనర్‌గా శ్రీమతి ప్రమీలగారిని నియమించారు. గ్రామస్తుల, భక్తుల, సాధకుల కృషి ఫలితంగా ప్రమీలగారి ఆధ్వర్యంలో మాస్టర్‌గారు అక్కడ అనేక సాధనా క్యాంప్‌లను, సహస్ర కుండీ యజ్ఞములను నిర్వహించటం జరిగింది.

ఆ విధంగా సూర్య, చంద్ర, అగ్ని, విద్యలకు కేంద్రాలుగా ఆశ్రమాలను స్థాపిస్తూ "గురుచేతనత్వ మనేది" మానవజీవితానికి అసలైన ఆధారకేంద్రం అని నిరూపించారు. గురుదేవులు కూడా చాలీసాలో "జో సద్గురుసో దీక్షా పావే – సో సాధన్‌కో సఫల బనావే" అని వ్రాశారు. సద్గురువుల నుంచి స్వీకరించిన దీక్ష సాధకునికి చక్కటి సాధనా ఫలితాలనందిస్తాయనేది అక్షరసత్యంగా గురుదేవులు చెప్పారు గదా! అందుకే ఈ నిత్యావతార దత్త క్షేత్రంలో మాస్టర్‌గారు దత్తసాధనలు, దత్త ప్రదక్షిణలు, దత్త దీక్షలు ఇంకా అనేకానేక సాధనలనిచ్చి దత్త వైభవాన్ని వివిధరకాలుగా అందించటం జరిగింది. ఈ క్షేత్రం ఎంతో పుణ్యప్రదమైంది. ఇక్కడ చేసే సాధన, సాధకుని ఆధ్యాత్మిక ఉన్నతికి తీసుకువెళుతుందని చెప్పడం జరిగింది.

14.05.1997న కాకివాయిలో ఇచ్చిన ప్రవచనం నుండిః "సహ్యాద్రి పర్వతాలలో పిలిచేవాడు లేక ఒక అనామకుడుగా, ఎవ్వరూ గుర్తించనటువంటి ఒక భిక్షగాడుగా దత్తాత్రేయస్వామి తిరుగుతున్నాడు. ఆయనను పట్టించుకునే నాథుడు ఒక్కడూ లేదు. మీకూ తెలుసు కదా! ఓ మూడు సంవత్సరాల క్రిందట మీకెవరికైనా దత్తాత్రేయస్వామి గొప్పతనాన్ని గురించి ఇంతగా తెలుసా?

అనామకుడుగా తిరుగుతున్నటువంటి ఆ దత్తాత్రేయస్వామిని కలుసుకున్నప్పుడు ఒక్కమాటే చెప్పాను 'భారతజాతి అంతరించిపోలేదు. భారతీయ ఆత్మ మీద ఎన్నిముసుగులున్నా, ఆ ముసుగులు ఎక్కువసేపు భారతజాతి యొక్క స్వఔన్నత్యాన్ని మర్చిపోనివ్వవనే నమ్మకం నాకున్నది. నువ్వు ఎన్ని వేషాలు వేసినా, పిశాచం లాంటి వేషం వేసుకున్నా, ఉన్మత్తుడిలాంటి వేషం వేసుకున్నా, బాలుడి లాంటి వేషం వేసుకున్నా నీ యొక్క జ్ఞానసాగరాన్ని భారతదేశపు ఆత్మ గుర్తించగలదు'. దత్తచైతన్యాన్ని గుర్తించడానికి కొన్ని మంత్ర, తంత్రాలున్నాయి. 18 సూత్రాలున్నాయి. అవి చాలు సహ్యాద్రి పర్వతాలలో తిరుగుతున్నటువంటి ఆ దత్తప్రభువును మీ ఇంటి ముందుకు లాక్కువచ్చి కట్టిపడేసుకోవడానికి, వట్టి కర్మకాండ చాలదు. భావనతో చేయ్యాలి. మీ మనస్సు, మీ వాక్కు మీ ఆచరణ ఆయనకివ్వాలి, అప్పుడే మీకాయన పలుకుతాడు అనే పరమసత్యాలను సభాముఖంగా చెప్పారు మాస్టర్‌గారు.

## సహ్యాద్రి దత్తాశ్రమం-ఓడరేవు

ఋషులు తమ సాధనకు అనువైన ప్రదేశాలను చూసుకోవడానికి ముందుగా నీటి వసతి తర్వాత చల్లటి నీడనిచ్చి, ప్రాణశక్తిని ప్రసాదించే విశాల వృక్ష సముదాయాలున్న ప్రాంతాలను ఎన్నుకుంటారు లేదా అలాంటి పరిస్థితులను కల్పించుకుని సాధనా కేంద్రాలను, గురుకులాలను స్థాపించి భవ్య భారతదేశానికి మెరికల్లాంటి విద్వాంసులను ప్రసాదిస్తారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు కూడా ఈ నాలుగు ఆశ్రమాలని స్థాపించడంతో పాటుగా ఒక అద్భుతమైన ప్రాణ విద్యాకేంద్రాన్ని స్థాపించాలని, అది సముద్రతీరానికి అతి దగ్గరలో, అంటే వారు కూర్చుంటే సముద్రం కనిపించేంత చేరువలో ఆశ్రమం కావాలని అడుగగా శ్రీ సుబ్బారావు, పార్వతి దంపతులు (చీరాల వారు) ఆ బాధ్యతను స్వీకరించి మాస్టర్‌గారికి కావలసిన రీతిలో ఆశ్రమ నిర్మాణాన్ని కొనసాగించారు.

ఈ ఆశ్రమాన్ని స్థాపించడానికి ముందుగా మాస్టర్‌గారు వాళ్ళింట్లో "బ్రాహ్మీ" అనుగ్రహపీఠాన్ని స్థాపించి ఏ సాధనా శిబిరమైనా ఆ పీఠంలోనే చేస్తుండేవారు. 1991 జూన్ నెలలో చీరాల

'శ్రీబ్రాహ్మీ అనుగ్రహపీఠం'లో తొమ్మిదిరోజుల పాటు కుండలినీ జాగరణ శిబిరాన్ని నిర్వహించి, కుండలినీ సాధనకు అవసరమైన కొన్ని ప్రాథమిక సాధనలు చేయించారు. ఆ తర్వాత 1996 జూన్ నెలలో ఓడరేవు సముద్రతీరంలో 'త్రిముఖీ గాయత్రీ' సాధనా విధానంతో పాటు జ్యోతిష శాస్త్రంపై తరగతులు కూడా ఇక్కడే నిర్వహించారు. మాస్టర్‌గారు ఆరోజుల్లో "సమర్థ సద్గురు వాణి విశ్వవిద్యాలయం" స్థాపించాలని, దాని మాధ్యమంతో వేదవిద్యను ఇంటింటికీ తీసుకువెళ్ళాలనే సంకల్పంతో ఉండేవారు. ఆ శిబిరంలో "సమర్థ సద్గురు వాణి విశ్వవిద్యాలయాన్ని" రూపొందించి, దానిని ప్రకటించారు. తత్సంబంధమైన 'చిహ్నము' (ఎంబ్లం) ను కూడా ఆరోజే ఆవిష్కరించారు.

ఆ తర్వాత 21.05.1998 సంవత్సరంలో సహ్యాద్రి దత్తాశ్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఆశ్రమం నిర్మాణం పూర్తి అయ్యాక మాస్టర్‌గారు ఇక్కడే ఉండి సాధన, స్వాధ్యాయం చేసుకుంటూ, సముద్రం యొక్క సామీప్యంలో వుంటూ "ప్రాణవిద్య"కు సంబంధించిన (గురుదేవులచే ఇవ్వబడిన) అనేక సాధనలు చేసారు. నీరు, చెట్లు, ప్రాణశక్తికి ప్రతీకలు. సాధనను ఎప్పుడూ దట్టమైన చెట్లుగల ప్రదేశంలో చేస్తే "సూర్యకిరణవిజ్ఞానం" యొక్క లోతులు అర్థమౌతాయని మాస్టర్‌గారు చెప్తుండేవారు.

**శ్రీ రామ హంస సహ్యాద్రి ఆశ్రమం: మన ఓడరేవు ఆశ్రమంలో శ్రీరామ అనేది శ్రీరామశర్మ ఆచార్య గురువుగారి పేరు. హంస అనేది మన శ్వాసకు ప్రతీక మరియు గాయత్రీ మాత వాహనంగా ప్రసిద్ధి చెందినది. సహ్యాద్రి అంటే మాతాజీ పేరు. గురుదేవులు, మాతాజీకి ఇచ్చిన బిరుదు అది. గురువుగారు మాతాజీని 'సర్వసహా' అని అంటుండేవారు. అంటే సహనము యొక్క అంతము చూసిన ఆవిడ అనేవారు. ఈ బిరుదు నేను ఇచ్చింది కాదు. గురుదేవులు ఆ తల్లికి ఇచ్చిన బిరుదు. ఇంతకంటే గొప్ప పేరు పెట్టగలనా? మా గురుదేవులు మా అమ్మకు పెట్టిన పేరును నేను నా ఆశ్రమానికి పెట్టుకుంటాను అన్నారు.** కాలచక్రం తిరిగిపోతూవుంటుంది. రకరకాల మార్పులు రావటం సహజం. అందులో భాగంగానే సహ్యాద్రి దత్తాశ్రమాన్ని 2006వ సంవత్సరం నుండి "శ్రీరామహంస సహ్యాద్రిదత్త ఆశ్రమం'గా మార్పుచేసి అక్కడ శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులకు సంబంధించిన సాధనా విధానాలను ప్రవేశపెట్టారు. ప్రఖర ప్రజ్ఞ, సజలశ్రద్ధ స్మారకాలను కట్టించారు. ఆశ్రమ ప్రవేశద్వారం దగ్గర గాయత్రీమాతను ప్రతిష్ఠించారు. 2004 డిసెంబరు నెలలో గురుసత్తా మహోత్సవాలప్పుడు ఈ స్మారకాలకు ప్రదక్షిణలు చేయించి సునామీ లాంటి ప్రకృతి వైపరీత్యాలనుంచీ మానవులను బయటపడేసారు.

ఇక్కడి సాధన ఏమిటంటే, ఎవరికి ఏ సమస్య వున్నా శ్రీరామహంస ఆశ్రమానికి వెళ్ళి ఐదు దీపాలు, ఐదు అగరువత్తులు వెలిగించుకొని ప్రఖర ప్రజ్ఞ, సజల శ్రద్ధల చుట్టూ ఐదు రోజులు కానీ, ఏడు రోజులు కానీ, పదకొండు రోజులు కానీ 108 ప్రదక్షిణలు చేస్తే వారి సమస్యలు తీరిపోతాయని మాస్టర్‌గారు చక్కటి నివారణోపాయాన్నిచ్చారు. 2007వ సంవత్సరంలో మూడు రోజుల పాటు 'శ్రీమద్భాగవత మరియు భగవద్గీత అఖండ పారాయణ' పూర్ణాహుతి కూడా ఎంతో అద్భుతంగా చేశారు.

గురుదేవులు రచించిన 17వ వాఙ్మయం, "ప్రాణశక్తి-అమూల్యవిభూతి" అనే పుస్తకం ఇక్కడ పాఠ్యపుస్తకం. అందులో ఇవ్వడిన సాధనలను ఇక్కడ చేయించాలి. మీలో కొంత మానసిక సంసిద్ధత వచ్చాక కానీ ఆ సాధనలు చెప్పటం కుదరదు. అలా ఒక్కొక్క ఆశ్రమంలో నిర్దిష్టమైన విషయ పరిజ్ఞానాన్ని సాధకులకంద చేయటానికి సిలబస్‌ను ఏర్పాటు చేశారు.

**మిషన్ ఆర్ కె డాట్ కామ్ వెబ్‌సైట్** – ఆన్‌లైన్ ఆశ్రమము

మాస్టర్‌గారు గురువుల కార్యక్రమాలను ముందుకు తీస్కెళ్ళేందుకు టెక్నాలజీని చాలా బాగా ఉపయోగించేవారు. ఏ పనినైనా ముందుగా తాను ఆచరించి తర్వాతే అందరినీ ఆ మార్గంలో పని చెయ్యటానికి ప్రోత్సహించేవారు. మొట్ట మొదట వారు స్వయంగా కంప్యూటర్‌లోని రక రకాల సాఫ్ట్‌వేర్‌లను నేర్చుకుని ఆ తరువాత తెలుగు, ఇంగ్లీష్ డిటిపి పన్లను నేర్చుకోవాలని అందరినీ ప్రోత్సాహించారు. కంప్యూటర్‌లో 1996 ప్రాంతంలోనే ఆయన వర్డ్, కోరల్ డ్రా, ఫొటోషాప్‌వంటి సాఫ్ట్‌వేర్‌లను ఇంట్లోనే కంప్యూటర్ పెట్టుకుని నేర్చుకున్నారు. ఇది ఆయన చుట్టుప్రక్కల ఉన్న యువతకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది, ఆయన వద్ద ఉన్న చాలామంది ఈ మార్గంలోకి అతి సునాయాసంగా ప్రవేశించారు. సప్తర్షి ఆశ్రమంలో ఒక డెస్క్‌టాప్‌ను అందరూ నేర్చుకునేందుకు వీలుగా ఏర్పాటు చేయించారు. 2001 జనవరి 1వ తేదీన మాస్టర్‌గారు www.missionrk.com ను ఆవిష్కరించారు, దీనిద్వారా వర్చ్యుయెల్ యజ్ఞవిధానాన్ని అందించటము అనేది వినూత్నమైన విషయము. అఖండ గురుసత్తాలోని గురువుల జీవిత చరిత్రలపై, వారు వ్రాసిన పుస్తకాలపై ఆన్‌లైన్ క్లాసులను నిర్వహించి సెర్టిఫికెట్‌లను ఇచ్చేవారు. ఈ వెబ్‌సైట్‌లో వారి సాహిత్యము, ఆడియోలు, వీడియోలు ఉంటాయి.

## అధ్యాయం-21
# గురుదీక్ష - సాధనలు

### అనుగ్రహ పీఠాల స్థాపన

ఆశ్రమాలను ఒక ప్రక్క స్థాపిస్తూనే, మరో ప్రక్క చిన్నచిన్న శక్తి పీఠాలను స్థాపించి, బ్రహ్మవర్చస్‌లో ఉండే 24 గాయత్రీశక్తి పీఠాల పేర్లను ఒక్కొక్కచోట ఒక్కొక్కపేరుతో ప్రతిష్ఠించి, వాటిని అనుగ్రహ పీఠాలనే పేరు పెట్టారు. వేదమాత గాయత్రీ అనుగ్రహపీఠం, బ్రాహ్మీ, వైష్ణవీ, శాంభవీ, మందాకినీ, అన్నపూర్ణ, సరస్వతీ ఇలా రాష్ట్రం నలుదిశలా అనుగ్రహపీఠాలను స్థాపించి ఏ ప్రాంతానికాప్రాంతంలో సాధనా శిక్షణలను కొనసాగించటానికి అనుగ్రహపీఠాల ప్రణాళికలను రచించారు. ఇవి మాత్రమే కాకుండా దత్తాత్రేయుని నామాలుగా గల సిద్ధిరాజుపీఠం, దత్తాత్రేయ అనుగ్రహపీఠం, శ్రీకృష్ణశ్యామ కమలనయన దత్తపీఠం ఇలా అనేకచోట్ల అనుగ్రహపీఠాలను సాధనా కేంద్రాలుగా స్థాపించారు. అవి ఈనాటికీ ఎంతో శక్తివంతమైన కేంద్రాలుగా సమిష్టి సాధన, సత్సంగాలకు కేంద్రాలుగా విరాజిల్లుచున్నాయి.

### సామూహికత

అన్ని ఆశ్రమాలను ఎందుకు పెట్టారో ముందు వ్యాసాలలో పాఠకులకు అవగతమై వుంటుంది. మనం యజ్ఞాలు చేస్తుంటాం. యజ్ఞాలలో అశ్వమేధం లాంటి మహాయజ్ఞాలు కూడా పూజ్య గురుదేవులు, మాతాజీల సూక్ష్మ సంరక్షణలో అవిశ్రాంతంగా జరుగుతున్నాయి. సాధారణంగా వ్యక్తిగతంగా చేసే వాటిని ద్రవ్యయజ్ఞమనీ, జ్ఞానయజ్ఞమనీ, స్వాధ్యాయయజ్ఞమనీ గీతలో చదువుకుంటాం. వ్యక్తిగత యజ్ఞాల వల్ల మనమేమీ సాధించలేం. మహాయజ్ఞాలలో అద్భుతమైన సామూహికత రావాలి. అది రానంతవరకు అది మహాయజ్ఞం కానేకాదు. సాధారణంగా నగరాలలో, పట్టణాలలో మున్సిపాలిటీ వుంటుంది. విద్యుత్ ఉంటుంది. పాఠశాలలు, కాలేజీలు వుంటాయి. రైతుబజార్లు అవీ వుంటాయి. అందరూ ఎవరి పనులు వారు ఒకేచోట వుంటూ చేసుకుంటుంటారు.

అలానే ఆశ్రమాలలో కూడా సామూహికత రావాలి. అదే మహాయజ్ఞం. అదే ఓ అశ్వమేధ మహాయజ్ఞం. ఆశ్రమాలలో కానీ, యజ్ఞాలు చేసేటప్పుడు కానీ సాధారణంగా పసుపు వస్త్రాలు

ధరించమని చెప్తారు. పసుపు బట్టలే ఎందుకు వేసుకోవాలి? అనే ప్రశ్న మీకు రావాలి. మీకు తెలిసినా, తెలియకపోయినా పసుపు అనే రంగు మీ సంచిత, ప్రారబ్ధ కర్మలను నాశనం చేస్తుంది. పసుపురంగులో ఉన్న గొప్పతనమది. ఆగామీ కర్మను అదేమీ చేయలేదు. అందుకే పసుపు బట్టలు వేసుకుని రమ్మనేది, తెలిసి వస్తే ఫలితమింకా బావుంటుంది. ఏ సంచిత కర్మపోయిందో మీకర్థ మౌతుంది. మందు వేసుకున్నారు. ఒకరికి జ్వరం తగ్గవచ్చు. మరొకరికి కాలునొప్పి తగ్గవచ్చు. అంతేగాక **పసుపు రంగు మీకు ఏ ప్రారబ్ధకర్మలున్నాయో వాటిని తీసేస్తుంది.**

**సామూహికతలో ఇంకో ఇంద్రజాలమున్నది. మీరు మంత్ర జపం చేసేటప్పుడు మీ మనస్సు సరిగ్గా లేకపోయినా సామూహికంగా చేస్తున్నవాళ్ళలో ఏ ఒక్కరి మనస్సు సరిగ్గా వున్నా అందరి మనస్సులు సరైపోతాయి.** క్లాసులో మాస్టర్ అడిగే ప్రశ్నకు ఏ ఒక్కడు సమాధానం చెప్పినా అందరూ రక్షించబడతారు. అందుచేత సామూహిక సాధనలో ఏ ఒక్కడి జపం సరిగ్గా క్లిక్ అయినా అందరికీ దాని లాభం వచ్చేస్తుంది. మేం ఇంటి దగ్గర చేసుకుంటాం అంటే మీలో సామూహికత రాలేదు. అది రానంతవరకు ఏ గురువూ ఏమీ చెయ్యలేడు. ఈ సామూహికత అనే విద్యను నేర్చుకోండి. ఎక్కడ నేర్చుకోవాలి? అంటే ప్రాణ విద్యలో నేర్చుకోవాలి. (యజ్ఞం ద్వారా ప్రాణవిద్యను నేర్చుకోవటం) సామూహికంగా ఆ ప్రాణవిద్యను నేర్చుకున్న తర్వాతే అశ్వమేథ యజ్ఞం జరుగుతుంది. ఆశ్రమాలలో సామూహిక మంత్ర జపాలు, సామూహిక ఆసన, ప్రాణాయామాలు, సామూహిక భోజన వ్యవస్థ ఇదంతా కాకుండా సామూహిక స్వయం సేవక కార్యక్రమాలు చేస్తారు. దీని వల్ల మనిషికి కాయాకల్ప చికిత్సతోపాటు మానసిక ఉన్నతి లభిస్తుంది. అందరికీ కచ్చితమైన సాధనా ఫలితాలు లభిస్తాయి.

## గురుదీక్ష

గురుదీక్ష అంటే ఏమిటి? అన్నదానికి మాస్టర్‌గారిచ్చిన అవగాహన వ్యాసాన్ని చదివి అర్థం చేసుకోండి. మన భారతీయసంస్కృతిలో గురుదీక్ష అనే పదం ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకున్నది. గురువు, గురుదీక్ష అనే ఈ రెండు పదాలు కేవలం భారతీయ సంస్కృతిలోనే తప్ప మరింకే దేశాలలో మనకు వినపడవు. గురుదీక్ష అంటే అర్థం ఏదో ఒక ముసుగు వేసి ఎవ్వరికీ వినబడకుండా భాజాభజంత్రీల మధ్య చెవిలో చెప్పే పదాల సమూహం కాదు. గురుదీక్ష అంటే గురువు చెప్పింది చెయ్యడం, గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్యగారు వ్రాసిన పుస్తకంలో "ఇదిచెయ్యి" అని వ్రాసి

వుంటే దానిని చెయ్యటం గురుదీక్ష అవుతుందే తప్ప మనము సామాన్యంగా చూసే ఉపనయనాలలో ఇచ్చేది గురుదీక్ష కాదు. వేలకు వేల రూపాయలు పోసి అట్టహాసంగా ఉపనయనం అనే సంస్కారం చేయడం జరుగుతున్నదే తప్ప ఆ మరునాటి నుండి కనీసం గాయత్రీ మంత్రాన్ని చేసేవారు చాలా అరుదుగా కనిపిస్తున్నారు.

యజ్ఞోపవీత దీక్షలో గాయత్రీ మంత్ర దీక్ష నిస్తారు. ఆ దీక్ష ఇచ్చిన రోజు నుండి–నేను ఈ రోజు నుండి గాయత్రీ దీక్ష తీసుకున్నాను. ప్రతిరోజూ నియమం తప్పకుండా జపం చేస్తాననే దీక్షను శిష్యుడు స్వీకరించాలి. ఉపనయన సంస్కారంలో దీక్ష అనేది గురువు కాదు. యజ్ఞోపవీతమనేది గాయత్రీ మాతకు ప్రతీకగా మన భుజంమీద నుండి హృదయాన్ని తాకుతూ నిరంతరం మన దీక్ష ఇది అని గుర్తు చేసే ఒక దివ్యశక్తి. ఆ యజ్ఞోపవీతానికి గౌరవం ఇవ్వాలి. భారతీయ సనాతన ధర్మంలో దీక్షా ప్రకరణకు గొప్ప ప్రాధాన్యత ఇవ్వబడింది. గురుదీక్ష అంటే నేను శ్రేష్ఠుణ్ణి అవుతాననే దీక్ష. పండిత శ్రీరామశర్మఆచార్యలాంటి అద్భుతమైన వ్యక్తి దగ్గర గురుదీక్ష తీసుకుని మీరా మంత్రాన్ని చెయ్యకపోతే, ఆ గురువుకు మనం ఏం మర్యాద ఇచ్చినట్లు. ఆ మంత్రానికి మనం ఏమి గౌరవమిచ్చినట్లు. మంత్రం చేయకపోతే ఆ దీక్షకు ఇక ఏ విలువా లేదు.

కబీర్ దాసుకు గురుదీక్ష తీసుకోవాలనే ఒక విపరీతమైన కోరిక వుండేది. రామనామ మంత్ర శక్తిని పొందిన రామానందస్వామి అంటే అందరికీ గురుతుల్యులు. ఆ రోజులలో హిందువేతరులకు గురుదీక్షనిచ్చే సాంప్రదాయము లేదు. కబీర్‌దాస్ పుట్టుక ఎవ్వరికీ తెలియదు కానీ ఆయన సాలెవాళ్ళ ఇంట్లో పెరిగారు. ఆయనకు గురుదీక్ష తీసుకోవాలనే తపన ఉండేది.

అందరికీ తెలిసిన సత్యమేమిటంటే ఆ రోజుల్లో తెల్లవారుఝామునే రామానందస్వామి గారు గంగా స్నానానికి వచ్చేవారు. ఆ సమయం కనిపెట్టి కబీర్ ఆయన గంగకు దిగే మెట్ల మీద పడుకున్నాడు. అంతా చీకటి కావటం వల్ల రామానందగారికి మెట్ల క్రింద పడుకున్న కబీర్ కనిపించలేదు. గబుక్కున ఆయన మీద కాలు పెట్టేశాడు. ఆ రోజుల్లో ఏం జరిగినా 'రాంరాం' అనటం ఆచారం. అలానే ఆయన కాలుకు కబీరు తగలగానే రామానందులవారు "రాంరాం" అన్నారు. దానినే దీక్షగా స్వీకరించి కబీర్‌దాస్ రామ భక్తుడయ్యాడు. గురుదీక్ష అంటే గురువుకు కాదు మర్యాద, దీక్షకు మర్యాద. దీక్షా విధానాలు మూడు రకాలుగా వుంటాయి.

**(1) ప్రాణదీక్ష:** ఇది సాధారణ దీక్ష. కేవలం గాయత్రీ దీక్ష తీసుకుంటాం. మంత్రార్థాన్ని చెప్పుకుంటాం. ఆనాటి దేశకాలపరిస్థితులకనువైన నియమాలను పాటిస్తూ సాధన చేస్తాము. సంస్కారాలను బట్టి నియమాలలో కూడా మార్పు వుంటుంది. కానీ తీసుకున్న విధంగా మంత్రజపం చేస్తే అది కొన్ని వేల సంస్కారాలనుండి మనల్ని దాటించేస్తుంది.

**(2) అగ్నిదీక్ష:** ఇదివరకు అగ్నిదీక్ష తీసుకున్న వారు అగ్ని వలె మారే దీక్ష ఇది. నిప్పులో సమిధను వేస్తే అదీ అగ్నిగానే మారిపోతుంది. ఈ సాధనను పూజ్యగురుదేవుల "తీన్ శరీర్ కా ధ్యాన్"లో 'సాధక్ సవితా ఏక్' అంటారు. ఆ సాధన చేస్తే మనం అగ్నిదీక్షను దాటినట్లే.

**(3) బ్రహ్మదీక్ష:** అగ్నిదీక్షలో వున్న మనం సాధనలు చేసీ చేసీ ఋషుల మాదిరి మారిపోతాం. మనం అలా మారిపోవాలనేదే ఈ గురుదీక్షలు తీసుకోవడంలోని రహస్యార్థం – గాయత్రీ మంత్ర దీక్ష మనలో ఉన్న దివ్యత్వాన్ని లేపుతుంది. నిజం చెప్పాలంటే శరీరంలో వుండే అణువణువూ దేవతాశక్తే. సాధన వలన ఆ శక్తులు జాగృతమౌతాయి.

నేటి వాతావరణంలో ఏది తీవ్రంగా వుందీ అంటే, ప్రచండమైన ఆసుర శక్తులు అని చెప్పాలి. అవి తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నాయి. మనుష్యుల మనస్సులతో అవి సంపర్కాన్ని సాధిస్తాయి. దాని ప్రకారంగానే వికృతమైన, విషపూరితమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని నాశనం చేయటానికి గాయత్రీ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించక తప్పదు. **గాయత్రీ యొక్క తీక్షణమైన చైతన్యం తప్ప వేరేదీ వీటిని నాశనం చేయలేదు. ఇవన్నీ నాశనమైతే తప్ప వాతావరణం నిర్మలంగా మారదు. అప్పుడే దైవీశక్తులు ప్రతిష్ఠించబడతాయి. దేవతల వరాలు సంతోషకరమైన పరిస్థితుల రూపంలో అవతరిస్తాయి.**

ఈ యుగంలో గాయత్రీని 'అసుర వినాశకశక్తిగా' ప్రయోగించడంలో గాయత్రీ పరివార్ మాత్రమే సమర్థవంతమైనది. నేడు ఇలాంటి సామర్థ్యం మరెవ్వరి దగ్గరా లేదు. పరిజనుల కుటుంబ సభ్యులందరూ గురుసత్తా సంరక్షణలో గాయత్రీ సాధన చేస్తూ ఆధ్యాత్మిక శక్తి సంతరించు కుంటున్నారు. దాన్ని ప్రయోగించాల్సిన సమయమిప్పుడు ఆసన్నమైంది. ఈసారి ఈ మహా యుద్ధం సూక్ష్మజగత్తులో జరుగుతుంది. ఇందులో జయిస్తే మానవజాతికి ఉజ్వల భవిష్యత్ వచ్చినట్లే. అసురసేన ఇప్పటికే అస్త్రశస్త్రాలతో సర్వసన్నద్ధంగా వుంది. అలాంటప్పుడు దైవసేన సిద్ధమవ్వాలి. ఈ మహాయుద్ధంలో మన సేనాపతి స్వయంగా పరమపూజ్య గురుదేవులు. వారు సూక్ష్మ

వాతావరణాన్ని బాగుచేయటానికి అసురశక్తులతో పోరాడుతూనే వున్నారు. వారి సహాయార్థం మనం ఈ క్షణమే యుద్ధానికి బయల్దేరాలి.

## గురుచరణాలే ఆచరణీయాలు

పరమపూజ్య గురుదేవులు ఎన్ని సంస్థలతో తమ అనుబంధాన్ని కొనసాగించారో, అదే సంస్థలతో మమేకమై మాస్టర్‌గారు కూడా తమ కార్యకలాపాలను ఎలా ముందుకు తీసుకువెళ్ళారో, తెలియాలంటే గురుదేవుల జీవితంలో గల కొన్ని సందర్భాలు మనకు చక్కటి మార్గదర్శనమును చేస్తాయి. పూజ్యగురుదేవులు థియోసాఫికల్ సొసైటీలో మంచి చురుకైన కార్యకర్త. అలానే వారు శ్రీఅరవిందుల సాహిత్యాన్ని, శ్రీరమణమహర్షిగారి జీవిత విధానాలని చాలా బాగా అధ్యయనం చేసినట్లు గురుదేవుల రచనలలో చూస్తాము.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు కాశీలో యం.యస్.సి. చదువుతున్నప్పుడే థియోసఫీలో మెంబరుగా చేరారు. తర్వాత మాస్టర్‌గారు గుంటూరుకు వచ్చాక మళ్ళీ థియోసఫీలో మెంబర్‌గా చేరారు. థియోసాఫికల్ సొసైటీ 'శ్రీకృష్ణలాడ్జి'లో మేడమ్ బ్లావెట్స్కీ వ్రాసిన "ది వాయిస్ ఆఫ్ సైలెన్స్, సీక్రెట్ డాక్ట్రిన్ మొదలగు పుస్తకాలపైన విశేష ప్రవచనాలను చెప్పటం జరిగింది. అంతే కాకుండా పరివార్ సభ్యులందరినీ ప్రోత్సహించి అందులో మెంబర్స్‌గా చేర్పించారు. దానికి ఒక విశేషమైన కారణాన్ని మాస్టర్‌గారు చెప్పారు.

గురుదేవుల అత్మకథలో 3వ అధ్యాయంలో

'1) "దివ్యజ్ఞాన సంస్థాపకురాలైన బ్లావెట్స్కీ ఒక సిద్ధయోగిని" అని నా గురుదేవులు చెప్పారు

(2) స్థూల శరీరంలో వుంటూ కూడా ఆమె సూక్ష్మశరీరధారులతో సంబంధమును కలిగి వుండేది.

(3) తన గ్రంథాలలో హిమాలయా అంతర్భాగాలలో అదృశ్య సిద్ధపురుషుల పార్లమెంటు ఉన్నదని,

(4) ఈ క్షేత్రవాసులను అదృశ్యసహాయకులని ఆమె పేర్కొంది –

దాదాగురుదేవులు ఆమె చెప్పిందంతా సత్యమేననీ, హిమాలయాల్లో నీ దివ్యచక్షువులతో వారిని దర్శించగలవని అన్నారు. టిబెట్టు ఆ కాలంలో హిమాలయాల పరిధిలోనే ఉండేది. ఇప్పుడా

పరిధి తగ్గినా బ్లావెట్స్కీ చెప్పినవన్నీ అక్షరసత్యాలే. స్థూల శరీరధారులు వారిని చూడలేకపోయినా, దాదా గురుదేవుల కృపతో వారిని చూడగలననే విశ్వాసం నాలో ఏర్పడినది' అని పరమపూజ్య గురుదేవులు వ్రాశారు.

అంతే కాకుండా యుగశక్తి గాయత్రిలో 'దివ్యజీవనదర్శనం' అనే ధారావాహికలో గురుదేవులు "తాము దివ్యజ్ఞాన సమాజ" సభ్యుడనని చెప్పుకుంటూ ఆనాటి సమావేశాలలో గురుదేవుల ప్రసంగంలో జరిగిన కొన్ని విశేష సంఘటనలను కూడా అందులో వివరించారు. అలా గురుదేవుల ఆదర్శమేదైతే వుందో దానిని మన మాస్టర్‌గారు తమ జీవితంలో కూడా అనుసరించారు. ఈ చరిత్ర అందరూ చదివి ఉండవచ్చు కానీ ప్రతి అక్షరాన్ని మాస్టారు వేదబుక్కులుగా భావించి జీవితంలో ఆచరించారు. అంత సూక్ష్మఅంశాలు ఆయనకై ఆయనే చెప్తే తప్ప మనం గమనించలేము. అలా వారు, గుంటూరు లోనే కాకుండా నెల్లూరు దివ్యజ్ఞాన సమాజంలో కూడా "థియోసఫీ" దాని లక్ష్యాల గురించి అనేకసార్లు ప్రసంగించారు. గుంటూరులో గల శ్రీకృష్ణ దివ్యజ్ఞాన సమాజంలో ప్రస్తుతం రెండవ లాడ్జిని కూడా ప్రారంభించారు. ఆయన ఏ సంస్థకెళ్ళినా ఆ సంస్థ సభ్యులతో మమేకమైపోయి వారి ఆదర్శాలను గౌరవిస్తూ, వాటితో పాటుగా గురుదేవుల ప్రణాళికలను వివరిస్తూ వుండేవారు.

అలాగే పూజ్యశ్రీ మాస్టర్‌గారు శ్రీ అరవిందో సొసైటీ వారితో కూడ అతి దగ్గర సంబంధ బాంధవ్యాలను కొనసాగించారు. శ్రీ అరవిందులను గురించి గురుదేవులు ఒక చక్కటి అవగాహనను మనకు అందించారు. 2011డిసెంబరు సంచికలో అనేక అంశాలను పొందుపరచారు. పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ గారు కూడా అరవిందుల సాహిత్యాన్నంతా అధ్యయనం చేసి 'అతిమానస చేతనత్వపు' సాధికారక అవధుల గురించి ఎన్నో ప్రవచనాల్లో భోధించారు. అరవిందుల 'సావిత్రి' గురించి గుంటూరు, బెంగుళూరు, హైదరాబాద్ ఇంకా అనేక ప్రాంతాలలో చక్కటి ప్రవచనాలనందించి గురుదేవులకు అనుంగు శిష్యులనిపించుకున్నారు.

ఇలా మాస్టర్‌గారు గురుదేవుల ప్రణాళికలో భాగంగా అనేకమంది ఋషుల ప్రణాళికలనే కాక పరమగురువుల ప్రణాళికలను కూడా వారు కోరుకున్న రీతిలో ముందుకు తీసుకువెళ్తూ ఇంకా "నా జీవితలక్ష్యం పరివ్రాజకులను" తయారు చెయ్యడం అని అనేకానేకమార్లు చెప్పడం జరిగింది. వారు చెప్పినట్లుగానే 2001 నుండి సప్తర్షి ఆశ్రమం, గుంటూరులో పరివ్రాజక శిక్షణా శిబిరాలను నిర్వహించటం, క్రమశిక్షణతో పనులను ఎలా చేయాలో బోధించి తిరుపతిలో జరిగే

అశ్వమేధ యజ్ఞానికి వరిష్ట కార్యకర్తలుగా వారి సేవలను అందించే అపూర్వమైన ప్రణాళికలను తయారు చేశారు.

## దివ్యపురుషుని లీలా గాథ

**ఇంటింటా వేదవిద్య:** పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యగారి నుండి దీక్ష తీసుకున్నది మొదలు ఆధ్యాత్మికత యొక్క చరమ లక్ష్యములనర్థం చేసుకొని వాటి యొక్క సమగ్రరూపమైన

**(1) పృథ్వీపై స్వర్గావతరణ.**

**(2) ఇంటింటా వేదవిద్య స్థాపన.**

**(3) ప్రతివారికి శాంతి, సుఖము, సమృద్ధి కావాలని విశేష కృషిని చేశారు.**

**వీటికొక రూపురేఖలనివ్వటానికి వారు పడే అంతర్మథనం అందరికీ అర్థమయ్యేది కాదు. ఈ లక్ష్యాలను సాధించటానికి ఆంధ్రప్రదేశ్ నలువైపులా ఆశ్రమాలను, అనుగ్రహపీఠాలను స్థాపించి వాటి ద్వారా ఈ విద్యను ఇంటింటికీ తీసుకువెళ్ళే ప్రయత్నం చేశారు. ప్రకృతిలోని 24 శక్తులను, చేతనత్వము యొక్క 16 కళలను, ఉపయోగించుకొని ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగుపెట్టిన ప్రతి వ్యక్తి ప్రకృతి నుండి వినిపించే ఆ దివ్య ప్రణవనాదాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించాలి. అలా పట్టుకోగలిగిన వారే 'గురువు'. సూక్ష్మతలాల నుండి ప్రవహించే గురుసత్తా తరంగాలను భౌతిక జగత్తులో అందరికీ స్పష్టంగా తెలియచెప్పేందుకు శరన్నవరాత్రులలో కాకివాయి శ్రీ హంస రామ ఆశ్రమంలో జరిగిన సాధనా శిబిరంలో దానికి బీజారోపణ చేశారు. అదే అనుగ్రహ వర్షమును అందరికీ పంచిపెట్టే ప్రయత్నంలో 24 గాయత్రీ అనుగ్రహపీఠాలను, 16 దత్తపీఠాలను స్థాపించాలని ప్రయత్నించారు.**

ఒక సాధకునికి ఋణానుబంధం కేవలం ఒక్క గురువుతో మాత్రమే ఏర్పడాలి. గురుదేవుల "ఆత్మకథ" ఆధారంగా మాస్టర్‌గారు వ్రాసిన కుండలినీ జాగరణలో "గురుసత్తాకి సంపూర్ణ సమర్పణ చేసుకున్న వ్యక్తికి నమస్కారములు" – అని వ్రాశారు. శంకర భగవత్పాదులు కూడా గురుపాదు కాస్తవం అనే 12 శ్లోకాలు గల స్తోత్రాన్ని రచించి గురువులకెలా సమర్పణ చేసుకోవాలో నేర్పించారు. ఇంత వ్రాసి కూడా వారు చివరగా గురుపదముల మీద ధ్యానం కుదరకపోతే "తతః కిం, తతఃకిం" అనే గుర్వష్టకాన్ని కూడా ప్రతిపాదించారు.

ఎన్నిసార్లు తిప్పి తిప్పి చెప్పినా మాస్టర్‌గారు తమ జీవితాన్ని సంపూర్ణంగా గురుదేవులకు ఎలా సమర్పణ చేసుకొన్నారో, అలానే తమ శిష్య వర్గాన్ని కూడా గురు అనుగ్రహానికి పాత్రులను చేయడానికి రకరకాల సరళమైన ప్రయోగాలను తాము చేస్తూ శిష్యుల చేత చేయించిన మరొక అద్భుతమైన ప్రక్రియే దత్త ప్రదక్షిణలు.

గురుచరిత్రలో గురువులకు సంపూర్ణ సమర్పణకి సర్వ సులభమైన సాధనగా ఒక చిన్నసాధనను ఇచ్చారు. ఏ సాధనను చెయ్యాలన్నా ముందుగా వారు దానిని అత్యంత నిష్ఠతో చేసేవారు. అలా వారు చేశాకనే ఇచ్చారీ సాధనను. మీకు ఇష్టమైన గురువు యొక్క ప్రతిమను ఒక కుర్చీలో పెట్టుకొని ఈ క్రింది శ్లోకాన్ని భక్తితో అంటూ ప్రదక్షిణలు చెయ్యాలి.

**నమస్తే యోగిరాజేంద్ర దత్తాత్రేయ దయానిధే ।**
**స్మృతిదేహి మాం రక్ష భక్తితే దేహిమే దృఢాం ॥**

## దత్త ప్రదక్షిణలు

పంచ కర్మేంద్రియాల, పంచ జ్ఞానేంద్రియాల వ్యాపారాలన్నీ ఏక కేంద్రకమైన దత్త చేతనత్వ తరంగాలకు పూర్తిగా లొంగిపోవడానికి చేసే కర్మకాండే ఈ దత్తప్రదక్షిణలు. మన మనో, వాక్కాయ, కర్మలను ఆ గురుసత్తాకి పూర్తిగా సమర్పణ చేసుకొని స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను దత్తత ఇవ్వడమనే పరమార్థసాధన ఈ ప్రదక్షిణలలో నిక్షిప్తమై ఉన్నది.

నమస్తే యోగిరాజేంద్ర దత్తాత్రేయ దయానిధే, స్మృతిదేహి మాం రక్ష భక్తితే దేహిమే దృఢాం॥

సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామియైన ఆ గురువుకు సమర్పణ చేసుకోవటం నా బాధ్యత అనుకుంటూ తన జ్ఞాన, కర్మేంద్రియాలను గురువుకు సమర్పణ చెయ్యాలి.

1. ఓం వరదాయనమః---తాడాసనం వేసి - నా మనస్సును గురువుకర్పించాను.
2. ఓం వరదాయనమః---పాదహస్తాసనం వేసి - నా వాక్కు గురువుకర్పించాను.
3. ఓం వరదాయనమః---సాష్టాంగ ఆసనం వేసి - నా ఆచరణను గురువుకర్పించాను.

ఇలా త్రికరణ శుద్ధిగా సమర్పణ చేసుకొని నీ మనస్సే, నా మనస్సు - నీ వాక్కే నావాక్కు- నీ ఆచరణే, నా ఆచరణ కాబట్టి నీ శ్వాసే, నాశ్వాస.

శ్వాస ద్వారా నీలోని సర్వజ్ఞత్వం నాలోకి వస్తోంది. అలా మళ్ళీ రెండవ శ్వాస తీసుకుంటూ – శ్వాస ద్వారా నీలోని సర్వవ్యాపకత్వం నాలోకి ప్రవేశిస్తున్నది. మళ్ళీ మూడవ శ్వాస తీసుకుంటూ నీలోని సర్వసమర్థత నాలోకి ప్రవేశిస్తోంది. అనే భావనతో ప్రదక్షిణలు చెయ్యాలి.

**1. ఓం యోగిరాజాయ నమః --పౌర్ణమి – చిత్ర.**

అద్వయానంద రూపాయ యోగ మాయాధరాయచ ।
యోగి రాజాయ దేవాయ శ్రీ దత్తాయ నమో నమః ॥

ఓం నమస్తే యోగి రాజేంద్ర దత్తాత్రేయ దయానిధే ।
స్మృతిదేహి మాం రక్ష భక్తితే దేహిమే ధృఢాం ॥

ఓం వరదాయనమః---అని మూడుసార్లు చెప్పి నా మనస్సు, నా వాక్కు, నా ఆచరణను త్రికరణ శద్ధిగా గురువుకు సమర్పిస్తున్నాను, గురువు శ్వాసే, నా శ్వాస అనుకోవాలి. మొదటి శ్వాస ద్వారా గురువు యొక్క సర్వజ్ఞత్వం నాలో ప్రవేశిస్తున్నది. రెండవ శ్వాసలో గురువు యొక్క సర్వవ్యాపకత్వం నాలో ప్రవేశిస్తున్నది. మూడవ శ్వాసలో గురువు యొక్క సర్వసమర్థత నాలో ప్రవేశిస్తున్నదనే భావనతో మూడుసార్లు గట్టిగా శ్వాస పీల్చివదలాలి.

**శ్రీసూక్తం:** ఓం హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణరజతస్రజామ్ ।
చన్ద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహ ॥

**2. ఓం అత్రివరదాయ నమః ----తిథి-పాడ్యమి, నిత్య – కామేశ్వరి.**

శ్లో॥ మాలా కమండలు ధరః కరపద్మయుగ్మే, మధ్యస్థపాణియుగళే డమరు త్రిశూలే ।
వ్యత్యస్థ ఊర్ధ్వకరయో శుభ, శంఖచక్రే వందే తమత్రి వరదం భుజ షట్కయుక్తం ॥

ఓం కార్తవీర్యాది రాజరాజ్యప్రదాయనమః

**శ్రీసూక్తం:** తాం మ ఆవహ జాతవేదో లక్ష్మీమనపగామినీమ్ ।
యస్యాం హిరణ్యం విన్దేయం గామశ్వం పురుషానహమ్ ॥

**3. ఓం దత్తప్రభవే నమః ----తిథి- విదియ, నిత్య- భగమాలిని.**

శ్లో॥ దత్తాత్రేయం శివంశాన్తం ఇంద్రనీలనిభంప్రభుం,
ఆత్మమాయారతం దేవం అవధూతం దిగంబరం।

భస్మోద్ధూళిత సర్వాంగం జటాజూటధరంవిభుం,
చతుర్బాహు ముదారాంగం దత్తాత్రేయం నమామ్యహమ్ ॥

ఓం అనఘాయనమః

**శ్రీసూక్తం:** అశ్వపూర్వాం రథమధ్యాం హస్తినాదప్రబోధినీమ్ ।
శ్రియం దేవీముపహ్వాయే శ్రీర్మా దేవీర్జుషతామ్ ॥

**4. ఓం కాలాగ్ని శమనాయనమః ----తిథి-తదియ, నిత్య-నిత్యక్లిన్నా.**

శ్లో॥ ఓం జ్ఞానానందైక దీప్తాయ కాలాగ్ని శమనాయచ ।
భక్తారిష్టవినాశాయ నమోస్తు పరమాత్మనే ॥

ఓం విశ్వశ్లాఘ్యాయ నమః

**శ్రీసూక్తం:** కాం సోస్మితాం హిరణ్యప్రాకారామార్ద్రాం జ్వలన్తీం తృప్తాం తర్పయన్తీమ్ ।
పద్మే స్థితాం పద్మవర్ణాం తామిహోపహ్వయే శ్రియమ్ ॥

**5. ఓం యోగిజన వల్లభాయ నమః ----తిథి-చవితి, నిత్య- భేరుండ.**

శ్లో॥ ఓం యోగవిజ్ఞాన నాథాయ భక్తానందకరాయచ।
దత్తాత్రేయాయ దేవాయ తేజో రూపాయతే నమః ॥

ఓం అమితాచారాయనమః

**శ్రీసూక్తం:** చన్ద్రాం ప్రభాసాం యశసా జ్వలన్తీం శ్రియం లోకే దేవజుష్టాముదారామ్ ।
తాం పద్మినీమీం శరణమహం ప్రపద్యేఽ లక్ష్మీర్మే నశ్యతాం త్వాం వృణే ॥

**6. ఓం లీలావిశ్వంభరాయనమః ----తిథి- పంచమి, నిత్య - వహ్నివాసిని.**

శ్లో॥ ఓం పూర్ణబ్రహ్మ స్వరూపాయ లీలావిశ్వంభరాయచ ।
దత్తాత్రేయాయ దేవాయ నమోస్తు సర్వ సాక్షిణే ॥

ఓం దత్తాత్రేయాయ నమః

**శ్రీసూక్తం:** ఆదిత్యవర్ణే తపసోఽ ధిజాతో వనస్పతిస్తవ వృక్షోఽ థ బిల్వః ।
తస్య ఫలాని తపసానుదన్తు మాయాన్తరాయాశ్చ బాహ్యా అలక్ష్మీః ॥

**7. ఓం సిద్ధిరాజాయ నమః ----తిథి- షష్టి, నిత్య - మహావజ్రేశ్వరి.**

ఓం సర్వసిద్ధాంత సిద్ధాయ దేవాయ పరమాత్మనే ।
సిద్ధిరాజాయ సిద్ధాయ మంత్ర ధాత్రీ నమో నమ ః ॥

ఓం మునీశ్వరాయ నమ ః

**శ్రీసూక్తం:** ఉపైతు మాం దేవసఖః కీర్తిశ్చ మణినా సహ ।
ప్రాదుర్భూతోఽస్మి రాష్ట్రేఽస్మిన్ కీర్తిమృద్ధిం దదాతు మే ॥

**8. ఓం శ్రీజ్ఞానసాగరాయ నమ ః ----తిథి-సప్తమి, నిత్య - శివదూతి.**

శ్లో॥ ఓం సర్వత్రా జ్ఞాన నాశాయ జ్ఞానదీపాయ చాత్మనే ।
సచ్చిదానంద బోధాయ శ్రీ దత్తాయ నమో నమ ః ॥

ఓం పరాశక్తి పదాశ్లిష్టాయ నమ ః

**శ్రీసూక్తం:** క్షుత్పిపాసామలాం జ్యేష్ఠామలక్ష్మీం నాశయామ్యహమ్ ।
అభూతిమసమృద్ధిం చ సర్వాం నిర్ణుద మే గృహాత్ ॥

**9. ఓం విశ్వంభరావధూతాయ నమ ః ----తిథి-అష్టమి, నిత్య - త్వరిత.**

శ్లో॥ ఓం విశ్వంభరాయ దేవాయ భక్త ప్రియ కరాయచ ।
భక్త ప్రియాయ దేవాయ నామ ప్రియాయ తే నమ ః ॥

ఓం యోగానందాయ నమ ః

**శ్రీసూక్తం:** గన్ధద్వారాం దురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీమ్ ।
ఈశ్వరీగ్ం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియమ్ ॥

**10. ఓం అవధూతాయ నమ ః----తిథి- నవమి, నిత్య - కుల సుందరి.**

శ్లో॥ ఓం మాయా ముక్తాయ శుద్ధాయ, మాయా గుణ హరాయతే ।
శుద్ధ బుద్ధాత్మ రూపాయ నమోస్తు పరమాత్మనే ॥

ఓం సదోన్మదాయ నమ ః

**శ్రీసూక్తం:** మనసః కామమాకూతిం వాచః సత్యమశీమహి ।
పశూనాగ్ం రూపమన్నస్య మయి శ్రీః శ్రయతాం యశః ॥

**11. ఓం మాయాయుక్తావ ధూతాయ నమ : ----తిథి- దశమి, నిత్య - నిత్య.**

శ్లో॥ ఓం స్వమాయా గుణగుప్తాయ, ముక్తాయ పరమాత్మనే ।
సర్వత్రాజ్ఞాన నాశాయ దేవ, దేవాయ తే నమ : ॥

ఓం సమస్త వైరి తేజో హృతే నమః

**శ్రీసూక్తం:** కర్దమేన ప్రజాభూతా మయి సంభవ కర్దమ ।
శ్రియం వాసయ మే కులే మాతరం పద్మమాలినీమ్ ॥

**12. ఓం ఆదిగురవే నమః ----తిథి- ఏకాదశి, నిత్య - నీలపతాక.**

శ్లో॥ ఓం చిదాత్మజ్ఞాన రూపాయ గురవే బ్రహ్మరూపిణే ।
దత్తాత్రేయాయ దేవాయ నమోస్తు పరమాత్మనే ॥

ఓం పరమామృత సాగరాయ నమః

**శ్రీసూక్తం:** ఆపః సృజన్తు స్నిగ్ధాని చిక్లీత వస మే గృహే ।
ని చ దేవీం మాతరం శ్రియం వాసయ మే కులే ॥

**13. ఓం శ్రీ శివరూపాయ నమః ----తిథి- ద్వాదశి, నిత్య - విజయ.**

శ్లో॥ ఓం సంసార దుఃఖ నాశాయ హితాయ పరమాత్మనే ।
దత్తాత్రేయాయ దేవాయ నమోస్తు పరమాత్మనే ॥

ఓం అనసూయాగర్భ రత్నాయ నమః

**శ్రీసూక్తం:** ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం పిఙ్గళాం పద్మమాలినీం ।
చన్ద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహ ॥

**14. ఓం శ్రీదేవదేవాయ నమః ----తిథి- త్రయోదశి, నిత్య - సర్వమంగళ.**

శ్లో॥ ఓం సర్వాపరాధ నాశాయ సర్వపాప హరాయచ ।
దేవ దేవాయ దేవాయ నమోస్తు పరమాత్మనే ॥

ఓం భోగమోక్ష సుఖ ప్రదాయనమః

**శ్రీసూక్తం:** ఆర్ద్రాం యః కరిణీం యష్టిం సువర్ణాం హేమమాలినీమ్ ।
సూర్యాం హిరణ్మయీాం లక్ష్మీం జాతవేదో మ ఆవహ ॥

**15. ఓం శ్రీదిగంబరాయ నమః ----తిథి- చతుర్దశి, నిత్య - జ్వాలామాలిని.**

శ్లో॥ ఓం దుఃఖ దుర్గతి నాశాయ దత్తాయ పరమాత్మనే ।
దిగంబరాయ శాన్తాయ నమోస్తు బుద్ధి సాక్షిణే ॥

ఓం శ్రీపాద శ్రీవల్లభాయనమః

**శ్రీసూక్తం:** తాం మ ఆవహ జాతవేదో లక్ష్మీమనపగామినీమ్ ।
యస్యాం హిరణ్యం ప్రభూతం గావో దాస్యోఽ శ్వాన్ విన్దేయం పురుషానహమ్ ॥

**16. ఓం శ్రీకృష్ణ శ్యామకమలనయనాయ నమః ----తిథి- పూర్ణిమ, నిత్య - చిత్ర.**

శ్లో॥ ఓం అఖండాద్వైత రూపాయ నిర్గుణాయ గుణాత్మనే ।
కృష్ణాయ పద్మనేత్రాయ నమోస్తు పరమాత్మనే ॥

ఓం శ్రీనృసింహ సరస్వతీస్వామి సద్గురు పాదుకాభ్యో నమః।

**శ్రీసూక్తం:** యః శుచిః ప్రయతో భూత్వా జుహుయాదాజ్య మన్వహమ్ ।

శ్రియం పఞ్చదశర్చం చ శ్రీకామః సతతం జపేత్ ॥

**17. ఓం శ్రీశ్రీరామశర్మఆచార్య గురుదేవాయ నమః----తిథి- పూర్ణిమ, నిత్య - చిత్ర.**

శ్లో॥ ఓం సచ్చిదానంద రూపాయ కృష్ణాయ క్లేశహారిణే ।
నమో వేదాన్త వేద్యాయ గురవే బుద్ధిసాక్షిణే ॥

ఓం శ్రీశ్రీరామశర్మఆచార్య సద్గురు పాదుకాభ్యోనమః

**శ్రీసూక్తం:** ఆనన్దః కర్దమశ్చైవ చిక్లీత ఇతి విశ్రుతాః ।
ఋషయస్తే త్రయః పుత్రా స్వయం శ్రీదేవి దేవతా ॥

18. ఓం సకలసమర్ధసద్గురుదేవతాభ్యో నమః ----తిథి-పూర్ణిమ, నిత్య - చిత్ర.

శ్లో॥ ఓం యస్యప్రసాదా దహమే విష్ణుః మయ్యేవ సర్వం పరికల్పితంచ ।
ఇద్థం విజానామి సదాత్మ తత్త్వం తస్యాంగ్రి పద్మం ప్రణతోస్మి నిత్యం ॥

ఓం సకల సమర్ధసద్గురు పాదుకాభ్యో నమః।

**శ్రీసూక్తం:** పద్మాసనే పద్మ ఊరూ పద్మాక్షీ పద్మసమ్భవే ।
త్వం మాం భజస్వ పద్మాక్షీ యేన సౌఖ్యం లభామ్యహమ్ ॥

పూజ్యులు మన మాస్టర్‌గారు అందించిన మరొక అద్భుత సాధన.

## "ఓం ద్రాం" సాధన

ఈ సాధన మణిపూరక చక్రం మీద చెయ్యాలి. వెన్నెముక నిటారుగా వుంచుకొని మూడుసార్లు ప్రాణాయామంచేసి చుబుకాన్ని కంఠకూపంలో ఉంచి దృష్టిని బొడ్డు దగ్గర ఉంచి అప్పుడు సాధన ఇలా చెయ్యాలి.

ఓం ద్రాం - 1, ఓం ద్రాం -2, ఓంద్రాం -3, ....ఇలా ద్రాంతో పాటు 100 వరకు మంత్రాన్ని చేసి, మళ్ళీ మెడను వెనక్కి పెట్టి ఓంద్రాం-1, ఓంద్రాం-2, ఓంద్రాం-3.....ఇలా25 సార్లు మంత్రాన్ని ఉచ్చరించాలి. ఇలా చేస్తే ఒక రౌండు మొత్తం 125 మంత్రాలు పూర్తి అవుతాయి. ఇలా ముందువైపు 100మంత్రాలు, వెనక్కి 25 మంత్రాల చొప్పున - 6సార్లు ఈ సాధన చెయ్యాలి. 'ద్రాం' మంత్రంలో ద- పరబ్రహ్మతత్వం అయితే 'రాం' పరమాత్మతత్వం. ఇది దత్తాత్రేయుల వారి యోగ మార్గాన్ని సూచిస్తుంది. ఈ ద్రాం అనే దత్తబీజానికి 'ఆం' శక్తి, 'క్రోం' కీలకం అనేది శాస్త్రం. ఈ బీజమంత్రం సమస్త విశ్వమంతటికీ మహాప్రాణం. అపారమైన ప్రాణశక్తినిస్తుంది. ఈ విశ్వశక్తి సమస్తం ఆ బీజంలో నిక్షిప్తమై ఉన్నది.

అన్ని ఆశ్రమాల్లో అనుగ్రహపీఠాల్లో ఈ సాధన జరుగుతూనే వుంది.

## గురుసత్తా : కుండలినీ జాగరణ

పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య జీవిత చరిత్రను 108 నామాలుగా వ్రాసి షట్చక్రాల మీద వాటినెలా స్థాపించుకోవాలో నేర్పిస్తూ కుండలినీ జాగరణకు ఇది బేసిక్ ప్రిన్సిపుల్ అని ప్రకటించారు. ఈ సాధనను ప్రతి రోజూ కనీసం ఒక్కసారి చెయ్యాలి. ప్రతి పూర్ణిమకు ఈ

నామావళిని చక్రాలమీద త్రిప్పుకుంటూ చేయడం వల్ల దీని ఫలితం 16 రెట్లు ఎక్కువగా సాధకునికి లభిస్తుంది. సాధారణంగా ఈ సాధన సామూహిక సాధన. చక్రాలు, వాటి దళాలను గురించి స్పష్టమైన అవగాహనను ముందుగా సాధకులకు బోధించాలి. అనంతరం ఒక వ్యక్తి ఈ నామావళిని చెప్తుంటే సాధకులు కనులు మూసుకుని ఏకాగ్రతతో నామాలను వింటూ తనను తాను గురువుకు శరణాగతి చేసుకోవాలి. మాస్టర్‌గారు ఎంతో గొప్ప కుండలినీ సాధనకు 'అతి సరళమైన, దగ్గరి మార్గాన్నిచ్చి శిష్యులకు గురుదేవుల పరిపూర్ణ అనుగ్రహాన్ని ప్రసాదించారు.

## సమర్థ సద్గురు స్పర్శ ధ్యానం

**"నడిచి వస్తున్న విజ్ఞాన సర్వస్వం" మన మాస్టర్‌గారు. ప్రకృతిలో ఎవ్వరూ ఊహించలేని, చెప్పని, చెప్పలేని, శక్తివంతమైన, దివ్య అస్త్రశస్త్రముల వంటి సాధనలను వారు మనకందించారు. అది కూడా 2000 సంవత్సరం లోపలే. కొన్ని అననుకూల పరిస్థితులలో పరమ గురువుల చేత కీలితం చేయబడిన ప్రఛండమైన శస్త్ర, అస్త్ర, సాధనలన్నింటిని తిరిగి ఈ యుగసంధికాలంలో, వాటినన్నింటిని బయటకు తీసుకురాకపోతే ఇంక అవి మానవజాతికి అందించటానికి మళ్ళీ 24 కోట్ల సంవత్సరములు వేచివుండాలి. అప్పుడు అవి నేర్పటానికి అర్హుడైన నిష్ణాతుడైన తగిన వ్యక్తి రావాలి. వచ్చినా వాటిని నేర్చుకొని సాధన చేసి అందరికీ అందించగల సమర్థులైన శిష్యులు రావాలి. ఇదంతా సంభవమయ్యేనా?**

దానికేనేమో ప్రేమ స్వరూపులైన, మన శ్రీశ్రీరామకృష్ణ మాస్టర్‌గారు 1999 సంవత్సరంలోనే "సమర్థ సద్గురు స్పర్శ" ధ్యాన ప్రక్రియను సప్తర్షి ఆశ్రమంలో ప్రసాదించారు. ఈ ధ్యానం ఎందుకు చెయ్యాలి, దీనిలోని గల విశిష్టత ఏమిటి? తెలుసుకోవాలి కదా మరి! మానవజాతికి ఉజ్జ్వల భవితవ్యత అనేది 2000 సంవత్సరం నాటికి వస్తుంది. పృధ్విపై స్వర్గావతరణ, వేదసంస్కృతి పునర్జాగరణ, అందిరికీ శాంతి, సుఖము, సమృద్ధి. ఇదీ రాబోయేటువంటి యుగం. ఇదీ మానవజాతి యొక్క భవితవ్యత. ఈ భవితవ్యత కోసం చేయవలసిన అతి చిన్న సాధనయే "సమర్థ సద్గురు స్పర్శధ్యానం".

సమర్థ సద్గురు స్పర్శ ధ్యానంలో ఖచ్చితంగా ఓంకారం – 21 సార్లు చేయాలి. ఈ 21 ఓంకారాలు మన షట్చక్రాలలో ఉన్నటువంటి మాలిన్యాలను కడిగివేస్తాయి. అవి పోతే తప్ప మనలో భగవంతుని శక్తి ప్రవహించదు. కాబట్టి 21 సార్లు "ఓం"కారము చేయవలసిందే.

ఈ ధ్యానము కొనసాగిస్తుంటే మీకు జ్ఞానం వస్తుంది. ఖచ్చితమైన సమయాల్లో ఉదయం 6.00 గంటలకు, సాయంత్రం 6.00 గంటలకు చేసే ఈ 'ఓం'కారసాధన జ్ఞాన అవతరణకు కీలకమౌతుంది. ధ్యానావస్థలో ఆ జ్ఞాన అవతరణ జరుగుతున్న అనుభూతిని మనం పొందగలగాలి. ఆ సమయంలో ఏ జపమూ చేయవద్దు. ఈ ధ్యానం యొక్క పేరు 'సమర్థసద్గురు స్పర్శ'. ఆయన ఇవ్వాలి ఆ స్పర్శను. మీరు జపం చేస్తూ కూర్చుంటే ఆయన వచ్చి ముట్టుకున్నా మీకు తెలియదు. మీరు పూర్తిగా ఏ విధమైన కర్మేంద్రియాల, జ్ఞానేంద్రియాల స్పందన లేకుండా ఉండిపోవాలి. ఈ ప్రయత్నం 20నిమిషాల పాటు చేస్తే చాలు. ఆ సమయంలో అలా ఉండిపోతే జ్ఞాన గంగ మీలోకి దిగిపోతుంది. జ్ఞానమెప్పుడూ బయటనుండి రాదు. జ్ఞానమంతా లోపలి నుండే వస్తుంది. ఇప్పుడు ఈ సైన్సు అంతా ఎక్కడ నుండి వస్తోంది? పుస్తకాల్లో ఉందా? ఒక్కొక్క సైంటిస్ట్ ఒక్కోరకంగా తనలోనే ఆ విజ్ఞానాన్ని గుర్తించాడు. బయట ఏం జ్ఞానం లేదు. అంతా మౌనంలోనే ఉంది. కాబట్టి 20 నిమిషాల పాటు ఆ మౌనంలో ఉండటం చాలా అవసరం. "పృథ్వి మీద స్వర్గావతరణ" అనే పదమునర్థం చేసుకోవాలి. మీరు అమరులుగా మారాలనేదే పరమ గురువులందరి కోరిక!

"చచ్చిపోయిన నేను 3 సార్లు 'ఓం'కారము చేయటం వల్ల బ్రతికి బయట పడ్డాను. ఇది నా స్వానుభవం" అని బ్లావెట్స్కీ మాత చెప్పారు. ఎందువల్లనంటే నేను మూడుసార్లు చనిపోయినప్పుడు ఆ పరమ గురువులు నన్ను బ్రతికించారు. మిమ్మల్నికూడా బ్రతికించగలరు." అంటుందాతల్లి.

మీ శరీరాన్ని 'ఓం'కారానికి అనుగుణంగా మారడం తప్ప మరోదారిలేదు. పృథ్విపై స్వర్గావతరణ అంటే మనందరం చిరంజీవులమై మృత్యువు వాత పడకుండా అమరులమై జీవించాలి. దీనికి సామూహిక సాధనే ఎక్కువ లాభదాయకంగా ఉంటుంది. ఇదే పృథ్విపై స్వర్గావతరణకు మూలసూత్రం. వీటన్నింటితో పాటు రోజుకు 12 సూర్యనమస్కారాలను చేయించేవారు.

## ఋషుల కార్యక్రమాల కేంద్ర బిందువులు

**పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఈనాటి దేశకాల పరిస్థితుల ప్రభావం మానవజాతి జీవితంలో ఎలాంటి మార్పులను తెస్తోందో అనేకమార్లు చెప్తూనే ఉండేవారు. ఆధ్యాత్మిక ముసుగులో ఈనాడు ప్రచారంలో వున్న ప్రచ్ఛన్న భౌతికతకు స్వస్తి చెప్పి నవ్యయుగాన్ని తెచ్చే సమయం ఆసన్నమైంది. ఆధ్యాత్మికత పేరుతో ప్రచారంలో వున్న వాటిలో ఆధ్యాత్మికతకు బదులు ఈనాడు భౌతిక లాలసల తృప్తి మాత్రమే కనిపిస్తోంది. నిజమైన ఆధ్యాత్మికత అంతరించకముందే "భారతీయత" తన అసలైన**

**వారసత్వాన్ని కోల్పోయే ప్రమాదమున్నది కనుక అలా కాకుండా ఉండాలంటే మన ప్రాచీన ఋషులు, పరమ గురువులు అందిస్తున్నటువంటి ఆధ్యాత్మిక విజ్ఞానము యొక్క నియమావళిని, దాన్ని ఉపయోగించుకునే విధానాన్ని కూలంకషంగా అర్థం చేసుకొని, ఈనాటి వైజ్ఞానికుని వలె సామూహిక ప్రయోగాలు జరిపి, ఆ ప్రయోగ ఫలితాలను సమస్త మానవజాతికి అందించాలనే ఆవేదన వున్న వారందరూ నాతో కలిసి నడవండి.**

'ఆధ్యాత్మిక విజ్ఞాన ప్రయోగశాల ఏమిటి అంటే మానవ శరీరమే. ఈ మానవ శరీరమనే ప్రయోగశాలలో వున్న 24 తత్వాలు, 16 కళలు పరిపూర్ణమైన వర్కింగ్ కండిషన్‌తో ఉండకపోతే, చేసిన ప్రయోగాలు కానీ, వచ్చే ఫలితాలు కానీ ప్రామాణికతను పొందలేవు. మంత్రద్రష్టలైన ఋషులు అందించిన వేదవిద్యను తిరిగి మనం అర్థం చేసుకోవాలంటే మన శరీరాలు కూడా ఋషుల శరీరాల వలె సంతులనం చెందివుండాలి. అలా వుండడం కోసమే పూజ్యగురుదేవులు, షోడశ సంస్కారములనందించారు. అయితే నేడు వ్యక్తి సంస్కరింపబడుటలేదు. కానీ ఋషులు, యజ్ఞముల ద్వారా సంస్కరింపబడి, పిండాండ, బ్రహ్మాండ సమన్వయమును సాధించేందుకై దివ్య చక్షువులను పొంది విరాట్ దర్శనాన్ని పొందారు. ఆ స్థాయిని సాధించడానికి, శరీరాలను మంత్ర దర్శనమునకు అనుకూలంగా సంతులనం చేయటానికి ఆశ్రమాలను అనుగ్రహపీఠాలను నేను స్థాపించాను' అని చెప్పారు.

మానవశరీరం ప్రకృతి ద్వారా అందివ్వబడిన 'అనుగ్రహం'. ఈ అనుగ్రహాన్ని ఉపయోగించుకొనుటకు సాధకుడు నిర్ణీతకాలంలో సాధన చెయ్యాలి. గురు అనుగ్రహం పొందడానికి ప్రతిరోజూ 18 దత్తప్రదక్షిణలను, యోగవిద్య నందించే సూర్యకిరణములనుపయోగించుకునేందుకు గాయత్రీ మంత్రమును, కోరిన కోరికలను తీర్చుకోవడానికి యజ్ఞవిద్యను నేను మీకందిస్తున్నాను" అని 1996లో నవంబర్‌లో అనుగ్రహపీఠాన్ని స్థాపిస్తూ ఇచ్చిన ప్రవచనంలో "ప్రకృతిలో ఉన్న అనంత విజ్ఞానాన్ని తన సొంతం చేసుకునేందుకు, పై కార్యక్రమాలనన్నింటినీ సామూహికంగా ఒకే చోట చేసుకునేందుకు వీలుగా ఒక్కొక్క క్షేత్రంలో ఒక్కొక్క రకమైన ఆశ్రమాలను, అనుగ్రహపీఠాలను ఏర్పాటు చేస్తున్నాను" అని స్పష్టంగా చెప్పారు. అనుగ్రహ పీఠస్థాపనానంతరం మాస్టర్‌గారు తమ ప్రసంగంలో ఈ విషయాలన్నీ చెప్పి – 'దీని తాళం చెవి నా దగ్గరుంది. దీన్ని మీరు సరిగ్గా నడపడం లేదని అనిపిస్తే, వెంటనే దీని శక్తిని తీసేస్తాను. మీరు మాట్లాడే ప్రతి మాట నాకు వినిపిస్తుంది, ప్రతి సంఘటన నాకు తెలుస్తుంది.' అని పదే పదే **హెచ్చరించటం జరిగింది.** అలా ఒక

స్పష్టమైన అవగాహనతోనే మాస్టర్‌గారు శ్రీహంసరామ ఆశ్రమాన్ని, సప్తర్షి ఆశ్రమాన్ని, అగస్త్యాశ్రమాన్ని, సహ్యాద్రి ఆశ్రమాన్ని, దత్త క్షేత్రాన్ని, తరువాతి కాలంలో మౌంట్ శంబళని ఇంకా అనేక అనుగ్రహ పీఠాలను ఏర్పాటు చేశారు.

## సకల సమర్థ సద్గురు వాణి విశ్వవిద్యాలయం

'పానీయంబులు త్రావుచున్, గుడుచుచున్, భాషించుచున్" - అనే పద్యం మాస్టర్‌గారి విషయంలో పరమసత్యం. అలనాడు ప్రహ్లాదునికి కూర్చున్నా, నిల్చున్నా, త్రాగుతున్నా, తింటున్నా, మాట్లాడుతున్నా నిరంతరం ఆయన దృష్టి శ్రీమన్నారాయణ పాదపద్మముల యందే ధృఢంగా నిలిచివుండేదట. అలానే మన మాస్టర్‌గారు కూడా ఏ పని చేస్తున్నా - 24 కోట్ల సంవత్సరాల తరువాత వచ్చిన ఒక అమూల్యమైన అవకాశమే ఈ యుగసంధికాలం, ఈ సమయం మనకు ప్రకృతి ప్రసాదించిన అపురూపమైన కాలం - అపురూపమైన వరం, దీనిని సద్వినియోగం చెయ్యాలి, ఎలా? అని తపనచెందుతుండేవారు. పరమ ప్రేమ స్వరూపులైన వారికి స్వార్థమనేదేమిటో తెలియదు. నిరంతరం వారి సాధన పరమార్థ ప్రయోజనాలకోసమే. అలాంటిదే ఈ పరమ గురువుల ప్రణాళికలో భాగమైన వేదవిద్యను ఇంటింటా స్థాపించటం.

**వైదిక పద్ధతిలో వైదిక సంస్కృతి యొక్క పునర్జాగరణ జరగాలి. దీనికి ఆధారమైన ఋషుల ప్రణాళికలను మానవజాతికి పరిచయం చెయ్యాలి. పూర్వకాలంలోని ఋషులు వశిష్ఠ, కశ్యప, అత్రి, విశ్వామిత్ర, గౌతమ, జమదగ్ని, భరద్వాజుల యొక్క జాగరణ జరగాలి. ఈ సప్త ఋషులు ఎక్కడ వున్నారు? ఏం చేస్తున్నారు? వీరు ఎక్కడో లేరు. వీరు మన ముఖంలోనే రెండు చెవులు, రెండు కళ్ళు, రెండు నాశికారంధ్రాలు, ఒక నోరు కలిపి ఏడు కన్నాల రూపంలో మన శరీరంలోనే వున్నారు. ఈ ఏడు కన్నాలను సప్త ఋషులుగా గుర్తించాలి. అందుచేత వైదిక సంస్కృతి యొక్క పునర్జాగరణ అంటే ఈ ఋషులను మేల్కొలపడమే అంటే ఈ అంగాలను సవ్యమైన రీతిలో ఉపయోగించుకోవడమే. అనగా ఈ జ్ఞానేంద్రియాల ద్వారా జ్ఞాన సముపార్జన చేస్తూ ఇవే జ్ఞానేంద్రియాల ద్వారా ఇతరులకు ఆ జ్ఞానాన్ని పంచిపెడుతూ మానవజాతిని జాగృతపరచాలి.**

పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఋషుల కోరిక మేరకు అలాంటి జ్ఞానాన్ని విశ్వానికందించటానికే "సకల సమర్థ సద్గురు వాణీ విశ్వవిద్యాలయం"ను ఏర్పాటు చేశారు. 20.05.1996 నుండి 28.05.1996 వరకు ఓడరేవులో జరిగిన సాధనా శిబిరంలో ఈ విశ్వవిద్యాలయం పేరును

ప్రకటించారు. **వైజ్ఞానిక ఆధ్యాత్మికతను నేర్చుకొనుటకు వీలుగా గురుసత్తా ప్రేరణతో మాస్టర్‌గారు దీనిని స్థాపించారు. దిగజారిపోయిన భారతదేశపు ఆధ్యాత్మిక వైభవాన్ని పునరుద్ధరించి భారతదేశమును తిరిగి "జగద్గురు పీఠాన్ని" అధిరోహింపచేసే ప్రయత్నంగా ఇది పరమ గురువులు ఏర్పరచిన సంస్థ.**

ఋషిప్రోక్తమైన ఈ వేదవిద్యను పంచకోశాలను జాగృతపరచే రీతిలో ఒక సిలబస్‌గా రూపొందించారు.

1. అన్నమయకోశ జాగరణకు – ఆసనాలు, సూర్య నమస్కారాలు

2. ప్రాణమయకోశజాగరణకు – పూజ్య గురుదేవులచే ఇవ్వబడిన 7 రకాల ప్రాణాయామాలు.

3. మనోమయ కోశ జాగరణకు – మంత్ర జపాలు – అవి గాయత్రీ జపం, అనుగ్రహమాలా మంత్రం, శరణాగతి మంత్రం, ఇవేకాక ఆదిత్యహృదయ పారాయణ, రామరక్షాస్తోత్రం, భగవద్గీత మొదలైన ఎన్నో పాఠ్యపుస్తకాలు.

4. విజ్ఞానమయకోశ జాగరణకు – పన్నెండుమంది పరమ గురువుల జీవితచరిత్రలు, గీతలోని 18 అధ్యాయములు.

5. ఆనందమయకోశ జాగరణకు – అతి ప్రధానమైనది సమర్పణ యోగం. మాస్టర్‌గారు, దీని కోసం గురుపాదుకాస్తవం, పూజ్యగురుదేవుల కుండలినీ జాగరణ, సమర్థ సద్గురుస్పర్శధ్యానం చేయించేవారు.

ఇవేకాక వేదావతరణకు నెక్ ఎక్సర్‌సైజులు, దిక్ నమస్కారములు, స్థలప్రదక్షిణలు చేయించే వారు. ఈ సిలబస్‌తో సర్టిఫికేట్ కోర్సులు, బి.యస్.సి, యం.యస్.సి. కోర్సులను రూపొందించి, సప్తర్షి ఆశ్రమంలో తరగతులు నిర్వహించేవారు. అక్కడ నేర్చుకున్నవారు వాళ్ళవాళ్ళ గ్రామాల్లోని అనుగ్రహపీఠాల్లో, ఆశ్రమాల్లో తరగతులు నిర్వహించేవారు.

## కార్యక్రమాలు - అవగాహన

మాస్టర్‌గారి జ్ఞాన, విజ్ఞానాలను గురించి చెప్పాలన్నా, స్వీకరించిన దీక్షలను గురించి చెప్పాలన్నా, స్థాపించిన ఆశ్రమాలను గురించి, అనుగ్రహపీఠాలను గురించి చెప్పాలన్నా, ఏదైనా ఒక విషయముపై వారిచ్చిన ప్రవచనాలను గురించి చెప్పాలన్నా – ఆది, అంతం ఎక్కడని చెప్పగలం? అలా వ్రాస్తూపోతే వారు చెప్పిన ప్రవచనాల పేర్లు చెప్పటానికే ఈ జీవితం సరిపోదేమో?

ఒక బాధ్యతగల కెమిస్ట్రీ లెక్చరర్‌గా టి.జె.పి.యస్. కాలేజీలో పనిచేస్తూ సాధారణంగా జీవిస్తూ సామాన్య మానవుడిలాగా అందరికీ కన్పించే పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారిలో ఇంతటి "స్పిరిట్యువల్ జయంట్ " ఉన్నారంటే ఎవరైనా నమ్ముతారా? ఈనాడు ఆధ్యాత్మికతలోకి ఎవరైనా వచ్చారంటే, వారికి మరెక్కడా తీరని ఆది భౌతిక సమస్యలున్నాయని అర్థం. అందుచేత వాటి పరిష్కారార్థం వచ్చే వారి సంఖ్యే ఈనాడు చాలా ఎక్కువగా వుంటుందనేది ఒక నగ్నసత్యం. అలాంటి వారెవరు వచ్చినా ఎంతో ప్రేమతో, ఆత్మీయంగా వారి కష్టసుఖాలను విని 'నేను చూసుకుంటాను లేమ్మా ' అని మాత్రమే అనేవారు. దాంతో ఆ వచ్చిన వారెంతో తృప్తి పొందేవారు. ఆరోగ్య పరిస్థితులు కానివ్వండి, ఆర్థిక పరిస్థితులు కానివ్వండి, ఏదైనా సరే – అలా వచ్చిన వారందరి సమస్యలు తీరిపోయేవి. దాంతో ఇంక వారికి మాస్టారి మీద చెప్పలేనంత ప్రేమ కలిగేది. ఇక వారి కార్యక్రమాలకు అందరూ వస్తుండేవారు. శిరిడీసాయి జీవితచరిత్రలో సాయిబాబా గారిని ఒక శిష్యుడు అడుగుతాడు "బాబా – మీరు అందరికీ ఇలాగా కోరికలు తీరిస్తే ఎలా అని" అందుకు బాబా "మన దగ్గరకు వచ్చే వారంతా కష్టాలతోనే వస్తారు. ఆ కష్టాలని మనం తీసివెయ్యాలి. భౌతిక జీవితంలో కష్టాలు పోతేనే కదా! ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగుపెట్టగలిగేది" అన్నారు. అలానే మాస్టర్‌గారి దగ్గరికి వచ్చేవాళ్ళందరూ ఏదో ఒక తీవ్రమైన కష్టంతోనే వచ్చేవారు. అవి తీరిపోగానే వారు తరచుగా మాస్టర్‌గారు చెప్పే ప్రవచనాలకు హాజరౌతుండేవారు. అలా మెల్లిమెల్లిగా వారు కూడా ఎంతో కొంత జ్ఞానాన్ని పొంది, తమతోటి వారికి చక్కటి సేవను చేయగల సామర్థ్యాన్ని పొందేవారు.

## దేవమానవుని దివ్యసందేశం

**మాస్టర్‌గారిచ్చే సాధనలు సార్వజనీనమైనవి. ఒక్కొక్క పరిస్థితిలో ఒక్కొక్క సమస్యకు పరిష్కార మార్గంగా ఒక్కొక్క సాధన వారిలో నుండి బయటకు వచ్చేది. ఆ సాధనతో ఆ సమస్య పరిష్కరించ బడినా అది తర్వాత అందరికీ దివ్యఫలాలనందించే సాధనగా రూపొందేది. మాస్టారు ఇచ్చిన ఉపన్యాసాన్ని యథాతథంగా పొందుపరుస్తున్నాము.**

కొన్ని కారణాంతరాలవల్ల 1975 జన్మాష్టమి నాడు ముగ్గురు ఋషుల కార్యక్రమాన్ని ప్రపంచానికి అందజేసే బాధ్యత నా మీద పడింది. బాధ్యతను స్వీకరించిన పిదప దానిని పూర్తిచేయటం నా కర్తవ్యం. నాకు కొన్ని లక్ష్యాలు, ఆదర్శాలున్నాయి. వాటిని పూర్తిచేయడం కోసం కొన్ని జన్మల

నుండి పనిచేస్తున్నాను. మనిషి లక్ష్యోన్ముఖుడు కావాలి, లక్ష్యాల కొరకు జీవించాలి. అంతే కాని వ్యక్తి కొరకు కాదు. మేము గురువు గారి పని చేస్తున్నాం అనుకోవటం తప్పు – గురువు యొక్క లక్ష్యాలు మన లక్ష్యాలైనప్పుడు, మనం కూడా మన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నామనే భావనతోనే జీవించాలి.

**మీరు నన్ను గుర్తించారా లేదా అనేది ప్రశ్న కాదు. నా లక్ష్యాలు గుర్తించారా లేదా అన్నదే ప్రశ్న. మీలో అవగాహనా లోపం ఉంది. మీ మధ్య ప్రేమరాహిత్యం ఉంది. కలిసిమెలసి పని చేయలేకపోతున్నారు. మీ అహంకారం మీకు అడ్డుపడుతున్నది. మీరంతా కలిసి పనిచేసినట్లయితే ఈపాటికి మరెన్నో పనులు పూర్తి అయివుండేవి. నేను జోక్యం చేసుకోకపోవటానికి కారణం ఉంది. హాస్యంగానైనా నా నోటి నుండి ఏదైనా ఒక మాట వస్తే కాస్త సీరియస్‌గా తీసుకోండి. దానికి చాలా విలువ ఉంటుంది.** 1980 నుంచి నాతో కలిసి పనిచేస్తున్న మీలో కొందరు తామరాకుపై నీటి బొట్టులా ఉన్నారు. నాతో సమర్పణగా కలసి పనిచేయలేకపోతున్నారు. ఒక ఆధ్యాత్మిక సంస్థలో కూడా ఎందుకు ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి అన్నది మననం చేసికొని, తప్పు ఎక్కడ జరుగుచున్నదో యోచించి సరిదిద్దుకోండి. గురువులకు మీరు సాయపడరు – నిజంగా గురువే మీకు సాయపడతాడు.

ప్రకృతి ఎప్పటికీ గురువును శాసించలేదు. ఆ భగవంతుడు కూడా శాసించలేడు. మీ మీ అర్హతలను పెంపొందించుకోండి. మీరు కేవలం చెప్పింది చెయ్యండి. ప్రశ్నించవద్దు. గురువు ప్రతిదీ విడమర్చి చెప్పజాలడు. పని చేస్తున్నప్పుడు మీకు వచ్చే బాధలను తొలగించి, అనుకూల పరిస్థితులను కలిగిస్తాడు. మీ దగ్గర ఎంత డబ్బు ఉందో దానితోనే కార్యక్రమాలు చెయ్యండి. డబ్బుతో కూడిన లేనిపోని బాధ్యతలు నెత్తికెత్తుకొని బాధపడకండి. ఉన్న వనరులతో చెయ్యగలిగినంత చెయ్యండి. డబ్బును గురించి, చేసే మనుష్యుల గురించి నాకు వదలిపెట్టండి. నా అనుభవముతో మీకు చెప్తున్నాను. మీరు మరొకరిని ఎలా నా దగ్గరకి రానివ్వడం లేదో, ప్రకృతి కూడా అంతే సింపుల్ నియమాన్ని పాటిస్తుంది. ముందు దీనిని సరిచేసుకోండి.

**మనుష్యుల్లో ఆ పరిపక్వతే కనుక వచ్చి ఉంటే ఇంత అవస్థపడవలసిన అవసరంగానీ, ఇన్ని అవతారాలు రావలసిన అవసరంగానీ లేదు. మీలో గురువుల పట్ల శ్రద్ధ, విశ్వాసాలు పెరగాలి, ఆయన అప్పగించిన బాధ్యతల పట్ల మీకు అపోహలు, మానసికద్వేషాలు ఎందుకొస్తున్నాయి?**

**అంటే మీకు లక్ష్యశుద్ధి లేదు. గురువులు కూడా అనుగ్రహపీఠాలను, మందిరాలను, ఎందుకు నిర్మించామా? అని బాధపడే సందర్భాలు వచ్చాయి మీ వల్ల. అప్పుడు గురువు ఆ మందిరం యొక్క స్విచ్‌ను తన చేతుల్లో ఉంచుకుంటాడు. అప్పుడు ఉండే గురువు, మీరు నిత్యం చూచే గురువు కాదు. ఆయన చెప్పిన పనిని మీరు చెయ్యకపోతే యక్షులో, గంధర్వులో లేక కింపురుషులో వచ్చి నా పనులు చేస్తారు. మీకు పేరు రావాలని నా తపన. కానీ ఈనాటి మీలోని కొందరి పనులు అధికశాతం ఎలా ఉన్నాయి అంటే పృథ్విని నాశనం చేసేలా ఉన్నాయి.**

**నవనాథపీఠం, కాకివాయి:** దత్తసాంప్రదాయం ఈనాడు పూర్తిగా మరుగునపడింది. ఇదే గురుసాంప్రదాయం. ఈనాడు గురువు కన్న భగవంతునికి ఎక్కువ విలువనిస్తున్నాం. దీన్ని గురు సాంప్రదాయం ద్వారా సరిదిద్దాలి. దీనికి నాందిగా ముగ్గురు మహానుభావులు సొరకాయల స్వామి, శిరిడీసాయి, వేంకయ్య స్వామిగార్లకి ఇక్కడ ఈ శ్రీ హంస రామ ఆశ్రమ ప్రాంగణంలో మందిరాలు కట్టాం, ఉపయోగించుకోండి.

సప్తఋషులు మరల భూమ్మీద సశరీరంగా తిరిగేందుకై నేను గత ఐదు సంవత్సరాల నుండి కృషిచేస్తున్నాను. వారి పనిలో భాగంగా ఈ ముగ్గురు ఋషులు నాతో చేయికలిపారు. మీ వద్ద ప్రేమ, అభిమానం ఉంటే నా వద్దకు రండి. మీ వయస్సుతో, అర్హతలతో నాకు పని లేదు. ప్రేమ అనే బంగారంతో నా వద్దకు చేరితే మిమ్మల్ని ఒక విలువైన ఆభరణంగా రూపొందిస్తాను.

## నేను చేపట్టే రెండో కార్యక్రమం

ఇంతకు ముందు పేజీలలో మనం చెప్పుకున్నదే అయినా మరల చెప్పుకుందాం. సహ్యాద్రి పర్వతాలలో పిలిచేవారు లేక అనామకునిగా ఎవరూ గుర్తించనటువంటి ఒక భిక్షగానిగా దత్తాత్రేయ స్వామి తిరుగుతున్నాడు. ఆయనను కలుసుకొన్నప్పుడు ఒక మాట చెప్పాను. "భారతజాతి అంతరించి పోలేదు. భారతీయ ఆత్మపై ఎన్ని ముసుగులున్నా తన స్వతస్సిద్ధమైన ఔన్నత్యాన్ని మర్చిపోలేదు. నీవు పిశాచంలాంటి రూపంలో నున్నా, ఉన్మత్తుడివైనా, బాలుని రూపంలోనున్నా, నీలోని జ్ఞాన స్వరూపాన్ని భారతజాతి గుర్తించగలదు."

మీరు మీ మనస్సును, మీ వాక్కును, మీ ఆచరణను కనుక ఇస్తే మీ వశమవుతాడు దత్తుడు. దత్తునికి కావలసిన వాతావరణాన్ని నిర్మించండి. తద్వారా ఆయనను బందీ చేయుట సులభం.

మూడురోజులపాటు ఇక్కడ కూర్చుందాం. మంచినీళ్ళే మన ఆహారం. నామస్మరణ చేద్దాం. మీరు వచ్చినా, రాకపోయినా, నేను ఒంటరిగా దత్తుణ్ణి ఇక్కడ దింపుకుంటాను. మీరు ఇక్కడ ఉంటే మీకు లాభం. రాబోయే ఐదు సంవత్సరాల లోపల అనేక దేవతా గుడులు, మఠాలు కనుమరుగవుతాయి. చాలామంది దత్త భక్తులవుతారు. సాయిదేవాలయాలు విపరీతంగా ప్రకృతి ప్రసాదాలుగా వచ్చేస్తాయి.

## నేను చేయబోయే మూడవ పని

త్రిముఖీ గాయత్రీ మాత : దత్తాత్రేయ శక్తికి, గాయత్రీ శక్తిని జోడించాలి. దీనికి సంబంధించిన దత్తమంత్రం.

**"ఓం దతాత్రేయాయ విద్మహే గాయత్రీశాయధీమహి తన్నో గురుః ప్రచోదయాత్"**

ఈ మంత్రానికి అభినవరూపకల్పనకై ప్రయత్నించాను. ఆ త్రిముఖీ గాయత్రీ యొక్క సాధనా విధానాన్ని కూడా ప్రపంచానికి అందించే బాధ్యత నాదే. **కొన్ని వందల జన్మల నుంచి మీరు నాకు సహకరించారు. కావున మీకు ఆ అవకాశమిస్తున్నాను.** ఇది గురువుగా నా బాధ్యత. మీరు నాతో సహకరించి ప్రపంచానికి దిశానిర్దేశాలను ఇవ్వాలి. ఏ మాలిన్యమూ అంటని హిమాలయాలలోని నందనవనంలా, ఈ కాకివాయి క్షేత్రం రూపుదాలుస్తుంది. మీరు సహకరిస్తే నేడు చలామణిలో ఉన్న దివ్యక్షేత్రాలన్నీ ఒకనాటి అరణ్యాలే. ఒక పుట్టపర్తి, శిర్డీ మాలపల్లి, దక్షిణేశ్వరం మొదలైనవన్నీ ఒకనాడు ఇలాంటి నిర్జన ప్రదేశాలే. మనం ప్రయత్నిస్తే అవి క్షేత్రాలుగా రూపొందుతాయి.

**మీరు ఏ దృష్టితో నన్ను ప్రేమిస్తే, దానికి రెండింతల ప్రేమను నా నుండి తిరిగి పొందుతారు. కేవలం పూర్తి విశ్వాసంతో మానసికంగా నన్ను ప్రేమించినా, మీతోనే ఉంటాను.** నవనాథపీఠము, ముగ్గురు గురువులు, వీరిద్వారా సప్తఋషుల ఆవిర్భావం. దత్తునికి ఆధారమైనట్టి త్రిముఖీ గాయత్రీ యొక్క శక్తిని తిరిగి కలపటం. వీటినన్నింటినీ ప్రపంచానికందించాల్సిన బాధ్యత నాదే ! నాతో పాటు మీకూ అందులో బాధ్యత ఉంటుంది.

మీ మనస్సుల్లో పరిపూర్ణమైన ప్రేమ, అనురాగం ఉంటే ఆ గురువులందరూ ఈ ప్రాంతంలోనే నివసించేటట్లు చూసే బాధ్యత నాది. కానీ మీలో ప్రేమను నేను నింపలేను. మీ అలవాట్లను మార్చుకోండి.

"ఆ గురువులు మీకు సద్బుద్ధి ఇచ్చుగాక."

## దివ్యచేతన యొక్క కార్యకలాపాలు

మానవ మేధస్సును స్థూలప్రకృతితో జోడించి తీవ్రమైన ఏకాగ్రతతో చేసే పరిశోధనలే ఈనాడు వైజ్ఞానికులు చేసిన కృషికి ఫలితాలు. వైజ్ఞానిక రంగంలో దేశకాలాలకతీతంగా ఏ వైజ్ఞానికుడు, ఏ ప్రకృతి రహస్యాన్ని దర్శించినా, అది తక్షణమే సంపూర్ణ మానవాళికి ఉపయోగపడుతూ వస్తున్నది. సైన్సులో ఈ పక్షపాతరహితమైన, నిష్కల్మషమైన ఓపెన్‌నెస్ ఉన్నది అంటే బహిరంగపరచే విధాన మున్నది. ఆధ్యాత్మిక జగత్తులో ఈనాటి గురుపరంపరతో అది తిరిగి మొదలైందని చెప్పవచ్చు. ఈ విధానము ఒక విధంగా బుద్ధభగవానుల వారి నుండి మొదలైందని చెప్పవచ్చు. గురుశిష్య సంప్రదాయమనేది ఒక రహస్య విధానము మాత్రమే. రహస్యాలను అందచేయాలనే నియమము అంధకార యుగములో అనవసరమైన ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

కానీ ఋషులు "ఆనోభద్రాక్రతవో యం తు విశ్వతః" అంటే ఉత్తమమైన ఆలోచనలు నలువైపుల నుండి నా వద్దకు వచ్చును గాక" అనే కోరికలోగానీ, 'వసుధైవ కుటుంబకం' అనే సార్వజనీనమైన అభిలాషలోగానీ ఈ విద్యను రహస్యంగా వుంచాలనే ఉద్దేశ్యము ఎక్కడా కనిపించదు. ఈనాడు మళ్ళీ ఆధునిక, వైజ్ఞానిక చమత్కారాలనన్నింటినీ కూడా ఆధ్యాత్మిక సాధనలో ఉపయోగించుకొని మనస్సు ద్వారా భౌతిక క్షేత్రాలలో విజయ పతాకాలను ఎగురవేస్తున్న మానవుడు ఆధ్యాత్మిక క్షేత్రాలలో కూడా ఇంతవరకు అందుకోలేని అత్యంత ఉన్నత శిఖరాలను గెలుచుకోవడానికి చేసిన ప్రక్రియే "శ్రీరామశర్మఆచార్య"గారి అవతరణ. ఈ రకమైన విశేష ప్రక్రియలను సాధనాపరంగా సాధక లోకానికందజేయడానికి 'శ్రీహంసరామ ఆశ్రమం'లో దానికి కావలసిన విశేషమైన అంకురార్పణను పూజ్యశ్రీ మాస్టర్‌గారు ప్రారంభించారు.

## ఒక చక్రీయక్రమ సాధనతో సంవత్సర కాలపు పరిణామము

1997వ సంవత్సరంలోని మార్గశిరపూర్ణిమ, దత్తజయంతినాడు శ్రీ హంస రామ ఆశ్రమంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు కుండలినీ సాధనలు మరియు సావిత్రీసాధనలు చేయించారు. మనిషి పరిణామక్రమంలో ఎలా ముందుకు పోగలడనే విషయాన్ని తెలియజేసే చిత్రమైన సాధనది.

ఒక చక్రీయ సాధనలో సంవత్సరకాలపు పరిణామక్రమము ఎలా సాధ్యమౌతుందో ఈ సాధన ద్వారా అర్థమౌతుంది. కొన్ని కోట్ల కోట్ల పరిణామక్రమంలో మానవుడు ఉద్భవించాడు.

ఇంకా కొన్ని కోట్ల సంవత్సరాలు గడిస్తే మానవుడు, మహామానవుడుగా లేక భగవంతుడుగా మారతాడని శాస్త్రాలు చెప్తున్నాయి. యోగశాస్త్రము ప్రకారము కిరణము పేరు క్రింద 360 అనే సంఖ్య ఉందనేది అందరికీ తెలిసిన విషయమే. (గురుసత్తా అనుగ్రహము – కుండలినీ జాగరణ అనే పుస్తకంలో దీని వివరాలు తెలుస్తాయి). ఈ ఇవల్యూషనరీ సైకిల్‌లో మంచి స్ఫూర్తిని, ప్రేరణను కలిగించటానికి మాస్టర్‌గారు ఒక రహస్య ప్రక్రియనందచేశారు.

ముందుగా మూలాధారం నుండి ఆజ్ఞ వరకు వెళ్ళి, మరల ఆజ్ఞ నుండి మూలాధారం వరకు వస్తే, ఒక సంవత్సరకాలం పాటు ఏ పరిణామక్రమంలో సాధకులు ఎలా వెళ్ళవలసి వస్తుందో, ఆ సాధనా విధానాన్ని ఇలా అందచేసారు.

| ↑ | ↓ |
|---|---|
| 6. ఆజ్ఞ | 1. ఆజ్ఞ |
| 5. విశుద్ధి | 2. విశుద్ధి |
| 4. అనాహతం | 3. అనాహతం |
| 3. మణిపూరకం | 4. మణిపూరకం |
| 2. స్వాధిష్ఠానం | 5. స్వాధిష్ఠానం |
| 1. మూలాధారం | 6. మూలాధారం |

ముందు ఇలాగా మనస్సును ఒక్కసారి అక్కడ త్రిప్పుకోగలిగితే ఒక్క సంవత్సరములో మనిషి పరిణామక్రమంలో ఎన్ని అనుభూతులు సంపాదించగలడో అన్ని సంపాదించగలడు. శ్రీ లాహిరీ మహాశయులు మానవజాతికి అందించినటువంటి క్రియాయోగ రహస్యం ఇదే. కోట్ల కోట్ల సంవత్సరాల పరిణామక్రమం అయితే గానీ మానవులు, మహామానవుల స్థాయికి వెళ్ళలేరు. ఆ ప్రక్రియ కోట్ల కోట్ల సంఖ్యలో (మూలాధారం నుండి ఆజ్ఞ, మరల ఆజ్ఞ నుండి మూలాధారం వరకు) జరగాలి. అంటే లాహిరీ మహాశయులు మనకందచేసిన సూత్రం ఇదే. మూలాధారం...ఆజ్ఞ, మళ్ళీ ఆజ్ఞ...మూలాధారం అలా చేస్తే ఒక సంవత్సర కాలం పరిణామక్రమం గ్యారంటీగా అయిపోతుందన్నారు. ఇలాగా 4 సంవత్సరాల 8 నెలల 9 రోజులపాటు ఉదయం 4 గంటలు,

సాయంత్రం 4 గంటలు చేసుకోగలిగితే మానవుడు మహామానవుడైపోతాడు. ఇది ఎంత మహత్తరమైన సాధనో చూడండి. దీనిని దత్త జయంతి నాడు ఇవ్వటం వలన దత్తానుగ్రహం కూడా కలిగి మరి కాస్త సత్వర ఫలితాలనందించాలనే ఉద్దేశ్యంతో మన మాస్టర్‌గారు దత్త బీజ మంత్రాన్ని ఈ ప్రక్రియకు జోడించి ఇలా చెప్పారు. ముందుగా మూలాధారం నుంచీ సాధన ప్రారంభమౌతుంది. అంటే ఈ సాధనను ఇలా చెయ్యాలి.

ఓం ద్రాం మూలాధారం, ఓం ద్రాం స్వాధిష్టానం, ఓం ద్రాం మణిపూరకం, ఓంద్రాం ఆజ్ఞ దగ్గర ఆగి, మళ్ళీ ఓంద్రాం ఆజ్ఞ, ఓంద్రాం విశుద్ధి........ అలా చివరకు ఓం ద్రాం మూలాధారం అని ఆపితే ఒక సైకిల్.

| ↑ | ↓ |
|---|---|
| 6. ఓం ద్రాం ఆజ్ఞ | 1. ఓం ద్రాం ఆజ్ఞ |
| 5. ఓం ద్రాం విశుద్ధి | 2. ఓం ద్రాం విశుద్ధి |
| 4. ఓం ద్రాం అనాహతం | 3. ఓం ద్రాం అనాహతం |
| 3. ఓం ద్రాం మణిపూరకం | 4. ఓం ద్రాం మణిపూరకం |
| 2. ఓం ద్రాం స్వాధిష్టానం | 5. ఓం ద్రాం స్వాధిష్టానం |
| 1. ఓం ద్రాం మూలాధారం | 6. ఓం ద్రాం మూలాధారం |

ఇది అతి సరళమైన సాధన. మనస్సును ఆయా చక్రాలలో మెకానికల్‌గా త్రిప్పుకుంటే చాలు. పరిణామక్రమంలో ఎంతటి ఉన్నతిని సాధించవచ్చునో చేసిన వారికి అర్థమౌతుంది.

"ఒక యోగి ఆత్మకథ" లో పరమహంస యోగానంద వ్రాసిన తెలుగు పుస్తకంలో "క్రియా యోగము" అనే చాప్టర్‌లో ఈ సాధన చాలా స్పష్టంగా ఇచ్చారాయన. (ఆ పుస్తకం చదువుకుంటే మంచిది). ఈ సాధనను అన్ని గంటలు చేయలేనివారు రోజుకో 500 సార్లో, 1000 సార్లో మీరు ఎంత సమయము దీనికోసం కేటాయించగలరో అంత చేసినట్లయితే, ఇది మిగతా సాధనలనన్నింటి కంటే పరిణామ ప్రక్రియను వేగవంతం చేసేస్తుందని మాస్టర్‌గారు ఘంటాపథంగా చెప్పటం జరిగింది. క్రియాయోగరహస్యం ఇందులోనే ఉంది.

## సావిత్రీ సాధన

లాహిరీ మహాశయులందించిన క్రియాయోగంలో షట్చక్ర జాగరణ మాత్రమే వుంది. మూలాధారం నుంచి ఆజ్ఞ, ఆజ్ఞ నుంచి మూలాధారం. ఇది కాకుండా శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు చేసిన సాధన ఏమిటీ అంటే అది సావిత్రీ విద్య. సాధనలో కూర్చున్నవాళ్ళు ఎప్పుడు చేసుకున్నా క్రింది నుండి పైకి, మళ్ళీ పై నుండి క్రిందికి ఎన్నిసార్లు అయినా చేసుకోవచ్చు. అలా షట్చక్రసాధన అయిపోయింది. సాధన నుండి లేద్దాము అనుకున్నప్పుడు సావిత్రీ సాధన ఒక్కసారే చెయ్యాలి. చివరి ఎనిమిది సంఖ్య సావిత్రి సాధనతో పూర్తి చెయ్యాలి.

## సాధన

ముందుగా సాధన మూలాధారం నుండి మొదలుపెట్టాలి. ఆజ్ఞ వరకు వచ్చాక మళ్ళీ ఆజ్ఞ నుండి మూలాధారం వెళితే వంద దళాలు అవుతాయి.

| చక్రస్థానము | దళాలు |
|---|---|
| ఆజ్ఞ | 2 |
| విశుద్ధి | 16 |
| అనాహతం | 12 |
| మణిపూరకం | 10 |
| స్వాధిష్టానం | 6 |
| మూలాధారం | 4 |

ఒక సైకిల్‌లో – 50 × 2 = 100 పూర్తౌతాయి. ఇలా వీలైనన్నిసార్లు చేశాక ఇక సాధన నుండి లేద్దాము అనుకున్నప్పుడు మనస్సును ఆజ్ఞ చక్రం దగ్గరకు తెచ్చుకుని ఆ గురుదేవుల నామాన్ని శ్రీరామశర్మఆచార్య గారిన్ని స్మరించుకోవాలి. ఆజ్ఞ దగ్గర మనస్సు తర్వాత బుద్ధి – చిత్తం – సహస్రారం దాకా వెళ్ళి మళ్ళీ అదే క్రమంలో వెనక్కు వచ్చి ఆజ్ఞ దగ్గర ఆగిపోతే 8 సంఖ్య పూర్తౌతుంది. 1008 సార్లు చేయదల్చుకుంటే మూలాధారాం నుండి ఆజ్ఞ, ఆజ్ఞ నుండి మూలాధారం వరకు – ఒక సైకిల్ పూర్తౌతుంది. ఇలా 10సార్లు చేశాక ఇంక లేవాలి అనుకున్నప్పుడు సావిత్రీ సాధన ఒక్కసారి చేస్తే సరిపోతుంది.

కానీ ఈ సాధన యొక్క సత్ఫలితాలు పొందాలనుకుంటే నిష్కల్మషమైనటువంటి మనస్సు చాలా అవసరం. స్వచ్ఛమైన నీటిలోనే ఆ సూర్యుడు గానీ, చంద్రుడు గానీ ప్రతిబింబిస్తాడు. సాధన చేస్తూ చేస్తూ వుంటే మనస్సులో వుండే నానా రకాల బీభత్సాలు మెల్లమెల్లగా శాంతిస్తాయి. అందుచేత మానసిక ఆవేదనలున్నా, ఎలాంటి బాధలు వున్నా ఈ సాధన చాలా అద్భుతంగా పనిచేస్తుంది. పెద్ద కష్టమైన సాధనేం కాదు. సరళంగా చేసుకోగలిగిన అత్యంత సుందరమైన సాధన ఇది, సద్యః ఫలితాలనిచ్చే సాధన. నిత్యావతారుడైన దత్తస్వామి కరుణా కటాక్షములతో నిత్యనూతనమైన సత్వర ఫలదాయకమైన ఈ సాధన సర్వకాల సర్వావస్థలలోనూ చేసుకోవచ్చు.

## దేవతల కంటే ఉచ్ఛస్థితిలో ఉన్నవాడు గురువు

దేవతలకు కోపం వస్తే గురువు క్షమించగలడు కానీ, గురువుకు కోపం వస్తే రక్షించేవాడెవ్వడూ లేడు అని గురుగీతలో చెప్పబడి వుంది. ఎప్పుడు చూచినా, నా పిల్లలు, నా ఉద్యోగం, నా పెళ్ళాం అని ఏడ్చేవాడు "శ్రీరామశర్మఆచార్య" అనే అద్భుతమైన గురువుకి శిష్యుడిగా తగడు.

గురుదేవుల ప్రణాళికను అమలు చేయటానికి మీకెప్పుడూ వీలు కలుగదు. ఒక సినిమాను చూడాలంటే వీలు కలిగించుకొని వెళతారు. టి.వీ. సీరియల్ చూట్టానికి టైం వుండదు. కానీ చూస్తారు. నేను చెప్పే విషయంలో ఉండే ఆ గంభీరతను అర్థం చేసుకోండి. ఈ గురుపూర్ణిమ నుండి 2004, 2005, 2006 గురుపూర్ణిమల వరకు సాధన చేసి పూర్ణాహుతి నిర్వహించాలనేది నా కోరిక. వీలైతే అది ఒక మహాయజ్ఞంగా చెయ్యాలనే కోరిక వున్నది. అది ఎలా? నేననుకున్నది మీకు మీరుగా చేస్తే మీ జీవితం యజ్ఞమయంగా మారుతుంది. నేను చేయబోయే 108 లఘు అనుష్టానాల పరంపరలో మీరూ పాలు పంచుకోవాలి. దానికి సంబంధించి ప్రతి నెలా 10, 20, 30 తారీకులలో జరిగే పూర్ణాహుతిలో సంస్కార మహోత్సవాలు జరుపుకోవాలి. దీక్ష తీసుకోదలచిన వారు అధిక సంఖ్యలో వచ్చి ఈ పూర్ణాహుతిలో దీక్ష తీసుకోవాలి, ప్రతీనెలా ఆ సంఖ్య అలా పెరిగిపోతూ వుండాలి. అలా వచ్చిన గొప్ప ఆత్మబలం గల వారి యొక్క శక్తితో మనం ఒక మహా యజ్ఞాన్ని నిర్వహించాలి. అంతేతప్ప చందాలడుక్కోవటం, ఆ ఇచ్చేవాడు ఇన్‌కంటాక్సు ఎగ్గొట్టి చందా డబ్బుగా ఇస్తే, 'దాన్ని సగం మన జేబులో వేసుకొని, ఆ మిగిలిన సగంలో బయటకు చెప్పకురా బాబూ!' అని ప్రక్కవాడికి కాస్త ఇచ్చి, మిగిలిన దాంతో యజ్ఞాలు చేసి, 'ఓహో, మేం ఇన్ని వేలకుండీలతో యజ్ఞం చేశాం' అని అనిపించుకోవచ్చు. కానీ నా ద్వారా మాత్రం మీరు

అలా అనిపించుకోలేరు. గురుదేవుల యొక్క సృజనాత్మక కార్యకలాపాలలో పాలుపంచుకొని, నేను చెప్పింది చెప్పినట్లు ఆచరించని వారితో ఈ మహాయజ్ఞం జరిగేటట్లు నేను చూడను. అది కూడా గుర్తుంచుకోండి. మీలో ఆ ఆవేదన వచ్చి గురుప్రణాళికా కార్యక్రమాల కొరకు మీకై మీరు పాటు పడాలి.

ఈనాటి ఈ దేశకాల పరిస్థితులలో పుట్టి ముఖ్యంగా శ్రీరామశర్మఆచార్యగురుదేవుల పేరు విని, వారి కార్యకలాపాలను అవగాహన చేసుకొని, మీరు సవ్యంగా జీవించాలని నేను కోరుకుంటున్నాను. గురుదేవుల పేరును విన్నవారు చాలా మందే ఉండి వుండవచ్చు. కానీ వారికా తపన లేదు. ఆ తీవ్రతా లేదు. అలాంటి వారు నాకు అక్కరలేదు.

**యుగసంధి-పరివర్తన:** ఈ కాలంలో ఒక పరివర్తన జరుగుతున్నది. దాని కొరకు ప్రతి నెల మూడు అనుష్టానాలు, మూడు పూర్ణాహుతులు 10, 20, 30 తేదీలలో జరగాలి. గురుదేవులు, 'నా వారసత్వం వీలునామా' (ఆత్మకథ) అనే పుస్తకంలో మీలో ప్రతి ఒక్కరికీ 24కోట్ల గాయత్రీజపం అంతరిక్షంలో ఉంచానని వ్రాసి పెట్టారు. గురుదేవులు మీకూ, మీ పిల్లలకు, వాళ్ళ పిల్లలకు సరిపోయినంత గాయత్రీ మంత్రశక్తి అనే ఆస్థిని అంతరిక్షంలో పెట్టి వెళ్ళారు. గాయత్రీ మంత్రశక్తి కోసం తీవ్ర తపస్సాధనలేవీ చేయనక్కరలేదు. అయితే వీలునామా రాశారు కదాని ఆయన ఆస్తిని, నీ ఇష్టానికి ఖర్చు పెట్టుకోనివ్వరు. ఆయన ఖర్చుపెట్టమన్నట్లు ఖర్చు పెట్టాలే తప్ప, మీ స్వార్థానికి దానిని ఉపయోగించుకోకూడదు.

రజనీకాంత్ నటించిన అరుణాచలం సినిమా చూస్తే అదేంటో మీకర్థమౌతుంది. మీరు గురుదేవుల గాయత్రీ మంత్ర శక్తిని, మీ స్వార్థానికి ఉపయోగించుకోకపోతేనే ఆయన అనంత సంపద మీకు లభిస్తుంది. ఆ అనంత సంపదను నీవు మంచి పనులకోసం మాత్రమే ఉపయోగించు కోవాలి. గురుదేవులు అందరికీ కావలసిన తపశ్శక్తిని, దానశక్తిని అంతరిక్షంలో వుంచారు. దీనిని ఉపయోగించుకోవాలంటే ముందు మీరు ఈ ఆధ్యాత్మిక విద్యను నేర్చుకోవలసి వుంటుంది. ఉదాహరణకు కంప్యూటర్‌ని కొని ఇంట్లో పెడితే లాభం లేదు. దానిని మీరు ఉపయోగించుకోవటం నేర్చుకోవాలి. దానిని మీరెంత బాగా నేర్చుకుంటే మీకది అంత గొప్పగా ఉపయోగపడుతుంది.

ఆధ్యాత్మిక విద్యను నేర్చుకొని దానిని ఉపయోగించుకోవటానికి గురుదేవులు ఆరునెలలు కాలపరిమితి గలిగిన సర్టిఫికేట్ కోర్సులనిచ్చారు. ఆ కోర్సును మనం 11 రోజులలోనే అంటే

ఒకటవ తేదీ నుండి తొమ్మిది రోజులలో జరిగే లఘు అనుష్ఠానాల పూర్ణాహుతితో పాటు ఆ పదిరోజులలో నేను చెప్పే సిలబస్‌ను నేర్చుకోవలసి ఉంటుంది. ఇది యుగసంధి కాలం. కాబట్టి మీరు చేసే ఆలోచనా విధానాలు, పనులు మారాలి. తాతలు చేసిన పనులే చెయ్యాలంటే ఎలా? దాన్నే సోషియాలజిష్టులు జనరేషన్ గ్యాప్ అన్నారు. ఈ యుగసంధి కాలం దాటగానే కొన్ని కోట్లసంవత్సరాల వరకు జనరేషన్ గ్యాప్ వుండదు.

## గాయత్రీ అక్షర ధ్యానము

పూజ్య మాస్టర్‌గారు గాయత్రీ మహావిజ్ఞానముపై తరగతులు నిర్వహిస్తూ గాయత్రీ మంజరి, గాయత్రీ అక్షరన్యాసము, గాయత్రీ సంహిత, గాయత్రీ గీత, గాయత్రీ రామాయణము, గాయత్రీ అక్షర ధ్యానములకు అత్యద్భుతమైన వివరణనిచ్చి ఆంధ్రులపై అమృత వర్షమును కురిపించారు. ముఖ్యంగా గాయత్రీ మంత్ర అక్షరములపై ధ్యానము నిత్యము చేసినచో సాధకుడు శాంతి, సమృద్ధి, సుఖములతో, అత్యున్నత ఆధ్యాత్మిక స్థాయిలను పొందవచ్చు. చిత్రములో చూపించిన విధముగా అక్షరములను చూస్తూ కనులు మూసుకొని ధ్యానం చేయవలెను. ఈ ధ్యానము యొక్క గొప్పతనాన్ని వివరించిట కష్టము, కానీ ధ్యాన ఫలాన్ని ఆ అక్షరముల దర్శనమాత్రముచేత పొందవచ్చును.

## సంజీవనీ సాధన

మానవజన్మ అతి దుర్లభమైనది. అందులోనూ ఈ యుగసంధికాలంలో పుట్టడమనేది మరింత శ్లాఘించాల్సిన విషయమే! అంతటి మానవజన్మనెత్తిన మనందరమూ మన విలువైన సమయాన్ని గురుప్రణాళికలో భాగంగా జీవిస్తూ, పరిణామక్రమములో ముందుకెళ్ళడానికి మాస్టర్‌గారిచే ప్రసాదించబడిన వివిధ సాధనలను చేసే అవకాశాన్ని పొందివున్నాము. అయితే ఏం చెయ్యాలన్నా ముందుగా మనకు మన శరీరం, మనస్సు, ఇంద్రియాలు సహకరించాలి. వాటిని నియంత్రించ గలిగిన సామర్థ్యాన్ని మనం కలిగివుండాలి. శారీరిక ధారుఢ్యం వున్నా మనస్సు సహకరించాలి. అది అతి ప్రధానమైన విషయం.

**మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః** అనేది ఉపనిషత్ ప్రమాణం. అలాంటి మనస్సును మనమెలా తయారుచేసుకోవాలో గీతలో శ్రీకృష్ణులవారు 6వ అధ్యాయంలో ఇలా చెప్పారు

**యుక్తాహార విహారస్య, యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ (భ.గీ..6-17)**

**అర్థం:** ఆహార, విహారముల యందు, కర్మాచరణముల యందు, జాగృత-స్వప్నాదుల యందు యథాయోగ్యముగా జీవించు వానికి దుఃఖనాశకమగు ధ్యానయోగము సిద్ధించునని ఆ శ్లోకార్థము. మిల్లేనియం సమయంలో సప్తర్షి ఆశ్రమంలో మూడునెలల పాటు మాస్టర్‌గారిచే నేర్పించబడుతున్న జప, ధ్యాన, యోగసాధనలను నేర్చుకోవడానికి ఆంధ్రప్రదేశ్ నుండి వందలాది మంది వచ్చి ఈ అవకాశాన్ని అద్భుతంగా వినియోగించుకున్నారు. అయితే ఈ యోగసాధనలవీ చేయడానికి మనస్సు సహకరించాలని ముందే చెప్పుకున్నాం. ఇవన్నీ నేర్చుకోవడానికి సహకరించే మనస్సు దేంతో తయారౌతుంది అంటే అన్నంతోనే తయారౌతుంది. అలాంటి యోగ్యమైన మనస్సును సాధకులలో వికసింపచేయడానికే మాస్టర్‌గారు **"సంజీవనీసాధన"**ను ఆహార వినియోగం కొరకు రూపొందించారు.

## యజ్ఞ ప్రక్రియగా సామూహిక భోజనం

ఆహారంతోనే కదా శక్తి ఆవిర్భవిస్తుంది. అయితే ప్రపంచంలో ఎన్ని శక్తులున్నాయి, అవేమిటీ అంటే-మొదటిది మనస్సు యొక్క శక్తి, రెండవది ప్రాణశక్తి, మూడవది వాక్శక్తి - దానినే కుండలినీ శక్తి అని కూడా పిలుస్తారు. వీటన్నింటినీ ఆహారం ద్వారానే ఉపయోగించుకుంటున్నాము. ఇక్కడ మనస్సును తయారుచేసేది సాలిడ్‌ఫుడ్ అంటే ఘనాహారం. ఎలాంటి ఆహారాన్ని తింటామో అలాంటి మనస్సే కదా ఏర్పడుతుంది. అందుచేత రాబోయే రోజులలో ఈ మైండ్ఎనర్జీని ఉపయోగించుకునే వాళ్ళు ఆహారానికి ప్రాముఖ్యతనివ్వాలి. ఇస్తారు కూడా! గుర్తుంచుకోవాల్సిందేమిటంటే,

1. మైండ్‌పవర్ అన్నా ఎలక్ట్రికల్ ఎనర్జీ అన్నా ఒక్కటే! అందుచేత మనం తినే ఘనాహార పదార్థాలన్నీ కూడా మైండ్‌ని అంటే మనోమయశక్తిని అంటే ఎలక్ట్రికల్ మైండ్‌ని కంట్రోల్ చేస్తాయి.
2. ప్రాణశక్తి. ఈ ప్రాణశక్తి సూర్యకిరణాల ఆధారంగా వచ్చేటటువంటి జలతత్వం మీద ఆధారపడివుంటుంది. ఇప్పుడు ఒక విత్తనాన్ని నాటామనుకోండి, దానిలో ప్రాణశక్తి రావాలన్నా, అది అంకురించాలన్నా దానికి నీళ్ళు కావాలి. అది దాని ధర్మం. అందుచేత ప్రాణశక్తి దేనిమీద ఆధారపడి ఉంటుందంటే నీరు మీదనే ఆధారపడి వుంటుంది. ఇకపోతే 3వది వాక్శక్తి. ఇది దేని మీద ఆధారపడి ఉంటుందంటే ఆయిల్స్ మీదా ఫాట్స్ మీదా ఆధారపడి వుంటుంది.

ముందుగా ఆహార నియమం ఏమిటీ అంటే బాగా ఆకలిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలి. అలాగే తినే ఆహారం రుచిగా వున్నదా, లేదా అన్నది ఇంపార్టెంట్ కాదు. నీవు తినే ఆహారం, నీ మనోమయశక్తిని పెంచేదిగా వున్నదా? దాని తర్వాత అది నీ ప్రాణశక్తిని పెంచేదిగా వున్నదా? నీ వాక్శక్తిని పెంచేదిగా వున్నదా, లేదా అనేది చూసుకోవాలి. నిజం చెప్పాలంటే వాక్శక్తిని ఉపయోగించుకొని నీకు కావలసిన వాటిని నీ దగ్గరకు తెచ్చుకోవచ్చు. ఋషులు చేసే మాజిక్‌లన్నీ అవే. వాక్శక్తిని ఎలా ఉపయోగించుకోవాలనేది వాళ్ళకు బాగా తెలుసు. ప్రాణశక్తి ఏం చేస్తుంది? దగ్గరగా ఉన్నవాటిని దగ్గరగానే ఉంచుతుంది. అందుకే ప్రాణశక్తి ఎక్కువగా ఉన్నవారి దగ్గరకు ఎక్కువ మంది వెళుతుంటారు. ఈ ప్రాణశక్తి అనేది ప్రేమ అనేటటువంటి అనుభూతిని, రసాన్ని కలుగచేస్తుంది. దీనినే మహారాసగా లేక రాసలీలగా అభివర్ణిస్తుంటారు. ఈ మూడురకాల శక్తులను కలిపి మనం కెమికల్ ఎనర్జీ అంటాం. అవే బ్రాహ్మీశక్తి, వైష్ణవీశక్తి మరియు లయకారకమైన శాంభవీశక్తి అంటారు.

ఒక నిర్ణీతసమయంలో రకరకాలైన పదార్థాలనన్నింటినీ కలిపి తయారుచేసుకునే ఆహారాన్ని 'డైట్' అంటాం. ఇంకా చెప్పాలంటే ఉదయాన్నే తినే బ్రేక్‌ఫాస్ట్‌ను ఉదయాన ఉన్న సూర్యకిరణాలకు అనుగుణంగా, మధ్యాహ్న సమయంలో తినే ఆహారాన్ని ఆ సమయాన ఉన్న సూర్యకిరణాలకు అనుగుణంగా, అలాగే రాత్రిపూట తినే ఆహారాన్ని రాత్రి సూర్యకిరణాలకు అనుగుణంగా తీసుకోవాలి. దీన్ని డైట్ అంటారు. ఇట్ ఈజ్ ఎ కాంబినేషన్ ఆఫ్ వెరైటీ ఆఫ్ ఫుడ్స్. ఈ కాంబినేషన్ ఆఫ్ ఫుడ్స్‌లో చాలా చిత్ర, విచిత్రాలు జరుగుతుంటాయి. ఉదాహరణకు తేనెను మామూలు నీళ్ళతో తీసుకుంటే ఒకలాగా పనిచేస్తుంది. వేడినీళ్ళతో తీసుకుంటే ఒకలాగా, చల్లటి నీటితో తీసుకుంటే ఇంకోలాగా, నెయ్యితో కలిపి తీసుకుంటే మరొకలాగా పనిచేస్తుంది. సరే, అసలు సంగతికి వద్దాం.

ఆహారమెలా తీసుకోవాలి? ఆహారం తీసుకునేటప్పుడే నోటిలోని లాలాజలంతో కలిసి డైజెషన్ అనేది మొదలవుతుంది. ఈనాడున్న అనేక రకాలైన గాస్ట్రిక్ ప్రాబ్లెమ్స్‌కు కారణం నోటిలో జరుగవలసిన అరుగుదలకు ఎవ్వరూ ప్రాముఖ్యతనివ్వకపోవడం. గురుదేవులు చెప్తుండేవారు, 'ఆహారాన్ని త్రాగండి, నీళ్ళని తినండి' అని. ఘనాహారం తింటున్నప్పుడు గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే అది మీ నోటిలోనే ద్రవంగా మారేంత వరకు నమలాలి. అంత నెమ్మదిగా తినాలి. ఎప్పుడైతే ఆహారం ద్రవంగా మారుతుందో అప్పుడు మనోమయశక్తితో పాటు ప్రాణమయశక్తి

కూడా వచ్చి కలుస్తుంది. గబాగబా ఆహారం ద్రవం కాకుండానే మింగేశారనుకోండి, అప్పుడు ప్రాణశక్తి అనేది ఇక మీ లోపల ఉండదు. తినే ప్రతి పదార్థాన్ని గమనించుకుంటూ తినడం నేర్చుకోవాలి.

ఇంతే కాకుండా ఆహారం తీసుకునే విషయంలో మాస్టర్‌గారు మరికొన్ని ఆణిముత్యాల్లాంటి నియమ, నిబంధనలను ఇలా వివరించారు.

1. వారానికి ఒక్కసారైనా ఉపవాసం చేస్తే మంచిది. లేదంటే ప్రతి నెలా వచ్చే శుక్లపక్ష ఏకాదశి, కృష్ణపక్ష ఏకాదశికి ఉపవాసం చెయ్యడం ఎంతో లాభదాయకం. భౌతిక పక్షంగా దీని లాభం గురించి చెప్పాలంటే శరీరం ఆరోగ్యవంతంగా వుంటుంది, ఆధ్యాత్మికపరంగా ఈ ఉపవాసం ప్రాణశక్తిని బాగా పెంచుతుంది.

2. పంచమినాడు ఉపవాసం చేస్తే మనోమయకోశ శక్తి పెరుగుతుంది.

3. పూర్ణిమనాడునాడు ఉపవాసం చేస్తే కుండలినీశక్తి పెరుగుతుంది.

4. ఆహారంలో 20% ఉడికించిన ఆహారపదార్థాలు, 80% ఉడికించని ఆహారపదార్థాలు –కాయగూరలు, పండ్లు, మొలకెత్తిన గింజలు మొ!! తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారం కడుపులో సగభాగం నిండాలి, మిగతా సగభాగంలో సగం నీటికి, సగం గాలి కొరకు వదలాలి. ఇదీ ఆహారం తీసుకునే విధానం. యజ్ఞీయప్రక్రియగా సామూహిక భోజనం తీసుకోవాలి. సామూహిక భోజనం సంపదలకు మూలం.

## సాధనాత్మక ఆహారము

04-04-98 లో మాస్టర్‌గారు ఇచ్చిన ప్రసంగంలోని ముఖ్యమైన విషయాలు యధాతథంగా– ఆహారానికి కూడా స్థూలత్వము, సూక్ష్మత్వము, కారణాత్మక అంశలు ఉంటాయి. ఆహారము యొక్క స్థూలత్వము మన స్థూల శరీరానికి అవసరమైన రక్తము, కండరాలు, ఎముకలు, మజ్జ మొ!! ఏడు ధాతువులు ఏర్పడటానికి ఉపయోగపడుతుంది. సూక్ష్మ అంశ మన భావనాత్మకతను ప్రభావితం చేస్తే, కారణ అంశ మన మనస్సుగా మారుతుంది. అందుచేత ఆహారమే – మనస్సు.

సాధన చేస్తున్నప్పుడు ఆహారనియమాలు ఎందుకు పెడుతున్నారంటే, మీరు ఏ సాధన చేస్తున్నారో ఆ సాధనకి తగినటువంటి ఆహారం తీసుకోవాలి కాబట్టి. కాళికాదేవి ఉపాసన చేస్తూ

నువ్వు సాత్వికమైన ఆహారం తీసుకున్నావనుకో, చుక్కెదురవుతుంది. నువ్వు చేసే ఉపాసన బట్టి ఆహారం ఎంచుకోవాలి. పరీక్షకి వెళుతున్నావు, కడుపు నిండుగా తిని వెళితే ఏమౌతుంది? మత్తు వస్తుంది. అందుచేత ఆహారనియమాలు మన లక్ష్యం మీద ఆధారపడి ఉండాలి. లక్ష్యం ఏమిటి? ఎటు వెళ్ళదల్చుకున్నారు? మనం తీసుకున్న ఆహారం ఏ విధమైనటువంటి మనస్సుగా మారుతోందో ఆలోచించుకోండి. అలాగే ప్రసాదం అనే సంప్రదాయం పెట్టారు, ఒకొొక్క దేవతకి ఒకొొక్క ప్రసాదం. ఉపాసనా రహస్యాన్ని అర్థం చేసుకుని పెట్టటం వల్ల వారికి కావల్సిన ఫలితాలు తక్షణమే వచ్చేవి. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు వచ్చేవి. కాని ఈ రోజుల్లో ఈ రహస్యాలు తెలీక ఎక్కవ ఖర్చు తక్కువ ఫలితాలు వస్తున్నాయి. అందుచేత ఆహారనియమాలలో చాలా జాగ్రత్తలు పాటించండి.

## యజ్ఞీయ ప్రక్రియగా భోజనం చేసేవిధానం

### మహాలక్ష్మీధ్యానం

**తతశ్చాద్విరభూత్సాక్షాత్ శ్రీరమా భగవత్పరా ।**
**రంజయంతే దిశఃకాంత్యా విద్యుత్సౌదామినీ యథా ॥ (భాగవతం8/8/8)**

**అచ్యుతానంతగోవిందా నామోచ్చారణ భేషజాత్ ।**
**నశ్యంతి సకలా రోగాః సత్యం,సత్యం వదామ్యహం ॥ (అగ్ని పురాణం)**

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధం ॥ (భ.గీ..15-17)**

1. భోజనం చెయ్యటానికి 15నిమిషాల ముందే పై శ్లోకాలను చదువుకోవాలి. భోజన సమయంలో పరిపూర్ణమైన మౌనమును పాటించ వలయును.

2. భోజనానికి ముందు ఒక ఐదు సార్లు మూలబంధం వేసుకొని భోజనం చేస్తే వృద్ధాప్యం తొందరగా రాదు.

3. ఆ రోజుకు సంబంధించిన యంత్రమును పటములో చూపిన విధంగా పళ్ళెంలో లేదా విస్తరిలో వేసుకోవాలి.

4. విశ్వకర్మా సూక్తమును, భగవద్గీతలోని 15వ అధ్యాయమును కళ్ళుమూసుకొని వింటూ ఆ మంత్ర తరంగాలలో లీనమవ్వాలి.

5. గాయత్రీమంత్రాన్ని మూడుసార్లు చెప్పుకొని, ప్రతి ముద్దను శరీరమనే ధునిలో ఒక ఆహుతి ఇస్తున్న భావనతో ఈ క్రింది క్రమంలో ఆయా ప్రాణవాయువుల మంత్రాలతో ప్రాణమయ శరీరం జాగృతం అయ్యేలా ఆహారం తీసుకోవాలి.

ఓం ప్రాణాయ స్వాహా, ఓం అపానాయ స్వాహా, ఓం సమానాయస్వాహా, ఓం ఉదానాయ స్వాహా, ఓం వ్యానాయస్వాహా అనే మంత్రాలను చెప్పుకుంటూ ఆహారం తీసుకోవాలి.

6. భోజనానంతరం ఆ ఆహారాన్ని వినిమయం చెయ్యటం ద్వారా ప్రపంచంలో ఆకలి బాధ ఉండదు. దానికొరకు వజ్రాసనం వేసుకొని, కళ్ళు మూసుకొని 'నమస్కారమ్స్ మాస్టర్ సి.వి.వి' అని మూడుసార్లు ఉచ్ఛరించి, 'నేను తీసుకున్న ఆహారం ప్రపంచంలో ఆకలిగొన్న ప్రతి ప్రాణికి కూడా చెందుగాక, అవి తృప్తి చెందుగాక!' అనే భావనతో 10 నిమిషాల పాటు సమానవాయువును గమనించాలి. చివరగా 'నమస్కారమ్స్ మాస్టర్ సి.వి.వి టూ యువర్ లోటస్ ఫీట్ ' అని మళ్ళీ ఉచ్ఛరించి ధ్యానాన్ని ముగించాలి. ఆహారాన్ని బట్టే మనస్సు ఏర్పతుందనే నియమాన్ని అర్థంచేసుకుని మనం దాన్ని పాటించుదాం

### మీనరాశి నుండి కుంభరాశికి మారుతున్నాం

ఈ యుగసంధికాలంలో అనేక సృజనాత్మక, నిర్మాణాత్మక కార్యకలాపాలు జరుగుతాయి. మనం మీనరాశి నుండి కుంభరాశికి మారుతున్నామనే విషయాన్ని పండిత శ్రీరామశర్మఆచార్య గురుదేవులు మాత్రమే అతి స్పష్టంగా చెప్పారు. మిగతా గురువులెవరూ ఈ విషయాన్ని గురించి భారతదేశంలో చెప్పలేదు. ఇక్కడ మళ్ళీ సౌరమండలాలు, గ్రహాలు మొదలైన వాటి గురించి చెప్తూ, కొన్ని పవిత్రగ్రహాలు, అపవిత్రగ్రహాలు వున్నాయిని చెప్పారు. అలా చెప్పినప్పుడు పృథ్వి అపవిత్రగ్రహమని చెప్పడం జరిగింది. అయితే రెండువేల సంవత్సరంలో దానికి పవిత్రత ఆపాదించబడింది. రెండు వేలసంవత్సరంలో పవిత్రత ఆపాదించబడిందేకానీ, స్వతహాగా దానికి పవిత్రత లేదు. ఈ విధంగా మనం కొంచెం అదృష్టవంతులం.

**మరొక ముఖ్యమైన విషయం:** జీవించటం ఎలా? ఇదొక ప్రత్యేకమైన ప్రణాళిక. పూర్తిగా ఇది మీ మానసికస్థితికి చెందిన విషయం. మీ జీవిత విధానం ద్వారా ఇతరులను ప్రభావితం చేయడం. దాని కొరకు ఆధ్యాత్మిక ప్రాణశక్తిని పెంపొందించుకోవడం చాలా అవసరం. ఈ విద్యనే గాయత్రీవిద్య, యజ్ఞవిద్యగా చెప్తారు. అయితే మీరు చెప్పే యజ్ఞమంత్రాలు మాత్రమే యజ్ఞవిద్యకాదు.

మీరు చేసే గాయత్రీ మంత్రం మాత్రమే గాయత్రీ కాదు. గీతలో శ్రీకృష్ణుడు, 'యజ్ఞానాం జప యజ్ఞోస్మి' అన్నాడు. అంటే యజ్ఞాలలో జపయజ్ఞాన్ని 'నేనే' అనీ మళ్ళీ 'గాయత్రీ ఛందసామహం' అని శ్రీకృష్ణుడు అంటే, దానినే గురుదేవులు 'గాయత్రీ జప యజ్ఞాన్ని' మించినది లేదు అని దానిని అందరికీ అందించారు. మంత్రజపంలో వుండవలసిన మానసికస్థితి ఏమిటి అంటే గాయత్రీ. అంటే అది ప్రాణవిద్య. గయాన్ ప్రాణాన్ త్రాయతి ఇతి గాయత్రి. అదీ గాయత్రి అంటే. గాయత్రీ చేసే వాడు చావడు. మీరు నిరంతరం జపం చేయటం అలవాటు చేసుకోండి. సామూహిక జపం చాలామంచిది. జపం చేసేటప్పుడు ఉచ్చారణ చాలా స్పష్టంగా ఉండాలి. కళ్ళు మూసుకొని అందులో లీనమైపోయి ఒకే స్వరంతో చెప్పాలి. ఈ యుగసంధికాలంలో అదే మిమ్మల్ని ముందుకు తీసుకుపోతుంది. సరే, ఇప్పటి వరకు చెప్పిన విషయాలను మననం చేసుకుందాం.

**1. మనం చాలా విశేషమైన కాలంలో పుట్టాం. అందరం అదృష్టవంతులం.**

**2. ఈ యుగసంధి కాలంలో మీరు చేయవలసిన మూడు పనులు – సమయదానం, అంశ దానం, ప్రతిభాదానం. దానము అని ఈ పనులకు పేరు చెప్తున్నాంగానీ, భవిష్యత్తులో మీరు వాటిని నాటుకుంటున్నారు.**

**3. గురువుల పనులు ఎవ్వరూ చేయడంలేదు కనుక, గురువులకెవరు దొరికితే వారి ద్వారా పనులు చేయించుకోవలసిందే. ఈ జన్మలో మీరీ పనులు చేసి ఎంత ఎత్తుకు ఎదుగుతారో మీకు తెలియదు. ఈ విషయాలను నేను తప్ప మీకెవరూ చెప్పరు. విన్నదానిని ఆచరిస్తేనే ఫలితాలు వస్తాయి.** క్షణం వృథాగా పోనీకుండా చెప్పినవి చెయ్యండని ఆనాటి ప్రవచనాన్ని ఎంతో ప్రచండంగా చెప్పారు. ఇంతటి మహత్తరమైన సాధనలను మనచేత చేయించి మనకెంతటి ఉదాత్తమైన జీవితాన్నిచ్చారనేది మన ఊహకందని విషయం.

## అమరత్వము

అమరత్వము ప్రతి మానవుడి హక్కు. దానికి కావల్సిన విధి విధానాలను నేర్చుకోవాలి తప్ప, అమరత్వసిద్ధికి ఏ సాధనలు, ప్రయత్నాలు అఖ్ఖర్లేదు. అరవిందులవారు అమరత్వాన్ని భూమికి దింపిన రోజు నవంబరు 24, 1926. అమరత్వము భూమి మీద దిగిపోయింది. దానిని ఉపయోగించుకోండి అని మాస్టర్‌గారు 1998–2001లలో కొన్ని ప్రవచనాలలో చెప్పారు. ఋషుల ప్రణాళికలో, మానవుడికి అమరత్వసిద్ధి ఒక అంశము. 'అమరత్వప్రాప్తి సంభవమే' అనే విషయాన్ని

ఘంటాపథంగా మాస్టర్‌గారు చాలా ప్రవచనాల ద్వారా సామాన్య మానవుడికి అర్థం అయ్యేవిధంగా పలురకాలుగా వివరించారు. ఆ ప్రవచనాలలోని కొన్ని ముఖ్య విషయాలు ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

"గురుపరంపర దగ్గర నుంచి మీరు నేర్చుకోవాల్సిందేమిటంటే – మీరు అమరులైపోయారు, అది గుర్తించాలి అంతే. 'అహం బ్రహ్మాసి', 'అయమాత్మా బ్రహ్మ', 'ప్రజ్ఞానం బ్రహ్మ', ఇవన్నీ ఏం చెపుతున్నాయి? నువ్వు అమరుడివి అవుతావు అనా, అయిపోయావు అనా? యు ఆర్ ఆల్‌రెడీ దేర్. అమరత్వము పొందటానికి కావల్సిన విధి విధానాలు మీరు నేర్చుకోవాలి అంతే. మొట్టమొదటి నియమం అబద్ధం చెప్పకపోవటం, సత్యమే పలకటం. రెండవ నియమము – వేద విజ్ఞానము. ప్రకృతి యొక్క నియమాలకు అనుగుణ్యంగా జీవించటమే వేద విజ్ఞానము. ప్రాకృతిక నియమాలకు పరిపూర్ణంగా స్పందించగలిగేటటువంటి ఒక యంత్రమే మానవశరీరము. విశ్వములో ఉన్న ప్రతీశక్తిని ఏ విధమైన అడ్డంకి లేకుండా – సున్నా (జీరో) నుండి అతి ఉచ్ఛస్థాయి వరకూస్పందించి ఉపయోగించుకోగలిగే యంత్రమే మానవశరీరము. అదే వేదమూర్తి. వేదముల సముదాయము, వేద మంత్రముల సముదాయము.

మీ శరీరముల ద్వారా ప్రకృతిలో ఉన్న శక్తిని ఉపయోగించుకుని, ఈనాడు శాస్త్రవేత్తలు యంత్రముల ద్వారా చేస్తున్నవన్నీ మీరు చేయవచ్చు. ఋషులు జీవితమంతా అదే చేసి చూపించారు కదా! దివ్యజ్ఞానము, దివ్యదృష్టి. ఈ టెలీఫోన్, టెలీకమ్యూనికేషన్స్ ఇవంతా ఏంటి? మనము యంత్రములతో చేస్తున్నాం, ఋషులివంతా శరీరంతో చేసేవారు. వేదవిజ్ఞానం అంటే నేనేం చెప్పానో అర్థం అయ్యిందా ఇప్పుడు? ప్రకృతిలో ఉన్న అతి సూక్ష్మమైన శక్తి నుండి అత్యద్భుతమైన శక్తి వరకూ స్పందించగలిగే కణాలు మానవుని యొక్క బుర్రలో ఉన్నాయి. అందుచేత వేదవిజ్ఞానము అంటే మంత్రాలు – తంత్రాలు – యంత్రాలు కాదు. మీ శరీరము ద్వారా ప్రకృతిలో ఉన్న ఏదో ఒక శక్తిని మీరు ఉపయోగించుకోవటానికి ప్రయత్నించకుండా మీరు కేవలం మంత్రాలు, వేదమంత్రాలు చదివేస్తే, అవన్నీ వృథా.

శరీరములో ఉన్న కేంద్రములు కొన్ని ప్రాకృతిక శక్తులకు స్పందిస్తాయి. అవి, పృథ్వి – జల – అగ్ని – వాయు – ఆకాశ తత్వాలు. ముందు మీకు పృథ్వి – జల – అగ్ని తత్వాల మీద ఆధిపత్యం రావాలి. గురుస్థాయిలో ఉన్న వ్యక్తులు అగ్నిలో నడిచేస్తారు. వారికి ఏమీ అవ్వదు. ఎక్కడ ఉన్నట్లు? అగ్నితత్వములో. అగ్ని, అగ్నిని ఏమి చెయ్యదు కదా! ఇది శరీరాన్ని మార్చుకునే

విద్య గురించి మాట్లాడుతున్నాను. వేదవిజ్ఞానం అంటే ఇది. ప్రకృతిలో ఉన్నటువంటి మొదటి ఈ ఐదు శక్తుల్ని పట్టుకోవటానికి కావల్సిన కేంద్రాలున్నాయి మన శరీరంలో అవే జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు. ఉపయోగించుకోండి.

## మూడో నియమము

**శాంతి, సమృద్ధి, సుఖము. మానవశరీరధారి ఎవరికైనా ఈ మూడు ఉండాలి. కాని మనం వరుస తలక్రిందులు చేస్తున్నాం. సమృద్ధి ఉంటే శాంతి వస్తుందను కుంటున్నాం. కాని గురువులు కలిపిన నిష్పత్తిలో ముందు శాంతి రావాలి. అందుకే 'ఓం శాంతిః, శాంతిః, శాంతిః' తో ఉపనిషత్తులు అంతమవుతాయి. మీరెంత శాంతంగా ఉంటారో అంత ఎక్కువ సమృద్ధి వస్తుంది.** ఆ శాంతిని నేర్పేదే 21 ఓంకార ధ్యానము. మీరు ధ్యానములో ఎంత లోతుకు వెళితే అంత సమృద్ధి భౌతిక జగత్తులో వస్తుంది.

అమరత్వము సాధ్యమే. 'అజోపిసన్నవ్యయాత్మా....' అంటాడు శ్రీకృష్ణుడు గీతలో. అజుడు అంటే పుట్టని వాడు. మీకూ వర్తిస్తుందది. మీరు కూడ రేపు ఈ మాటలు అనవచ్చు. కానీ నేనూ పుట్టుకలేనివాడిని అవటానికి కావలసిన జ్ఞానం మీరు సంపాదించుకోవాలి. అమరత్వము అందరికీ వచ్చేటట్లు చేయగలిగేలా పూర్వం లేదు. అందుకే మనుష్యులు గందరగోళం పడుతున్నారు. మీరంతా ఈ నియమాలను అభ్యాసం చేస్తే అమరత్వం వచ్చేస్తుంది" అంటూ మాస్టర్‌గారు వివరించారు. మాస్టర్‌గారు పరివార్ సభ్యులకు మూడు ముఖ్యమైన లక్షాలను అందించారు. 1. రోగ రహిత జీవితము (దీనికొరకు ఆహార నియమములు, ఆహారము తీసుకునే విధివిధానాలను అందరికీ తప్పనిసరి చేసారు) 2. వృద్ధాప్యరహిత జీవితము (ఆసన ప్రాణాయామములు, జపము) 3. మృత్యు రహిత జీవితము (ధ్యానము, స్వాధ్యాయము). ప్రతి వ్యక్తి ఈ మూడు విషయములను నిరంతరం పాటిస్తే గురువులు కలగన్న "పృథ్విపై స్వర్గావతరణ" జరిగితీరుతుంది.

# సత్యయుగము ఎలా వస్తుంది?

(ప్రస్తుతము తీసుకున్న ఈ లేఖను పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య 1942 వ సంవత్సరం జనవరి అఖండజ్యోతిలో వ్రాసి ప్రచురించారు. 68 సంవత్సరాల క్రిందటే గురుదేవులు ఈ లేఖ ద్వారా భవిష్యత్ రూపురేఖలను గురించి తెలియచేశారు. 68 సంవత్సరాల క్రిందటి ఈ లేఖ మనకు గురుదేవుల యొక్క యుగద్రష్ట స్వరూపమును గురించి అభివ్యక్తీకరిస్తుంది.)

ఇక కలియుగము సమాప్తమైపోయి సత్యయుగం ప్రారంభం కాబోతున్నది అనే విషయం అనేక తర్క, తథ్య, ప్రమాణాలు, అనుభవాలు, భవిష్యవాణుల ద్వారా ప్రకటీకరించబడింది. ఇందుకు కనీసం వంద సంవత్సరాల సమయం పట్టవచ్చు. 19 వ శతాబ్దము మొదలుకొని 21వ శతాబ్దము నాటికి ఈ పని పూర్తవుతుంది. ఈ శతాబ్దకాలము కలియుగ అంతానికి, సత్యయుగ ప్రారంభానికి మధ్యవుండే సంధికాలము. 2000 సంవత్సరం కాగానే సత్యయుగం క్రిందికి దూకదు. ఇది యుగాంతమే కానీ కల్పాంతం కాదు కనుక ఎవ్వరూ భయపడడం కాని, గాభరాపడడం కాని చేయవద్దు.

సత్యయుగము ముందుగా స్వః లోకంలో వస్తుంది. తరువాత భువః లోకంలో, ఆ తరువాత భూః లోకంలో కనపడుతుంది. స్వః-మనస్సు. భువః- వాక్కు. భూః-కర్మ. మున్ముందుగా ప్రజలు శుభసంకల్పాల వైపు ఆకర్షితులౌతారు. హృదయపూర్వకంగా "హేప్రభూ! మాకు సద్బుద్ధినివ్వు, దుష్కర్మ ఉచ్చుల నుండి మమ్ము రక్షించు" అని ప్రార్థిస్తారు. శుభకర్మలను చేసేవారిని చూసి మనస్సు ప్రశాంతపడుతుంది. జ్ఞానచర్చలు వినాలని మనస్సు తహతహలాడుతుంది. చిన్నపిల్లవాడు కూడా హరికథలు, సంకీర్తనలు చేస్తూ, సత్సంగమునకే ఇష్టపడతారు. ఎప్పుడైతే ఇలాంటి లక్షణాలు ప్రస్ఫుటంగా కనపడడం మొదలెడతాయో అప్పుడే స్వఃలోకంలోను, బ్రహ్మలోకంలోను సత్యయుగం దిగిందని అర్థం చేసుకోవాలి. కానీ సంపూర్ణ సత్యయుగమనేది ఎన్నటికీ రాదు. ఎందుకంటే సృష్టి యొక్క నిర్మాణములోనే సత్వ, రజ, తమోగుణములు కలిసివున్నాయి. ఇందులో ఏ గుణము సమాప్తమైపోయినా సృష్టి నాశనమైపోతుంది. సత్యయుగ ప్రారంభంలో సత్యము ఎక్కువగా వుంటుంది. అక్కడక్కడా మాటల ద్వారా, పనుల ద్వారా ఈ మెరుపు మనకు కనిపిస్తూవుంటుంది. కానీ అది చాలా తక్కువగా వుంటుంది. మాటలు మరియు కర్మలు.

స్వః లోకం నుండి క్రిందికి దిగిన సత్యయుగము భువః లోకంలోకి ప్రవేశిస్తుంది. అప్పుడు మనస్సుల్లోను, మాటల్లోను సత్యసంధత ప్రకటీకృతమౌతుంది. సత్యమంటే ఉన్న గౌరవమును మనస్సుల్లోనే దాచుకోకుండా దాని గొప్పతనాన్ని మాటల ద్వారా కూడా ప్రశంసిస్తారు. భూఃలోకంలో సత్యయుగము ఆవిర్భవించి, సత్యయుగము ప్రారంభమైనప్పుడు సత్యము, ప్రేమ, న్యాయములతో కూడిన ఆచరణకు ప్రముఖ స్థానం లభిస్తుంది. తన హితము కంటే పరహితానికే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి అనే మానసిక ప్రవృత్తి కలిగినప్పుడే నిజమైన సత్యయుగం.

లోకములను గురించిన వర్ణన వయస్సుపరంగా కూడా మనకు లభిస్తుంది. బాల్యావస్థ సత్వగుణ ప్రధానమైనది, యువావస్థ రాజసికమైనది, వృద్ధావస్థ తామసికమైనది. భూః లోకంలో ముందుగా సత్యయుగం 27 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు వున్న బాలకులలో దిగుతుంది. 27 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు వున్నవారి హృదయాలలో సత్యప్రేరణ అందరికంటే ఎక్కువగా వుంటుంది. వారి హృదయమనే నిర్మలమైన నీటిలో ప్రతి వస్తువు యొక్క ప్రతిబింబము స్పష్టంగా కనిపిస్తుంది. నవయువకుల హృదయాలలో శ్రద్ధ, భక్తి స్వభావసిద్ధంగానే వుంటాయి. కలియుగంలో పెద్ద వయస్సున్న వారి కోపానికి వీరు గురౌతుండడమే కాక చీవాట్లు, తిరస్కారాలు కూడా తప్పక ఎదురౌతుంటాయి. ప్రహ్లాదుని వలె ఈ బాలురు ధృఢంగా, నిర్భయంగా, సత్యనిష్టను, ధృవుని వంటి తపోశక్తిని సాధించి, సత్యమార్గము నుండి వెనుదిరగరు. అసురుల ఇండ్లనుండి ఇటువంటి దేవబాలకులు సేనలు సేనలుగా వెలువడి ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతారు. సత్యయుగము యొక్క మొదటి భాగంలో ఇటువంటి దృశ్యాలు కనిపిస్తాయి. 2000 సంవత్సరం మొదలు 2033 సంవత్సరం వరకు ఇటువంటి బాలకులతో కూడిన ఒక ప్రచండమైన సైన్యం తయారై ఒక ఆందోళన జరుగుతుంది. అయినప్పటికీ కర్మలో చాలా కొద్దిపాటి పరివర్తన మాత్రమే సాధ్యమౌతుంది. బాలురలో వచ్చిన ఈ హృదయపరివర్తనకు విలువివ్వరు. కానీ సత్వరమే వారికి తాము చేసిన తప్పు అర్థమవ్వడం మొదలౌతుంది. సత్యయుగమెప్పుడు భువఃలోకంలో దిగుతుందో అప్పుడు సత్యము యొక్క ప్రకాశము పెరిగి మధ్యవయస్కులు (27-70 సంవత్సరాల వయస్సు) ఇందులో పాలుపంచుకున్నా, వారు సత్యము, ప్రేమ, న్యాయములను వ్యతిరేకించే సాహసం చేయరు. కానీ వాక్కు ద్వారా పిల్లలను సమర్థిస్తారు. బాలకులు, మధ్యవయస్కులు కలిసి ఈ ఆందోళనకు నేతృత్వం వహిస్తారు. మనస్సునందు, వాక్కునందు సత్యము ప్రతిధ్వనిస్తుంటుంది. కర్మలో సగభాగం మిగిలి మరణావస్థకు చేరుకున్న కలియుగం పునర్జీవితమౌతుంటుంది. మానవులకు

చింత, దుఃఖము నిష్పూరవ్వవలె రాజుకుని, సత్యయుగ ఆగమనముపై నమ్మకం కోల్పోయే స్థితి ఏర్పడ్డా భవిష్యత్‌లో వారి భ్రమలు నివారింపబడతాయి. సత్యానికి ఎల్లప్పుడూ జయమే.

వృద్ధులు తమ పాత ఆలోచనలలోనే బంధించుకొని బయటకు రాలేక సతమతమౌతారు. ప్రారంభంలో పిల్లల్లో వచ్చిన ఈ హృదయపరివర్తనను చూసి వీరు ఎగతాళి చేసినా, మధ్యవయస్కులు వారికి తోడైనాక వృద్ధులు తమ సహజస్వభావం వల్ల అందరినీ విరోధిస్తారు. కానీ చివరకు యుగప్రభావం వీరిపై కూడా పడుతుంది. ఎప్పుడు మృత్యులోకంలో కూడా సత్యయుగము వస్తుందో అప్పుడు వారు తమ ఆలోచనలను మార్చుకొని అసత్యానికి తిలోదకాలిచ్చి సత్యమునకు శరణాగతి పొందక తప్పదు. సత్యయుగంలో వయోవృద్ధులు తమ యొక్క సద్జ్ఞానము కారణంగా చాలా ఉన్నతస్థితిలో వుంటారు. సత్యయుగము కారణంగా చాలా ఉన్నతస్థితిలో వుంటారు. సమయము యొక్క రహస్యాన్ని అర్థము చేసుకుంటారు. తమ పుత్రులకు, పౌత్రులకు సత్యమార్గమును అనుసరించాలనే ఉపదేశాన్నిస్తారు. 2100 దశకానికి (2043 వసంవత్సరం) ఇది పూర్తౌతుంది. అప్పటికి భూలోకంలో సత్యయుగము ప్రకటీకృతమైనదని అర్థము చేసుకోవచ్చు. స్త్రీలు బుద్ధిజీవులు కారు. వారిలో భావనయే ప్రధానం. అందుచేత వారు సత్యయుగము యొక్క ఆగమనమనే చర్చను ఆశ్చర్యంతో వింటారు. వారి హృదయం దయ, క్షమ, కరుణ, ప్రేరణలతో నిండి భర్త, పుత్రుల కొరకు ఎన్ని ఆత్మత్యాగాలకైనా వారు సిద్ధపడతారు. సత్యము, ప్రేమ, న్యాయం అనేవి స్త్రీలయందు సులభంగా ప్రతిష్ఠితమౌతాయి. అందుచేత పురుషులతో పోలిస్తే వారు చాలా త్వరితంగా సత్యయుగవ్యక్తులుగా మారిపోతారు. ఈ ప్రయోజనముల పూర్తిచేసేందుకై భగవానునిచే పంపబడిన నైష్టిక, జాగృత, ఉన్నత వ్యక్తులెవరో, ఎవరి నుదుటిన సత్యయుగ అవతారముగా తయారుకావాలని లిఖించబడివుందో వారు చాలా ముందుగా అనగా సత్యయుగ ప్రారంభంలోనే అంటే 2000 శతాబ్దం దగ్గరలోనే సర్వస్వాన్ని త్యజించి సావధానులై స్వర్గమును పృథ్వీపైకి తీసుకువచ్చేందుకై సర్వస్వమును త్యజించి రథమునందు ఆసీనులై సూర్యుని యొక్క సప్తఅశ్వములతో సమానమైన వేగముతో పనిచేస్తారు. సత్యయుగము వచ్చేస్తుంది. అది ఎవరు ఏ విధంగా ఆపినా ఆగేదికాదు. కానీ స్వర్గతుల్యమైన ఈ అవకాశము యొక్క లాభమును, కీర్తిని పొంది అమరులుగా మిగిలిపోగలిగే సౌభాగ్యము ఈశ్వరునికృపకు పాత్రులైన గొప్ప అదృష్టవంతులకే లభిస్తుంది.

**సర్వేజనా సుఖినోభవంతు !!!**


# శ్రీ హంసరామ ఆశ్రమము – స్మర్తుగామీ సిద్ధక్షేత్రము, కాకివాయి





















అగస్త్య ఆశ్రమము, రేపల్లె

గాయత్రీ అనుగ్రహ పీఠము, ఒంగోలు







గాయత్రీ అనుగ్రహ పీఠము, ఒంగోలు






సహ్యాద్రి దత్తాశ్రమము, ఓడరేవు, చీరాల




ఆహార మంత్రము మరియు యంత్రములు





గాయత్రీ అక్షర ధ్యానము





శ్వేతద్వీపములో మాస్టర్‌గారు


Madam Blavetsky
జగత్ జనని శ్రీమహాయోగీశ్వరీ దేవి
ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం ధ్యాన చిత్రము





సూర్య కిరణాల పేర్లు, చక్రములు, గ్రహములు



సర్వరోగ నివారణ యంత్రము

# అఖండ గురుసత్తా





గుంటూరులోని సప్తర్షి ఆశ్రమంలో
మాస్టర్‌గారిచే బాబా ప్రతిష్ఠాపన



గోశాల



నవగ్రహ మంటపము



అష్టలక్ష్మీ సహిత మహాకాల యంత్రము



సప్తర్షి
ఆశ్రమంలోని
బాబా



శ్రీ వేంకటేశ్వర
స్వామి



యజ్ఞ
మంటపములో
వివిధ ఆకృతులలో
ఉన్న యజ్ఞ
కుండములు

# నిత్యావతార దత్తక్షేత్రము, వేటపాలెం










త్రిముఖి గాయత్రి

మాస్టర్‌గారు దర్శించిన జగత్ జనని శ్రీ మహాయోగీశ్వరీ దేవి



## సప్తర్షి ఆశ్రమంలో
## అఖండ గురుసత్తా సహిత శ్రీ మహాయోగీశ్వరీ దేవి ఆలయం



## అనుగ్రహ మాలా మంత్రం

**ఓం భూర్భువః స్వః హ్రీం శ్రీం క్లీం తత్సవితుర్వరేణ్యం**

**భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్**


**హ్రీం శ్రీం క్లీం ఓం**

**క ఏ ఈ ల హ్రీం**

**హ స క హ ల హ్రీం**

**స క ల హ్రీం శ్రీం ॥**

# సమర్థ సద్గురు స్పర్శ ధ్యానము







సప్తర్షి ఆశ్రమంలో ప్రవచనమిస్తున్న మాస్టార్‌గారు

















శ్రీ మారెళ్ళ కామరాజుగారు & శ్రీమతి మారెళ్ళ సక్కుభాయి మాత

(పూజ్య మాస్టర్‌గారి తల్లిదండ్రులు)

పూజ్య మాస్టర్‌గారి
గురుదేవులు
పండిత శ్రీరామశర్మ ఆచార్య
మాతా భగవతీదేవి శర్మగార్లు





కార్యకర్తలని
మాతాజీకి పరిచయం
చేస్తున్న మాస్టర్‌గారు





బందరులో
మాస్టర్‌గారు
జన్మించిన ఇల్లు





కాశీలో మాస్టర్‌గారు
నివసించిన ఇల్లు







పరమపూజ్య గురుదేవుల వెనకాల నిలబడి ఉన్న మాస్టర్‌గారు




ల్యాప్‌టాప్‌తో వర్క్ చేసుకుంటున్న మాస్టార్‌గారు



'ఓం శాంతిః' శాంతిమంత్రం చెప్తున్న మాస్టార్‌గారు

# మహాకాల చక్రవర్తి పట్టాభిషేకము






శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ
చిదగ్నికుండ సంభూతా దేవకార్య సముద్యతా
శ్రీ శివాశివశక్త్యైక్యరూపిణీ లలితాంబికా ఓం ॥

**యతీనాం బ్రహ్మాభవతి సారథి ॥**

ప్రతి వ్యక్తిలోను స్వ ఆత్మ రాజ్య స్థాపన
జరుపుకోవాలి అనే నా ఈ సందేశాన్ని అందరికీ
తెలియచేయటమే నావారి పని.

**Website: www.missionrk.com**

YASASVEE ART PRINTERS, HYD @ 9701055009